# వ్యాకరణం - ఛందస్సు - అలంకార శాస్త్రం

## ఎం.ఏ. తెలుగు, మొదటి సంవత్సరం - నాల్గవ పేపరు


**రచయితలు**

**డా॥ అంబడిపూడి నాగభూషణం, యం.ఏ., పి.హెచ్.డి.,**
రీడర్,
డా॥ కె.వి.కె. సంస్కృత కళాశాల,
గుంటూరు.

**ఆచార్య నేతి అనంతరామశాస్త్రి, యం.ఏ., పి.హెచ్.డి.,**
విశ్రాంత ఆచార్యులు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
గుంటూరు. – 6, బి 1- 84, పట్టాభిపురం.

**డా॥ పుల్లభట్ల వెంకటేశ్వర్లు, యం.ఏ., పి.హెచ్.డి.,**
రీడర్,
డా॥ కె.వి.కె. సంస్కృత కళాశాల,
గుంటూరు.

సంపాదకులు
**ఆచార్య. బేతవోలు రామబ్రహ్మం, యం.ఏ., పి.హెచ్.డి.,**
తెలుగు శాఖ,,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

సమన్వయ కర్త
**ఆచార్య జి.వై. ప్రభావతి దేవి యం.ఏ., పి.హెచ్.డి.,**
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**డైరెక్టర్** ఎం.వి. రాంమోహన్ రత్నమ్
**ఆచార్య. బి.కృష్ణారావు, ఎం.యస్సి., పి.హెచ్.డి.,** M.A., Ph.D.

దూరవిద్యా కేంద్రము
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం .నాగార్జున నగర్-522 510**
Ph :0863-2293299 , (08645) 211023 ,211024, Cell :9848285518
E-mail : info@anucde.ac.in
Website: www.anucde.ac.in

M.A., Telugu , First Year, Paper - IV : Telugu Grammar - Prosody - Poetics

First Edition : 2003

Second Edition : 2005

Third Edition : 2006

Fourth Edition : 2008

First Edition : 2011

Sixth Edition : 2012
No. of Copies : 5000

Seventh Edition : 2013
No. of Copies : ~~4000~~

(C) **Acharya Nagarjuna University**

This book is exclusively prepared for the use of students of M.A., Telugu, Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is meant for limited circulation only.

Published by : M.V. Ramkumar Ratnam
**Prof. ~~D. Krishna Rao~~,**
*Director,*
Centre for Distance Education,
Acharya Nagarjuna University

Dr. P.P.S. Paul Kumar
**~~Prof. M.V. Ramkumar Ratnam~~,**
*Deputy Director,*
Centre for Distance Education,
Acharya Nagarjuna University

***Printed at :***
**Don Bosco Technical School Press**
Ring Road, Guntur-7, **Ph.: 2350832**

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2003 వ సంవత్సరంలో NAAC చే B++ (80-85) గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి ఎంతో సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని సుమారు 300 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనతో పాటు పరిశోధన డిగ్రీలను కూడా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్య నభ్యసించలేనివారికి, ఎంతో వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర విద్యావకాశం ఎంతో దోహదపడుతుంది. ఇట్టి వారందరికి తమ ముంగిట్లో విద్యను అందించే ఉద్దేశ్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 2003-04 విద్యా సంవత్సరంలో డిగ్రీస్థాయిలో బి.ఏ., బి.కాం.; పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ, ఎల్.ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించడం జరిగింది.

ఈ దూర విద్యా పద్ధతి ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసికొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా నైపుణ్యంలో విశేష అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించటం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ విద్యార్థులు, ఈ పాఠ్యాంశాల బోధనలో నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు చేసే ప్రచురణలలో మరింత నిర్దిష్టంగా, మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం డిగ్రీ స్థాయిలో వారాంతపు తరగతులు, పి.జి. స్థాయిలో కాంటాక్ట్ క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసి, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని వాటి ద్వారా దేశ పురోగతికి దోహదపడాలని నా ఆశయం. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మా ప్రయత్నానికి సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు నా అభినందనలు.

**ఆచార్య .కె.వియ్యన్నా రావు**
కులపతి
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

నాగార్జున నగర్
13-5-2005

పాఠం - 1.

# సూత్రాలకు వివరణం (ప్రౌఢ వ్యాకరణం)

## 1. ఆంధ్ర భాషకు వర్ణంబు లేబదియైదు (సంజ్ఞ - 1)

ఆంధ్రభాషలో ఏభైఐదు అక్షరాలున్నాయనేది అర్థము.

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ . . . ఏ ఏ ఐ ఒ ఓ ఔ ఁ అం అః క ఖ గ ఘ ఙ చ . . ఛ జ . . ఝ ఞ ట ఠ డ ఢ ణ త థ ద ధ న ప ఫ బ భ మ య ర ల వ శ ష స హ ళ

చిన్నయసూరి "తెనుగునకు వర్ణములు ముప్పదియాఱు" (సంజ్ఞ - 3), "ఋ ౠ ... . . . విసర్గ ఖ ఛ ఠ థ ఫ ఘ ఝ ఢ ధ భ ఙ ఞ శ ష లు సంస్కృత సమంబులను గూడి తెలు గున వ్యవహరింపబడు (సంజ్ఞ - 4)" అనే రెండు సూత్రాల్లో చెప్పిన విషయాల్ని కలిపి ప్రౌఢవ్యాకర్త ఈ సూత్రం రాశాడు. తెలుగు భాష అంటే "అచ్చ తెలుగుభాష" అనేది సూరి అభిప్రాయం. 19 అక్షరాలు సంస్కృత సమాలుగా తెలుగులో చేరాయి.

" .... కారగ్రహణము సంస్కృత ప్రాకృతభాషా వ్యాకరణజ్ఞుల సమ్మతము అయ్యాది మంత్రశాస్త్ర ప్రసిద్ధము" అంటూ ప్రౌఢవ్యాకర్త వివరించాడు. . . . కారం పాణినీయసమ్మతం కూడా కాదు. మిగిలిన సంస్కృత వ్యాకర్తలు, ప్రాకృత వ్యాకర్తలు దీన్ని గ్రహించారు. మంత్ర శాస్త్రంలో . . . కారం వుంది. మాతృకాపూజలో వుంది. అందువల్ల వర్ణసమామ్నాయంలో చెప్పబడింది.

"యరలవలు లఘువులని యలఘువులని ద్వివిధంబులగు" (సంజ్ఞ - 18) అనే సూరి సూత్రాన్నిబట్టి "హరియతడు" అంటే యకారం లఘువవుతుంది. 'కాయ' అంటే య కారం అలఘువైంది. అట్లానే పెరుగు అంటే లఘురేఫం, "విఱుగు, మెఱుగు" అంటే అలఘురేఫం అవుతుంది.

లఘువుల్నీ అలఘువుల్నీ వేరు వేరు అక్షరాలుగా గుర్తించటం లేదు గదా ! కాబట్టి శకట రేఫాన్ని (ఱ) వేరే అక్షరంగా గుర్తించలేదు.

క్ష కారాన్ని సంస్కృత వ్యాకరణంలోనూ, నిఘంటువులలోనూ, షాంతపదమధ్యాల్లో చెప్పడమువలన అది వేరే అక్షరము కాదు. అనంతామాత్యుడు మొదలైనవాళ్ళు 'క్ష' అనేదాన్ని వేరే అక్షరంగా చెప్పారు. ఇది వర్ణాంతరం అయితే 'చక్రం' అంటే క్రవర్ణాంతం కావాలి. అందువలన క కార, ష కారాల సంయోగము వల్ల ఏర్పాడ్డ క్ష కారము సంయుక్తాక్షరము అవుతుందే తప్ప వర్ణాంతరము గాదని గుర్తించాలి.

## 2. ఒకానొకచో జకారంబుభయంబునగు (సంజ్ఞ - 5)

"శ్లేష యందు జ కాంమొక్కటియ యొకయర్థమున దంత్యమును వేఱొక యర్థమునఁ దాలవ్యమునయ్యెడని యర్థము" అంటూ ప్రౌఢవ్యాకర్త సూత్రాన్ని కూడా వ్రాశాడు.

**ఉదా :** అకట పాండురాజ యశమెన్నవైతి.

"పాండురాజ + యశమెన్నవైతి" అనే పదవిభాగంతో భారతార్థంలో దంత్యంగానూ, "పాండుర + అజయశ మెన్నవైతి" అని రామాయణార్థంలో తాలవ్యంగానూ అవుతుందని గ్రహించాలి.

చిన్నయసూరి "దంత్యతాలవ్యంబులయిన చ జ లు సవర్ణంబులు" (సంజ్ఞ - 7) అనే సూత్రంలో దంత్యతాలవ్యచజలు సవర్ణాలని చెప్పాడు. ప్రౌఢ వ్యాకర్త దాన్ని వివరిస్తూ ఈ సూత్రము వ్రాశాడు. "పాండురాజ" అనేది దంత్యము అని ప్రౌఢ వ్యాకర్త అభిప్రాయము. కాని "మఱియు రాజుశబ్దం బొక్కటి దంత్యయుక్తంబుగానం బడియెడి" (బాల.సంజ్ఞ - 10వ సూత్ర వివరణ) అని సూరి 'రాజు' అంటూ ఉత్వంతో ఉంటేనే దంత్యము అన్నాడు. "పాండురాజ" అంటే చివర ఉత్వము లేదు గదా ! కాబట్టి అది ఈ సూత్రానికి లక్ష్యము కాదు.

"ఒకానొకచో చకారంబు భయంబునగు" అంటూ చకారానికీ ఉభయం చెప్పవచ్చు.

ఉదా : తీయగ పంచదార వెనుదీయగఁబల్కి నన్ ద్వితీయఁగన్ (విజయవిలాసము 1ఆ. 94) అనే విజయవిలాస పద్యంలో పంచ + దార అంటే తత్సమం గాబట్టి తాలవ్యంగానూ, "పంచదార" అంటే ఆచ్ఛికంగాబట్టి దంత్యంగాను అవుతుందని గ్రహించాలి.

చిన్నయ సూరి చెప్పిన దంత్య తాలవ్యాలసామ్యం వాఙ్మయంలో అంతటా ఉంటుందనుకొంటే ఈ సూత్రం చెప్పాల్సిన పనిలేదు.

### 3. రాజు వైకృతంబనికొందఱందురు (సంజ్ఞ - 6)

'రాజు' అనే దాన్ని తద్భవంగా కూడా కొంతమంది చెపుతుంటారని యర్థము.

**ఉదా :** 'రాజు చూడంగ చెప్పంగరాని కడిమి'

ఇది యయాతి చరిత్రలోని ఉదాహరణము. అది అచ్చ తెలుగుకావ్యము. కాబట్టి తత్సమాలుండటానికి వీల్లేదు గదా ! 'రాజు' అనేది వైకృతం అవుతుందనేది అభిప్రాయం.

చిన్నయసూరి "మఱియు రాజు శబ్దం బొక్కటిదంత్య యుక్తంబు గానంబడియెడి" అని రాజు శబ్దం దంత్యయుక్తంగా చెప్పాడు. "అపుడు తత్సమమునందలి చ జ లు దంత్యయుక్తములుగావని యూహించునది" అంటూ ప్రౌఢ వ్యాకర్త వివరణం వ్రాశాడు. "ఒకానొకచో జకారంబు భయంబునగు" (సంధి - 5) అనే సూత్రానికి లక్ష్యంగా 'పాండురాజ' అనే దాన్ని దంత్యయుక్తంగా ప్రౌఢ వ్యాకర్త చెప్పాడు గదా ! ఇది తత్సమము గదా !

అట్లే "సంస్కృత సమంబులందికారాంతములైన శబ్దముల యుపధాచజలు బహువచనంబు పరంబగునపుడు దంత్యములగు" (సంధి - 10) అనే సూత్రం సూరి వ్రాసి అర్చి - అర్చులు, రోచి - రోచులు, వాజి - వాజులు అనే ఉదాహరణలిచ్చాడు. ఇవి తత్సమాలే గదా ! అప్పుడు తత్సమాలలో దంత్యచజలు లేవనడం ఎలా పొసగుతుంది.

ప్రౌఢ వ్యాకర్త కూడా " కొందఱందురు" అని అన్నాడే కానీ తన నిశ్చితాభిప్రాయంగా చెప్పలేదు.

రాజు అనే శబ్దం తత్సమంగా ఒకటి, వైకృతంగా ఒకటి ఉందని ఊహించవచ్చు. అప్పుడు తద్భవాల్లో కూడ రాజు శబ్దం దంత్యంగా ఉండవచ్చునన్నమాట.

### 4. న కారంబసాధారణంబు ద్రుతంబు (సంజ్ఞ - 7)

అసాధారణమైన నకారం ద్రుతము అవుతుందని అర్థము.

"ప్రత్యయాగమావ్యయాత్మకమై యుత్వవిశిష్టమయిన నకారంబు ద్రుతసంజ్ఞకంబనియర్థము ద్రుత మనగానొల్లని యెడ మఱఁగి పోవునది" అంటూ ప్రౌఢవ్యాకర్త సూత్రార్థాన్ని వివరించాడు. చిన్నయసూరి "నకారంబుద్రుతంబు" అని సామాన్యంగా చెప్పాడు.

**ప్రత్యయాత్మకమైన నకారానికి :** తాను, నేను, ధనమును, చదువుచున్నాను మొ॥

**ఆగమాత్మకమైన నకారానికి :** నన్నును, నాచేతను మొ॥

**అవ్యయాత్మకమైన నకారానికి :** అన్నయును, తమ్ముండును, ఏనియును మొ॥

"వలయుచో నీద్రుతంబు నందలి యుత్వంబునకు లోపంబు" అంటాడు ప్రౌఢవ్యాకర్త. "ఈ విషయాన్ని "అవసానంబునందుద్రుతస్వరంబునకేని, ద్రుతంబున కేనిలోపంబు బహుళంబుగానగు" (సంధి - 20) అంటూ సూరి చెప్పాడు గదా !

"ఉన్నాను - ఇత్యాదుల యందు ద్రుతంబు నందలి యుత్వంబునకు లోపంబుగలుగదు". ఇక్కడ "ద్రుతంబునందలి యుత్వంబునకు" అంటే ద్రుతానికుప లక్షణంగా గ్రహించాలి. 'ఉన్నాను' అన్నప్పుడు ద్రుతానికిగానీ, ఉత్వానికి గానీ లోపం చేయరాదు.

బాల వ్యాకర్త ఈ విషయాన్ని ద్రుతాన్ని గూర్చి చెప్పేటప్పుడు చెప్పకపోయినా, నుగాగమం, నుజీ మొదలైన వాటిని ఉత్వవిశిష్టాలుగా విధించాడు గదా ! "అవసానంబు" (సంధి - 20) అనే సూత్రం వ్రాయటంలో గూడ ద్రుతం ఉత్వవిశిష్టంగానే ఉంటుందని తెలుస్తుంది.

"శబ్దశాసనుడు "ద్రుతాఖ్యోనః" అని కేవలనకారార్థ గ్రహణము చేయుట ద్రుతమునకు స్థిరత్వ సిద్ధికై అని తెలియవలయును" అంటూ వివరించాడు. ద్రుతం మీద ఏ అచ్చు ఉన్నానకారానికే గదా పరుషసరళస్థిరాదిసంజ్ఞలు. కాబట్టి "ద్రుతాఖ్యోనః" అన్నా "ద్రుతాఖ్యోనుః" అన్నా నకారం స్థిరం కావటానికి అడ్డంకిలేదు గదా ! ఇది పరుష సరళాలకంటే భిన్నమైంది గదా ! చింతామణి మతంలో కేవలనకారం ద్రుతమవుతుంది. అందువల్ల అలా చెప్పవలసి వచ్చింది.

## 5. తద్భవము లందున నలఘురేఫముగలదు (సంజ్ఞ - 9)

తద్భవ శబ్దాల్లో కూడ అంటే సంస్కృత ప్రాకృతభవ శబ్దాల్లో కూడ అలఘురేఫం (ఱ) కన్పిస్తుందని అర్థం.

**ఉదా :** కఱకంఠుడు - గరళకంఠ శబ్దభవము

కాఱియ - కారికాశబ్ద భవము

గొఱపము - కురరీశబ్ద భవము మొదలగునవి.

చిన్నయసూరి "యరలవలు లఘువులని యలఘువులని ద్వివిధంబులగు (సంజ్ఞ - 18) అనే సూత్రవివరణంలో "శకటరేఫము తత్సమతద్భవము లందులేదు" అని వ్రాశాడు. కఱకంఠుడు మొదలైన పదాలు తద్భవాలనీ, వీనిలో శకటరేఫం కన్పిస్తుందనీ ప్రౌఢ వ్యాకర్త తెల్పాడు.

'కఱకంఠుడు' అనే ఉదాహరణంలో 'కఱ' అనేది ఆచ్ఛికం. 'కంఠుడు' అనేది సంస్కృతసమం. ఇది బహువ్రీహి సమాసం. "స్త్రీ సమఘటితంబయొకానొకండు బహువ్రీహి చూపట్టెడు" (సమాస - 6) అనే సూరి సూత్రం ప్రకారం మిశ్రబహువ్రీహి కుదరదు. లక్షణ విరుద్ధమైంది కాబట్టి గ్రామ్యమైంది. అయినా మహాకవులు ప్రయోగించారు. అందువల్ల అనింద్య గ్రామ్యం అయింది. ఈ ఇబ్బంది తొలగించటానికి ప్రౌఢ వ్యాకర్త గరకంఠ శబ్దం నుంచి కఱకంఠుడు అనే తద్భవరూపం వచ్చిందంటాడు. తద్భవాల్లో ఱకారం ఉండటానికి వీల్లేదు గదా ! కఱకంఠుడు అనే దాన్ని తద్భవంగా అంగీకరించడానికి వీల్లేదు.

## 6. కారము క్షారశబ్దభవము (సంజ్ఞ - 10)

"క్షార" అనే శబ్దం నుండి కారం అనేది పుట్టిందనేది అర్థం. అంటే అక్షరసామ్యాన్నిబట్టి 'కారం' అనే దాన్ని క్షారశబ్ద భవంగా ఊహించడం ఉచితం అని తెల్పటానికి ప్రౌఢ వ్యాకర్త "ఇందుసారూప్యము గనఁబడెడి క్షారశబ్దము కటుశబ్దపర్యాయంబునగు" అనే వివరణ వ్రాశాడు.

**ఉదా :** 'త్రిరాత్రముభయో రధశ్శయ్యాక్షారలవణ వర్జనంచ' అని యాపస్తంబ సూత్రవాక్యము.

ఇందు లవణ శబ్దం ఉంది. దానికి 'ఉప్పు' అని అర్థం. క్షారశబ్దానికికూడా లవణమనే అర్థం ఉన్నప్పటికీ ఇక్కడ లవణశబ్దం ఉంది కాబట్టి క్షారశబ్దానికి ఆ అర్థం చెప్పడానికి వీల్లేదు గదా ! క్షారశబ్దానికి 'కారం' అనే అర్థం చెప్పాలని ప్రౌఢ వ్యాకర్త ఆశయం.

బాల వ్యాకర్త "సంస్కృత ప్రాకృతతుల్యంబగు భాషతత్సమంబు" సంజ్ఞ - 19 అనే సూత్రానికి ఉదాహరణల్లో

| | | | | |
|---|---|---|---|---|
| సంస్కృతము | - | ప్రాకృతము | - | ప్రాకృతసమము |
| కటుః | - | కారో | - | కారము |

అన్నారు. 'కారో' అనే ప్రాకృత శబ్దం నుంచి 'కారం' అనే రూపం వచ్చిందని అర్థం. క్షారశబ్దం నుంచి కారం వచ్చిందని ప్రౌఢ వ్యాకర్త అభిప్రాయం.

ఆపస్తంబ సూత్ర వాక్యం ఒక్కటే ఉదాహరణగా చూపాడు. అక్కడున్న క్షారశబ్దానికి వ్యాఖ్యాతలు పప్పుదినుసులు, దుంపకూరలు మొదలైన అర్థాలు చెప్పారు. సందిగ్ధమైన అర్థంగల ఈ ఒక్క ఉదాహరణం గ్రహించి క్షారశబ్దం నుంచి కారం పుట్టిందనేమాట పొసగడం లేదు. కాని సూరి చెప్పినట్లు కారో అనే ప్రాకృతం నుండి 'కారం' అనే ప్రాకృతసమం పుట్టిందనడం సమంజసం.

## 7. కోటపేటలు వైకృతములు (సంజ్ఞ - 11)

కోటపేటలు తద్భవాలని అర్థం.

**ఉదా :** కోట్టశబ్దభవము కోట (అమరత్రిలింగ శేషము)
పింతాశబ్ద భవము పేఁట (అమరపద పారిజాతము)
అంటూ కోశాల్లోని పదాలు ఉదాహరణాలుగా చూపాడు.

'పింతా = పేట' ఇక్కడ పింతా శబ్దంలోని త కారం ట కారంగా మారడం, ఏత్వం రావడం, పూర్ణబిందువు ఖండబిందువుకావడం అనే వికారాలు కల్గాయి. "అది వికృతి యందు సహజంబు" అని వివరణం. సూరి చూపించిన పేటలో అరసున్నాలేదు. దానికి నాల్గుపేటల గొలుసు అనే విధంగా అర్థం చెప్పాలి. ప్రౌఢ వ్యాకర్త చూపించిన పేఁట అనే దానికి విటజనాశ్రయం అనే అర్థం ఉండవచ్చు.

"కోట్టశబ్ద పర్యాయంబుగా సంస్కృతంబునఁగోట శబ్దంబు నొక్కండు గానంబడియెడి. దానివలన గలిగిన దందునేనియపుడది కుండలోనగు వానివంటిదని దీని యెఱుంగ వలయును" అనే వివరణం ఉంది. కుండ శబ్దభవము కుండ అయినట్లే పింతాశబ్దభవము పేట అవుతుంది.

ప్రౌఢ వ్యాకర్త ఉదాహరణలుగా చూపించిన కోశాలు అంత ప్రామాణికాలుకావు. కోశాల్లో ఉన్నవి ఉదాహరణలుగా గాక విశాల వాఙ్మయంలో ఉన్న ఉదాహరణలు చూపిస్తే బాగుండేది.

### 8. కపిలశబ్ద భవము కవిలశబ్దంబొండుగానంబడియెడి (సంజ్ఞ - 13)

కపిల అనే శబ్దం నుంచి కవిల అనే తద్భవం పుట్టిందని అర్థం.

**ఉదా :** "అవసరజ్ఞుండయి వ్యాసుడేతెంచె నంతనత్తపసి కవిలగడ్డంబున గవిలజడలును గవిల కన్నులును" . . . . . అని నన్నయ భారతంలో ఉదాహరణగా చూపాడు.

చిన్నయసూరి కపిల అనేది సంస్కృతం అనీ, గడ్డము, జడలు, కన్నులు అనేవి ఆచ్ఛికాలనీ భావించి "కేవల సంస్కృత శబ్దము వికృతి శబ్దంబుతోడ సమసింపదు" (సమాస - 3) అనే వివరణ వాక్యాన్నిబట్టి కపిలగడ్డం మొదలైనవి వైరి సమాసాలు కాబట్టి గ్రామ్యాలవుతాయి. "ఆర్య వ్యహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు" (సంజ్ఞ - 23) అనే సూత్రంలో గ్రామ్యమైనా పెద్దలు వ్యవహరించడం చేత అనింద్య గ్రామ్యాలంటాడు.

ప్రౌఢ వ్యాకర్త 'కపిల గడ్డం' అనికాక కవిలగడ్డం అని నన్నయ ప్రయోగించాడంటాడు. పై పద్యంలో వకారం ప్రాసస్థానంలో వుంది. సూరి ప్రకారం "కపిల గడ్డము" అని గ్రహిస్తే ప, వ లకు ప్రాస అంగీకరించాలి. భారతంలో ప, వ లకు ప్రాస లేదు. పద్యం వివాదగ్రస్తంగా ఉంది. వైరిపద సమాసాలు ప్రాచీన ప్రామాణిక కవులకూ, లాక్షణికులకూ సమ్మతాలు కావు. ప్రౌఢ వ్యాకర్త చేసిన ఈ సవరణం సమంజసంగా ఉంది.

### 9. ఇప్రత్యయాంతా వ్యయంబునకు సంధియుఁజూపట్టెడి. (సంధి - 2)

భూతకాలికా సమాసక క్రియ యొక్క ఇకారమునకుఁ బ్రామాణిక ప్రయోగములందునుగొన్ని యెడల సంధి గనబడుతున్నది" అంటూ సూత్రార్థాన్ని వ్రాశాడు.

**ఉదా :** 1. చాపమునాకందిమ్ము

2. వెఱచిట్లంబుధినాథనందనులు

3. ఎఱింగెఱింగి

4. నీచేత చెప్పంబడే

చిన్నయసూరి "క్త్వార్థంబైన యిత్తునకు సంధి లేదు" (సంధి - 8) అంటూ సంధి నిషేధం తెల్పాడు. ప్రౌఢ వ్యాకర్త సంధి విధించాడు.

1) "అందిమ్ము" అన్నప్పుడు 'అంది + ఇమ్ము' అని క్త్వార్థంగాకాక 'అందునట్లు ఇమ్ము' అని శబ్ద పల్లవంగా చెప్పవచ్చు. కాబట్టి ఇది దీనికి లక్ష్యంకాదు.

2) "వెఱచిట్లు" అనే దానికి 'వెఱనిట్లు' అనే పాఠాంతరం ఉంది. ఈ రెండు ప్రయోగాలు తిక్కనవి.

ఎఱింగెఱింగి, చెప్పంపడే అనేవి పోతన, పింగళి సూరన ప్రయోగాలు. ప్రాచీనాలుగావు. అందువల్ల ప్రామాణిక కవి ప్రయోగాల్లో "క్త్వార్థంబయిన యిత్తునకు సంధిలేదు" అనే సూరి మతమే సమ్మతం.

### 10. కొన్నియెడలఁబ్రామాణిక కవిప్రయోగంబులం ద్రుతంబునకచ్చు పరంబగుచో ద్విత్వంబు చూపట్టెడు. (సంధి - 3)

నాచన సోమనాధాది ప్రామాణిక కవి ప్రయోగాల్లో ద్రుతానికి అచ్చుపరంగా ఉంటే ద్విత్వం వస్తుందని అర్థం.

**ఉదా :** సర్వాంగునిన్నను భూత

'సర్వాంగునిన్ + అనుభూత' అనేటప్పుడు ద్రుతానికి అచ్చుపరంగా ఉంది కాబట్టి ద్విత్వం వచ్చి "సర్వాంగునిన్ననుభూత" అనే రూపం వస్తుంది. అట్లాగే సర్వమున్నతని.

చిన్నయసూరి ఈ విషయం చెప్పలేదు. కవిత్రయ ప్రయోగాల్లేకపోవడమే కారణం అయివుంటుంది. ఉత్వవిశిష్టనకారంపై మరోనకారాన్ని అంగీకరించాడు. "కొన్ని యెడల ద్రుతంబుమీద నకారంబుగానంబడియెడి" (సంధి - 21). అది యనున్గాక, దివంబునుంబోలె.

"నన్నయభట్టారకుడు" అన్నిష్టసఖినూదియున్నదాని" అని ప్రయోగించి 'లుక్సంశ్లేషానాచిద్రుతస్య' అని సంశ్లేషమును నిషేదించుట ప్రయోగవైరుధ్య సూచనార్థకంబని ఎఱుంగునది" అంటూ ప్రౌఢ వ్యాకర్త వివరించాడు.

'అన్నిష్టసఖి' అన్నప్పుడు 'అన్ + ఇష్టసఖి' అనికాక 'అనిన + ఇష్టసఖి' అనిగానీ, అన్న + ఇష్టసఖి' అనిగానీ పదవిభాగం చేసుకుంటే ద్రుతద్విత్వాన్ని అంగీకరించాల్సిన పనిలేదు గదా !

## 11. కొన్నిచోట్ల షష్టీసమాసంబునందుకారంబునకచ్చు పరంబగునపుడు, నుగాగమంబునకు లోపంబగు. (సంధి - 10)

కొన్నిచోట్ల షష్టీ సమాసంలో ఉకారానికి అచ్చుపరంగా ఉంటే నుగాగమానికి లోపం వస్తుందని అర్థం.

**ఉదా :** గోకులమిల్లిల్లు

చిన్నయసూరి "షష్ఠీ సమాసమునందుకారబుకా రములకచ్చుపరమగునపుడు నుగాగమంబగు" (సంధి - 34) అనే సూత్రంతో "రాజునాజ్ఞ" మొదలైనచోట్ల నుగాగమాన్ని విధించాడు.

ప్రౌఢ వ్యాకర్త కొన్నిచోట్ల ఈ నుగాగమానికి లోపాన్ని చెప్పాడు. 'గోకులము యొక్క + ఇల్లిలు' అని ఉంటే "సమాస విభక్తికి లోపంబగులట్టునకుగాదు" (సమాస - 25) అనే బాలవ్యాకరణ సూత్రంతో విభక్తి లోపించి 'గోకులము + ఇల్లిల్లు' అని వుంటే ఉత్వసంధి జరిగి గోకులమిల్లిల్లు అని అవుతుంది.

'గోకులము + ఇల్లిల్లు' అని ప్రథమాంతంగా కానీ, 'గోకులమున్ + ఇల్లిల్లు' అని ద్వితీయాంతంగా కానీ సమర్థించడానికి వీలుంది.

'బచ్చింట, శిరసందము' అనేవి ఆధునికాలు.

"నుగాగమంబునకు లోపంబగు" అని ప్రౌఢవ్యాకర్త చెప్పడాన్నిబట్టి బాలవ్యాకరణం ప్రకారం నుగాగమం చెప్పుకొని ప్రస్తుత సూత్రంతో లోపం చేయాల్సి వస్తుంది. ప్రక్రియా గౌరవం అవుతుంది. "నుగాగమంబుగానంబడదు" అంటే బాగుండేది.

## 12. సమాసమందుఁదత్సమంబులు పరంబగునపుడును నుగాగమాదులు గానంబడియెడి. (సంధి - 12)

సమాసంలో తత్సమాలుపరంగా ఉంటే కూడ నుగాగమం మొదలైనవి వస్తాయని యర్థం.

చిన్నయసూరి "సమాసంబునం బ్రాతాదుల తొలియచ్చుమీది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగానగు" (సంధి - 36) అనే సూత్రానికిచ్చిన ఉదాహరణలన్నీ ఆచ్చికాలే. తత్సమాలుపరంగా ఉంటే ఈ సూత్రం ప్రవర్తింపదేమో అనే సందేహాన్ని వారించటానికి ఈ సూత్రాన్ని ప్రౌఢ వ్యాకర్త వ్రాశాడు.

**ఉదా :** ముంగోపము, వింజామరము మొ॥

'ముందు + కోపము' అని ఉంటే "సమాసంబునం(బ్రాతాదుల తొలియచ్చుమీది వర్ణంబులకెల్ల లోపంబుబహుళంబుగానగు" (సంధి - 36) అనే సూత్రంతో తొలిఅచ్చు మీది వర్ణాలు లోపించి 'ము + కోపము' అని అవుతుంది. ప్రస్తుత సూత్రంతో నుగాగమంరాగా 'మును + కోపము' అనికాగా "ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు" (బాల.సంధి - 16) అనే సూత్రంతో "కో" అనేది "గో"గా మారి "మును + గోపము" అని అవుతుంది.

"ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు" (బాలసంధి - 17) అనే సూత్రంతో ద్రుతానికి నిండుసున్నా వస్తే "ముంగోపము" అని అవుతుంది. 'అరసున్న' రావటానికి వీలులేదు. "అఁట యిఁక చుఁడు శబ్దంబులందప్ప నుడితొలి హ్రస్వము మీద ఖండ బిందువును ద్రుతంబునకు లోపంబునులేవు" (బాల.సంధి - 22) అనే సూత్రం అరసున్నను నిషేధిస్తుంది. 'ముందు' అనేది ప్రాతాదుల్లోనిది. "వ్యవస్థితవిభాషచే నీద్రుతంబునకు సంశ్లేషంబులేదు" (సంధి - 37) అనే సూరి వివరణ వాక్యాన్ని బట్టి సంశ్లేషంరాదు.

"వెల్ల + చామరము లేక వీచు + చామరము" అన్నప్పుడు "సంధియందు వర్ణవికారము" అనే వివరణ వాక్యంతో 'విను + చామరము' వింజామరమవుతుంది. సూరి కూడ "క్రిఁగడుపు, క్రిఁగాలు, క్రిఁదోడ - ఇత్యాదులం గ్రిందుశబ్దమునకులుప్తశేషంబునకు దీర్ఘంబు బహుళగ్రహణము చేతనని యెఱుంగునది" (సంధి - 38) అంటూ సూరి ఇట్టివాటిని అంగీకరించాడు.

సూరి "కెంధూళి, కెంజడలని ప్రయోగంబులు గానంబడియెడి" (సంధి - 38) అన్న దాన్ని నిర్ధారించడానికి ప్రౌఢ వ్యాకర్త ఈ సూత్రాన్ని వ్రాశాడు.

## 13. నెన్నడాదులన్ నెఱిదగు (సంధి - 14)

నెన్నడ, నెన్నడుము మొదలైన వాటిల్లో ముందుపదము 'నెఱి' అని ఉండాలని అర్థము.

**ఉదా :** నెన్నడుము.

'నెఱి + నడుము' అని వుండగా "అన్యంబులకు సహితమిక్కార్యంబు కొండొకచోగానంబడియెడి" (సంధి - 39) అనే సూత్రంతో "క్రొత్తశబ్దమునకాద్యక్షరశేషంబునకుంగొన్ని యెడల నుగాగమంబునుంగొన్ని యెడల మీది హల్లునకు ద్విత్వంబునగు" (సంధి - 38) అనే సూత్రము ప్రకారము చెప్పిన ఆద్యక్షరశేషము మీద హల్లుకు ద్విత్వము వస్తే 'నెన్నడుము' అని అవుతుంది.

"నెఱ + నడుము, నెఱి + నడుము" అనువానిలో దేన్ని గ్రహించినా 'నెన్నడుము' అనే రూపం వస్తుంది. ప్రౌఢ వ్యాకర్త సూత్రవివరణలో 'నెఱపూర్ణార్థకము, నెఱిరమ్యార్థకము' అని అంటాడు. 'నెఱి + నడుము' అనే పదవిభాగముతో 'అందమైన నడుము' అని గ్రహించడము యుక్తముగా నుంది.

'నెత్తఱి, నెమ్మది, నెవ్వడి' మొదలైన చోట్ల 'నెఱి' శబ్దము సరిపోదుగదా ! 'నెన్నడుము' అన్నప్పుడు ఎంత నడుము ఉంటే సరిపోతుందో అంతనిండైన నడుము" అని అర్థం చెప్పవచ్చుగదా !

## 14. షష్ఠీ సమాసమునందలి నిలలమీది యచ్చులకు హల్లుపరంబగుచోఁగొన్నియెడల లోపంబుగానంబడియెడి. (సంధి - 17)

షష్ఠీతత్పురుష సమాసములో నిలల మీద వున్న అచ్చులకు హల్లుపరముగానుంటే కొన్నిచోట్ల లోపము కన్పిస్తుందని అర్థము.

**ఉదా :** (1) ఇంద్రున్వలెన్ (ఉ.రా.2ఆ - 33)

(2) రజనీచర భాస్కర బింబముల్రుచుల్ (రామా - 5-187)

(3) అబ్జాసనాంకముల్ పెంపు (చంద్రా - 1-87)

1) 'ఇంద్రుని + వలెన్' అని ఉన్నప్పుడు ప్రస్తుత సూత్రముతో "ని" లోని ఇత్వము లోపించి "ఇంద్రున్వలెన్" అని అవుతుంది. కానీ దీనికి 'ఇంద్రుంబలెన్' అనే పాఠాంతరముంది. 'ఇంద్రునిన్' అను ఉంటే ద్వితీయా 'ని' లోపించి 'ఇంద్రున్' అని అవుతుంది.

2) "రజనీచర భాస్కర బింబము లుచుల్" అన్నప్పుడు దాన్ని ప్రథమ బహువచనాంతముగా సమన్వయించవచ్చు. "ఒకానొకచోనొక విభక్తికి మరియొక విభక్తియునగు" (బాల.కారక. - 21) అను సూత్రము ప్రకారము 'బింబములు + రుచుల్' అని ఉంటే "పదాంతంబులైయసంయుక్తంబులయిన నులురులయుత్వంబునకులోపంబు బహుళంబుగానగు" (ప్రకీర్ణ - 16) అను సూత్రం ప్రకారము ఉత్వము లోపించి 'బింబములుచుల్' అని అవుతుంది. చంద్రాంగద చరిత్రలోని "అబ్జాసనాంకముల్ పెంపు' అనునది ఆధునిక ప్రయోగం. ఈ సూత్రానికి ప్రామాణిక ప్రయోగాలు అన్వేషించాడు.

## 15. మధ్యమ పురుష మువర్ణకంబున కచ్చుపరంబగునపుడును గొన్నియెడల లోపంబు చూపట్టెడి (సంధి - 18)

మధ్యమ పురుష ము వర్ణకానికి అచ్చుపరముగా నున్నప్పుడు కూడా లోపము కన్పిస్తుందని అర్థం.

చిన్నయసూరి "మధ్యమ పురుష ము వర్ణంబునకు హలవసానంబులు పరంబగునపుడు లోపంబు విభాషనగు" (సంధి - 47) అని సూత్రాన్ని వ్రాశాడు. మధ్యమ పురుష ము వర్ణకానికి లోపం రావాలంటే హల్లుపరముగానైనా ఉండాలి, లేదా మ వర్ణకం చివరనైనా వుండాలి. ప్రౌఢ వ్యాకర్త దీన్ని సవరించాడు.

**ఉదా :** ఆడుము + ఇదె = ఆడిదె (కళా-9-106)
చెప్పుము + అనినన్ - 'మార్కం 1-127)

ఇక్కడ ము వర్ణకం లోపించడం, ఉత్వసంధి జరగడము వల్ల "ఆడిదె, చెప్పునినున్' అనే రూపాలవుతాయి. 'ఆడిదె' అను దానికి 'అడితే' అనియు, చెప్పనినన్ అనేదానికి చెప్పునినున్' అనే పాఠాంతరాలున్నాయి. ఈ సూత్రానికి ఉదాహరణల్ని వెదకాల్సివుంది.

## 16. ప్రాసంబున మకారంబుపరంబగుచో ద్రుతంబునకు మకారాదేశంబగు (సంధి - 22)

ప్రాసస్థలాల్లో కొన్నిచోట్ల పూర్వపదం చివరలోనున్న నకారానికి పరపదంలో మొదట మకారం వుంటే మకారం ఆదేశంగా వస్తుందని అర్థం.

**ఉదా :** కమ్మని లతాంతములకుమ్మొనసి
వృష్టిఁజేసే మ్మహానది

'లతాంతములకున్ + మొనసి' అని ఉంటే ప్రస్తుత సూత్రంతో నకారానికి మకారము ఆదేశముగావచ్చి 'లతాంతాములకుమ్మొనసి' అనే రూపము అవుతుంది. "లతాంతములకున్మొసని" అంటూ నకారమకార సంశ్లేషముగా వ్రాస్తే ప్రాసయతి భంగం అవుతుంది. ప్రాసస్థానంలో ద్విత్వమకారము ఉంది కాబట్టి సంశ్లేషంగా వ్రాస్తే యతిభంగమవుతుంది.

బాలవ్యాకర్త ఈ విషయం చెప్పలేదు. "కే చిద్వదంత్య భేదత్వమనుస్వారమకారయోః (వి.వి. సంధి - 12) అనే అధర్వణకారికకు ఉదాహరణగా అహోబలుడు "కమ్మనిలతాం తములకుమ్మొనసి" అనే దాన్నిచూపాడు. చిన్నయసూరి "ద్రుతంబునకు సరళస్థిరంబులు పరంబులగునపుడు లోపసంశ్లేషంబులు విభాషనగు" (సంధి - 18) అనే సూత్రంతో స్థిరపరంగా ఉంటే లోపాన్ని సంశ్లేషాన్ని మాత్రమే చెప్పాడు. ద్రుతానికి మకారాన్ని విధించలేదు.

## 17. ఆమ్రేడితంబు పరంబగునపుడు కృతహ్రస్వంబునకు దీర్ఘంబగు (సంధి - 23)

ద్విరుక్తం యొక్క పరరూపం ఆమ్రేడితమవుతుంది. అంటే రెండు పదాలు ఉచ్చరించేటప్పుడు రెండవది ఆమ్రేడితమవుతుంది. ఆమ్రేడితం పరంగా ఉంటే వ్యాకరణం చేత చేయబడ్డ హ్రస్వానికి దీర్ఘం వస్తుందని అర్థం.

**ఉదా :** లేలెమ్ము, పోపొమ్ము

'లెమ్ము, పొమ్ము' అనేవి మధ్యమ పురుషక్రియలు. త్వరితార్థంలో ద్విరుక్తాలయి 'లెమ్ము + లెమ్ము, పొమ్ము + పొమ్ము' అని ఉంటాయి. "ఆమ్రేడితంబు పరంబగునపుడు మధ్యము ముడుజ్జులకు లోపంబు విభాషనగు" (సంధి - 49) అనే బాలవ్యాకర్త సూత్రంతో 'మ్ము' అనేది లోపించి లె + లెమ్ము, పొ + పొమ్ము' అని ఉంటాయి. అప్పుడు ప్రస్తుత సూత్రంతో దీర్ఘంవస్తే లేలెమ్ము, పోపొమ్ము అనే రూపాలవుతాయి.

"ముజ్ఞు పరంబగునపుడు దీర్ఘంబునకు హ్రస్వంబును ము వర్ణకంబునకు మాముడియు "నగు" (బాల.క్రియ.61) 'లెమ్ము' మొదలైనరూపాలు అవుతాయి. మధ్యమ ముడుజ్జులు ఉంటేనే దీర్ఘాలు హ్రస్వాలవుతాయి. "నిమిత్త స్యాపాయే నైమిత్తికస్యా ప్యపాయః" అనే వ్యాకరణ నియమాన్ని అనుసరించి "మ్ము" లోపిస్తే పూర్వపుస్థితి వచ్చి లేలెమ్ము, పోపొమ్ము అనే రూపాలవుతాయి. స్పష్ట ప్రతిపత్తికీ సూత్రం చెప్పినట్లు గమనించాలి.

## 18. విశేషణంబులు కొన్ని విశేష్యలక్షకంబులగు (శబ్ద - 12)

విశేషణముంటే విశేష్యం ఉండాలి. కొన్నిచోట్ల విశేషణాలు మాత్రమే ప్రయోగింపబడి లక్షణావృత్తితో విశేష్యార్థాన్ని బోధిస్తామని అర్థం.

**ఉదా :** దేవతల కప్రియంబులు గావించి మనుష్యు లధమగతులగుదురు. (భార-అరణ్య-2-50)

'ఇక్కడ 'అప్రియంబులు' అనేది విశేషణం. విశేష్యం చెప్పబడలేదు. 'అప్రియంబులు' అంటే అప్రియమైనటు వంటి పనులనే అర్థం చేసుకోవాలి.

పరమపతివ్రతన్ . . . . . మానవభామినిగాఁదలంచి దెప్పరములు పల్కఁగాదగునె. (భార-సభా-2-255)

'దెప్పరములు' విశేషణం. అంటే దెప్పరమైన మాటలనే అర్థం చేసుకోవాలి.

బెట్టుదంబులంగాని చక్కంబడదు. (భార-అర-6-173) బెట్టిదంబులన్ అంటే బెట్టిదమైన మాటలచే అని అర్థము.

## 19. రోశబ్దం బొండు సంబోధనంబున స్త్రీవాచకంబునకుఁబరంబుగనగు అయ్యది హ్రస్వాంతంబుననయ్యెడి (శబ్ద - 14)

స్త్రీ వాచకాలైన శబ్దాలకు సంభోదనార్థాన్ని వివక్షించేటప్పుడు "రో" అనే శబ్దం ఒక్కటి పరంగా వస్తుంది. అది 'రొ' అని హ్రస్వాంతంగా కూడ ఉండవచ్చని అర్థం.

**ఉదా :** కమలదాళాక్షిరో

'కమల దళాక్ష' అనేది స్త్రీ వాచకం. దానికి సంబోధనార్థాన్ని వివక్షించేటప్పుడు ప్రస్తుత సూత్రంతో "రో" అనేది వచ్చి 'కమలదళాక్షిరో' అని అవుతుంది. హ్రస్వం వస్తే 'కమలదళాక్షిరొ' అని అవుతుంది.

చిన్నయసూరి సంబోధ్య వాచకాలకు ముందు "ఓ, ఓరి, ఓయి, ఓసి" అనేవి విధించాడు. రో శబ్దాన్ని గుర్చి చెప్పలేదు. ఇది బాలవ్యారణానికి పూరణం అవుతుంది.

అధర్వణాచార్యులు "రో ఇతిస్త్రీవాచకోభవేత్ పరత్రైవ" అని చెప్పాడు. కాబట్టి ప్రౌఢవ్యాకర్త చెప్పింది త్రిలింగలక్షణశేషం గాదు.

"ఒకానొక యాధునిక గ్రంధములందు అన్నరో, ఏనుంగురొ అని ప్రయోగములు కానంబడుచున్నవి. వానికిఁబ్రామాణిక ప్రయోగములు కానంబడవు" అనే వివరణం ఉంది. అంటే వాటిని నిరసించినట్లు గ్రహించాలి. 'అన్న' అనేది స్త్రీ సమమైనా స్త్రీ వాచకంకాదు. 'ఏనుగు' అనేది అమహద్వాచకం. వాటిపై 'రో' రావటానికి వీల్లేదు. అధర్వణుడు మాత్రం "అన్యత్రాపి క్వచిద్రోస్యాత్ రూఢ దేశ్యప్రయోగతః' అనే కారికలో స్త్రీ వాచకాలు కాని దేశ్యపదాలకు 'రో' విధించాడు.

## 20. హలవసానంబులు పరంబులగునపుడు లు, రు వర్ణంబుల యుత్వంబునకులోపంబు వైకల్పికంబు (శబ్ద - 16)

లు, రు అనేవి ప్రథమా బహువచన ప్రత్యయాలు. వాటిలో వున్న ఉత్వానికి హల్లుపరంగా ఉంటేగాని, చివరలో ఉంటేగాని లోపం వికల్పంగా వస్తుందని అర్థం.

**ఉదా :** వారిదప్రతతుల్సొల్పడి . . . . . తత్పాలుర్ భయంబందగన్ (భార-ఆది-2-91)

ఇక్కడ లు, రు (ప్రతతుల్, తత్పాలుర్) అనే వాటిలోని యత్వం హల్లుపరంగా ఉన్నప్పుడు లోపించింది. 'భూసురోత్తముల్, భూపాలుర్' అన్నప్పుడు చివరిలో ఉన్న లు, రు లోని ఉత్వం లోపించింది.

"సూరి" పదాంతంబులయి యసంయుక్తంబులయిన నులురులయుత్వంబునకు లోపంబు బహుళంబుగానగు" (కీకార్ణ - 16) అనే సూత్ర వివరణంలో "ఇందు నురుల కు త్వలోపంబుప్రాయికంబుగ హల్పరకంబులకుఁజూపట్టెడు" అని హల్లుపరంగా ఉంటేనే ఉత్వలోపం చెప్పబడింది. రాములు - రాముల్, వనములు - వనముల్ అని ఉదహరించాడు. సూరిసూత్రంలో ప్రాయికంబుగా అన్నాడు కాబట్టి ఇట్టి వాటిని గ్రహించవచ్చు. ప్రౌఢ వ్యాకరణ సూత్రంతో పనిలేకుండానే ఆ రూపాలు సాధించవచ్చును గదా !

## 21. మహత్తమహదర్థక శబ్దంబ మహత్కార్యయుక్తంబయ్యుత ద్విశేషణక్రియలు మహత్కార్య యోగ్యంబులు విభాషనిగు (శబ్దము - 17).

మహత్వము హోర్థికశబ్దం (పురుషులను బోధించే శబ్దం) అమహత్కార్యమగు ము వర్ణకంతో గూడియున్నప్పటికినీ దానికి సంబంధించిన విశేషణాలూ, క్రియలూ మహద్వాచకాలు కర్తలుగా ఉంటే ఏ రూపాలతో ఉంటాయో అట్టి రూపాలతోనే వికల్పంగా ఉంటాయని యర్థం. అంటే మహత్వమూ హోర్థికపదం కర్తగా ఉంటే దానికి సంబంధించిన విశేషణలూ, క్రియలూ అమహత్కార్య యుక్తాలు ఒకసారి, మహత్కార్య యుక్తాలుగా ఒకసారి వుంటాయని అర్థంగా గ్రహించాలి.

**ఉదా :** మునిని కాయము . . . . . ఆతనిఁబూజించిరి.

ఇక్కడ 'మునినికాయము' అనేది పురుష సమూహార్థక పదమైనప్పటికీ, అమహత్కార్యయుక్తంగా అంటే మువర్ణకంతో వుంది. దీనికి సంబంధించినవి విశేషణాలూ క్రియలూ, అమహత్కార్యంతో గూడా వుండవచ్చుగదా ! 'పూజించిరి' అనే క్రియ ప్రథమ పురుష బహువచనాంతం అట్లుకానిచో "తిర్యగ్జడంబులు వాచ్యంబులగునపుడు లిఙ్గాట్టుల బహువచనంబునకే కవచనంబగు" (క్రి.మి.చ) అనే దాన్ని అనుసరించి పూజించెను అనే వుండాల్సి వస్తుంది.

'గీర్వాణి గణంబుకాలకేయులతోడన్ గర్వించిరణము చేసిరఖర్వపరాక్రమములు కడిమి కుడునుద్ధతులై, (భార.అర.3-4) అన్నప్పుడు అ అనేది అ మహత్కార్యంతో కూడియున్న మహత్వమూ హోర్థిక శబ్దం. దీనికి విశేషణాలైన ఆఖర్వపరాక్రములూ, ఉద్దతులూ అనేవి, 'చేసిరి' అనే క్రియ కూడా మహత్కార్య యుక్తాలుగా వున్నవి. 'రణంబుచేసెన్' అని యుండవచ్చు. దీన్ని తెలుగు వ్యాకర్త లెవ్వరూ చెప్పలేదు. కాబట్టి త్రిలింగలక్షణశేషం అవుతుంది.

## 22. కంటెవర్ణకంబు పరంబగునపుడును గొన్నియెడల నగాగమంబు చూపట్టెడి. (శబ్దం - 20)

"పంచమీ విభక్తి ప్రత్యయమైనట్టి కంటె వర్ణకంపరంగా వుంటే కొన్ని యెడల నగాగమం కన్పిస్తుందని అర్థం. "కువర్ణకంబు పరంబగునపు డుకారబుకారంబులకు "నగాగమంబగు" (తత్సమ - 28) అని సూరి ఉకారబుకారంతాలైన శబ్దాలకు కువర్ణకంపరంగా ఉంటే నగాగమాన్ని విధించింది. సూరి 'కంటె' వర్ణకంపరంగా ఉంటే నగాగమాన్ని చెప్పలేదు.

**ఉదా :** తత్క్రతుశతంబున కంటె సుతుండు (భార-ఆది-4-93)

తత్క్రతుశతంబు + కంటె అని వుండగా ప్రస్తుత సూత్రంలో నగాగమం వచ్చి "తత్క్రతు శతంబున కంటె" అని అవుతుంది.

ఉకార బుకారాంతాలకు కువర్ణకం పరంగా ఉంటే నగాగమం విధింపబడినది కాబట్టి కంటె వర్ణకం కూడా ఉకారబుకారాంతాలకు పరంగా ఉంటేనే నగాగమం వస్తుందని గ్రహించాలి.

ఈ ఆగమం 'కొన్నియెడల' అని చెప్పడంవల్ల అది రానప్పుడు తత్క్రతుశతంబు కంటె అని అవుతుంది.

## 23. ద్విత్వయుక్త లాంతంబు మీది లులలకు ను రురలాదేశంబులగు. (శబ్ద - 23)

ద్విత్వలకారం అంత మందు గల ప్రాతిపదికలకు పరంగా వున్న లులలకు రురలు ఆదేశంగా వస్తాయని అర్థం.

సూరి "అదంతంబయిదీర్ఘపూర్వలోపధంబైన మహత్తు మీది విభక్తి లకారంబునకు రేఫంబగు" (తత్సమీ 38) అనే సూత్రాన్ని వ్రాసి బాలురు బాలురన్ మొదలైన రూపాలు సాధించాడు. సూరి లక్షణాల్లో 'దీర్ఘపూర్వ' అనేదాన్ని విడిచి మిగిలిన లక్షణాన్ని అంతా గ్రహించాలి.

"ద్విత్వయుక్త లాంతంబు మీది" అని అనటంవల్ల ప్రాతిపదిక అదంతమనే విషయం తెలుస్తున్నప్పటికినీ, మహద్వాచకం కావాలనేది సూరి నుండి గ్రహించాల్సిందే గదా !

**ఉదా :** మల్లురు

'మల్ల' అనే ప్రాతిపదికానికి "లు వర్ణంబు బహువచనంబు" (తత్సమ 12) అనే సూరి సూత్రం ప్రకారం ప్రథమా బహువచనంలో "లు" వస్తే మల్ల + లు అని అవుతుంది. ప్రస్తుత సూత్రంలో "లు" అనే దానికి "రు" అనేది ఆదేశంగా వస్తే 'మల్ల + రు' అని కాగా, "పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబుబుది యత్వంబున కుత్వంబగు" (తత్స - 21) అనే సూత్రం ప్రకారం అత్వానికుత్వం వస్తే 'మల్లురు' అనే రూపం వస్తుంది.

ఈ సూత్రం తత్సమాలకే వర్తిస్తుందని గ్రహించాలి లేకపోతే "మగపిల్లలు" మొదలైన ఆచ్ఛికాలకు కూడ ఈ సూత్రం వర్తించాల్సి వస్తుంది.

సూత్రంలో లులలకు రురలు నిత్యంగా చెప్పబడ్డాయి. కానీ మల్లులకున్, మల్లులు మొదలైన రూపాలు ఉన్నాయి కాబట్టి వికల్పం అంటే బాగుండేది.

## 24. విధాశబ్దంబు సంస్కృతంబు నంబుంలింగంబునగు (శబ్ద - 24)

'విధా' అనే శబ్దం సంస్కృతంలో పుంలింగంలోను ఉందని అర్థం.

సూరి "కంథరాదులు క్లీబతుల్యంబులు బహుళంబుగానగు" (తత్స - 66) అనే సూత్రాని కిచ్చిన ఉదాహరణల్లో 'విధా'శబ్దాన్ని ఆకారాంత స్త్రీలింగంగా భావించి "విధాశబ్దమునకు గ్లీబతుల్యత్వంబు నిత్యంబు" అని వివరించాడు. విధా ప్రాతిపదిక

"నామంబులదుతి దీర్ఘంబునకు హ్రస్వంబగు" (తత్స - 54) అనే సూత్రం ప్రకారం హ్రస్వంవచ్చి 'విధ' అనికాగా, "అమహన్నపుంసకములకదంతములకు ముపర్ణకంబగు" (తత్స - 39) అనే సూత్రంతో ముపర్ణకం వచ్చి 'విధము' అనే రూపం అవుతుంది.

ఈ విధానం ప్రక్రియ గౌరవంగా వుందని ప్రౌఢ వ్యాకర్త "విధః" అనే పుంలింగాన్ని గ్రహిస్తే 'విధ' అనే ప్రాతిపదిక నుంచి 'విధము' అనే రూపాన్ని సాధించవచ్చని భావించాడు.

సంస్కృతంలోనే అప్రసిద్ధంగా ఉన్న నిఘంటువును బట్టి తెలుగులో ప్రసిద్ధమైన 'విధము' అనే రూపాన్ని సాధించడం సమంజసంగాదు. "దంష్ట్రా శబ్దంబును బులింగంబునుగానంబడియెడి" అని ప్రౌఢవ్యాకర్త వివరించాడు. పోనీ విధా, దంష్ట్రా శబ్దాలనే వాటిని విడిచినా 'కంథరాది' సూత్రం అవసరమే గదా ! అప్రసిద్ధ నిఘంటువులతో సూత్రాల్ని సవరించడం సమంజసంగా వుండదు.

## 25. ఆర్ఘాదుల కడయచ్చున కుత్వంబును మీద వువర్ణకంబును వైకల్పికంబుగానగు (శబ్ద - 25)

అర్ఘ మొదలైన శబ్దాలకు ఉత్వమున్నూ, ప్రథమైక వచనంలో 'వు' ప్రత్యయమున్నూ వికల్పంగా వస్తాయని అర్థం.

**ఉదా :** అర్ఘువు, అర్ఘ్యము

'అర్ఘ' అనే ప్రాతిపదికాన్ని తీసికుంటే అత్వానికుత్వం, వువర్ణకం వస్తే 'అర్ఘువు' అని అవుతుంది. వికల్పం కాబట్టి రాకపోతే ముపర్ణకంతో (బాల.తద్ధిత - 39) 'అర్ఘము అని అవుతుంది.

'ధర్మువులు' అన్నపుడు వుగాగమాన్ని విధించినట్లు గ్రహించాలి. సూత్రంలో 'వర్ణకం' అనే దానికి బదులు 'వర్ణం' అంటే బాగుండేది. 'వర్ణకం' అంటే ప్రత్యయమే అని అర్థం. 'వర్ణం' అంటే అక్షరాన్ని, ప్రత్యయాన్ని గ్రహింపవచ్చును గదా !

వర్గువునందలి వువర్ణకం బొండెలోపించు" ఉదాహరణ వర్గు అని వివరించాడు. వర్గశబ్దాన్ని వృద్ధాదులో చెప్పుకుంటే వర్గు, వర్గువు అనే రూపాలవుతాయి. ఈ సూత్రం బాలవ్యాకరణానికి పూరణంగా గ్రహించాలి.

పాఠం - 2

# సూత్ర వివరణం (ప్రౌఢ వ్యాకరణం)

## 1. రాహుబాహు శబ్దములకంతతట వువర్ణకలోపంబు వైకల్పికంబు (శబ్ద - 26)

రాహు బాహు శబ్దాలకు అంతట వువర్ణకం వికల్పంగా లోపిస్తుందని అర్థం.

**ఉదా :** రాహు - రాహువు

బాహు - బాహువు

సూరి "ఉకారాంతంబగుమహత్తునకు వువర్ణకము బహుళముగానగు" (తత్సమ 5) అనే సూత్రంతో "విష్ణువు, విష్ణుఁడు" మొదలైనరూపాలు సాధించాడు. "ఉకారంత గోశబ్దంబుల కంతట వువర్ణకంబగు" (తత్స - 48) అనే సూత్రంతో అమహద్వాచకంలో ధర్మువు మొదలైన విధంగా రూపాలవుతాయి. రాహు శబ్దం మహద్వాచకం కాబట్టి "రాహు" అనే వువర్ణకం లోపించిన రూపం వుండదు. ప్రౌఢ వ్యాకర్త వువర్ణక లోపం చెప్పాడు కాబట్టి 'రాహువు, రాహుడు, రాహు' అనే రూపాలవుతాయి.

'రాహు పర్వంబు గాక మభానుగప్పె' - భార.పరా. - 2-29 అనే నన్నయ ప్రయోగం చూపాడు

'నాయెదుర బాహప్పళించి' భార-వి.రా-2.7. తిక్కన ప్రయోగం. బాహు అనేది అమహద్వాచకం. ప్రౌఢ వ్యాకర్త అభిప్రాయం ప్రకారం బాహు, బాహువు అనే రెండు రూపాలుంటాయి.

సూత్రంలో "అంతట" అని వుంది కాబట్టి వువర్ణానికంటె ఇతర విభక్తులుపరంగా ఉంటే కూడ ఈ లోపం వికల్పంగా వస్తుందని తెలుస్తుందని వ్యాఖ్యాతలన్నారు. ఈ విషయాన్ని బాలవ్యాకరణం (తత్సమ - 49) చేతనే సాధింపవచ్చు.

'బాహ' అనే ఆకారాంత స్త్రీ లింగ రూపం నుంచి "నామంబుల తుదిదీర్ఘంబునకు హ్రస్వంబగు" (తత్సమ - 54) అని సూరి సూత్రం ప్రకారం హ్రస్వము వచ్చి 'బాహ + అప్పళించి' అని ఉంటే గంగను కాసె (బాల.సంధి - 4) అనుచోట సంధి చేసిన విధంగా సంధి చేస్తే "బాహప్పళించి" అవుతుంది. దీనికిది తప్పితే వేరే ప్రయోగం లేదు. ఈ సూత్రం బాలవ్యాకరణానికి పూరణం అవుతుంది.

## 2. విశ్వకర్ముఁడనియురూపంబు (శబ్ద - 27)

'విశ్వకర్ముఁడు' అనే పుంలింగరూపం కూడా ఉందని అర్థం.

సూరి "విశ్వకర్మాదులకు స్త్రీత్వంబగు" (తత్సమ - 75) అని సూత్రించాడు. 'విశ్వకర్మ' అని ఒక్క రూపమే అవుతుంది. ప్రౌఢ వ్యాకర్త సవరించాడు.

**ఉదా :** విశ్వకర్ముని కూతు విశద లావణ్యసముజ్జ్వలచేకొని (హరి - ఉ-4-45)

"హలంతంబుప్రథమైకవచనాంత తుల్యంబిందు నామంబగు" (కూల-తత్సమ-67) అనే సూత్రం ప్రకారం 'విశ్వకర్మా' అనేది ప్రాతిపదిక అవుతుంది. "నామంబుల తుది దీర్ఘంబునకు హ్రస్వంబగు" (తత్సమ - 54) అనే సూత్రం ప్రకారం హ్రస్వం వస్తే 'విశ్వకర్మ' అని అవుతుంది. ఇది పుంలింగం మహద్వాచకం కాబట్టి ఉత్వ డుజ్ఞులు రావాలి. "విశ్వకర్మాదులకు స్త్రీత్వంబగు" (తత్సమ - 75) అనే సూత్రంతో స్త్రీత్వాన్ని చెప్పాడు కాబట్టి పదత్వసిద్ధికై చేసిన 'సు' ప్రత్యయానికి "స్త్రీ లింగంబుల ప్రథమైకవచనంబునకు లోపంబగు" (తత్సమ - 57) అనే సూత్రంతో లోపం వస్తే 'విశ్వకర్మ' అని అవుతుంది. సూరిమతంలో 'విశ్వకర్ముఁడు' అని కాదు. అందువల్ల 'విశ్వకర్ముని యొక్క కూతు' అని నిగాగమం కూడా రావటానికి వీల్లేదు. (డుమంతంబునకు

ద్వితీయాద్యేకవచనంబు పరంబగునపుడు నిగాగమంబు సర్వత్రవిభాషనగు) (తత్సమ - 23)

విశ్వకర్మ శబ్దానికి స్త్రీత్వంవైకల్పికంగా వస్తుందని గ్రహించాలి. అప్పుడు, "విశ్వకర్మ, విశ్వకర్ముఁడు" అనే రెండు రూపాలుంటాయి.

**3. ముత్తియ శబ్దేతరంబుల యందును దఱచుగ నిత్వలోపంబు గానంబడియెడి - (శబ్ద - 49)**

ముత్తియ శబ్దానికంటె ఇతరమైన శబ్దాల్లోని 'ఇయ' అనుదానిలోని ఇత్వానికి లోపం కన్పిస్తుందని అర్థం.

**ఉదా :** కన్నియ - కన్య, దివ్వియ - దివ్య, వీడియము - వీడ్యము

చిన్నయసూరి "ఇయకుమాఱుగా నామాంతంబున కెత్వంబు బహుళంబుగానగు" (ఆచ్ఛిక - 23) అనే సూత్రవివరణలో "ఇయశబ్దంబునందికార లోపంబు కొందఱు వక్కాణించిరి. అయ్యది ప్రయోగంబులందు మృగ్యంబు. ముత్తియశబ్దంబునందు మాత్రమెత్వ లోపంబు గానంబడియెడి" అని తెల్పారు. ప్రౌఢ వ్యాకరణం దాన్ని సవరించింది.

'కన్నియ' అనేదాన్లో ఇత్వం లోపిస్తే ఒక నకారమే కన్పిస్తుందిగదా. "హలంతర సంయోగము నందు సజాతీయంబులగు హల్లులలో ఒక్కటి మాత్రమే శేషించియుండు" అనే నియమాన్ని అనుసరిస్తే ఒక నకారం లోపిస్తుంది. అప్పుడు 'కన్య' అని అవుతుంది.

1) అంబుజ బాంధవాన్వయనృపాగ్రణి . . . . . భోజనశాలలో ఁబళ్యంబిడినారు. కాశీ-5-307. ప్రాసస్థానంలో 'పళ్యంబిడి' అని ఉంది కాబట్టి మార్చడానికి వీలులేదు.

2) షత్తు కొల్పిరి లేత వీడ్యముల డాలు - పాండు-3-74. 'వీడ్యము' యతిస్థానం. కాబట్టి మార్చడానికి వీల్లేదు. ఈ ప్రౌఢ వ్యాకరణ సవరణం అవసరమే.

**4) నామపునర్గ్రహణంబున భిన్నంబున భిన్నంబునయి తచ్ఛబ్దార్థంబు తత్పర్యాయంబగు (శబ్ద - 75)**

నామవాచకాన్ని ఒకసారి గ్రహించి మరలా గ్రహించాల్సివస్తే, నామవాచకం లేకుండాగాని, నామవాచకంతో గాని 'ఆ' శబ్దం నామవాచకార్థంలో ప్రయోగింపబడుతుందని అర్థం.

**ఉదా :** వాడె సురాసురులెల్లనడ్డమై వచ్చిననైన (భాగ-10-సంక్.పు.1734)

"వాడె - భిన్నరూపము, ఆ సుదర్శనాయుధుఁడనుట అభిన్నరూపము, సుదర్శనాయుధుడు - నామపదము" అని వివరణం కూడా వ్రాశారు.

ఇచ్చట 'వాడె' అనే తచ్ఛబ్దార్థం "సుదర్శనాయుధుఁడు" అనే పదానికి పర్యాయంగా వాడబడింది. ఇక్కడ నామపదాన్ని విడిచి తచ్ఛబ్దార్థమే ప్రయోగించటం జరిగింది.

"ఆ సుదర్శనాయుధుఁడే . . . . . కొనిపోవునిన్ను" అని అంటే నామపదాన్ని తచ్ఛబ్దాన్ని ప్రయోగించినట్లవుతుంది.

అర్థం శబ్దానికి సంబంధించినది కాబట్టి సర్వనామాలను గూర్చి తెలిపేటప్పుడు అర్థవిశేషం వివరిస్తే బాగుంటుందని వ్యాకర్త భావించి వుండాలి.

**5. మహద్విశేషణ సంఖ్యావాచకంబులకుం గొన్నియెడల నమహత్కార్యంబు చూపట్టెడి - శబ్ద - 104.**

"విశేష్యం మహద్వాచకంలో వున్నప్పటికినీ, దానికి సంబంధించిన సంఖ్యా ప్రయుక్త విశేషణాలు అమహత్కార్య రూపంలో

కన్పిస్తున్నాయని అర్థం.

**ఉదా :** అసురులు పదివేలు

యతులు ఎనిమిదివేలు

విశేష్యం మహద్వాచకంలో వుంటే దానికి సంబంధించే విశేషణాలు కూడ మహద్వాచకాలుగానే వుండాలి. విశేష్య విశేషణాలకు లింగ, వచన, విభక్తులు సమానంగా ఉండాలనేది సంస్కృత వ్యాకరణ సంప్రదాయం. "విశేష్యంబునకుంబోలెవిశేషణంబునకు లింగవిభక్తివచనంబులగు" (కారక - 19) అంటూ సూరి ఈ విషయాన్ని చెప్పాడు. అట్లాగే విశేషణ విశేష్యాలకేర్పడే మార్పులూ చెప్పాడు. ప్రౌఢ వ్యాకర్త "విశేష్యంమహద్వాచకంలో వున్నప్పటికినీ, దానికి సంబంధించే సంఖ్యా ప్రయుక్త విశేషణాలు అమహత్కార్య రూపాలతో కన్పిస్తా"యని చెప్పాడు. ఇక్కడ విభక్త్యాది భేదంకాక మహదమహద్భేదం కన్పించడం విశేషం.

ఉదాహరణల్లో "అసురులు, యతులు" అనేవి మహద్వాచక విశేషాలు. అవి పదివేలు, ఎనిమిది వేలు అనే అమహద్వాచక సంఖ్యా విశేషణాలతో కూడివున్నవి. పదివేవురు, ఎనిమిదివేవురు అని ఉండాలి. రెండు విధాలైన రూపాలుండవచ్చని సూత్రం నిర్దేశిస్తుంది.

## 6. ఊరుచోటు మేన్వాదులున్ల ద్విషయంబులు (శబ్ద - 106)

'ఊరుచోటు మేను' అనే వాటికి సప్తమీవిభక్తిలో నవర్ణకం చేస్తే ప్రాతిపదిక చివర్లోవున్న ఉత్వమూ, న అనుదానిలోని అత్వమూ లోపిస్తాయని అర్థం.

**ఉదా :** ఊరు + నన్ = ఊరన్

చోటు+నన్ = చోటన్, మేను + నన్ = మేనన్

బాల వ్యాకర్త "ఔపవిభక్తికంబుల తృతీయాసప్తముల కత్వంబాదేశంబు బహుళంబుగానగు" (ఆచ్ఛి - 38) అని తెలిగించాడు. ఈ సూత్రంతో అత్వాదేశం పొందేవాటికి తృతీయార్థమున్నూ, సప్తమ్యర్థమున్నూ చెప్పాలి. ఊరన్, చోటన్, మేనన్ అనే వాటికి సప్తమ్యర్థమే కన్పిస్తుంది. కాబట్టి ఈ మూడు అత్వాదేశానికి లక్ష్యాలుగా వుంటూ, 'ఊరు + నన్' మున్నగు విధంగా సప్తమ్యేకవచనాంతాలుగా నిర్ణయించి 'ఉన్' అనే దానికి లోపం చెప్పాడు. అప్పుడివి సప్తమ్యార్థాన్నే బోధిస్తాయని యర్థం.

సూరి తృతీయాసప్తమాలకత్వాదేశం బహుళంగా చెప్పారు. 'మేను' అనేది ఔపవిభక్తికం కాదు అని పెద్ద చర్చ జరిగింది. ఔపవిభక్తికమైతే సూరి సూత్రానికి లక్ష్యం అవుతుంది. ఔపవిభక్తికం కాకపోతే ప్రౌఢ వ్యాకరణానికి లక్ష్యం అవుతుంది.

'కేషాంచిదుంతానాం నేతివిభక్తా వునోలుక్స్యాత్' అనే చింతామణి సూత్రానికి వ్యాఖ్యరాస్తూ అహోబలుడు ఔపవిభక్తికా లీ సూత్రానికి లక్ష్యాలుకావనీ, అనౌపవిభక్తికాలైన ఉదంతామహద్వాచకాలే లక్ష్యాలనీ తెల్పి ఇటు+నన్ = ఇటన్ మున్నగువాటిని సాధించాడు. ప్రౌఢవ్యాకర్త సూత్రంలో ఈ మూటినే పేర్కొనటం తగినదికాదు.

## 7. ఉద్దేశార్థమునందు ద్వితీయకు గుఱిచియు ననుప్రయుక్తంబగు (కార - 2)

ఉద్దేశార్థకంలో ద్వితీయవిభక్తి 'ను' వర్ణకానికి 'గుఱిచి' అనేది అనుప్రయుక్తంగా వస్తుందని అర్థం.

**ఉదా :** మముగుఱిచి

"మము" అనుదానికి "నువర్ణంబు ద్వితీయ" (తత్సమ - 2) అనే సూత్రంలో ను వర్ణకం వచ్చి 'మమును' అని అవుతుంది. ప్రస్తుత సూత్రంతో 'గుఱిచి' అనుప్రయుక్తమైతే మమును + గుఱిచి అనికాగా "ద్రుతంబునకు సరళ స్థిరంబులు పరంబులగునపుడు

లోపసంశ్లేషంబులు విభాషనగు (బాల.సంధి - 18) అనే సూత్రం ప్రకారం 'ను' వర్ణము లోపించి మముగుటిచి' అని అవుతుంది. "నిమిత్త స్యాప్యపాయే నైమితిక స్యాపపాయః" అనే సంస్కృత నియమం ప్రకారం ను వర్ణంలోపిస్తే దాన్ని అనుసరించి వచ్చినట్టి 'గుటిచి' అనేది కూడా లోపించాలి. ఇక్కడ అట్టి లోపం జరుగక పోవడం విశేషంగా భావించాలి.

సూత్రమున గుటిచియును అన్నప్పుడు సముచ్చయ గ్రహణము కూర్చి జ్ఞాపనార్థమని వివరించాడు.

'కూర్చి' అనేది ద్వితీయావిభక్తిపై వస్తుందని ప్రౌఢ వ్యాకర్త అభిప్రాయం.

చింతామణి 'కూర్చి' అనేదాన్ని ద్వితీయావిభక్తిగా చెప్పింది. కర్మప్రవచనీయకే కూర్చిః, కూర్చిలనునయోభవద్వితీయాతు". ప్రౌఢవ్యాకర్త ద్వితీయకు 'కూర్చి' అనేది కూడ అనుప్రయుక్తంగా వస్తుందని చెప్పాడు.

ఉద్దేశార్థకంలో ద్వితీయ ప్రత్యేకంగా విధింపబడలేదు. ప్రస్తుత సూత్రం ద్వారా ఉద్దేశార్థంలో ద్వితీయ వస్తుందని చెప్పినట్లైంది.

## 8. ఉండి పదంబు పరంబగుచో వలన కందువర్ణకమట్లు నవర్ణకంబగు (కారక - 10)

ఉండి పదం పరంగా వున్నప్పుడు 'వలన' అనే దానికి అందువర్లకంలాగా నవర్ణకమున్నూ వస్తుందని అర్థం.

**ఉదా :** బ్రహ్మలోకంబున నుండి

"బ్రహ్మలోకంబు వలన" అనే పంచమీవిభక్తి పై "ఉండి పదంబొకానొకచో వలన వర్ణకంబున కనుప్రయుక్తంబగు" '(బాల.కారం - 10) అను సూత్రంతో వలనకు 'ఉండి' అనుప్రయుక్తమైతే బ్రహ్మలోకంబు వలన నుండి" అని అవుతుంది. "ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయా సప్తములు ప్రాయికంబుగనగు (బాల.కారక - 11) అనే సూత్రంతో వలన" అనే దానికి సప్తమీవిభక్తి అందువర్ణకము వచ్చి తత్సమ 26వ సూత్రంతో నగాగమంవచ్చి 'బ్రహ్మలోకంబునందుండి' అని అవుతుంది. ప్రస్తుత సూత్రంతో 'బ్రహ్మలోకంబు వలన నుండి' అని ఉంటే వలనకు నవర్ణకం వస్తే 'బ్రహ్మలోకంబుననుండి' అని అవుతుంది.

చిన్నయసూరి వలనకు ద్వితీయాసప్తములు వచ్చునని తెల్పి 'వనమందుండి' అని అందు ప్రత్యాయానికి ఉదాహరణలిచ్చాడు. న వర్ణానికి రాదేమో అని శంకించి ప్రౌఢ వ్యాకర్త సూరి యభిప్రాయాన్ని వివరించాడు.

## 9. వలనకాదేశంబగు ద్వితీయా సప్తముల మీది యుండికి లోపంబు బహుళంబుగా నగు. (కార - 11)

"ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయా సప్తములు ప్రాయికంబునగు", (బాల.కార - 11) అను సూత్రం ప్రకారం "ఉండి శబ్దం పరంగా ఉన్నప్పుడు 'వలన' అనే దానికి ద్వితీయా సప్తమీ విభక్తులాదేశాలవుతాయి. వలనకు ఆదేశంగా వచ్చిన ద్వితీయా సప్తమీ విభక్తుల తరువాత ఉన్న 'ఉండికి' లోపం బహుళంగా వస్తుందని సూత్రార్థం.

**ఉదా :** ద్వితీయావిభక్తి మీది ఉండికి :- అదితిగర్భమున్ - "అదితి గర్భము వలన నుండి' అని ఉండగా బాల - కారక 11వ సూత్రంతో వలనకు ద్వితీయ విభక్తి వచ్చిన యెడల 'అదితి గర్భమున్ + ఉండి' అనికాగా ప్రస్తుత సూత్రంతో ఉండి లోపించి 'అదితి గర్భమున్' అనే రూపమేర్పడుతుంది.

**సప్తమి మీది యుండికి** :- వదనగహ్వరమున్ - 'వదనగహ్వరము వలన నుండి' అని వుండగా కారక 11చే "వదనగహ్వరమునన్ + ఉండి" అని కాగా ప్రస్తుత సూత్రంలో 'ఉండి' లోపించి 'వదనగహ్వరమునన్' అనే రూపం అవుతుంది.

'బహుళ గ్రహణముచే నందు మీదియుండికి లోపంబు గలుగదనియె ఋుంగునది" అని ప్రౌఢ వ్యాకర్త బహుళ ప్రయోజనాన్ని వివరించాడు. వదన గహ్వరము నందుండి' అన్నప్పుడు ఉండికి లోపాన్ని చెప్పడానికి వీల్లేదు.

## 10. కొన్ని యెడల హేతువునందన్నంతక్రియల మీదను బట్టి వర్ణంబు విభాషనగు - (కారక - 12)

కొన్నిచోట్ల హేత్వార్థంలో 'అన్' అనేది అంతమందు గల క్రియల మీద పట్టివర్ణకం వికల్పంగా వస్తుందని అర్థం.

'సూరి' "తుమర్థభావలక్షణంబులందు నుజియగు (క్రియ - 40) అనే సూత్రం ప్రకారం భావలక్షణంలో 'నుజి' వస్తే "జేత్తు పరంబగునపు డుత్వంబునకత్వంబగు" (క్రియ - 20) అనే సూత్రం ప్రకారం ధాతువు చివరలో ఉన్న ఉత్వానికి అత్వం వస్తే అత్వాన్ని నుజిని కలిపితే 'అన్' అని అవుతుంది. ప్రౌఢ వ్యాకర్త అన్నంతక్రియలన్నాడు. ప్రౌఢ వ్యాకర్త అక ప్రత్యయాంతా వ్యయంబు కళయు (సంజ్ఞ - 8) అనేటప్పుడు కూడ సూరి 'కజి' విధిస్తే ఈ విధంగానే చెప్పాడు.

ఉదా : కలుగంగఁబట్టిగాక

కలుగుధాతువు నుజి చేరినచో కలుగన్ అని అవుతుంది. "నుజ్యంతంబగునగుధాతువు క్రియావిశేషణంబుల కను ప్రయుక్తంబగు, నుజికి విభాషనగు" (బాలక్రియ - 15) దానికి హ్రస్వంబు విభాషనగు (క్రియ - 116) 'కను' అనేది అనుప్రయుక్తమై ద్రుతకార్యాలు జరిగి కలుగంగన్ అనికాగా ప్రస్తుత సూత్రము పట్టిరాగా కలుగంగఁబట్టె అని అవుతుంది. సూరి "పట్టి వర్ణకంబు హేతువలగు గుణక్రియలకగు" (కారక - 14) అని హేతువైన గుణవాచకానికీ, హేతువైన క్రియకు పట్టి వర్ణకాన్ని చెప్పాడు. కాబట్టి ప్రౌఢవ్యాకర్త అన్నంతాలకు పట్టిని విధించాడు.

## 11. షష్టీ స్థానికంబగు కువర్ణకంబొక్కొక్కచో ద్వితీయాది విభక్తులకు మాఱుఁగ ఁదత్తదర్థంబులం జూపట్టెడి (కార - 13)

షష్టీ విభక్తి స్థానంలో వచ్చేకువర్ణకం ఒక్కొక్కచో ద్వితీయాది విభక్తులకు బదులుగా ఆయా అర్థాలలో చూపట్టుతుందని యర్థం.

**ఉదా :** వేటకుఁబోయిరి
పక్షంబున వేటబోయిరి

**తృతీయకు :** 'నీకు నారాధ్యను' పక్షంబున నీచే నారాధ్యను.

**పంచమి :** విలువిద్యనీకునోరులు - పక్షంబున నీకంటె నోరులు

**సప్తమీ :** కోమలకి నీకనురక్త - పక్షంబున నీ యందనురుక్త - "చతుర్థికినుదాహరణంబులు పూర్వవ్యాకరణంబులంజించునది" అని ప్రౌఢ వ్యాకర్త వివరించాడు.

"చైత్రునకు మైత్రుండు తుల్యుండని తుల్యార్థయోగంబున షష్ఠియు నగు" (బాల-కారక-5). "ఈ పంచమికి షష్ఠియునగు" చోరునకు వెఱచి (బాల-కారక-9) అని సూరి తృతీయాపంచమీవిభక్తుల అర్థంలో 'కు' అనేదాన్ని ప్రయోగింపవచ్చునన్నాడు. తృతీయ, చతుర్థి, పంచమీ విభక్తులకు ఉదాహరణల్ని సూరి చూపినట్లైంది.

## 12. యొక్కకు లోపంబు బహుళంబుగా నగు (కార-16)

'యొక్క' అనే షష్ఠీ విభక్తి ప్రత్యయానికి లోపం బహుళంగా వస్తుందని అర్థం.

'సమాసవిభక్తికి లోపంబగు లట్టునకు గాదు' (సమాస - 25) అనే సూత్రంతో సూరి సమాసాల్లో ఉన్న షష్ఠీ విభక్తికి లోపాన్ని విధించాడు. ప్రస్తుత సూత్రం షష్ఠీవిభక్తియైన యొక్కకు వ్యస్తంగా వున్నప్పుడు కూడ లోపాన్ని బహుళంగా చెపుతుంది.

**ఉదా :** ధర్మజు నలువురుదమ్ములు

'ధర్మజు యొక్క నలువురుదమ్ములు' అన్నప్పుడు 'ధర్మజు యొక్క' అనేది వ్యస్తపదం. ప్రస్తుత సూత్రంతో యొక్కకి

లోపం వచ్చి 'ధర్మజనలువురుదమ్ములు' అని అవుతుంది. లోపంబహుళంగాన రాకపోతే 'ధర్మజు యొక్క నలువురుదమ్ములు అని కూడా వుంటుంది.

**నిత్యప్రవృత్తి :** (నిత్యంగా యొక్క లోపించడం) "బహుళగ్రహణముచే ధాతుజ విశేషణ భావార్థకముల ముందటి కర్తృపదంబుల యొక్కయు నిత్యంబుగ లోపంబగునని యెఱుంగవలయును" అని వివరణం చేశాడు.

**ఉదా :** బాహుకు రథంబు గడపునేర్పు

"బాహుకు యొక్క రథంబు గడపునేర్పు" అని అన్నప్పుడు లోపం నిత్యంగా వచ్చి "బాహుకు రథంబు గడపునేర్పు" అని అవుతుంది.

పై లక్ష్యాలను (ఉదాహరణల్ని) సమాసాలుగా కూడ సమన్వయించడానికి వీలుంది. 'యొక్క' అనేది ఆధునిక ప్రయోగాల్లో కన్పించడంచేత ఈ వ్యాకర్త బహుళమన్నాడు.

## 13. కొన్నియెడల నజడంబు తృతీయా సప్తములకు బహుత్వంబున ద్వితీయ చూపట్టెడి - (కారక - 18)

అజడవాచకాల తృతీయాసప్తమీ విభక్తులకు బహువచనంలో ద్వితీయావిభక్తి కన్పిస్తుందని అర్థం.

సూరి "జడంబుతృతీయాసప్తములను ద్వితీయబహుళంబుగానగు" (కారక - 22) అని జడవాచకాల తృతీయసప్తమీ విభక్తులకు ద్వితీయవిధించాడు. కోలంగూలనేసె, బాణంబులను రూపుమాపె" అని ఏకవచన, బహువచనాలను లక్ష్యంగా ఇచ్చాడు. అజడవాచకాల తృతీయ - సప్తములకు బహువచనంలోనే ద్వితీయను విధిస్తూ ప్రౌఢవ్యాకర్త పూరించాడు

**తృతీయా బహువచనమునకు ద్వితీయావచ్చినందులకు :** ఘనతర స్తనచక్రవాకంబులనలరు హరి - 7-70 ఘనతర స్తన చక్రవాకములతోనలరు" అని ఉన్నప్పుడు ప్రస్తుత సూత్రంకే తృతీయకు ద్వితీయవస్తే 'ఘనతర స్తనచక్రవాకములనలరు' అని అవుతుంది.

**సప్తమీ బహువచనమునకు ద్వితీయ వచ్చినందులకు :** మనుజులవిప్రుండు - భార - శాంతి - 1-71 మనుజులయందు విప్రుండు' అని ఉండగా సప్తమికి ద్వితీయవచ్చి 'మనుజులను + విప్రుండు' అని అవుతుంది. "ద్రుతంబునకు సరళస్థిరంబులు పరంబులగునపుడు లోపసంశ్లేషంబులు విభాషనగు" (బాల.సంధి - 18) అనే సూత్రం ప్రకారం స్థిరంపరంగా ఉంది కాబట్టి ద్రుతం లోపించి మనుజుల విప్రుండు అని అవుతుంది.

సూరి ఉదంతాలైన జడవాచకాలకు బహుత్వంలో ద్వితీయ చెప్పాడు. ప్రౌఢ వ్యాకర్త ఉదంతాలుకాని వాటి క్కూడా బహుత్వంలో ద్వితీయ విధించడం విశేషం. ఇది బాలవ్యాకరణానికి పూరణం అవుతుంది.

## 14. ఒక్కోచో సమాసాంతర్గత విశేష్యంబులగు విశేషణంబుల షష్ఠికిని ప్రథమ చూపట్టెడి - (కార - 21)

విశేష్యం సమాస మధ్యలో వుండి విశేషణాలు మాత్రం వేరుగా ఉంటే ఆ విశేషణాల షష్ఠీవిభక్తికి ప్రథమవిభక్తి వస్తుందని అర్థం.

సూరి "ఒకానొకచో విశేషణంబుల షష్ఠికింబ్రథమ విభాషనగు" (కారక - 27) అని సూత్రం వ్రాసి "సుగుణాభిరాముడు రామునకు జోహారు" అని ఉదహరించాడు. అక్కడ సమాసాంతర్గత విశేష్యాలు లేవు. అందువల్ల స్పష్ట ప్రతిపత్తి కోసం ప్రౌఢ వ్యాకర్త ఈ సూత్రాన్ని వ్రాశాడు.

**ఉదా :** పార్థివ ప్రాగ్రసరుండు ధర్మసుతుపన్పు - భార - 5-416. ఇక్కడ ధర్మసుతుడు అనే విశేష్యం. అది 'పన్పు'

అనే పదంతో సమసించింది (సమాసాన్ని బొందింది) 'ధర్మసుతుని యొక్క పన్ను' అని అర్థం. 'పార్థివప్రాగ్రసరుండు' అనేది విశేషణం. "విశేష్యంబునకుంబోలె విశేషణంబుకు లింగవిభక్తి వచనంబులగు" (బాల-కారక-19) అనుసూత్రాన్ని బట్టి 'పార్థివప్రాగ్రసరుడు' అనేది షష్ఠీవిభక్తిలో ఉండాలి. ప్రస్తుత సూత్రంచే ప్రథమావిభక్తిలో ఉంది. కాబట్టి పార్థివప్రాగ్రసరుండు ధర్మసుతుపన్ను" అని అయింది.

సూత్రమున 'సమాసాంతర్గత' అన్నప్పుడు సిద్ధసమాసంగానీ, సాధ్యసమాసంగానీ ఏదైనా కావచ్చు. ఉదాహరణలు సాధ్యసమాసాలకే ఇచ్చాడు. సిద్ధసమాస విశేషణం ప్రథమాంతంగా ప్రయోగాలు లేవు. కాబట్టి 'సమాసాంతర్గత' అని సామాన్యంగా చెప్పినప్పటికినీ సాధ్యసమాస విషయంగా అన్వయించుకోవాలి.

## 15. కొన్నియెడల విశేషణంబు ద్వితీయాదులకును బ్రథమచూపట్టెడి (కారక - 22)

కొన్నిచోట్ల విశేషణాలకు విశేష్యాన్ని అనుసరించి ద్వితీయాది విభక్తులు రావల్సివుండగా దానికి బదులు ప్రథమావిభక్తి వస్తుందని అర్థం.

సూరి "ఒకానొకచో విశేషణంబుల షష్ఠికింబ్రథమ విభాషనగు" (కారక - 27) అని షష్ఠికి ప్రథమావిభక్తి విధించాడు. అట్లాగే "భవత్యర్థ వ్యవహితంబులగు విశేషణంబులకుం బ్రదమయగు" (కారక - 28) అని అగుధాతువుతో వ్యవధానమున్నప్పుడే ప్రథమవిధించాడు. ఈ వ్యవధానము లేకుండా ద్వితీయాదులకు ప్రథమనుచెప్పడానికి సూత్రం ఆరంభింపబడింది.

**ఉదా :** 1) అహన బాహుబిలసారఘనుల్ మధుకైటభాది దైత్యాప తులనెల్ల - (నిర్వ - 5అ - 12)

ఇక్కడ "మధుకైటభాది దైత్యపతులన్" అనేది విశేషణం ప్రథమాబహువచనంలో వుంది. విశేషణ విశేష్యాలకు ఒక విభక్తి ఉండవలసి ఉన్ననూ మార్పు కనిపిస్తుంది.

2) తల్లిద్రౌపదితోడన్ - జై - 1ఆ - 97

తల్లి అనేది ద్రౌపదికి విశేషణం. విశేష్యం ద్రౌపది. తృతీయా విభక్తిలో వుంది. విశేషణం మాత్రం ప్రథమలో వుంది. ఇక్కడ 'తల్లియగు ద్రౌపది' అని కర్మదారయముగా భావిస్తే విభక్తి లోపించి 'తల్లిద్రౌపదితోడన్' అని అవుతుంది. దీనిని ఈవిధంగా సమర్థించడానికి వీలుంది కాబట్టి దీనినిచ్చట ఉదాహరణంగా గ్రహించాల్సిన పనిలేదు.

"షష్ఠీ విశేషణానాం ప్రథమాస్యాత్" అని ఆంధ్రశబ్ద చింతామణి షష్ఠికి ప్రథమ విధించింది. "షష్ఠీ విశేషణానామ్' అను బహువచన స్వారస్యమిట్టి ప్రయోగములకుత్పాదకముగా నున్నయది" అని ప్రౌఢ వ్యాకర్త చింతామణి కర్త కిట్టి మార్పులు ఇష్టమైనట్లు సూచించాడు.

## 16. షష్ఠీ తత్పురుషంబులందు నగాగమంబు విభాషనగు - (సమాస - 1)

షష్ఠీ తత్పురుష సమాసంలో పూర్వపదానికి నగాగమం వికల్పంగా వస్తుందని అర్థం.

**ఉదా :** ఎలజవ్వనంబున విలసనంబు - (భార-ఆది-3-27)

"విలజవ్వనంబున విలసనంబు" అని వుంటే సమాస విభక్తికిలోపం బగులట్టునకుగాదు" (బాల-సమాస-25) అనే సూత్రాన్నిబట్టి 'యొక్క' లోపించి విలజవ్వనంబు + విలాసనంబు అని కాగా ప్రస్తుత సూత్రంచే నుగాగమంవచ్చి ఎలజవ్వనంబున విలసనంబు' అని అవుతుంది. 'యోగక్షేమంబున తెఱగు' అన్నప్పుడు నగాగమము ద్రుతప్రకృతిగం కాదు కాబట్టి ద్రుతకార్యాలు రావు. యోగ క్షేమంబున తెఱగు" అనియే వుంటుంది.

సూరి 'ఉకారాంతజడంబునకు నవర్ణకంబగు' (కారక - 18) అని సూత్రించాడు. ప్రౌఢ వ్యాకర్త చూపించిన ఉదాహరణలు

కూడా ఉదంతజడవాచకాలే. 'ఏలజవ్వనంబు నాదవిలసనంబు' అనే అర్థం చెప్పుకుంటే పై రూపాలు సాధించవచ్చు. సప్తమీ విభక్తిగా చెప్పితే ద్రుతకార్యాలు జరుగుతాయి. 'యోగక్షేమంబున తెఱగు అనేది యతి ప్రాసబద్ధమైన ప్రయోగంకాదు గదా! కాబట్టి యోగక్షేమంబునఁదెఱగు అని వ్రాయవచ్చు గదా ! పై రూపాలను సప్తమ్యంతాలుగా సమర్థించడానికి వీలుంది కాబట్టి ఈ సూత్ర రచనకు ప్రయోజనం కల్పించడం లేదు.

## 17. క్రొత్తాదులు లుప్తశేషంబులు దేశ్యంబుతోడంబలె తత్సమంబుల తోడంగొన్నియెడల కర్మధారయంబగు (సమాస - 7)

క్రొత్తాది శబ్దాలు లుప్తశేషాలై దేశ్యపదాలతో సమాసాలు పొందిన విధంగా తత్సమపదాలతో గూడా సమాసాన్నిబొంది కర్మధారయ సమాసాలు అవుతాయని అర్థం.

చిన్నయసూరి "సమాసంబునంబ్రాతాదుల తొలియచ్చు మీది వర్ణంబులకెల్ల లోపంబుబహుళంబుగానగు" (సంధి - 36) అను సూత్రానికి లేగొమ్మ, చెందొవ, మీఁగడ మొదలైన ఆచ్ఛికాలే ఉదహరించాడు. మిశ్రసమాసాలకు ఈ కార్యంరాదేమో అని సందేహించి "ప్రౌఢ వ్యాకర్త' ఈ సూత్రాన్ని రచించాడు.

**ఉదా :** క్రొంబులకలు

'క్రొత్త + పులకలు' అనేటప్పుడు 'పులకలు' అనేది తత్సమం ప్రస్తుత సూత్రంచేత తత్సమంపరంగా ఉన్నప్పుడు కూడా ప్రాతాదికార్యాలు జరగాలి. "సమాసంబునంబ్రాతాదుల తొలియచ్చుమీది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగానగు" అనే సూత్రంతో 'క్రొ + పులకలు' అనియుండగా "లుప్తశేషంబునకుంబరుషంబులుపరములగునపుడు నుగాగమంబగు" (సంధి - 37) అనే సూత్రంతోను నుగాగమం వచ్చి క్రొను + పులకలు అనికాగా ద్రుతకార్యాలు జరిగి 'క్రొంబులకలు' అని అవుతుంది.

సూరి మిశ్రసమాసాలకు ఉదాహరణలు ఈయకున్నా అన్నిచోట్లరాదని నిషేదించలేదు గదా ! కాబట్టి సూరి సూత్రానికిది వివరణంగా భావించాలి.

## 18. "ముయ్యేడ్వాదులందు హ్రస్వద్విత్వంబులు నిత్యంబులు" (సమాస - 10)

ముయ్యేడు మొదలైన వాటిలో మూడు + ఏడు అని వుండాలి. డు వర్ణానికి లోపము రాగామిగిలిన మూయొక్క దీర్ఘానికి హ్రస్వము మీది హల్లుకు ద్విత్వము వస్తాయని అర్థం.

**ఉదా :** ముయ్యేడు

'మూడు + ఏడు' అని వుండగా "సమానాధికరణం బగునుత్తరం పదంబుపరంబగునపుడు మూఁడుశబ్దము డుజ్వర్ణంబునకు లోపంబును. మీది హల్లునకు ద్విత్వంబునగు" (బాల-సమాస - 17) అనే సూత్రాన్ని అనుసరించి మూడు శబ్దములోనిడు జ్వర్ణము లోపించును. ఏడు అన్నప్పుడు హల్లులేదుగదా ! "మూ + ఏడు" అన్నప్పుడు 'సంధిలేనిచోట స్వరంబుకంటెంబరంబయిన స్వరంబునకు యడాగమంబగు' (బాల.సంధి - 3) అను సూత్రంతో యడాగమం చేస్తే 'మూ+యేడు' అని వుంటే ఇప్పుడు మీది హల్లుకు ద్విత్వంవస్తే ము + య్యేడు అని అవుతుంది. "ద్విరుక్తంబగు హల్లు పరంబగునపుడాచ్ఛికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు" (బాల.సమాస - 13) అను సూత్రం ప్రకారం దీర్ఘానికి హ్రస్వంవస్తేముయ్యేడు అనే రూపం అవుతుంది. ('మూ'ఁ + యేడు అన్నప్పుడు స్థిరంపరంగా ఉంది కాబట్టి అరసున్నాకు లోపం వచ్చింది).

సూరి "సమానాధికరణంబగు . . . . . ద్విత్వంబునునగు (సమాస - 17) అనే సూత్రానికి "ముజ్జగములు, మూడు జగములు' అని రెండు రూపాలిచ్చాడు. సూత్రంలో 'ద్విత్వంబునుఅగు' అని ద్విత్వం కూడా వస్తుందని చెప్పాడు. కాబట్టి

హ్రస్వద్విత్వాలులేని మూడు జగములు మొదలైన రూపాలు సూరి తెల్పాడు. సూత్రంలో వికల్పం అని మాత్రం చెప్పలేదు. 'మూడుజగములు' అన్నప్పుడు వ్యస్తస్థితి. మజ్జగములు అన్నప్పుడు సమానం అవుతుంది. సూరి మూడు జగములు మొదలైన రూపాలుదాహరించాడు. కాబట్టి ముయ్యేడు అన్నప్పుడు హ్రస్వద్విత్వాలు రాని రూపాలుండరాదని గ్రహించాలి. 'మూఁడు+ఏడు' అన్నదాన్నిబట్టి అచ్చుఆదిలో గలపదమే ఉత్తరపదంలో ఉంచాలి అనడానికి కూడా వీలులేదు. 'ముమ్మడుగు' మొదలైన వాటిలో ఉత్తరాపదం హలాదిగా ఉందిగదా !

"ఆంధ్రశబ్ద చింతామణి యందుగల "ఇదమదసిత్యాది సూత్రమునందలి యదఃప్రభృతులు వ్యర్థములగుచు స్వేతరంబులకును నిక్కంబని తెలుపుచున్నది" అని వివరణ వాక్యం వుంది. ఇదమదసేతద్యత్తచ్ఛబ్దాశ్చ బ్దాంతరాన్వయే బహుళయే. హ్రస్వంప్రపద్య దీర్ఘాద్విత్వముపర్యక్షరస్య జనయంతి" అనేది ఆంధ్రశబ్ద చింతామణి సూత్రం. ఆ, ఈ, ఏ అనే త్రికాలను గూర్చి తెలిపే ప్రస్తావన. "యత్" అంటే 'ఏ', తత్ అంటే ఆ, 'ఇదమ్, అదస్, ఏతత్' ఈ మూటికిని 'ఈ' అనేది అర్థం. ఒక్కటి చెపితేచాలుగదా ! మూడు శబ్దాలు ఎందుకు ప్రయోగించాడు అని ప్రౌఢ వ్యాకర్త ప్రశ్నించుకొని వ్యర్థం కాబట్టి స్వేతరములకు అంటే ఆ, ఈ, ఏ అనే త్రికాలకేకాక తద్భిన్నమైన మూడు మొదలైన వానికి కూడ హ్రస్వద్విత్వాదులు వస్తాయని భావించాడు. సూరి మూడు శబ్దాన్ని గూర్చి ప్రత్యేకంగా సూత్రాన్ని వ్రాసియున్నాడు గదా !

## 19. తమ్ముఁగుజ్జులు చిలుకు మొకరి యిత్యాదులు విశేష్యపూర్వపద కర్మధారయంబులు (సమాస - 16)

కర్మధారయ సమాసంలో ముందు విశేషణమున్నూ, తరువాత విశేష్యమున్నూ వుండాలి. కానీ దానికి భిన్నంగా విశేష్యముముందూ, విశేషణము తరువాత గల తమ్ముఁగుజ్జులు, చిలుకమొకరి మొదలైన కర్మధారయ సమాసాలున్నాయని యర్థం.

"మయూరవ్యంస కాదయశ్చ"

అని పాణినీయము విశేష్యపూర్వపద సమాసాలు చెప్పింది. అట్టివి తెలుగులో ఉన్నాయంటూ ఈ సూత్రం వ్రాయబడింది. సూరి తత్పురుషాదులకు లక్షణంబు ప్రాయికంబుగ సంస్కృతోక్తంబయగు" (సమాస - 3) అని సూత్రం వ్రాశాడు. కాని విశేషపూర్వపదకర్మధారయాలు ఉదాహరించలేదు.

**ఉదా :** తమ్ముఁగుజ్జులు

'కుజ్జులయినతమ్ములు' అని అర్థం. ఇచ్చట 'కుజ్జులు' విశేషణము. తమ్ములు విశేష్యము సమాసములో 'విభక్తి' లోపించి నుగాగమువచ్చి తమ్ముఁగుజ్జులు అనురూపమేర్పడుతుంది. సూరి "కర్మధారయంబు త్రికస్త్రీసమ, ముగంత, ధాతుజ విశేషణ పూర్వపదంబయియుండు" (సమాస - 5) అని చెప్పాడు. "తమ్మ" అనేది మహద్వాచకం పూర్వపదం ఉదంత స్త్రీసమం కాదు కాబట్టి సంధి - 25 ప్రకారం నుగాగమం కూడా రావటానికి వీల్లేదు. తమ్ముఁగుజ్జులు అనే రూపాన్నిబట్టి కర్మధారయంగా భావించడం, నుగాగమం వేసుకోవటం చేయవలసి వుంది.

## 20. అలరుఁబోడీత్యాదులుపమాన పూర్వపదకర్మధారయంబులు (సమాధి - 19)

'అలరుఁబోడి' మొదలైనవి ఉపమానం పూర్వపదంగా గల కర్మధారయసమాసాలని అర్థం.

చిన్నయసూరి "బహువ్రీహి స్త్రీవాచ్యంబగుచో నుపమానంబు మీది మేనునకు చోఁడియగు" (సమాస - 23) అని సూత్రం వ్రాసి అలరుబోడి, విరిబోఁడి, ననబోఁడి, పూబోఁడి మొదలైన రూపాలు సాధించాడు. సూరి అలరుఁబోడి మొదలైనవాటిని బహువ్రీహి సమాసాలంటే ప్రౌఢవ్యాకర్త వాటిని ఉపమానం పూర్వపదంగాగల కర్మధారయ సమాసాలంటున్నారు.

ప్రౌఢ వ్యాకర్త "అలరు + పోడి" దీనికి పువ్వువలె మనోజ్ఞురాలైదని యర్థం. ఇటఁబోఁడి పరంబగుచో నెల్లెడల నుమ్మగు.

ఆదిదముచే తీయఁబోఁడి, ననఁబోఁడి, విరిఁబోడి . . . . . యిత్యాదులు గ్రాహ్యంబులు అని వివరించాడు. 'తీయబోడి' అన్నపుడు 'తీయ' అనేదాన్ని ఉపమానంగా ఎలా స్వీకరించాలి ? సూరి "బోఁడి" అనే దానిని 'మేను' అనే దానికి ఆదేశించినట్లు గ్రహించవలసి వుంటుంది.

సూరి నుగాగమమును విధింపగా ప్రౌఢవ్యాకర్త 'నుమ్మగు' అని నుమాగమమును విధించుట సరిగాదు.

బొంది శబ్దమునుంచి బోఁడి అనే రూపాంతారమేర్పడింది. శరీరమృదుత్వాన్ని తెలియజేయటానికి కవులు 'విరిబోఁడి, ననబోఁడి' అనే పదాలు ప్రయోగించారు. ప్రౌఢ వ్యాకర్త పూవువలె మనోజ్ఞురాలు అని అర్థం చెప్పి ఉపమాన పూర్వపదకర్మధారయంగా సమన్వయించాడు. 'మనోజ్ఞము' అనటానికి ఉపమానాలుగా 'అలరు, చిగురు' అనేవి చెప్పడం ప్రసిద్ధంగా కన్పించదు. రూపసాధనానికీ మార్గాన్ని అనుసరించినా అర్థంలో మాత్రం సొగసుండదు. కాబట్టి సొగసు సాధించటానికి సూరి మార్గం అనుసరణీయంగా గుర్తించవచ్చు. సూరి కాలంలో ముద్రింపబడిన ప్రథమ ముద్రణంలోగానీ తర్వాత కొన్ని ముద్రణల ముందుగానీ 'అలరుబోఁడి' అని అలరు తర్వాత బిందువులేని రూపమే వున్నట్లు వజ్ఝల చిన సీతారామస్వామిశాస్త్రి గారు తమ వ్యాకరణ సంహితా సర్వస్వం'లో కూడా చెప్పారు.

## 21. ఒక్కచో ద్విగువు మిశ్రంచేకవచనాంతంబునగు (సమాస - 20)

ఒక్కొక్కచో మిశ్రద్విగుసమాసం బహువచనంలోగాక ఏకవచనంలో ఉంటుందని అర్థం.

**ఉదా :** నల్దిక్కు

దిక్కులు అని వుంటే 'నాలుగు' అనే దానికి నలుఅనేది ఆదేశమై ఉత్వము లోపించి (బాల.ప్ర.16) నల్దిక్కులు అనికాగా, ప్రస్తుత సూత్రంచే ఏకవచనం వచ్చి నల్దిక్కు అని అవుతుంది.

సూరి "ద్విగువునకేకవచనంబు ప్రాయికంబుగానగు మిశ్రంబునకుఁగాదు' (బాల.సమాస.18) అని సూత్రించి ఆచ్ఛికములలోనే ద్విగుసమాసం ఏకవచనంలో వుంటుందనీ, మిశ్రద్విగువులో వుండదనీ చెప్పాడు. ముప్పిధములు అని మిశ్రానికి ఉదాహరణ కూడా ఇచ్చాడు.

"తద్ధితోత్తరపదసమాహారేచ" అని పాణినీయం ద్విగుసమాస విషయంలో చెప్పబడింది. సమాహారం చెప్పబడితేనే ద్విగుసమాసం అవుతుంది. నల్దిక్కు ఉన్నప్పుడు 'నాలుగు దిక్కుల సమాహారం' అని చెప్పడంచేత ద్విగుసమాసమై ప్రస్తుత సూత్రాన్నిబట్టి ఏకవచనంలో వుంది.

'ముప్పిధములు' అన్నప్పుడు ఇక్కడ సమాహారంలేదు కాబట్టి ద్విగుసమాసంకాక కర్మధారయ సమాసంగా గుర్తించాల్సి వుంటుంది. సంఖ్యావాచకాలు పూర్వమునందున్నవన్నీ ద్విగుసమాసాలుకావని తెలుస్తుంది.

## 22. కఱకంఠుడు బహువ్రీహి - (సమాస - 27)

కఱకంఠుడు అనేది బహువ్రీహిసమాసమని అర్థం.

సూరి 'కఱయగు కంఠముగలవాడు' అనే అర్థంలో 'కఱ' అనేది ఆచ్ఛికం, కంఠుడు అనేది తత్సమం. అందువలన "స్త్రీ సమఘటితంబు యొకానొకండు బహువ్రీహి చూపట్టెడు (సమాస - 6) అనే సూత్రానికిది లక్ష్యం కాదు. రెండు స్త్రీ సమాలైతే బహువ్రీహి సమాసం తెలుగులో అవుతుంది. 'కంఠుడు' అనేది స్త్రీ సమంకాదు కాబట్ట ఈ సమాసం గ్రామ్యమవుతుంది. అయినా ఈ మహాకవులు ప్రయోగించారు కాబట్టి అనింద్యగ్రామ్యంగా గుర్తించాలంటూ "ఆర్యవ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు"

అని (సంజ్ఞ - 23) తెల్పాడు.

ప్రౌఢ వ్యాకర్త "తద్భవములందును నలఘురేఫము గలదు (సంజ్ఞ - 9) అనే సూత్రంలో గరళకంఠ శబ్దం నుంచె 'కఱకంఠుడు' అనే రూపం వచ్చిందనీ కాబట్టి సిద్ధావస్థలో అది బహువ్రీహి సమాసం అవుతుందనీ తెల్పాడు. తద్భవాలలో 'ఠ'కారం వుండటానికి వీల్లేదు గదా !

"దీనినహోబల పండితుడు మిశ్ర బహువ్రీహియనెఁగాని యది యట్లగుట దుర్ఘటము" అని ప్రౌఢ వ్యాకర్త వివరణలో నిరసించాడు. గరళకంఠ శబ్దం నుండి కఱకంఠుడు అనేది వచ్చింది అనటాన్ని "తద్భవము లందును నలఘురేఫముగలదు" అనే సూత్రవ్యాఖ్యానంలో నిరసించాడు. కాబట్టి దీన్ని తద్భవంగా గ్రహించటానికి వీల్లేదు. 'కఱకంఠుడు' అనేటప్పుడు బహువ్రీహి సరిపడటం లేదుగదా ! స్త్రీ సమాలు కాని వాటికి వేసిన సమాసాలు తెలుగులోలేవు. 'కఱ' ఆచ్ఛికం. 'కంఠుడు' అనేది తత్సమం కాబట్టి మిశ్రసమాసంగా అంగీకరించడంలో ప్రతిబంధక మేమీకన్పించడం లేదు. కాబట్టి ప్రౌఢవ్యాకర్త అభిప్రాయాన్ని గౌరవించాల్సిన పనిలేదు.

## 23. ద్వంద్వంబప్రాణివాచక, కృదంతశబ్ద ఘటితం చేకవచనాంతంబునగు (సమాస - 30)

ప్రాణివాచకాలు గాని శబ్దములతో గూడిన ద్వంద్వమున్నా, కృదంతశబ్దాలతో గూడిన ద్వంద్వమున్నా ఏకవచనంలో వుంటుందని అర్థం.

**ఉదా :** కూడుగుడ్డ, తాఁకుదగులు.

కూడుగుడ్డ అనునవి ప్రాణివాచకముగావు. అప్రాణివాచక ద్వంద్వసమాసం 'కూడును, గుడ్డయును' అనే విగ్రహ వాక్యంలో 'కూడు + గుడ్డ' అని వుంటే బహువచన లు' ప్రత్యయం వస్తే 'కూడుగుడ్డలు' అని మాత్రమే కావాలి. కాని ప్రస్తుత సూత్రంలో ఏకవచనంవస్తే కూడుగుడ్డ అని వుంటుంది. అట్లే తాఁకుదగులు' అనేది కృదతమునకుదాహరణ.

సూరి ద్వంద్వమున యపదార్థ ప్రధానమని తెల్పి అన్నదమ్ములు మొదలైనవాటిని ఉదహరించాడు. సమాహారద్వంద్వము, ఇతరేతర యోగద్వంద్వము' అని పాణినీయం ద్వంద్వాన్ని రెండువిధాలుగా సమన్వయించింది. తెలుగులో కూడ సమాహారాన్ని చెపితే ఏకవచనమున్నూ, ఇతరేతరయోగాన్ని చెపితే బహువచనమున్నూ ప్రయోగించాలి.

"ను" శబ్దంబుచే గూరగాయ లిత్యాదులు బహువచనాంతంబులు నగునని యెఱుంగవలయును' అని వివరణలో ప్రౌఢ వ్యాకర్త చెప్పాడు.

"తాకు + దగులు" అన్నప్పుడు 'తాకు, దగులు' అనే వాటికి 'ఉవర్ణకంబడుగ్వాదులకగు (బా.ల.పు. 21) అని ఉవర్ణకాన్ని విధించింది. కాబట్టి 'తాకు + దగు'లు అన్నప్పుడు కృదంతాలవుతాయి. వాటికి ఈ సూత్రం వర్తిస్తుంది.

## 24. ఒక్కొకచోసమాసగత పూర్వపదంబు వ్యవహితోత్తర పదంబొంటెతోడను, వానిపెక్కింటి తోడను నన్వయించెడి (సమాస - 34)

ఒకానొకచో సమాసంలో వున్న పూర్వపదం వ్యవధానంగల అనంతర పదంతోగాని, పెక్కుపదాలతోగాని, అన్వయిస్తుందని అర్థము.

**ఉదా :** రాహుకంఠము దెగి దేహము ధరణిబడియె.

ఇచ్చట 'రాహుకంఠము' అనునది సిద్ధసమాసము. ఇక్కడున్న 'రాహు' అనేది వ్యవహితంగా వున్న 'దేహము' అనే

దానితో గూడ అన్వయాన్ని పొందుతుంది. అప్పుడు రాహువుయొక్క కంఠందెగి రాహువుయొక్క దేహము ధరణిబడియె అనే అర్థం లభిస్తుంది.

"పరుల ధనమునకు విద్యాపరిణతికి", పది కడవలనేయిపెరుగు(ంబాలు" అన్నప్పుడివి సాధ్య సమాసాలు. రాహుకంఠము అనేది మాత్రంసిద్ధ, సాధ్యసమాసాలుగా నుండవచ్చును.

రాహువుయొక్క కంఠముదెగి దేహము ధరణిబడియె' అన్నప్పుడు వ్యస్తంగా భావిస్తే "యొక్కకులోపంబు బహుళంబు" అనే ప్రౌఢ వ్యాకరణ సూత్రం ప్రకారం వ్యవస్థిత విభక్తిలోపిస్తే రాహుకంఠముఅని అవుతుంది. ఇప్పుడు 'రాహు' అనేది కంఠ, దేహశబ్దాలతో అన్వయించడానికి సూత్రాన్ని అంగీకరించాల్సిన పనిలేదు.

సూత్రము నందు 'ఉత్తరపదము' అని వున్నది. ఉత్తరపదమంటే సమాస చరమావయవమని యర్థం. వ్యస్త పదము అనే అర్థంలో ఉత్తరపదం వాడుట సమంజసం కాదు.

'ఒక్కొక్క కన్నును జవియును, జిక్కును' అన్నప్పుడు ఒక్కొక్క అనేది పెక్కింటిలో అన్వయించడానికి ఉదాహరణం అవుతుంది'. ఒక్కొక్క కన్నును, ఒక్కొక్క చెవియను మున్నగు విధంగా అర్థం చెప్పాల్సి వస్తుంది.

## 25. కొన్నియెడల సప్తమీ తత్పురుషము నందు నవర్ణకంబునగు (సమాస - 37)

కొన్నిచోట్ల సప్తమీ తత్పురుషంలో నవర్ణకం కూడా వుంటుందని అర్థం.

**ఉదా :** కువలయంబున వారు.

సూరి "సమాస విభక్తికి లోపంబగు లట్టునకుగాదు" (సమాస - 25) అనే సూత్రం ప్రకారం విభక్తి లోపించవలసివుంది. కాని సప్తమీ విభక్తి ప్రత్యయమైన నవర్ణకం లోపించదని అర్థం. ఇట్టివి అలుక్స మాసాలని అర్థం.

'కువలయంబున + వారు' అని వుంటే బాలవ్యాకరణంలోని సమాస (25) ప్రకారం సప్తమీ విభక్తి ప్రత్యయమైన 'న' అనేది లోపించాలి. అది లోపించడం లేదని అర్థం.

సూరి "అంద్వాదుల కలిగాగమంబుసమాసంబునందగు" (సంధి - 44) అని అందువిభక్తికి లోపంలేదని చెప్పాడు. అట్లాగే న వర్ణకానికి కూడా లోపం లేదని ప్రౌఢ వ్యాకర్త పూరించాడు.

సూత్రము 'న వర్ణకంబునగు' నని నవర్ణకాన్ని విధించినట్లుంది. "నవర్ణక లోపంబు రాకుండుటయుం గలదు" అనే లోపాభావాన్ని విధించటం ఉచితం. సమాసంలో విభక్తి లోపం వస్తుంది కాబట్టి దాన్ని వారించడం ఉచితంగా ఉంటుంది. లోపించిన నకారాన్ని విధించడం ఉచితంగాలేదు.

సంస్కృతంలోను "కంఠేకాలః, వనేచరః" మున్నగు సప్తమీ విభక్తి లోపించిన సమాసాలు (అలుక్తమాసాలు) వున్నవి.

పాఠం - 3

# వాక్య వివరణం

## 1. తలఁచుగ ననుటచేఁ గేవలవర్ణోచ్చారణమునందీ విధి నిత్యముకాదని తెలియునది (సంజ్ఞా - 2)

"నిర్దేశ విధానోచ్చారణంబులందఁలుచుగ 'అ' వర్ణాదులు కారప్రత్యయాంతములును, రవర్ణ మిఫప్రత్యయాంతమునగు" అనే సూత్రంలోనిది వివరణ వాక్యం.

'అ' మొదలైన అక్షరలకు కార ప్రత్యయం చేర్చి అకారం, ఇకారం మొదలైన విధంగా వ్యవహరించాలి. "ర" అనే అక్షరానికి 'ఇఫ' ప్రత్యయం చేర్చి 'రేఫం' అని పలకాలి.

సూత్రంలో తలఁచుగ అన్నాడు కాబట్టి 'అ' మొదలైన అక్షరాలకు కారప్రత్యయాన్ని నిత్యంగా చెప్పాల్సిన పనిలేదని, అట్లాగే రవర్ణానికి కూడ ఇఫప్రత్యయాన్ని నిత్యంగా చేయాల్సిన పనిలేదని వివరించాడు.

'ఒకచోఁహ్రస్వంబు దీర్ఘంబగు' (సంజ్ఞ - 3) అనే తరువాతి సూత్రాన్నిబట్టి పై ప్రత్యయాలు రాకపోతే "ఆకు" ఊ వచ్చును. "కా" కు "గా" వచ్చును 'లా' కు 'రా' వచ్చును అని రూపాలవుతాయని ప్రౌఢ వ్యాకర్త వివరించాడు.

సూరి ఈ విషయాన్ని సూత్రరూపంలో చెప్పకపోయినా సూచించాడు. "సంస్కృతమునకు వర్ణములేబది" (సంజ్ఞ - 1) అనే సూత్రంలో "ఇందకారాదులచ్చులు' కకారాదులుహల్లులు' అని తెల్పాడు. 'యరలవలు లఘువలని యలఘువులని ద్వివిధంబులగు (సంజ్ఞ - 18) అనే సూత్రంలో 'శకటరేఫము తత్సమతద్భవములందు లేదు' అని తెల్పియున్నాడు.

## 2. అపుడు తత్సమంబునందలి చజలు దంత్యముల కావని యూహించునది (సంజ్ఞా - 6)

"రాజు వైకృతంబని కొందఱందురు' అనే సూత్రంలోనిది ఈ వివరణ వాక్యం.

సూరి దంత్య తాలవ్య 'చజ'లను గూర్చి వివరిస్తూ 'అర్చి - అర్చులు, వీచి - వీచులు' మొదలైన పదాల్లోనూ, 'రాజు' శబ్దంలోనూ దప్ప సంస్కృత సమాల్లో దంత్యచజలు లేవని చెప్పాడు. "రాజు చూడంగఁజెప్పంగరానికడిమి" అని అచ్చ తెనుగుకావ్యమైన యయాతి చరిత్రలో వున్న ఉదాహరణాన్నిబట్టి రాజు శబ్దం తత్సమంకాదని తెల్పాడు. అచ్చ తెలుగుకావ్యంలో తత్సమ శబ్దాలుండటానికి వీల్లేదు గదా ! 'రాజు వైకృతంబనికొందఱందురు' అని సూత్రం వ్రాశాడు. రాజు శబ్దాన్ని తద్భవంగా పరిగణించడం జరిగింది. అర్చి - అర్చులు అన్నప్పుడు కూడ తాలవ్యంగానే గ్రహించాలని ప్రౌఢ వ్యాకర్త అభిప్రాయం.

ప్రౌఢ వ్యాకర్త "కొందఱందురు" అని అన్నాడేగాని తన నిశ్చితాభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పలేదు. 'రాజు' శబ్దం తత్సమం ఒకటి. తద్భవం ఒకటి వుందని గ్రహిస్తే సరిపోతుంది. తద్భవంలో ఉన్న రాజు శబ్దం దంత్యమే అవుతుంది.

## 3. శబ్దశాసనుఁడు 'ద్రుతాఖ్యోనః' అని కేవల, నకార గ్రహణము చేయుట ద్రుతమునకు స్థిరత్వసిద్ధికై యని తెలియవలయును (సంజ్ఞ - 7)

'నకారంబసాధారణంబు ద్రుతంబు' అనే సూత్రవివరణంలోనిది వాక్యం. ప్రత్యయాగమాత్మకమై యుత్వ విశిష్టమైన నకారంబు ద్రుతసంజ్ఞకంబనియర్థము" అనేది సూత్రార్థం.

శబ్దశాసనుడు "ద్రుతాఖ్యోనః" అని నకారాన్ని గ్రహించడం ద్రుతానికి స్థిరత్వసిద్ధికన్నది ప్రౌఢ వ్యాకర్త అభిప్రాయం.

ద్రుతంపై ఏ అచ్చువున్నా 'హల్' మాత్రానికే అంటే నకారానికే పరుష సరళస్థిరాది సంజ్ఞలు చెప్పడం జరుగుతుంది కదా ! ద్రుతాఖ్యోనః' అన్నా 'ద్రుతాఖ్యోనుః' అన్న నకారం స్థిరం కావడానికి అడ్డంకిలేదుగదా ! ఇది పరుషసరళాల కంటే భిన్నమైందే గదా ! చింతామణి మతంలో కేవలనకారమే స్థిరం. 'ను' అనేది ద్రుతం కాదు. కాబట్టి ఆతడావిధంగా చెప్పాడు. ప్రౌఢ వ్యాకర్త ఈ వివరణ వాక్యంవల్ల సాధించిందేమీ కనబడటంలేదు.

## 4. అదివికృతి యందు సహజంబ (సంజ్ఞ - 11)

"కోటపేటలు వైకృతములు" (సంజ్ఞా - 11) అనే సూత్ర వ్యాఖ్యానం వ్రాయాలి.

## 5. అంచపదము, అంచయానలోనగు వానివంటిది (సంజ్ఞా - 12)

"ప్రాణగొడ్డ మగ్రామ్యంబు నాఁదగు" అనే సూత్రవివరణం లోనిదీ వాక్యం.

సూరి 'ప్రాణగొడ్డము' అన్నప్పుడు 'ప్రాణ' అనేది సంస్కృతం, 'గొడ్డము' అనేది ఆచ్ఛికం. కేవల సంస్కృత పదానికి ఆచ్ఛిక పదంతో సమాసం చేయడలవల్ల లక్షణవిరుద్ధమై గ్రామ్యం కావల్సివుంది. మహాకవుల ప్రయోగించారు కాబట్టి అనింద్యగ్రామ్యం అని చెప్పాడు.

ప్రౌఢ వ్యాకర్త 'ప్రాణకుట్ట'క శబ్దం నుంచి 'ప్రాణగొడ్డము' అనేది తద్భవంగా ఏర్పడింది కాబట్టి గ్రామ్యంకాదంటాడు. దానికి ఆధారంగా అంచపదనము, అంచయాన అనే వానిలో పూర్వపదాలు మాత్రమే వికారం పొందాయి. ప్రాణగొడ్డము అనే దానిలో ఉత్తరపదం వికారం పొందింది. పైన చెప్పినటువంటి పోలికలు సూటిగా సరిపోవడంలేదు. తద్భవాల్లో వర్ణలోపాగమాదేశాది వికారాలు అనేకవిధాలుగా వుంటాయని గ్రహిస్తే సరిపోతుంది.

## 6. తఱచుగ ననుటచే ఒక్కొక్కచో ననుకరణ సహితంబు నగునని యెఱుంగవలయు (సంజ్ఞా - 16)

"జయపదంబనుకరణ విరహితంబ తఱచుగనగు" అనే సూత్రవివరణలోనిదీ వాక్యం.

**ఉదా :** 1) జయపూతనాఘాత జయదైత్యాదమన 2) జయనారాయణ

ప్రౌఢ వ్యాకర్త సంజ్ఞా పరిచ్ఛేదములోని 15వ సూత్రములో సంస్కృత వాక్యాలు అనుకరణం లేకుండా ప్రయోగించవచ్చని తెలిపాడు. ఈ సూత్రంలో 'జయించుగాక, జయింపుము' అనే అర్థంగల జయ అనే 'జి' ధాతువు యొక్క లోట్, మధ్యమపురుష ఏకవచనాన్ని అనుకరణం లేకుండా ప్రయోగించవచ్చని తెల్పుచున్నాడు. 'జయ పూతనాఘాత' మొదలైన వాటిని సంస్కృత సంబోధనలుగా భావించి 15వ సూత్రానికి లక్ష్యాలనే అవకాశం వుంది. 'జయనారాయణ' అనేది దీనికి లక్ష్యం అవుతుంది.

సూత్రంలో 'తఱచుగ' అనే పదం ప్రయోగించడంవల్ల ఒక్కొక్కచోట ఈ 'జయ' 'పదం' అనుకరణము లేకుండా కూడ ప్రయోగింపవచ్చని తెలుస్తుంది.

## 7. ఇయ్యది తదితరంబులకును నుపలక్షణంబని యెఱుంగునది (సంధి - 4)

"చిట్టడవిఁజట్టి" అను సూత్రమునందలిదీ వివరణ వాక్యం. 'చిట్టడవి' అనే ఒకే రూపంలో 'చిట్టి' పూర్వపదంగా వుందని సూత్రంలో చెప్పి "తదితరంబుల కుపలక్షణము" అని చెప్పినందున చిట్టా ముదము, చిట్టీడు, చిట్టుడుకు, చిట్టెలుక, చిట్టెలకా మొదలైనవి సాధించవచ్చని సూచించినట్లైంది.

సూరి "కుఱుచిఱుకడునడునిడు శబ్దంబుల అడలకచ్చుపరంబగునపుడు ద్విరుక్తటకారంబగు" (సంధి - 12) అని సూత్రించి 'చిట్టెలుక' మొదలైనవాటిలో పూర్వపదం 'చిఱు' అని తెల్పాడు. 'చిఱు' అన్నప్పుడు ద్విరుక్తటకారం చేసుకోవడం, ఉత్వసంధిచేయడం ప్రక్రియ గౌరవం అవుతుందనీ, చిట్టివాడు మొదలైన విధంగా చిట్టిపదమే వాడడంచేత 'చిట్టి' అనేది పూర్వపదంగా గ్రహించడం ఉత్తమమని ప్రౌఢ వ్యాకర్త అభిప్రాయం.

## 8. సంజ్ఞా వాచకంబులు గానసంధి నిత్యము (సంధి - 4)

"చిట్టడవిఁజట్టి" అనే సూత్రంలోని వివరణ వాక్యం. 'చిట్టడవి' అనేదానిలో చిట్టిపూర్వపదంగా చెప్పడం జరిగింది. చిట్టి + అడవి" అన్నప్పుడు 'ఏమ్యాదుల యిత్తునకు సంధి వైకల్పికముగానగు'. (బాల.సంధి - 5) అనే సూత్రం ప్రకారం సంధి చేయాలి సంధి వస్తే చిట్టడవి అని వికల్పం కాబట్టి రాకపోతే 'చిట్టయడవి' అని రెండు రూపాలవుతాయి. కాని 'చిట్టి యడవి' అని సంధి లేని రూపం ప్రయోగాల్లో లేదు. కాబట్టి 'చిట్టడవి' అనే దాన్ని సంజ్ఞా వాచకంగా భావించి ప్రౌఢ వ్యాకర్త సంధి నిత్యంగా వస్తుందని చెప్పాడు.

'చిట్టడవి' అన్నప్పుడిది సంజ్ఞా వాచకం కాదుకదా ! 'ఉన్మత్త గంగము' (ఒకదేశము) మొదలైనవి సంజ్ఞావాచకాలు సంజ్ఞావాచకాలకు సంధి నిత్యంగా జరుగుతుందని బాలప్రౌఢవ్యాకర్తలు సూత్రం వ్రాయలేదు. ఏమైనా చిట్టడవి, చిట్టా మదము మొదలైనచోట్ల సంధి తప్పక చేయవలసిందే. 'చిట్టయడవి, చిట్టియాముదము అనే రూపాలు కన్పించుటలేదు.

## 9. కొన్నియెడల సనగాంబ్రాసంబు లందనియర్థము (సంధి - 5)

"కొన్నియెడలఁదెనుగులమీది సాంస్కృతిక కతపలకు గదవలు గానంబడియెడి" అనే సూత్రంలోని వివరణ వాక్యమిది.

**ఉదా :** వీరల్గోపించిన

ఇట్లుదపంబు

వేవణములు

సూరి "తెనుఁగుల మీది సాంస్కృతిక పురుషలకు గసడదవలు రావు" (సంధి - 14) అనే సూత్రం ప్రకారం తెనుగుపదాలపై వున్న తత్సమ పరుషాలకు గసడదవలు రావని నిషేదించాడు. అందులో తత్సమ 'కతప' అనే వాటికి 'గదవ' అనేవి వస్తున్నాయని తెల్పటానికి సూత్రంలో 'కొన్నియెడల' అని వ్రాశాడు. అంటే ప్రాసంబులలో అని అర్థం వ్రాశాడు. ప్రాసలో ప్రయోగం వుంటే మార్చడానికి వీల్లేదు కాబట్టి తాను చెప్పే విషయం పరమప్రామాణికం అని చెప్పడానికి ఈ వివరణ వాక్యం వ్రాయడం జరిగింది.

'వీరల్' అనేది తెనుఁగు 'కోపించిన' అనేది తత్సమ పదసంబంధమైన పరుషం. (సాంస్కృతిక పరుషం) క కారానికి గ కారం వచ్చి వీరల్గోపించిన అని అవుతుంది. మిగిలినవి ఇట్లే గ్రహించాలి.

## 10. సంధి యందు వర్ణవికారము (సంధి - 12)

'సమాసమందు' దత్సమంబు పరంబగునపుడును నుగాగమాదులు గానంబడియెడి" అనే సూత్రవివరణంలోనిదీ వాక్యం.

**ఉదా :** వింజామరము

బాలవ్యాకర్త "సమాసంబునం బ్రాతాదుల తొలియచ్చు మీది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగానగు" (సంధి - 36) అనే సూత్రానికి ఉదాహరణములుగా 'ప్రాయిల్లు, పూరెమ్మ' మొదలైన ఆచ్చకాలే ఉదాహరణలుగా ఇచ్చాడు. తత్సమాలకు నుగాగమాదులు రావేమో అని శంకించి స్పష్ట ప్రతిపత్తి కోసం సూత్రం రచించాడు.

'వెల్ల + చామరము' అన్నప్పుడు 'వెల్ల' అనే దానికి 'విన్' అనేది సంధియం దేర్పడినట్లు చెప్పడానికి ప్రౌఢ వ్యాకర్త "సంధియందు వర్ణవికారము" అని వ్రాశాడు. 'వెల్ల' అనేదానికి ఇట్టి వికారం రావచ్చని సూరిగాని, ప్రౌఢ వ్యాకర్తగాని ప్రత్యేకంగా చెప్పలేదు. సూరి ప్రాతాది సూత్రవివరణంలో "క్రిఁగడుపు, క్రిఁగాలు మొదలైన వాటిలో దీర్ఘం. సూత్రాధిలోని బహుళ పదం వల్ల గ్రహించినట్లు చెప్పాడు. అట్లే 'వెల్ల' అనే దానికి 'విన్' అనేది ఆదేశంగా వచ్చినట్లు భావింపవచ్చు.

## 11. నెఱపూర్ణార్థకము నెఱిరమ్యార్థకము (సంధి - 14)

'నెన్నడాదులన్ నెఱిదగు' అనే సూత్రవివరణంలోని వాక్యం. 'నెన్నడుము' మొదలైన రూపాలను సాధించడానికి "సూరి" 'అన్యంబులకు సహితమిక్కార్యంబు కొండొకచోఁగానంబడియెడి" అనే సూత్రంలో నెఱ + నడుము" అని పదవిభాగం చేసి రూపం సాధించాడు. ప్రౌఢ వ్యాకర్త నెఱి + నడుము అని పదవిభాగం చేయాలనిచెప్పాడు. కాబట్టి నెన్నడుము అన్నపుడు 'నెఱ + నడుము' అని పదవిభాగంచేయరాదు. 'నెఱి + నడుము' అని పదవిభాగం చెయ్యాలని చెప్పాడు. అర్థాన్ని వివరిస్తూ నెఱ అంటే పూర్ణార్థకము అంటే నిండైన అని అర్థం చెప్పడం జరిగింది. నెఱి అంటే రమ్యమైన అంటే అందమైన అని అర్థాన్ని వివరించాడు.

నెమ్మది, నెత్తఱి మొదలైనచోట్ల 'నెఱి' అని రమ్యార్థాన్ని చెప్పలేంకదా ! అక్కడ నెఱ అనేదాన్ని గ్రహించాలి. కాబట్టి అన్నింటికీ సరిపోయే నెఱశబ్దాన్ని గ్రహిస్తే బాగుంటుంది.

## 12. ఒకానొకయాధునిక గ్రంథమునందు అన్నరో, ఏనుంగురో అని ప్రయోగములు కానంబడుచున్నవి (శబ్ద - 14)

"రో శబ్దం బొండు సంబోధనంబున స్త్రీవాచకంబునకుఁ బరంబుగనగు, అయ్యది హ్రస్వాంతంబును నయ్యెడి" అనే సూత్ర వివరణలోనిది వాక్యం.

సంబోధనలో స్త్రీ వాచకాలకు పరంగా "రో" అనేది వస్తుందని ప్రౌఢ వ్యాకరణం తెలుపుతుంది. అది స్త్రీ వాచకమైతే రావచ్చును.

అన్నరో, ఏనుంగురో అనే ప్రయోగాలు కనబడుతున్నాయి. గాని అవి ప్రామాణికములు కావని ప్రౌఢ వ్యాకర్త నిరసిస్తున్నారు.

'అన్న' అనేది స్త్రీ సమము. స్త్రీ వాచకము కాదు కాబట్టి 'రో' అనేది రావడానికి వీల్లేదు. 'ఏనుంగు' అనేది అమహద్వాచకం. స్త్రీవాచకం కాదు. కావున రో అనేది రావడానికి వీల్లేదు. బాల వ్యాకరణమున సంబోధనలో 'రో' ప్రత్యయం వస్తుందని చెప్పలేదు. కాబట్టి దానికి పురాణం.

"అన్యత్రాపి క్వచిద్రోస్యాత్ రూఢదేశ్య ప్రయోగతః" అని అథర్వణుడు ఇట్టి వానిని సాధించియే వున్నాడు. ప్రౌఢ వ్యాకర్త మాత్రం కమలదళాక్షిరో, రమణిరొ మొదలైన స్త్రీవాచకాలకు విధించిన రూపాలను అంగీకరించాడు.

## 13. ఈః కవి పాపజాతి కాన - అని ప్రయోగించినాడు. అది విచార్యము (శబ్ద - 15)

"దేశ్యంబులంగొన్నియెడల స్త్రీవాచక స్త్రీసమంబులగు సంబోధ్యవాచక శబ్దంబుల మీదనేకవచనంబునఁ గాన శబ్దంబొండును, అలయను నవ్యయంబొండును గానంబడియెడి. అలదీర్ఘాంతంబగు" అనే సూత్రవివరణలోనిదీ వాక్యం.

దేశ్య శబ్దాలలో కొన్ని స్త్రీ వాచక సంబోధనాంతములపైనను, స్త్రీ సమంబులగు సంబోధనాంతములపైననూ ఏకవచనంలో 'కాన' అనే శబ్దమున్నూ, 'అల' అనే అవ్యయమున్నూ చేరుతుందని అర్థం. 'అలా' అని దీర్ఘంగా కూడ చేరవచ్చును.

**ఉదా :** తల్లికాన - నైష - 7అ - 9.

'తల్లి' స్త్రీ వాచకము కాబట్టి 'కాన' చేరి 'తల్లికాన' అని అయింది. మాసామికాన-సా-1ఆ-73 అని వ్రాసిన తరువాత పై వివరణ వాక్యం ఇచ్చాడు కాబట్టి సారంధర చరిత్రలోని దగను. పాపజాతికాన అని ప్రయోగము. సామికాన అనేది స్వామి అనే పదానికి తద్భవ రూపం. ఆ ఉదాహరణ ఇచ్చినందున తద్భవాలకు కూడ 'కాన' రావచ్చునేది ప్రౌఢ వ్యాకర్త అభిప్రాయంగా భావించాలి. 'పాపజాతి' అనేది తత్సమం కాబట్టి దానిపై ప్రస్తుత సూత్రం ప్రకారం 'కాన' చేరడానికి వీల్లేదు కాబట్టి ప్రౌఢ వ్యాకర్త వివరించాడు. అప్పుడు సూత్రం 'దేశ్యంబులందు' అనికాక 'అచ్ఛికంబులందు' అని చెప్పిన సరిపోవును. "సంస్కృత సమేతంబయిన 'భాష యచ్ఛయనంబడు' (ఆచ్ఛిక - 1) అని ఆచ్ఛికాన్ని బాల వ్యాకరణం నిరూపించింది. మాసామికాన అనే తద్భవాన్ని గ్రహించినపుడు పాపజాతి కాన అనే తత్సమున్న కూడ అంగీకరింపవచ్చు గదా ! కాదంటే 'సామికాన అనేది కూడ నిరసింపడగిందే అవుతుంది'.

## 14. దంష్ట్రా శబ్దంబును బుంలింగముగాను గానంబడియెడి

"విధా శబ్దంబు సంస్కృతంబునం బుంలింగంబునగు" అనే సూత్ర వివరణలోనిదీ వాక్యం.

సూరి "కంధరాదులు క్లీబ తుల్యంబులు బహుళంగానగు" (తత్సమ - 66) అనే సూత్రోదాహరణలన్నీ స్త్రీలింగాలుగా చెప్పాడు. "విధా" శబ్దానికి క్లీబ తుల్యత్వం నిత్యంగా చెప్పాడు. కాగా 'విధము' అనే రూపమవుతుంది. ('విధా' అని దీర్ఘాంత తీసికొని హ్రస్వం చేసి మువర్ణకం చేయాలని తెల్పాడు) అది ప్రక్రియా గౌరవమని భావించిన ప్రౌఢ వ్యాకర్త "విధో విధానే" అనే నిఘంటువులో "విధః" అని పుంలింగములో ఉందనీ, "విధ" అనే దానికి ము వర్ణకంతో 'విధము' అవుతుందని చెప్పాడు. సంస్కృతంలోనే అప్రసిద్ధంగా ఉన్న నిఘంటువును బట్టుకొని తెలుగులో ప్రసిద్ధమైన రూపాన్ని సాధించాలనుకోవడం విచారింపదగ్గ విషయం.

"కంధరా - నాసికా - భిక్షా - దంష్ట్రా - గ్రీవా - పాదకోల్కా ప్రభృతులు కంధరాదులు" అని సూరి కంధరాదులను చెప్పాడు. 'దంష్ట్రా అనేది ఆకారాంత స్త్రీలింగంగా భావించాలని సూరి అభిప్రాయం. అపుడు దంష్ట్ర, దంష్ట్రము అని రెండు రూపాలవుతాయి. 'దంష్ట్ర' శబ్దము కూడా పుంలింగములో నున్నదనీ, దాన్ని గ్రహిస్తే ప్రక్రియ గౌరవం తగ్గుతుందని భావించిన ప్రౌఢ వ్యాకర్త ఇలా చెప్పాడు. 'దంష్ట్ర' శబ్దానికి నిఘంటు రూపం కూడా వుదాహరించలేదు.

## 15. వర్గువునందలి వువర్ణకంబొండె లోపించు (శబ్ద - 25)

అర్ఘ్యాదుల కడయచ్చున కుత్వంబును, మీఁద వువర్ణకంబును వైకల్పికంబుగానగు" అనే సూత్రవివరణలోనిదీ వాక్యం.

అర్ఘశబ్దము అదంతము అహహత్తు. కాబట్టి సూరి మతముల్లో "అమహన్నపుంసకముల కదంతములకు మువర్ణకంబగు" (తత్సమ - 39) అనే సూత్రం ప్రకారం 'అర్ఘ్యము' అనే అవుతుంది. ప్రౌఢ వ్యాకర్త మతం ప్రకారం 'అర్ఘ్య' అను ప్రాతిపదికకు అత్వానికుత్వమున్నూ, మీద 'వు' ప్రత్యయమున్నూ వచ్చి అర్ఘువు అనే రూపమవుతుంది. వికల్పము కాన రాకపోతే అర్ఘము అని అగును. అట్లే వర్గువు - వర్గము అని రెండు రూపాలగును. వర్గువులోనున్న 'వు' అనే ప్రత్యయానికి లోపం వస్తుందని ప్రస్తుత వివరణ వాక్యం చెబుతుంది. కాబట్టి 'వు' ప్రత్యాయంలోపిస్తే "వర్గు" అని అవుతుందని ప్రౌఢ వ్యాకర్త అభిప్రాయం. దీనికి ప్రయోగమివ్వలేదు.

## 16. శబ్దశాసనుడు "తచ్ఛబ్దాతః" అని సూత్రించిన సూత్రము నందలి తచ్ఛబ్ద మంతప్రభృతులకు నుపలక్షణమని తెలియనది (శబ్ద - 51)

"ఈ, ఏ, ఒక శబ్దముల కంటెంబరంబయిన యంతశబ్దము నకారమునకు లోపంబగు. అగుచో నీ, యేలదీర్ఘమునకు హ్రస్వమును, "ఒక కు" వర్ణవ్యత్యాయ సంహితలునగు" అనే సూత్ర వివరణంలోనిదీ వాక్యం.

**ఉదా :** ఇంత, ఎంత, కొంత

శబ్దాశాసనుని “శబ్దాత్తచ్ఛబ్దాతః” అనే సూత్రానికి “కాపు + అది = కాపుది” అనేది లక్ష్యం. అంటే ‘అది’ శబ్దంలోని అకారం లోపించిందని అర్థం. ప్రౌఢ వ్యాకర్త “అంత” శబ్దంలోని అకారానికి లోపం ఎట్లా వస్తుందన్నదని ప్రశ్నించుకొని తద్భబ్ద మంత ప్రభృతులకు సూచకమని తెల్పాడు. అదే శబ్దములోని అకారం లోపించనట్లే ‘అంత’ అనే దానిలోని అకారం కూడ శబ్దశాసనుని మతం ప్రకారం లోపింపజేయవచ్చును అని గ్రహించాలి.

## 17. సాధారణంబుగననుటచే ఎనమండ్రు, తొమ్మండ్రు, ఇరువండ్రు, ముప్పండ్రు - ఇత్యాదులందురాదని యెఱుంగునది (శబ్ద - 91)

“రురవర్ణంబులు పరంబులగునపుడు సాధారణంబుగ సంఖ్యావాచకంబులకు గువర్ణంబు పూర్వాగమంబగు” అనే సూత్ర వివరణంలోనిది వాక్యం.

**ఉదా :** ఇరు గురు

‘ఇరు’ అనే సంఖ్యావాచకానికి ‘రు’ పరముగా ఉంటే ప్రస్తుత సూత్రంచే ‘గు వర్ణం’ ఆగమంగావస్తే ‘ఇరుగురు’ అని అవుతుంది. సంఖ్యావాచకాలకు‘ గు’ వర్ణం పూర్వాగమంగా వస్తుందంటే విపరీతార్థం వస్తుంది. “ఇరు” మొదలైన సంఖ్యలవాచకాలకు ముందు ‘గు’ వ్రాయాలా అన్న అర్థం వస్తుంది. రు, ర లకు ముందు సవర్ణంబు వ్రాయాలి. అంతేగాని సంఖ్యావాచకాలు కాదు. ఎనమండ్రు, తొమ్మండ్రు మొదలైనవాటిలో ‘రు’ ఉంది కాబట్టి ముందు ‘గు’ వర్ణం ఆగమంగా వ్రాయాలని భావించి రాదని నిషేదించాడు.

“ఎనిమిది” మొదలైన సంఖ్యావాచకాలు ఎనమండ్రు అని మారుతున్నాయి. అక్కడ రు సంయుక్తాక్షరంగా ఉంది. ఇట్టిచోట ‘గు’ అనే వర్ణం రాదనే గ్రహించాల్సి ఉంటుంది.

## 18. కొన్నింటి యనుటచే అయిదుగురు, ఆరుగురు ఇత్యాదులందు లోపంబులేదు. (శబ్ద - 92)

“సంఖ్యావాచకంబులకు విభక్తి పరంబగునపుడు కొన్నింటి యంత్యాక్షరంబులకు లోపంబగు” (శబ్ద - 92) అనే సూత్రవివరణంలోనిదీ వాక్యం.

**ఉదా :** ముగురు, ఎనమండ్రు మొదలగుని

మూడు + గురు అన్నప్పుడు ప్రస్తుత సూత్రంచే అంత్యాక్షరం లోపించి ‘మూగురు’ అనే రూపం అవుతుంది. ‘ఎనమండ్రు’ అనేటప్పుడు అంత్యాక్షరానికి, దానికి ముందున్న అక్షరానికి లోపంవచ్చి ‘ఎనమండ్రు’ అని అవుతుంది. అయిదు + గురు అన్నప్పుడు, ఆఱు + గురు అన్నప్పుడు అంత్యాక్షరములకు లోపం లేదు. దానిక్కారణం సూత్రం కొన్నింటికని చెప్పడంగా గ్రహించాలి.

## 19. సముచ్ఛయగ్రహణము కూర్చిజ్ఞాపనార్థము (కారక - 2)

‘ఉద్దేశార్థము నందు ద్వితీయకు గుఱిచియు ననుప్రయాక్తంబగు” అనే సూత్రవివరణలోనిదీ వాక్యం.

ఉదా : మముగుఱిచి నామగోత్ర క్రమమున . . . . . హరి-భా- 2-61.

ఉద్దేశార్థంలో ద్వితీయా విభక్తి ప్రత్యేకంగా విధింపబడలేదు. ప్రస్తుత సూత్రం ఉద్దేశార్థంలో ద్వితీయ వస్తుందని

నిరూపించినట్లైంది.

చింతామణి 'కూర్చి' అనేదాన్ని ద్వితీయా విభక్తిగా చెప్పింది. "కర్మ ప్రవచనీయకేకూర్చిః కూర్చిలను నయోభవేద్ద్వితీయాతు" ప్రౌఢ వ్యాకర్త ద్వితీయావిభక్తికి కూర్చి అనేది అనుప్రయుక్తంగా చేరుతుందని చెపుతున్నాడు.

## 20. బహుళగ్రహణముచే నందుమీది యుండికి లోపంబు కలుగదని యెఱుంగునది (కారక - 11)

"వలనకాదేశంబగు ద్వితీయ సప్తముల మీది యుండికి లోపంబు బహుళంబుగానగు" అనే సూత్ర వివరణలోనిదీ వాక్యం.

**ఉదా :** వదనగహ్వరము నుండి

"వదనగహ్వరము నుండి" అని ఉన్నప్పుడు "ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయా సప్తములు ప్రాయికంబుగనగు (కారక - 11) అనే సూత్రంతో వలనకు సప్తమీ విభక్తి వచ్చిన వదనగహ్వరమునన్ + ఉండి అనియుంటే ప్రౌఢ వ్యాకరణ సూత్రంతో ఉండి లోపించి "వదనగహ్వరమునన్" అని అవుతుంది. సప్తమీ విభక్తి అన్నాడేకాని 'న' అనే సప్తమీ విభక్తికే అని చెప్పలేదు. అప్పుడు 'అందు' అనే సప్తమీ విభక్తికి పరంగా వున్న ఉండి కూడ ప్రౌఢ వ్యాకరణం ప్రకారం లోపించాల్సి ఉంది. దాన్ని వాదించడానికి ప్రౌఢవ్యాకర్త సూత్రంలో బహళం చెప్పాననీ, దాన్నిబట్టి 'అందు' తర్వాత వున్న ఉండికి లోపంరాదనీ వివరణ వ్రాశాడు. అప్రవృత్తిగా గ్రహించాలి.

"వదనగహ్వరమునందుండి" అన్నపుడు అందు అనే దానిపైన ఉన్న "ఉండి" అనేది లోపించదనటం ఫలితార్థం.

## 21. బహుళగ్రహణముచే ధాతుజ విశేషణ భావార్థకముల ముందటి కర్తృపదంబుల యొక్కకు నిత్యంబుగ లోపంబగునని యెఱుంగవలయును (కారక - 16)

"యొక్కకులోపంబు బహుళంబు" అనే సూత్రవివరణలోనిదీ వాక్యం.

యొక్క అనే వ్యస్తపదానికి లోపంబహుళంగా వస్తుందని గ్రహించాలి. విభక్తి లోపం చెప్పబడింది కాబట్టి వ్యస్తస్థితిలో ఈ సూత్రం ప్రవర్తిస్తుందని గ్రహించాలి.

**ఉదా :** ఎవ్వనియేని

బహుళమనుటచే "ఎవ్వనియొక్కయేని" అని కూడా వుండవచ్చును. "ధాతుజ విశేషణ భావార్థక పూర్వ వ్యవహితా వ్యవహితా కర్తృపద ప్రథమకుఁదఱచుగ యొక్క షష్ఠియగు. (కారక - 15) అనే సూత్రాన్నిబట్టి ధాతజవిశేషణాలకున్ను, భావార్థకాలకున్నూ పూర్వంలో వున్న కర్తృవాచక పదం యొక్క ప్రథమావిభక్తికి బదులు షష్ఠీవిభక్తి తఱచుగా వస్తుందని అర్థం. యొక్కకు లోపంబు బహుళంబు' అన్నప్పటి బహుళం వల్ల ఆ యొక్క కులోపం నిత్యంగా వస్తుందని గ్రహించాలి.

**ఉదా :** బాహుకురథంబుగ గడుపనేర్చు - (భార - ఆర - 2-170)

'బాహుకుండు రథంబుఁగడుపునేర్చు" అని ప్రథమాంతంగా వుండవలసి వుంది. బాహకు యొక్క రథంఁబుఁ గడుపు నేర్చు" అని షష్ఠ్యంతముగా ఉండవచ్చు. ఈ యొక్కకు లోపం నిత్యంగా చేయాలని ప్రౌఢ వ్యాకర్త ఆశయము. బాహువు యొక్క రథంబు గడుపునేర్చు" అనికాక బాహుకురథంబు గడపునేర్చు అని యొక్క లోపించిన రూపమే ఉంటుంది.

## 22. "షష్ఠీ విశేషణామ్" అనుబహువచన స్వారస్యమిట్టి ప్రయోగముల కుత్పాదకముగానున్నయది" (కారక - 22)

"కొన్నియెడల విశేషణంబు ద్వితీయాదులకును బ్రథమ చూపట్టెడి" అనే సూత్రంలోని వివరణ వాక్యమిది.

విశేషణ విశేష్యములు ఒకేలింగ విభక్తి వచనాల్లో ఉండాలనేది సామాన్య నియమం. కొన్నిచోట్ల విశేష్యము ద్వితీయావిభక్తులకు ప్రథమావిభక్తి వస్తుందని అర్థం.

**ఉదా :** అహీనబాహుబలసార ఘనుల్ మధుకైటభాది దైత్యపతులనెల్ల . . . నిర్వ - 5 - 12

అహీన బాహుబలసారఘనుల్ అనేది విశేషణం ప్రథమాబహువచనంలో వుంది. "మధుకైటాభాది దైత్యపతులన్" అనేది విశేష్యము ద్వితీయాబహువచనంలో వుంది. అహీనబాహుబలసార ఘనులన్ అనే ద్వితీయ బదులు అహీన బాహుబలసారఘనుల్ అని ప్రథమగా ప్రయోగించడం జరిగింది.

"షష్ఠీ విశేషణస్య ప్రథమాస్యాత్" అనే సూత్రం వ్రాయవలసి వుండగా చింతామణికర్త "షష్ఠీ విశేషణానామ్" అని బహువచనాన్ని ప్రయోగించినందువల్ల షష్ఠీ విశేషణములకు ప్రథమావిభక్తి రావటమేకాక మిగిలిన విశేషణములకు కూడ ప్రథమావిభక్తి రావచ్చునని సూచించినట్లైంది అనేది వాక్యవివరణంగా గ్రహించాలి. అంటే చింతామణి కర్తకున్నూ ఇట్టి మార్పుసమ్మతమనే విషయాన్ని తెలుపటానికి ప్రౌఢ వ్యాకర్త ఈ వివరణ వాక్యం వ్రాశాడు.

## 23. ఇక్కడఁదృతీయకుఁబంచమిగా మార్పుగలిగెనని తెలియవలయు. (కారక - 26)

"కొన్ని యెడల విభక్తి పరిణామంబు గ్రాహ్యంబు" అనే సూత్రవివరణలోనిదీ వాక్యం.

కొన్నిచోట్ల ఒక విభక్తి వేరొక విభక్తిగా మార్పుచెందుతుందని యర్థం.

**ఉదా :** ఈతనితో సాటి యనంగమేలన

ఈతనితోసాటి అన్నప్పుడు తుల్యార్థములో తోడవర్ణక వచ్చింది. ఈతనితో మేలు అని అర్థం చెప్పవలసి వచ్చును. "కంటెవర్ణకంబు నిర్ధారణ పంచమికగు" (బాల.కార - 13) అనే దాన్ని 'ఈతని కంటె మేలు' అనే కావలెను. రెండు వాక్యాలను కలిపినపుడు "ఈతనితో సాటియనంగ మేలన" అని మాత్రమేవుండి ఈతనితో మేలని తృతీయార్థముగా కాక పంచమీ విభక్తిగా మార్చి అర్థం చెప్పుకోవాలి. అప్పుడు "ఈతనితో సాటియనంగ ఈతనితోమేలన" అని అవుతుంది.

## 24. కృష్ణశాస్త్రీత్యాదులందు దీర్ఘంబు కలుగదు (సమాస - 2)

"కర్మధారయంబు బిరుదాద్యుత్తర పదంబయ్యేనేని ద్వ్యక్షరాదంత స్త్రీ పుం సంజ్ఞావాచకంబగు పూర్వపదంబు నంత్యాక్షరంబునకంతట దీర్ఘంబు బహుళంబుగానగు" అనే సూత్రవివరణలోనిదీ వాక్యం.

**ఉదా :** రామాశాస్త్రి, రామశాస్త్రి (దీర్ఘం వైకల్పికం)

బహుళ పదానికి అప్రవృత్తి అనేది ఒకటివుంది. కృష్ణశాస్త్రి అని రెండురూపాలు కావల్సివచ్చును. కృష్ణాశాస్త్రి అనే దీర్ఘంబుతో వున్న రూపాన్ని నిషేధించడానికి దీర్ఘం లేదు అన్నందువల్ల కృష్ణశాస్త్రి అని మాత్రమే ఉంటుంది.

## 25. అంతటననగా సాంస్కృతికాదులు మూటననియర్థము (సమాస - 2)

పై సూత్రములోనిదే ఈ వివరణ వాక్యమున్నూ, సూత్రములో "అంతట" అని చెప్పుటచే సాంస్కృతికంబని, ఆచ్ఛికంబని, మిశ్రంబని చెప్పబడిన మూడు విధాలైన సమాసాల్లోనూ దీర్ఘంబహుళంగా వస్తుందని యర్థం.

**ఉదా :** రామాశాస్త్రి :- ఇచ్చట రామ అదంతమైన పూర్వశబ్దము. పురుష సంజ్ఞావాచకం. 'శాస్త్రి' అనే బిరుదవాచకం. ఉత్తరపదం. మొదటి పదం చివరలో దీర్ఘంవస్తే రామాశాస్త్రి అని అవుతుంది. రామ, శాస్త్రి అనే రెండు శబ్దాలు తత్సమాలు. కనుక

సాంస్కృతిక సమాసం అవుతుంది.

సుబ్బారెడ్డి : ఇచట సుబ్బ, రెడ్డి రెండుపదాలు ఆచ్ఛికాలే. దీర్ఘం వచ్చి సుబ్బారెడ్డి అని అయ్యింది. దీర్ఘం నిత్యంగా వచ్చినట్లు గ్రహించాలి. సుబ్బరెడ్డి అని వుండదుగదా !

**సుబ్బాశాస్త్రి :** ఇచట సుబ్బ అనేది ఆచ్ఛికం. శాస్త్రి తత్సమం. ఇది మిశ్రసమాసం. దీర్ఘం వచ్చి సుబ్బాశాస్త్రి అని అవుతుంది. రాకపోతే సుబ్బశాస్త్రి అని అవుతుంది.

ప్రౌఢ వ్యాకర్త మూడు విధాలైన సమాసాలను గ్రహించాలని చెప్పడానికి సూత్రంలో "అంతట" అని ప్రయోగించాడు.

## 26. ఇట్లనుటచేఁబూర్వపదంబు లుప్త విభక్తికంబయి యవికృతాంతంబగునని యెఱుంగవలయు (సమాస - 6)

"కర్మధారయం బియ్యది మిశ్రంబు సిద్ధసమాసంబట్లయగు" అనే సూత్రంలోనిదీ వివరణ వాక్యం.

సంస్కృతాచ్ఛిక శబ్దములతోఁగూడిన సమాసం (మిశ్రసమాసం) సిద్ధసమాసంలాగా వుండును అంటే కేవల సంస్కృత శబ్దాల సమాసంవలె వుండును.

ఈ విధంగా చెప్పడంవల్ల మిశ్రసమాసంలోని పూర్వపదాలు విభక్తి లోపాన్నిపొంది చివరలో ఏ మార్పును పొందవని అర్థం.

**ఉదా :** కృష్ణరాయఁడు, రామరావు

కృష్ణ, రామ అనేవి తత్సమపదాలు. రాయఁడు, రావు అనేవి ఆచ్ఛికాలు. ఈ రెంటికి జరిగిన సమాసం మిశ్రసమాసం అవుతుంది.

'కృష్ణ, రాయ' అనేటప్పుడు 'ఉత్వడుజ్ఞు' వచ్చును. సమాసంలో విభక్తి లోపిస్తుంది. ఉత్వం వుండి కృష్ణు, రాయు అనికావలసి వుంటుంది. ఉత్వంరాదని చెప్పడానికి ఈ వివరణ వాక్యం వ్రాయబడింది. సిద్ధసమాసంలో ఉత్వప్రసక్తి వుండదు గదా !

## 26. ఆంధ్రశబ్ద చింతామణియందుఁగల 'ఇదమద' సేత్యాది సూత్రమందలి యదఃప్రభృతులు వ్యర్థములగును స్వేతరంబులకును నక్కార్యంబగునని తెలుపుచున్నవి (సమాస - 10)

"ముయ్యేద్వాదులందు హ్రస్వదిత్వంబులు నిత్యంబులు" అనే సూత్రవివరణలోనిదీ వాక్యం.

"ఇదమదసేతద్వత్తత్" అని చింతామణి సూత్రం త్రికాలను గూర్చిచెప్పేది. ఆ, ఈ, ఏ అనేవి త్రికాలు. యత్ అంటే ఏ, తత్ అంటే ఆ అని అర్థం. "ఇదమ్, అదస్, ఏతత్" అనే మూటికినీ ఈ అని అర్థం. ఒక్కదాన్ని చెపితే సరిపోతుందిగదా ! మూడెందుకు చెప్పాడని ప్రౌఢ వ్యాకర్త ప్రశ్నించుకొని వ్యర్థంగా చెప్పాడు కాబట్టి వ్యర్థమై "స్వేతరములకు అంటే" ఆ, ఈ, ఏ అనే వాటికంటే భిన్నమైన మూడు మొదలైన వాటికి కూడా హ్రస్వద్విత్వాలు వస్తాయని భావించాడు. "ముయ్యేద్వాదులందు" అనే సూత్రంలో ప్రస్తావించాడు కాబట్టి మూడు మొదలైనవి గ్రహించాలని భావం. 'మూడు' అనే దాన్నిగూర్చి సూరి ప్రత్యేకంగా సూత్రాన్ని వ్రాశాడు.

## 27. తెనుగున సాధారణంబుగ విశేషణంబు లవిభక్తికంబులు (సమాస - 9)

"అట్టి యిట్టి యెట్టి విశేషణంబుల మీది తచ్ఛబ్ద వకారంబునకు లోపంబు విభాషనగు" అనే సూత్ర వివరణలోనిదీ వాక్యము.

'అట్టియిట్టియెట్టి' అనేవి విశేషణాలు. తెలుగులో సాధారణంగా విశేషణాలకు విభక్తులుండవు. ఒకవేళ విభక్తి వివక్షించాల్సి వచ్చినచో తచ్ఛబ్దము చేరి 'అట్టి + వాఁడు' అనికాగా తచ్ఛబ్దవకారం లోపిస్తే 'అట్టిఁడు' అని అవుతుంది. "హ్రస్వము మీదిఖండ బిందువునకు బూర్ణబిందువు వైకల్పికముగనగు" అనే సూత్రం ప్రకారం హ్రస్వానికి పూర్ణబిందువు వస్తే 'అట్టిండు' అని అవుతుంది. సూరి కూడ 'ధాతజవిశేషణంబులకు విభక్తి వివక్షించునపుడు తచ్ఛబ్దంబనుప్రయుక్తంబగు"(సమాస - 9) అని విభక్తి వివరించినపుడు అనుటవల్ల విభక్తి వుందని తెలుస్తుంది.

## 29. ఇటఁబోఁడి పంబగుచోనెల్లెడల నుమ్మగు (సమాస - 19)

"అలరుఁబోఁడీత్యాదు లుసమానపూర్వపద కర్మధారయంబులు" అనే సూత్రవివరణంలోదీ వాక్యం.

ఉపమానం పూర్వపదంగా కర్మధారయ సమాసంలో 'పోఁడి'పరంగా వున్నప్పుడు ఉదంతాని కంటె భిన్నమైనదానికి నుమాగమం వస్తుందని ప్రౌఢవ్యాకర్త అభిప్రాయం.

'అలరు + పోఁడి' అని వుండగా "సమాసంబున నుదంతంబులగు స్త్రీసమంబులకుం బుంపులకుం బరుష సరళంబులు పరంబులగునపుడు నుగాగమంబగు" (బాల-సంధి-25) అని సూరి ఉదంతాలకు నుగాగమం విధించాడు కాబట్టి అలరు + ను + పోడి 'అలరుఁబోడి' అవుతుందని భావం.

'నన + పోఁడి', విరి + పోఁడి మొదలైనవి ఉదంత స్త్రీ సమాలుకావు కాబట్టి నుగాగమం రావటానికి వీల్లేదు. కాబట్టి ప్రౌఢ వ్యాకర్త నుమాగమాన్ని విధించాడు. అప్పుడు ననఁబోఁడి, విరిఁబోఁడి మొదలైన రూపాలవుతాయి.

## 30. దీనినహోబలపండితుడు మిశ్రబహువ్రీహి యనెంగాని యదియట్లగుట దుర్ఘటము - (సమాస - 27)

'కఱకంఠుడు బహువ్రీహి" అనే సూత్రవివరణలోదీ వాక్యం.

ప్రౌఢ వ్యాకర్త 'గరళకంఠ' శబ్దం నుండి కఱకంఠుడు అనేది వచ్చిందికాబట్టి మిశ్రబహువ్రీహి అనరాదంటాడు. 'కంఠ' అనేది తత్సమం. 'కఱ' అనేది ఆచ్ఛికం.

'స్త్రీ సమ ఘటితంబ యొకనొకండు బహువ్రీహి చూపట్టెడు" (సమాస - 6) అని సూరి బహువ్రీహి సమాసంలో రెండు స్త్రీసమాలు కావలెనన్నాడు కాబట్టి కంఠుడు స్త్రీసమం కానందున అనింద్యగ్రామ్యమని తెల్పాడు.

బహువ్రీహి సమాసమనుటలో వ్యాకర్తలెవరికినీ అభిప్రాయభేదం లేదు. 'గరళకంఠ నుండి కఱకంఠుడు' అనే రూపముద్భవించిందనటాన్ని "తద్భవము లందును నలఘురేఫముగలదు" అనేచోట వివరించడం జరిగింది. 'కఱ' ఆచ్ఛికం, 'కంఠుడు' తత్సమం. కాబట్టి మిశ్రమ బహువ్రీహియనటంలో సందేహం లేదు.

పాఠము - 4

# రూపవివరణం

## 1. కాదనక :

అను ధాతువునకు "కజీ వ్యతిరేక క్త్వార్థంబునందగు" (బాల.క్రియ - 56) అను సూత్రంచే వ్యతిరేకార్థక భూతకాలిక అసమాపక క్రియయందు కజీ వచ్చిన 'అను + క' అనివుండగా "జీత్తు పరంబగునపు డుత్వంబున కత్వంబగు" (బాల.క్రియ - 20) అనే సూత్రంతో 'అను' అనే ధాతువు చివరిలోవున్న ఉత్వానికి అత్వం వచ్చి 'అనక' అనే ధాతువు చివరలోవున్న ఉత్వానికి అత్వంవచ్చి 'అనక' అని అవుతుంది. 'కాదు + అనన్' ఉత్వసంధి 'కాదనక' అని అవుతుందని సూరి అభిప్రాయం.

ప్రౌఢ వ్యాకర్త వాటిని కజీ ప్రత్యయాంతావ్యయాలనక" అప్రత్యయాంతావ్యయంబు కళయ" (ప్రౌఢ-సంజ్ఞా -8) అనే సూత్రంతో 'అను+అక' అని వుంటే "అంద్వవగాగమంబులందప్ప నపదాది స్వరంబు పరంబగునపుడచ్చునకు సంధియగు' (బాల.సంధి -11) అను సూత్రం ప్రకారం సంధి జరిగి 'కాదనక' అను రూపం ఏర్పడిందంటాడు.

## 2. మొక్కేముసామి :

బాలవ్యాకర్త "లక్షణ విరుద్ధంబగు భాషగ్రామ్యంబు" (సంజ్ఞ - 22) అను సూత్రంవ్రాసి "ఈ భాష ప్రయోగంబున కనర్హంబు' అని వివరణం వ్రాశాడు. కాబట్టి సూరికి 'మొక్కేముసామి' మొదలైన ప్రయోగాలు సమ్మతం కావు.

ప్రౌఢ వ్యాకర్త "గ్రామ్యంబు తత్తజ్జాతి వర్ణనంబునం బ్రయోగార్హంబు (సంజ్ఞా - 14) అని సూత్రం వ్రాసి మహా కావ్యాలలో సయితం పామరులు మాట్లాడేభాష ప్రయోగించినప్పటికినీ పాత్రోచితమైన భాష కాబట్టి గ్రామ్యమైనా గ్రహింపవచ్చునన్నాడు.

## 3. అంటితి నమశ్శివాయ :

"నమశ్శివాయ" అనేది సంస్కృత వాక్యం. 'శివాయనమః = శివునకి నమస్కారం అని అర్థం. ఇట్టి వాక్యాల్ని తెలుగున ప్రయోగించేటప్పుడు "అను" ధాతు రూపంతో అంటే అనుకరణంతో ప్రయోగించాలని సూరి అభిప్రాయం.

ప్రౌఢ వ్యాకర్త "ఒకానొకచో ననుకరణ విరహితంబుగ సంస్కృత వాక్యంబు గానంబడియెడి" (సంజ్ఞా - 15) అని సూత్రంవ్రాసి 'నమశ్శివాయ' అని మాత్రమే వ్రాసి అనుకరణం లేకుండా "అంటితి నమశ్శివాయ" మున్నగు విధంగా ప్రయోగింపవచ్చునంటాడు. ఇది క్వాచిత్కము మాత్రమే. కాబట్టే "ఒకానొకచో" అని సూత్రంలో వ్రాశాడు.

## 4. జయదైత్యదమన :

"జయ" అనేది సంస్కృత పదం. దీనిని అనుకరణం లేకుండా తెలుగులో ప్రయోగించరాదు. కాని, "జయపదం బనుకరణ విరహితంబ తఱచుగనగు" (సంజ్ఞా - 16) అనే సూత్రం ప్రకారం ప్రౌఢ వ్యాకర్త జయశబ్దాన్ని అనుకరణం లేకుండా ప్రయోగింపవచ్చునన్నాడు.

## 5. రామయ్య :

'రామ + అయ్య' అనివుండగా, 'అయ్య' అనేది శ్రేష్ఠతా వాచకం. "శ్రేష్ఠతా వాచకంబులగు నార్యాంబాద్యర్థక శబ్దంబులు పరంబులగుచో నన్ని యచ్చులకును సంధి నిత్యము. (ప్రౌఢ సంధి - 1) అనే సూత్రం ప్రకారం సంధి జరిగి 'రామయ్య' అని అవుతుంది.

**6. చిట్టడవి :**

బాలవ్యాకర్త 'చిఱు + అడవి' అని పదవిభాగంచేసి "కుఱుచిఱుకడు నడునిడు శబ్దముల ఱుండలకచ్చు పరంబగునపుడు ద్విరుక్తటకారంబగు" (సంధి - 12) అని ద్విరుక్తటకారంతో చిట్టడవి అనుదాన్ని సాధించాడు.

ప్రౌఢ వ్యాకర్త "చిట్టడవిఁజిట్టి" (సంధి - 4) అని సూత్రం వ్రాసి 'చిట్టి + అడవి' అని పదవిభాగం చేసి "ఏమ్యాదులు యిత్తునకు సంధి వైకల్పకముగానగు (బాల.సంధి - 5) అను సూత్రంచే సంధి జరిగి చిట్టడవి అనే రూపాన్ని సాధించాడు. 'ఇవి' సంజ్ఞావాచకములు గాన "సంధినిత్యము" అనే వివరణతో ఇట్టిచోట్ల నిత్యసంధిచేయాలంటాడు.

**7. సర్వమున్నతని :**

'సర్వమున్ + అతని' అని వుండగా "సర్వమున్ అనునది ద్రుతప్రకతికము కాబట్టి "ఇఁకాదులకుదప్ప ద్రుతప్రకృతికములకు సంధి లేదు" (బాలసంధి - 9) అని సూరి సంధిని నిషేధించినాడు కాబట్టి 'సర్వమునతని' అని కావలెను.

ప్రౌఢ వ్యాకర్త "కొన్నియెడలఁబ్రామాణిక ప్రయోగంబులం ద్రుతంబున కచ్చుపరంబగుచో ద్విత్వంబుచూపట్టెడి" (సంధి - 3) అనే సూత్రం ప్రకారం ద్రుతద్విత్వము వచ్చి సర్వమున్నతని' అని అవుతుందనెను.

**8. అంద చందములు :**

'అందము + చందము' అనేది విగ్రహవాక్యము. ఇది ద్వంద్వసమాస సంబంధమైనది. "సమాస విభక్తికి లోపంబగు లట్టునకు గాదు" (బాల.సము - 25) అనే సూత్రం ప్రకారం విభక్తి లోపించి 'అంద + చంద' అనికాగా "ద్వంద్వంబునం బదంబుపయి పరుషములకు గసడదవలగు" (బాల.సంధి - 15) అనే సూత్రం ప్రకారం గసడదవాదేశం సూరి మతం ప్రకారం నిత్యంగా వచ్చి 'అందసందములు' అని కావాలి.

ప్రౌఢ వ్యాకర్త "కొన్ని యెడల ద్వంద్వంబునం బదంబుమీది చతపలకు సదవలు గానంబడవు" (సంధి - 6) అని చకారానికి సకారమురాదన్నాడు. 'అందచంద' అని వుండగా, 'లు వర్ణంబు బహువచనంబు' (బాల-తత్స-12) అని బహువచనంలో లు వర్ణము వచ్చి అందచంద + లు అనికాగా, "వానికి ముపర్ణకేతరంబయిన విభక్తి పరంబగునపుడు ముగాగమంబగు" (బాల - తత్సమ - 40) అనే సూత్రం ప్రకారం ముగాగమం వచ్చి 'అందచందములు' అని అవుతుంది.

**9. తామరపాకు :**

'తామర + ఆకు' అని వుండగా 'అత్తునకు సంధి బహుళంబుగానగు. (బాల.సంధి - 4) అనే సూత్రం ప్రకారం సంధి జరిగి 'తామరాకు' అనే రూపం ఏర్పడాలి.

ప్రౌఢ వ్యాకర్త 'తామరకాకు పరంబగునపుడు పుగాగమంబగు" (సంధి - 8) అని పుగాగమాన్ని విధించాడు కాబట్టి తామరపాకు అను రూపమేర్పడింది.

**10. పెన్నదరులు :**

"పెన్ + అదరులు" అని వుండగా ఇది కర్మధారయ సమాసంకాబట్టి "తఱచుగఁగర్మధారయ సమాసంబునం బెన్వాదుల కడ హల్లునకచ్చు పరంబగునపుడు ద్విత్వంబు గానంబడియెడి" (ప్రౌఢ సంధి - 9) అనే సూత్రం ప్రకారం 'అదరులు' అన్నప్పుడు అచ్చుపరంగా వుంది కాబట్టి చివరి హల్లునకు ద్విత్వంవచ్చి 'పెన్నదరులు' అని అవుతుంది.

## 11. శిరసు పూగగన గంగ :

"శిరసు పూవు గగన గంగ' అని వుండగా "పూపూవు" (ప్రౌఢ సంధి - 11) అనే సూత్రం ప్రకారం "అసమాసంబునం బూ శబ్దము పూవు శబ్దము యొక్క పర్యాయంబగ గానంబడియెడి" అనే వివరణం ప్రకారం వ్యస్తముగా వున్నప్పుడున్నూ 'పూవు' అనే దానికి బదులు 'పూ' అనేది వాడవచ్చు కాబట్టి పూ అనేది వుపయోగించిన 'శిరసు పూగగనగంగ' అని అవుతుంది.

## 12. గిరివ్రజమన్పురంబు :

"గిరివ్రజము + అను + పురంబు" అని వున్నప్పుడు "అనుకొను లోనగధాతుజ విశేషణముల యంత్యోకారమునకు హల్లు పరంబగునపుడు లోపంబు వైకల్పికంబు" (ప్రౌఢ సంధి - 13) అనే సూత్రం ప్రకారం 'అను' అనే ధాతువుకు 'పురము' అనే హల్లుపరంగా వుంది కాబట్టి "అను"లోని చివరి 'ఉకారం' లోపిస్తే 'గిరివ్రజము + అన్పురంబు' అనికాగా ఉత్వసంధిలో 'గిరివ్రజమన్పురంబు' అనే రూపమేర్పడుతుంది.

## 13. రెన్నాళ్ళు :

"రెండు + నాళ్ళు" అని వుండగా, "కొన్ని యెడల నవర్ణంబు పరంబగునపుడు పూర్వపదాంత్య డకాంబునకారంబగు" (ప్రౌఢ సంధి - 15) అనే సూత్రం ప్రకారం పూర్వపదం చివరిలో వున్న డ కారానికి నకారం వచ్చి 'రెం + న్నాళ్ళు' అని అవుతుంది. ఇది ఆచ్ఛికం. 'సంస్కృత సమేతరములైన తెలుగు శబ్దముల యందు ఁబరుషసరళములకు ముందే బిందువుకానంబడుచున్నది'. (బాల.సంజ్ఞా - 16) అనే సూత్రం ప్రకారం 'న్నాళ్ళు' అనే స్థిరానికి ముందు బిందువు వుండటానికి వీల్లేదు కాబట్టి లోపిస్తే 'రెన్నాళ్ళు' అను రూపం ఏర్పడుతుంది.

## 14. నీకే బ్రాతియే :

"నీకేమి + బ్రాతియే" అని వుండగా, "హలవసానంబులు పరంబులగునపుడేమి శబ్దము యొక్క మికారంబునకు లోపంబు వైకల్పికంబు" (ప్రౌఢ-సంధి - 16) అను సూత్రంచే ఏమి శబ్దంలోని మికారమునకు బ్రాతియే అన్నప్పుడు హల్లుపరంగా వుంది కాబట్టి లోపంవచ్చి 'నీకేబ్రాతియే' అని అవుతుంది. లోపం వికల్పం కాబట్టి లోపం రాకపోతే 'నీకేమి బ్రాతియే' అని కూడా వుంటుంది.

## 15. బింబముల్ రుచుల్ :

"బింబముల యొక్క రుచుల్" అని విగ్రహవాక్యం షష్ఠీసమాసం. "సమాస విభక్తికి లోపంబగు లట్టునకుఁగాదు" (బాల.సమా - 25) అను సూత్రం ప్రకారం విభక్తిలోపించి 'బింబముల + రుచుల్' అని వుండగా "షష్ఠీ సమాసమందలి నిలల మీది యచ్చులకు హల్లుపరంబగుచోఁగొన్ని యెడల లోపంబు గానంబడియెడి" (ప్రౌఢ సంధి - 17) అను సూత్రం ప్రకారం హల్లుపరంగా వుంది కాబట్టి 'ల' అనుదానిలో అచ్చైన అత్వము లోపించి 'బింబముల్ రుచుల్'అను రూపమేర్పడుతుంది.

## 16. కనకనమను :

'కన' అనునది ధ్వన్యనుకరణ శబ్దము. "ధ్వన్యనుకరణ శబ్దంబులు ద్విరుక్తంబులయగు" (ప్రౌఢ సంధి - 20) అను సూత్రం ప్రకారం ధ్వన్యనుకరణ శబ్దమైన 'కన' అనే దానికి ద్విరుక్తం వచ్చిన "కనకన" అని అవుతుంది. దీనికి 'అను' ధాతువుకు చెప్పిన 'కనకన + అను' అనికాగా "ధ్వన్యనుకరణ శబ్దముల కనుధాతువు పరంబగుచోఁగొనియెడల ముగాగమంబగు" (ప్రౌఢ సంధి - 19) అను సూత్రంచే ముగాగమం వచ్చి 'కనకనమను' అనే రూపం అవుతుంది.

**17. వడవడ జమదగ్ని సూతివడఁకెన్ :**

'వడ' అనునది ధ్వన్యనుకరణ శబ్దం. "ధన్యనుకరణ శబ్దంబులు ద్విరుక్తంబులయగు" ప్రౌఢ సంధి - 20) అను సూత్రంప్రకారం ద్విరుక్తం వచ్చి 'వడవడ' అని అవుతుంది. "వడకెన్" అని క్రియాపదమును వెంటనే ప్రయోగించవలెను. కాని "ఇయ్యవి క్రియావ్యవహితంబులు నగు" (ప్రౌఢ సంధి - 21) అను సూత్రం ప్రకారం క్రియతో వ్యవధానమును బొంది అనగా వడవడ అన్నతరువాత జమదగ్నిసుతి" అనిచేర్చి క్రియను తరువాత ప్రయోగించడం జరిగింది.

**18. వృష్టిఁజేసెమ్మహానది :**

"వృష్టిఁజేసెన్ + మహానది" అని వుండగా "ప్రాసంబున మకారంబు పరంబగుచో ద్రుతంబునకు మకారాదేశంబగు" (ప్రౌఢ సంధి - 22) అను సూత్రం ప్రకారం వృష్టిఁజేసెన్ అనేది ద్రుతాంతం. దానికి మకారంపరంగా ఉంది కాబట్టి ద్రుతానికి మకారం ఆదేశంగా వచ్చి "వృష్టిఁజేసెమ్మహానది" అని అవుతుంది.

**19. డెబ్బది యొక్క రథము :**

"డెబ్బది యొక్క రథము' అన్నప్పుడు 'డెబ్బది యొక్క' అనునది సంఖ్యావాచకమైన విశేషణము. 'ఒక్క' అనేది చివరలో వున్నది. 'రథము' విశేష్యము. అమహద్వాచకము. "విశేష్యంబునకుంబోలె విశేషణంబునకు లింగవిభక్తి వచనంబులగు" అను సూత్రం ప్రకారం డెబ్బది యొక్క రథములు" అని వుండవలెను. "సంఖ్యాప్రయుక్త విశేషణమేకాంతంబయి యమహద్విశేష్యకమయ్యు, తదంశాంతంబయి మహదమహద్విశేష్యకమయ్యూ, సమస్తంబు వ్యస్తంబునగుచో విశేష్యంబుక్రమంబుగ నుత్తరపదంబు నేకవచనాంతంబును, పూర్వపదంబు బహువచనాంతంబునగు" (ప్రౌఢ శబ్ద - 4) అను సూత్రం ప్రకారం విశేష్యం ఏకవచనంలో వుంటే 'డెబ్బదియొక్క రథము' అని అవుతుంది.

**20. దెప్పరములు పల్కఁగా :**

'దెప్పరములు' అనునది విశేషణము. విశేష్యము ప్రత్యేకముగా చెప్పబడలేదు. "విశేషణంబులు కొన్నియెడల విశేష్యలక్షణంబులగు" (ప్రౌఢ-శబ్ద-12) అను సూత్రంప్రకారం కొన్నిచోట్ల విశేషణములే లక్షణావృత్తి విశేష్యమునుగూడ భోదింపవచ్చు. 'దెప్పరములు' అనగా దెప్పరమైన మాటలు అని అర్థం గ్రహించాలి.

**21. ఓ వినువీధినున్న ఖచరోత్తములార :**

ఇచ్చట 'ఓ' అనునది సంబోధనలో వచ్చినది. "ఓ యామంత్రణంబునందగు" (బాల.తత్స - 14). 'ఇది సంబోద్యవాచకమునకు ముందే ప్రయోగింపబడును' అనియు సూరి వివరణ వ్రాశాడు. 'ఖచరోత్తములార' అనేది సంబోద్యవాచకము. 'ఓ' అనుదానికినీ, సంబోధ్యవాచకమైన 'ఖచరోత్తములార' అనుదానికినీ మధ్యలో ఇతర శబ్దములు ఉండరాదని సూరి అభిప్రాయం. "ఓ శబ్దంబొక్కచో సంబోధ్యవాచకంబునకు ముందితర శబ్ద వ్యవహితంబయి కానంబడియెడి (శబ్ద - 13) అనే ప్రౌఢవ్యాకరణ సూత్రం ప్రకారం 'వినువీధినున్న' అనే పదం మధ్యలో చేరి 'ఓ వినువీధినున్న ఖచరోత్తములార" అని ప్రయోగించడం జరిగింది.

**22. తల్లికాన :**

'తల్లి' అనునది స్త్రీవాచకము. దేశ్యపదము. 'ఓ శబ్దంబుతోఁగూడియు సంబోధ్యవాచకంబు ప్రయోగింపవచ్చును" (తత్సమ -14) అను సూరి వివరణం ప్రకారం ఓ శబ్దము లేకున్ననూ సంబోధ్యవాచకం ప్రయోగించవచ్చు కాబట్టి 'తల్లి'సంబోధ్యవాచకం. "దేశ్యంబులంగొన్నియెడల స్త్రీవాచక స్త్రీసమంబులగు సంబోధ్యవాచక శబ్దంబుల మీద నేకవచనంబునఁ గాన శబ్దంబొండును, అలయను నవ్యయంబొండును గానంబడియెడి. అల దీర్ఘాంతంబునగు" (ప్రౌఢ శబ్ద - 15) అను సూత్రం ప్రకారం ఏకవచనంలో 'కాన' వచ్చిన 'తల్లికాన' అనే రూపం వస్తుంది.

## 23. అర్థిమెయిన్ :

'అర్థితోడ' అనునది తృతీయాంతం. జడవాచకం. కాబట్టి "జడ పదంబు మీద తోడకుమెయి మైలు వికల్పింబుగనగు" (శబ్ద - 18) అను సూత్రం ప్రకారం 'తోడ' అనే దానికి 'మెయి' అనేది ఆదేశంగావచ్చి 'అర్థిమెయి' అనికాగా ద్రుతము చేరి అర్థిమెయిన్ అనురూపం అవుతుంది.

## 24. బచ్చుకున్ :

"బచ్చు" అను ప్రాతిపదికకు షష్ఠీ విభక్తిలో "కు" ప్రత్యయముచేరి "తృతీయాదులకు నుగాగమంబగు" (బాల.తత్సమ - 8) అనే సూత్రం ప్రకారం నుగాగమం చేసిన 'బచ్చు + కున్' అనికాగా, "కు వర్ణంబు పరంబగునపు డుకారబుకారంబులకు నగాగమంబగు" (తత్సమ - 28) అనే బాలవ్యాకరణం సూత్రం ప్రకారం నగాగమం వచ్చి 'బచ్చునకున్' అని కావాలి.

"కు వర్ణకంబు పరంబగునపుడు కవిత్రయంబువారి ప్రయోగంబు లందక్కఁదక్కిన మహాకవి ప్రయోగంబులందునుం గొన్ని యెడలనగాగమంబు చూపట్టదు". (శబ్ద - 19) అని ప్రౌఢ వ్యాకర్త నగాగమం లేదన్నాడు కాబట్టి నగాగమం రానిచో 'బచ్చుకున్' అని వుంటుంది.

## 25. తత్క్రతుశతంబున కంటె :

"తత్క్రతుశతంబు + కంటె' అని వున్నప్పుడు "కంటె వర్ణకంబు నిర్ధారణ పంచమికగు" (బాల-కార-13) అను సూత్రం ప్రకారం కంటె వచ్చింది. సూరి "కు వర్ణకంబు పరంబగునపు డుకారబుకారంబులకు నగాగమంబగు" అని కువర్ణకంపరంగా ఉంటే నగాగమం చెప్పడంవల్ల కంటెవర్ణకంపరంగా ఉన్నప్పుడు నగాగమం రాదు. "కంటె వర్ణకంబు పరంబగునపుడును గొన్నియెడల నగాగమంబు చూపట్టెడి" (శబ్ద - 20) అని ప్రౌఢ వ్యాకర్త కంటె వర్ణకంపరంగా వున్నప్పుడు నగాగమం చెప్పినందున 'తత్క్రతుశతంబున కంటె' అనే రూపం ఏర్పడింది.

## 26. నిండు జవ్వనంబున యందు :

"నిండుజవ్వనంబు + అందు" అని వుండగా "ఉదంతములగు నమహత్తులకందు వర్ణకము పరంబగునపుడును నగాగమంబు కొన్ని యెడల గానంబడియెడి" (శబ్ద - 21) అనే సూత్రం ప్రకారం ప్రౌఢ వ్యాకర్త 'అందు' అనే సప్తమీ విభక్తి ప్రత్యయంపరంగా వున్నప్పుడు నగాగమం విధించాడు కాబట్టి నగాగమం వచ్చిన నిండు జవ్వనంబున యందు అనే రూపం ఏర్పడుతుంది.

## 27. బాలిగాఁడు :

"బాల" అనునది తత్సమ ప్రాతిపదిక. "తెనుఁగునం గొన్ని తత్సమ దేశ్య శబ్దంబుల కంటెం బరంబుగ నేకవచనంబున నీచత్వద్యోతకంబయి యిగాయనున్నొక్కశబ్దంబును దానిపై డువర్ణకాదులునుం జూపట్టెడి, సంబోధనంబున డువర్ణకంబు జూపట్టదు". తుది దీర్ఘంబునకు హ్రస్వంబు వైకల్పికంబు' (శబ్ద - 22) అను సూత్రం ప్రకారం నీచత్వార్థములను వివక్షించేటప్పుడు 'ఇగా' శబ్దము వచ్చింది. బాల + ఇగా అనికాగా "అంద్వవగాగమంబులం దప్ప నపదాది స్వరంబు పరంబగునపు డచ్చునకు సంధియగు" (బాల - సంధి -11) అను సూత్రం ప్రకారం సంధి జరిగి 'బాలిగా' అనికాగా ప్రస్తుత సూత్రముచే 'డుజ్' కూడా వచ్చిన 'బాలిగాడు' "జీత్తు బిందు పూర్వంబగు" (బాల.తత్స - 19) అనే సూత్రంతో ఖండిబిందువు వచ్చిన 'బాలిగాఁడు' అనేరూపం అవుతుంది. "దీర్ఘము మీద సాధ్యపూర్ణములేదు" (బాల-సంజ్ఞ - 15) అను సూత్రాన్ని అనుసరించి పూర్ణబిందువు రాదు.

**28. ధర్మ్మవులు :**

'ధర్మ' అనునది ప్రాతిపదిక. ప్రథమా బహువచనంలో 'లువర్ణంబు బహువచనంబు' (బాల.తత్సమ - 12) అని లువర్ణము వచ్చి "ధర్మ + లు" అనికాగా "అర్థాదులకడయచ్చున కుత్వంబును, మీద వువర్ణకంబును వైకల్పికంబుగానగు" (శబ్ద - 25) అను సూత్రాన్ని అనుసరించి అర్థాదులలో ఉన్న ధర్మశబ్దానికి వుగాగమంబునూ అత్వానికుత్వమున్నూ రాగా 'ధర్మ్మవులు' అనే రూపం అవుతుంది. (సూత్రంలో వు వర్ణకంబు' అని వున్నది. వర్ణకం అంటే ప్రత్యయం. కాని ఇక్కడ వుగాగమంగా గ్రహించాలి.

**29. అయ్యగారు :**

'అయ్య' అనునది దేశ్యమైన స్త్రీసమ శబ్దం. దీనికి పూజ్యార్థాన్ని వివక్షించునపుడు" తఱచుగా స్త్రీ సమంబులగు దేశ్యశబ్దంబులకు, గడపలఁగొన్నింటికేకవచనంబునంబూజ్యత యందు గారుశబ్దంబగు" (శబ్ద - 39) అను సూత్రాన్ని అనుసరించి ఏకవచనంలో 'గారు' శబ్దం చేరగా 'అయ్యగారు' అనురూపం అవుతుంది.

**30. శ్రీరాములవారు :**

'శ్రీరామ' అనేది తత్సమ ప్రాతిపదిక. డుమంతం "పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబు తుదియత్వంబున కుత్వంబగు" (బాల. తత్సమ - 21) అను సూత్రముతో 'శ్రీరాము' అనికాగా "నువర్ణంబు ద్వితీయ" అని నువర్ణంచేయగా శ్రీరాము + ను అనికాగా "బహుత్వంబున ద్వితీయాది విభక్తులకు లడాగమంబగు" (తత్సమ - 31) అను సూత్రం ప్రకారం బహువచన వివక్షలో "తత్సమాదిశబ్దంబులకు గొన్నింటికి ద్వితీయాబహువచనం మీదఁబూజ్యతయందుగారునకు మాఱుగవారగు" (శబ్ద - 41) అను సూత్రంతో 'గారు' అనుదానికి బదులుగా 'వారు' అనునదిచేరి శ్రీరాములను + వారు అనికాగా "ద్రుతంబునకు సరళ స్థిరంబులు పరంబులగనపుడు లోపసంశ్లేషంబులు విభాషనగు" (బాల.సంధి - 18) అని ద్రుత లోపం జరిగి 'శ్రీరాములవారు' అను రూపమవుతుంది.

**31. చూచివత్తమమ్మసుదతులార :**

"సుదతులార" అనేది బహువచనాంతమైన సంబోధ్యవాచకం. 'చూచివత్తము' క్రియ. క్రియ తరువాత 'అమ్మ' అని వుంది. "అమ్మలార" అని బహువచనంలో వుండాలి. "సంబోధ్య వాచకంబు బహువచనాంతంబయ్యుఁగ్రియలమీది మమ్మాదు లేక వచనాంతంబుల యగు" (శబ్ద - 44) అనే ప్రౌఢ వ్యాకరణ సూత్రం ప్రకారం "చూచివత్తమమ్మ" అన్నప్పుడు అమ్మ ఏకవచనంలో వుంది.

**32. మాయిల్లు :**

'మా యొక్క ఇల్లు' అను విగ్రహ వాక్యంలో "సమాసవిభక్తికి లోపంబగు లట్టునకుగాదు" (బాల.సమాస - 25) అనే సూత్రాన్ని అనుసరించి 'యొక్క' విభక్తి లోపించి 'మా + ఇల్లు' అని వుండును. నా యొక్క ఇల్లు అనేది అర్థం. 'నా' అని ఏకవచనంలో వుండాలి కాని "సంబంధంబున యుష్మదస్మచ్ఛబ్దంబులకు గొన్నియెడల బహుత్వంబగు" (శబ్ద - 46) అను సూత్రంతో బహువచనంలో వుంటే, మా + ఇల్లు" అని అవుతుంది. "సంధిలేనిచోట సర్వంబుకంటె బరంబయిన స్వరంబునకు యడాగమంబగు" (సంధి - 3) అను సూత్రం ప్రకారం యడాగమం వచ్చి 'మా యిల్లు' అని అవుతుంది.

**33. కోడండ్రురు :**

'కోడలు' శబ్దము ఆల్వాదుల లోనిది. దానికి బహువచనంలో "లు" వర్ణంచేయగా 'కోడలు+లు' అని వుండగా "అల్వాదుల బహువచన లకారంబునకు రేఫంబును ముందటి లువర్ణంబునకు బిందు పూర్వక డకారంబునగు" (బాల.ఆచ్ఛిక - 11) అను

సూత్రాన్ని అనుసరించి బహువచన లకారానాకి రేఫమున్నూ, ముందున్న లువర్ణానికి బిందుపూర్వక డకారం వచ్చి 'కోడండ్రు' అని అవుతుంది. ఇది బహువచనరూపం. "కొన్నియెడల మహన్మహత్యర్థక బహువచనాంత నామంబులపై మరల బహువచన ప్రత్యయంబులు చూపట్టెడు, అచ్చోవారు వీరు మీరు శబ్దంబుల యంత్యోకారంబున కకారంబగు" (శబ్ద - 48) అను సూత్రాన్నిబట్టి మరల బహువచనప్రత్యయం చేరి కోడండ్రురు అని అగును.

## 34. వీడ్యము :

'వీడియ' అనునది ప్రాతిపదిక. ఇది అమహద్వాచకం. కాబట్టి "అమహన్నపుంసకముల కదంతంబులకు ముపర్ణకంబగు" (బాల.తత్సమ- 39) అను సూత్రంతో ము వర్ణకం వచ్చి 'వీడియ + ము' అని అవుతుంది. సూరి'ముత్తియ' శబ్దములో ఇత్వలోపం చెప్పాడు. "ముత్తియ శబ్దేతరంబులయందును దఱచగ నిత్వలోపంబు గానంబడియెడి" (శబ్ద - 49) అనే సూత్రాన్ని అనుసరించి 'ఇయ' లోని ఇత్వంలోపిస్తే 'వీడ్యము' అని అవుతుంది.

## 35. అన్ని :

"అంత" అని వుండగా ఇది అమహదర్థం. భిన్న వస్తు సముదాయం అర్థంగా నిర్ణయించేటప్పుడు ఏకవచన వివక్షలో 'అమహదర్థంబున భిన్న వస్తుసముదాయం బర్థమగుచో యేకవచనంబున నంతాదుల తకారంబునకు ద్విరుక్త నివర్ణంబగు" (శబ్ద- 52) అని సూత్రంచేత తకారానికి ద్విరుక్త 'ని' వర్ణం చేసిన యెడల 'అం + న్ని' అనికాగా 'సంస్కృత సమేతరములయిన తెలుగు శబ్దముల యందుఁ బరుష సరళములకు ముందే బిందువు కానంబడుచున్నది" (బాల.సంజ్ఞా - 16) అను సూత్రాన్ని బట్టి స్థిరానికి ముందు బిందువుండటానికి వీల్లేదు కాబట్టి లోపిస్తే "అన్ని" అని అవుతుంది.

## 36. అద్ది :

'ఆ' అనుత్రికముపై ప్రథమైక వచన వివక్షలో "త్రికంబున నమహదర్థంబునం బ్రథమైన వచన బహువచనంబులం గ్రమంబుగ ది, వి వర్ణకంబులగు" (శబ్ద - 58) అను సూత్రంతో దివర్ణకం చేయగా 'ఆ + ది' అనికాగా, అనికాగా "ద్విరుక్తంబగు హల్లుపరంబగునపుడా చ్చికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు" (బాల.సమాస - 13) అనుసూత్రం ప్రకారం హ్రస్వం వచ్చి 'అ+ది' అనికాగా హ్రస్వ వ్యస్త త్రికంబు మీది దివులకు ద్విత్వంబునగు" (శబ్ద - 59) అను సూత్రం ప్రకారం 'ది' అనుదానికి ద్విత్వంవచ్చి 'అద్ది' అని అవుతుంది.

## 37. సత్క్రతువది మేలు :

"సత్క్రతువు + అది మేలు" అని వున్నప్పుడు 'అది' అనేది అమహదర్థకం. 'సత్క్రతువు అనుదానికి 'అది' చివర చేరి "సత్క్రతువదిమేలు" అని అవుతుంది. ఇచ్చట సత్క్రతువు మేలు అన్నను సరిపోవును. 'అది' అనేదానికి విశేషార్థం లేదు. "పదాద్యంత గతంబా శబ్దంబమహదర్థకంబు సమస్తంబు వ్యస్తంబునయి కొన్నియెడల నర్థశూన్యంబగు" (శబ్ద - 63) అను సూత్రాన్ని అనుసరించి 'అది' అనేది అర్థశూన్యంగా అంతంలో చేరిందని తెలుస్తుంది.

## 38. తావచ్చె సుదర్శనాయుధుఁడు :

'సుదర్శనాయుధుడు" నామ పదము. దీనిని మరల చెప్పవలసివచ్చినపుడు "నామ తదేతద్వ్యక్తిమర్థంబులకుం బు నర్గ్రహణంబునఁబ్రథమాద్యంతమయి పూర్వపరంబుగ నాత్మార్థం బవిహితంబగు" (శబ్ద - 77) అను సూత్రాన్ని అనుసరించి ప్రథమాంతమైన 'తాను' అనునది ముందుగాచేరి "తావచ్చె సుదర్శనాయుధుఁడు" అనురూపం అవుతుంది. "తాను + వచ్చె" అని వుండగా "ద్రుతంబునకు సరళస్థిరంబులు పరంబులగునపుడు లోప సంశ్లేషంబులు విభాషనగు" (బాల.సంధి - 18) అను సూత్రంచేత ద్రుతానికి లోపంవచ్చి "తావచ్చె సుదర్శనాయుధుఁడు" అని అవుతుంది.

**39. అందఱు :**

'అంత' అనుదానికి తచ్ఛబ్దమైన 'వారు'చేరి "అంత + వారు" అనికాగా "అంతాదులకు వారుపరంబగుచో వాకులోపంబును రురలకు ఱుఱలా దేశంబునగు" (శబ్ద - 88) అను సూత్రాన్ని అనుసరించి 'వా'రులోని వా లోపించి రేఫకు శకటరేఫం (ఱ) వచ్చి 'అంత + ఱు' అనికాగా, 'వా లోపంబుతఱివాని తకారంబునకు దకారంబగు" అను సూత్రంతో తకారానికి దకారం వచ్చి 'అందఱు' అనురూపం ఏర్పడుతుంది.

**40. చెయ్యి :**

'చేయి' ఔపవిభక్తికం. "ఔపవిభక్తి కాంతంబులగు చేయినేయిలోనగుశబ్దంబుల యాద్యచ్చునకు హ్రస్వంబును, మీది హల్లునకు ద్విత్వంబును బ్రథమైక వచనంబునందు వైకల్పికంబుగ నగు" (శబ్ద - 105) అను సూత్రంతో 'చేయి'లోని ఆద్యచ్చునకు హ్రస్వమునకు, మీది హల్లునకు ద్విత్వమున్నూ వచ్చి చెయ్యి అని అవుతుంది.

**41. కృష్ణ కృష్ణ :**

"కృష్ణ" అనుపదానికి ఆదరార్థాన్ని వివక్షించునప్పుడు 'ఆదరార్థంబునంద్విరుక్తియగు" (శబ్ద - 111) అను సూత్రం ప్రకారం ద్విరుక్తి వచ్చి 'కృష్ణ కృష్ణ' అని అవుతుంది.

**42. ఏక విప్ర సంబోధనఁజేసి :**

"ఏకవిప్రసంబోధన చేత" అని వుండగా "జడంబు తృతీయా సప్తములకు ద్వితీయ బహుళంబుగానగు" (బాల-కార-22) అను సూత్రంతో తృతీయా విభక్తియైన 'చేత' అనుదానికి ద్వితీయవచ్చి "ఏకవిప్ర సంబోధనను" అనియగును. "కొన్నియెడలఁ జేత విభక్త్యర్థక వర్ణకంబులకును వలన వర్ణకంబునకును దఱుచుగఁ జేసి యనుప్రయుక్తంబగు" (ప్రౌఢ కారక - 4) అనుసూత్రాన్ని అనుసరించి 'చేసి' అనుప్రయుక్తమైన "ఏకవిప్రసంబోధనను + చేసి" అనికాగా ఏకవిప్ర సంబోధనను' అనేది ద్రుతప్రకృతికం. "ద్రుతప్రకృతము మీది పరుషములకు సరళములగు" (బాలసంధి - 46) అను సూత్రంతో పరుషానికి సరళం వచ్చి 'ఏకవిప్రసంబోధనను + జేసి' అనికాగా "ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందుసంశ్లేషంబులు విభాషనగు" (సంధి - 17) అను సూత్రప్రకారం ద్రుతానికి ఖండబిందువు వచ్చి 'ఏకవిప్ర సంబోధనఁజేసి' అని అవుతుంది.

**43. తోడ మాటాడకునికి :**

ఇచ్చట 'తోడ' అనునది తృతీయావిభక్తి ప్రత్యాయము. విభక్తి ప్రత్యయము శబ్దములకు ఆయా విభక్తులలో విధింపబడుతుంది. దీనికి ప్రత్యేక ప్రయోగముండదు. కాని "ఒకానొకచో దోడకుఁబ్రత్యేక ప్రయోగంబునుంజూపట్టెడి" (కారక - 6) అని ప్రౌఢ వ్యాకర్త తోడకు ప్రత్యేక ప్రయోగాన్ని అంగీకరించాడు. "తోడ" అనగా "తనతోడ" అని అర్థం చెప్పుకోవలసి వుంటుంది.

**44. అఖిలబాంధవులయుఁబ్రాహ్మణులయుఁదోడ :**

"అఖిల బాంధవులయుఁదోడ బ్రాహ్మణులయుదోడ" అని రెండు చోట్లను తోడ ప్రయోగింపవలెను. కాని "కొన్ని యెడల నుశబ్ద ప్రయోగంబునం దోడకులోపంబును వ్యవహితత్వంబును బహుత్వంబునంగానంబడియెడి" (కారక - 7) అను సూత్రం ప్రకారం 'అఖిల బాంధవులయుఁదోడ' అన్నప్పుడు 'అఖిలబాంధవుల యను+తోడ' అని సముచ్చయార్థక నువర్ణమును, బహుత్వంబును వున్నందున తోడకు లోపం చేయగా, "అఖిలబాంధవులయు బ్రాహ్మణులయుఁదోడ" అనే రూపం వచ్చింది.

## 45. ప్రాణము తోడుత :

"తోడ" అనేది తృతీయావిభక్తి ప్రత్యయముగా "చేతతోడతృతీయ" '(బాల.తత్సమ - 3) అని వివరింపబడింది. 'ప్రాణముతోడ' అని ప్రయోగింపవలెను. "ఒకానొకచోఁదోడకుఁ దోడుతనని రూపాంతరంబును గలదు. అయినను దానికివలె దీని కితరకార్యంబుగలుగదు" (ప్రౌఢ కారక - 8) అను సూత్రాన్ని అనుసరించి తోడ బదులు 'తోడుత' అని ప్రయోగింపవచ్చు. అప్పుడు ప్రాణము 'తోడుత' అని అవుతుంది. 'తోడ' అనుదానికి చెప్పినవిధంగా స్వతంత్ర ప్రయోగార్హత మాత్రముండదు.

## 46. కార్య సంప్రయోగము పొంటెన్ :

కార్యసంప్రయోగము కొఱకున్ అను చతుర్థీవిభక్తి ప్రయోగింపవలసినచోట "చతుర్థికింబొంటె వర్ణకంబునగు" (కారక - 9) అనే సూత్రం ప్రకారం 'కొఱకున్' అనుదానికి 'పొంటెన్' అనేది ఆదేశంగా వచ్చి కార్యసంప్రయోగము పొంటెన్' అని అవుతుంది.

## 47. నీకనురక్త :

"నీయందనురక్త" అనేది అధికరణమున వచ్చిన సప్తమీ విభక్తి. (విషయసంబంధమైనది' "నీయందున్ + అనురక్త అని వున్నప్పుడు "షష్ఠీ స్థానికంబగు కువర్ణకంబొక్కొక్కచో ద్వితీయాది విభక్తులకు మాఱుగాఁదత్తదర్థంబులంజూపట్టెడి" (కారక - 13) అని ప్రౌఢ వ్యాకర్త సప్తమీ విభక్తి యొక్క అర్థములో షష్ఠీవిభక్తికమైన కువర్ణకాన్ని విధించాడు. కాబట్టి నీకున్ + అనురక్త" అని కాగా "ప్రథమేతర విభక్తి శత్రర్థక చువర్ణంబులందున్న యుకారంబునకు సంధివైకల్పికంబుగానగు" (బాల.సంధి - 2) అను సూత్రం ప్రకారము సంధి జరిగి "నీ కనురక్త" అని అవుతుంది.

## 48. ఏనుగున నేనుఁగు వైచుచు :

"ఏనుఁగుచే నేనుగు వైచుచు అని తృతీయా విభక్తిలోనున్నప్పుడు 'ఏనుగు' అనునది, అజడము ఉదంతము. "ఒక్కొచో నుదంతంబగు నజడంబు తృతీయకును నవర్ణకంబు గానంబడియెడి" (కారక - 17) అను సూత్రంచేత తృతీయకు నవర్ణకము వచ్చిన ద్రుతముతో (ఏనుగునన్ + ఏనుగు వైచుచు)' 'ఏనుగున నేనుగు వైచుచు' అని అవుతుంది. సూరి "ఉదంతజడంబు తృతీయకు నవర్ణకంబగు" (కారక - 23) అని ఉదంత జడాలకే న వర్ణకం చెప్పియున్నాడు. ప్రౌఢ వ్యాకర్త ఉదంత అజడాదులకు కూడ నవర్ణకం విధించాడు.

## 49. అమ్మదనాగ మెదిర్చి :

"అమ్మదనాగమును ఎదిర్చి" అని వుండగా "కొన్నియెడల నజడంబు ద్వితీయకును ప్రథమకానంబడియెడి" (కారక - 19) అను సూత్రమును బట్టి "అమ్మదనాగమును" అన్నప్పటి ద్వితీయావిభక్తికి ప్రథమావిభక్తి వచ్చిన "అమ్మదనాగము + ఎదిర్చి" అనికాగా ఉత్వసంధితో 'అమ్మదనాగమెదిర్చి' అని అవుతుంది. సూరి "జడంబు ద్వితీయకుం బ్రథమ బహుళంబుగానగు" అని జడవాచకముల ద్వితీయకు ప్రథమ విధించగా ప్రౌఢ వ్యాకర్త అజడవాచకముల ద్వితీయకున్నూ ప్రథమవిభక్తిని విధిస్తున్నాడు.

## 50. తీర్థమాడి :

"తీర్థమందున్ + ఆడి" అనివుండగా 'ఒక్కొక్కచో జడంబు సప్తమికింబ్రథమయునగు" (కారక - 20) అను సూత్రాన్ని అనుసరించి సప్తమీ విభక్తికి ప్రథమావిభక్తి ఆదేశముగా వచ్చిన 'తీర్థమాడి' అనురూపం అవుతుంది.

పాఠం - 5

# రూప మరియు పారిభాషిక పదవివరణం

## 1. అరదంబున యురవడికిన్ :

అరదంబు యొక్క యురవడికిన్ అని వుండగా "సమాస విభక్తికిలోపంబగు లట్టునకుగాదు" (సమాస - 25) అనే సూత్రాన్ని అనుసరించి విభక్తిలోపించి "అరదంబు + ఉరవడికిన్" అనికాగా "షష్ఠీ తత్పురుషంబులందునగాగమంబు విభాషనగు' (సమాస - 25) అనే సూత్రం ప్రకారం నగాగమము వచ్చి "అరదంబున + ఉరవడికిన్" అనికాగా - "సంధి లేనిచోట స్వరంబు కంటెంబరంబయిన స్వరంబునకు యడాగమంబగు" (సంధి - 3) అనే సూరి సూత్రం ప్రకారం యడాగమం వచ్చి 'అదరంబునయురవడికిన్' అనే రూపం అవుతుంది.

## 2. రామాశాస్త్రి :

'రామ' అనేది రెండక్షరాలు గల పురుషవాచక శబ్దము. దానికి 'శాస్త్రి' అనే ఉత్తరపదం పరంగా వుంది కాబట్టి "కర్మధారయంబు బిరుదాద్యుత్తర పదంబయ్యేనేని ద్వక్షరాజంత స్త్రీపుం సంజ్ఞావాచకంబగు పూర్వపదంబగు నంత్యాక్షరంబున కంతట దీర్ఘంబు బహుళంబుగానగు" (సమాస - 2) అను ప్రౌఢ వ్యాకరణ సూత్రాన్ని అనుసరించి పూర్వపదము యొక్క అంత్యాక్షరానికి దీర్ఘం వచ్చి 'రామశాస్త్రి' అని అవుతుంది.

## 3. సుబ్బినాయఁడు :

'సుబ్బ' అనునది రెండక్షరాలు గల పురుషవాచక శబ్దము. "నాయఁడు" అనేది ఉత్తరపదము. అనగా ఇవి సమాసాలని అర్థం. "ఇటఁబూర్వపదంబు నత్వంబునకిత్వంబు బహుళంబుగానగు" (సమాస - 3) అను సూత్రాన్ని అనుసరించి 'సుబ్బ + నాయఁడు' అన్నపుడు పూర్వపదము చివరనున్న అత్వాని కిత్వమువచ్చి "సుబ్బినాయఁడు" అనే రూపం వస్తుంది.

## 4. తిక్కన సోమయాజి :

'తిక్కన సోమయాజి' అనునది కర్మధారయసమాసము. 'సోమయాజి' అను ఉత్తరపదము బిరుద వాచకము. "తిక్క + సోమయాజి" అని వున్నప్పుడు "కొన్నియెడలనిచ్చోననాపామాఁయాగమంబులగు" (సమాస - 4) అను సూత్రముచేత 'అన' అనునది ఆగమంగా చేరితే 'తిక్క + అన + సోమయాజి' అని అవుతుంది. "అంద్వవగాగమంబులం దప్ప నపదాది స్వరంబు పరంబగునపు డచ్చునకు సంధియగు" (బాలసంధి - 11) అను సూత్రాన్ననుసరించి సంధి జరిగి "తిక్కన సోమయాజి" అనేరూపం అవుతుంది.

## 5. తిమ్మప్పనాయఁడు :

కర్మధారసమాసము. 'నాయఁడు' అనేది బిరుదాది పదము. 'తిమ్మ + నాయఁడు' అనివుండగా, "కొన్ని యెడలనిచ్చో ననాపామాయాగమంబులగు" (సమాస - 4) అనే సూత్రాన్ని అనుసరించి 'అప' అను ఆగమంచేరి 'అపదాది' స్వరసంధి జరిగి 'తిమ్మపనాయఁడు' అనికాగా "పై యాగమంబులు కొన్ని యెడల ద్విత్వయుక్తంబులగు" (సమాస - 5) అని ద్విత్వయుక్తంగా పై ఆగమాలు వచ్చిన 'తిమ్మప్పనాయఁడు అని రూపం అవుతుంది.

### 6. ముంగోపము :

"ముందు + కోపము" అని వుండగా "సమాసంబునం బ్రాతాదులతొలియచ్చుమీది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగానగు" (బాలసంధి - 36) అనే సూత్రం ప్రకారం 'ముందు' అనేది ప్రాతాదులలోది కాబట్టి తొలియచ్చు మీది వర్ణములు లోపించి "ము + కోపము" అని అగును. "క్రొత్త శబ్దమునకాద్యక్షరశేషంబునకుంగొన్ని యెడల నుగాగమంబునుంగొన్ని యెడల మీది హల్లునకు ద్విత్వంబగు" (బాల. సంధి - 38) అనే సూత్ర ప్రకారం నుగాగమం వచ్చి 'మును + కోపము' అని అగును. 'కోపము' తత్సమం సూరి ఆచ్చికాలే ఉదాహరణగా యిచ్చాడు. "క్రొత్తాదులు లుప్త శేషంబులు దేశ్యంబులతోడంబలెఁ దత్సమంబులతోడంగొన్ని యెడలఁగర్మధారయంబగు (ప్రౌఢ సమాస - 7) అని కర్మధారయములకు కూడా ఈ సూత్రాలు వర్తిస్తాయి. "మును + కోపము" అని వుండగా "ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు" (బాలసంధి - 16) అని సరళంకాగా 'మును + గోపము' అని వుంది. "ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషంబులు, విభాషనగు" (సంధి - 17) అని ద్రుతానికి పూర్ణబిందువు వచ్చి 'ముంగోపము' అని అవుతుంది.

### 7. వేదముల్ సదువునట్లు :

'చదువు' అనునది ధాతుజ విశేషణము. సూరి "తృ వర్ణకార్థంబునం దెడియెడు వన్నియలగు. వానికి లోపంబు బహుళంబుగానగు" (క్రియ 44, 45) అనే సూత్రాలలో కర్త్రర్థములో ఎడు, ఎడి విధించి లోపం చెప్పినాడు. 'చదువు' అనునది 'ఎడు' లోపించిన ధాతుజ విశేషణము. "ధాతుజ విశేషణంబులు తథార్థకావ్యయంబు తోడం గర్మధారయంబగు" (సమాస - 8) అనుటచేతనథార్థకావ్యయం అంటే అట్లు అనే దానితో సమసించి కర్మధారయ సమాసమవుతుంది. 'చదువు + అట్లు' అనికాగా "ఉదంతమగు తద్ధర్మర్థ విశేషణమునకచ్చు పరమగునపుడు నుగాగమంబగు' (బాల.సంధి - 33) అనే సూత్రం ప్రకారం నుగాగమం వచ్చిన 'చదువునట్లు' అని అవుతుంది. 'వేదముల్+ చదువునట్లు' అన్నపుడు గసడవాదేశము వచ్చి వేదముల్ సదువునట్లు అని అగును. (గసడవాదేశము బాల.సంధి - 13)

### 3. అట్టిండు :

'అట్టి + వాఁడు' అని వున్నప్పుడు "అట్టియిట్టి యెట్టి యను విశేషణంబులమీదితచ్ఛబ్దవకారంబునకు లోపంబు విభాషనగు" (సమాస - 9) అనే సూత్ర ప్రకారం వకారంలోపించి 'అట్టిఁడు' అనికాగా "హ్రస్వము మీఁది ఖండ బిందువునకుఁబూర్ణబిందువు వైకల్పికముగనగును" (బాల-సంజ్ఞ - 14) అనే సూత్రాన్ని అనుసరించి ఖండ బిందువుకు పూర్ణబిందువురాగా 'అట్టిండు' అనే రూపం అవుతుంది.

### 9. తళతళని తరణి :

'తళ' అనునది ధ్వన్యనుకరణ శబ్దము. "ధ్వన్యనుకరణ శబ్దంబులు ద్విరుక్తంబులయగు" (ప్రౌఢ సంధి - 20) అనే సూత్రాన్ని అనుసరించి 'తరణి' అనే దానికి విశేషణంగా 'తళ తళ' ప్రయోగించినపుడు నిగాగమాన్ని పొంది "తళతళని తరణి" అని అవుతుంది.

### 10. కమ్మందేనె :

"కమ్మనైనతేనె" అను కర్మధారయ సమాసంలో "కమ్మ + తేనె" అనివుండగా "గుణవచనంబులగు నల్లాదులకుం గర్మధారయంబు నందు నిగాగమంబు బహుళంబుగానగు" (బాల - సమాస - 12) అనే సూత్రాన్ని అనుసరించి నిగాగమము వచ్చి 'కమ్మని + తేనె" అని అవుతుంది. 'కమ్మని' గుణవాచకము. 'తేనె' అన్నప్పుడు పరుషంపరంగా వుంది. కాబట్టి

"గుణవాచకంబులు కొన్నింటి నిగాగమంబునకుఁబరుషంబులు పరంబులగునపుడు బిందువగు" (ప్రౌఢ సమాస - 12) అనే సూత్రాన్ని 'ని' అనుదానికి ఖండబిందువు వచ్చిన "కమ్మఁ + తేనె" అని అగును. పూర్ణబిందువు వచ్చిన కమ్మం + తేనె" అని అగును. "ఆచ్ఛిక సమాసంబులంతటఁచుగ వర్ణలోపాగమాదేశవికారంబులు నిత్యవైకల్పికముగాఁబెక్కులు గానంబడియెడి" (సమాస - 36) అనే సూత్రాన్ని అనుసరించి తకారానికి దకారము వచ్చి "కమ్మఁదెనె, కమ్మందెనె" అను రూపాలగును.

## 11. చక్కఁగన్ :

'చక్క' అనునది గుణవాచకము నల్లాదులలోనిది. "నవర్ణకంబు గుణవచనంబులగు నల్లాదులకగు" (బాల.తద్ధిత - 6) అను సూత్రముచేత నవర్ణకం వచ్చి చక్కన అని అవుతుంది. దీన్ని క్రియావిశేషణముగా చేయునప్పుడు "నుజ్యంతంబగు నగుధాతువు క్రియావిశేషణంబుల కను ప్రయుక్తంబగు. నుజికి విభాషనగు, దానికి హ్రస్వంబు విభాషనగు. (బాల క్రియ - 115, 116) అను సూత్రంచే 'కను' అనునదిచేరి చక్కన + కను అనికాగా "గుణవాచకంబు క్రియావిశేషణంబగుచో నక్కడ నవర్ణకంబునకు బిందువు గానంబడియెడి' (ప్రౌఢ సమాస - 14) అనే సూత్రం ప్రకారం పూర్ణబిందువు వచ్చి 'చక్కం + కను' ఇట సరళంబు నిత్యంబు" అను సూరి వివరణననుసరించి సరళాదేశం నిత్యంగావచ్చి 'చక్కఁగను' అనికాగా ద్రుత స్వరలోపముతో 'చక్కఁగన్' అని అవుతుంది.

## 12. ముల్లోకము :

'మూడైన లోకములు' అను విగ్రహ వాక్యంలో 'మూడు' ఆచ్ఛికము. 'లోకము' తత్సమము. మిశ్రద్విగువు. 'మూడు + లోక' అనివుండగా "సమనాధికరణంబగు నుత్తరపదంబు పరంబగునపుడు మూడు శబ్దము డు ఙ్వర్ణకంబునకు లోపంబును, మీది హల్లునకు ద్విత్వంబగు" (బాల.సమాస - 17) అను సూత్రాన్ననుసరించి డు లోపమున్ను, మీది హల్లునకు ద్విత్వమున్ను) వచ్చి 'ముల్లోక' అని అవుతుంది. "ద్విగువున కేకవచనంబుప్రాయికంబుగనగు మిశ్రంబునకుగాదు" (బాల.సమాస - 18) అనే సూత్రాన్ననుసరించి ముల్లోకములు అని కావలెను. కాని ప్రౌఢ వ్యాకర్త "ఒక్కచో ద్విగువు మిశ్రం బేకవచనాంతంబునగు" (సమాస - 20) అనుసూత్రముచే ఏకవచనంలో ఉంటుంది కాబట్టి 'ముల్లోక' అనుదానికి "అమహన్నపుంసకముల కదంతంబులకు మువర్ణకంబగు" అను సూత్రాన్ననుసరించి 'ము' వర్ణకం వచ్చి 'ముల్లోకము' అనిరూపం ఏర్పడుతుంది.

## 13. పదునొకండు :

'పది' అనుదానికి 'ఒకండు' అనునది పరముగా ఉన్నప్పుడు "ఒకండ్వాదులు పరంబగులగుచోఁదఁఉచుగ నున్‌పదికగు" (సమాస - 22) అను సూత్రం ప్రకారం 'పది' అనుదానికి 'ఉన్' చేరి పది + ఉన్ + ఒకండు" అని వుండగా "అంద్వవగాగమంబులందప్ప నపదాది స్వరంబుపరంబగునపు డచ్చునకు సంధియగు" (బాల.సంధి - 11) అనే సూత్రంతో సంధి జరిగి 'పదునొకండు' అనియగును.

## 14. ఏఁబది :

"ఏను + పది" అని వుండగా "పది యుత్తరపదంబగుచో నేను దొమ్మలనమ్మలకు బిందువును, ఎనికెనును, ఏడునకు వర్ణ వ్యత్యాయంబును, ఆ పరుషంబునకు సరళంబును గ్రమంబుగనగు" (సమాస - 29) అను సూత్రాన్ని అనుసరించి 'ను' అనుదానికి ఖండబిందువును, పరుషమైన 'ప' అనుదానికి సరళమైన 'బ' వచ్చి 'ఏఁబది' అని అగును. "దీర్ఘము మీద సాధ్యపూర్ణములేదు" (సంజ్ఞా -15) అను సూరి సూత్రాన్నిబట్టి పూర్ణబిందువుతో నున్న రూపం వుండదు.

**15. అఱువది :**

"అఱు + పది" అనివుండగా "పదియుత్తరపదంబగుచోఁబూర్వపదంబు దీర్ఘంబునకు హ్రస్వంబగు. ఏనునేకురాదు "సమాస - 25) అను సూత్రముతో పదిపరముగా వుంది కావున పూర్వపదములో నున్న దీర్ఘానికి హ్రస్వంవచ్చి "అఱు + పది" అనికాగా "ప్రథమ మీది పరుషములకు గసడదవలు బహుళంబుగానగు" (బాల.సంధి - 13) అనుసూత్రంతో గసడదవాదేశము వచ్చి అంటే 'పది'లోని పకారానికి వకారమువచ్చి 'అఱువది' అని అవుతుంది.

**16. అన్నదమ్ములు :**

"అన్నయును దమ్ముడును" అనే విగ్రహవాక్యములో 'అన్న + తమ్మ' అని వుండగా ఇది మహద్ద్వంద్వసమాసము కావున "కొన్నియెడల మహద్ద్వంబునం బూర్వపదాంత్యస్వరంబునకు దీర్ఘంబునుంజూపట్టెడి" (సమాస - 28) అను సూత్రంతో పూర్వపదంలోని అచ్చునకు దీర్ఘమువచ్చి 'అన్నా + తమ్మ' అనికాగా "బల్లిదాదులు సంస్కృత తుల్యంబులు' (బాల.సమాస - 3) అనుటచే సంస్కృత తుల్యములగును. "పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబుతుదియత్వంబున కుత్వంబగు" (బాల.తత్సమ - 25) అని అత్వానికుత్వంవచ్చి అన్నా + తమ్ము అని బహువచన 'లు' వర్ణముచేరి అన్నా + తమ్ములు అనికాగా "ద్వంద్వంబునం బదంబుపయి పరుషములకు గసడవదలగు" (బాల.సంధి - 15) అను సూత్రముచే తకారానికి దకారము వచ్చి 'అన్నదమ్ములు' అను రూపం ఏర్పడుతుంది.

**17. పుట్టుగ్రుంకుగట్లు :**

"పుట్టు గట్టునుక్రుంకు గట్టును" అనే ద్వంద్వ సమాస విగ్రహవాక్యంలో 'పుట్టుగట్టు + క్రుంకుగట్టు' అని వుండగా "ద్వంద్వంబునం బూర్వపదాంత్యావయవంబునకు లోపంబొండెనగు" (సమాస - 32) అను సూత్రాన్ని అనుసరించి పూర్వపదములోని అంత్యావయవమైన 'గట్టు'లోపించి "పుట్టు + కుంకుగట్టు' అనికాగా "ద్వంద్వబునంబదంబుపయి పరుషములకు గసడదవలగు" అనే సూత్రంతో కకారానికి గకారము వచ్చి "పుట్టుగ్రుంకుగట్టు' అనికాగా బహువచన 'లు' వర్ణముచేరి 'పుట్టుగ్రుంకు గట్టు + లు' అని అగును. "బహువచనంబుపరంబగుపుడు డలట రలయుత్వంబునకు లోపంబు బహుళంగానగు" (బాల-ఆచ్ఛిక - 12) అని టకారంలోని ఉత్వం లోపించి "పుట్టుగ్రుంకుగట్లు" అని అగును, (హలంతర సంయోగంబునందు సజాతీయంబుల సహల్లులలో నొక్కటిశేషించు" అనే నియమము).

**18. అవసరమక్కరలు :**

"అవసరమును అక్కరయును" అనే విగ్రహవాక్యంలో "అవసరము + అక్కర" వుండగా "సమాసవిభక్తికి లోపంబగు లట్టునకుఁగాదు" (బాల.సమాస - 25) అని 'ము' విభక్తి లోపించవలసియుండగా ప్రయోగాన్నిబట్టి లోపము చేయరాదు. "ఆచ్ఛికశబ్దంబుతోడ స్త్రీసమంబు ప్రాయికంబుగా ద్వంద్వంబగు" (సమాస - 7) అని సూరి పూర్వపదం స్త్రీ సమము అన్నందున దాన్ని సవరించును. ప్రౌఢ వ్యాకర్త 'ఒకానొకచో ద్వంద్వంబు మిశ్రంబుగను, అందలి పూర్వపదంబు క్లీబసమంబు గనుగానంబడియెడి' (సమాస - 37) అని తెల్పుటచే "అవసరము" అను క్లీబసమము పూర్వపదంగా వున్నది. ఉత్వసంధి జరిగి, లుప్రత్యయముచేరి "అవసరమక్కరలు" అను రూపమేర్పడును.

**19. అందచందములు :**

'అందమును చందమును' అనునది ద్వంద్వ సమాసము. 'అందము + చందము' అని వుండగా "ఆచ్ఛికశబ్దంబుతోడఁ

స్త్రీసమంబు ప్రాయికంబుగ ద్వంద్వంబగు" (సమాస - 7) అని సూరి మతంలో పూర్వపదం స్త్రీసమం కావాలి. "ఒకానొకచో ద్వంద్వంబునంబూర్వపదంబు క్లీబసమంబగు అగుచో నాముపర్ణకంబునకు లోపంబగు" (సమాస - 29) అని పూర్వపదం క్లీబసమంగా వుండవచ్చునన్నాడు. పూర్వపదములోని 'ము' లోపించి 'అంద + చంద' అనికాగా (చందములోని 'ము' సమాసములో విభక్తి లోపాన్ని పొందింది' 'ద్వంద్వంబునంబదంబుపయి పరుషములకు గసడదవలగు" (బాల.సంధి - 15) అని సూరి మతమున గసడదవాదేశము రావలసియుండగా "కొన్నియెడల ద్వంద్వంబునంబదంబు మీది చతపలకు సదవలు గానంబడవు" (సంధి - 6) అని ప్రౌఢ వ్యాకర్త నిషేధించుటచే గసడదవాదేశమురాక బహువచన ముగాగమములతో అందచందములు అనురూపమేర్పడును.

## 20. కూరగాయ :

"కూరయును కాయయును" అను విగ్రహవాక్యములో కూర + కాయ అనునది ద్వంద్వ సమాసము. "ద్వంద్వంబునంబదంబు పయి పరుషములకు గసడదవలగు" (బాల.సంధి - 15) అని గసడదవాదేశము రాగా కూరగాయ అనికాగా బహువచన 'లు' వర్ణము రావలసియున్నది. అప్పుడు 'కూరగాయలు' అని కావాలి. కాని ఇది అప్రాణివాచక ద్వంద్వసమాసము కాబట్టి, "ద్వంద్వం బప్రాణివాచక కృదంత శబ్ద ఘటితంబేక వచనాంతంబునగు" (సమాస - 30) అని ప్రౌఢ వ్యాకర్త ఏకవచనాంతంగా నిర్దేశించడంచేత కూరగాయ' అని ఏకవచనంలో వుంటుంది.

## 21. ఔగాములు :

"అవుట + కామి" అనునది భావద్వంద్వసమాసము. "ఆచ్ఛికంబులందయియవులకు వక్రతమంబులు బహుళంబుగానగు" (బాల. క్రియ - 103) అనుటచే 'అవు'కి వక్రతమము ఔరాగా 'ఔట + కామి' అనికాగా "భావద్వంద్వంబునందొలిపదంబు టవర్ణకంబునకు లోపంబగు" (సమాస - 31) అను ప్రౌఢ వ్యాకరణ సూత్రాన్ని అనుసరించి పూర్వపదములోని టవర్ణకము లోపించి 'ఔ + కామి' అనికాగా "ద్వంద్వబునంబదంబు పై పరుషములకు గసడదవలగు" (బాల.సంధి - 15) అని గసడదవాదేశము వచ్చి 'ఔగామి' అనికాగా బహువచన 'లు' వర్ణకముచేయగా "ఇత్తునకు బహువచనంబుపరంబగుపు డుత్వంబగు" (బాల.తత్సమ - 45) అను సూత్రముచే ఇత్వానికుత్వం వచ్చి "ఔగాములు" అను రూపం ఏర్పడుతుంది.

## 22. అందాఁక :

"అంత + దాక" అనివుండగా "ఆచ్ఛిక సమాసములందఱచుగ వర్ణలోపాగమాదేశ వికారంబులు నిత్యవైకల్పికములుగా బెక్కులుగానంబడియెడి" (సమాస - 36) అనే సూత్రము ప్రకారం తకారములోపించి, క కారానికి ముందు ఖండ బిందువువచ్చి 'అందాఁక' అనురూపమేర్పడుతుంది.

## 23. వారణావతమునవారు :

"వారణావతమునన్ వారు" అను విగ్రహవాక్యములో "సమాసవిభక్తికి లోపంబగు లట్టునకుగాదు" (బాల.సమాస - 25) అని సప్తమీ విభక్తి లోపించవలసి వున్నది. "కొన్నియెడల సప్తమీ తత్పురుషమునందు నవర్ణకంబునగు" (సమాస - 37) అనే సూత్రం అనుసరించి న వర్ణకము లోపించకుండా ఉంటుంది. అప్పుడు 'వారణావతమునన్ + వారు" అనియుండగా "ద్రుతంబునకు సరళస్థిరంబులు పరంబులగునపుడు లోపసంశ్లేషములు విభాషనగు" (బాల.సంధి - 17) అను సూత్రం ప్రకారం ద్రుతములోపించి వారణావతమునవారు అని అవుతుంది.

## 24. హవ్యవహుఁడుంబోలెన్ :

'హవ్యవహుఁడు' అనుదానికి ఇవార్థకమైన 'పోలెన్' పరంబగునపుడు 'హవ్యవహుడు + పోలెన్'అని వుండగా "ప్రథమాంతముల మీది పోలె బలె పోని శబ్దంబులు ద్రుతపూర్వకంబులు విభాషనగు" (సమాస - 39) అను సూత్రం ప్రకారం ద్రుతము చేరి

'హవ్యవహుడు + ను + పోలెన్' అనికాగా "ద్రుత ప్రకృతికము మీది పరుషములకు సరళములగు" (బాల.సంధి - 16) అని పరుషానికి సరళమురాగా "హవ్యవహుడును + బోలెన్" అనికాగా "ఆదేశసరళములకు ముందున్న ద్రుతమునకు బిందుసంశ్లేషంబులు విభాషనగు" (బాల.సంధి -17) అను సూత్రం ప్రకారం ద్రుతానికి పూర్ణబిందువు వచ్చి "హవ్యవహుడుంబోలెన్" అను రూపమేర్పడుతుంది.

## 25. అలరుఁబోడి :

'పువ్వువలె మనోజ్ఞురాలైనది' అనే అర్థంలో 'అలరు + పోడి" అనియుండగా "అలరుఁబోడీత్యాదులుపమాన పూర్వపద కర్మధారయంబులు" (సమాస - 19) అను సూత్రముచే ఇట్టివి ఉపమాన పూర్వపదకర్మధారయములగునని ప్రౌఢవ్యాకర్త అభిప్రాయం. సూరి బహువ్రీహి సమాసాలన్నాడు. "ఇటుఁబోఁడి పరంబగుచో నెల్లెడలనుమ్మగు" అను వివరణ ప్రౌఢ వ్యాకర్త వ్రాసినాడు. కావున నుగాగమమై అలరు + ను + పొడి అనికాగా, "ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు" (బాల.సంధి - 16) అని పరుషానికి సరళమై 'అలరుఁను + బోఁడి' అని కాగా, "ఆదేశసరళములకు ముందున్న ద్రుతంబునకు బిందుసంశ్లేషంబులు విభాషనగు" (సంధి - 17) అను సూత్రం ప్రకారం ద్రుతానికి ఖండబిందువచ్చి 'అలరుఁబోడి' అని అవుతుంది.

## పారిభాషిక పదవివరణం

### 1. నిర్దేశము :

వ్యాకరణకార్యము దేనికి విధింపబడుతుందో దానికి 'నిర్దేశమని' పేరు.

'నిర్దేశ విధానోచ్చారణంబులందఅుచుగ' అవర్ణాదులుకారప్రత్యయాంతములును, ర వర్ణమిఫప్రత్యయాంతమునగు" (సంజ్ఞా - 2)

**ఉదా :** అకారమునకు ఉకారము వచ్చును.

ఇక్కడ అకారానికి విధింపబడుతుంది. ఇచ్చట 'అ' నిర్దేశము.

### 2. విధానము :

ఏది విధింపబడుతుందో దానికి 'విధానమని' పేరు. "నిర్దేశవిధానోచ్చారణంబులం" (సంజ్ఞా - 2)

**ఉదా :** కకారమునకు గకారము వచ్చును.

ఇక్కడ 'కారం' విధింపబడుతుంది. కాబట్టి 'గ' విధానము.

### 3. ద్రుతము :

"నకారం బసాధారణంబు ద్రుతంబు " (సంజ్ఞా - 7)

ప్రత్యయగమావ్యయాత్మకమై యుత్వవిశిష్టమయిన నకారంబు ద్రుత సంజ్ఞకంబని యర్థము. ద్రుతమన నొల్లని యెడ మఱిగిపోవునది"

**ఉదా :** తాను, నేను, ధనమును, చదువుచున్నాను మొదలగునవి.

### 4. అకప్రత్యయాంతావ్యయము :

'వ్యతిరేకార్థ భూతకాలికోసమాపకక్రియ" అని అర్థం. సూరి "కజీ వ్యతిరేకక్త్వార్థమునందగు" (క్రియా - 39) అని కజీని చెప్పి "జీత్త్వపరంబుగునపు డుత్వంబున కత్వంబగు" (క్రియా - 20) అని ధాతువునకత్వము చెప్పాడు. అత్వమును, కజీని

కలిపి ప్రౌఢవ్యాకర్త అకప్రత్యాయాంతావ్యయమని అన్నాడు.

**ఉదా :** కాదనక, వినక, తినక మొ॥

## 5. ధ్వన్యనుకరణము :

అనుసరించి చెప్పుటకు అనుకరణమని పేరు. ధ్వనికి సంబంధించిన పదాలను అనుకరించడానికి ధ్వన్యనుకరణమని పేరు.

"ధ్వన్యనుకరణ శబ్దంబులు ద్విరుక్తంబులయగు - (శబ్ద - 10)

**ఉదా :** గడ గడ, తళ తళ

ఇచ్చట గడ, తళ అనేవి ధ్వన్యనుకరణ శబ్దాలు.

## 6. విశేష్యము :

"విశేష్యము నా విశేషణముచేఁదెలుపఁబడు విశేషముగలది" (శబ్ద - 2)

విశేషణముచేత తెలుపబడు విశేషముగల దానికి 'విశేష్యమని' పేరు

**ఉదా :** అయ్య, అన్న, అమ్మ, అక్క మొదలగునవి

"సుగుణాభిరాముఁడు రాముడు" అన్నప్పుడు 'సుగుణాభిరాముడు' అనే విశేషణముచేత తెలుపబడే 'రాముడు' అనేది విశేష్యము.

## 7. విశేషణము :

"విశేషణము నా జాత్యాది విశేషములను దెలుపునది" (శబ్ద - 2)

జాతి మొదలైన విశేషాలను తెలపేదానికి 'విశేషణమని' పేరు.

**ఉదా :** సరసపుమాట

"సరసపు మాట" అన్నప్పుడు 'మాట యొక్క' అంటే విశేష్యము యొక్క లక్షణాన్ని తెలుపుచున్న 'సరసపు' అనేది విశేషణము.

## 8. జాతిప్రయుక్త విశేషణము :

జాతి అంటే అనేక వ్యక్తుల యందుండే ధర్మం. జాతిని అనుసరించి ప్రయోగింపబడే విశేషణం జాతి 'ప్రయుక్త విశేషణం' అవుతుంది.

**ఉదా :** ద్రోణుడు బ్రాహ్మణుడు

ఇచ్చట 'ద్రోణుఁడు' విశేష్యము. 'బ్రాహ్మణుడు' అనేది ద్రోణుడిలో వున్న బ్రాహ్మణత్వ విశేషాన్ని తెలిపే విశేషణం అవుతుంది. 'బ్రాహ్మణుడు' అనేది జాతి ప్రయుక్త విశేషణము.

## 9. క్రియాప్రయుక్త విశేషణము :

'క్రియ' అంటే పని. క్రియను అనుసరించి తెలిపే విశేషణము 'క్రియాప్రయుక్త విశేషణం'.

**ఉదా :** పోవువాఁడురాముఁడు

ఇచ్చట రాముడు విశేష్యము. "పోవుట" అనేది 'రాముడను' విశేష్యము చేసే పనిని తెలిపే విశేషణము క్రియారూపంలో వుంది. కాబట్టి 'పోవువాడు' అనేది క్రియాప్రయుక్త విశేషణమవుతుంది.

### 10. గుణప్రయుక్త విశేషణము :

గుణాన్ని అనుసరించి ప్రయోగింపబడే విశేషణము 'గుణప్రయుక్త విశేషణమవుతుంది'.

**ఉదా :** నల్లని కృష్ణుడు

ఇచ్చట 'కృష్ణుఁడు' విశేష్యము. 'నల్లని' అనేది విశేష్యమైన కృష్ణునిలోని గుణాన్ని తెలియజేసే విశేషణము. కాబట్టి 'నల్లని' అనేది "గుణప్రయుక్త విశేషణమవుతుంది".

### 11. ద్రవ్యప్రయుక్త విశేషణము :

ద్రవ్యమంటే ఒక పదార్థమని అర్థం. ద్రవ్యాన్ని అనుసరించి ప్రయోంగించే విశేషణము 'ద్రవ్యప్రయుక్త విశేషణమవుతుంది'.

**ఉదా :** ధనవంతుఁడు రాజు

ఇచ్చట 'రాజు' విశేష్యము. "ధనము కలిగియుండుట" అనే విశేషాన్ని తెలయజేయటానికి ప్రయోగించిన 'ధనవంతుడు' అనేది ద్రవ్యప్రయుక్త విశేషణమవుతుంది.

### 12. సంఖ్యాప్రయుక్త విశేషణము :

సంఖ్యననుసరించి ప్రయోగింపబడిన విశేషణము సంఖ్య ప్రయుక్త విశేషణమవుతుంది.

ఉదా : ఒక్కడు

'ఒక్క' అనేది సంఖ్యావాచకం. కాబట్టి 'ఒక్కడు' అనేది సంఖ్యాప్రయుక్త విశేషణమవుతుంది.

### 13. సంజ్ఞా ప్రయుక్త విశేషణము :

'సంజ్ఞ' అనగా "గుర్తు" లేక "పేరు" అని అర్థం. సంజ్ఞ ననుసరించి ప్రయోగింపబడిన విశేషణం సంజ్ఞా ప్రయుక్త విశేషణమవుతుంది.

**ఉదా :** దేవదత్తుడు

ఇది పేరు. అంటే సంజ్ఞ అని అర్థం. సంజ్ఞను బట్టి ప్రయోగింపబడ్డ విశేషణం కాబట్టి సంజ్ఞాప్రయుక్త విశేషణమవుతుంది.

### 14. ఇప్రత్యయంతావ్యయము :

'ఇ' అనే ప్రత్యయం చివరగల అవ్యయము 'ఇప్రత్యయంతావ్యయమవుతుంది'. "సమానాశ్రయంబులం బూర్వకాలంబునం దివర్ణకంబగు" (బాల. క్రియ. - 38) అని ఇప్రత్యయము విధింపబడింది. ఇదియే క్త్వార్థము.

**ఉదా :** వండి, తిని, విని మొదలగునవి

**15. విశేష్యలక్షకము :**

"లక్షకము" అనేది "లక్షణావృత్తి" అనే అర్థంలో ప్రయోగింపబడింది. 'లక్షణ' మనగా ముఖ్యార్థబాధ కలిగినపుడు అర్థాంతరాన్ని స్వీకరించమని అర్థం. లక్ష్యార్థాన్నిచ్చేది లక్షకం. విశేష్యమును లక్ష్యంగా తెలిపేది విశేష్యలక్షకం అవుతుంది.

**ఉదా :** అప్రియంబులు గావించి (శబ్ద పరిచ్ఛదము - 12)

ఇచ్చట 'అ' ప్రియంబులు' అనేది విశేషణము. 'అప్రియమైన పనులు' అనేది విశేష్యలక్షకము.

**16. వర్ణవ్యత్యయము : (శబ్ద - 51)**

'వర్ణ వ్యత్యయమంటే' 'అక్షరాలు తారుమారవటం' అని అర్థం. "ముందున్న అక్షరం తరువాత రావడం, తర్వాత ఉన్న అక్షరం ముందురావడం" అనేది వర్ణవ్యత్యయమవుతుంది.

**ఉదా :** కొంత

'ఒక + అంత' అన్నప్పుడు ఒక అనేది 'క + ఓ' మారి కొంత అని అవుతుంది.

**17. కారకము : (కారక -1)**

క్రియాన్వయమును గలిగించునది అనగా - క్రియన్వయము కలదియని కారకశబ్దార్థము"

**ఉదా :** రాముడు రావణుని చంపెను.

ఈ వాక్యములో ఆఖ్యాతముకర్తయైన రాముని చెప్పుచున్నది కాన ఇది 'కర్తృకారకము'.

**18. అన్నంత క్రియ (కారక - 12)**

'అన్' ప్రత్యయము చివరగల క్రియ 'అన్నంతక్రియ' అవుతుంది.

'తుమర్థభావలక్షణంబుననుజియగు" (క్రియ - 41) అని సూరి' ను విధించినాడు. "జేత్తు పరంబగునపు డుత్వంబున కత్వంబగు" (బాల. క్రియ - 20) అని ధాతువు చివరనవున్న ఉత్వానికత్వము చెప్పినాడు. ఆ రెంటిని కలిపి "అన్నంతక్రియ" అని ప్రౌఢ వ్యాకర్త చెప్పినాడు.

**ఉదా :** కలుగంగన్ - చివర 'అన్' ఉన్నది కాబట్టి అన్నంతక్రియ.

**19. వీప్స (కారక - 14) :**

వివిచ్య ఆప్తుమిచ్ఛావీప్సా' అని విగ్రహవాక్యం. వరుసగా అనేక వస్తువుల్లో వ్యాపించడానికి ఇష్టపడటం 'వీప్స' అవుతుంది.

**ఉదా :** మ్రానిమ్రానికి నరిగి

ఒక్కొక్కచెట్టు దగ్గర వెళ్ళుట కిష్టపడుట అని అర్థం.

**20. స్వస్వామి సంబంధము (కారక - 23) :**

'స్వ' అంటే సొత్తు 'స్వామి' అంటే అధిపతి. ధనానికీ ధనాధిపతికీ గల సంబంధం 'స్వస్వామి సంబంధము' అవుతుంది.

**ఉదా :** నన్నతడు చెట్టపటినన్

ఇచ్చట 'పట్టినన్' అనేది క్రియ. దానితో 'నన్ను' అనే దానికీ 'చెట్ట' అనే దానికీ అన్వయము. అంటే సంబంధముందని అర్థం.

**21. విధేయ విశేషణము (కారక - 24) :**

"మీద తెలియదగినది 'విధేయము'. విధేయము వక్తకు మాత్రము తెలియును. (ప్రౌఢ వాక్య - 6 సూత్రవివరణ)

**ఉదా :** బ్రాహ్మణముఖ్యుఁబురోహితుండుగా

'పురోహితుండు' విధేయ విశేషణము.

**22. సమాసము :**

"సమాసమనగా సంయోగదశ యందుఁగలిగెడు విభక్తి లోపాత్మక పదస్వరూపసంగ్రహము. (సమాస.ప్రారంభంలో)

**ఉదా :** రాముని గుణములు

"రాముని యొక్క గుణములు" అనే విగ్రహవాక్యంలో విభక్తి లోపాన్ని పొంది "రాముని గుణములు" అని అవుతుంది.

**23. తథార్థకావ్యయము (సమాస - 8) :**

'తథా' అని సంస్కృత పదము యొక్క అర్థాన్ని తెలియజేసే అవ్యయం తథార్థకావ్యయమవుతుంది. 'తథా' అంటే 'అట్లు' అని అర్థం.

**ఉదా :** చదువునట్లు

ఇచ్చట 'అట్లు' అనేది తథార్థకావ్యయము.

**24. విశేషణోభయపద కర్మధారయము (సమాస - 17) :**

విశేషణానికి విశేష్యముతో సమాసం చేస్తే 'కర్మధారయమవుతుంది'. విశేష్యానికి రెండు వివేషణాలు ముందు ప్రయోగిస్తే 'విశేషణోభయపద కర్మధారయమవుతుంది'.

**ఉదా :** ఆ యీ నేరములు

నేరములు విశేష్యము. 'ఆ, యీ' అనేవి రెండు విశేషణాలు.

**25. ఉపమాన పూర్వపద కర్మధారయము (సమాస - 19) :**

విశేషణానికి విశేష్యముతో సమాసం 'కర్మధారయమవుతుంది'. పూర్వపదం ఉపమానమైతే 'ఉపమాన పూర్వపదకర్మధారయ సమాసమవుతుంది'.

**ఉదా :** అలరుఁబోఁడి.

'పువ్వువలె మనోజ్ఞురాలని' అర్థం. "అలరు" అనేది ఉపమానం. ఉపమానం పూర్వపదంగా వుంది కాబట్టి 'ఉపమాన పూర్వపద కర్మధారయమవుతుంది'.

**26. మహద్ద్వంద్వము (సమాస - 28) :**

రెండు మహద్వాచకాలకు గానీ, రెండూ మహతీ వాచకాలకుగాని చేసిన ద్వంద్వము 'మహద్ద్వంద్వమవుతుంది'. ఒకటి మహద్వాచకమున్నూ, మరొకటి అమహద్వాచకమున్నూ కావచ్చును.

**ఉదా :** అన్నాదమ్ములు (రెండు మహద్వాచకములే)

అప్పాచెల్లింద్రు (రెండు మహతీ వాచకములే)

తల్లీదండ్రులు (ఒకటి మహతీ వాచకం, రెండవది మహద్వాచకము)

పాఠం - 6

# గ్రంథస్థ ప్రశ్న వివరణం

## 1. అనింద్ర్యగ్రామ్యాలను గురించి వ్రాయండి ?

సూరి "లక్షణ విరుద్ధంబగు భాషగ్రామ్యంబు (సంజ్ఞా 22) అనే సూత్రం వ్రాసి వస్తాడు, తెస్తాడు మొదలైన వాటిని ఉదాహరణలుగా చూపాడు. "ఈ భాష ప్రయోగంబునకనర్హంబు" అని వివరణ రచించాడు. మహాకవులు ప్రయోగించిన కొన్ని ప్రయోగాలు లక్షణ విరుద్ధాలుగా వున్నప్పటికీ గ్రహించవచ్చునంటూ "ఆర్య వ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు" అని వ్రాసి కఱకంఠుడు, ప్రాణగొడ్డము, కపిలకన్నులు అనేవాటిని చూపాడు.

### 1. కఱకంఠుడు :

"కఱయగు కంఠము గలవాడు" అనే విగ్రహ వాక్యంతో కఱకంఠుడు బహువ్రీహి సమాసమవుతుంది. బహువ్రీహి సమాసంలో రెండు పదాలు స్త్రీసమాలుగా వుండాలని "స్త్రీ సమఘటితంబ యొకానొకండు బహువ్రీహి చూపట్టెడు" (సమాస - 6) అనే సూత్రం తెల్పుతుంది. 'కంఠుడు' అనేది స్త్రీసమం కాదు కాబట్టి అనింద్యగ్రామ్యంగా గ్రహించాలని సూరి అభిప్రాయము.

ప్రౌఢ వ్యాకర్త "కఱకంఠుడు బహువ్రీహి" (సమాస - 27) అనే సూత్రంవ్రాసి కఱకంఠుడు అనేది గరళగంఠ శబ్దం నుండి పుట్టిందని చెప్పాడు. సిద్ధావస్థలోనే (సంస్కృతంలోనే) బహువ్రీహి సమాసం గాబట్టి దాన్నుండి పుట్టిన కఱకంఠుడు అనేది గ్రామ్యం కాదని భావం. అనాంధ్రవర్ణమైన ఠకారం తద్భవాల్లో వుండటం కుదరదు. ఈ సవరణ యంతసరియైందిగా కన్పించదు.

### 2. ప్రాణ గడ్డము :

'ప్రాణ' అనేది సంస్కృతము. 'గొడ్డము' అనేది ఆచ్ఛికము. 'కేవల సంస్కృత శబ్దం వికృతి శబ్దముతోడ సమసింపదు (బాల-సమాస - 3 వివరణం) అనే విషయాన్ని అనుసరించి 'ప్రాణగొడ్డము' అన్నప్పుడు వైరిసమాసమవుతుంది. పెద్దలు ప్రయోగించారు కాబట్టి సూరి అనింద్యగ్రామ్యంగా గ్రహించాలంటాడు.

"ప్రాణగొడ్డమ గ్రామ్యంబునాదగు" (సంజ్ఞా - 12) సూత్రం వ్రాసి "ఇయ్యది ప్రాణకుట్టక శబ్దభవము. అంతపదము, అంతయు లోనగువానివంటిది" అని వివరణ వ్రాశాడు. ప్రాణగొడ్డము అన్నప్పుడు ఉత్తరపదం మారింది. "హంసపదము - అంచపదము, హంస - అంచమాన అన్నప్పుడు పూర్వపదములు మాత్రము మారినవి. ప్రాణకుట్టకశబ్దము నుండి ప్రాణగొడ్డ మనునది పుట్టిందన్నప్పుడు గ్రామ్యం కాదు.

### 3. కపిలకన్నులు :

'కపిల' కేవల సంస్కృతము. గొడ్డము ఆచ్ఛికము. ప్రాణగొడ్డమువలె ఇదియు వైరిసమాసమని సూరి అభిప్రాయము.

ప్రౌఢ వ్యాకర్త "కపిలశబ్దభవము కవిల శబ్దంబొండుగానంబడియెడి" (సంజ్ఞా - 13) అని సూత్రము వ్రాసి 'కపిలకన్నులు' అని నన్నయ ప్రయోగించలేదని 'కపిలకన్నులు' అనేది సరియైన ప్రయోగమనియు తెల్పి, "అవసరజ్ఞుండయి" అని ప్రాసనిబద్ధమైన ప్రయోగమును చూపి సమర్థించుకొన్నాడు. ఇది సమంజసముగానే వున్నది.

4. సూరి అనింద్యగ్రామ్యములుగా తెల్పినవాటిని ప్రౌఢవ్యాకర్త అసలవి గ్రామ్యాలు కావంటూ సమర్థించినాడు.

## 2. అనుకరణ సంధులను గూర్చి ప్రౌఢ వ్యాకర్త చెప్పిన విశేషాలను దెల్పుము ?

ఉన్నది ఉన్నట్లుగా చెప్పడానికి అనుకరణమని పేరు. సంస్కృత పదాలనుగానీ, వాక్యాలనుగానీ అనుకరణం లేకుండా ప్రయోగించడానికి వీల్లేదు.

ఈ అనుకరణంలో అనువర్తించే వాక్యానికిగానీ, పదానికిగానీ పరంగా "అను ధాతురూపము" ఉంటుంది. 'అను' ధాతువు ప్రయోగించినపుడు జరిగే సంధికార్యాలు అనుకరణ సంధులు.

**1. ఒకానొకచో ననుకరణ విరహితంబుగ సంస్కృతవాక్యంబు గానంబడియెడి"**

**(సంజ్ఞా - 15)**

సంస్కృతవాక్యాలు కొన్ని అనుకరణం లేకుండా అంటే 'అను' ధాతువు ప్రయోగించకుండా తెలుగులో సంస్కృత వాక్యాన్ని యథాతథంగా తెలుగులో ప్రయోగించవచ్చని అర్థం.

**ఉదా :** అంటితి నమశ్శివాయ పాపాత్ముంరాల (జైమినిభారతము 4 - 71) "నమశ్శివాయ" అనే సంస్కృత వాక్యము అనుకరణము లేకుండా ప్రయోగింపబడింది.

**2. జయపదంబనుకరణ విరహితంబ తఱచుగనగు (సంజ్ఞా - 16)**

'జయ' అను సంస్కృత శబ్దము అనుకరణం లేకుండా తఱచుగా ప్రయోగింపబడుతుందని అర్థం.

**ఉదా :** జయపూతనాఘాత జయదైత్యదమన - హరి-పు-7-58

జయనారాయణ పుండరీకనయనా - ఉ.హరి - 6-20

తఱచగననుటచే నొక్కకచో ననుకరణసహితంబునగునని యెఱుంగవలయు.

**3. ధ్వనిని అనుకరించి చెప్పేపదములకు ధ్వన్యనుకరణ శబ్దములనిపేరు.**

"ధ్వన్యనుకరణ శబ్దంబులు ద్విరుక్తంబులయగు" (సంధి - 20) ధ్వనిని అనుసరించి చెప్పే శబ్దములు రెండుసార్లు ఉచ్చరింపబడుతుంటాయని అర్థం.

**ఉదా :** గడగడ, వడవడ, తళతళ

**4. ధ్వనన్యనుకరణ శబ్దముల కనుధాతువు పరకబగుచోఁగొన్ని యెడల ముగాగమంబగు (సంధి - 19)**

ధ్వనిని అనుకరించి చెప్పే పదాలకు అను ధాతువుపరంగా ఉంటే ముగాగమం వస్తుందని అర్థం.

**ఉదా :** కనకనమను, సలసలమను

**5. ఇయ్యవి క్రియాంతవ్యవహితంబులగు**

ధ్వన్యనుకరణ శబ్దములు క్రియతో వ్యవధానమును పొందివుండవచ్చు. అనగా ధ్వన్యనుకరణ శబ్దాల ప్రక్కనే క్రియాపదముండాల్సినపనిలేదు. మధ్యలో వేరే పదాలుండవచ్చు.

**ఉదా :** వడవడ జమదగ్ని సూతివడకెన్

3,4,5 సూత్రాలనుబట్టి ఆచ్ఛిక శబ్దాలను గూడా అనుకరింపవచ్చుననీ, అట్టి యెడకొన్ని మార్పులుగల్గుననీ సూచించినట్లైంది.

## 3. ప్రౌఢ వ్యాకర్త చెప్పిన విశేషణ విశేష్యాలు గూర్చి వివరించండి ?

1) శబ్దములు విశేష్యములు విశేషణములని ద్వివిధంబులు అయ్య, అన్న, అమ్మ, అక్క మొదలగునవి విశేష్యములు నల్లని, చక్కని మెదలగునవి విశేషణములు.

2) విశేష్యమునా విశేషణముచేఁదెలుపఁబడు విశేషముకలది విశేషణమునా జాత్యాది విశేషములను దెలుపునది (శబ్ద - 2)

3) విశేషణము జాత్యాదిభేదంబులచేషడ్విధంబు (శబ్ద - 3)

అ) జాతి ప్రయుక్త విశేషణము - బ్రాహ్మణుడు

ఆ) క్రియా ప్రయుక్త విశేషణము - పోవువాడు

ఇ) గుణప్రయుక్త విశేషణము - నల్లనివాడు

ఈ) ద్రవ్యప్రయుక్త విశేషణము - ధనవంతుడు

ఉ) సంఖ్యా ప్రయుక్త విశేషణము - ఒక్కడు

ఊ) సంజ్ఞా ప్రయుక్త విశేషణము - దేవదత్తుడు

4). సంఖ్యాప్రయుక్త విశేషణ మేకాంతంబయి మమహద్విశేష్యకమయ్యు, తదంశాంతంబయి మహదమహద్విశేష్యకమయ్యు, సమస్తంబు వ్యస్తంబునగుచో విశేష్యంబు క్రమంబుగ నుత్తరపదంబు నేకవచనాంతంబును, పూర్వపదంబు బహువచనాంతంబునగు (శబ్ద -4)

**ఉదా :** డెబ్బది యొక్క రథము

రథము లుడెబ్బయి యొక్కటి

రెండున్నర రూపాయి

రూపాయలు రెండున్నర

5). అయ్యది యేకాంతంబు మహద్విశేష్యకంబు సమస్తంబుకాదు వ్యస్తంబగుచో బహువచనాంతంబయగు (శబ్ద - 5)

**ఉదా :** పదునొక్కండ్రు రుద్రులు

6). విశేష్యంబు ప్రధానం బితరంబ ప్రధానంబు - (శబ్ద - 6)

7) ప్రధానంబు పశ్చాద్వాచ్యంబగు - (శబ్ద - 7)

అన్వయ క్రమంబునందు విశేషణములను ముందుచెప్పి కడపట విశేష్యమును జెప్పవలెనమట.

8) ఒక్కొచో విశేషణంబులును విశేష్యంబులగు - (శబ్ద - 8)

**ఉదా :** నారదుండిట్లనియె

9) ఒక్కొక్కచో విశేషణ విశేష్యంబులు వ్యత్యస్తంబులునగు (శబ్ద - 9)

**ఉదా :** నీ యాఱుదల్లి త్రిభువన భామారత్నంబు గంధవతిపై

10) తెనుగునం గొన్నిశబ్దములు విశేష్య విశేషణంబు లుభయంబుననగు (శబ్ద - 10)

కొన్నియనగాఁగీడు ప్రభృతులును నల్లాదులును.

**విశేష్యము :** కృష్ణ కృష్ణ యనంతయనీడులేదు.

**విశేషణము :** వారలతలంపులు కీడు

11) విశేషణంబులుకొన్ని వ్యవహితంబులనగు (శబ్ద - 11)

**ఉదా :** ఈ లోకంబున వెదకితిమే లెల్లెడగాన.

'ఎల్లెడ' అనే పదంతో వ్యవధానం వుంది.

12) విశేషణంబులు కొన్నియెడల విశేష్యలక్షకంబులగు - (శబ్ద - 12)

**ఉదా :** దేవతల కప్రియంబులు

(అప్రియంబులు = అప్రియమైన వాక్యములు)

## 4. ప్రౌఢ వ్యాకర్త చెప్పిన సంబోధన విశేషాలను వివరించండి ?

సూరి "ఓ యామంత్రణంబునందగు" తత్సమ - 14) అనే సూత్రము వ్రాసి వివరణలో ఓ యనే శబ్దం సంబోధనతో వస్తుందనీ, అది సంబోధ్య వాచకానికి ముందే ప్రయోగింపబడుతుందనీ చెప్పాడు.

ప్రౌఢ వ్యాకర్త సంబోధన విషయంలో కొన్ని సవరణలు, పూరణలు తెల్పినాడు.

### 1) ఓ శబ్దం బొక్కచో సంబోధ్యవాచకంబునకు ముందితర శబ్దవ్యవహితంబయి కానంబడియెడి (శబ్ద - 13)

ఓ శబ్దమునకు సంభోద్య వాచకములకు ముందు ఇతర శబ్దాలు వుంటాయని తెల్పాడు.

**ఉదా :** ఓ వినువీధినున్న ఖచరోత్తములార

ఓ అనే సంబోధనకూ, ఖచోరత్తములార' అనే సంబోధ్యవాచకానికీ ముందు 'వినువీధినున్న' అనే పదంతో వ్యవధానం ఏర్పడింది.

### 2) రోశబ్దం బొండు సంబోధనంబున స్త్రీవాచకంబునకుఁబరుంబుగనగు అయ్యది హ్రస్వాంతంబుననయ్యెడి (శబ్ద - 14)

సంబోధనార్థమును వివక్షించే సమయంలో స్త్రీ వాచకానికిపరంగా 'రో' అనే శబ్దము వస్తుంది. అది హ్రస్వాంతముగా కూడా వస్తుందని అర్థం.

**ఉదా :** కమలదళాక్షరో వినవుగాఁగల యొక్కటిగంటి వేకువన్. అరమణిరో భృత్యులందపరాధము గల్గిన.

### 3) దేశ్యంబులం గొన్నియెడల స్త్రీవాచక స్త్రీసమంబులగు సంభోద్యవాచక శబ్దంబుల మీద నేకవచనంబునఁ గాన శబ్దంబొండును, అలదును నవ్యయంబొందునుగానంబడియెడి, అలదీర్ఘాంతంబునగు". (శబ్ద - 15)

దేశ్యములైన స్త్రీవాచక స్త్రీసమాలైన శబ్దాలకు కొన్నింటిని సంబోధన ప్రథమేకవచనంలో 'కాన' అనే శబ్దమును' అలా అనే అవ్యయము చేరుతుందని అర్థం. అలా అని దీర్ఘాంతంగా కూడా చేరుతుందని అర్థం.

**ఉదా :** 1) మీ తల్లికాన - శనై - 7-9

2) మాసామికాన - సా - 1-73

స్వామి శబ్దమునుండి 'సామి' అనేది వచ్చింది కాబట్టి 'సామి' అనేది తద్భవమేగాని దేశ్యము కాదు.

### 4) పూజ్యతయం దొక్కచో నామతదేతదేతద్యుష్మదస్మచ్ఛబ్దంబుల యేకవచనంబునకు బహువచనంబగు. అందులో సంబోధ్య వాచకంబు బహువచనాంతంబుగాదు - (శబ్ద - 43)

ఏకవచనానికి బహువచనాలు వచ్చే సందర్భాలు చెపుతూ 'నీ' శబ్దము బహువచనంగా వున్నప్పటికినీ సంభోద్యవాచకాలు

మాత్రం బహువచనంగా వుండటంలేదు.

**ఉదా :** "మీకుం బ్రియశిష్యుఁడటయమిధ్యావచనా" (భార-ఆది-5-240) మీకు అనేది బహువచనం. 'అమిద్యావచనా' అనే సంబోధన ఏకవచనంలో ఉంది.

**5) సంబోధ్యవాచకంబు బహువచనాంతంబయ్యు గ్రియలమీది మమ్మొదు లేకవచనాంతంబులయగు (శబ్ద - 44)**

సంబోధ్యవాచకం బహువచనంలో వుంటే దానికి సంబంధించిన క్రియలు బహువచనంలో వుండాలనేది నియమం. ఏకవచనంలో వుండటం విశేషంగా కన్పిస్తుందని అర్థం.

**ఉదా :** మన యశోద చిన్న మగవాని గనెనట చూచి వత్తుమమ్మ సుదతులార - భాగ - 10-1-84.

'సుదతులార' అనే సంబోధ్య బహువచనాంతం. 'చూచివత్తము' అనుక్రియ ఏకవచనంలో ఉంది.

**5. నగాగమాన్ని గూర్చి ప్రౌఢ వ్యాకరణం తెల్పిన వివరం ఏమిటి ?**

సూరి "కు వర్ణకంబుపరంబగునప్పుడు డుకారబుకారములకు నగాగమంబగు" అని సూత్రంవ్రాసి రామునకున్, విధాత్రునకున్' అని వాని నుదాహరించాడు.

**1) కువర్ణకంబు పరంబగునపుడు కవిత్రయంబువారి ప్రయోగంబులందక్కఁదక్కినమహాకవి ప్రయోగంబులందునుఁగొన్నియెడల నగాగమంబగు" (శబ్ద - 19)**

కువర్ణకం పరంగానున్నప్పుడు కవిత్రయ ప్రయోగాలలోగాక ఇతర మహాకవి ప్రయోగాల్లో కొన్నియెడల నగాగమం కన్పిస్తుందని అర్థం.

**ఉదా :** అ) ఉత్తవముకేగెడు, ఆ) బచ్చుకున్

**2) కంబె వర్ణకంబుపరంబగునపుడును గొన్నియెడల నగాగమంబు చూపట్టెడి (శబ్ద - 20)**

కంటె వర్ణముపరంగా వున్నప్పుడును, కొన్నిచోట్ల నుగాగమముకన్పిస్తుందని అర్థం.

**ఉదా :** అ) తత్క్రతుశతంబున కంటెసుతుండు మేలు (భార-ఆది-4-93)

ఆ) అనఘు చరిత్రమునకంటె (నిర్వ - 9-52)

**3) ఉదంతములగు నమహత్తులకందువర్ణకము పరంబగునపుడును నగామమంబు కొన్నియెడలఁ గానంబడియెడి (శబ్ద - 21)**

ఉదంతాలైన అమద్వాచకాలకు అందువర్ణకంపరంగా వుంటే కొన్నిచోట్ల నగాగమం వస్తుందని అర్థం.

**ఉదా :** అ) దేవసేన నిమిష నాయకత్వమున యందు

ఆ) సంతరించితి నిండుజవ్వనంబునయందు

ఇ) వినుపిండదానసమయంబున యందును

ఈ) మనంబునయందు; మొదలగునవి.

**5. బహువచన ప్రత్యయాదులను గూర్చి వ్రాయండి ?**

**1) అందర్వాదులు నిత్యబహువచనాంతములు (శబ్ద - 35)**

**ఉదా :** అందఱు, ఇందరు, పెక్కండ్రు

**2) అదరులులోనగు శబ్దములును (శబ్ద - 36)**

**ఉదా :** అదరులు, మిడుఁగుఱులు మొదలగునవి

**3) అఱచుగధాన్యవాచక శబ్దములను (శబ్ద - 37)**

**ఉదా :** ఆళ్ళు, చోళ్ళు, పెసలు మొదలగునవి

**4) క్రీడా విశేషవాచకశబ్దములును. (శబ్ద - 38)**

**ఉదా :** అచ్చనగాయలు, కనుమూసిగంతులు, బొమ్మపెండ్లిండ్లు మొదలగునవి

**5) తఱచుగా స్త్రీ సమంబులగుదేశ్య శబ్దంబులకుఁగడపలఁగొన్నింటి కేకవచనంబునం బూజ్యతయందు గారు' శబ్దంబగు (శబ్ద - 39)**

**ఉదా :** అయ్యగారు, తల్లిగారు, రాజుగారు

**6) డుమంతంబులగు తత్సమాది శబ్దంబులకుం గొన్నింటికిని ద్వితీయాబహువచనంబు మీదఁబూజ్యతయందు గారునకు మాఱుగ వారగు. (శబ్ద - 41)**

ఉదా : శ్రీరాములవారు, వసిష్టులవారు మొదలగువారు.

**7) తాముతమరుతారునగు**

**8) దేశ్యంబునంగొన్నియెడల మహన్మహత్యర్థక బహువచనాంత నామంబులపై మరల బహువచన ప్రత్యయములు చూపట్టెడు. అచ్చో వారు, వీరు, మీరు శబ్దాంబుల యంత్రో కారంబున కకారంబగు. (శబ్ద - 48)**

**ఉదా :** వేడుకకాండ్రురు, చూపరులు, వారలు వీరలు, మీరలు మొదలగునవి

**8. విభక్తి విపరణామమును వివరింపుము ?**

"విశేష్యంబునకుఁబోలె విశేషణంబునకు లింగవిభక్తి వచనంబులగు" (కారక - 19) అని సూరి సూత్రము వ్రాసినాడు. విశేషణ విశేష్యాలు ఒకే విభక్తిలో వుండాలనేది నియమం. సూరి కొన్ని విభక్తుల మార్పులను చెప్పియున్నాడు. అట్లే ప్రౌఢ వ్యాకర్త విశేష్యాలకున్న విభక్తి పరిణామాన్ని వివరించాడు.

**1) "ఒక్కొచో నుదంతంబగునజడంబు తృతీయకును న వర్ణకంబు గానంబడియెడి" (కారక - 17)**

ఉదంతాలైన అజడవాచకాల తృతీయ విభక్తికి సప్తమీ విభక్తియైన నవర్ణకము కన్పిస్తుందని అర్థం.

**ఉదా :** ఏనుగునేనుగువైచుచు

"ఏనుగుతోనేనుగు" అను తృతీయకు బదులు సప్తమీ నవర్ణకం వచ్చింది.

**2) కొన్నియెడల నజడంబుతృతీయా సప్తములకును బహుత్వంబున ద్వితీయచూపట్టెడి. (కారన్-18)**

కొన్ని చోట్ల అజడవాచకాల తృతీయా సప్తమీ విభక్తులకు బహువచనములో ద్వితీయా విభక్తి వస్తుందని అర్థం.

**ఉదా :** 1) ఘనతర స్తన చక్రవాకముల నలరు

"ఘనతరస్తనచక్రవాకములతో" అని తృతీయాయాబహువచనానికి ద్వితీయ వచ్చింది.

**2) మనుజుల విప్రుండు :** మనుజుల విప్రుండు

మనుజుల యందు విప్రుండు (సప్తమికి ద్వితీయ)

**3) కొన్నియెడల నజడంబు ద్వితీయకును బ్రథమకానంబడియెడి (కారక - 19)**

కొన్ని అజడవాచకాల ద్వితీయావిభక్తికి ప్రథమావిభక్తి కన్పిస్తుందని అర్థం.

**ఉదా :** అమ్మదనాగమెదిర్చి

అమ్మదనాగము నెదిర్చి (ద్వితీయకు ప్రథమ)

**4) ఒక్కొక్కచో జడంబు సప్తమికిం బ్రథమయునగు (కారక - 20)**

ఒక్కొక్కచో జడవాచకముల సప్తమి ప్రథమవిభక్తి కూడా వచ్చునని అర్థం.

**ఉదా :** తీర్థమాడి

తీర్థమందాడి (సప్తమికి ప్రథమ)

**5) ఒక్కచో సమాంతర్గత విశేష్యంబులగు విశేషణంబుల షష్ఠికిని బ్రథమచూపట్టెడి (కారక - 21)**

ఒక్కొక్కచో సమాస మధ్య భాగంలో వున్న విశేష్యంబులకు సంబంధించిన విశేషణముల షష్ఠికిని ప్రథమావిభక్తి కన్పిస్తుందని అర్థం.

**ఉదా :** పార్థివప్రాగసరుండు ధర్మసుతుపన్నిది

'ధర్మసుతుపన్ను' అన్నప్పుడు 'ధర్మసుతుయొక్క పన్ను' అని షష్ఠీ విభక్తి. 'ప్రార్థివ ప్రాగ్రసరుడు అనేది దానికి సంబంధించిన విశేషణము. ధర్మసుతు యొక్క అని సమాస మధ్యభాగంలో వున్న విశేష్యానికి ప్రయోగించిన విశేషణం "పార్థివప్రాగ్రసరుండు" అని ప్రథములో వుంది.

**6. కొన్నియెడల విశేషణంబు ద్వితీయాదులకును బ్రథమచూపట్టెడి. (కారక - 22)**

కొన్నిచోట్ల విశేష్యము ద్వితీయాది విభక్తిల్లో వున్నప్పటకినీ దానికి సంబంధించిన విశేషణం ప్రథమావిభక్తిలో వుంటుందని అర్థం.

**ఉదా :** తల్లిద్రౌపది తోడన్

తల్లితోడ ద్రౌపదిలోడన్ అని తృతీయకు ప్రథమవచ్చి 'తల్లి ద్రౌపది తోడన్' అని అయ్యింది.

**7. క్రియాన్వయంబున రెండు పదంబులకు స్వస్వామి సంబంధముతలచో సంబంధి పదంబు షష్ఠికి ద్వితీయయగు. (కారక - 23)**

రెండు పదాలకు క్రియతో అన్వయంవుండి స్వస్వామి సంబంధం వుంటే స్వామిపదం' సంబంధి పదము యొక్క షష్ఠీ విభక్తికి ద్వితీయావిభక్తి వస్తుందని అర్థం.

**ఉదా :** నన్నునతడు చెట్టువట్టినన్

'నన్ను చెట్టవట్టినన్' అనగా 'నాయొక్క చెట్ట' అని అర్థం. "నాయొక్క చెట్ట' అన్నప్పుడు స్వస్వామి సంబంధముంది. సంబంధి వాచకము 'నా' అనునది. దానికి ద్వితీయ వచ్చినన్ను అని అవుతుంది. అప్పుడు నన్నునతడు చెట్టవట్టినన్' అని అవుతుంది.

## 8. ఒక్కొక్కచో ద్వితీయాంతవిధేయ విశేషణంబునకుఁబ్రథమయినగు (కారక - 24)

ఒక్కొచో విశేష్యము ద్వితీయలో వున్నప్పుడు దానికి సంబంధించిన విధేయ విశేషణము యొక్క ద్వితీయకు బదులు ప్రథమవిభక్తి వస్తుందని అర్థం.

**ఉదా :** బ్రాహ్మణ ముఖ్యుఁ బురోహితుండుగాఁజేకొనువారము. 'బ్రాహ్మణముఖ్యన్' అనేది విశేష్యము. ద్వితీయాంతము. "పురోహితుండు" విధేయ విశేషణము. ద్వితీయలో వుండవలసినప్పటికిని ప్రస్తుత సూత్రములో ప్రథమలో వుంది. కాబట్టి 'బ్రహ్మణముఖ్యుఁ బురోహితుండు" అని అయ్యెడు.

## 8. కర్మధారయ సమాసములను గూర్చి వివరింపుము ?

విశేషణమునకు విశేష్యంతో సమాసం చేస్తే అది కర్మధారయమవుతుంది. అందుగలుగు మార్పులనిట్లు గుర్తింపవచ్చు. (1) కర్మధారయంబు బిరుదాద్యుత్తర పదంబయ్యేనేని ద్యక్షరాదంత స్త్రీ పుం సంజ్ఞావాచవంబగు పూర్వపదంబునంత్యాక్షరంబు నకంతట దీర్ఘంబు బహుళంగానగు. (సమాస - 2) కర్మధారయ సమాసం బిరుదాద్యుత్తర పదాలతో కూడియున్నప్పుడు రెండక్షరాలు గల స్త్రీలింగ, పుంలింగ సంజ్ఞావాచకాలు పూర్వపదాలుగా వుంటే పూర్వపదంలోని చివరి అచ్చుకు దీర్ఘం వస్తుందని అర్థం.

**ఉదా :** రామాశాస్త్రి, సుబ్బారాయుఁడు, (పుం.సంజ్ఞలు' చిన్నోదేవి (స్త్రీ సంజ్ఞ)

### 2) ఇట పూర్వపదంబు నత్వంబునకి త్వంబు బహుళంబుగానగు (సమాస - 3)

ముందటి సూత్రంలో చెప్పబడ్డ పూర్వపదం చివరలోవున్న అత్వానికి ఇత్వం బహుళంగా వస్తుందని అర్థం.

**ఉదా :** రామిసెట్టి, ఎల్లిసెట్టి మొదలగునవి

'రామిసెట్టి' అన్నప్పుడిత్వంబు నిత్యంబు. సుబ్బినాయుడు సుబ్బనాయఁడు అని రెండు రూపాలుంటాయి.

## 3) కొన్నియెడల నిచ్చో ననాపామాయాగమంబులగు (సమాస - 4)

కొన్నిచోట్లపై కర్మధారయ సమాసాల్లో పూర్వపదంలో వున్న అకారానికి "అన, అప, అమ, అయ" అనేవి ఆగమాలుగా వస్తాయని అర్థం.

**ఉదా :** తిక్కన సామయాజి (అన 'ఆగమం' )

నన్నపార్యుడు (అప 'ఆగమం)

కృష్ణమనాయఁడు (అమ ఆగమం)

నన్నయభట్టు ( అమ ఆగమం)

**4) పై యాగమంబులు కొన్నియెడల ద్విత్వయుక్తంబులగు (సమాస - 5)**

అన మొదలైన వాటికి కొన్నిచోట్ల ద్విత్వం కూడా వస్తుందని అర్థం.

**ఉదా :** రామన్నసెట్టి, తిమ్మప్పనాయుఁడు, మల్లయ్యశాస్త్రి మొదలగునవి

**5) కర్మధారయంబియ్యడి మిశ్రంబు సిద్ధసమాంసం బిట్లయగు (సమాస - 5)**

పైన చెప్పబడిన వాటిలో మిశ్రమ కర్మధారయము సిద్ధ కర్మధారయసమాసంవలె వుండును.

**ఉదా :** కృష్ణరాయఁడు, రామరావు మొ॥

ఇట "పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబు తుది యత్వంబున కుత్వంబగు" (బాల.తత్సమ - ) అని తెల్పిన ఉత్వాంరాదు. సిద్ధ సమాసంలాగా ప్రాతిపదికతోడనే వుండును.

**6) క్రొత్తాదులు లుప్తవిశేషంబులు దేశ్యంబులతోడంబులెఁ తత్సమంబులతోడంగొన్నియెడఁల గర్మధారయంబగు - (సమాస - 7)**

దేశ్యపదాలతో చేసిన కర్మధారయంలాగా తత్సమ కర్మధారయం క్రొత్తాదుల్లో వస్తుందని అర్థం.
ఉదా : క్రొంబులకలు.
ఇచ్చట 'క్రొత్త' ఆచ్ఛికం. 'పులకలు' తత్సమం. మిశ్రసమాసమౌతుంది.

**7) ధాతుజ విశేషణంబులు తదార్థ కావ్యంబు తోడం గర్మధారయంబగు**

ధాతుజలి విశేషణము 'అట్లు' అనే అవ్యయంతో కర్మధారయసమాసాన్ని పొందుతుందని యర్థం.

**ఉదా :** వేదముల్ సదువునట్లు

"చదువు" అనేది ధాతుజ విశేషణము. అట్లు తథార్థకావ్యయము. 'చదువునట్లు' కర్మధారయసమాసము.

**9. గుణవాచకంబులను గూర్చి వివరింపుము ?**

విశేష్యము యొక్క గుణాన్ని తెలియజేసేది గుణవాచకమవుతుంది.

**1) గుణవాచకంబులు కొన్నింటి నిగాగమంబునకు బరుషంబులు పరంబగునపుడు బిందువగు' (సమాస - 13)**

కొన్ని గుణవాచకాల నిగామమునికి పరుషంపరంగా వుంటే బిందువు వస్తుందని అర్థం.

**ఉదా :** కమ్మందేనె

'కమ్మనైన తేనె' అనే అర్థంలో 'కమ్మ + తేనె' అని వుంటే నిగాగమంతో కమ్మని + తేనె అని అయ్యింది. 'ని' అనే దానికి ప్రస్తుత సూత్రంతో బిందువువచ్చి 'కమ్మఁదెనె, కమ్మందేనె' అనే రూపాలవుతాయి. (ఆచ్ఛిక సమాసంబులందఅచుగడవర్ణలోపాగమా దేశవికారంబులు నిత్యవైకల్పికములుగాఁ బెక్కులు గానంబడియెడి (సమాస - 36) అని 'త' కారానికి దకారం వచ్చింది)

**2) గుణవాచకంబు క్రియావిశేషణంబగుచో నెక్కడ నవర్ణకంబునకు బిందువు గానంబడియెడి (సమాస - 4)**

గుణవాచకంబు క్రియావిశేషణంగా మారేటప్పుడు నవర్ణకానికి బిందువు వస్తుందని అర్థం.

**ఉదా :** చక్కంగన్

చక్క గుణవాచకం. "నవర్ణకంబు గుణవాచకంబులగు నల్లాదులకగు" (బాల-తద్ధి - 6) అని నవర్ణకంవచ్చి దానిపై

'కన్' అనేది క్రియావిశేషణంగా మారేటప్పుడు వేరి నవర్ణానికి బిందువుపస్తే 'చక్కంగన్' అని అయ్యింది.

**3) ఒకానొకచో గుణవాచక ధాతుజవిశేషణంంబు లవయవ విశేష్యపూర్వకంబులయియద యవితోసమసించెడి (సమాస - 15)**

ఒకానొకచో గుణవాచకములన్నూ, ధాతుజ విశేషణములున్నూ అవయవవాచకమైన విశేష్యమును పూర్వమందుగలవై అవయ విదారక శబ్దంతో సమాసాన్ని పొందుతాయని అర్థం.

**ఉదా :** ఒడలు తెల్లని తురగోత్తము.

ఇచ్చట 'ఒడలు తెల్లని అని అనగా తెల్లని యెడలుగల అనియర్థము. "తెల్లని గుణవాచక విశేషణము. ఒడలు అవయవము. తురగోత్తమము అవయతి. తెల్లని అనునది ఒడలు అనే విశేష్యము ముందుగల దైతురగోత్తమము అను విశేష్యముతో సమాసము చెందును.

**10. ద్వంద్వ సమాస విశేషాలను వివరింపుము ?**

సమాసంలో వున్న రెండు పదాలకు సమానమైన ప్రాధాన్యముంటే అది ద్వంద్వసమాసమవుతుంది.

**ఉదా :** తల్లిదండ్రులు

**1) కొన్నియెడల మహద్ద్వంద్వంబునం బూర్వపదాంత్య స్వరంబునకు దీర్ఘంబునుం జూపట్టెడు (సమాస - 28)**

ద్వంద్వ సమాసాల్లో రెండు మహద్వాచకాలుగానీ, రెండు మహతీ వాచకాలుగానీ, ఒక మహతీవాచకము వేరొకటి మహద్వాచకంగానీ అయినచో కొన్నిచోట్ల పూర్వపదము చివరలో ఉన్న స్వరానికి దీర్ఘమునూ వస్తుందని అర్థం.

**ఉదా :** 'అన్నాదమ్ములు (రెండూ మహద్వాచకాలే )
అప్పాచెల్లెండ్రు (రెండూ మహతీవాచకాలే)
తల్లీదండ్రులు (పూర్వపదం మహతీవాచకం. ఉత్తరపదం మహద్వాచకం)

**2) ఒకానొకచో ద్వంద్వబునం బూర్వపదంబు క్లీబసమంబగు. అగుచో మువర్ణకంబునకు లోపంబగు (సమాస - 29)**

ద్వంద్వ సమాసాలు కొన్నింటిలో పూర్వపదం నపుంసక లింగసమం వుండవచ్చుననీ, ఆ ము వర్ణానికి లోపం కూడా వచ్చుననీ అర్థం.

**ఉదా :** అందచందములు

పూర్వపదము "అందము" క్లీబసమం. మువర్ణకలోపంతో అందచందములు అని అవుతుంది.

**3) ద్వంద్వంబు ప్రాణివాచక కృదందశబ్ద ఘటితం బేకవచనాంతంబునగు (సమాస - 30)**

అప్రాణివాచక శబ్దములతో చేయబడిన ద్వంద్వసమాసమున్నూ కృదంతశబ్దములతో చేయబడిన సమాసమున్నూ, ఏకవచనంలో కూడ వుండవచ్చని అర్థం.

**ఉదా :** కూడుగుడ్డ (రెండూ అప్రాణివాచకాలే)

కూడుగుడ్డలు అని బహువచనంలోనూ వుండవచ్చును.

**4) భావద్వంద్వంబునందోలి పదంబు టవర్ణకంబునకు లోపంబగు (సమాస - 31)**

బావార్థకంలో ఏర్పడిన ద్వంద్వసమాసంలోని పూర్వపదంలో వున్న టవర్ణకానికి లోపం వస్తుందని అర్థం.

టవర్ణకంబిట(గ్ర)త్ప్రత్యయంబున కుపలక్షణంబు.

**ఉదా :** ఔగాములు

అవుట + కామి = ఔట + కామి = ఔగామి = ఔగాములు, వచ్చురాములు (వచ్చుట + రామి)

### 5) ద్వంద్వంబునం బూర్వపదాంత్యాయంబునకు లోపంబొండెనగు (సమాస - 32)

ద్వంద్వసమాసంలో పూర్వపదంలోని అంత్యావవానికి లోపం కొన్నిచోట్ల వస్తుందని అర్థం.

**ఉదా :** పుట్టు గ్రుంకుగట్లు

పుట్టుగట్టు + క్రుంకుగట్లు = పుట్టుగ్రుంకుగట్లు

### 6) ఒకానొక ద్వంద్వంబు మిశ్రంబుగను(యందలి పూర్వపదంబు క్లీబసమంబు ను గానంబడియెడి (సమాస - 33)

కొన్నిచోట్ల ద్వంద్వసమాసమున్నూ, పూర్వపదం క్లీబసమముగన్నూ కలదని యర్థం.

**ఉదా :** అనవసరమక్కరలు

'అవసరము' అని పూర్వపదం తత్సమం. 'అక్కర' ఆచ్ఛికం. మిశ్రద్వంద్వము. పూర్వపదం 'ము' వర్ణకంతో వుంది.

**- డాక్టర్ పుల్లాభట్ల వెంకటేశ్వర్లు**

**పాఠం - 7**

# ప్రౌఢవ్యాకరణం
# సూత్రవివరణం - 1
# 1. సంజ్ఞాపరిచ్ఛేదం

### 1. ఒకచో హ్రస్వంబు దీర్ఘం బగు.

(సం.3) 'నిర్దేశవిధానంబులం గారేఫప్రత్యయములు రానియెడల హ్రస్వమునకు దీర్ఘము వచ్చునని యర్థము'. అని సూత్రం అర్థాన్ని సూత్రకర్తే వివరించాడు.

'నిర్దేశవిధానోచ్చారణంబులం దఱచుగ అవర్ణాదులు కారప్రత్యయాంతంబులును రవర్ణ మిఫ ప్రత్యయాంతంబు నగు' అనేసూత్రంచేత అ మొద లయినవర్ణాలకు 'కార' అనేప్రత్యయమూ 'ర' అనేవర్ణానికి 'ఇఫ' అనే ప్రత్యయమూ విధింపబడ్డాయి.దేనికి విధింపడుతుందో అది నిర్దేశం. (దానికి) ఏది విధింపబడుతుందో అది విధానం.

నిర్దేశమో లేదా విధానమో అయినవర్ణాలు హ్రస్వా లయితే వాటికి కార, ఇఫ అనేప్రత్యయాలు రానపుడు దీర్ఘం వస్తుం దని సూత్రానికి అర్థం.

లకారమునకు రేఫము వచ్చును. ఈవాక్యంలో 'ల' అనేవర్ణం నిర్దేశం. దానికి విధింపబడిన 'ర' అనేవర్ణం విధానం. నిర్దేశవిధాన – అనేసూత్రంచేత 'ల' వర్ణానికి కార ప్రత్యయ మై లకారము, 'ర' వర్ణానికి ఇఫ అనేప్రత్యయం వచ్చి రేఫము, అని అవుతుంది.

ప్రస్తుతసూత్రంసామర్థ్యంచేత కార, ఇఫ లు రాక, ల– ర అనేవర్ణాలకు దీర్ఘం వచ్చి ' లాకు రా వచ్చును' అని వ్యవహరించవచ్చును. 'అదంగ్వాదులడాకు–మొ.

'ఒకచో' అనేపదానికి 'నిర్దేశవిధానంబుల' అని సూత్రకర్త అర్థం చెప్పాడు. కాబట్టి ఉచ్చారణంలో దీర్ఘం రాదు. 'అ' కారము అనేఅర్థంలో 'ఆ' అనగూడదు.

'ఒకచో' అనేదళంచేత దీర్ఘం రావడం అరు దని గూడా గ్రహించాలి.కాబట్టి 'లకారమునకు రేఫ మగును' అనేవిధంగా కార– ఇఫలు వచ్చినప్రయోగాలే అధికంగా ఉంటాయి.

'ఒకచో' అనేదళంచేత ఈసూత్రంప్రకారం ఒకపక్షంలో కార, ఇఫ ప్రత్యయాలు రా వనీ, అపుడు దీర్ఘం వస్తుం దనీ, సూత్రకర్తవివరణంవల్ల తెలుస్తున్నది. కాబట్టి కార, ఇఫలు వచ్చినపుడు దీర్ఘం రాదు. 'లాకారమునకు ళాకారము వచ్చును' అనేవిధంగా ఉండదు.

'హ్రస్వంబు' అనడంచేత నిర్దేశవిధానవర్ణాలు దీర్ఘా లయితే వాటికి ఈకార్యం కలగదు. ఐకి ఔ వచ్చును.

(దీర్ఘంబు)'అగు' అనడంచేత దీర్ఘం రావడం నిత్యం. కాబట్టి 'ల కు ర వచ్చును' అని కార, ఇఫ లూ, దీర్ఘమూ ఏదీ రాకుండా ఉండడానికి వీలు లేదు.

నిర్దేశవిధానవర్ణాలు అనేకం అయితే కార, ఇఫ, దీర్ఘాలు ఏవీ రాకపోవడం గమనించవచ్చు. 'కచటతపలు పరుషంబులు, పరుషములకు గసడదవలు' మొ. ఇట 'కకారచకార- ఇత్యాదిగా, లేదా 'కాచాటాతా- ఇత్యాదిగా గాని ఉండదు.

'దీర్ఘ స్యా ద్వర్ణనిర్దేశే' అనేవికృతివివేకలక్షణం దీనికి మూలం.

## 2. దీర్ఘంబు దీర్ఘంబ. (సం.4)

'నిర్దేశనిధానవిషయము లైనవర్ణములు దీర్ఘము లయ్యె నేని యవి యట్లే యుండు నని యర్థము' అని సూత్రార్థాన్ని సూత్రకర్త పేర్కొన్నాడు.

నిర్దేశవిధానోచ్చారణంబులం దఱచుగ అవర్ణాదులు కారప్రత్యయాంతములును రవర్ణ మిఫ ప్రత్యయాంతము నగు' అనేసూత్రం అ మొద లయినవర్ణాలకు కార అనేప్రత్యయమూ, ర అనేవర్ణం ఒక్కదానికి మాత్రం 'ఇఫ' అనేప్రత్యయమూ విధించింది.

'ఒకచో హ్రస్వంబు దీర్ఘం బగు' అనేసూత్రవివరణాన్ని అనుసరించి ప్రస్తుతసూత్ర అర్థం ఇలా గ్రహించాలి.

నిర్దేశం లేదా విధానం, అయినవర్ణం దీర్ఘం అయితే, దానికి కార (ఇఫ) అనేప్రత్యయాలు రానిపక్షంలో ఆదీర్ఘాలు దీర్ఘాలుగా అలాగే ఉంటాయి. వాటికి ఏవిధ మయినమార్పు కూడా రాదు.

ఐకి ఔ వచ్చును. ఇందులో 'ఐ' అనేవర్ణం నిర్దేశం, 'ఔ' అనేవర్ణం విధానం.'నిర్దేశ విధాన - అనేసూత్రంచేత కారప్రత్యయం వస్తే 'ఐకారమునకు ఔకారము వచ్చును' అని వ్యవహరింపబడుతుంది.

ప్రస్తుతసూత్రంచేత కారప్రత్యయం రానిపక్షంలో ఇంక ఏమార్పూ రాక దీర్ఘం దీర్ఘంగానే ఉండి ఐకి ఔ వచ్చును.

'దీర్ఘంబు' అనేదళంచేత నిర్దేశవిధానవర్ణాలు హ్రస్వా లయితే యీసూత్రం దగ్గర ప్రసక్తి లేదు. 'ఒకచో హ్రస్వంబు దీర్ఘం బగు' అనేసూత్రంచేత దీర్ఘం వస్తుంది.

'దీర్ఘంబు- అ' అనేచోటిఅవధారణార్థకం (అ) చేత దీర్ఘానికి ఏమార్పూ రాదు.

'ఒకచో హ్రస్వంబు దీర్ఘం బగు' అనే సూత్రంచేతనే దీర్ఘానికి ఏమార్పూ లేకపోవడం సిద్ధిస్తున్నది. దీర్ఘానికి మార్పును చెప్పేలక్షణం వేరుగా లేదు. కాబట్టి దీర్ఘం దీర్ఘమే అని సూత్రించవలసిన అవసరం లేదు. అయితే దీర్ఘం మీద కార, (ఇఫ) ప్రత్యయాలు రానిస్థితిని సాధించడం ప్రయోజనం అనాలి. కాని నిర్దేశవిధానోచ్చారణంబుల అనేసూత్రంలోని తఱచుశబ్దంచేత ఉచ్చారణంలో మాత్రమే కాక నిర్దేశవిధానాల్లో గూడా కార, ఇఫలు రానిస్థితిని సాధించుకోవచ్చు. అపుడు ఈసూత్రం చెప్పడంవలన ప్రయోజనం ఏమీ లేదు అని చెప్పక తప్పదు.

**3. ఒకానొకచో జకారం బుభయంబు నగు.** (సం.5)

ఈసూత్రం అర్థాన్ని సూత్రకర్తే వివరించాడు. శ్లేషయందు జకార మొక్కటియ యొకయర్థమున దంత్యమును, వే ఱొకయర్థమున దాలవ్యము నయ్యెడు నని యర్థము.

తెలుగులో 'చజ'లు తాలవ్యమూ, దంత్యమూ అని రెండురకాలు. ఎక్కడిది తాలవ్యమో, ఎక్కడిది దంత్యమో చిన్నయసూరి పేర్కొన్నాడు. ఒకేచోట రెండూ కావడాన్ని ఈసూత్రం విశేషంగా చెప్తున్నది.

శ్లేషస్థలంలో అంటే అనేక మయినఅర్థాలు ఉన్నచోట ఉన్నజకారం ఒకటే ఒక అర్థంలో తాలవ్యమూ, మరొక అర్థంలో దంత్యమూ రెండూ అవుతుంది అని సూత్రార్థం.

ఉదా. 'పాండురాజయశ మెన్న వైతి'.

రామాయణార్థంలో 'పాండుర అజయశము' అని విభాగం. అజశబ్దం సంస్కృత(సమ)ం. సంస్కృతంలో దంత్యచజలు లేవు. ఉన్నవి తాలవ్యాలు మాత్రమే. అందుచేత 'అజ' అనేసంస్కృత(సమ)శబ్దంలోనిజకారం తాలవ్యం.

భారతార్థంలో 'పాండురాజ (యశ మెన్న వైతి)' అనేచోట రాజశబ్దంలోనిజకారం దంత్యం. ఇదికూడా సంస్కృత(సమ)మే. అయినా 'మఱియు రాజు శబ్దం బొక్కటి దంత్యయుక్తంబు గానంబడియెడి' అని చిన్నయసూరి సంస్కృతసమ మయినా రాజుశబ్దంలో మాత్రం జకారం దంత్యం అన్నాడు. వైకృతచంద్రిక, మొ. పూర్వవ్యాకరణాలు కూడా రాజు జకారం దంత్య మని చెప్పాయి.

కాగా 'పాండురాజయశము' అనేచోట ఉన్నజకారం భారతార్థంలో దంత్యమూ, రామాయణార్థంలో తాలవ్యమూ ఉభయం అయింది. కాబట్టి ఇది ఉభయ మని ప్రౌఢవ్యాకర్త అభిప్రాయం.

'రాజు' అనేవిధంగా ఉదంత మయినపుడే ఇక్కడి జకారం దంత్యం.రాజా, రాజవు ఇత్యాదిస్థలాల్లో జకారం తాలవ్యమె, అని సూరి అభిప్రాయంగా విమర్శకులు గుర్తించారు. 'రాజ' అన్నపుడు జకారం దంత్య మనడం భ్రాంతి అని చెప్పాడు అప్పకవి. కాగా ఈఉదాహరణంలో జకారం రెం డర్థాలలోనూ తాలవ్యం ఒక్కటి మాత్రమే అయింది. అందుచేత ఉభయం కావడానికి ఇది సరి యైన లక్ష్యం కాదు.

ధర్మరా జితరక్షమాపాల మొ. ఇక్కడ ఉదాహరింపవచ్చు. ( ధర్మరాజు ఇతర –రాజులో జకారం దంత్యం. ధర్మరాజిత రక్ష – రాజిత లో జకారం తాలవ్యం.)

'ఒకానొకచో' అంటే శ్లేషలో మాత్రమె కాబట్టి రెం డర్థాలు లేనిచోట జకారం దంత్యమో, తాలవ్యమో ఏదో ఒకటే అవుతుంది. కాని ఉభయం కాదు. 'శ్లేషయందు' అనే సూత్రంలో చెప్తే స్పష్టంగా ఉండేది.

'జకారంబు' అనడంచేత 'చ' కారానికి ఇటువంటిఉభయస్థితి లే దని అర్థం. కాని 'పంచదార వెనుదీయగ' అనే విజయవిలాసప్రయోగంలో చకారం కూడా ఉభయం అయింది. పంచ–దార అయిదుగురిభార్య అనే అర్థంలో సంస్కృత మయిన 'పంచ' శబ్దంలో చకారం తాలవ్యం. చక్కెర అనే రెండవఅర్థంలో అచ్చతెలు గయిన 'పంచదార' శబ్దంలో (అకారంతో కూడిఉన్నది కాబట్టి) దంత్యం.

చకారం కూడా ఇలా ఉభయం అయినస్థితి ఉంది, కాబట్టి సూత్రంలో 'జకారంబు' అని జకారం ఒక్కదానినే చెప్పడం సరి గాదు.

'ఉభయంబును' అనేచోటిసముచ్చయంచేత ఇటువంటిస్థలాలు కవిప్రయోగాలలో అరుదుగా ఉన్నట్లు గ్రహించవచ్చు.

'ఉభయము' అంటే ఒకేసారి దంత్యతా, తాలవ్యతా రెండూ కలిసిన ఉచ్చారణం ఉంటుంది అని అర్థం. కాని ఒక్కొక్కఅర్థంలో దంత్యమో, తాలవ్యమో ఏదో ఒక్కటే అవుతున్నది కాని ఒకేసారి చజలు ఉభయం కావడం లేదు.

కాగా ఈలక్షణం లక్ష్యవిరుద్ధం అనక తప్పదు.

**4. నకారం బసాధారణంబు ద్రుతంబు.** (సం. 7)

సూత్రార్థాన్ని సూత్రకర్తే వివరించాడు ఇలా. 'ప్రత్యయాగమావ్యయాత్మక మై యుత్వవిశిష్ట మయిననకారంబు ద్రుతసంజ్ఞకం బని యర్థము. ఇది 'విభక్త్యాగమ చార్థో ను ద్రుతః' అనే సూత్రాంధ్రవ్యాకరణసూత్రానికి అనువాదం.

'నకారంబు ద్రుతంబు' అనేబాలవ్యాకరణలక్షణం సాధారణంగా నకారానికి ద్రుతం అనేసంజ్ఞను చెప్పినట్లుగా తోస్తుంది. పరుషాదిసంజ్ఞలవలె ఈద్రుతసంజ్ఞ నకారానికి సాధారణంగా అంటే అన్నిచోట్లా చెల్లదు.

అసాధారణం అంటే కొన్ని విశేష మయినలక్షణాలు కలిగినపుడే నకారం ద్రుతం అవుతుంది. ఆవిశేషలక్షణాలు ఇవి. 1. నకారం ఉత్వంతో కూడిఉండాలి. అంటే 'ను' అనేది ద్రుతం. 2. ఆ ను వర్ణం ప్రత్యయమో లేక ఆగమమో లేక అవ్యయమో ఈమూడింట్లో ఏదో ఒకటి కావాలి. అపుడే నకారం ద్రుతసంజ్ఞను పొందుతుంది.

**1. ప్రత్యయనువర్ణం** – తాను, నేను. ఇక్కడ 'ను' వర్ణం ప్రథమావిభక్తి ప్రత్యయం.

ధనమును – ద్వితీయావిభక్తి. నామవిభక్తి.

చదువుచున్నాను – ఇక్కడ 'ను' ఉత్తమపురుషైకవచనం. క్రియావిభక్తి.

**2. ఆగమనువర్ణం** – నాచేతను మొ. ఈ నువర్ణం 'తృతీయాదులకు నుగాగమం బగు' అని ఆగమంగా వచ్చింది. కాబట్టి ఆగమం.

**3. అవ్యయనువర్ణం** – అన్నయును, తమ్ముడును. సముచ్చయం మొద లయిన అర్థవిశేషాలను తెలియజేసే 'ను' అనేది అవ్యయ మయిన ప్రత్యేకపదం. అదీ ద్రుతమే.

వలెను, పోలెను మొ. అవ్యయాలలోని 'ను' వర్ణం ప్రత్యేకంగా అవ్యయం కాదు. ఇది ప్రత్యయం కానీ, ఆగమం కానీ కూడా కాదు. అవ్యయ అవయవం. వలె మొద లయిన అవ్యయాలలో చివరి ను వర్ణం ద్రుతం.

ద్రుత మయిన ఈనువర్ణం ఇకారాదులపై ఉండి 'ని' అని మారినా, లేదా ను,ని లలో అచ్చు లోపించి నకారపుపొల్లుగా (న్) ఉన్నా 'ఏకదేశవికృత మనన్యవత్' అనేన్యాయా న్ననుసరించి ద్రుతమే అవుతుంది. హరిని, పైన్. మొ.

అదియును(న్) కాక మొద లయినస్థలాల్లో 'కొన్నియెడల ద్రుతంబుమీద నకారంబు గానంబడియెడి' అనేసూత్రంచేత పొల్లనకారమే వస్తుంది. ఇది నువర్ణవికారం కాదు. అయినా ద్రుతమే. అదియునున్గాక.

'ద్రుత మనగా నొల్లనియెడ మఱిగిపోవునది' అని సూత్రకర్త ఈసంజ్ఞకు అర్థం చెప్పాడు. ఇది అవ్యాప్త్యాది దోషరహితం అనలేం. ద్రుతం లోపింపవచ్చు.

'అవసానంబునందు ద్రుతస్వరంబున కేని ద్రుతంబున కేని లోపంబు బహుళంబుగా నగు' అనేసూత్రంచేత ద్రుతంలో అచ్చు లోపింపవచ్చు. వచ్చెన్, హరిన్. ద్రుతమే లోపింపవచ్చు. వచ్చె హరి.ఆసూత్రంలోనిబహుళపదంచేత ఉన్నాను మొద లయినచోట్ల లోపం రాదు. ఉన్నాన్, ఉన్నా ఇత్యాదిగా కవిప్రయోగాలు కనబడవు.

'నకారంబు' అనడంచేత ప్రత్యయాదు లయినా నకారం కానిదానికి ద్రుతసంజ్ఞ లేదు. రామునకు – హరికి. మొ.

'అసాధారణంబు' అనడంచేత ప్రత్యయాదిలక్షణాలు లేని సాధారణ మయిన నకారానికి ద్రుతసంజ్ఞ ఉండదు. చేను, మి న్నదు మొ.

### 5. అకప్రత్యయాంతావ్యయంబు కళయ.

(సం. 8)

సూత్రార్థాన్ని సూత్రకర్తే ఇలా వివరించాడు. 'వ్యతిరేకార్థక భూతకాలికాసమాపక క్రియ ద్రుతప్రకృతికము కా దని యర్థము'.

లింగ, విభక్తి, వచనాలు లేనిపదం అవ్యయం. 'కజీ వ్యతిరేకక్త్వార్థంబునం దగు' ఇత్యాదిగా వ్యతిరేకక్త్వార్థంలో విధింపబడిన 'క' అనేప్రత్యయమూ, దానికి ముందుగా ధాతువు చివర వచ్చే 'అ'త్వమూ కలిపి 'అక' ప్రత్యయంగా వ్యాకర్త పేర్కొంటున్నాడు. అక ప్రత్యయం చివర కలిగిన అవ్యయం, అక ప్రత్యయాంతావ్యయం. ద్రుతాంతము లయినపదములు ద్రుతప్రకృతికములు, కాగా ద్రుతప్రకృతులు కానిశబ్దంబులు కళ లనం బడును.

'అక' అనేప్రత్యయం చివర కలిగిఉన్న వ్యతిరేకక్త్వార్థక మయిన అవ్యయం కళ మాత్రమే అవుతుం దని సూత్రార్థం. ఎప్పుడూ ద్రుతప్రకృతికం కా దని తాత్పర్యం.

వైకృతచంద్రిక, తెలుగువ్యాకరణం మొద లైన పూర్వవ్యాకరణగ్రంథాల్లో ఇటువంటివి వైకల్పికద్రుతప్రకృతికాలుగా పేర్కొనబడ్డాయి. కొట్టక, తిట్టక అనే (అ) కప్రత్యయాంతాలను కళలలో ఉదాహరించి చిన్నయసూరి ఇవి ద్రుతప్రకృతికాలు కా వనీ, కళ లవుతా యనీ చెప్పాడు. దాన్నే యీసూత్రం ఇంకా వివరంగా చెప్తున్నది.

ఉదా. కా దన కిట్టి. అనక (అను – అక) అనేది అనుధాతువుయొక్క అకప్రత్య యాంతరూపం. ఇది ద్రుతప్రకృతిక మైతే 'ఇకాదులకు దప్పు – అని సంధి రాదు. కాబట్టి 'అనక నిట్టి' అని కావాలి. 'అన కిట్టి' అని సంధి జరగడాన్నిబట్టి 'అక' కళే. అత్తునకు సంధిగా 'చూడ కుండెను' అని ఉదాహరించి సూరి ఈవిషయాన్నే చెప్పాడు.

తొరంగ నీక తొలగ, లేక తగ. ఇక్కడ ఈక (ఇచ్చు– క) లేక (కలుగు – క) అనేవి అకప్రత్యయాంతాలు. పరుషం పరంగా ఉండగా ద్రుతకార్యాలు లేకపోవడాన్ని బట్టి (ఈకఁ దొలగ, లేకఁ దగ) వీటికి చివర ద్రుతం లేదు.పరుషం పర

మైనపుడు వ్యస్తతలో ద్రుతానికి లోపం రాదు. కాబట్టి సహజంగానే చివర ద్రుతం లే దని గ్రహించాలి. ద్రుతాంతాలు కావు, కాబట్టి ద్రుతప్రకృతికాలు కావు. కాబట్టి యివి కళలు.

అచ్చు పరంగా ఉండగా సంధి, పరుషం పరంగా ఉన్నపుడు ద్రుతకార్యాలు రాకపోవడాన్నిబట్టి అక ప్రత్యయాంతం కళ మాత్రమే అవుతుం దని గ్రహించాలి.

'ఆధారము లేకను' అనే నన్నయప్రయోగంలో 'లేక' అనేఅకప్రత్యయాంత కళాపదంమీద అర్థవిశేషంలో 'ను' అనే మరో అవ్యయపదం చేరి లేకను అని ద్రుతాంత మయింది. రాముడు(ను) అన్న(యును) మొ. వానివలె లేక(ను) కళే.

'అక ప్రత్యయాంత' అనడంచేత చూచుచున్, చూచినన్, మొ. ఇతరప్రత్య యాంతాలకు ఇట ప్రసక్తి లేదు. అవి ద్రుతప్రకృతికాలు కావచ్చు.

'అవ్యయంబులు' అనడంచేత అకప్రత్యయాంతాలే అయినా అవ్యయాలు కాని గీఱకము, మాఱకము మొ. వాని కిట ప్రసక్తి లేదు.

'కళయ' (కళ – అ) అనుచోటిఅవధారణార్థకంచేత ఇవి ఎప్పుడూ (వైకల్పికంగా కూడా) ద్రుతప్రకృతికాలు కా వని అర్థం.

బాలవ్యాకరణం ఈవిషయం చెప్పిఉండడంచేత ప్రస్తుతలక్షణం చెప్పకుంటే భాషకు అనర్థం లేదు. సిద్ధార్థానువాద మైన ఈలక్షణం స్పష్టత కనుకోవాలి.

### 6. కారము క్షారశబ్దభవము. (సం. 10)

తెలుగులో ఉన్న కారము అనేశబ్దం సంస్కృతంలోని 'క్షార' అనేశబ్దంనుంచి పుట్టిం దనీ, కాబట్టి (సంస్కృతభవం) తద్భవం అనీ సూత్రానికి అర్థం.

చిన్నయసూరి 'సంస్కృతప్రాకృతతుల్యం బగుభాష తత్సమంబు' అని సూత్రించి కటుః (సం) కారో (ప్రా) కారము అని ఉదాహరించాడు. అంటే తెలుగులోని కారము అనేశబ్దం ప్రాకృతంలోని కారో అనేశబ్దంనుంచి (ప్రాకృత)సమంగా వచ్చిం దనీ, కాబట్టి యిది తత్సమ మనీ చిన్నయసూరిమతం.

సూరిమతం – తత్సమం – కారో అనే ప్రాకృతశబ్దంనుంచి యిది తెలుగులోకి వచ్చింది.

ప్రౌఢమతం – తద్భవం – క్షార అనే సంస్కృతశబ్దం నుంచి పుట్టింది.

క్షారశబ్దంనుండి పుట్టిం దనడానికి వ్యాకర్త కారణాలు ఇలా చెప్తున్నాడు.

కార అనేతెలుగుశబ్దానికి 'క్షార' అనేరసంస్కృతశబ్దంతో రూపసామ్యం ఉన్నది. కటుశబ్దంతో పోలిక లేకపోవడంవల్ల కారము కటుశబ్దభవం అనడం కుదరదు. కాబట్టి మూలరూపాన్ని ప్రాకృతంనుండి గ్రహించవలసివచ్చింది సూరికి.

క్షార – కార శబ్దాలకు అర్థంలో కూడా సామ్యం ఉంది. 'క్షారలవణవర్జనం చ' అనే ఆపస్తంబసూత్రంలో లవణం వేరుగా చెప్పడంవల్ల ఇక్కడ క్షారం అంటే కారం అని అర్థం. కాబట్టి కారము అనేదానికి మూలసంస్కృతశబ్దం 'క్షార' అని చూపాలి. సూరి కటుశబ్దం చూపడం సరి కాదు.

శబ్ద-అర్థాలు రెండూ సరిపోవడంచేత కారము క్షారశబ్దభవం, తద్భవం అని ప్రౌఢవ్యాకర్త నిర్ణయం.

కాని క్షారశబ్దానికి అర్థం కారం కా దనీ, కొన్ని రకా లయిన పప్పుదినుసు లనీ వ్యాఖ్యాతలు చెప్పారు. ముఖ్యంగా లోక(కావ్య)వ్యవహారంలో క్షారశబ్దం కటుశబ్దానికి పర్యాయంగా లేదు. తత్సమ, తద్భవాలు లోకవ్యవహారంలో ఉన్నశబ్దాలనుంచి ఏర్పడతాయి గానీ, నిఘంటువుల్లోనో మ రేమారుమూలగ్రంథాలలోనిశబ్దాలనుంచో ఏర్పడవు.

రూపం, అర్థం రెండింటితో సామ్యంతో 'కారో' అనేప్రాకృతశబ్దంనుంచి తత్సమంగా కారము వచ్చిం దనే సూరిమతమే యుక్తం. తత్సమం అయినా ప్రాకృతసమం కాబట్టి కారము ఆచ్ఛికమే.

### 7. కోటపేఁటలు వైకృతములు. (సం. 11)

వైకృతం అంటే ఇక్కడ తద్భవం (సంస్కృతభవం) అని గ్రహించాలి. తెలుగులోని కోట, పేఁట అనేశబ్దాలు సంస్కృతంనుంచి వచ్చిన వనీ, తద్భవా లనీ సూత్రానికి అర్థం.

చిన్నయసూరి 'త్రిలింగదేశవ్యవహారసిద్ధం బగుభాష దేశ్యంబు' అని సూత్రించి ఉదాహరణల్లో కోట, పేట అని చూపాడు. కాబట్టి కోట, పేటలు దేశ్యా లని సూరిమతం. అవి దేశ్యాలు కా వనీ, సంస్కృతభవా లనీ, ప్రౌఢవ్యాకరణం సవరిస్తున్నది.

'కోట్టారఘట్ట హట్టా శ్చ' అనే అమరత్రిలింగశేషనిఘంటువాక్యాన్ని అనుసరించి సంస్కృతంలో కోట్ట అనేశబ్దం ఉన్నట్లు తెలుస్తున్నది. 'కోట్ట' అనే ఆసంస్కృతశబ్దంనుంచి తద్భవంగా తెలుగులో 'కోట' అనేశబ్దం పుట్టింది. ఇది స్త్రీసమం. కోట, కోటలు మొ.

కోట్ట అనేశబ్దంతోపాటే సంస్కృతంలో 'కోట' అనేశబ్దం కూడా ఉంది. దానినుంచి అయినా తెలుగు 'కోట' తద్భవంగానే ఏర్పడుతుంది. ఇది సంస్కృత'కోట'తో తుల్యంగా ఉన్న దని తత్సమం అనుకోగూడదు. సంస్కృతంలోని 'కుండ' శబ్దంనుంచి తుల్యరూపంతో తెలుగులో 'కుండ' అనేది తద్భవంగా ఏర్పడినట్లు సంస్కృతం కోట నుంచి ఏర్పడే తెలుగు కోట కూడా రూపం సమ మయినా తద్భవమే అవుతుంది.

కోట్టనుంచి వచ్చినా, కోటనుంచి వచ్చినా తెలుగు కోట సంస్కృతభవం. తద్భవం.

'పింఠా విటజనాశ్రయః' అనేఅమరపదపారిజాతాన్నిబట్టి సంస్కృతంలో పింఠా శబ్దం ఉంది. దానినుంచి తెలుగులో 'పేఁట' అనేపదం తద్భవంగా ఏర్పడింది. సంస్కృతంలో పింఠ అంటే విటు లుండేచోటు. పేఁట అంటే తెలుగులో సామాన్యంగా జనావాసం. తద్భవాలలో ఇలా మూలప్రకృతి అర్థం మారడంలో విశేషం లేదు. కాబట్టి అర్థంలో కొంచెం తేడా ఉన్నా పేఁట - పింఠా శబ్దభవమే.

సూరి దేశ్యంగా చూపిన 'పేట' శబ్దంలో అరసున్న లేదు. హారం మొ. వాటిలో వరుస అని దాని కర్థం. మూడుపేటలగొలుసు, ముప్పేటత్రాడు మొ. ప్రౌఢవ్యాకరణం తద్భవంగా చూపిన పేఁటలో అరసున్న ఉన్నది. కాబట్టి ఈశబ్దం వేరు.

కోట్ట(కోట), పింఠా శబ్దాలు లోకవ్యవహారంలో ప్రచురంగా ఉండిఉంటే వాటినుంచి తెలుగులో తద్భవాలుగా కోట, పేఁటలు ఏర్పడవచ్చు. కాని అటువంటిస్థితి కనబడటం లేదు.

**8. ప్రాణగొద్ద మగ్రామ్యంబు నాఁ దగు.** (సం.12.)

'లక్షణవిరుద్ధం బగుభాష గ్రామ్యంబు' అగ్రామ్యం అంటే గ్రామ్యం కానిది. వ్యాకరణానికి విరుద్ధం కానిది. అంటే లక్షణబద్ధ మైనది. 'ప్రాణగొద్దము' అనేశబ్దం లక్షణ విరుద్ధం కాదు. సాధుపదమే. కావ్యాలలో ప్రయోగింపదగినదే.

ప్రాణ అనేకేవలసంస్కృతశబ్దానికి గొద్దము అనేవికృతిపదంతో సమాసం చేయడంవల్ల 'ప్రాణగొద్దము' ఏర్పడింది. ఇది 'కేవలసంస్కృతశబ్దము వికృతిశబ్దముతోడ సమసింపదు' అనే లక్షణానికి విరుద్ధం. కాబట్టి గ్రామ్యం. తిక్కన ప్రయోగించడంచేత 'ఆర్యవ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు' అనే లక్షణంప్రకారం గ్రామ్య మయినా గ్రహింపదగినదే అని చిన్నయసూరిమతం.

'ప్రాణగొద్దము' అనేసమాసం గ్రామ్యం అనేసూరిమతాన్ని సవరిస్తూ ప్రౌఢవ్యాకరణం అది గ్రామ్యం కా దని ఇలా పేర్కొంటున్నది.

ప్రాణకుట్టక అనేసంస్కృతసమాసపదంనుండి ప్రాణగొద్దము అనేది తద్భవంగా ఏర్పడింది. 'హంసపదము – అంచపదము, హంసయాన – అంచయాన. అనేవిధంగా సంస్కృతసమాసం మొత్తం తెలుగులో తద్భవంగా ఏర్పడటం ఉన్నది. అలాగే ప్రాణకుట్టక నుండి ప్రాణగొద్ద పుట్టింది. యోగపాదుకా – యోగవాగె, నాగస్వరః – నాగసరము మొ. విధంగా సంస్కృతసమాసం తద్భవ మయ్యేటప్పుడు ఉత్తరపదం మాత్రమే వర్ణవికారాలు పొంది, పూర్వపదం ఏమార్పూ లేకుండా తెలుగులోకి రావడం ఉంది. హంసయాన అంచయాన అన్నచోట పూర్వపదం మార్పులు పొందింది, ఉత్తరపదంలో మార్పు రాలేదు.

ఇలా ప్రాణగొద్దం అనేది మొత్తం తద్భవంగా ఏర్పడింది కాబట్టి ప్రాణ అనేసంస్కృతశబ్దానికీ గొద్దం అనేవికృతిపదానికీ తెలుగులో సమాసం చేయడం అనేప్రక్రియ లేదు. అందుచేత లక్షణంతో విరోధం లేదు. కాబట్టి గ్రామ్యం కాదు. అగ్రామ్యం.

ఈప్రౌఢవ్యాకర్తమతం యుక్తంగానే తోస్తున్నది. 'గొద్దము' అనేపదం విడిగా తెలుగులో కనబడదు. కాబట్టి తెలుగులో సమాసం చేయడం సాధ్యం కూడా కాదు.

'ప్రాణగొద్ద మగ్రామ్యంబు' అంటే చాలు.'ప్రాణగొద్దము ప్రాణకుట్టకశబ్దభవము' అంటే ఇంకా యుక్తం.

**9. కపిలశబ్దభవము కవిలశబ్దం బొండు గానంబడెడి.**
(సం.13)

కపిల అనే సంస్కృతశబ్దంనుంచి పుట్టినదిగా, అంటే తద్భవం(సంస్కృతభవం)గా తెలుగులో 'కవిల' అనేశబ్దం ఒకటి కనబడుతున్న దని సూత్రాని కర్థం.

కపిల అనే కేవలసంస్కృతశబ్దానికి గడ్డము, జడలు, కన్నులు, అనేవికృతిశబ్దాలతో సమాసం చేయగా కపిలగడ్డము, కపిలజడలు, కపిలకన్నులు అనేరూపాలు ఏర్పడతాయి. కాని కేవల సంస్కృతశబ్దానికి వికృతిశబ్దంతో సమాసం వ్యాకరణం తిరస్కరించింది. కాబట్టి ఈసమాసాలు లక్షణవిరుద్ధా లై గ్రామ్యా లయినాయి.కాని నన్నయ ప్రయోగించడంవల్ల 'ఆర్యవ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు' అనేసూత్రంప్రకారం గ్రామ్యా లయినా గ్రహింపదగినవే అని సూరిమతం.

ఇక్కడ 'కపిల' అనేసంస్కృతశబ్దమే లేదు, కవిలగడ్డము ఇత్యాదిగా ఇక్కడ ఉన్నది కవిల అనేతద్భవశబ్దమే. రెండువికృతిశబ్దాలకు చేసినయీఆచ్ఛికసమాసాలు లక్షణబద్ధ మయినవే కావడంచేత నన్నయ ప్రయోగించినవి అసలు గ్రామ్యాలే కావు.అని ప్రౌఢవ్యాకరణం సూరిఅభిప్రాయాన్ని సవరిస్తున్నది.

ఇక్కడ నన్నయప్రయోగంలో 'అవసర – పద్యంలో వకారం ప్రాస. కవిలగడ్డము అనేప్రౌఢవ్యాకర్త పాఠం ప్రకారం 'వ' కారప్రాస సరిపోతుంది. సూరి చూపిన 'కపిల'గడ్డము అనేపాఠం ప్రకారం 'ప-వ' ప్రాస అవుతుంది. ప-వ ప్రాసను లాక్షణికులు అంగీకరించలేదు.

ప్రౌఢవ్యాకర్త పాఠంలో గ్రామ్యత్వదోషమే కాక, ప్రాసవిరోధరూప మయినమరోదోషం గూడా తొలగిపోతున్నది. కాబట్టి అది గ్రహింపదగినది.

కాని ప్రౌఢవ్యాకర్త చెప్పిన 'కవిల' అనేతద్భవశబ్దం ఇక్కడ తప్ప మ రెక్కడా కనబడడం లేదు.వేరే సమాసంలో గానీ, ప్రత్యేకంగా కానీ, కవిల అనేశబ్దం ప్రయోగింపబడినజాడ లేదు. కాగా ఈప్రయోగంకోసమే కవిలశబ్దాన్ని అంగీకరించి గడ్డము, జడలు, కన్నులు అనేశబ్దాలతో మాత్రమే సమాసం జరిగి ప్రయోగింపబడుతుం దని చెప్పాలి. ఈసమన్వయం యుక్తమా?

కపిలగడ్డము అనేసూరిపాఠమే వ్రాతప్రతుల్లో పెక్కింటిలో ఉన్నది. (అక్కడ మూడోపాదంలోనూ 'తపసి' అని ప్రాసగా 'ప' కారమే ఉంది.) కపిలశబ్దం ప్రసిద్ధమే. కానీ గ్రామ్యం కావడం, ప,వ ప్రాస కావడం అనేరెండు ఇబ్బందులు ఆపక్షంలో ఉన్నాయి.

'ఒందు గానంబడెడి' అనేమాట తద్భవ మయిన కవిల శబ్దం ఉనికివిషయంలో ప్రౌఢవ్యాకర్తకు కూడా నిశ్చయం లే దని సూచిస్తున్నది.

ఏ మయినా ఈప్రయోగస్వరూపం గూర్చి ఇంకా నిశితంగా పరిశీలించి నిర్ణయించాలి.

### 10. గ్రామ్యంబు తత్తజ్జాతివర్ణనంబునం బ్రయోగార్హం బగు.
(సం. 14)

'లక్షణవిరుద్ధం బగుభాష గ్రామ్యంబు' వ్యాకరణానికి విరుద్ధ మయిన ఈగ్రామ్యం ప్రయోగించడానికి తగ దనీ, కావ్యాలలో ప్రయోగింపరా దనీ చిన్నయసూరి స్పష్టం చేశాడు.

లక్షణవిరుద్ధ మయినా గ్రామ్యభాష ఆయాజాతులవర్ణనంలో కావ్యంలో ప్రయోగించడానికి తగినదే అని యీసూత్రం చెప్తున్నది. 'గ్రామ్యం తత్తద్విధౌ సాధు' అనే అధర్వణుడిలక్షణం దీనికి మూలం.

త త్తజ్జాతు లంటే గ్రామ్యభాష ఉపయోగించడానికి తగినగ్రామ్యజనులు మొ. జాతులు అని గ్రహించాలి. వర్ణనం అంటే ఆయాజాతిమనుషల సంభాషణావర్ణనం అని అర్థం. తత్తజ్జాతిపాత్రలస్వరూపాదులను వర్ణించేటప్పుడు అవి కవివచనా లయితే, అక్కడ గ్రామ్యం ఉపయోగించడం కుదరదు. ఆపాత్రలు సంభాషించేటప్పుడే గ్రామ్యం పాత్రోచితం అవుతుంది.

ఉదా. మొక్కేము సామి, సూసినా మేలు బాగెము సేసినాము.

ఇవి ఎఱుకలమాటలు, కాబట్టి ఆపాత్రలకు తగినట్లుగా గ్రామ్యం ప్రయోగింప బడింది. ఇటువంటిసందర్భాలలో 'మ్రొక్కెదము, ఇతని జూచినమేలు భాగ్యము సేసినారము' అనేవిధంగా లక్షణబద్ధ మయినభాష ప్రయోగిస్తే అది ఆపాత్రకు తగినవిధంగా ఉండదు. ఎఱుకలు ఇటువంటి ప్రామాణికభాష మాట్లాడడం లోకవిరుద్ధం కదా.

ఈవిధ మయినపాత్రోచితభాష యక్షగానాదికృతులలో గమనింపవచ్చు. పూర్వకావ్యాలలో పాత్రోచితంగానే అయినా గ్రామ్యప్రయోగం వెదికి పట్టుకోవలసిందే.

ప్రౌఢవ్యాకర్త ఉద్ధరించినపైస్థలాల్లోనూ నేడు లక్షణబద్ధ మయినపదప్రయోగమే కనబడుతున్నది.

లక్షణయుక్తమె అయినా లక్ష్యాలు ఎంతవఱకు సహకరిస్తాయో పరిశోధించాలి.

'గ్రామ్యంబు' అనడంచేత తత్సమ, తద్భవ, దేశ్యాలు(లక్షణబద్ధాలు) ప్రయోగించడంలో భాధ లేదు.(అసలు గ్రామ్యాలు కూడా లక్షణానికి విరుద్ధంగా ఉండే తత్సమ,తద్భవ,దేశ్యాలే అవుతాయి.)

'తత్తజ్జాతివర్ణనంబున' అనడంచేత ఉత్తమజాతిపాత్రలసంభాషణలలో గ్రామ్యప్రయోగం కుదరదు.

**11.ఒకానొకచో ననుకరణవిరహితంబుగ సంస్కృతవాక్యంబు గానంబడియెడి.**
(సం.15)

ఇతరులు పలికిన మాటలను, ధ్వనులను, వారు పలికినవిధంగా యథాతథంగా స్వీకరించి చెప్పడం అనుకరణం.

'న పదా న్యవ్యయ సుప్తిఙ్ క్త్వా తుమునామ్' అనేసూత్రంతో ఆంధ్రశబ్దచింతామణి సంస్కృతపదాలను తెలుగుతో కలిపి ప్రయోగింపరాదు అని చెప్పింది. తర్వాత 'అనుకృతే కస్తి వాక్యం తు' అనేసూత్రంతో అనుకరణంలో మాత్రం సంస్కృతవాక్యం తెలుగులో కలిపి ప్రయోగించుకోవచ్చు నన్నది. కాగా అనుకరణం లేకుండా సంస్కృతవాక్యాన్ని (పదాన్ని) తెలుగులో ప్రయోగింపరాదు అని చింతామణి నిర్ణయించింది.

'వి నానుకరణం కేచి దాద్యశబ్దం ప్రయుంజతే' అని వికృతివివేకం అనుకరణం లేకుండా కూడా సంస్కృతవాక్యం, పదం, తెలుగులో ప్రయోగింపబడడాన్ని ప్రస్తావించింది. ప్రస్తుతలక్షణం ఆఅంశాన్నే అనువదిస్తున్నది.

అనుకరణం లేకుండా సంస్కృతవాక్యం అరుదుగా ప్రయోగింపబడుతున్న దని సూత్రానికి అర్థం.

'అంటితి నమ శ్శివాయ పాపాత్మురాలి' అంటితి పాపాత్మురాలి అనేతెలుగువాక్యం మధ్యలో 'నమ శ్శివాయ' అనే సంస్కృతవాక్యం అనుకరణం లేకుండానే ప్రయోగింపబడింది. ఇలాగే 'యాగంబు లట 'నమో విశ్వసృజే' విన మింతకు' మొ.

ఇది లక్షణానికి తగినలక్ష్యం కాదు. ఇక్కడ అనుకరణం ఉండా లన్నా సంస్కృతవాక్యం తర్వాత అనుకరణం ఉండే అవకాశమే లేదు.

ఇక్కడ సంస్కృతవాక్యం మాత్రమే అనుకరింపబడడం లేదు. 'అంటితి నమ శ్శివాయ పాపాత్మురాలి' అనేది మొత్తం పాత్ర పలికినమాట. కాగా అనుకరణం ఆచివర ఉండాలి. అనుకృత మయ్యేవాక్యం పూర్తి కాకుండానే అనుకరణం ఎలా అవుతుంది. 'కిం త త్తనె' అనేస్థలంలో 'కిం అనె తత్' అని ఉంటుందా.

ప్రౌఢవ్యాకర్త చూపినరీతి ఉదాహరణస్థలాల్లో సంస్కృతవాక్యంవరకే అనుకరణం ఉండడం అసంభవం. కాబట్టి పైలక్షణానికి తగినలక్ష్యం మరొకటి వెదుక్కోవలసిందే.

'ఒకానొకచో' అనడంచేత అనుకరణం లేనిసంస్కృతవాక్యప్రయోగం అరుదు.

'అనుకరణవిరహితంబుగ' అనడంచేత అనుకరణసహిత మయినప్రయోగం సాధారణమూ, ధారాళమే.

'సంస్కృతవాక్యంబు' అనడంచేత తెలుగువాక్యం ప్రయోగించుకోవడంలో బాధ లేదు.

'కానంబడియెడి' అనడంచేత కవిప్రయోగాల్లో ఉన్నస్థలాలు మాత్రమే స్వీకరించాలి. కాని స్వతంత్రంగా సంస్కృతాంధ్రాలు కలిపి ప్రయోగింపరాదు.

ఈసూత్రం చెప్పకపోతే భాషకు నష్ట మే మయినా ఉన్న దేమో ఆలోచించాలి. అటువంటి లక్ష్యం మృగ్యం.

# 2. సంధిపరిచ్ఛేదం

## 1. ఇప్రత్యయాంతావ్యయంబునకు సంధియు జూపట్టెడి. (సంధి. 2)

అవ్యయం అంటే లింగం, విభక్తి, వచనం లేనిది. అంటే వాటికి సంబంధించిన మార్పులు లేనిది. 'సమానాశ్రయంబులం బూర్వకాలంబునం దివర్ణకం బగు' అనే సూత్రంచేత విధింపబడిన 'ఇ' అనేప్రత్యయం ఇక్కడ గ్రహింపబడుతుంది. దానినే క్త్వార్థం అంటారు. 'క్త్వార్థం బైనయిత్తునకు సంధి లేదు' అని చిన్నయసూరి ఈ ఇ ప్రత్యయానికి సంధిని నిషేధించాడు. 'క్త్వార్థేతో న భవేత్ సదా' అని అంతకు ముందు అధర్వణుడు కూడా సంధిని నిషేధించి ఉన్నాడు. ఇలా పూర్వవ్యాకరణాలచేత క్త్వార్థక మయిన ఇ కారానికి సంధి రాక పోతుండగా ప్రౌఢవ్యాకర్త ప్రస్తుతసూత్రంచేత సంధిని పేర్కొంటున్నాడు.

క్త్వార్థక మయిన ఇ కారానికి ప్రామాణికకవిప్రయోగాలలో అచ్చు పర మవుతుండగా సంధి కనబడుతున్న దని సూత్రానికి అర్థం.

అంది – ఇమ్ము. ఇక్కడ 'అందు' అనేధాతువుపై క్త్వార్థంలో ఇ ప్రత్యయం వచ్చి ( అందు–ఇ) అంది అని అయింది. ఇది ఇ ప్రత్యయాంతావ్యయం. 'క్త్వార్థం బైనఇత్తునకు' అనే నిషేధంవల్ల సంధి రాకపోతుండగా ప్రస్తుతసూత్రంచేత సంధి వచ్చి 'అందిమ్ము' అని అయింది.

'ఇప్రత్యయాంత' అనడంచేత ఇతరప్రత్యయాంతానికి ఈకార్యం లేదు. వచ్చినన్ – అతడు. వచ్చిన నతడు.

'అవ్యయంబునకు' అనడంచేత ఇ ప్రత్యయాంతం అవ్యయం కాకపోతే ఈసూత్రంచేత సంధి రాదు. ఓయారి యది, జాల రడిగెను. మొ.

'ఇప్రత్యయాంతావ్యయంబునకు' అని వివరించినా సంధి ఈఅవ్యయం చివరి ఇత్వానికే. కాబట్టి 'క్త్వార్థం బైనయిత్తునకు సంధియు జూపట్టెడి' నని చెప్తే సూటిగా ఉండేది.

'సంధియును' అనేచోటిసముచ్చయంచేత సంధి రాకపోవటమే తఱుచు. సంధి జరగడం అరు దని అర్థం. క్త్వార్థం బయినయిత్తుకు సంధి అయినప్రయోగాలు భాషలో చాల విరళంగా ఉంటా యన్నమాట. వెఱచి యిట్లు మొ. రీతి సంధి రాకపోవడం ప్రచురం.

'చూపట్టెడి' అనడంచేత కవిప్రయోగాలలో చూపట్టినస్థలాల్లో మాత్రమే యీసంధిని గ్రహించాలి. కానీ స్వతంత్రించి క్త్వార్థకేకారానికి సంధి చేయగూడదు.

అందు – ఇచ్చు. అం దిచ్చు– అం దిమ్ము. ఇదిశబ్దపల్లవం. ఇక్కడ క్స్వార్థకేకారసంధి లేదు. వెఱ చిట్లు – వెఱ నిట్లు, చెప్పంపడె – చెప్పండె, అనేపాఠాంతరాలతో ఆఉదాహరణల్లో కూడా యీసంధి లేదు. 'ఎఱిం గెఱింగి' వంటివి గ్రాహ్యాలు.

**2. చిట్టడవిఁ జిట్టి.** (సంధి. 4)

'చిట్టడవి, చిట్టెలుక మొ. వాటిల్లో పూర్వపదం చిట్టిశబ్దం అని సూత్రానికి అర్థాన్ని సూత్రకర్తే వివరించాడు.

చిన్నయసూరి 'చిట్టెలుక' అనేదాన్ని చిఱు–ఎలుక అని విడదీసి 'కుఱు చిఱు కదు నదు నిదు శబ్దంబుల అదల కచ్చు పరం బగునపుడు ద్విరుక్తటకారం బగు' అని 'చిఱు'లో 'ఱు' వర్ణంస్థానంలో 'ట్ట్' ఆదేశ మై (చిట్ట్ – ఎలుక) చిట్టెలుక అని అవుతుం దని చెప్పాడు.

దీన్నిబట్టి చిట్టడవి ప్రభృతుల్లో పూర్వపదం చిఱు(త) శబ్దం అనీ, అందులో ఱువర్ణానికి 'ట్ట్' ఆదేశ మవుతుం దనీ సూరిమతం.

ప్రస్తుతసూత్రాన్నిబట్టి పూర్వపదం చిట్టిశబ్దం. కాబట్టి చిట్టి– అడవి (చిట్టి–ఎలుక) అని విభాగించి 'ఇవి సంజ్ఞావాచకంబులు గాన సంధి నిత్యము' అనే సూత్రకర్త వివరణాన్నిబట్టి సంధి నిత్యంగా జరిగి చిట్టడవి (చిట్టెలుక) అని అవుతుంది.

దీన్నిబట్టి చిట్టడవి ప్రభృతుల్లో పూర్వపదం (చిఱు కాదు) చిట్టి అనీ, (నిత్యంగా) సంధి జరుగుతుంది. అని ప్రౌఢవ్యాకర్తమతం.

'చిట్టడవిన్' అని సూరి ఉదాహరించిన 'చిట్టెలుక'ను సూత్రంలో చెప్పకపోవడం, సూరిమీద గౌరవాన్ని వ్యక్తం చేస్తుం దని కూడా చెప్పవచ్చు. కాని 'చిట్టడవిప్రభృతుల' నని స్పష్టంగా చెప్పదగు. ఉపలక్షణాది వ్యాఖ్యతో పని ఉండేది కాదు. 'పూర్వపదంబు' అని కూడా చెప్తే మరీ మంచిది.

ప్రౌఢవ్యాకర్తమతంలో కొన్నిదోషా లున్నాయి.

1. 'చిట్టడవి' ఇత్యాదులు సంజ్ఞావాచకాలు కావు. కాబట్టి సంజ్ఞావాచకాల్లో సంధి నిత్య మని అంగీకరించినా సంజ్ఞలు కాని ఈశబ్దాలలో సంధి నిత్యంగా రాదు. కాబట్టి ఏమ్యాదిసూత్రంచేత సంధి వికల్పంగా వచ్చి 'చిట్టియడవి' అనేవిధ మయిన, సంధి రానిరూపాలు ఏర్పడవలసివస్తుంది.

2. సంజ్ఞావాచకాల్లో సంధి నిత్యం అనేలక్షణం (సూరి గానీ) ప్రౌఢవ్యాకరణం కూడా చెప్పలేదు. రామయ్య, సీతమ్మ వంటివాటిని సాధించే 'శ్రేష్ఠతావాచకంబులు–' అనేసూత్రం ఇలాంటిది కాదు . ఇలాంటిదే అన్నా ఆసూత్రంప్రకారం చిట్టడవి ఇత్యాదుల్లో సంధి రాదు.

3. వీటిల్లో సంధిని ప్రత్యేకంగా విధించుకోవాలి. చిట్టడవివంటిరూపాలను సాధించడంకోసం ప్రత్యేకంగా సంధికార్యాన్ని విధించుకోవలసివస్తే 'ద్విరుక్తటకారాన్నే విశేషంగా చెప్పుకోవడంలో ప్రక్రియాగౌరవవంటిదోషం లేదు.

4. సూరి ఆసూత్రంలో కుఱు, కదు, నదు, నిదు, శబ్దాల్లో కూడా ఇటువంటికార్యాన్ని చెప్పాడు. చిఱు అనే ఒక్కదానికి వేరే సమన్వయాన్ని ఆశ్రయించినా మిగిలిన కుఱు, ప్రభృతిశబ్దాలవిషయంలో ఆవిధానం తప్పదు. కుఱ్వాదిశబ్దాలలో ట్ట కారం చేసుకుంటున్నపుడు చిఱు శబ్దం ఒక్కదానివిషయంలోనే యిటువంటిప్రక్రియ అసహజం అని తిరస్కరించడానికి వీలు లేదు.

5. ఒకవేళ అలా చెప్పుకున్నా 'చిఱుగాలి, చిఱుచాప, అనేవిధంగా హల్లు పర మయినప్పటిలాగా, అచ్చు పర మయినపుడు చిఱుశబ్దం ఉంటే ఏం కావాలి. చిఱుటడవి, చిఱడవి మొ. రూపా లున్నాయా. చిఱు(త)శబ్దానికి అజాదిపదంతో సమాసమే కా దని నియమించుకోవాలి. ఇది కేవలం అసహజం.

సూరి చెప్పిన 'చిఱు-ఎలుక' అనేవిభాగం చారిత్రకంగా కూడా సమన్వయింపబడు తున్న దనే శాస్త్రజ్ఞుల అభిప్రాయం కూడా ఇక్కడ స్మరించుకోవడంలో దోషం లేదు.

కాగా 'చిట్టి-అడవి' అనేప్రౌఢమతంకంటే 'చిఱు- అడవి' అనే సూరిమతమే గ్రాహ్యం.

### 3. కొన్నియెడలఁదెనుఁగులమీదిసాంస్కృతికకతపలకుగదవలుగానంబడియెడి. (సంధి. 5)

'కొన్నియెడల ననగా ప్రాసంబులం' దని సూత్రకర్తే అర్థం చెప్పాడు. ప్రాస అంటే పద్యపాదంలో రెండవఅక్షరం. సంస్కృతానికి సంబంధించినవి సాంస్కృతికాలు. తత్సమాల్లో (మొదటి)వని యిక్కడ అర్థం.

ప్రథమాంత మయిన, అచ్చతెనుగుశబ్దంపైన, ప్రాసస్థానంలో ఉన్నటువంటి, సంస్కృతసమశబ్దాల్లో మొదటి 'క త ప' అనేహల్లులస్థానంలో క్రమంగా 'గ ద వ' అనేవి ఆదేశంగా రావడం కవిప్రయోగాల్లో కనబడుతున్న దని సూత్రాని కర్థం. క ద ప, గ ద వ అన్నపుడు పైనున్న అకారం ఉచ్చారణసౌకర్యంకోసం చేర్చింది. కాబట్టి క్ త్ ప్, అనేపొల్లులస్థానంలో గ్, ద్, వ్ అనేపొల్లులు వస్తాయి.

'ప్రథమమీదిపరుషములకు గసడదవలు బహుళంబుగా నగు' అనేసూత్రంచేతప్రథమాంతంమీదిపరుషాలకు రావలసినగసడదవాదేశాన్ని 'తెలుగులమీదిసాంస్కృతిక పరుషములకు గసడదవలు రావు' అనేసూత్రంచేత అచ్చతెలుగుపదంమీద ఉన్నసంస్కృతసమశబ్దం మొదటిపరుషాలకు రా దని నిషేధిస్తున్నది. అలా గసడదవలు రాకపోతుండగా ప్రౌఢవ్యాకర్త ప్రయోగానుగుణంగా కతపలకు గదవలు రావడం ఈలక్షణంలో పేర్కొన్నాడు.

వే - పణములు. ఇక్కడ 'వే'శబ్దం ప్రథమాంతం. (వేయిశబ్ద మనీ, సమాస మై యి లోపించిం దనీ, అనుకోగూడదు. 'మొగములు వే గలశేషుండు' అని ప్రయోగం.) దానికి పకారం పర మైంది. 'ప్రథమమీదిపరుషములకు- అనేసూత్రంచేత పకారానికి వకారం ప్రాప్తిస్తున్నది.'తెనుగులమీదిసాంస్కృతికపరుషములకు - అనేనిషేధంవల్ల రాదు. ఇలా రాకపోతుండగా ప్రస్తుతసూత్రంచేత పకారానికి వకార మై, వేవణములు అవుతుంది.

'కొన్నియెడల' అంటే ప్రాసస్థలంలో అన్నాడు సూత్రకర్త. సూత్రంలోనే 'ప్రాసంబులందు' అంటే స్పష్టంగా ఉండేది. కాగా ప్రాస కానిస్థలంలో ఈకార్యం లేదు. కాని ఈభేదదృష్టి అవసరం అనిపించదు. కొన్నియెడల అనేశబ్దం 'అరుదు' అనేఅర్థంలో గ్రహిస్తే, ఆదేశం లేకపోవడం తఱు చనేవిషయం ప్రయోజన మయ్యేది. గ్రంథకర్తే స్వయంగా వ్యాఖ్యానం వ్రాసుకుంటే ఒక్కొక్కసారి ఇలా యిబ్బందులు వచ్చేఅవకాశమూ ఉంది.

'తెనుగులమీది' అనడంచేత సంస్కృతసమాలమీది సాంస్కృతికపరుషాలకు పరుషాలకు ప్రస్తుతలక్షణం వర్తించదు.పూర్వవ్యాకరణాలప్రకారం ఆదేశం సామాన్యం. రాముడు గరుణించెన్.

'సాంస్కృతిక' అనడంచేత (అచ్చుతెలుగుశబ్దంమీది) అచ్చుతెలుగుశబ్దం మొదటిపరుషాలవిషయంలో ఈసూత్రం వర్తించదు. పూర్వవ్యాకరణాలచేత ఆదేశం సామాన్యంగానే వస్తుంది. వాడు గొట్టె.

'కతపలకు' అనడంచేత చ,ట లకు ఈఆదేశం అసలు లేదు. వాడు చక్రపాణి. అయ్యది టంకృతి.మొ.

'కానంబడియెడి' అనడంచేత కవిప్రయోగాలలో కానవచ్చినస్థలాల్లో మాత్రమే ఈఆదేశం గ్రహించాలి. స్వతంత్రించి చేయగూడదు.

**4. కొన్నియెడల ద్వంద్వంబునం బదంబుమీదిచతపలకు సదవలు గానంబడవు.** (సంధి.6)

సమాసంలోని ఉభయ(పూర్వ–ఉత్తర) పదాలఅర్థం ప్రధాన మైన (క్రియలోకి అన్వయించే) సమాసం ద్వంద్వం. చతపలు అన్నపుడు అకారం ఉచ్చారణసౌకర్యంకోసం. కాబట్టి చ్ ఇత్యాదిగా పొల్లులే గ్రహింపబడతాయి.

ద్వంద్వసమాసంలో పూర్వపదానికి తరువాత ఉన్న(ఉత్తర)పదం మొదటి 'చతప' అనేపరుషాలస్థానంలో సదవ అనేవర్ణాలు ఆదేశంగా రావడం కవిప్రయోగాల్లో కొన్నిచోట్ల కనబడ్డం లేదు. అంటే ఆదేశం రావడం లేదు అని సూత్రానికి అర్థం.

'ద్వంద్వంబునం బదంబుపయి పరుషములకు గసడదవ లగు' అని బాల వ్యాకరణం ద్వంద్వసమాసంలో కచటతపలకు గసడదవలు నిత్యంగా విధించింది. కాబట్టి ద్వంద్వంలో సూరిమతంలో గసడదవాదేశం రాకుండటానికి అవకాశం లేదు.కాగా కవిప్రయోగానుగుణంగా ఆదేశం రాకపోవడాన్ని ప్రౌఢవ్యాకరణం ఈసూత్రంతో ప్రస్తావిస్తున్నది.

'రాకయును, పోకయును' అనేఅర్థంలో ద్వంద్వసమాసం అయి (విభక్తి లోపించి) రాక – పోక. అని ఉండగా 'ద్వంద్వంబునం బదంబుపయి' అనే(బాల)సూత్రంచేత పకారానికి కావలసినవకారాదేశం ప్రస్తుతసూత్రంచేత వారింపబడగా రాదు. (ప్రథమావిభక్తిలో బహువచనంతో) రాకపోకలు అని ఉంటుంది.

ఇలాగే అందచందములు, అన్నపుడు చకారానికి సకారమూ,

కండతుండెములు అన్నపుడు తకారానికి దకారమూ రాలేదు.

'కొన్నియెడల' అనడంచేత ద్వంద్వంలో సదవాదేశం కూడా రానిస్థలాలు కవిప్రయోగాలలో అరుదుగా మాత్రమే ఉంటాయి. కాబట్టి ద్వంద్వంలో ఆదేశం రావడమే తఱుచు. కాలుసేతులు మొ.

'ద్వంద్వంబున' అనడంచేత ఇతరస్థలాలకు ఇక్కడ ప్రసక్తి లేదు.

'చతపలకు సదవలు' అనడంచేత 'క,ట లకు గ,డ ల ఆదేశం రాకపోవడం ఎక్కడా లేదు. అయితే ప్రౌఢవ్యాకర్త ద్వంద్వంగా చూపిన 'విన్నకన్నది' (సమా.32) అనేదాన్లో కకారానికి గకారం లేదు. దాన్ని ఈసూత్రం సంగ్రహించదు. నిజానికి విన్నకన్నది అనేది ద్వంద్వం కాదు. 'ఎత్తిపెంచినవారు' ఇత్యాదులలాగా విశేషణసమాసం. కాబట్టి అక్కడ గసడదవాదేశం ప్రసక్తే లేదు.

'కానంబడవు' అనటంచేత గసడదవలు రానిస్థలాలను కవిప్రయోగానుసారంగానే గ్రహించాలి. స్వతంత్రంగా ద్వంద్వంలో ఈఆదేశాన్ని మానగూడదు.

**5. తామర కాకు పరం బగునపుడు పుగాగమం బగు.** (సంధి. 8)

ఆగమం అంటే (వర్ణం) అధికంగా వచ్చిచేరటం. అలా వచ్చిచేరినవర్ణం కూడా ఆగమం అవుతుంది. పుక్ - ఆగమ, అన్నపుడు కకారం ఇత్తు. కాబట్టి లోపిస్తుంది. కకారం ఇత్తుగా కలిగింది, కాబట్టి 'పు'వర్ణం కిత్తు. అందుచేత 'ఆద్యన్తౌ ట కితౌ' అనేసంస్కృతపరిభాషచేత విధించినదానికి చివరలో చేరుతుంది. 'పు' వర్ణంలో ఉత్వం ఉచ్చారణసౌకర్యంకోసం చేర్చబడింది. కాట్టి అది తొలగిపోగా మిగిలిన పకారంపొల్లు మాత్రమే ఆగమం అవుతుంది.

ఆకు అనేశబ్దం పరంగా ఉండగా పూర్వంలోని 'తామర' అనేశబ్దానికి చివర పకారపు పొల్లు (ప్) ఆగమంగా వచ్చి చేరుతుం దని సూత్రానికి అర్థం.

తామర - ఆకు అని ఉండగా 'అత్తునకు సంధి బహుళముగా నగు' అనేసూత్రం చేత ప్రాప్తిస్తున్నసంధిని బాధించి ప్రస్తుతసూత్రంచేత పుగాగమం వచ్చి తామరప్ + ఆకు, తామరపాకు.

'తామరకు' అనడంచేత ఇతరశబ్దానికి ఈకార్యం లేదు. చింత + ఆకు- చింతాకు, చింతయాకు. తాటి+ఆకు- తాటాకు. తాటియాకు. మొ.

'ఆకు పరం బగునపుడు' అనడంచేత ఆకు కంటే ఇతర మయినశబ్దం పర మయితే ఈకార్యం రాదు. తామరయందము.

'అగు' అనడంచేత పుగాగమం నిత్యం. కాహట్టి ఆగమం రాని - తామరాకు, తామరయాకు అనేరీతిరూపాలకు అవకాశం లేదు. తామరాకు, తామరయాకు అనేరూపాలు కవిప్రయోగాలలో కనబడకపోవడంచేత వ్యాకర్త నిత్యంగా విధించి ఉండవచ్చు.

ఈఆగమం సమాసంలో మాత్రమే వస్తుంది. 'తెల్లదామర ఆకుపై నున్నది'. అని వ్యస్త మైతే పుగాగమం రాదు. సమాసంలో వచ్చే అనేక మయినమార్పుల్ని సమాస (36)పరిచ్ఛేదంలో ఈవ్యాకర్త కూడా నిరూపించాడు. ఒక్క (విధ మయిన) రూపాన్ని సాధించడంకోసం ఇలా ప్రత్యేకంగా లక్షణం చేయడం ఎంతవరకు అవసరం అనేది ఆలోచించవలసి ఉంది.

**6. కొన్నిచోట్ల షష్ఠీసమాసంబునం దుకారంబున కచ్చు పరం బగునపుడు నుగాగమంబునకు లోపంబు నగు.**

(సంధి. 10)

షష్ఠీ(యొక్క)విభక్తి చివర గలిగిశబ్దానికి మీదిపదంతో చేసినసమాసం షష్ఠీసమాసం. షష్ఠీతత్పురుషసమాసంలో తరువాతిపదం మొదటిఅచ్చు పరంగా ఉండగా పూర్వపదం చివరిఉకారంపైన చేరిన నుగాగమానికి లోపం కూడా వస్తుం దని సూత్రాని కర్థం.

'షష్ఠీసమాసంబులం దుకార ఋకారముల కచ్చు పరం బగునపుడు నుగాగమం బగు' అనేసూరిలక్షణం ప్రకారం వచ్చిననుగాగమానికి ఈసూత్రం ఉదంతాలపై లోపం చెప్తున్నది.

శిరసుయొక్క – అనేషష్ఠ్యంతానికి అందము అనే పైపదంతో (షష్ఠీ)సమాసం చేయగా సమాసంలో విభక్తి లోపించి 'శిరసు+అంద' అని ఉండగా ఉత్త్వసంధిని బాధించి 'షష్ఠీసమాసంబునం దుకారఋకారములకు' అనేసూత్రంప్రకారం నుగాగమం వచ్చి శిరసున్+అంద –. ప్రస్తుతసూత్రంచేత నుగాగమం లోపించి శిరసు+అంద. 'ఉత్తున కచ్చు పరం బగునపుడు సంధి యగు' అని సంధి జరిగి శిరసందము.

'కొన్నిచోట్ల' అనడంచేత నుగాగమం వచ్చిన అన్నిచోట్లా లోపం రాదు. కవిప్రయోగాలలో లోపం కనిపించినచోట్ల మాత్రమే వస్తుంది. ప్రయోగాలలో నుగాగమం నిలిచిఉండటమే తఱుచు. 'రాజునాజ్ఞ' మొ.

'షష్ఠీసమాసంబునందు' అనడంచేత ఋకారంపై వచ్చిననుగాగమానికి లోపం రాదు. విధాతృనానతి. మొ.

'అచ్చు పరం బగునపుడు' అనడంచేత హల్లు పర మయినపు డయిన నుగాగమానికి లోపం రాదు. సింగపుంగొదమ.మొ.

'నుగాగమంబునకు' అనడంచేత ఇతర మైనఆగమానికి లోపం రాదు. వేలుపుటావు.మొ.

'లోపంబును' అనేచోటి సముచ్చయార్థక 'ను' శబ్దంచేత లోపం వచ్చేలక్ష్యాలలో కూడా లోపం అరుదు అనీ, లోపం రాకపోవడమే తఱ చనీ అర్థం. శిరసునందము.మొ.

'లోపంబు' చెప్పడంవల్ల ముందుగా ఆగమం చేయాలి. ఆగమం చేసి దానికి లోపం చేయడంకంటె మొదలు ఆగమమే కొన్నియెడల రా దని చెప్తే ప్రక్రియలో లాఘవం.

'ఆగమశాస్త్ర మనిత్యమ్' అని బాలవ్యాకరణంచేతనే అరుదుగా ఆగమం రానిరూపాలు కూడా సాధించుకునే అవకాశం ఉంది అంటారు కొందరు.

**7. పూ పూవు.**

(సంధి.11)

'అసమాసంబునం బూశబ్దము పూవుశబ్దముయొక్క పర్యాయముగా గానంబడియెడి నని యర్థము' అనిసూత్రం అర్థాన్ని సూత్రకర్తే వివరించాడు.

పూవు అనేశబ్దానికి పర్యాయంగా 'పూ' అనే ఏకాక్షరశబ్దం కూడా సమాసం కానిస్థితిలోనూ ఉన్నది అని తాత్పర్యం.

సమాసంలో పూవు(శబ్దానికి పర్యాయంగా), పూ ఉండడాన్ని సూరి పేర్కొన్నాడు. పూవు అనేశబ్దం ప్రాతాదులలోది. కాబట్టి పూవురెమ్మ ఇత్యాదిగా సమాసం చేసినసందర్భంలో 'సమాసంబునం బ్రాతాదులతొలియచ్చుమీదివర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు' అనేసూత్రంచేత తొలియచ్చుమీదివర్ణాలు లోపించగా పూ–రెమ్మ. ఇత్యాదిగా 'పూ' అనే రూపం ఏర్పడుతుంది. ఈకార్యం సమాసంలో మాత్రమే. కాబట్టి సమాసం కానిపక్షంలో

వ్యస్తతలో 'పూవు' శబ్దానికి 'పూ' అనేరూపాంతరం బాలవ్యాకరణం ప్రకారం సిద్ధించదు.

ఉదా. కాలకంఠునిశిరసుపూ గగనగంగ

ఇక్కడ పూవుశబ్దం తీసుకుంటే అందులో తొలి అచ్చుమీదివర్ణాలు లోపించే అవకాశం లేదు. కాబట్టి 'శిరసుపూ' అనేచోటి 'పూ'శబ్దం పూవు నుండి ఏర్పడిం దనడానికి వీలు లేదు. అందుచేత ఇక్కడి పూ శబ్దం ప్రత్యేక మైనదిగా చెప్పవలసిందే.

సమాసం కానపుడు 'పూ' శబ్దం ఉందని చెప్పడంలో పూరెమ్మ ఇత్యాది రూపాలకోసం పూవును ప్రాతాదుల్లో చేర్చడం అనవసర మనీ, పూ శబ్దానికి రెమ్మతో సమాసం చేస్తే పూరెమ్మ అయిపోతుం దనీ, ప్రౌఢవ్యాకర్త అభిప్రాయం కావచ్చు. అందుకే దీన్ని సంధిపరిచ్ఛేదంలో చెప్పాడు.

కానీ, 1. పూబొదలు, పూదోట, ఇత్యాదుల్లో నుగాగమం రావడం మొ. వాటినిబట్టి పూవును ప్రాతాదులలో చేర్చక తప్పదు.

2. పూను, పూచేత ఇత్యాదిగా పూశబ్దం వ్యస్తంగా కనబడడం లేదు. 'సింధువారమున బూ శిథిలపడగ' అని ప్రయోగం ఉంది. కాని ప్రామాణికాలు లేవు.

3. శిరసుపూ, (తలపూ వాడక, పొన్నపూ) ఇత్యాదులు కూడా సమాసాలే. ఇక్కడ పూ(వు)శబ్దం సమాసంలో చివర ఉన్నది. ప్రాతాదిసూత్రంలోని బహుళశబ్దంచేత గానీ, సామాసికవికారంగా గానీ, ఇక్కడ గూడా పూవు లో వు లోపం సాధించుకోవడం యుక్త మేమో అనిపిస్తుంది.

ప్రౌఢవ్యాకర్త ప్రస్తావించిన 'పూ' అనే ప్రత్యేకశబ్దాన్ని అంగీకరించడానికి ఇంకా దృఢ మైన ఆధారాలు వెదకాలి. పూరెమ్మ, పూదోట ఇత్యాదులు ప్రసిద్ధాలు. కాగా సూరి మతమే యుక్తం అని యిప్పటికి నిశ్చయింపవచ్చు.

### 8. సమాసమందు దత్సమంబు పరం బగునపుడును నుమాగమాదులు గానంబడియెడి. (సంధి. 12)

ఇక్కడ ప్రౌఢవ్యాకర్త నిర్దేశించిన'క్రొత్తాదులు లుప్తశేషంబులు దేశ్యంబులతోడంబలె దత్సమంబులతోడం గొన్నియెడల గర్మధారయం బగు' అనే సూత్రాన్నిబట్టి ఈకార్యం క్రొత్తాదులసమాసంలో అని గ్రహించాలి. చిన్నయసూరి చెప్పిన ప్రాతాదులే ప్రౌఢవ్యాకర్త చెప్పిన క్రొత్తాదులు. 'నూతనత్వాదిబోధకాః' అనే అథర్వణవచనాన్ని అనుసరించి ప్రౌఢవ్యాకర్త క్రొత్తాదు లన్నాడు. లక్ష్యాలలో ప్రయోజనాన్ని ఉద్దేశించి సూరి ప్రాతాదు లని మార్పు చేశాడు.

తత్సమం అంటే సంస్కృతసమం అని అర్థం. పూర్వపద మైన క్రొత్తాదు లన్నీ ఆచ్ఛికాలే. ఉత్తరపదం సంస్కృతసమం కావడంవల్ల ఇవి మిశ్రసమాసాలు. 'నుమాగమం' అన్నపుడు నుమ్ లో మకారం ఇత్తు. 'మి దచో ऽన్త్యాత్ పరః' అని మి త్తయిన ఆగమం విధించినదానిలో చివరిఅచ్చుకు పరంగా వస్తుంది. 'నుమాగమాదులు' అన్నప్పటి ఆదిశబ్దంచేత మీదిహల్లుకు ద్విత్వం గ్రహించాలి.

'ను మ్వోతః' అని చింతామణి చెప్పిననుమాగమం 'అమిశ్రే స్త్రీసమాత్' అని అథర్వణుడు మిశ్రసమాసాలలో అంటే సంస్కృతసమం పరంగా ఉంటే, రా దని చెప్పాడు. (సూరి రా దనలేదు, కాని ప్రాతాదిసంధిసందర్భంలో మిశ్రసమాసం ఉదాహరించలేదు.)ఆఅభిప్రాయాన్ని సవరిస్తూ ప్రౌఢవ్యాకర్త ఈలక్షణం చేశాడు.

మిశ్రసమాసంలో క్రొత్త మొద లయినశబ్దాలకు సంస్కృతసమం అయిన ఉత్తరపదం పరంగా ఉండగా నుమాగమం, లేదా మీదిహల్లుకు ద్విత్వం రావడం కవిప్రయోగాలలో కనబడుతున్న దని సూత్రాని కర్థం.

ముందు-కోపము అని ఉండగా 'సమాసంబునం బ్రాతాదులతొలియచ్చుమీది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు' అనేసూత్రంచేత మొదటిఅచ్చు పైన ఉన్న వర్ణాలు అన్నీ లోపించి ము-కోప. ఇక్కడ 'కోప' అనేది సంస్కృతసమం. ప్రస్తుతసూత్రంచేత నుమాగమం వచ్చి మును- కోప. ద్రుతకార్యాదులతో - ముంగోపము.

క్రొ(త్త) - నారాచ. అన్నపుడు మీదిహల్లుకు ద్విత్వం వచ్చి, క్రొన్నారాచము.

ఈలక్షణం స్పష్టంగా లేదు.ప్రాతాదులసమాసంలో అని స్పష్టంగా చెప్పకపోవడంవల్ల ఆబ్బందము, రామునిబాణము ఇత్యాదిగా సంస్కృతసమం పర మైన సమాసా లన్నింటిలోను ఈలక్షణం ప్రసక్త మవుతున్నది. ఇలాగే కఱకుటసుర, మొ.

తత్సమం అనడంకంటె సంస్కృతసమం అంటే ఇంకా ఉచితంగా ఉండేది.

'తొలియచ్చుమీదివర్ణములు లోపించి' లుప్తశేషం అయినతర్వాతనే బాలవ్యాకరణం ప్రకారం నుగాగమాదు లయ్యేది. అంటే నుగాగమాదులకు ముందు 'లోపం' కూడా చెప్పాలి. లోపం వచ్చి లుప్తశేషం అయినతరువాత నుమాగమాదులు తప్పక వస్తాయి. మొదటికార్యం లోపం. కాబట్టి ఇక్కడ కార్యం లోపాదులుగా చెప్తే సక్రమంగా ఉండేది.

'నుమ్' అని మిత్తుగా చింతామణి, వికృతివివేకాలనుబట్టి చెప్పడం జరిగింది. షష్ఠీసమాసంలోలాగా బాలవ్యాకరణానుగుణంగా 'నుక్' అని కిత్తుగా చెప్పదగు.

తొలియచ్చుమీదివర్ణాలు లోపించి, 'ము- కోప. అని అయినతర్వాత ను ఆగమం, లేదా ద్విత్వం, రాకుండా ముకోపము, నెమనము వంటి రూపాలు ఉండవు.

కాగా ఈసూత్రం చెప్పకపోతే భాషకు నష్టం కలుగుతుం దని చెప్పలేం.

## 9. నెన్నడాదులన్ నెఱి దగు. (సంధి.14)

నెన్నడ అనేది మొదలుగా కలిగినవి నెన్నడాదులు.వీటిలో పూర్వపదంగా నెఱి అనేశబ్దం ఉండటం యుక్తం. అని సూత్రార్థాన్ని సూత్రకర్తే చెప్పాడు. 'నెఱ పూర్ణార్థకము. నెఱి రమ్యార్థకము. అనేసూత్రకర్త వివరణాన్నిబట్టి నెన్నడాదులలో పూర్వపదం 'నెఱ' కా దని చెప్పడం తాత్పర్యంగా తెలుసుకోవచ్చు.

సూరి 'అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచో గానంబడియెడి' అనే సూత్రంవద్ద ' నెత్తఱి, నెమ్మది, నెవ్వగ, నెన్నడుము అని ఉదాహరించి వాటిలో పూర్వపదంగా 'నెఱ' అనేశబ్దం చూపాడు. వీటిలో నెన్నడుమును నెన్నడాదులలో చేర్చి పూర్వపదం నెఱ కా దని సూరిమతాన్ని తిరస్కరిస్తూ నెఱి ఉండటం యుక్త మని తనమతాన్ని వ్యాకర్త వివరించాడు.

నెఱ-నడ, నెఱ-నడుము అని గ్రహిస్తే నిం డైన నడక, నిం డైన నడుము ఇత్యాదిగా అర్థం చెప్పాలి.'నెఱ' ప్రశస్తగుణవాచక మనీ, నెన్నడుము ఇత్యాదుల్లో గూడా నెఱశబ్దం యుక్తమే అని కొంద రంటారు. కానీ దానికంటే నడక, నడుము మనోహరంగా ఉం దని చెప్పడమే యుక్తం. కాబట్టి పూర్వపదంగా నెఱి ఉండా లనే ప్రౌఢమతమే ఉచితంగా కనబడుతున్నది.

'నెన్నడాదులన్' అనడంచేత నెన్నడ మొద లయినవాటిలో చేరనిసమాసంలో పూర్వపదం 'నెటి' కానక్కఱ లేదు. కాగా నెత్తటి, నెమ్మది, నెవ్వగ అనే సూరిఉదాహరణలలో సూరి చెప్పినట్లు పూర్వపదం 'నెఱ'గా ఉండడం సమంజసం. అన్నిచోట్లా ఒకేశబ్దం ఉండా లనేనియమం లేదు.

కాగా సూరి ఉదాహరణలలో నెన్నడుము ఒక్కదానిలోనే మార్పు. అయితే ఆశబ్దమే సూత్రంలో చెప్పకుండా నెన్నడ అని వేరే శబ్దాన్ని తీసుకోవడంలోనూ, 'తగున్' అనడంలోనూ ప్రౌఢవ్యాకరణంలో మృదుత్వాన్ని గమనింపవచ్చు.

**10. కొన్నియెడల నవర్ణంబు పరం బగునపుడు పూర్వపదాంత్యదకారంబు నకారం బగు.** (సంధి. 15)

'నవర్ణంబు' అన్నచోట అకారం ఉచ్చారణార్థంగా గ్రహించాలి. కాబట్టి నవర్ణం అంటే నకారం (న్). పూర్వపదం అనేమాట సమాసంలోని మొదటిపదాన్ని బోధిస్తుంది. అందుచేత ఈకార్యం సమాసాల్లోనే. పూర్వపదం చివర దకారం అచ్చసహిత మై ఉంటుంది. అపుడు స్వరంతో వ్యవధానంవల్ల నకారం పరంగా ఉండడం సంభవించదు. అపు డీవిధానం

వర్తించే అవకాశం ఉండదు. కాబట్టి ఈవిధానసామర్థ్యంచేత పూర్వపదాంత్యదకారంమీది అచ్చు లోపిస్తుం దని గ్రహించాలి.

కొన్నిచోట్ల సమాసంలో తరువాతిపదం మొదటినకారం పరంగా ఉండగా ముందరిపదం చివరిదకారంమీది అచ్చు లోపించి, ఆదకారంపొల్లుస్థానంలో నకారంపొల్లు ఆదేశంగా వస్తుం దని సూత్రాని కర్థం.

రెండు – నాఁడు(ళ్లు) అని ఉండగా ప్రస్తుతసూత్రంచేత దువర్ణంలో ఉత్వం లోపించి, రెండ్– నాఁడు. ఇపుడు నకారం పరంగా ఉండగా ముందరి దకారపుపొల్లుస్థానంలో పొల్లునకార మై, రెం–నాఁడు. 'సంస్కృతసమేతరంబు లయినతెలుఁగుశబ్దములయందు బరుషసరళములకు ముందే బిందువు కానంబడుచున్నది' అనేసూత్రంప్రకారం స్థిరానికి ముందు బిందు వుండదు. కాబట్టి లోపించి రెన్–నాఁడు. ప్రథమావిభక్తిలో బహువచనంతో రెన్నాళ్లు అవుతుంది.

'కొన్నియెడల' అనడంచేత ఈకార్యం అన్నిచోట్లా రాదు. మఁడినీళ్లు, మూఁడునెలలు మొద లయినచోట్ల దకారానికి నకారం రాదు. నకారం వచ్చేచోట్ల గూడా రెండు నాళ్లు, వేఁడినీళ్లు ఇత్యాదిగా నకారం రానిరూపాలే తఱుచుగా ఉంటాయి.

'నవర్ణంబు పరం బగునపుడు' అనడంచేత ఇతరవర్ణం పర మయితే ఈకార్యం లేదు. వేఁడిపాలు, కాఁడిమ్రాను. మొ.

'నవర్ణంబు' అంటే అత్వసహితనకారం (న) అని అర్థ మవుతుంది. 'ద్వంద్వంబునందు ఋకారంబునకు రవర్ణంబువిభాష నగు'. (బాల. సమా.) నకారంబు అంటే బాగుండేది.

'పూర్వపద' అనడంచేత ఈకార్యం సమాసాలలోనే. కాబట్టి సమాసం కానపుడు ఈకార్యం లేదు. క్రోసులు రెండు నడచెను. వేఁడి నెలకొనె. మొ.

'అంత్య' అనడంచేత చివరిది కానిదకారానికి నకారం రాదు.

'దకారంబు' అనడంచేత దకారంకంటె వే రయినహల్లుకు నకారం రాదు. ఒకనాడు, ఐదునెలలు మొ. అయినా వెల్ల–నెల, వెన్నెల మొ. కొన్నిస్థలాలు విశేషం. ఇవి నిక్కలాదులలో చేరతాయి.

'నకారం బగు' అనకుండా 'నకారంబు నగు' అని సముచ్చయం చేరిస్తే రెండునాళ్లు వంటివాటికి అవకాశం స్పష్టంగా ఉండే దని తోస్తుంది.

**11. మధ్యమపురుషమువర్ణకంబున కచ్చు పరం బగునపుడును గొన్నియెడల లోపంబు చూపట్టెడి.** (సంధి. 18)

యుష్మదర్థం (నీవు, మీరు) కర్తగా కలిగినక్రియాపదం మధ్యమపురుషం. (ఆశీస్సు, ప్రార్థనం మొ. అర్థాలలో) 'ము'ప్రత్యయం మధ్యమపురుషలో ఏకవచనం.

ఈమధ్యమపురుష 'ము' ప్రత్యయం అచ్చు పరంగా ఉన్నపుడు కూడా లోపించడం కవిప్రయోగాలలో కనబడుతున్న దని సూత్రాని కర్థం.

'మధ్యమపురుషమువర్ణకంబునకు హలవసానంబులు పరంబు లగునపుడు లోపము విభాష నగు' అని చెప్పినసూరి 'చూడు మనియె, విను మనియె ఇచ్చట నచ్చు పర మయినది కాట్టి లోపము లేదు. అని స్పష్టంగా మళ్ళీ చెప్పాడు. అథర్వణుడు కూడా 'న ప్రాణే తు కదాచన' అన్నాడు. ఆఅభిప్రాయాన్ని సవరిస్తున్నది ఈసూత్రం.

'చెప్పుము- అనినన్' అని ఉండగా 'ఉత్తున కచ్చు పరం బగునపుడు సంధి యగు' అనేసూత్రంచేత ప్రాప్తిస్తున్న ఉత్వసంధిని బాధించి ప్రస్తుతసూత్రంచేత మువర్ణకం లోపించి చెప్పు-అనినన్. ఇపుడు 'ఉత్తున కచ్చు- అనేసూత్రంచేత సంధి జరిగి 'చెప్పనినన్' అని అవుతుంది.

'మధ్యమపురుష' అనడంచేత మధ్యమపురుష కాని మువర్ణకానికి ఈకార్యం లేదు. చదువుదము - అంటిని. చదువుద మంటిని. (అన్నము-అడిగెను. అన్న మడిగెను.)

'మువర్ణకంబునకు' అనడంచేత మువర్ణకంకంటె వే రయినమధ్యమపురుష ప్రత్యయానికి ఈకార్యం లేదు. చదువుదువు- ఎల్లపుడు. చదువుదు వెల్లపుడు. వినుడు-ఇదె. విను డిదె.

'అచ్చు పరం బగునపుడును' అనేచోటిసముచ్చయార్థక నుశబ్దంచేత హలవసానాలు పర మైనపుడు పూర్వవ్యాకరణాలచేత సాధారణంగానే లోపం వస్తుంది. చూడు నన్ను, ఇటు చూడు. మొ.

'కొన్నియెడల' అనడంచేతఅచ్చు పర మైనపుడు లోపం (హలవసానపరకతలోవలే) సార్వత్రికం కాదు. అరుదుగా కొన్నిచోట్లనె. కాబట్టి చూడు మనియె, విను మనియె ఇత్యాదిగా లోపం రాకపోవడమె సాధారణం.

చెప్పు నినున్- - పుణ్యుండుగా. అనేయతిస్థలప్రయోగా న్ననుసరించి ఇక్కడ హల్లు పర మైనపుడే 'ము' లోపం అయింది. ఆడిదె అనే మరో దానికి ఆడితె అనే పాఠాంతరమే అర్థవంతం.

కాగా ఈలక్షణానికి కావు కావు(ము)-అనువారు. 'కావు కా వనువారు' వంటివి ఉదాహరించడం యుక్తం.

**12. ప్రాసంబున మకారంబు పరం బగుచో ద్రుతంబునకు మకారాదేశం బగు.** (సంధి. 22)

'వళి రాద్య మనన్తరాక్షరం ప్రాసః'. పద్యంలో ప్రతిపాదంలోనూ రెండవఅక్షరానికి ప్రాస(ము) అని పేరు. ప్రాసస్థానంలోని మకారం పరంగా ఉండగా దానికి పూర్వంలోనిద్రుతంస్థానంలో మకారపుపొల్లు ఆదేశంగా నిత్యంగా వస్తుం దని సూత్రాని కర్థం. ప్రాసనియమం ఉన్నపద్యంలో, మిగిలినపాదాల్లో ప్రాసాక్షరం ద్విరుక్తమకారం అయినసందర్భంలో మాత్రమే ఈకార్యం జరుగుతుం దని గ్రహించాలి.

'కమ్మనిలతాంతములకు మ్మొనసి'. ఇక్కడ 'కమ్మని' అన్నపుడు ద్విరుక్తమకారం ప్రాస అయింది. కాబట్టి 'లతాంతములకును-మొనసి' అనేచోట 'ద్రుతమునకు సరళస్థిరంబులు పరంబు లగునపుడు లోపసంశ్లేషంబులు విభాష నగు' అనేసూత్రాన్ని బాధించి ప్రస్తుతవిశేషవిధిచేత ద్రుత మైన 'ను' వర్ణంస్థానంలో మకారంపొల్లు వచ్చి 'లతాంతములకు మ్మొనసి' అని అవుతుంది. ఇలాగే చేసెను-మహానది. చేసె మ్మహానది. మొ.

'ప్రాసంబున' అనడంచేత (ద్విత్వమకారం) ప్రాసకంటే వే రయినస్థలాల్లో ఈకార్యం లేదు. 'ద్రుతమునకు సరళస్థిర- అనే సూత్రంచేత లోప సంశ్లేష స్వత్వాలు యథావసరంగా కలుగుతాయి. లతాంతములకు మొనసి, చేసె న్మహానది, మొ.

'మకారంబు పరం బగుచో' అనడంచేత వేరేవర్ణం పరంగా ఉంటే ఈకార్యం రాదు. చేసె నతడు, ధాత న్నాభిని. మొ.

'ద్రుతంబునకు' అనడంచేత ద్రుతం కానిదానికి ఈకార్యం లేదు. విన్మిదియ కాదు. వినుము- విను- విన్. ఈనకారం ద్రుతం కాదు. కాబట్టి విమ్మిది అని కాదు.

'మకారాదేశంబు' అన్నపుడు ఆదేశ మనేమాట స్పష్టతకే. అది లేకుండా 'ద్రుతంబునకు' అని మాత్రమే చెప్పినా ద్రుతస్థానంలో మకారం ఆదేశంగానే వస్తుంది.

'అగు' అనడంచేత ఈకార్యం నిత్యం గాబట్టి 'కమ్మని లతాంతములకు మొనసి' అనేవిధంగా ద్విత్వమకారప్రాసస్థలంలో ద్రుతానికి లోపాదులు రావు.

'ప్రాసంబున' అని సాధారణంగా కాకుండా 'ద్విమకారప్రాసంబున' అని స్పష్టంగా చెప్పాలి. 'భ్రమరములు లతాంతముల-కు మొనసి, తన్మయత లతాంతముల - కున్మొనసి' అనే యితరవిధ మైనప్రాసల్లో మకారమే పరంగా ఉన్నా ద్రుతానికి మకారాదేశం చేస్తే ప్రాసభంగ మవుతుంది. అయినా ప్రాసస్థానంలో వచ్చే ఈకార్యం ఇతరత్రా రా దని చెప్పడంలో యుక్తి కనబడదు. అసలు 'ప్రాసంబున' అనేదళమే లేకుండా చెప్పడం మేలు. కాని-

'ద్విత్వమకారప్రాసలో అని చెప్తే 'అగు' అని నిత్యంగా విధించడం యుక్తం. సాధారణంగా చెప్పదలచుకుంటే (మామూలుగానే) మకారం రావడం 'కొన్నియెడల కానంబడియెడి' అనడం అవసరం.

### 13. ఆమ్రేడితంబు పరం బగునపుడు కృతహ్రస్వంబునకు దీర్ఘం బగు. (సంధి. 23)

ద్విరుక్తంయొక్క పరరూపం ఆమ్రేడితం. ఒకేశబ్దం రెండుసార్లు ఉచ్చరించినపుడు అందులో రెండవసారి ఉచ్చరింపబడినది (రెండవశబ్దం) ఆమ్రేడితం. కృతహ్రస్వం అంటే (దీర్ఘానికి) చేయబడినహ్రస్వం. మధ్యమముడుజులు లోపించకపోతే ఆమ్రేడితం కృతహ్రస్వానికి పరంగా ఉండదు. కాబట్టి ముడుజులు లోపించినపుడు మాత్రమే ఈలోపం వస్తుంది.

ఆమ్రేడితం పర మయినపుడు మధ్యమముడుజులు లోపింపగా పూర్వంలో ఉన్న(మొదటిశబ్దందీర్ఘానికి) చేయబడినహ్రస్వానికి దీర్ఘం వస్తుం దని సూత్రాని కర్థం.

లెమ్ము-లెమ్ము. అని ఉండగా 'ఆమ్రేడితంబు పరం బగునపుడు మధ్యమ ముడుజులకు లోపంబు విభాష నగు' అనేసూత్రంచేత మొదటి 'లెమ్ము' లో 'మ్ము' వర్ణం లోపించగా లె-లెమ్ము. (ఇక్కడ 'లే(చు) లో దీర్ఘానికి వచ్చినహ్రస్వం కాబట్టి 'లె' అన్నపు దున్నది కృతహ్రస్వం. దానికి ఆమ్రేడితం పర మైంది కాబట్టి) ప్రస్తుతసూత్రంచేత దీర్ఘం వచ్చి లేలెమ్ము అని అవుతుంది. ఇలాగే 'లెండు - లెండు. 'లేలెండు.'

'ఆమ్రేడితంబు' అనడంచేత ఆమ్రేడితం కానిది పర మయితే ఈకార్యం లేదు. లెమ్ము, పొందు.మొ.

ఆమ్రేడితంబు 'పరం బగునపుడు' అనడంచేత (ఆమ్రేడితానికి పూర్వంలోని మొదటిశబ్దంలోనే ఈదీర్ఘం.) ఆమ్రేడితంలో దీర్ఘం రాదు. లెలేమ్ము, పాపోందు అని కాదు.

'కృతహ్రస్వంబునకు' అనడంచేత సహజ మయినహ్రస్వానికి దీర్ఘం రాదు.

కొట్టు కొట్టుము, లెమ్ము లెమ్ము. ఇక్కడ కొట్టూ కొట్టుడు, లెమ్మూ లెమ్ము ఇత్యాదిగా దీర్ఘం రాదు.

'అగు' అనడంచేత ఈకార్యం నిత్యం. కాబట్టి దీర్ఘం రాని లెలెమ్ము, పొపొందు అనేవిధ మయినరూపా లుండవు.

ఈకార్యం ఆమ్రేడితం పరంగా ఉన్నపుడు మాత్రమే కాక మధ్యమముడుజులు లోపించిన అన్నిసందర్భాలలోనూ అంటే హలవసానపరకతలోనూ వస్తుంది.

రా, బాలకృష్ణ ! రా. సూరి 'ముడుజులకు లోపంబు రా- అని శబ్దలక్షణ సంగ్రహంలో చెప్పాడు. కాబట్టి 'ఆమ్రేడితంబు పరం బగునపుడు' అనకుండా ' మధ్యమముడుజులకు లోపంబు రా' అని చెప్పి ఉంటే లక్ష్యా లన్నీ సంగ్రహింపబడేవి.

# 3.శబ్దపరిచ్ఛేదం

**1. విశేషణము జాత్యాదిభేదంబుచే షడ్విధంబు** (3)

చూ. విషయవివరణం.

**2. ఒక్కొకచో విశేష్యవిశేషణంబులు వ్యత్యస్తంబులు నగు.** (9)

వ్యత్యాసం అంటే తారుమారు కావడం. తారుమా రయినది వ్యత్యస్తం. కొన్నిచోట్ల విశేషణాలూ, విశేష్యాలూ, తారుమారు అవుతా యని సూత్రానికి అర్థం. అంటే విశేషణాలు విశేష్యా లవుతాయి, విశేష్యాలు విశేషణాలు అవుతాయి.

నీమాఱుదల్లి త్రిభువనభామారత్నంబు గంధవతిపై. ఈ ప్రయోగంలో 'గంధవతి' అనేది సంజ్ఞ. కాబట్టి సంజ్ఞాప్రయుక్త విశేషణం. తల్లి అనేది విశేష్యం. నీమాఱుదల్లి, (త్రిభువనభామారత్నమూ) అయిన గంధవతిమీద- అనేఅన్వయంతో విశేష్య మయిన మారుదల్లి విశేషణ మయింది. (సంజ్ఞాప్రయుక్త) విశేషణ మయిన 'గంధవతి' ప్రధాన ఇక్కడమై విశేష్యం అయింది.

'ఒకొక్కచో' అనడంచేత ఈవిధమైన వ్యత్యాసం సార్వత్రికం కాదు. అరుదుగా మాత్రమే ఉంటుందని అర్థం.

'విశేషణ విశేష్యంబులు' అనడం స్పష్టతకే. 'ఒక్కొకచో వ్యత్యస్తంబులు నగు' అని చెప్పినా ప్రకరణాన్నిబట్టి ఈఅర్థం సిద్ధిస్తుంది.

'వ్యత్యస్తం' అంటే విశేషణం పూర్వంలోనూ, విశేష్యం దానికి తరువాతగానూ ప్రయోగింపబడడం అనేస్థితి తారుమారవుతుందని కొందరు అర్థం చెప్పారు. అంటే మారుతల్లి అనేది విశేష్యమే, గంధవతి-విశేషణమే ముందువెనుకలే తారుమారయ్యాయి అంటారు. కాని 'గంధవతిపై' అనేదే ప్రాధాన్యాన్నిబట్టి ఇక్కడ విశేష్యం.

'వ్యత్యస్తంబులును' అనేచోటిసముచ్చయంచేత వ్యత్యస్త మయినచోట వ్యత్యస్తంగానిస్థితికూడా ఉంటుందని అర్థం.

## 3. విశేషణంబులు కొన్ని వ్యవహితంబులు నగు. (11)

వ్యవహితం అంటే వ్యవధానం అంటే ఎడం కలిగినది. విశేషణాలను గురించి చెప్తున్నాడు కాబట్టి ఈవ్యవధానం విశేష్యంతో అని గ్రహించాలి.

(విశేషణానికీ, విశేష్యానికీ) మధ్యలో వేరే పదం ప్రయోగించడంచేత విశేషణం విశేష్యంతో వ్యవధానం (ఎడం) కలిగినది కావడం కొన్ని విశేషణాలవిషయంలో ఉన్న దని సూత్రానికి అర్థం.

మే లెల్లెడఁ గాన వరునిన్. ఇచట 'వరుని' అనేది విశేష్యం.మేలు అనేది విశేషణం. మేలు-వరుని అనే విశేషణవిశేష్యాలకు మధ్యలో 'ఎల్లెడఁ గాన' అనేపదాలు ప్రయోగింపబడినాయి. కాగా మేలు అనేవిశేషణం వరుని అనేవిశేష్యంతో 'ఎల్లెడఁ గాన' అనే పదాలతో వ్యవధానం కలిగిఉన్నది కాబట్టి యిది ప్రస్తుతసూత్రానికి లక్ష్యం అవుతున్నది.

ఇక్కడ 'మే లెల్లెడ వరునిఁ గాన' అని పాఠాంతరం. అందులోనూ 'ఎల్లెడ' అనేదానితో వ్యవధానం. 'మేలిల్లెడువరుని' అనే ముద్రితపాఠంలో మేలిల్లెడు ధాతుజవిశేషణం కాబట్టి వ్యవధానం లేదు.

వీరభోజ్యము సుమ్ము రాజ్యము, మొదలుగా విశేషణవిశేష్యములకు వ్యవధానం ప్రయోగాలలో ఉన్నది. కాని మేలెల్లెడ గాన వరుని అనేరీతి వ్యవధానం మాత్రం వింతగా తోస్తున్నది.

4. హలవసానంబులు పరంబు లగునపుడు లురు వర్ణకంబుల యుత్వంబునకు లోపంబు వైకల్పికంబుగ నగు.(16)

కకారాదులు హల్లులు. పిదప వర్ణము లేవీ లేకపోవడం అవసానం. వర్ణకం అంటే ప్రత్యయం. హల్లు గానీ అవసానం గానీ పరంగా ఉన్నప్పుడు, పూర్వంలో ఉన్న ప్రత్యయాలైన లు - రు - అనేవాటిలోనిఉకారానికి వికల్పంగా లోపం వస్తుంది అని సూత్రానికి అర్థం.

ప్రతతులు+సాల్పడి. ఇక్కడ హల్లు(సకారం) పరమైంది. కాబట్టి ప్రథమాబహువచనం అయిన లు వర్ణంలోని ఉకారం ప్రస్తుతసూత్రం ప్రకారం లోపించగా ప్రతతుల్ సాల్పడి అని అవుతుంది.

' వైకల్పికం' అనడంచేత ఉత్వం లోపించనిపక్షంలో 'ప్రతతులు సాల్పడి' అని కూడా ఉంటుంది.

భూసురోత్తముల్ భూసురోత్తములు - ఇక్కడ అవసానంలో ఉత్వలోపం.

ఇలాగే తత్పాలురు + భయంబు - తత్పాలుర్భయంబు - హల్పరకతలో - ప్రథమాబహువచన మైన 'రు' వర్ణకంలో ఉత్వలోపం. ఇలాగే వత్తురు + వారు - వత్తుర్వారు.

భూపాలుర్ - (భూపాలురు) అవసానంలో రువర్ణంలో ఉత్వలోపం.

'హలవసానంబులు' అనడంచేత అచ్చు పర మైనపుడు ఉత్వానికి లోపం రాదు. ప్రతతులు + ఎగిరి = ప్రతతు లెగిరి, భూపాలురు + అందఱు = భూపాలురందఱు అనేవిధంగా ఉత్తుకు సంధి జరుగుతుంది.

'లురు' అనడం చేత ఇతరప్రత్యయాలలోని ఉత్త్వానికి లోపం రాదు. రాముఁడు రాఁడు. మొ॥.

'వర్ణకంబుల' అనడంచేత ప్రత్యయం కాని లు-రు- అనేవర్ణాలలోనిఉత్వానికి ఈసూత్రంచేత లోపం రాదు. (విలుపూని, కారుపోతు)

'పదాంతంబు లయి యసంయుక్తంబు లయిననులురులయుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు' అనే బాలవ్యాకరణ లక్షణంచేత ప్రత్యయం ఐనదీ, ప్రత్యయం కానిదీ అయిన లురులలో ఉత్వం లోపిస్తుంది. కాబట్టి యిక్కడి ఉదాహరణ లన్నీ బాలవ్యాకరణసిద్ధాలే. సూరి రువర్ణంలో ఉత్వానికి లోపం హల్లు పరంగా ఉన్నపుడు ప్రాయికంగా కనబడుతున్న దన్నాడు. కాబట్టి అవసానం పరంగా ఉన్నపుడు లోపం అరుదుగా (ప్రత్యయేతరంలో అసలు లేదు) వస్తుంది. అది కవిప్రయోగానుగుణం.

కాగా ప్రస్తుతలక్షణం బాలవ్యాకరణలక్షణానికి వ్యాఖ్యానప్రాయం. స్పష్టత ప్రయోజనం అనవచ్చు.

### 5. జడపదంబుమీఁదితోడకు మెయిమైలు వికల్పంబుగ నగు (18)

'జడము లనఁగా నచేతనములు' 'మెయిమైలు' అంటే మెయి, అనీ, మై అనీ రెండుశబ్దాలను లక్ష్యానుగుణంగా గ్రహించాలి .'తోడకు' అనేచోటిషష్ఠిచేత తోడ ప్రత్యయంస్థానంలో అని అర్థం.

జడవాచకా లయినశబ్దాలమీద ఉన్న తోడ అనేతృతీయావిభక్తిస్థానంలో మెయి, లేదా, మై అనేశబ్దాలు వికల్పంగా అదేశంగా వస్తాయి అని సూత్రానికి అర్థం. ఇవి రెండూ 'తోడ' స్థానంలోనే రావాలి కాబట్టి, ఒకటి రానిపక్షంలోనే రెండవది వస్తుం దని అంటే పర్యాయంగా వస్తా యని గ్రహించాలి. తోడకు ఆదేశ మైన మెయి మైలు ద్రుతాంతా, లవుతాయి.

'భక్తితోడన్' అన్నపుడు భక్తి అనేజడవాచకంపైన ఉన్న 'తోడ' స్థానంలో ప్రస్తుతసూత్రంచేత 'మెయి' అనేది ఆదేశం అయి భక్తిమెయిన్. వికల్పం కాబట్టి 'మెయి' ఆదేశం కానిపక్షంలో భక్తితోడన్ అని ఉండగా మై అనేది ఆదేశ మై భక్తిమైన్. ఇది కూడా వికల్పం కాబట్టి (మై) రానిపక్షంలో భక్తితోడన్.

'జడపదంబుమీఁది' అనడంచేత అజడశబ్దాలమీద ఈకార్యం లేదు. రామునితోడ-సీతతోడ, లేడితోడ-మొ॥ ఇక్కడ రాముని మెయిన్ అనేరీతిరూపాలు ఉండవు.

'తోడకు' అనడంచేత జడశబ్దాలమీద నైనా ఇతరవిభక్తులకు ఈకార్యం లేదు. 'విద్యచేత యశంబు గల్గు' - ఇక్కడ విద్యమెయి, లేదా విద్యమై యశంబు గల్గు - అని కాదు.

'మెయిమైలు' అన్నప్పటి బహువచనంచేతా, కవిప్రయోగాలనుబట్టి కూడా, ఇక్కడ విధింపబడినవి మెయి-మరియు మై-అనే రెండు శబ్దాలు అని తెలుసుకోవాలి.

'జడపదంబుమీఁది తోడకు' అనేచోట 'జడంబుతోడకు' అని చెప్తే ఇంకా నిర్దుష్టంగా ఉండేది అనిపిస్తుంది.

జడశబ్దాలమీద అన్నింటా ఈకార్యం కనబడదు. కోలతోడ గూల్చె. అన్నచోట కోలమెయి గూల్చె అని ఉండదు. ఈకార్యం 'కొన్నియెడల'- అనేవిధంగా చెప్పడం అవసరం అనిపిస్తుంది.

6. ద్విత్వయుక్తలాంతంబు మీఁదిలులలకును రుర లాదేశంబు లగు (23)

ద్విత్వంతో కూడినలకారం ద్విత్వయుక్తలకారం. ద్విత్వయుక్తమైన 'ల' అంతంలో కలిగినశబ్దం ద్విత్వయుక్తలాంతం. 'లు' అనేది ప్రథమాబహువచనం'. 'ల' అనేది ద్వితీయాదివిభక్తులలో బహుత్వంలో ఆగమంగా వచ్చినది.

'ల్ల' అనేవర్ణం చివర కలిగిన ప్రాతిపదికలమీద ఉన్న లు-ల-అనేబహువచనాలకు క్రమంగా రు-ర అనేవి ఆదేశంగా వస్తాయని సూత్రాని కర్థం. లువర్ణంస్థానంలో రువర్ణమూ, లవర్ణంస్థానంలో 'ర' వర్ణమూ ఆదేశ మవుతాయి.

'మల్ల' ప్రాతిపదిక. 'పుంలింగం బై మహద్వాచకం బయిననామంబుతుదియత్వంబున కుత్వం బగు' అని ఉత్వం వచ్చి మల్లు. దీనిపై ప్రథమాబహువచనవివక్షలో 'లు వర్ణంబు బహువచనంబు' అని లువర్ణకమై మల్లు+లు. ప్రస్తుతసూత్రంచేత 'లు' వర్ణం స్థానంలో 'రు' ఆదేశం కాగా మల్లురు.

ఇలాగే ద్వితీయాదుల్లో 'ల' కు 'ర' వర్ణం వస్తుంది. మల్లు+లను - మల్లురను మొ॥.

'అదంతం బయి దీర్ఘపూర్వలోపధం బయిన' అనేబాలవ్యాకరణసూత్రమూ, లాన్తా త్తు రురౌ, అనే చింతామణిసూత్రమూ లాంతాలమీద మాత్రమే విధించిన ఈకార్యం 'ల్లా'ంతాలపై రాకపోతుండగా ప్రౌఢవ్యాకర్త ఈలక్షణం చేశాడు.

'ద్విత్వయుక్త' అనడంచేత అద్విరుక్త మైతే ఈసూత్రంప్రకారం రురలు రావు. అదంతం బయి అనేబాలవ్యాకరణంచేత రేఫ చేవస్తుంది. బాల-బాలురు-మొ॥.

ద్విత్వయుక్త 'లాంతంబు' అంటే 'లల' అనేది చివరిలో ఉన్నశబ్దం అని అర్థం అవుతుంది. 'సలలాంతం' ఇత్యాదిగా చెప్తే బాగుండేది.

'లాంతంబు' అనడంచేత 'ల్ల' వర్ణాంతం కానిశబ్దంమీద ఈకార్యం లేదు.

వ్యాకర్త చింతామణిమార్గాన్ని అనుసరించి లు-ల-లకు మొత్తానికి రు-ర-లాదేశించాడు. కాని ఆదేశాలుగా చెప్పిన 'రుర' లలోని ఉత్వఅత్వాలు అంతకు ముందున్న లు-లలో ఉన్నవే. కాబట్టి సూరి మార్గంలో ల కారానికి రేఫం చేస్తే చాలు.

'లులలకును' అనేచోటినుశబ్దంచేత పూర్వవ్యాకరణానుసారంగా బహువచనా లయిన లులలకే అని అర్థం. కాబట్టి ఇతరవర్ణాలకు ఈకార్యం లేదు. మల్లు లాఘవము.

'ఆదేశంబులు' అనడం స్పష్టతకే. 'లులలకు' అనేచోటిషష్ఠీవిభక్తివల్ల 'షష్ఠీస్థానే యోగా' అనేసంస్కృతపరిభాష ననుసరించి లులలస్థానంలో, రురలు ఆదేశంగా వస్తా యనేఅర్థం సిద్ధిస్తునే ఉన్నది. 'లులలకు రురలు' అంటే చాలు.

'అగు' అనడంచేత ఈకార్యం నిత్యం. కాబట్టి రురలు రాని మల్లులు', మల్లులను అనేరీతిరూపాలు లక్షణవిరుద్ధాలు కావలసివస్తున్నది. కాని తిక్కన ఆదేశం కాని మల్లులు అనేరూపాన్ని ప్రాసఘటితంగా ప్రయోగించాడు.

కాబట్టి 'అగు' అని కాక, విభాష అనో, చూపట్టెడి ననో చెప్పడం యుక్తం.

### 7. విధాశబ్దంబు సంస్కృతంబునం బుంలింగంబు నగు (24)

'విధా' అని స్త్రీలింగంగా ప్రసిద్ధమై ఉన్నశబ్దం సంస్కృతంలో పుంలింగం కూడా అయిఉన్నది అని సూత్రాని కర్థం.

'విధో విధానే' అనేవాక్యం ప్రకారం విధానం అనేఅర్థంలో 'విధః' అని యీశబ్దం పుంలింగంలో ఉన్నట్లు అజయుడు చెప్పడం దీనికి ప్రమాణం.

'తత్సమంబునం బుంలింగరూపముతోనె ప్రయోగము గాని స్త్రీలింగరూపముతో లేదు' అని వ్యాకర్త విశేషవివరణం.

'విధ' అనేపుంలింగశబ్దం తెలుగులో ప్రాతిపదిక. ఇది పుంలింగ మైనా అమహత్తు. అదంతం కూడా అయింది కాబట్టి ప్రథమైకవచన వివక్షలో 'అమహన్నపుంసకముల కదంతములకు మువర్ణకం బగు' అని ముప్రత్యయం వచ్చి విధము. ఇతరవిభక్తుల్లో విధములు విధములందు మొ॥.

'విధా' అనేస్త్రీలింగశబ్దం తెలుగులోకి రాదు. కాబట్టి ప్రథమైకవచనలోపాదికంతో విధ- విధలు అనేవిధ మయినరూపాలు ఉండవు.

'సంస్కృతంబునన్' అనేదళం సూత్రంలో వ్యాఖ్యానప్రాయమె.

సూరి 'విధా' అనేస్త్రీలింగరూపమే తీసుకుని, విధ-విధలు అనేరీతిస్త్రీలింగరూపాలను నివారించి, విధము, విధములు అనే రీతిగా మువర్ణకాంతరూపాలను సాధించడంకోసం అకంధరాదులు క్లీబతుల్యంబులు బహుళంబుగా నగు' నని చెప్పి బహుళశబ్దానికి ప్రయోజనంగా క్లీబతుల్యత్వం దీనికి నిత్యంగా పేర్కొన్నాడు. ప్రౌఢవ్యాకర్త దానిని పూర్తిగా తిరస్కరిస్తూ- స్త్రీలింగశబ్దం అసలు తెలుగులోకి రాదనీ, మువర్ణకాంతరూపం పుంలింగశబ్దంనుండి సిద్ధిస్తుంది. కాబట్టి సూరి క్లీబతుల్యత విధించడం అనవసర మని ఈలక్షణం చేశాడు.

'విధాశబ్దంబు' అని స్త్రీలింగశబ్దాన్ని ఉచ్చరిస్తూ పుంలింగం కూడా అవుతు దనడాన్నిబట్టి స్త్రీలింగశబ్దమే ప్రసిద్ధం అని స్పష్టం. 'పులింగంబును' అనేచోటిసముచ్చయం పుంలింగశబ్దం అప్రసిద్ధ మని కూడా చెప్తున్నది. కాగా అప్రసిద్ధమైన (పుంలింగ) శబ్దంనుంచి తత్సమా లేర్పడ్డా యనడం ఉచితం కాదు. సూరిమార్గం ఉచితం. ఈలక్షణం సరికాదు అని విమర్శకులు నిర్ణయించారు.

8. అర్ఘాదులకడయచ్చున కుత్వంబును మీఁద వువర్ణకంబును వైకల్పికంబుగా నగు (25)

అర్ఘ మొద లైనవి అర్ఘాదులు. వర్ణకం అంటే ప్రత్యయం. 'డుమువులు ప్రథమ, డుమువున లేకవచనంబులు' అనే లక్షణాల ననుసరించి 'వు' ప్రథమైకవచనం.

అర్ఘ మొద లైనప్రాతిపదికలలో చివరిఅచ్చుస్థానంలో అన్ని విభక్తులలోనూ హ్రస్వ మయినఉకారం ఆదేశంగా వస్తుంది. దానిపైన ప్రథమావిభక్తి ఏకవచనంలో వుఅనేప్రత్యయం వస్తుంది. అని సూత్రానికి అర్థం.

అర్ఘ మొద లయినఈశబ్దాలు అన్నీ అదంతాలు. ఇవి అన్నీ అమహత్తులు. కాబట్టి 'అమహన్నపుంసకముల కదంతములకు ముువర్ణకంబగు' అని ముువర్ణకం ప్రాప్తిస్తుండగా దాన్ని బాధించి ప్రస్తుతసూత్రంచేత ఉత్వవువర్ణకాలు అవుతా యని అర్థం.

'అర్ఘ' అనేప్రాతిపదికకు ప్రథమైకవచనవివక్షలో 'అమహన్నపుంసకములకు' అనేసూత్రాన్ని బాధించి ఈసూత్రంచేత చివరి అత్వానికి ఉత్వమూ, (అర్ఘు) మీద వుప్రత్యయమూ వచ్చి అర్ఘువు అని అవుతుంది.

'వైకల్పికం' అనడంచేత ఉత్వవువర్ణకాలు రానిపక్షంలో బాధ లేదు కాబట్టి 'అమహన్నపుంసకములకు' అనేసూత్రంచేత ముువర్ణకం వచ్చి అర్ఘము అని అవుతుంది.

'ప్రథమైకవచనేతరవిభక్తులలో ఉత్వం మాత్రం ఈసూత్రంప్రకారం రాగా, 'వువర్ణకేతరవిభక్తి పరం బగునపు దుకారాంతంబులకు బహుళంబుగా..... వుగాగమం బగుని అనే సూరిసూత్రంచేత బహుళంగా వుగాగమం వస్తుంది. అర్ఘువులు. అర్ఘులు. మొ॥.

'అర్ఘాదుల' అనడంచేత అర్ఘ మొదలయిన వాటిల్లో చేరనిశబ్దానికి ఈకార్యం లేదు. వృక్షము, వనము మొ॥ వృక్షువు, వనువు ఇత్యాదిగా కాదు.

'కడయచ్చునకు' అనడంచేత మిగిలినవర్ణాలకు ఈకార్యం రాదు.

అర్ఘాదు లన్నీ అదంతాలే. 'అచ్చునకు' అని సామాన్యంగా కాకుండా 'అత్తునకు' అని స్పష్టంగానే చెప్పవచ్చు. పయిగా విధింపబడిన ఉత్వం ఏకాల్లు కాబట్టి అలోఽంత్యస్య' అనేసంస్కృతపరిభాషచేత చివరివర్ణంస్థానంలోనే వస్తుంది. కాబట్టి సూత్రంలో 'కడయచ్చునకు' అనేదళం అనవసరం.

'ఉత్వంబును వువర్ణకంబును' అనేచోటి సముచ్చయార్థకశబ్దాలచేత ఈరెండు కార్యాలు కలిసే వస్తాయి. రాకపోతే రెండూ రావు. కాబట్టి ఉత్వం మాత్రమే వచ్చి అర్ఘు - అని కానీ, వువర్ణకం మాత్రమే వచ్చి అర్ఘవు అని కానీ కాదు.

'మీఁద' అనేదళం స్పష్టతకే. 'వు' వర్ణకం అంటే ప్రత్యయం కాబట్టి 'ప్రత్యయః- పర శ్చ అని పరంగానే వస్తుంది.

అసలు వు వర్ణకవిధానమే స్పష్టత కనాలి. 'ఉత్వం' రాగా ఉదంతా లయినఈశబ్దాలమీద 'ఉకారాంతగోశబ్దంబుల కంతట వువర్ణకం బగుని అని బాలవ్యాకరణంచేతనే వువర్ణకం సిద్ధిస్తుంది. కాబట్టి 'అర్ఘాదుల కుత్వంబు వైకల్పికంబుగా నగు' నని ఉత్వాన్ని మాత్రం సూత్రంలో విధించి వువర్ణకాన్ని వివరణలో ప్రస్తావించవచ్చు.

### 9. రాహు బాహు శబ్దముల కంతట వువర్ణకలోపంబు వైకల్పికంబు (26)

రాహు బాహు అనేశబ్దాలకు పరంగా ఉన్న ప్రథమైకవచన వు ప్రత్యయం వికల్పంగా లోపిస్తుం దని సూత్రానికి అర్థం.

'రాహు' శబ్దం మహద్వాచకం, పుంలింగం. ప్రథమైకవచనంలో డుఙ్ను (నిత్య వు వర్ణకాన్నీ) బాధించి 'ఉకారాంతం బగు మహత్తునకు వువర్ణకము బహుళముగా నగు' అనేసూత్రంచేత వువర్ణకం వచ్చి రాహువు. ప్రస్తుతసూత్రంచేత ఆ వుప్రత్యయం లోపించగా రాహు.

'వైకల్పికంబు' అనడంచేత లోపం రానిపక్షంలో వువర్ణకంతో రాహువు. 'బహుళం' కాబట్టి వువర్ణకం అసలు రాకపోతే 'పుంలింగ మగు మహద్వాచకమునకు డు జగు' అని డుఁప్రత్యయం వచ్చి రాహుఁడు.

బాహుశబ్దంమీద ప్రథమైకవచనంలో 'ఉకారాంతగోశబ్దంబుల కంతట వువర్ణకం బగు' అని వు ప్రత్యయం వచ్చి బాహువు. ఆవువర్ణకం ప్రస్తుతసూత్రంచేత లోపించి బాహు. 'వైకల్పికం' కాబట్టి లోపం రానిపక్షంలో బాహువు.

'రాహుబాహుశబ్దంబులకు' అనడంచేత ఇతరశబ్దాలకు ఈకార్యం లేదు. శంభువు, తరువు – మొ॥.

'అంతట అనడంవల్ల' ప్రథమైకవచనేతరవిభక్తులలో కూడా ఈలోపం వస్తుం దని సూత్రకర్త భావించినట్లుంది. అందుకే రాహులు, బాహులు అని కూడా ఉదాహరించాడు. ప్రథమైకవచనేతరస్థలాలలో 'వు' ఆగమం. వర్ణకం కాదు. కాబట్టి 'వువర్ణకంబునకు అంటే వుగాగమానికి రాదు' లోపం. అయినా వుగాగమానికి లోపం చెప్పక్కర్లేదు. ఉకారాంతాలకు వుగాగమం బహుళం కాబట్టి ఆగమం రాకుండానే ఈరూపాలు బాలవ్యాకరణంచేత సిద్ధిస్తున్నాయి. వుగాగమలోపాన్ని వ్యాకర్త ఉద్దేశించి ఉండకపోతే రాహులు, ఇత్యాదిగా ఉదాహరించడం అనవసరం. సూత్రంలో 'అంతట' అనేదళమూ అనవసరమే.

'బాహు' అనేప్రయోగం లేదు. 'బాహప్పళించు' శబ్దపల్లవం. కాబట్టి అందులో వర్ణవికారంగా వు లోపాన్ని గుర్తించవచ్చు. కాగా బాహుశబ్దానికి ప్రథమైకవచనంలో గూడా ఈలోపం చెప్పనవసరం లేదు.

రాహుశబ్దానికి 'ఉకారాంతం బగుమహత్తునకు వువర్ణకము బహుళముగా నగు' అనేసూత్రంలోని బహుళశబ్దంచేత అన్యకార్యంగా ప్రథమైకవచనలోపంతో 'రాహు' అనేరూపం సాధించవచ్చు. కాబట్టి ప్రస్తుతసూత్రం అవసరం అంతగా లేదు. చెప్పాడు కాబట్టి స్పష్టత కుపయోగించుకోవచ్చు.

### 10. విశ్వకర్ముఁ డనియు రూపంబు (27)

'విశ్వకర్మన్' అనే నకారాంతశబ్దానికి 'విశ్వకర్ముఁడు' అనేవిధంగా పుంలింగరూపం కూడా ఉన్నది అని సూత్రానికి అర్థం.

'విశ్వకర్మన్' శబ్దం పుంలింగమే. కాని బాలవ్యాకరణం 'విశ్వకర్మాదులకు స్త్రీత్వం బగు' అని నిత్యంగా స్త్రీలింగత్వాన్ని విధించి, స్త్రీలింగత్వాతిదేశంచేత ఉత్వ డుజులు రాజువని స్పష్టం చేసింది. కాగా ఉత్వ డుజులతో గూడ – అంటే పుంలింగంగా రూపం కవి ప్రయుక్తమై ఉన్నది. కాబట్టి విశ్వకర్మశబ్దానికి స్త్రీత్వాన్ని సూరి నిత్యంగా విధించడం సరి కా దని ప్రౌఢవ్యాకర్త తాత్పర్యం.

'విశ్వకర్మన్' శబ్దం. అలంతంబు ప్రథమైకవచనాంతతుల్యం బిందు నామం బగు' తెలుగులో 'విశ్వకర్మా' ప్రాతిపదిక. నామంబుల తుదిదీర్ఘంబునకు హ్రస్వం బగు' విశ్వకర్మ. 'విశ్వకర్మాదులకు స్త్రీత్వం బగు' అనేసూత్రాన్ని బాధించి ప్రస్తుతసూత్రంప్రకారం స్త్రీత్వం రాదు. కాబట్టి పుంలింగకార్యం వస్తుంది పుంలింగం బై మహద్వాచకం బయిన – అని ఉత్వమూ, పుంలింగ మగుమహద్వాచకమునకు అని డుజూ వచ్చి విశ్వకర్ముఁడు అని అవుతుంది.

'విశ్వకర్ముఁడు అనియు' అనేచోటిసముచ్చయంచేత ఈపుంలింగకార్యం రానిపక్షంలో బాలవ్యాకరణాన్ని అనుసరించి స్త్రీత్వం కలిగి, 'స్త్రీలింగంబులప్రథమైకవచనంబునకు లోపం బగు' అని ప్రథమైకవచనం లోపించగా విశ్వకర్మ – అనేరూపం అవుతుంది.

సూరి విశ్వకర్మాదు లనగా ఇక్కడ 'విశ్వకర్ముఁడు' అనడంచేత 'విశ్వకర్మన్' అనేదానికంటే ఇతరశబ్దాలకు పుంలింగరూపం ఉండదు. కాబట్టి కృష్ణవర్ముడు, యువుడు ఇత్యాదు లుండవు.

'అనియు' అనేసముచ్చయం 'విశ్వకర్మ' అనేస్త్రీత్వరూపం తఱుచుగా ఉంటుం దనీ, 'విశ్వకర్ముఁడు' అనే పుంలింగప్రయోగం అరు దని తెలుపుతున్నది.

'విశ్వకర్మునికూఁతు' అనేప్రయోగాన్నిబట్టి విశ్వకర్ముఁడు అనేరూపాన్ని సాధిస్తున్న ఈలక్షణం సార్థకమే. కాని 'విశ్వకర్మ కొక్కచో స్త్రీత్వంబు గానంబడదు' ఇత్యాదిగా 'స్త్రీత్వాభావాన్ని' పేర్కొంటే స్పష్టంగా ఉండేది.

## 11. ముత్తియశబ్దేతరంబులయందును దఱచుగ నిత్వలోపంబు గానంబడియెడి (49)

'ముత్తియ' అనేదానికంటే వే రయినశబ్దాలలో గూడా హ్రస్వ మైనఇకారానికి లోపం రావడం కవిప్రయోగాలలో తఱుచుగా కనబడుతున్న దని సూత్రానికి అర్థం.

సూరి 'ఇయశబ్దంబునం దికారలోపంబు కొందఱు వక్కాణించిరి. అయ్యది ప్రయోగంబులందు మృగ్యంబు. ముత్తియ శబ్దంబునందు మాత్ర మిత్వలోపంబు గానంబడియెడి' అన్నాడు. దీన్నిబట్టి ముత్తియశబ్దం ఒక్కదానిలో మాత్రమే ఇత్వం లోపిస్తుం దనీ, తదితరశబ్దాలలో ఇత్వలోపం మృగ్య మనీ సూరి చేసినలక్షణాన్ని సవరిస్తూ ప్రౌడవ్యాకర్త ప్రస్తుతసూత్రం చెప్తున్నాడు. కాబట్టి 'ఇత్వలోపం' అంటే 'ఇయ'లో ఇత్వానికి లోపం అనీ, ముత్తియేతరమైనయీ శబ్దా లన్నీ, ఇయాంతాలే ననీ, గ్రహించాలి.

'కన్నియ', 'ఇయకు నామాంతంబున కెత్వంబు' వస్తే కన్నె. బహుళం గాబట్టి ఎత్వం రాక కన్నియ అని ఉండగా ప్రస్తుత సూత్రంచేత 'ఇ' కారం లోపించి 'కన్న్+య'. భిన్నహల్సంయోగంలో నడుమ సజాతీయ మైనహల్లు లోపిస్తుంది. కాబట్టి ఒక నకారం లోపించగా కన్+య, కన్య (సంస్కృతసమ మైన కన్య శబ్దంకంటె ఇది భిన్నం. తద్భవం).

తఱచుగ అనడంచేత ఇత్వలోపం రానిపక్షంలో కన్నియ, ఇలాగే పళ్యము పల్లియము మొ॥.

'ముత్తియశబ్దేతరంబులందును' అనేచోటిసముచ్చయార్థకంచేత పూర్వ (బాల) వ్యాకరణానుసారంగా ముత్తియశబ్దంలో ఇత్వం లోపించడం సమ్మతమే. ముత్యము ముత్తియయు.

'కానంబడియెడి' అనడంచేత ఈకార్యం కావ్యాలలో కనబడినశబ్దాలలో మాత్రమే గ్రహించాలి. అంటే కవిప్రయోగాలలో ఇత్వలోపం వచ్చినశబ్దాలను ఇక్కడి ముత్తియేతరశబ్దాలలో చేర్చుకుని ఈసూత్రంచేత ఇత్వలోపం సాధించుకోవాలి. కాబట్టి

సందియము, జన్నియ – మొ॥ చోట్ల ఇత్వం లోపించదు.

ముత్తియేతరశబ్దంబులందు, అనో ముత్తియేతరములందు అనో చెప్తే సూటిగా ఉండేది.

'తఱచు' అంటే ఇత్వలోపం వచ్చినరూపాలే అధికంగా ఉంటా యని అర్థం. కాని అది కవిప్రయోగాలకు విరుద్ధం. మృగ్య మన్న సూరివచనాలపై విరోధాన్ని ఇది ఎక్కువగా వ్యక్తం చేస్తున్నది. 'తఱచుగ' అనేపదం లేకుండటం యుక్తం.

## 12. ఆత్మార్థం బొకానొకచో నామాస్మదర్థాభిధాయియు నగు (78)

ఆత్మన్ అనేసంస్కృతశబ్దంయొక్క అర్థాన్ని తెలిపే తెలుగుశబ్దం ఆత్మార్థం. 'తా' అనేశబ్దం. నామం అంటే వస్తువును బోధించేశబ్దం. (అస్మద్యుష్మదర్థాలకు భిన్న మైనదాన్ని బోధించేది అని స్థూలంగా చెప్పవచ్చు) 'అస్మత్' శబ్దార్థాన్ని తెలిపే 'నా' అనేది అస్మదర్థం.

ఆత్మార్థకమయిన 'తా' అనేశబ్దం ఆయాసందర్భాలలో నామార్థాన్ని అస్మదర్థాన్ని గూడ తెలియజేస్తుం దని సూత్రాని కర్థం.

తనకు తానె చుట్టంబు ఇక్కడ తనకు తాను అనేఆత్మార్థకశబ్దం 'స్త్రీ' అనేనామార్థాన్ని బోధిస్తుంది. స్త్రీకి స్త్రీయే చుట్టం అని దీని అర్థం.

ఇలాగే 'తన కిష్టుడున్' అనేనన్నయపద్యంలో తనకున్ అంటే నన్నయకు అని నామార్థక మైనట్లు చెప్పడం నన్నయమార్గం. నన్నయ తనవిషయంలో అస్మదర్థాన్ని ప్రయోగించడం అరుదు. పయిగా దీనితర్వాత పద్యంలో నన్నయభట్టు-జగద్ధితంబుగన్ అన్నాడు కూడా.

'తన తనుచ్ఛాయ' అన్నచోట తన (యొక్క) అనేఆత్మార్థకం నా (యొక్క) అని అస్మదర్థాన్ని తెలుపుతున్నది.

'ఆత్మార్థంబు' అనడంచేత యుష్మదర్థాదులకు ఈకార్యం లేదు.

'ఒకానొకచో' అనడంచేత ఈకార్యం కవిప్రయోగాల్లో అరుదుగా ఉంటుం దని అర్థం. కాబట్టి ప్రయోగానుసారంగా గ్రహించాలి.

'నామాస్మదర్థాభిధాయి' అనడంచేత ఇతర మైన యుష్మదర్థాదులను బోధించదు.

'అభిధాయియు' అనేచోటిసముచ్చయం ఆత్మార్థకం, ఆత్మార్థాన్ని బోధించడం సాధారణమే అని సూచిస్తుంది.

13. కొన్ని యెడల నవ కగు కానంబడియెడి (103)

సంఖ్యావాచకాలకు పూరణార్థంలో వచ్చే 'అవ' ఇక్కడ గ్రహింపబడుతుంది. 'సంఖ్యకుం బూరణార్థంబునం దవగాగమం బగు' అని సూరి 'అవక్' ఆగమంగా చెప్పాడు. 'సమాసే 2వ స్తు సర్వదా' అని అధర్వణుడు ప్రత్యయంగా చెప్పాడు. అవకు అన్నప్పటిషష్ఠీ విభక్తి చేత 'అవ' స్థానంలో అని అర్థం.

సంఖ్యావాచకాలమీద పూరణార్థంలో వచ్చిన 'అవ' అనేశబ్దం స్థానంలో 'అగు' అనేది కొన్ని కవిప్రయోగాలలో కనబడుతున్న దని సూత్రానికి అర్థం.

ఏడు అనేసంఖ్యను పూరించేది అనేఅర్థంలో 'ఏడు' శబ్దంపై 'సంఖ్యకుం బూరణార్థంబునందు' - అని అవ ఆగమ మై అపదాదిస్వరసంధి జరిగి ఏడవ. ఈవిశేషణం అమహదర్థంలో ఏడవది. ఏడవది అయినపర్వము ఏడవపర్వము. ప్రస్తుతసూత్రం చేత' 'అవ' స్థానంలో 'అగు' వచ్చి - ఏడగుపర్వము.

'కొన్నియెడల' అనడంచేత 'అగు' రావడం అరుదు. అంటే తఱుచుగా 'అవ' ఉంటుంది. ఏడవవాడు, పదవది మొ॥.

'అవకు' అనడంచేత 'అవ' లేకపోతే 'అగు' రాదు. పర్వము లేదు- ఇక్కడ పూరణార్థం లేదు. కాబట్టి అవ రాదు. అందుచేత అగు కూడ ఉండదు. పర్వము లే దగు అని కాదు.

'కానంబడియెడి' అనడంచేత అరుదుగా సైతం అవకు-అగు వచ్చేస్థలాలను కవిప్రయోగాలలో కనబడేవాటినే గ్రహించాలి.

అవకు 'అగు' అనడంచేత ముందు అవ చేసి దానికి అగు ఆదేశం చేయాలి. 'పూరణంలో అగు' (అవకు బదులుగా) విధిస్తే ప్రక్రియలో లాఘవం సిద్ధించేది.

'అగు' ధాతుజవిశేషణంగా సమన్వయిస్తే 'అగు' విధానమే అవసరం కాదు. అవకాశం పరిశీలించాలి.

## 14. ఊరు చోటు మేన్వాదు లున్లుగ్విషయంబులు (106)

విషయాలంటే లక్ష్యాలు. ఊరు, చోటు, మేను మొద లైనవి 'ఉన్' లోపించడానికి లక్ష్యా లని సూత్రాని కర్థం.

ఊరు లోనగువానికి, ధృతీయయం దత్వము. సంప్రాప్తింపదు గాన 'ఔపవిభక్తికనామ్నా మత్వం స్యా త్సప్తమీ తృతీయార్థే. అనుసూత్రమున కవి విషయములు గాక, కేషాంచి దుదంతానాం నేతి విభక్తా వునో లుక్ స్యాత్. అనుసూత్రమునకు విషయంబు లగుచున్న వని యెఱుంగవలయును' అని సూత్రార్థాన్ని సూత్రకర్త స్పష్టం చేశాడు.

కాగా ఈసూత్రం చింతామణిలక్షణానికి వ్యాఖ్యానం.

'ఔపవిభక్తికనామ్నా మత్వం స్యా త్సప్తమీ తృతీయార్థే' అనేచింతామణిసూత్రం ఔపవిభక్తికశబ్దాలకు పైన తృతీయా సప్తమీ విభక్తులఅర్థంలో అత్వం చెప్పింది. ఊరు మొద లైనవి ఔపవిభక్తికాలే. కానీ ఊరన్. మొ॥ వాటికి సప్తమ్యర్థం మాత్రమే ఉంది తప్ప అందుచేత తృతీయార్థం లేదు. తృతీయా సప్తములు రెంటికీ చెప్పిన అత్వం సప్తమ్యర్థం మాత్రమే ఉన్న ఊరు మొ॥ వాటికి రాదు. కాబట్టి యివి ఆ సూత్రానికి లక్ష్యాలు కావు.

'కేషాంచి దుదన్తానాం నేతి విభక్తా వునో లుక్ స్యాత్' అనేచింతామణిసూత్రం కొన్ని ఉదంతాలకు సప్తమీ నవర్ణకం పరబిమావుతుండగా 'ఉన్' అనే దానికిలోపం చెప్తున్నది. నవర్ణకం సప్తమి కాబట్టి ఉన్లోపంచేత ఏర్పడేరూపం సప్తమ్యర్థకం మాత్రమే అవుతుంది.

ఊరన్ మొద లైనవి సప్తమ్యర్థకాలు మాత్రమే. కాబట్టి అవి కేషాంచి త్తనేప్రస్తుతసూత్రానికే లక్ష్యా లవుతా యని ప్రౌఢవ్యాకర్త సమన్వయం.

ఊరు శబ్దంమీద సప్తమిలో 'అందు న సప్తమి' అని నవర్ణక మై (నుగాగమంతో) ఊరు+నన్ ప్రస్తుతసూత్రంచేత 'ఉన్' లోపించి (ఊర్+అన్) ఊరన్- లోపం రానిపక్షంలో ఊరునన్.

'ఊరు చోటు మేన్వాదులు' అనడంచేత వీటిలో చేరని ఔపవిభక్తికశబ్దాలకు అత్త్వం రావచ్చు. గోరన్-గోరిచేతన్, గోరియందున్ - మొ॥ కాగా ఇవి 'ఔపవిభక్తికనామ్నామ్' అనే సూత్రానికి విషయా లవుతాయి.

'ఉన్లుగ్విషయంబులు' అనడంచేత ఊరు లోనగువానికి ఉన్లోపమె వస్తుంది. కాని అత్వం రాదు. కాబట్టి ఊరిచేత అనే అర్థంలో ఊరన్ అనేరూపం ఉండదు.

'ఊరు చోటు మేన్వాదులు' అన్నపుడు ఆదిశబ్దం ఎలాగూ ఉన్నది. కాబట్టి చోటు, మేను శబ్దాలను సూత్రంలో చెప్పనవసరం లేదు. వివరణంలో ప్రౌఢవ్యాకర్తే, చెప్పినట్లు ఊరులోనగునవి (ఊర్వాదులు) ఇత్యాదిగా చెప్పటం ఉచితం. ఉన్లుగ్విషయంబులు అనక ఉన్లోపం (వికల్పంగా) విధిస్తే బావుండేది.

తృతీయలో అత్వంలేదు కాబట్టి అత్వం రాదనడం కుదరదు. అత్వం రాని ఊరిచేత, చోటితోడ – ఇత్యాదిరూపాలను కవి ప్రయోగాలనుంచి చూపాలి. అటువంటిదే లేకపోతే అత్వప్రసక్తే లేదు. సూరి 'ఔపవిభక్తికంబుల తృతీయాసప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగా నగు' అని బహుళంగా చెప్పాడు. ఊరిచేత, చోటితోడ్ లాంటివి కవిప్రయోగాల్లో దొరికితే, బహుళగ్రహణంచేత తృతీయలో అత్వం రా దని గ్రహించాలి.)

ఇంతకీ ఉన్లోపం చేస్తే సప్తమ్యర్థం మాత్రమే వస్తుం దనడం కూడా కుదరదు. 'ఉదంతజడంబు తృతీయకు నవర్ణకం బగు' అని నవర్ణకం తృతీయలో గూడా వస్తుంది. కాబట్టి ఉన్లోప పక్షంలోనూ తృతీయార్థం ప్రసక్త మవుతుంది. నవర్ణకం సప్తమే అయినా తృతీయార్థంలో కూడా వస్తున్నది కదా.

ఫౌఢవ్యాకర్త సమన్వయం సరికాదు. ఈలక్షణం విచార్యం.

**డాక్టర్. అంబడిపూడి నాగభూషణం**

పాఠం - 8

# ప్రౌఢవ్యాకరణం
# సూత్రవివరణం - 2
# కారకపరిచ్ఛేదం

## 1. ఉద్దేశార్థమునందు ద్వితీయకు గుఱించియు ననుప్రయుక్తం బగు (2)

ఉద్దేశం (లక్ష్యం) అనేఅర్థం ఉద్దేశార్థం. అనుసరించి ప్రయోగించబడడం అనుప్రయోగం. అలా అనుప్రయోగం అయినశబ్దం అనుప్రయుక్తం. ఉద్దేశించినదానిని తెలిపేశబ్దంయొక్క ద్వితీయావిభక్తికి పైన 'గుఱించి' అనేశబ్దం కూడా అను ప్రయుక్తం అవుతుంది అని సూత్రానికి అర్థం.

ఉద్దేశార్థంలో ద్వితీయావిభక్తి ప్రత్యేకంగా విధింపబడలేదు. 'కర్మంబున ద్వితీయ యగు' అని కర్మకు ద్వితీయ వస్తుంది. అక్కడ ఉద్దేశార్థం ఉన్నప్పుడు, కర్మార్థంలో వచ్చినద్వితీయమీద గుఱించిఁ కూర్చి మొ॥) ప్రయోగింపబడుతుం దని తాత్పర్యం.

'మముగుఱించి అర్చ సేయఁగా' (అర్చ చేయడం అనేధాత్వర్థానికి ఫల మైనఅర్చనలు పొందడం అనేది అస్మదర్థాన్ని ఆశ్రయించి ఉంది కాబట్టి) కర్మ అయిన 'నా' శబ్దానికి 'కర్మంబున ద్వితీయ యగు' అని ద్వితీయావిభక్తి వచ్చి బహుత్వంలో మమున్ అవుతుంది. ఈకర్మ 'మమ్ము ఉద్దేశించి' అనేవిధంగా ఉద్దేశార్థంతో ఉండడంచేత ప్రస్తుతసూత్రా న్ననుసరించి ద్వితీయమీద 'గుఱించి' శబ్దం చేరి (సరళపరక ద్రుతలోపంతో) 'మముగుఱించి' అవుతుంది. ఇలాగే రామునిగుఱించి మొ॥

'ఉద్దేశార్థంబునందు' అనడంచేత ఉద్దేశార్థం లేకపోతే ద్వితీయకు ఈకార్యం లేదు. పుస్తకమును చదివెను. పుస్తకమును గుఱించి అని ఉండదు.

'ద్వితీయకు' అనడంచేత ఉద్దేశార్థంలో ఇతరవిభక్తికి ఈకార్యం లేదు. పురుషార్థముకొఱకు యత్నింపవలయును. చతుర్థిపై గుఱించి మొ॥ చేరవు.

'గుఱించియు' అనేచోటి ను శబ్దం (సముచ్చయం) చేత 'కూర్చి' కూడా వస్తుం దన్నాడు వ్యాకర్త. పురుషార్థమునుగూర్చి మొ॥ విరించి గుఱించి, రమేశ్వరు గానీ గుఱియించి అనేవిధంగా ఇక్కడ గుఱించి, గుఱియించి అనేశబ్దాలు కూడా కవి ప్రయోగాలలో కనపడుతున్నాయి.

అంతేకాక ఈ ను శబ్దంచేత గుఱించి మొ॥ అనుప్రయుక్తం కాకపోవడం కూడా గ్రహించాలి. 'మమ్ము నర్చన సేయగా'.

## 2. ఒకానొకచోఁ దోడకుఁ బ్రత్యేక ప్రయోగంబునుం జూపట్టెడి (6)

ప్రకరణాన్నిబట్టి ఇక్కడ ప్రస్తావించినతోడ (తృతీయా) విభక్తి అని గ్రహించాలి. తోడ అనేతృతీయావిభక్తి ప్రాతిపదికను ఆశ్రయించి కాక స్వతంత్రంగా ప్రయోగింపబడటం కూడా కవిప్రయోగాలలో కానవస్తున్న దని సూత్రానికి అర్థం.

ఇది సుబంతం గానీ తిజంతం గానీ కాదు, కాబట్టి పదం కాదు. 'అపదం న ప్రయుంజీత' అనేసంప్రదాయాన్నిబట్టి పదం కానిదానిని స్వతంత్రంగా ప్రయోగించడానికి వీలు లేదు. ఇది నామ (తృతీయా) విభక్తి కాబట్టి ప్రాతిపదికలపైన ఉండి మాత్రమే ప్రయోగింపబడాలి. కాగా కవిప్రయోగానుసారంగా ఈసూత్రం అపద మయినా తోడకు స్వతంత్రప్రయోగాన్ని పేర్కొంటున్నది.

'విలోకించి తోడ మాటాడక' ఇక్కడ 'తనతోడన్' అనే అర్థంలో 'తన' అనే ప్రాతిపదిక లేకుండానే తోడన్ అనే తృతీయావిభక్తి ప్రత్యేకంగా ప్రయోగింపబడింది.

'ఒకానొకచో' అనడంచేత ఈకార్యం అరుదు. కాబట్టి తోడ కూడా సాధారణంగా ప్రకృతిని ఆశ్రయించే ప్రయోగింపబడుతుంది. రామునితోడన్ – మొ॥

'తోడకు' అనడంచేత ఇతరవిభక్తులకు ఈకార్యం రాదు. 'డు' మొ॥ విభక్తులకు స్వతంత్రప్రయోగం లేదు.

'ప్రత్యేకప్రయోగంబునున్' అనేచోటిసముచ్చయనుశబ్దంచేత స్వతంత్రంగా ప్రయోగింపబడిన అరుదయినస్థలాల్లో గూడా ప్రకృతి నాశ్రయించినప్రయోగమే సాధారణం. తనతోడ మాటాడక – మొ॥.

'చూపట్టెడి' అనడంచేత కవిప్రయోగాలలో కానవచ్చినస్థలాలలో మాత్రమే స్వతంత్రప్రయోగం అంగీకరించాలి. స్వతంత్రించి కొత్తస్థలాలలో ప్రయోగింపరాదు.

అపదం (ప్రత్యయం) స్వతంత్రంగా ప్రయోగింపబడిం దనడం శాస్త్రసంప్రదాయానికి అనుగుణంగా లేదు. తోడికోడలు, తోడఁబుట్టువు ఇత్యాదులలో ఔపవిభక్తికమైన తోడుశబ్దంనుండి ఏర్పడిన 'తోడన్' అనేపదంతో ఇటువంటిస్థలాలను సమన్వయించే అవకాశం పరిశీలించాలి.

### 3. చతుర్థికిం బొంటెవర్ణకంబు నగు (9)

చతుర్థీవిభక్తిలో పొంటె అనేప్రత్యయం కూడా అవుతుంది అని సూత్రానికి అర్థం.

'కొఱకు కయి చతుర్థి'అని బాలవ్యాకరణం చతుర్థిలో కొఱకు, కయి అనేరెండువిభక్తులనే పేర్కొన్నది. వాటితోపాటు 'పొంటె' అనేది కూడా చతుర్థిలో అవుతుం దని ఈసూత్రం చెప్తున్నది. కయి పట్టి యొక్క విభక్తులకు భిన్నం గాబట్టి (ద్రుతప్రకృతికం, తృతీయాదులకు నుగాగమం బగు – అని దీనికి నుగాగమం వస్తుంది.

'కార్యసంప్రయోగ' శబ్దంమీద ఉద్దేశార్థంలో 'సంప్రదానంబునకుం జతుర్థి యగు' అనేసూత్రంచేత చతుర్థిరాగా ఆ చతుర్థికి ప్రస్తుతసూత్రంచేత పొంటె ప్రత్యయం వచ్చి 'నుగాగమ మై 'కార్యసంప్రయోగము పొంటెన్'.

'చతుర్థికి' అనడంచేత ప్రథమ మొద లైనఇతరవిభక్తులఅర్థంలో పొంటె రాదు.

'వర్ణకంబును' అనేచోటిసముచ్చయార్థకనుశబ్దంచేత కొఱకు, కయి అనేప్రత్యయాలు రావడం సాధారణం. కార్యసంప్రయోగముకొఱకు, సంప్రయోగముకయి మొ॥

కాని ఈపొంటె ప్రత్యయం కొఱకు కయిలు వచ్చే అన్నిస్థలాల్లో రాదు. ముఖ్య మైన త్యాగోద్దేశానికి పొంటె లేదు. రాముని కొఱకు (కయి) కన్య నిచ్చె అనేవంటిస్థలాల్లో 'రామునిపొంటె కన్య నిచ్చె' అని ఉండదు. ఉద్దేశమాత్రానికి చతుర్థి అనేసందర్భాల్లో మాత్రమే అరుదుగా కనబడుతుంది. ఆవిషయం వ్యాకర్త చెప్పి ఉండవలసింది.

### 4. ఉండిపదంబు పరం బగుచో వలన కందువర్ణక మట్లు నవర్ణకంబు నగు (10)

ఉండి అనేపదం పరంగా ఉన్నప్పుడు దానికి పూర్వంలో ఉన్న 'వలన' అనేవిభక్తిస్థానంలో సప్తమీవిభక్తి అయిన 'అందు' అనేప్రత్యయం వచ్చినట్లే 'న' అనేసప్తమీప్రత్యయం కూడా వస్తుంది అని సూత్రానికి అర్థం.

'ఉండిశబ్దము పరం బగునపుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికంబుగ నగు' అని చెప్పినచిన్నయసూరి 'వలనకు' సప్తమిలో 'అందు' ప్రత్యయం వచ్చినందుకు మాత్రమే ఉదాహరణం చూపాడు. 'అందు-న-సప్తమి' అనేసూత్రం ప్రకారం నవర్ణకం కూడా సప్తమే. కాగా పైసూత్రంలోని సప్తమీశబ్దంచేత అందు-న అనేవి రెండు వస్తాయి. కాని ఉదాహరణలలో చూపకపోవడంచేత 'న' వర్ణకం రా దేమో నని సందేహం కలగవచ్చు నన్నఉద్దేశ్యంతో సూరిసూత్రాభిప్రాయాన్ని ప్రౌఢవ్యాకర్త ఈ సూత్రంతో వివరిస్తున్నాడు.

'బ్రహ్మలోకమువలనన్' అనేచోట వలనపై ఉండి అనుపయుక్తమై, 'బ్రహ్మలోకమువలనన్ + ఉండి' అని ఉండగా, ఉండి పదంబు పరం బగునపుడు వలనకు ద్వితీయాసప్తములు' అనేసూత్రంచేత వలనకు సప్తమి రాగా దానికి (ఉదంతజడ మైన 'బ్రహ్మలోకము'పై) ప్రస్తుతసూత్రంప్రకారం నవర్ణకం వచ్చి - బ్రహ్మలోకముననుండి.

'ఉండిపదంబు పరం బగుచో' అనడంచేత ఉండి పరంగా లేనపుడు (ద్వితీయా) సప్తమీవిభక్తే రాదు గాబట్టి న వర్ణకం కూడా రాదు.

వదనగహ్వరంబున వరదవాఱ, ఉడుపథంబున జాఱు' అనేరీతిస్థలాల్లో ఉండి పరంగా ఉండగా వలనకు నవర్ణకం వచ్చి ఆతర్వాత సప్తమి (నవర్ణకం) మీది ఉండి లోపించిం దని ప్రౌఢవ్యాకర్త ప్రక్రియ గ్రహించాలి.

'వలనకు అందు వర్ణకమట్లు' అనేదళాలు బాలవ్యాకరణాభిప్రాయాన్ని అనువదిస్తున్నాయి. 'అందు వర్ణకమట్లు' అనే దళం లేకున్నా ఇబ్బంది లేదు, స్పష్టత కనాలి.

'నవర్ణకంబును' అనేచోటిసముచ్చయార్థకనుశబ్దంచేత 'అందు' ప్రత్యయం కావడం ప్రసిద్ధం అని తాత్పర్యం. బ్రహ్మలోకంబునందుండి.

సూరిసూత్రార్థాన్ని వివరించే ఈసూత్రం స్పష్టతకే.

### 5. వలన కాదేశంబు లగుద్వితీయాసప్తములమీఁదియుండికి లోపంబు బహుళంబుగా నగు. (11)

అనుప్రయుక్తంగా వచ్చిన ఉండి అనేపదం పరంగా ఉండగా దానికి పూర్వంలో ఉన్న 'వలన' అనేవిభక్తికి ద్వితీయ, సప్తమీవిభక్తులు ఆదేశంగా వచ్చినసందర్భంలో వాటికిపైన 'ఉండి' అనే పదం బహుళంగా లోపిస్తుంది అని సూత్రానికి అర్థం.

అదితిగర్భమును వెలువడుము. అదితిగర్భశబ్దంమీద అపాయార్థంలో 'అపాయభయజుగుప్సా మొ॥ సూత్రంచేత వలన ప్రత్యయం. గర్భమువలన. 'ఉండి పదం బొకానొకచో వలనవర్ణకంబున కనుప్రయుక్తం బగు' అని వలనపై ఉండి చేరి గర్భమునన్ + ఉండి 'ఉండిశబ్దము పరం బగునపుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికంబుగ నగు' అనేసూత్రంచేత వలనకు ద్వితీయా (ను) విభక్తి వచ్చి గర్భమును + ఉండి ఆద్వితీయ మీది ఉండికి ప్రస్తుతసూత్రంచేత లోపం వచ్చి – గర్భమును వెలువడుము. బహుళం కాబట్టి లోపం రాకపోతే గర్భమునుండి వెలువడుము.

వదనగహ్వరమున వరదవాఃఅ. ఇక్కడ 'న' అనేసప్తమీవిభక్తిమీది ఉండి లోపించింది. లోపించనిపక్షంలో వదన గహ్వరముననుండి వరదవాఃఅ.

'వలన కాదేశంబు లగు' అనడంచేత ఇతర ద్వితీయాసప్తములమీద (అనుప్రయుక్తం కాని స్వతంత్రపదమైన) ఉండి లోపించదు. ద్వారవతి నుండి కంటిని. ఆపురమున నుండి బ్రదికితిమి మొ॥.

అనుప్రయుక్త మైన ఉండి పరంగా ఉండగా, వలనకు ద్వితీయాసప్తములు రెండే ఆదేశంగా వస్తాయి కాబట్టి ద్వితీయా సప్తములకంటే ఇతర మైన విభక్తిపైన 'ఉండి' కి లోపం రావడానికి అవకాశం లేదు.

కాగా వలనకు పైనున్న ఉండికి లోపం రాదు. వృక్షమువలన పడియె (గర్భమువలన వెలువడుము) ఇత్యాదుల్లో ఉండి' అనుప్రయుక్తం కాలే దని గ్రహించాలి.

బహుళం అనడంచేత వలన కాదేశ మైన 'అందు' అనేసప్తమిమీద ఉండి లోపించదు. అంటే అప్రవృత్తి అని వ్యాకర్త వివరించాడు. కాని 'నాయందు (ధనము) గొనిపొమ్ము' అనేవిధంగా తిక్కనాదులప్రయోగాల్లో అందుపై ఉండి లోపించింది.

**6. కొన్నియెడల హేతువునం దన్నంతక్రియలమీఁదను బట్టివర్ణకంబు విభాష నగు.** (12)

ఫలసాధనయోగ్యం బగుపదార్థము హేతువు. 'అన్' అనేది అంతమందు కలిగినక్రియ అన్నంతక్రియ. 'తుమర్థ భావలక్షణంబులందు నుజీ యగు' అనేసూత్రం చేత వచ్చిన 'ను' అనేప్రత్యయం జిత్త్వంవల్ల ముందు ధాతువుచివరిఉత్వానికి వచ్చే అత్త్వంతో కలుపుకొని (అను) అన్ ప్రత్యయంగా ఈవ్యాకర్త వ్యవహరిస్తున్నాడు.

అన్నంతక్రియ హేతు వయితే దానిమీద 'పట్టి' అనేపంచమీవిభక్తి వికల్పంగా వస్తుం దని సూత్రానికి అర్థం.

'పట్టివర్ణకంబు హేతువు లగుగుణక్రియల కగు' అనేబాలవ్యాకరణసూత్రంప్రకారం క్రియ హేతు వయితే పట్టి ప్రత్యయం వస్తుంది. కాని అన్నంతక్రియ అవ్యయం. అవ్యయం విభక్తివచనశూన్యం. దీనిపై విభక్తులు ఉండవు. కాబట్టి పట్టి విభక్తి కూడా రాకపోతుండగా ఈసూత్రం ప్రత్యేకంగా పట్టిని విధిస్తున్నది.

కలుగు ధాతువుపై అన్ (నుజి) ప్రత్యయమై కలుగన్. దీనిమీద నుజ్యంత మైన అగుధాతువు రూపం (కాన్) చేరి హ్రస్వమై (కన్) కలుగంగన్. ఈఅన్నంతక్రియ ప్రభావం సమకూర్చుట అనేఫలాన్ని సాధించడానికి సాధనమైంది కాబట్టి హేతువు. కావడంచేత ప్రస్తుతసూత్రంచేత పట్టి ప్రత్యయమై కలుగంగఁబట్టి అని అవుతుంది. ఇలాగే కాఁబట్టి మొ॥

'విభాష' అనడంచేత పట్టి ప్రత్యయం రానిపక్షంలో హేతువులో 'కలుగంగన్' అని కూడా ఉంటుంది.

'కొన్నియెడల' అనడంచేత హేతువు కాకపోతే ఈకార్యం లేదు. చదవఁగోరెను.

'అన్నంతక్రియల మీఁద' అనడంచేత, హేతువు లయినా ఇతర (అవ్యయ) క్రియలమీద ఈకార్యం లేదు. 'కంఠము తెగి దేహము పడియె' మొ॥

'మీఁదను' అనేచోటినుశబ్దం పూర్వవ్యాకరణోక్త మైన జ్ఞానముఁబట్టి, వచ్చుటంబట్టి మొ॥ సంగ్రహింపబడుతున్నాయి. అలాగే అన్నంతం 'అవ్యయ మైనప్పటికీ' పట్టి విభక్తి వస్తుం దనీ సూచిస్తుంది.

## 7. యొక్కకు లోపంబు బహుళంబు (16)

'కు యొక్క లోపల షష్ఠి' అని యొక్క అనేది షష్ఠీవిభక్తి. 'శేషషష్ఠికి యొక్కయు నగు' అని సంబంధార్థంలో సంబంధి పదానికి యొక్క ప్రత్యయం వస్తుంది. దానికి బహుళంగా లోపం వస్తుం దని ఈసూత్రానికి అర్థం.

'సమాసవిభక్తికి లోపం బగు' అనేసూత్రంచేత సమాసంలో మిగిలినవిభక్తులతోపాటు యొక్క విభక్తి కూడా లోపిస్తుంది. కాగా సమాసం కాని (వ్యస్త) స్థితిలో లోపింపజేయడంకోసం ఈసూత్రం ప్రారంభింపబడింది.

ఎవ్వనియొక్క ఏని – అనేవ్యస్తస్థలంలో ప్రస్తుతసూత్రంచేత యొక్క విభక్తి లోపించి 'ఎవ్వనియేని'. పుష్పదామముల (యొక్క) యు మొ॥.

'యొక్కకు' అనడంచేత (సమాసం కానపుడు) ఇతరవిభక్తికి లోపం రాదు. ఎవ్వడేని మొ॥

'బహుళంబు' అనడంచేత 'ధాతుజవిశేషణ భావార్థక పూర్వ వ్యవహితావ్యవహిత కర్తృపదప్రథమకుఁ దఱచుగ యొక్క షష్ఠి యగు' అని వచ్చిన యొక్కకు లోపం నిత్యంగా వస్తుం దని సూత్రకర్త వివరించాడు. బాహుకురథంబు గడపు నేర్పు. 'బాహుకుయొక్క రథంబు గడపునేర్పు' అనేవిధంగా 'యొక్క' లోపించకపోవడం ఉండదు.

కాని 'యొక్క' ప్రత్యయం లోపించకుండా నిలిచిఉన్నస్థలం కావ్యాలలో ఎక్కడా కనబడదు. ఎవ్వనియొక్క యేని అనేరీతి ప్రయోగాలు లేవు. ఏమి శబ్దముయొక్క మికారమునకు (సంధి – 16) సమీపకర్తయొక్క లింగవచనంబులు (వాక్య. 15) అని రెండుచోట్ల సూత్రంలో ఈవ్యాకర్త యొక్కను ప్రయోగించాడు. కాని వ్యాఖ్యానాదిభాగాల్లో కూడా యొక్క విభక్తి లేదనే చెప్పాలి. కాగా 'బాహుకుయొక్క రథంబు గడపునేర్పు' అనేవిధ మైనప్రయోగాలు లేవు.

యొక్కకు లోపం కావ్యాలలో నిత్యంగానే వస్తున్నట్లు చెప్పక తప్పదు. 'తఱచుగ' అని అయినా చెప్పవలె గానీ బహుళంగా చెప్పడం విచార్యం.

## 8. ఒక్కచో నుదంతం బగునజడంబు తృతీయకును నవర్ణకంబు గానంబడియెడి. (17)

హ్రస్వ మైన ఉకారము (ఉత్) చివర కలిగినశబ్దం ఉదంతం. జడము లనగా నచేతనములు. కాబట్టి అజడ మంటే చేతనం. మహత్తులు, స్త్రీ తిర్యగ్వాచకాలు అజడాలు.

హ్రస్వ మయిన ఉకారం చివరగలిగిన చేతనశబ్దాలమీదితృతీయావిభక్తికి 'న' అనేసప్తమీవిభక్తి కవిప్రయోగాలలో కనబడుతున్నది అని సూత్రాని కర్థం.

'ఉదంతజడంబు తృతీయకు నవర్ణకం బగు' అని సూరి జడవాచకాలపై వస్తుం దని చెప్పినకార్యం, జడం కానిశబ్దం మీద గూడా సాధించడానికి సూత్రం ప్రారంభింపబడింది. ఇది సూరిలక్షణానికి సవరణం.

ఏనుగు శబ్దం మీద కరణార్థంలో 'చేతవర్ణకంబు హేతుకరణంబులకు (కార. 7) అని చేత ప్రత్యయం వస్తే ఏనుగుచేత, 'కరణ సహార్థ తుల్యార్థ యోగంబులం దృతీయకుం దోడవర్ణకం బగు' (కార. 8) అని తోడ వస్తే ఏనుగుతోడ (ఏనుగువైచుచు). ప్రస్తుతసూత్రంచేత ఆతృతీయ (చేత – తోడ) స్థానంలో 'న' వర్ణకం వచ్చి, ఏనుగునన్ – ఏనుగు వైచుచు అని అవుతుంది. ఏనుగునన్ అంటే ఏనుగుచేత లేదా ఏనుగుతోడ అనేవిధంగా (తృతీయ) కరణం అర్థం.

'ఒక్కచో' అనడంచేత ఈకార్యం అరుదు. కాబట్టి ఉదంత మైన అజడశబ్దాల కన్నిటికీ ఈకార్యం రాదు. ఏనుగుచేతఁ జంపబడె, ఏనుగుతో కలిసి వచ్చెను, ఇక్కడ ఏనుగునఁ జంపబడె' అని కాదు. ఏనుఁగున ఏనుగు అనేప్రయోగ మొక్కటి మాత్రమే ఈలక్షణానికి లక్ష్యంగా దొరుకుతున్నది. కాబట్టి ఒక్కచో = ఈప్రయోగం ఒక్కచోటనే అనే చమత్కారం గూడా వ్యాకర్త ఉద్దేశించి ఉండవచ్చు.

'ఉదంతంబు' అనడంచేత ఉదంతాలు కానివాటికి ఈకార్యం లేదు. అనుదంతానికి దేనికి గూడా సప్తమిలో సైతం నవర్ణకం రాదు.

'తృతీయకు' అనడంచేత ఇతరవిభక్తులకు ఈకార్యం రాదు. 'ఏనుగు వచ్చెను' ఇక్కడ ఏనుఁగున వచ్చెను అనేవిధంగా ఉండదు.

'తృతీయకు' అనేచోట సముచ్చయం పూర్వవ్యాకరణానుసారంగా జడవాచకంపై నవర్ణకం రావడాన్ని సంగ్రహిస్తుంది. బాణమునఁ గూల్చె.

"కానంబడియెడి" అనడంచేత కవిప్రయోగాలలో ప్రత్యక్షంగా చూచినవాటిని మాత్రమే గ్రహించాలి. అలాంటివాటిని స్వతంత్రంగా కల్పించగూడదు.

**9. కొన్నియెడల నజడంబు తృతీయాసప్తములకు బహుత్వంబున ద్వితీయ చూపట్టెడి.** (18)

జడము లనగా నచేతనములు. అజడం అంటే చేతనం. చేతనవాచకా లైన మహత్తులూ, స్త్రీలు, తిర్యక్ శబ్దాలకు పైన ఉన్న తృతీయాసప్తమీవిభక్తులకు కూడా బహుత్వార్థంలో ద్వితీయావిభక్తి వస్తుం దని సూత్రార్థం.

'జడంబు తృతీయాసప్తములకు ద్వితీయ బహుళంబుగా నగు' అనేబాలవ్యాకరణలక్షణంలో జడశబ్దాలకు విధించినకార్యం జడం కానిశబ్దాలపైన గూడా సాధించడానికి ఈలక్షణం ప్రారంభింపబడింది.

"కరణ సహార్థ తుల్యార్థ యోగంబులం దృతీయకుం దోడవర్ణకం బగు" అనేసూత్రంచేత సహార్థంలో చక్రవాకశబ్దం మీద తృతీయా, దానికి తోడ విభక్తీ వచ్చి బహుత్వంలో 'చక్రవాకములతోడ అలరు' అని ఉండగా ప్రస్తుతసూత్రంచేత తృతీయకు

ద్వితీయ వచ్చి చక్రవాకములన్ అలరు అవుతుంది. ద్వితీయ రానిపక్షంలో చక్రవాకములతోడ అలరు అని తృతీయ అలాగే ఉంటుంది.

'మనుజులయందు విప్రుడు' అన్నచోట సప్తమికి ద్వితీయ వచ్చిన పక్షంలో 'మనుజుల విప్రుండు'.

'కొన్నియెడల' అనడంచేత ఈకార్యం అరుదు. చేతనశబ్దాలు అన్నింటిమీద ఈకార్యం సాధారణంగా రాదు. అంటే జడవాచకాలమీదలాగా అజడాలమీద ప్రసిద్ధం గా దని తాత్పర్యం.

'అజడంబు' అనడంచేత జడశబ్దాలపై ఈకార్యం ప్రస్తుతసూత్రంచేత రాదు. 'జడంబు తృతీయాసప్తములకు' అనేబాలవ్యాకరణసూత్రంప్రకారం సాధించుకోవాలి.

'తృతీయాసప్తములకు' అనడంచేత ఇతరవిభక్తులకు ఈకార్యం (ద్వితీయ) రాదు. రామునికయి తపము మొ॥

'బహుత్వంబున' అనడంచేత కవిప్రయోగాలలో కానవచ్చినచోట్ల మాత్రమే యీకార్యాన్ని గ్రహించాలి. స్వతంత్రించి ఇలా ప్రయోగింపరాదు.

### 10. కొన్నియెడల నజడంబు ద్వితీయకును బ్రథమ కానంబడియెడి (19)

జడం అంటే అచేతనం. జడం కానిది అంటే చేతనం అజడం. చేతనవాచకం అయినశబ్దంమీద ఉన్న ద్వితీయావిభక్తికి కూడా ప్రథమావిభక్తి రావడం కవిప్రయోగాలలో కనిపిస్తున్నది అని సూత్రానికి అర్థం.

'జడంబు ద్వితీయకుం బ్రథమ బహుళంబుగా నగు' అని చిన్నయసూరి జడవాచకాలమీద చెప్పినకార్యం అజడానికి సిద్ధించకపోతుండగా ఆఅవకాశాన్ని కల్పిస్తూ ప్రస్తుతసూత్రం సూరిలక్షణాన్ని సవరిస్తున్నది.

హయోత్తమ మొక్కడఁ గట్టఁబంపుచున్' ఇక్కడ కర్మ అయిన హయోత్తమశబ్దానికి 'కర్మంబున ద్వితీయ యగు' అనే సూత్రంచేత ద్వితీయావిభక్తి రాగా 'హయోత్తమమున్'. ఇది తిర్యగ్వాచకం. జడం కాదు, కాబట్టి ప్రస్తుతసూత్రంచేత ఆద్వితీయకు ప్రథమావిభక్తి వచ్చి - హయోత్తమము (ఒక్కెడ) అని అయింది.

ప్రథమ రానిపక్షంలో ద్వితీయతో 'హయోత్తమమున్'

'కొన్నియెడల' అనడంచేత ఈకార్యం సార్వత్రికం కాదు. అజడశబ్దా లన్నింటికి ఈకార్యం సాధారణంగా రాదు. రావణుని జంపెను మొదలైనచోట్ల ప్రథమ అసలు రాదు. (పుం, స్త్రీ) మహత్తుల కీకార్యం కనబడదు. తిర్యక్కులకు మాత్రమే అని చెప్పవచ్చు నేమో. పరిశీలించాలి.

'అజడంబు' అనడంచేత జడశబ్దాలపై ఈసూత్రంచేత ప్రథమ రాదు. బాలవ్యాకరణం ప్రకారం వస్తుంది.

'ద్వితీయకు' అనడంచేత ఇతరవిభక్తులకు ఈకార్యం లేదు. మదనాగముతో సమము మొ॥

(అజడంబు) 'ద్వితీయకును' అన్నచోటిసముచ్చయార్థకం జడద్వితీయకు పూర్వవ్యాకరణాలప్రకారం ప్రథమ రావడాన్ని స్మరింపజేస్తుంది. పూవులు దెచ్చె (ప్రథమ అనడంచేత ఇతరవిభక్తులు రావు).

'కానంబడియెడి' అనడంచేత ఇటువంటివి కవిప్రయోగాలలో కానవచ్చిన స్థలాలు మాత్రమే గ్రహించాలి. కాని స్వతంత్రంగా కల్పించగూడదు. కాబట్టి అజడం ద్వితీయకు ప్రథమ రావడం అరుదు. అందుచేత ప్రథమ వచ్చినచోట గూడా 'హయోత్తమమున్' అనేవిధంగా ప్రథమ రానిరూపాలే ప్రచురంగా ఉంటాయి.

సూరిసూత్రంలోని బహుళపదంచేత అన్యకార్యంగా దీనిని సాధించుకోవచ్చు. అయినా స్పష్టత కీలక్షణం ఉచితమె.

## 11. ఒక్కొక్కచో జడంబు సప్తమిం బ్రథమయు నగు (20).

జడంబు లనగా నచేతనములు. 'ప్రథమయు' అన్నప్పటిసముచ్చయశబ్దానికి వికల్పం అర్థం. జడశబ్దాలకు పైనున్న సప్తమీవిభక్తిస్థానంలో ప్రథమావిభక్తి, వికల్పంగా వస్తుం దని సూత్రానికి అర్థం.

'జడంబు ద్వితీయకుం బ్రథమ బహుళంబుగా నగు' అనేసూరిసూత్రం ద్వితీయకు మాత్రమే ప్రథమ చెప్తున్నది. సప్తమికి కూడా ప్రథమ రావడాన్ని చెప్తూ ఈసూత్రం బాలవ్యాకరణలక్షణానికి పూరక మవుతున్నది.

ఉదా : తీర్థమాడి. అధికరణార్థంలో 'అధికరణంబునకు సప్తమి యగు' అనేసూత్రంప్రకారం తీర్థశబ్దానికి సప్తమీవిభక్తి రాగా ఏకవచనంలో తీర్థమందున్ (తీర్థమునన్) ఆసప్తమికి ప్రస్తుతసూత్రంచేత ప్రథమావిభక్తి రాగా తీర్థము (ఆడి) అని అవుతుంది. వికల్పం కాబట్టి ప్రథమ రానిపక్షంలో తీర్థమందు, తీర్థమున ఆడి అని సప్తమి అలాగే ఉంటుంది.

'ఒక్కొక్కచో' అనడంచేత ఈకార్యం సార్వత్రికం కాదు. ప్రయోగానుసారంగా అరుదుగా వస్తుం దని గ్రహించాలి. ఘటమందు జల మున్నది మొ॥

'జడంబు' అనడంచేత జడం కానిశబ్దంమీద ఈకార్యం లేదు. రామునియందు భక్తి.

'ప్రథమయు' అన్నప్పటి ను శబ్దంచేత వికల్పం కాబట్టి ప్రథమ వచ్చినస్థలాల్లో కూడా సప్తమితో రూపా లుంటాయి.

## 12. ఒక్కచో సమాసాంతర్గతవిశేష్యంబుల కగువిశేషణంబులషష్ఠికిని బ్రథమ చూపట్టెడి (21)

విశేష్యం షష్ఠ్యంత మై సమాసంలో ఉండగా కూడా విడిగా ఉన్న దానివిశేషణానికి సంబంధించిన షష్ఠీవిభక్తిస్థానంలో ప్రథమావిభక్తి రావడం కవిప్రయోగాలలో కనబడుతున్న దని సూత్రానికి అర్థం.

'విశేష్యంబునకుం బోలె విశేషణంబులకు విభక్తి వచనంబు లగు' అనేసూత్రంప్రకారం విశేష్యం ఏ విభక్తిలో ఉంటే విశేషణానికి కూడా అదేవిభక్తి అవుతుంది. విశేష్యం షష్ఠ్యంత మైనపుడు విశేషణానికి కూడా షష్ఠీవిభక్తి వస్తుంది.

'షష్ఠీ విశేషణానాం ప్రథమా స్యాత్' అనేచింతామణి సూత్రాన్ని వ్యాఖ్యానిస్తూ అహోబలుదు షష్ఠ్యంతవిశేష్యం సమాసగత మైనా విశేషణషష్ఠికి ప్రథమ వస్తుం దని చెప్పి 'ప్రల్లదుఁ డైన యొక్కకులపాంసనుచేసినదాన' అనేనన్నయప్రయోగం చూపాడు.

ఒకానొకచో విశేషణంబుల షష్ఠికి 'బ్రథమ విభాష నగు' అని చెప్పినఉదాహరణలతో విశేష్యం భిన్నంగా ఉన్నప్పటిస్థితిని మాత్రమే ఉదహరించాడు. అహోబలపతివ్యాఖ్య కనుగుణంగా వివరిస్తూ ప్రౌఢవ్యాకరణం ఈసూత్రం చెప్పింది.

ఉదా : పార్థివప్రాగ్రసరుడు ధర్మసుతుపన్ను.

ఇక్కడ 'ధర్మసుతుయొక్క' అనేషష్ఠ్యంతం విశేష్యం. ఇది పన్ను అనేమీదిపదంతో సమాస మై (షష్ఠి లోపించి) ధర్మసుతుపన్ను. 'ధర్మసుతు' విశేషణం కావడంచేత 'పార్థివ ప్రాగ్రసర' అనే శబ్దానికి 'విశేష్యంబునకుం బోలె' అని షష్ఠీవిభక్తి రాగా పార్థివప్రాగ్రసురునియొక్క. ఆ షష్ఠికి ప్రస్తుతసూత్రంచేత ప్రథమా విభక్తి వచ్చి పార్థివప్రాగ్రసరుండు' అని అయింది. ప్రథమ రానిపక్షంలో 'యొక్కకు లోపంబు బహుళంబు' అని యొక్క లోపించి 'పార్థివప్రాగ్రసరు ధర్మసుతుపన్ను'.

ఇలాగే 'దేవుడు త్రివిక్రము (యొక్క) సొమ్ములు' మొ॥

'ఒక్కచో' అనడంచేత ఇటువంటి ప్రయోగాలు అరుదుగా ఉంటాయి.

'విశేషణంబుల' అనడంచేత విశేష్యవిభక్తికి మార్పు లేదు.

'షష్ఠికి' అనడంచేత ఇతరవిభక్తులకు ప్రథమ రాదు. 'షష్ఠికిని' అనేచోటిసముచ్చయంచేత సమాసాంతర్గతం కాకుండా భిన్నంగా ఉన్నవిశేష్యానికి సంబంధించినవిశేషణషష్ఠికి 'ప్రథమ' బాలవ్యాకరణాన్నిబట్టే సిద్ధిస్తుంది.

'చూపట్టెడి' అనడంచేత ఇటువంటిస్థలాలను కవిప్రయోగాలలో ఉన్నవాటినే మాత్రమే గ్రహించాలి. స్వతంత్రంగా కూర్చకూడదు.

### 13. కొన్నియెడల విశేషణంబు ద్వితీయాదులకుఁ బ్రథమ చూపట్టెడి (22)

విశేషణానికి సంబంధించిన ద్వితీయ మొద లైనవిభక్తులకు కూడా ప్రథమావిభక్తి రావడం కొన్ని కవిప్రయోగాలలో కనబడుతున్నది అని సూత్రానికి అర్థం.

'ఒకానొకచో విశేషణంబులషష్ఠికిం బ్రథమ విభాష నగు' అని (చింతామణి ననుసరించి) సూరి విశేషణముల షష్ఠీవిభక్తికి ప్రథమావిభక్తి చెప్పాడు. భవత్యర్థవ్యవధానం ఉన్నప్పుడు మాత్రం విశేషణం ద్వితీయాదివిభక్తులకు అన్నిటికీ ప్రథమ పేర్కొన్నాడు. అగు మొదలైన భవత్యర్థకాలతో వ్యవధానం లేకపోయినప్పటికీ షష్ఠికి మాత్రమే కాక ద్వితీయ మొద లయినయితరవిభక్తులకు గూడా ప్రథమను విధించేఈలక్షణం బాలవ్యాకరణానికి పూరణ మనుకోవచ్చు.

ఉదా : ఘనుల్ . . . దైత్యపతులన్. ఇక్కడ దైత్యపతులన్ అనేవిశేష్యం ద్వితీయావిభక్తిలో ఉంది. కాబట్టి దానికి విశేషణ మయినఘనశబ్దం కూడా 'విశేష్యంబునకుంబోలె' ద్వితీయావిభక్తివచ్చి ఘనులన్ – దైత్యపతులన్ అని ఉంటుంది. ఘనులన్ అనేవిశేషణశబ్దంమీదిద్వితీయావిభక్తికి ప్రస్తుతసూత్రంచేత ప్రథమావిభక్తి రాగా ఘనుల్(లు) దైత్యపతులన్ అని అవుతుంది. ప్రథమావిభక్తి రానిపక్షంలో 'ఘనులన్ (పతులన్) అని ద్వితీయావిభక్తి అలాగే ఉంటుంది. ఇలాగే తల్లి (తోడ) ద్రౌపదితోడన్ మొ॥

'కొన్నియెడల' అనడంచేత షష్ఠికంటే ఇతర మైనవిభక్తులకు ప్రథమ రావడం అరుదు. కాబట్టి ద్వితీయాదులు అలాగే ఉండడం ప్రచురం. ఘనుని రామునిన్ మొ॥

'విశేషణంబుల' అనడంచేత విశేష్యవిభక్తి మారదు. ఘనుల్ దైత్యపతులన్.

'ద్వితీయాదులకు' అనడంచేత ప్రథమకు ప్రథమ రాదు. (చేయవలసినఅవసరం లేదు) షష్ఠి కూడా ద్వితీయాదుల్లోనిదే అయినా దానికి ప్రథమ ప్రత్యేకంగా చెప్పి ఉండటంచేత (ప్రథమ) షష్ఠికంటే ఇతర మైనవిభక్తులచే ఈసూత్రంచేత ప్రథమను సాధించుకోవాలి. షష్ఠికి పూర్వ (బాల) వ్యాకరణానుగుణంగా ప్రథమ వస్తుంది.

'చూపట్టెడి' అనడంచేత ఇటువంటివి కవిప్రయోగాలలో కానవచ్చినస్థలాలు మాత్రమే స్వీకరించాలి. స్వతంత్రించి ప్రయోగించరాదు.

## 14. ఒక్కచో ద్వితీయాంతవిధేయవిశేషణంబునకుం బ్రథమయు నగు. (24)

విశేష్యంలోని జాతి, గుణం మొద లయినవిశేషాలను తెలియజేసేశబ్దం విశేషణం. ఇది వ్యావర్తకం, హేతుగర్భం, విధేయం అని మూడు రకాలు. విధేయం అంటే మీద తెలియదగినది, ఇది వక్తకు మాత్రమే తెలిసిఉంటుంది అని వ్యాకర్త స్థలాంతరంలో వివరించాడు. వాక్యంలో దేనినిగురించి చెప్పబడుతుందో అది ఉద్దేశ్యం. దాన్నిగురించి, ఏమి చెప్పబడుతుందో అది (విధింపదగినది) విధేయం. విధేయ మైనవిశేషణం విధేయవిశేషణం. దానియొక్క ద్వితీయావిభక్తికి కొన్నిచోట్ల ప్రథమావిభక్తి వికల్పంగా వస్తుం దని సూత్రానికి అర్థం.

ఉదా : బ్రాహ్మణముఖ్యుఁ బురోహితుండుగా

విశేష్య మైన 'బ్రాహ్మణముఖ్యున్' అనేశబ్దం ద్వితీయాంతం. కాబట్టి దానికి విశేషణ యిన 'పురోహిత' శబ్దానికి 'విశేష్యంబునకుంబోలె . . .' అనేసూత్రంప్రకారం ద్వితీయ వచ్చి పురోహితున్. ఆద్వితీయకు ప్రస్తుతసూత్రంచేత ప్రథమావిభక్తి వచ్చి 'పురోహితుండు' అయింది.

వికల్పం గాబట్టి ప్రథమ రానిపక్షంలో 'బ్రాహ్మణముఖ్యు' 'ఁబురోహితునిగా' అని ద్వితీయాంతంగా ఉంటుంది. వానిని బ్రాహ్మణకులుఁగా నెఱుఁగుము అని ప్రయోగం.

'ఒక్కచో' అనడంచేత ఈకార్యం క్వాచిత్కం. ప్రయోగానుసారంగా గ్రహించాలి.

'ద్వితీయాంత' అనడంచేత తృతీయాదులకు ప్రథమ రాదు. కాని విధేయవిశేషణం తృతీయాద్యంత మై కానరాదు. ప్రథమకు ప్రథమ చెప్పనవసరం లేదు. కాగా ద్వితీయకు మాత్రమే ప్రథమ.

'విధేయ' అనడంచేత వ్యావర్తక, హేతుగర్భ రూప మైనయితరవిశేషణాలకు ఈకార్యం ఈసూత్రంచేత కలుగదు. 'కొన్నియెడల విశేషణంబు ద్వితీయాదులకు' 'బ్రథమ చూపట్టెడి' అనేసూత్రంచేత ప్రయోగానుసారంగా ప్రథమ రావచ్చు.

'విశేషణంబునకు' అనడంచేత విధేయం విశేష్య మయితే ఈకార్యం రాదు. 'ఘనుల్ - దైత్యపతులన్' ఇక్కడ దైత్యపతులన్ అనేవిశేష్యం విధేయం. కాగా ప్రథమ రాదు.

విధేయవిశేషణానికి కూడా 'విశేషణంబు ద్వితీయాదులకు అనేలక్షణంచేతనే ప్రథమ వస్తుంది. ఈసూత్రం చెప్పకపోతే నష్టం కనబడదు.

### 15. కొన్నియెడల విభక్తిపరిణామంబు గ్రాహ్యంబు (26)

కొన్ని సందర్భాలలో వాక్యంలో ప్రయోగింపబడినవిభక్తి, అన్వయాన్ని అనుసరించి వేరొకవిభక్తిగా మార్పు చెందడం గ్రహింపదగిఉన్న దని సూత్రానికి అర్థం.

ఉదా : ఈతనితో సాటి యనంగ మే లన

'సాటి' అనేతుల్యార్థంతో యోగంచేత 'ఈ' శబ్దానికి 'కరణ సహార్థ తుల్యార్థయోగంబులం దృతీయకుం దోడవర్ణకం బగు' అని తో(డ)ప్రత్యయం వచ్చి ఈతనితో సాటి. ఈశబ్దం 'మేలు' అనేదానితో గూడా అన్వయించవలసిఉన్నది. అన్యార్థాదులలోని దయిన 'మేలు' శబ్దంతో 'ఈతనితో' అనేతృతీయ అన్వయించదు. కంటెవర్ణకం బన్యార్థాదియోగజం బగుపంచమి కగు' అనేసూత్రాన్ని అనుసరించి 'కంటె' ప్రత్యయం కావాలి. కాబట్టి మేలు శబ్దంతో అన్వయించేసందర్భంలో 'ఈతనితో(సాటి) అన్నప్పటి తృతీయ ఈతనికంటె మేలు అనేవిధంగా పంచమీవిభక్తిగా మారుతుంది.

'కొన్నియెడల' అనడంచేత ఈకార్యం సార్వత్రికం కాదు. ఆ 'కొన్నియెడలు' ప్రయోగానుసారంగా గుర్తించాలి.

పెక్కింటితో అన్వయం ఉన్నప్పుడే ఈకార్యం. 'ఈతనితో మేలు' అనేవిధంగా అనేకాన్వయం లేనిచోట వేరేవిభక్తి ఉండడమూ అది మరోవిభక్తిగా మారడమూ ఉండదు.

అనేకాలతో అన్వయించేటప్పుడు మొదటిపదంతో అన్వయాని కనుగుణంగా విభక్తి వస్తుంది. అదేపదం ఆతరువాతి పదాలతో అన్వయించేటప్పుడు దాని కనుగుణంగా మారుతుంది.

సన్నిహితపర మైనశబ్దంతోటిఅన్వయానికి అనుగుణంగా వచ్చినవిభక్తి, ఆతరువాతిపదాలతో అదేశబ్దం అన్వయింపవలసివచ్చినపుడు ఆఅన్వయానికి అనుగుణంగా అవసర మైతే మార్పు చెందుతుంది.

'రామునకు నధికుఁడు తుల్యుడు లేడు' అనేరీతిస్థలాల్లో అవసరం లేదు గాబట్టి విభక్తిమార్పు ఉండదు.

అవసర మైనచోట్ల ఈపరిణామం నిత్యమే.

## 5. సమాసపరిచ్ఛేదం

### 1. షష్ఠీతత్పురుషంబునందు నగాగమంబు విభాష నగు (1)

షష్ఠీ (యొక్క) విభక్తి చివర కలిగినపదానికి పైపదంతో ఏర్పడినసమాసం షష్ఠీతత్పురుషం. 'నక్' ఆగమ అన్నపుడు కకారం ఇత్తు. కాబట్టి అది లోపిస్తుంది. 'న' ఆగమం అవుతుంది. ఇది కిత్తు కాబట్టి విధించినదానికి అంత్యావయవంగా చివర వచ్చి చేరుతుంది.

షష్ఠీ తత్పురుషసమాసంలో ఉదంత మైనపూర్వపదానికి చివరలో 'న' అనేవర్ణం వికల్పంగా ఆగమంగా వస్తుంది.

యోగక్షేమంబుయొక్క అనేశబ్దానికి తెఱఁగు అనేపదంతో సమాసం జరిగి, విభక్తి లోపించి 'యోగక్షేమంబు + తెఱఁగు' అని ఉండగా, ప్రస్తుతసూత్రంచేత నగాగమం వచ్చి 'యోగక్షేమంబునతెఱఁగు' అని అవుతుంది.

'విభాష' అనడంచేత వికల్పం గాబట్టి నగాగమం రానిపక్షంలో 'యోగక్షేమంబుతెఱఁగు' అని ఉంటుంది.

'షష్ఠీతత్పురుషంబునందు' అనడంచేత ఇతరసమాసాలలో ఈకార్యం రాదు. చివురుసవురు.

'నగాగమం' అసామాన్యంగా చెప్పడంచేత హల్లు పర మైనా అచ్చు పర మైనా ఈఆగమం వస్తుంది. అరదంబునయురవడి.

ఈకార్యం ఉదంతాలకు మాత్రమే వస్తుంది. ఉదంతాలు కానివాటిపై నగాగమం రాదు. అమ్మమాట, రామునిబాణము మొ॥

ఇక్కడిఉదాహరణలు సప్తమీ అలుక్‌సమాసాలుగా అన్వయింపబడతాయి. కాబట్టి 'న' అనేది ఆగమం కాక సప్తమీ విభక్తి అని గుర్తిస్తే ఈలక్షణం చెప్పనవసరం లేదు.

## 2. కొన్నియెడల నిచ్ఛే ననాపామాయాగమంబు లగు (4)

'ఇచ్ఛేన్' అంటే పూర్వసూత్రసందర్భాన్నిబట్టి 'బిరుదాద్యుత్తరపదమయినకర్మధారయసమాసంలో, పూర్వపదం ద్వ్యక్షరాదంత స్త్రీపుంసంజ్ఞావాచకం అయినచోట' అని అర్థం.

కర్మధారయసమాసంలో బిరుదాద్యుత్తరపదం పరంగా ఉండగా, ద్వ్యక్షరాదంత స్త్రీ పుం సంజ్ఞావాచక మైన పూర్వపదానికి చివరలో, అన, అప, అమ, అయ అనేవి ఆగమాలుగా వస్తాయి అని సూత్రానికి అర్థం.

'తిక్క' అనే ద్వి అక్షర, అదంత పుంసంజ్ఞకు 'సోమయాజి' అనేబిరుదవాచకంతో కర్మధారయసమాస మై 'తిక్క + సోమయాజి' అని కాగా, (దీర్ఘాన్ని, ఇత్వాన్నీ బాధించి) ప్రస్తుతసూత్రంచేత 'అన' అనేది ఆగమ మై తిక్క + అన, 'అంద్వవగాగమంబులం దప్ప' అని సంధి జరిగి 'తిక్కన సోమయాజి'. ఇలాగే

| | | | |
|---|---|---|---|
| అప- | నన్న + ఆర్య | నన్న + అప + ఆర్య | నన్నపార్యుడు |
| అమ- | కృష్ణ + నాయ | కృష్ణ + అమ + నాయ | కృష్ణమనాయఁడు |
| అయ- | నన్న + భట్టు | నన్న + అయ + భట్టు | నన్నయభట్టు |

'కొన్నియెడల' అనడంచేత ఈకార్యం సార్వత్రికం కాదు.

తిక్కయజ్వ- కృష్ణశాస్త్రి - చిన్నాదేవి (చిన్నపరెడ్డిలో అప) మొ॥చోట్ల వీటిలో ఏఆగమమూ రాదు. అలాగే ఆయాశబ్దాలకు ఆయాశబ్దాలు పరంగా ఉన్నప్పుడే ఆయాఆగమాలు వస్తాయి. నన్నయభట్టు తిక్కయసోమయాజి మొద లైనవిధంగా వేర్వేరు

ఆగమాలు రావడం ప్రసిద్ధం కాదు. ఈస్థితి కూడ 'కొన్నియెడల' అనేదళంచేతనే సమన్వయించుకోవాలి.

అన + అప + అమ + అమ + ఆగమ అని అన మొ॥ తెలుగుశబ్దాలను సంస్కృతంలోకి అనువదించడంవల్ల సవర్ణదీర్ఘంతో అనాపాయాగమంబు' అని అయింది.

'అగు' అనడంచేత ఈకార్యం నిత్యమే. ఈఆగమాలు వచ్చినస్థలాలలో ఆగమం లేనిరూపాంతరం కనబడదు. తిక్కనసోమయాజి నన్నపార్యుడు ఇత్యాదుల్లో తిక్కసోమయాజి నన్నార్యుడు ఇత్యాదులు కానరావు.

ఈఆగమాలు పూర్వపదానికే వస్తాయి. పూర్వపదం అదంతం కావడంవల్ల అత్వం అంతకుముందే ఉన్నది కాబట్టి న-ప-మ-య అని యేకాక్షరాలను ఆగమంగా చెప్పినట్లయితే సంధి చేయవలసినప్రక్రియాగౌరవం తగ్గిఉండేది.

వీటిలో తిక్కన, నన్నయ ఇత్యాదులు కొన్ని ప్రత్యేకపదాలుగా (అన – అయ మొ॥ వాటిలో) ప్రసిద్ధాలు అయినా నన్నప (ఆర్య) కృష్ణమ ఇత్యాదులు లేవు. నన్నన, తిక్కప ఇత్యాదులు కూడా. కాగా ఆగమాలుగా చెప్పడంవరకు అవసరమే. ఏకాక్షరాలుగా చెప్పడం మేలు అనిపిస్తుంది.

### 3. కర్మధారయం బియ్యది మిశ్రంబు సిద్ధసమాసం బట్ల యగు (6)

ఇయ్యది – అంటే పూర్వం చెప్పింది. బిరుదాది ఉత్తరపదమూ, (ద్వ్యక్షరాదంత స్త్రీ, పుం) సంజ్ఞావాచకము పూర్వపదమూ అయినది అని అర్థం. సంస్కృతసమ ఆచ్ఛికశబ్దాలకు కలిగినసమాసం మిశ్రం. సంస్కృతంలో సమాసంగా ఏర్పడినది (సమాసమే ప్రాతిపదికగా తెలుగులోకి వచ్చినది) సిద్ధసమాసం.

బిరుదాద్యుత్తరపద మయిన కర్మధారయసమాసం మిశ్ర మైతే అది సిద్ధసమాసంవలె అవుతుం దని సూత్రానికి అర్థం.

సిద్ధసమాసంవలె – అనడంలో ప్రయోజనాన్ని వ్యాకర్తే 'పూర్వపదంబు లుప్తవిభక్తికం బయి యవికృతాంతం బగు' నని వివరించాడు. అంటే ఈసమాసంలో మొదటిపదంచివరివిభక్తి లోపించి, ఆ విభక్తిని నిమిత్తం చేసుకుని ప్రాతిపదికచివర వచ్చినమార్పు లన్నీ పోయి (సంస్కృతంలోలాగా) మూలప్రాతిపదిక రూపం మిగులుతుంది.

రాముఁడు అనేతత్సమసంజ్ఞకు రావు అనేబిరుదవాచకంతో కర్మధారయ మై రాముఁడు + రావు. ఇందులో రాముడు సంస్కృతసమం. రావు ఆచ్ఛికం. కాబట్టి ఈసమాసం మిశ్రం. 'సమాసవిభక్తికి లోపం బగు' అనేసూత్రాన్ని బాధించి (ఆసూత్రంప్రకారం విభక్తి లోపిస్తే రామురావు అవుతుంది) ప్రస్తుతసూత్రంచేత సిద్ధసమానంవలే అవుతుంది. దానివలన విభక్తి లోపించి రాములో అత్వానికి వచ్చిన ఉత్వరూప మైనవికారం కూడా పోయి అంటే ఆమార్పు పొందక పూర్వం ఉన్నరూపం కలిగి రామ – రావు అని అవుతుంది. ఆతర్వాత 'కర్మధారయంబు' ఇత్యాదిసూత్రంచేత దీర్ఘం వస్తే రామారావు.

'మిశ్రంబు' అనడంచేత సాంస్కృతిక ఆచ్ఛిక సమాసాల్లో ఈకార్యం లేదు.

దీన్నిబట్టి 'రామశాస్త్రి' 'కృష్ణశాస్త్రి' ఇత్యాదులు సంస్కృతంలోనే ఏర్పడినసమాసాలుగా గుర్తించాలి. (రాముడు + శాస్త్రి) అని తెలుగులో సమాసం చేస్తే రాముశాస్త్రి కావలసివస్తుంది.

సుబ్బఁడు + రావు అనేరీతిఆచ్ఛికసమాసాల్లో విభక్తిలోపంచేతనే సుబ్బరావు ఇత్యాదు లవుతాయి. అంటే (ఇక్కడ) ఆచ్ఛిక సమాసాల్లో పూర్వపదం (అత్వానికి ఉత్వం రాని) మగాదుల్లోనిదే అవుతుంది.

'సిద్ధసమాసం బట్ల' అనడంచేత రామురావు వంటి రూపా లుండవు. సిద్ధసమాసాలవలె ఉంటాయి. కాని యివి మిశ్రమసమాసాలే. తెలుగులో చేసినసమాసాలే.

'ఇయ్యది' అనేదానిచేతనే కర్మధారయంబు అనేఅర్థం వస్తుంది. కాబట్టి సూత్రంలో 'కర్మధారయంబు' అనేదళం స్పష్టతకే. లేకున్నా అనర్థం లేదు.

'సిద్ధసమాసంబట్ల' అనడంకంటే పూర్వపదంలో ఉత్వానికి అత్వం చెప్పడం ఉచిత మేమో పరిశీలించాలి. విభక్తిలోపం పూర్వోత్తరపదాలు రెండింట్లో వస్తుంది.

### 4. క్రొత్తాదులు లుప్తశేషంబులు దేశ్యంబులతోడంబలెఁ దత్సమంబులతోడం గొన్నియెడలఁ గర్మధారయం బగు

క్రొత్త మొద లైనశబ్దాలు క్రొత్తాదులు. లుప్తశేషం అంటే (తొలియచ్చు మీదివర్ణాలు) లోపించగా మిగిలిన (మొదటి) అక్షరం. దేశ్యం అంటే అచ్చతెనుగు అనీ, తత్సమం అంటే కేవలం సంస్కృతసమం అనీ ఇక్కడ గ్రహించాలి.

(తొలియచ్చు) మీదివర్ణాలు లోపించగా మిగిలినమొదటిఅక్షరం (లేదా మొదటిరెండక్షరాలు) కలిగిన క్రొత్త మొద లయిన శబ్దాలు (క్రొ, మొ॥) ఆచ్ఛికశబ్దాలతోలాగానే సంస్కృతసమశబ్దాలతో గూడా అరుదుగా కర్మధారయసమాసాన్ని పొందుతాయి అని సూత్రానికి అర్థం.

ప్రాతాదికార్యాలసందర్భంలో సూరి అన్నీ ఆచ్ఛికసమాసాలే ఉదాహరించాడు. అధర్వణాచార్యులు 'అమిశ్రే స్త్రీసమాత్' అని మిశ్రసమాసాలను పరిహరించాడు. క్రొత్తాదు లన్నీ ఆచ్ఛికాలే కాబట్టి సంస్కృతసమంతో సమాసం చెప్పడం ద్వారా మిశ్ర సమాసాలను ప్రౌఢవ్యాకరణం సాధిస్తున్నది.

సూరి ప్రాతాదు లని చెప్పి క్రొత్తశబ్దం ప్రాతాదుల్లో నిదిగా చూపాడు. 'శబ్దానా మాదిభాగేషు నూతనత్వాదిబోధకాః ' అనే అధర్వణుడివచనాన్ని అనుసరించి ప్రౌఢవ్యాకర్త క్రొత్తాదు లన్నాడు. అందుకే సూరి ప్రాతాదులకంటే అన్యంగా చూపిన నెఱ మొ॥ ప్రౌఢవ్యాకర్త క్రొత్తాదులలో చూపాడు.

అలాగే సమాస మయినతర్వాత తొలియచ్చుమీదివర్ణాలు లోపించడం సూరిప్రక్రియ. కాగా ముందుగా లోపం వచ్చిన తర్వాత (లుప్తశేషానికి) మీదిపదంతో సమాసం చేయడం అనేప్రౌఢవ్యాకర్త పేర్కొన్నప్రక్రియ అధర్వణమతానుసరణం వల్ల కావచ్చు.

'క్రొత్త' శబ్దంలో 'త్త' అనే అక్షరం లోపింపగా మిగిలిన 'క్రొ' అనేశబ్దం, 'పులకలు' అనేసంస్కృతసమంతో ప్రస్తుత సూత్రంప్రకారం సమాసం పొందుతుంది. క్రొ + పులకులు – సమాసవిభక్తి లోపించి 'క్రొ + పులక' 'సమాసమందు' దత్సమంబు పరం బగునపుడు నుమాగమాదులు గానంబడియెడి' అనే ప్రౌఢ సూత్రం ప్రకారం నుగాగమం వచ్చి ద్రుతకార్యాలతో క్రొంబులకులు. ఇలాగే ముంగోపము, వింజామరము మొ॥

క్రొత్తశబ్దం లుప్తశేష మై క్రొ. దీనికి 'నారాచములు' అనే సంస్కృతసమంతో ప్రస్తుతసూత్రంచేత సమాసం. 'సమాసమందుఁ దత్సమంబు' అనేసూత్రంచేత మీదిహల్లుకు ద్విత్వం వచ్చి – క్రొన్నారాచములు.

'క్రొత్తాదులు' అనడంచేత క్రొత్తాదులలో చేరనిశబ్దానికి ఈకార్యం లేదని చెప్పాలి. కాని క్రొత్తాదులలో లేనిది లుప్తశేషం కావడమూ, (సంస్కృతసమంతో సమాసం పొందక) ఆచ్ఛికంతో సమాసం పొందడమూ అనేస్థితిని గూర్చి విచారించాలి.

'లుప్తశేషంబులు' అనడంచేత లోపం రాక (క్రొత్త) మొద లైనవిధంగా ఉన్నప్పుడు సమాసం లే దని చెప్పాలి. క్రొత్తపులకలు ఇత్యాదులు సమాసాలు కా వనాలి. ఇది విచార్యం. క్రొత్తకుండలు ఇత్యాదులు సమాసాలుగా సూరి చెప్పాడు.

'దేశ్యంబులతోడంబలె' అనడం స్పష్టతకే. అది లేకపోయినా అనర్థం లేదు. 'తత్సమంబులతోడను' అనేసముచ్చయంతో ఆచ్ఛికాలతో సమాసం ప్రచురం గావడం స్పష్టం అవుతుంది.

'కొన్నియెడల' అనడంచేత క్రొంబులకలు వంటి మిశ్రసమాసాలు అరుదు.

### 5. అట్టి యిట్టి యెట్టి విశేషణంబులమీఁది తచ్ఛబ్దవకారంబునకు లోపంబు విభాష నగు (9)

'తత్' అనేసంస్కృతశబ్దంయొక్క అర్థం కలిగిన తెలుగుశబ్దం తచ్ఛబ్దం. తచ్ఛబ్దానికి సంబంధించిన వకారం తచ్ఛబ్దవకారం. వాఁడు వారు మొదలైనవాటిలోనిది. వకారం అంటే పొల్లే (వ్) కాని లక్ష్యానుగుణంగా ఇక్కడ మాత్రం 'వా' అనేఅక్షరం మొత్తం గ్రహించాలి.

అట్టి – ఇట్టి – ఎట్టి అనేవిశేషణాలకు పైన ఉన్న వాఁడు, వారు అనేశబ్దాలలోని 'వా' అనేఅక్షరానికి వికల్పంగా లోపం వస్తుం దని సూత్రానికి అర్థం. దీన్నిబట్టి ఈవిశేషణాలమీద విభక్తివివక్షలో తచ్ఛబ్దం చేరుతుం దని గ్రహించవలసిఉంటుంది.

అట్టి అనేవిశేషణంమీద ప్రథమైకవచనవివక్షలో 'ధాతుజవిశేషణంబులకు విభక్తి వివక్షించునపుడు తచ్ఛబ్దం బనుప్రయుక్తం బగు' అనేసూత్రంచేత ధాతుజవిశేషణం ఇతర విశేషణాలకుపలక్షకం) తచ్ఛబ్దం అనుప్రయుక్తం కాగా, మహదర్థంలో అట్టిఁ వాడు. ప్రస్తుతసూత్రంచేత 'వా' అనేఅక్షరం లోపించగా – అట్టిఁడు.

'విభాష' అనడంచేత లోపం రానిపక్షంలో అట్టివాఁడు .

'అట్టి యిట్టి ఎట్టి' అనడంచేత ఇతరవిశేషణాలకు పైన ఈలోపం లేదు. నల్లవాఁడు, తెల్లవారు మొ॥

'తచ్ఛబ్ద' అనడంచేత తచ్ఛబ్దంకంటే భిన్న మైనశబ్దంలోని వ కారానికి లోపం రారాదు. అట్టివీఁడు, ఇట్టివావి, ఎట్టివరుస 'వకారంబునకు' అనడంచేత తచ్ఛబ్దానికే సంబంధించినదే అయినా ఇతరవర్ణాలకు లోపం రాదు. అట్టియతఁడు. ఎట్టియామె మొ॥

'విశేషణంబుల' అనడం స్పష్టతకే. ఇవి విశేషణాలుగా మాత్రమే కావడం కోశాలు గుర్తించాయి. పైగా 'సేసలు వెట్టిన యట్టి రైరి' మొ॥ అనుప్రయుక్త మైన అట్టి మీద గూడ ఈలోపం వస్తున్నది.

'వ కారం' అంటే పోల్లే అయి, అట్టి+వాఁడు, అట్టి + ఆఁడు, అట్టాఁడు ఇత్యాదిగా అపరూపాలు ఏర్పడే(ప్రమాదం ఉంది. వాక్షరంబునకు లేదా తచ్ఛబ్దానికే లోపం చెప్తే బావుండేది.

ఈలోపం ప్రథమేతరవిభక్తులలో గానరాదు. అటువంటప్పుడు ప్రథమావిభక్తిలో మాత్రమే లోపిస్తుం దనేఅంశం గూడా చెప్పడం అవసరం. విభాషా పదానికి ఈఅర్థం వ్యవస్థ చేసుకోవచ్చు.

### 6. ముయ్యేడ్వాదులందు హ్రస్వద్విత్వంబులు నిత్యంబులు (10)

ముయ్యేడు మొద లగునవి ముయ్యేడ్వాదులు. ముయ్యేడు మొద లైనసమాసాలలో మీదిహల్లుకు ద్విత్వమూ, దాని ముందరి దీర్ఘానికి హ్రస్వమూ నిత్యంగా వస్తా యని సూత్రానికి అర్థం.

'సమానాధికరణం బగునుత్తరపదంబు పరం బగునపుడు మూఁడుశబ్దము దుజ్వర్ణంబునకు లోపంబును మీఁదిహల్లునకు ద్విత్వంబును' అనేసూరిప్రణాళికలో ఈకార్యం లోపద్విత్వరూప మైనది. 'ఇదమదఏతద్యత్తచ్ఛబ్దాః . . . బహుళం హ్రస్వం ప్రపద్య దీర్ఘాః ద్విత్వ ముపర్యక్షరస్య జనయంతి" అనే చింతామణిలో హ్రస్వద్విత్వాలు చెప్పబడ్డాయి. ప్రౌఢవ్యాకర్త చింతామణి సూత్రార్థవివరణప్రాయంగా ఈసూత్రం చెప్పాడు. కాబట్టి సూత్రార్థాన్ని చింతామణిమార్గంలో సమన్వయించాలి. చింతామణిలో ఈకార్యం బహుళం అని చెప్పబడింది. ముయ్యేడ్వాదులలో ప్రవృత్తి అని ఈ వ్యాకర్త తాత్పర్యం.

మూడు శబ్దాన్ని క్రొత్తాదుల్లో చేర్చుకొని మొదటిఅక్షరం మాత్రమే మిగిలేటట్లుగా మిగిలినఅక్షరాలన్నీ (దుక్) లోపింపజేయగా 'మూ' అని ఉంటుంది. దీనికి మూఁడైన ఏడులు అనేఅర్థంలో 'ఏడు' శబ్దంతో కర్మధారయమై మూ + ఏడు. ఇక్కడ సంధి లేదు కాబట్టి (యశ్రుతి) యడాగమం వచ్చి 'మూయేడు' ప్రస్తుతసూత్రంచేత మూకు హ్రస్వమూ, (ము + యేఁడులు) మీది హల్లుకు ద్విత్వమూ నిత్యంగా వచ్చి ముయ్యేడులు.

'ముయ్యేడ్వాదులందు' అనడంచేత ముయ్యేడు మొదల యిన వాటిలో చేరనిస్థలాల్లో ఈకార్యం నిత్యం కాదు. వ్యాకర్త చూపినఉదాహరణలనుబట్టి ముయ్యేడ్వాదు లన్నింట్లో పూర్వపదం మూఁడుశబ్దమే అయిఉంటుం దని తోస్తున్నది (అని సూత్రకర్త స్పష్టంగా చెప్పలేదు). ఆ కన్య.

'హ్రస్వద్విత్వంబులు' అనడంచేత ఈశబ్దం మొదటిఅక్షరం మిగిలింది కాక 'మూఁడు' అని ఉన్నసందర్భంలో హ్రస్వద్విత్వాలు రాక – మూఁడుజగములు, మూ డేడులు, అనేవ్యస్తరూపాలు ఉంటాయని వ్యాకర్త భావించిఉండాలి.

'నిత్యంబులు' అనడంచేత ఆకన్య మొద లైనవానివలె మూయేడులు అనేరీతిరూపా లుండవు.

కాగా మూఁడేడులు అనేరూపం ఉండడంలో అభ్యంతరం లేదనీ, మూయేడు అనేరీతిరూపాలు నివారించడమే ఈ లక్షణానికి ప్రయోజన మని గ్రహించాలి.

ముక్కారు, ముత్రోవ ఇత్యాదులనుబట్టి ఇక్కడ నుగాగమం ఎప్పుడూ రాక మీదిహల్లుకు ద్విత్వం మాత్రమే వస్తుండటంతోనే సూరి మూఁడును ప్రాతాదుల్లో చేర్చక వీటికి ప్రత్యేకలక్షణం చెప్పిఉండవచ్చు. నిర్దుష్టమూ, విస్పష్టమూ అయినసూరిమార్గాన్ని విడిచి ప్రౌఢవ్యాకర్త తిరిగి చింతామణివ్యాఖ్యకు పూనుకోవడం విచార్యం.

**7. గుణవాచకంబులు కొన్నింటినిగాగమంబునకుఁ బరుషంబులు పరంబు లగునపుడు బిందు వగు** (13)

గుణాన్ని తెలియ జేసేశబ్దాలు గుణవాచకాలు. కచటతపలు పరుషాలు. నిక్ ఆగమంలో క కారం ఇత్తు. కాబట్టి 'ని' అనేదే నిలిచిఉంటుంది. నిగాగమంబునకు – అనడంచేత 'ని' వర్ణం మొత్తంస్థానంలో బిందువు వస్తుంది. బిందువు అని సామాన్యంగా చెప్పడంవల్ల ఖండబిందువూ, పూర్ణబిందువూ రెండూ వస్తాయి.

పరుషాలు పరంగా ఉండగా, వాటికి పూర్వంలో ఉన్న కొన్ని గుణవాచకాలకు కర్మధారయసమాసంలో ఆగమంగా వచ్చిన 'ని' అనేవర్ణంస్థానంలో, అరసున్న లేదా నిండుసున్న వస్తుంది అని సూత్రానికి అర్థం.

'కమ్మ + తేనె' అనే కర్మధారయంలో 'గుణవచనంబు గునల్లాదులకుం గర్మధారయంబునందు నిగాగమంబు బహుళంబుగా నగు" అనే (బాలవ్యాకరణ) సూత్రంచేత నిగాగమం వచ్చి' కమ్మనితేనె. ఆ ని వర్ణానికి ప్రస్తుతసూత్రంచేత అర్ధబిందువు వస్తే కమ్మఁ తేనె. పూర్ణబిందువు వస్తే కమ్మంతేనె. లక్ష్యానుగుణంగా ఇక్కడ బిందువుతోపాటు మీదిపరుషానికి సరళం కూడా వస్తుందని గ్రహించాలి. కమ్మఁదేనె, కమ్మందేనె.

'గుణవాచకములు' అనడంచేత ఇతర (ధ్వన్యనుకరణ) శబ్దాల నిగాగమానికి ఈకార్యం లేదు. తళతళనితరణిమెఱుఁగులు.

'కొన్నింటి' అనడంచేత గుణవాచకాలకు గూడా అన్నింటికీ ఈకార్యం లేదు. నల్లనికలువ, చక్కనితరుణి మొ॥

'నిగాగమంబునకు' అనడంచేత నిగాగమం రానిపక్షంలో బిందువు రావడానికి అవకాశం లేదు. కమ్మతేనె.

'పరుషంబులు పరంబు లగునపుడు' అనడంచేత పరుషేతరం పర మైతే ఈకార్యం లేదు. కమ్మనియమృతము, కమ్మనిగాలి మొ॥

'బిందు వగు' అనడంచేత ఈకార్యం నిత్యం అని చెప్పవలసిఉంది. అపుడు 'కమ్మనితేనె' అనేరీతిరూపం లక్షణ విరుద్ధం అవుతుంది. కాబట్టి నిత్యంగా చెప్పగూడదు.

బిందువుతోపాటు పైపరుషం సరళం కావడం చెప్పకపోవడం సరికాదు. ఈరెండూ చెప్పడంకంటే 'ను'గాగమ (ద్రుత) విధానం ఉచితం.

'కొన్నింటి' అని చెప్పినా 'కమ్మ' శబ్దం మాత్రమే ఉదహరింపబడింది. మరొకటి మృగ్యం.

ఇలాంటివి ఒకవేళ ఒకటో రెండో ఉన్నా వాటిని 'గుణవచనంబులగు' అనే బాలవ్యాకరణసూత్రంలోని బహుళశబ్దంచేత అన్యకార్యంగా ఇక్కడ నుగాగమాన్ని సాధించుకుంటే ఈరూపాలన్నీ తేలికగా సమగ్రంగా సిద్ధిస్తాయి. అటువంటప్పుడు ఈ విధానం అవసరం కాదు.

**8. తమ్ముఁగుట్టులు చిలుకమొకరి యిత్యాదులు విశేష్యపూర్వపదకర్మధారయంబులు** (16)

విశేషణానికి విశేష్యంతో అయినసమాసం కర్మధారయం. పూర్వపదం అంటే సమాసంలో మొదటిపదం. విశేషణంచేత చెప్పదగిన జాత్యాదివిశేషం కలిగినది విశేష్యం.

తమ్ముఁగుజ్జులు, చిలుకమొకరి మొద లయినవి విశేష్యం పూర్వపదంగా కలిగినకర్మధారయసమాసాలు అని సూత్రానికి అర్థం. దీనివల్ల విశేష్యం పూర్వపదంగా మారుతుంది.

'తత్పురుషాదులకు లక్షణంబు ప్రాయికంబుగ సంస్కృతోక్తంబ యగు' అని సూత్రించి తెలుగులోని ఆయాసమాసాలను వివరించినసూరి విశేష్యపూర్వపదకర్మధారయాలు సంస్కృతంలో లాగా తెలుగులో కూడా ఉంటా యనేవిషయాన్ని ప్రస్తావించలేదు. అందుకని ప్రౌఢవ్యాకరణం వాటిని పేర్కొన్నది.

'కుజ్జ లయినతమ్ములు' అనేవిగ్రహంచొప్పున కుజ్జులు అనేవిశేషణానికి తమ్ములు అనేవిశేష్యంతో కర్మధారయసమాసం ఏర్పడి కుజ్జులు + తమ్ములు. విశేష్య మయిన తమ్ములు అనేశబ్దం ప్రస్తుతసూత్రంచేత పూర్వపదం అయి తమ్ములు+కుజ్జులు. 'సమాసవిభక్తికి లోపం బగు' అని విభక్తి లోపించి, తమ్ము + కుజ్జ. లక్ష్యానుగుణంగా ఇక్కడ పూర్వపదానికి నుగాగమం వస్తుం దని గ్రహించాలి. తమ్మును + కుజ్జ. ద్రుతకార్యాలతో (తమ్ము + ఁ గుజ్జ) ఈసమాసప్రాతిపదికపై ప్రథమావిభక్తిని వివక్షించగా బహుత్వార్థాన్నిబట్టి బహువచనం(లు) వచ్చి తమ్ముఁగుజ్జులు.

ఇలాగే మొకరి యగుచిలుక . . . చిలుకమొకరి.

'తమ్ముఁగుజ్జులు చిలుకమొకరి' అనేనిర్దేశంవల్ల కుజ్జతమ్ములు, మొకరిచిలుక అనేవిధంగా విశేషణం పూర్వపదంగా ఉంటే, (విశేషణపూర్వపద) కర్మధారయాలు అవుతాయి.

ఇత్యాదు లనడంచేత కవిప్రయోగానుసారంగా ఇతరశబ్దాలను గ్రహించవచ్చు. అల్లుఁగుజ్జ, కొడుకుఁగుజ్జ మొ॥

'ఇత్యాదులు' అని ఎలాగూ చెప్తున్నప్పుడు సూత్రంలో అటువంటివాటిని రెండు ఉచ్చరించడంవల్ల ప్రయోజనం లేదు. 'తమ్ముఁగుజ్జ లిత్యాదులు' అని మాత్రమే చెప్పినా ఇత్యాదిశబ్దంచేత 'మొకరిచిలుక' కూడా గ్రహింపబడుతుంది.

'విశేష్యం పూర్వపదం కావడం' అనే విధేయాంశాన్నే చెప్పిన ట్లయితే బాగుండేది.

## 9. ఆయీత్యాదిఘటితంబులు విశేషణోభయపదకర్మధారయంబులు (17)

ఆ – ఈ అనేవి సర్వనామాలు (త్రికం). ఇత్యాదు లంటే ఏ అనేత్రికమూ, గుణవిశేషణాలూ, ధాతుజవిశేషణాలు మొదలైనవిశేషణాలను గ్రహించాలి. సమాసంలో మొదటిపదానికి పూర్వపద మనీ, చివరిపదానికి ఉత్తరపద మనీ వ్యవహారం. ఉభయపదాలూ విశేషణా లయిన కర్మధారయసమాసాలు విశేషణోభయపదకర్మధారయాలు.

తెలుగులో ఆ, ఈ మొదలైన విశేషణశబ్దాలతో కూర్పబడినవి విశేషణోభయపదకర్మధారయసమాసాలు.

'స్నాతానులిప్తః' ఇత్యాదిగా సంస్కృతంలో ఇటువంటిసమాసా లున్నాయి. సూరి 'ఆయాకాలము' ఇత్యాదులు స్థలాంతరంలో ఉదాహరించాడు. కాని లక్షణంలో వీటిని చెప్పలేదు. "విశేషణసమాసో –పిక్వచి దిష్టో భవే న్మమ' అని అథర్వణుడు పేర్కొన్నాడు. ప్రౌఢవ్యాకరణం దాన్ని అనుసరించింది.

రెండవవిశేషణాన్ని విశేష్యంగా వివక్షించి విశేషణవిశేష్యభావంతో రెండు విశేషణాలకు కర్మధారయం చేయడం సంస్కృత సంప్రదాయం.

ఎత్తినవారు, పెంచినవారు అనేఅర్థంలో, ఎత్తినవారు, పెంచినవారు అనేధాతుజవిశేషణాలకు ప్రస్తుతసూత్రంచేత కర్మధారయమై సమాసవిభక్తి లోపించగా, ఎత్తినపెంచిన. ఈసమాసప్రాతిపదికపై ప్రథమావిభక్తి వివక్షించగా "ధాతుజ విశేషణంబులకు విభక్తి వివక్షించునపుడు తచ్ఛబ్దం బనుప్రయుక్తం బగు" అని తచ్ఛబ్దం చేరి ప్రథమలో బహుత్వార్థాన్ని బహువచనం రాగా మహదర్థంలో 'ఎత్తినపెంచినవారు' అని అవుతుంది. ఇలాగే కొట్టినతిట్టినయాతఁడు మొ॥

'ఆయీనేరములు' ఇత్యాదులలో 'ఆ ఈ' అనేవిశేషణాలకు ముందుగా కర్మధారయం చేసి (ఆయివి) ఆ రెండు విశేషణాలకూ విశేష్యమైన (నేరములు) దానితో కర్మధారయం చేయగా, ఆయీనేరములు మొ॥.

ధాతుజవిశేషణాలు తప్ప మిగిలినవిశేషణాలు విశేష్యంతో సమాసం పొందకుండా కేవలం విశేషణసమాసాలుగా ప్రయుక్తం కావడం కానరాదు. సూరి చూపిన ఆయాకాలము ఇటువంటిదే.

'ఈయాదేశంబు' అనేచోట ఏకవచనాన్నిబట్టి అన్వయంలో విశేషం గుర్తించవలసిఉంది.

విశేషణోభయపదకర్మధారయా లని వర్ణించడంకంటే ఆయీత్యాదివిశేషణాలకు సమాసం విధించడంలో ఔచిత్యం ఉందనిపిస్తుంది.

## 10. అలరుఁబోఁడీత్యాదు లుపమానపూర్వపదకర్మధారయంబులు (19)

విశేషణానికి విశేష్యంతో సమాసం కర్మధారయం. ఉపమానం పూర్వపదంగా కలిగినకర్మధారయం ఉపమానపూర్వపద కర్మధారయం. అంటే విశేషణ మైనపూర్వపదం ఉపమాన మైతే అది ఉపమానపూర్వపదకర్మధారయం.

'అలరుఁబోఁడి' మొదలైనవి ఉపమానపూర్వపదకర్మధారయాలు. ఇక్కడ పోఁడి పరంగా ఉన్నప్పుడు అన్ని శబ్దాలకూ నుగాగమం వస్తుంది.

అలరువంటి పోఁడి (మనోజ్ఞత కలది) అనేఅర్థంలో ఉపమాన మైన అలరు అనేవిశేషణానికి, పోఁడి అనేవిశేష్యంతో కర్మధారయసమాస మయి, 'ఇటఁ బోఁడి పరం బగుచో నెల్లెడల ను మ్మగు' అనడంచేత నుగాగమం వచ్చి ద్రుతకార్యాలతో అలరుఁబోఁడి మొ॥

'ఉపమానాని సామాన్యవచనైః' అనేపాణినీయలక్షణంచేత ఉపమానశబ్దాలు సామాన్యవచనాలతో సమాసాన్ని పొందుతాయి. అపుడు ఉపమానం పూర్వపదంగా నిలుస్తుంది. ఉపమాన – ఉపమేయాలలో సమానంగా ఉన్నధర్మం సామాన్యం. దాన్ని బోధించేశబ్దం సామాన్యవచనం.

అలరువంటి పోఁడి – స్త్రీ. అలరు అనేఉపమానంలోనూ, స్త్రీ అనే ఉపమేయంలోనూ సమానంగా ఉన్నధర్మం ఒప్పిదం. (మనోజ్ఞత) దానిని తెలిపేశబ్దం పోఁడి కాబట్టి అలరు అనేఉపమానానికి పోఁడి అనేసామాన్యవచనంతో ప్రస్తుతసూత్రం ప్రకారం (సమానాధికరణ) కర్మధారయసమాసం వచ్చిం దన్నమాట.

అలరువంటి మేను గలది అనేఅర్థంలో అలరు (ఉపమానం) మేను అనేశబ్దాలకు బహువ్రీహి సమాసం కాగా, 'బహువ్రీహిని స్త్రీ వాచ్యం బగుచో నుపమానంబుమీఁదిమేనునకు బోఁడి యగు' అని మేనుశబ్దంస్థానంలో 'బోఁడి' ఆదేశం అవుతుం దని సూరిప్రక్రియ. ఈరెండు మతాలలో బేధం ఇలా గుర్తించవచ్చు.

1) ఇది బహుప్రీహి అని సూరి. ఉపమానపూర్వపదకర్మధారయ మని ప్రౌఢ మతం.

2) ఉత్తర పదం మేను అనీ, దానికి బోఁడి ఆదేశ మవుతుం దనీ సూరి. ఉత్తరపదం 'పోఁడి' అనీ అది పరంగా ఉంటే నుమాగమం వస్తుం దనీ ప్రౌఢ మతం.

3) బోఁడికి పూర్వంలో అరసున్నా ఎక్కడా ఉండదు. ఉదంతాల మీద నిండుసున్న ఉండవచ్చు అని సూరి మతం, నుగాగమంచేత బోఁడికి పూర్వంలో అరసున్న నిండుసున్నలు రెండు అన్ని విధ మైనశబ్దాలమీద ఉంటాయి అని ప్రౌఢమతం. ననఁబోడి విరిఁబోడి.

4) పూవు వంటి శరీరం కల స్త్రీ అని సూరి మతంలో అర్థం. పూవువలె మనోజ్ఞురాలయిన స్త్రీ అని ప్రౌఢమతం.

శబ్దస్వరూపం ప్రౌఢవ్యాకర్తమతాని కనుగుణం కాగా, సూరిమతం అర్థానుగుణం. ప్రౌఢవ్యాకర్త చెప్పిన (మనోజ్ఞురాలైనది' అనేదానికంటే సూరి చెప్పిన 'మేనుకలది' అనే అర్థం సముచితం అనవచ్చు.

## 11. ఒక్కచో ద్విగువు మిశ్రం బేకవచనాంతంబు నగు (20)

విశేషణానికి విశేష్యంతో సమాసం కర్మధారయం. 'ఇయ్యది సంఖ్యాపూర్వంబు ద్విగువు నాఁబడు'. కర్మధారయంలో విశేషణ మయినపూర్వపదం సంఖ్యను తెలియజేసేది అయితే దానికి ద్విగుసమాస మని విశేష మయినసంజ్ఞ. సంస్కృతసమమూ, ఆచ్ఛికమూ అయినశబ్దాలు కలిగినసమాసం మిశ్రం. ఏకవచనాంత మవుతుం దంటే ఏకవచనం వస్తుం దని సారాంశం.

మిశ్రం అయిన ద్విగుసమాసానికి కూడా అరు దైనస్థలాల్లో, వికల్పంగా ఏకవచనం వస్తుంది అని సూత్రానికి అర్థం.

'ద్విగువున కేకవచనంబు ప్రాయికంబుగనగు' అని చెప్పిన సూరి అక్కడే 'మిశ్రంబునకుఁ గాదు' అన్నాడు. అధర్వణుడు కూడా 'ద్విగో రమిశ్రతాయాం ప్రాయ ఏకత్వ మిష్యతే' అని మిశ్రం కాని ద్విగువు కేకవచం చెప్పి మిశ్రతాయాం బహుత్వం స్యాత్' అని మిశ్రద్విగువునకు బహువచనమే వస్తుం దని మరోసారి స్పష్టంచేశాడు. కాగా ప్రయోగానుసారంగా మిశ్రద్విగువుకు కూడా ఏకవచనం రావడాన్ని ప్రౌఢవ్యాకర్త పేర్కొన్నాడు.

నాలుగయినదిక్కులు అనేవిగ్రహంచొప్పున నాలుగు, అనే (సంఖ్యా) విశేషణానికి, దిక్కు అనేవిశేష్యంతో కర్మధారయ సమాస మై - నాలుగు + దిక్కు. విభక్తి లోపించి 'నాలుగు' కు నలు ఆదేశమై - నలుదిక్కు. ఈసమాసప్రాతిపదికపై ప్రథమావిభక్తిని వివక్షింపగా బహుత్వార్థాన్నిబట్టి 'లువర్ణంబు బహువచనంబు' అని లు వర్ణకం రాగా దానికి ప్రస్తుతసూత్రంచేత ఏకవచనం వచ్చి నలుదిక్కు + సు. 'ఇగ్లౌరాయుగంతంబుల' అని ప్రథమైకవచనం లోపించి నలుదిక్కు (నల్దిక్కు) అని అవుతుంది.

'ఏకవచనాంతంబును' అనేచోటిసముచ్చయార్థకనుశబ్దంచేత ఏకవచనం వికల్పం. కాబట్టి రానిపక్షంలో బహువచనంతో నలుదిక్కులు. (నల్దిక్కులు).

'ఒక్కచో' అనడంచేత ఈకార్యం అరుదు. కవిప్రయోగానుసారంగా కొన్ని స్థలాల్లో మాత్రమే వస్తుంది. కాబట్టి ముజ్జగములు, ముప్పిధములు ఇత్యాదిగా పెక్కులక్ష్యాలలో బహువచనం మాత్రమే ఉంటుంది.

'ద్విగువు' అనడంచేత ఇతరసమాసానికి ఈకార్యం రాదు. తెల్లనిగుఱ్ఱములు, అన్నదమ్ములు మొ॥

'మిశ్రంబు' అనడంచేత ఇతరద్విగువుకు ఈసూత్రంచేత ఏకవచనం రాదు. బాలవ్యాకరణంప్రకారం ఆచ్ఛికద్విగువుకు ఏకవచనం వస్తుంది. ముచ్చిచ్చు, మొ॥ ఇతరాలకు లేదు. సప్తర్షులు మొ॥

'ఏకవచనాంతంబు' అని వర్ణించడంకంటే 'ఏకవచనంబు నగు' అనేవిధేయాంశాన్ని చెప్తే బాగుండేది.

## 12. కఱకంఠుఁడు బహువ్రీహి (27)

కఱకంఠుడు అనేశబ్దం బహువ్రీహి సమాసం అవుతుం దని సూత్రానికి అర్థం.

'కఱకంఠుడు ఇత్యత్ర మిశ్రబహువ్రీహిః అని అహోబలుడు దీనిని మిశ్రబహువ్రీహిగా చెప్పడం సరి గాదని ప్రౌఢవ్యాకర్త ఈలక్షణం చేశాడు.

కఱ అయిన కంఠము కలవాడు అనేవిగ్రహంతో, కఱ అనేఆచ్ఛికశబ్దానికీ, కంఠము అనేసంస్కృతసమశబ్దానికీ బహువ్రీహి సమాసం చేస్తే అది మిశ్రబహువ్రీహి అవుతుంది. కాని 'స్త్రీ సమఘటితంబు యొకానొకండు బహువ్రీహి చూపట్టెడు' అనేసూత్రంచేత స్త్రీసమాలయిన ఆచ్ఛికాలకు మాత్రమే బహువ్రీహి లక్షణానుసారంగా కుదురుతుంది. కాబట్టి మిశ్రం కుదరదు. అందుకనే మిశ్రం కావడం దుర్ఘటం అన్నాడు ప్రౌఢవ్యాకర్త.

ఇంక ఇది బహువ్రీహి అవుతుంది. 'తద్భవములందును నలఘురేఫము గలదు' అనేసూత్రం దగ్గర 'కఱకంఠుడు అనేది గరకంఠ శబ్దభవమని చెప్పాడు. వత్సనాభి – వసనాభి అనే తీరుగా సిద్ధ (సంస్కృత) సమాసంనుంచి తద్భవాలు ఏర్పడాన్ని వైకృతదీపికలో ఈవ్యాకర్త పేర్కొన్నాడు. అలాగే 'ప్రాణకుట్టక' అనేసమాసంనుంచి 'ప్రాణగొడ్డము' తద్భవం కావడం ఈవ్యాకరణంలో పేర్కొన్నాడు.

'గరకంఠ' అనే (సిద్ధ) సమాసం సంస్కృతలక్షణానుసారంగా బహువ్రీహి. కాబట్టి దానినుండి తద్భవంగా ఏర్పడిన 'కఱ కంఠ' అనేది కూడా బహువ్రీహే అవుతుంది. ఇక్కడ తెలుగులో సమాసం చేయడం అనేపద్ధతి లేదు. కాబట్టి ప్రౌఢవ్యాకర్త చెప్పినమార్గంలో 'కరకంఠ' అనేసమాసం మిశ్రం కాదు.

కఱకంఠ అనే తద్భవ (బహువ్రీహి) శబ్దం ప్రథమైకవచనంలో ఉత్త్వడుజులతో కఱకంఠుడు అని అవుతుంది. ఇలాగే మిగిలిన విభక్తుల్లో కఱకంఠుని మొ॥

'కఱకంఠ' అనేతద్భవశబ్దంలో ఱకారం ఉంది. ఇది అచ్చతెనుగువర్ణమాలలో లేదు. కాబట్టి అచ్చతెలుగులో ఉండకూడని ఱకారం ఉండటంచేత 'కఱకంఠ' అనేతద్భవశబ్దం లక్షణవిరుద్ధమై గ్రామ్య మైంది. అయినా 'కఱకంఠా ! క్షమియింపుము !" అనే నన్నయప్రయోగంచేత 'ఆర్యవ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు' గాబట్టి గ్రహింపబడుతున్నది. శబ్దరత్నాకరంలో దీన్ని వైకృతం, గ్రామ్యం అని చెప్పాడు ఈవ్యాకరణకర్త. అందుకే ప్రౌఢవాకర్త 'ప్రాణగొడ్డ మగ్రామ్యంబు' అన్నట్లుగా 'కఱకంఠుడు' అగ్రామ్యం బనలేదు.

సమాసం లక్షణవిరుద్ధం గాబట్టి గ్రామ్యం అని సూరిమతం.

అసలు తెలుగులో ఇక్కడ సమాసం చేయడమే లేదు గాబట్టి సామాసికదోషం లేదు. కానీ అచ్చతెలుగులో లేని ఠకారం ఉండడంచేత గ్రామ్యం అని ప్రౌఢ మతం.

నన్నయప్రయుక్తం కావడంవల్ల గ్రాహ్యం అనడం సర్వసమ్మతం. కాని ప్రౌఢ మార్గంలో నన్నయప్రయోగంలో మరో గ్రామ్యత వస్తుంది. 'కలకంఠుడు' తద్భవ మయితే దీనికి సంబోధనంలో 'కృతోత్కం బగుసంస్కృతనామంబు సంబుద్ధి డుజునకు లోపంబు విభాష నగు' అనేసూత్రంచేత డుజ్లోపం రాదు. సంస్కృతనామం కాదు కదా. చందురుఁడా, అనవలసిందే. చందురా అనవచ్చునా. అలాగే తద్భవ మైన కలకంఠుడు – కలకంఠుడా అవుతుందే కాని 'కలకంఠా' కాదు. ఇక్కడ డుజ్లోపం చేయడం మరోదోషం.

గ్రామ్యత ఎలాగూ తప్పనప్పుడు సామాసిక దోషంగా (అహోబలాదుల) సూరిమతాన్ని స్వీకరిస్తే 'కలకంఠుఁడు' 'కంఠ' శబ్దంసంస్కృతనామం కాబట్టి డుజ్లోపాదులతో నన్నయప్రయోగం సిద్ధిస్తుంది.

కాగా బహువ్రీహి అనేప్రౌఢవ్యాకర్తమతంకంటే మిశ్రబహువ్రీహి అన్న అహోబలాదులమతమే యుక్తం.

## 13. కొన్నియెడల మహద్ద్వంద్వంబునం బూర్వ పదాంత్యస్వరంబునకు దీర్ఘంబునుం జూపట్టెడు. (28)

ఇక్కడ మహత్ (మహత్ చ మహతీ చ) అనే శబ్దం ఏకశేషసమాసం. మహత్తు అంటే పురుషవాచకం, మహతి అంటే స్త్రీ వాచకం. సూత్రంలోని మహత్ శబ్దం ఈరెండింటినీ బోధిస్తుంది. ఉభయ (పూర్వ + ఉత్తర) పదార్థప్రధాన మైనసమాసం ద్వంద్వం. పూర్వపదం అంటే సమాసంలో ఆద్యవయవం (మొదటిపదం). 'దీర్ఘంబున్' అనేచోటి సముచ్చయార్థక ను శబ్దంచేత ఈకార్యం వికల్పం.

మహత్తులు, మహతీవాచకాలు అయిన శబ్దాలకు కలిగిన కొన్ని ద్వంద్వసమాసాలలో మొదటిపదంలోని చివరిఅచ్చుకు దీర్ఘం, వికల్పంగా రావడం కవిప్రయోగాలలో కనబడుతున్నది అని సూత్రానికి అర్థం.

అన్నయును తమ్ముఁడును అనేఅర్థంలో అన్న, తమ్ముఁడు అనేశబ్దాలకు 'ఆచ్ఛికశబ్దంబుతోడ స్త్రీసమంబు ప్రాయికంబుగా ద్వంద్వం బగు' అని ద్వంద్వసమాసం ఏర్పడి, సమాసవిభక్తి లోపించి అన్న + తమ్ము. (రెండు మహత్తులకు చేసిన యీ ద్వంద్వ సమాసంలో) ప్రస్తుతసూత్రంచేత మొదటిపదం చివరిఅచ్చుకు దీర్ఘం వచ్చి అన్నా తమ్ము – గసడదవాదేశం వచ్చి – ప్రథమావిభక్తిలో అన్నాదమ్ములు.

వికల్పం కాబట్టి దీర్ఘం రానిపక్షంలో (అన్న + తమ్ము) అన్నదమ్ములు.

అప్పాచెల్లెండ్లు (రెండూ మహతీవాచకాలు) తల్లీదండ్రులు (ఒకటి మహతి, మరొకటి మహత్తు)

'కొన్నియెడల' అనడంచేత ఈకార్యం క్వాచిత్కం. కాబట్టి ద్వంద్వసమాసా లన్నింటిలో ఈకార్యం రాదు.

'చూపట్టెడు' అనేదాన్నిబట్టి కవిప్రయోగానుసారంగా దీర్ఘం వచ్చినస్థలాలను గ్రహించాలి. ఆలుమగలు ఇత్యాదుల్లో దీర్ఘం అసలు లేదు. లోకవ్యవహారంలో ఆలూమగలూ, వదినే(నా)మరదులు ఇత్యాదిగా దీర్ఘం వినిపిస్తుంది. దానికి కావ్య ప్రయోగప్రామాణ్యం లేదు.

'మహత్' అనడంచేత తిర్యగ్జడాలకు ఈకార్యం లేదు. కుక్కనక్కలు, కూరగాయలు మొ॥

'ద్వంద్వంబున' అనడంచేత ఇతరసమాసాల్లో ఈకార్యం లేదు. పెద్దతమ్ముఁడు, రామునిబాణము మొ॥

'పూర్వపద అంత్యస్వరంబునకు' అనడంచేత అన్నదమ్ములూ, లేదా ఆన్నదమ్ములు ఇత్యాదిగా ఉత్తరపదాలలో గాని, పూర్వపదంలో ఇతరస్వరాలకు గాని దీర్ఘం రాదు.

### 14. ఒకానొకచో ద్వంద్వబునం బూర్వపదంబు క్లీబసమం బగు అగుచో నాముపర్ణకంబునకు లోపం బగు (29)

క్లీబం అంటే నపుంసకం. దానితో సమాన మైనది క్లీబసమం. నపుంసలింగశబ్దంతో సమాన మైనకార్యం (ముపర్ణకాదికం) పొందే (ఆచ్ఛిక) శబ్దం క్లీబసమం అని తెలియవచ్చు. ఉభయ (పూర్వఉత్తర) పదార్థ ప్రధాన మైనసమాసం ద్వంద్వం.

ద్వంద్వసమాసంలో పూర్వపదం అరుదుగా క్లీబసమం అవుతున్నది. అపుడు అందులో ము విభక్తికి లోపం వస్తుంది.

"ఆచ్ఛికశబ్దంబుతోడ స్త్రీసమంబు ప్రాయికంబుగా ద్వంద్వం బగు' అని బాలవ్యాకరణం ద్వంద్వంలో పూర్వపదం తఱుచుగా స్త్రీ సమ మవుతుం దని చెప్తున్నది. కాగా క్లీబసమానికి సైతం ఆచ్ఛికశబ్దంతో ద్వంద్వసమాసం అరుదుగా కావడం, ఈసూత్రం విశేషంగా చెప్తున్నది. ఉత్తరపదం ఆచ్ఛికం కావడం అనేఅంశం బాలవ్యాకరణాన్నిబట్టి గ్రహించాలి.

అందమును, చందమును అనేఅర్థంలో అందము అనేక్లీబసమానికి చందము అనేఆచ్ఛిక (క్లీబసమ)శబ్దంతో ప్రస్తు సూత్రంచేత ద్వంద్వసమాసం ఏర్పడి అందము + చందము. పూర్వపదంలో ముప్రత్యయం లోపించి అందచందము, 'సమాసవిభక్తికి లోపం బగు' అని ఉత్తరపదంలో ముప్రత్యయం లోపించి అందచంద. ఈసమాసప్రాతిపదికపై ప్రథమావిభక్తి వివక్షలో బహుత్వార్థాన్ని బట్టి బహువచనం వచ్చి అందచందములు. ఇలాగే వెచ్చము + సచ్చము = వెచ్చసచ్చములు మొ॥

'ఒకానొకచో' అనడంచేత ద్వంద్వంలో పూర్వపదం క్లీబసమం కావడం క్వాచిత్కం. కవిప్రయోగానుసారంగా ఆయా స్థలాలను గ్రహించాలి. బాలవ్యాకరణా న్ననుసరించి తఱచుగా స్త్రీసమమే అవుతుంది. కందతుండెములు మొ॥

'ద్వంద్వంబున' అనడంచేత ఇతరసమాసాలలో యథావకాశంగా ఉండవచ్చు.

'పూర్వపదంబు' అనడంచేత ఉత్తరపదం పూర్వ (బాల) లక్షణానుగుణంగా ఆచ్ఛికం (స్త్రీ సమ, క్లీ సమ, పుంలింగగతుల్యాలు) ఏదైనా కావచ్చు. తల్లిదండ్రులు, అన్నదమ్ములు మొ॥

'అగుచో నాముపర్ణకంబుకు లోపం బగు' అనడం అవసరం కాదు. 'సమాసవిభక్తికి లోపం బగు' అనేదానిచేత ఉత్తరపదం విభక్తితోపాటు పూర్వపదవిభక్తి కూడా లోపిస్తుంది. పుంప్వాదేశంస్థలంలో విశేషవిధానసామర్థ్యంవల్ల లోపించదు. మచ్చెకంటి మొ॥

'పూర్వపదంబు క్లీబసమం బగు' అనేమాట సమాస మైనతర్వాతస్థితిని వర్ణిస్తున్నది. కాని 'క్లీబసమానికి ఆచ్ఛికంతో ద్వంద్వం' విధించడం యుక్తమార్గం.

'అచ్చికశబ్దంబుతోడ స్త్రీ సమంబు ప్రాయికంబుగా ద్వంద్వం బగు' అనేబాలవ్యాకరణసూత్రంలో ప్రాయికశబ్దంచేత అరుదుగా క్లీబసమం కావడం సాధించుకోవచ్చు. అప్పుడీప్రౌఢవ్యాకరణసూత్రం బాలవ్యాకరణసూత్రంలోని ప్రాయిక శబ్దానికి వివరణప్రాయం అవుతుంది.

## 15. ద్వంద్వం బప్రాణివాచక కృదంతశబ్దఘటితం బేకవచనాంతంబు నగు (30)

ప్రాణం కలిగినది ప్రాణి. ప్రాణి కానిది అప్రాణి. అప్రాణిని బోధించేశబ్దం అప్రాణివాచకం. ధాతువుకంటే విధింపబడిన క్రియావిభక్తులకంటే వేరయిన ప్రత్యయం కృత్తు. కృత్తు అంతమందు కలిగినది కృదంతం. ను శబ్దంచేత ఈ కార్యం క్వాచిత్కం.

అప్రాణివాచకాలకు, కృదంతశబ్దాలకు (ఉభయాలకు) ఏర్పడిన ద్వంద్వసమాసం ఏకవచనాంతం కూడా అవుతుంది. అంటే అరుదుగా ఏకవచనం అవుతుం దని తాత్పర్యం. 'అన్యత్రాపి క్వచి ద్భవేత్' అనేఅథర్వణవచనం ఈఅర్థాన్నే చెప్తున్నట్లు అహోబలుడు చెప్పాడు.

కూడును గుడ్డయును అనేఅర్థంలో కూడు, గుడ్డ అనేశబ్దాలకు 'అచ్చికశబ్దంబుతోడ స్త్రీసమంబు' అనేసూత్రంచేత ద్వంద్వసమాస మై కూడుగుడ్డ అనేద్వంద్వసమాసప్రాతిపదిక ఏర్పడుతుంది. బహుత్వార్థాన్ని అనుసరించి దీనిపై బహువచనం వస్తుండగా ఈ అప్రాణిద్వంద్వానికి ప్రస్తుతసూత్రంచేత ఏకవచనం వస్తుంది. ఇది స్త్రీసమం కాబట్టి ప్రథమావిభక్తిలో ఏకవచనం లోపించి 'కూడు గుడ్డ' అని అవుతుంది. బహుత్వార్థంలో వచ్చింది కాబట్టి ఈ ఏకవచనం బహుత్వార్థాన్నే బోధిస్తుంది. కూడుగుడ్డ అంటే కూడుగుడ్డలు అనే అర్థం.

వికల్పం కాబట్టి ఏకవచనం రానిపక్షంలో బహువచనంతో కూడుగుడ్డలు,

రేవగలు అప్రాణివాచకాల ద్వంద్వం. తాఁకుదగులు. ఇక్కడ కృదంతాల ద్వంద్వానికి ఏకవచనం.

కూరగాయ, దరిదాఁపు అన్నపుడు మొదటిశబ్దం అప్రాణి, రెండవది కృదంతం.

'ద్వంద్వంబు' అనడంచేత ఇతరసమాసాల కీకార్యం లేదు. మడిసెడుదడములు.

'అప్రాణివాచక' అనడంచేత ప్రాణివాచకాలద్వంద్వానికి ఈకార్యం లేదు. తల్లిదండ్రులు. కాని ఆలుబిడ్డ లేని యట్టి త్రిమ్మరి, అత్తమామ నాగ అని ఒకటి రెండు ప్రయోగాలలో ప్రాణిద్వంద్వానికి కూడా ఏకవచనం కనబడుతున్నది.

'కృదంత' శబ్దాలను వేరుగా చెప్పడం అవసరంగా కనబడదు. ప్రాణివాచకాలైన కృదంతాలద్వంద్వానికి ఏకవచనం కావడం వ్యాకర్త చూపలేదు.

ఆధిక్యాన్నిబట్టి కేవలం 'అప్రాణిద్వంద్వం' అని మాత్రమే చెప్పవచ్చు. 'ఆలుబిడ్డ' లాంటి వాటిని గుర్తిస్తే సామాన్యంగా 'ఒకానొకచో ద్వంద్వంబేకవచనాంతం' కావడం చెప్తే చాలు.

'ఏకవచనాంతంబును' అని వర్ణించడంకంటే 'ఏకవచనంబు నగు' అని ఏకవచనాన్ని చెప్పడం ఉచితం.

'ను'శబ్దంచేత ఈకార్యం క్వాచిత్కం. కాబట్టి అప్రాణివాచకాలకు గూడా అన్నింటికీ ఈకార్యం రాదు. ఊరువల్లెలు, కాలుసేతులు మొ॥

## 16. భావద్వంద్వంబునం దొలిపదంబు టవర్ణకంబునకు లోపం బగు (31)

భావార్థకాలకు ఏర్పడిన ద్వంద్వసమాసం భావద్వంద్వం. 'టవర్ణకం' అనేది భావార్థకాలైన ఇకి మొదలైన కృత్ ప్రత్యయాలను కూడా తెలుపుతుంది. ట వర్ణకం కృత్తు కావడంవల్ల తన మొద లైన భావార్థకతద్ధితప్రత్యయాలకు ఇక్కడ ప్రసక్తి లేదు. కాగా ఇక్కడ భావార్థం అంటే ధాత్వర్థం.

భావార్థకా లయిన కృదంతశబ్దాలకు ఏర్పడిన ద్వంద్వసమాసంలో మొదటిపదంలోని ట మొ॥ భావార్థక కృత్ ప్రత్యయానికి నిత్యంగా లోపం వస్తుం దని సూత్రానికి అర్థం.

ఔట(అగుట)యును, కామియును అనేఅర్థంలో ఔట, కామి అనేశబ్దాలకు 'ఆచ్ఛికశబ్దంబుతోడ స్త్రీసమంబు' అనే సూత్రంచేత ద్వంద్వసమాసం ఏర్పడి సమాసవిభక్తి లోపించి, ఔట + కామి అని కాగా ఔట అనేమొదటిపదంలోని ట ప్రత్యయం లోపించి (ఔగామి) ప్రథమావిభక్తిలో బహువచనంతో ఔగాములు.

వినికి + వినమి అనేచోట వినికిలో భావార్థక కృత్ప్రత్యయం 'ఇకి' అయినా 'కి' వర్ణం ఒక్కటే లోపించడం (విని + వినిమి) విశేషం. వినివినములు.

'భావ (ద్వంద్వంబున)' అనడంచేత ద్వంద్వసమాసంలో ఎక్క డైనా ఉత్తరపదం కృదంతం కాకుండా పూర్వపదాంతంలో భావార్థకేతరమైన కృత్ ప్రత్యయం ఉంటే దానికి లోపం రాదు.

'తొలిపదంబు' అనడంచేత ఉత్తరపదంలోని (వ్యతిరేక) భావార్థకప్రత్యయం లోపించదు, ఔగాములు.

'టవర్ణకంబు' ఇతరభావార్థకకృత్తుల కుపలక్షకం. కాబట్టి ప్రయోగానుసారంగా అవి లోపిస్తాయి. వినివినములు.

'అగు' అనడంచేత ఈకార్యం నిత్యం. కాబట్టి లోపం రాని 'ఔటగాములు' అనేవిధ మైనరూపాలు ఉండవు.

వినవినములు, వచ్చిరాములు మొద లైనచోట్ల మొదటిశబ్దం క్వాంతం అని 'ద్వంద్వః కేషాంచి దిష్ట సాస్యత్ క్త్వార్థశబ్దేన కుత్రచిత్' అనేఅథర్వణలక్షణంద్వారా వ్యాఖ్యాతలు చెప్పారు. వచ్చురాములు, వినువినములు అనేతీరుగా వీటిని భావార్థకాలుగా చూపించినా, చేసిచేయములు ఇత్యాదుల్లో మొదటిది క్త్వార్థకం అనక తప్పదు. ఇక్కడ ఇ ప్రత్యయం క్త్వార్థాన్ని కాక భావార్థాన్నే బోధించడం గమనించాలి.

ఈద్వంద్వంలో మొదటిది (స్వార్థ) భావార్థకం కాగా రెండవ శబ్దం వ్యతిరేక భావార్థకం కావడం నియతంగా కనబడుతున్నది. రెండూ వ్యతిరేకభావార్థకాలు కావడం (వినమికనములు) రెండూ భావార్థకాలు కావడం (వినుట, కనుటలు) లేదా వ్యత్యస్తంగా వినమికనుటలు ఇత్యాదిగా కానరావు.

ఇంకా జాగ్రత్తగా పరిశీలించి లక్షణం సమగ్రంగా నిర్దుష్టంగా గుర్తించాలి.

## 17. ద్వంద్వమునం బూర్వపదాంత్యావయవంబునకు లోపం బొండె నగు (32)

ఉభయ (పూర్వ – ఉత్తర) పదార్థ ప్రధానం అయినసమాసం ద్వంద్వం. పూర్వపదం అంటే సమాసంలో ఆద్యవయవం (మొదటిపదం). 'అంత్యావయవం' అనడంవల్ల ఈద్వంద్వంలో పదంలో రెండు అవయవాలు (భాగాలు) ఉంటా యని తెలుస్తున్నది. ఒండె – అంటే వికల్పం.

రెండవయవాలు కలిగినపదాలతో ఏర్పడినద్వంద్వసమాసంలో మొదటిపదంయొక్క చివరి (రెండవ) అవయవం వికల్పంగా లోపిస్తుం దని సూత్రానికి అర్థం.

పుట్టున దైనగట్టు, పుట్టుగట్టు. క్రుంకునది ఐన గట్టు క్రుంకుగట్టు, పుట్టుగట్టును, క్రుంకుగట్టును అనేఅర్థంలో 'ఆచ్ఛికశబ్దంబుతోడ స్త్రీసమంబు' అనేసూత్రంచేత ద్వంద్వసమాస మై విభక్తి లోపించి పుట్టుగట్టు, క్రుంకుగట్టు. మొదటిపదమైన పుట్టగట్టు అనేదానిలోని చివరిఅవయవం 'గట్టు' అనేదానికి ప్రస్తుతసూత్రంచేత లోపం రాగా పుట్టు + క్రుంకుగట్టు. గసడదవాదేశం వచ్చి ప్రథమావిభక్తిలో బహువచనంతో – పుట్టుగ్రుంకుగట్లు.

ఇలాగే తొవవిందు, తమ్మివిందు – తొవదమ్మివిందు. ఇక్కడ ఏకవచనం విశేషం.

విన్నది + విన్నది – విన్నకన్నది. ఇక్కడ గసడదవాదేశాభావం విశేషం.

'ద్వంద్వబున' అనడంచేత ఇతరసమాసాల్లో ఈకార్యం లేదు. తొవవిందుసొగసు మొ॥

'పూర్వపద' అనడంచేత ఉత్తరపదాంత్యావయవానికి లోపం లేదు. 'పుట్టుగట్టుగ్రుంకులు అని ఉండదు.

'అంత్యావయవంబునకు' అనడంచేత ఆద్యవయవానికి గానీ మొత్తానికి గానీ లోపం రాదు. 'గట్టుగ్రుంకుగట్లు' అని గానీ క్రుంకుగట్లు అని కానీ కాదు.

'ఒండె' అనడంచేత లోపం వికల్పం. కానీ లోపం రాని 'పుట్టుగట్టు గ్రుంకుగట్లు' అనేవిధ మైనరూపాలు మృగ్యం. ఒండెపదం లేకుంటే బాగుండేది.

పూర్వపదంతోపాటు ఉత్తరపదం గూడా రెండవయవాలు ఉండి, రెండుపదాల్లోనూ రెండవఅవయవం సమానంగా ఉన్నప్పుడే ఈకార్యం జరుగుతుం దనీ లక్ష్యాలనుబట్టి తెలియాలి. లక్షణంలోనే చెప్తే బాగుండేది.

పుట్టునదియును క్రుంకునదియును పుట్టుక్రుంకునవి. పుట్టుక్రుంకునవి యగుగట్లు 'పుట్టుగ్రుంకుగట్లు' అనేవిధంగా సమన్వయించే అవకాశం ఉంది. గసడదవాదేశం విశేషం. పరిశీలించి నిర్ణయించాలి.

## 18. ఒకానొకచో ద్వంద్వంబు మిశ్రంబును అందలిపూర్వపదంబు క్లీబసమంబునుగఁ గానంబడియెడి (33)

సంస్కృతసమశబ్దమూ, ఆచ్ఛికశబ్దమూ కూడినసమాసం మిశ్రం. క్లీబం అంటే నపుసంకలింగం. దానితో సమ మైనది క్లీబసమం. నపుంసకలింగశబ్దంతో సమ మైనకార్యం (ము వర్ణకం మొ॥) పొందే (ఆచ్ఛిక) శబ్దం క్లీబసమం.

అరుదుగా ద్వంద్వసమాసం మిశ్రం అయి కనబడుతుంది. అందులో పూర్వపదం క్లీబసమం అయిఉన్నది అని సూత్రానికి అర్థం.

'ఆచ్ఛికశబ్దంబుతోడ స్త్రీ సమంబు ప్రాయికంబుగ ద్వంద్వం బగు' అన్నాడు సూరి. బాలవ్యాకరణాన్ని అనుసరించి స్త్రీ సమక్లీబసమాలు ఆచ్ఛికాలే. కాబట్టి ద్వంద్వంలో పూర్వోత్తరపదాలు రెండూ ఆచ్ఛికాలే కావాలి. సూరి అలాగే (ఆచ్ఛికద్వంద్వాలనే) ఉదాహరించాడు.

దాన్ని సవరిస్తూ మిశ్రం కూడా సంస్కృతసమానికి ద్వంద్వం కావడం కూడా ఉం దని ప్రౌఢవ్యాకర్త ఇక్కడ పేర్కొన్నాడు.

అలాగే పై బాలవ్యాకరణసూత్రం ద్వంద్వసమాసంలో పూర్వపదం తఱచుగా స్త్రీసమం కావా లంటే క్లీబసమం గూడా అవుతుం దని మరొకసవరణ.

అవసరమును, అక్కఱయును అనేఅర్థంలో అవసరము అనేసంస్కృత మయినక్లీబసమానికీ అక్కడ అనేఆచ్ఛిక శబ్దంతో ప్రస్తుతసూత్రంప్రకారం మిశ్రద్వంద్వసమాసం ఏర్పడింది. అవసరము + అక్కఱ 'సమాసవిభక్తికి లోపం బగు' అని ఉత్తరపదవిభక్తిని వివక్షింపగా బహుత్వార్థాన్నిబట్టి బహువచనం వచ్చి అవసరమక్కఱలు.

'ఒకానొకచో' అనడంచేత మిశ్రద్వంద్వం అరుదు.

'కానంబడియెడి' అనడంచేత కవిప్రయోగాలలో చూచినవాటిని మాత్రమే గ్రహించాలి. 'అవసరమక్కఱలు' ఒక్కటే వ్యాకర్త చూపాడు. మరొకటి మృగ్యం.

'ద్వంద్వంబు' అనడంచేత ఇతరసమాసాలు యథాలక్షణంగా మిశ్రాలు ఉండవచ్చు. ఆబ్బందము,గుణములప్రోక మొ॥

'మిశ్రంబును' అనేచోటిసముచ్చయంచేత పూర్వలక్షణానుగుణంగా ఆచ్ఛికద్వంద్వాలు ప్రసిద్ధమే. అన్నదమ్ములు మొ॥ సంస్కృతానుసారంగా సిద్ధద్వంద్వా లుంటాయి. రామలక్ష్మణులు మొ॥ ఇంక సాధ్యసాంస్కృతిక (సంస్కృతసమాలతో) ద్వంద్వం ఉండదు.

'అందలిపూర్వపరంబు క్లీబసమంబునుగ' అనడంచేత మిశ్రద్వంద్వంలో పూర్వపదం క్లీబసమేతరం కాదు. అలాగే ఉత్తరపదం కూడా ఆచ్ఛికమే కావా లనవచ్చు. చూడగా 'అవసరమక్కఱలు' అనేఒక్కదానిని దృష్టిలో ఉంచుకొని ఈసూత్రం చెప్పబడిం దని స్పష్టం.

'అవసరము' అనేపదం సంస్కృతసమం. సంస్కృతసమాన్ని క్లీబసమంగా వ్యవహరించడం సూరిమతవిరుద్ధం. లక్ష్యానుగుణం కూడా కాదు. మువర్ణకాంత మనవచ్చు.

'మిశ్రంబును అందలి' అని స్పష్టతకైనా సూత్రంలోనే విసంధిగా ప్రయోగించడం విలక్షణం.

'సమాసవిభక్తికి లోపం బగు' అనేసూత్రంచేత ఉత్తరపదంలోలాగా పూర్వపదంలోనూ ము విభక్తి లోపించవలసిఉండగా లోపింపకపోవడాన్ని చెప్పవలసిఉంది.

అవసరమును అక్కఱయును అనేఅర్థంలో సముచ్చయార్థక ను శబ్దం ప్రయోగింపబడలే దని గ్రహిస్తే ఇది సమాసమే కాదు.

'అవసరమక్కఱలు' అనేఒక్కదానికోసం ప్రత్యేకసూత్రం చెప్పడంకంటే కఱకంఠాదులవలె గ్రాహ్యంగా చెప్పవచ్చు.

ఇంతకీ ఈప్రయోగం 'గ్రామ్యంబు తత్తజ్జాతివర్ణనంబునం బ్రయోగార్హం బగు' అనేసూత్రానికి ఈవ్యాకర్త లక్ష్యంగా చూపిన 'మొక్కేము సామి' అనేసందర్భంలో తజ్జాతివచనంలోనిది. అచ్చటి అవసరమక్కఱలు సాధింపబూనితే 'మొక్కేము సామి' అనేదాన్ని గూడా సాధించాలి.

ఈసూత్రం అనవసరం. తెలుగులో మిశ్రద్వంద్వాలు ప్రామాణికాలు లేవు.

## 19. కొన్నియెడల సప్తమీతత్పురుషంబునందు నవర్ణకంబు నగు (37)

సప్తమీవిభక్తి అంతమందు గలిగినశబ్దానికి మీదిపదంతో సమాసం సప్తమీతత్పురుషం. సప్తమీతత్పురుషంలో 'న' అనేప్రత్యయం కూడా అవుతుం దని సూత్రార్థం. అంటే పూర్వపదంలోని 'న' అనేసప్తమీవిభక్తి కూడా (అందుతోపాటు) ఈ సమాసంలో లోపింప దని తాత్పర్యం.

'అంద్వాదుల కలిగాగమంబు సమాసంబునం దగు' అని బాలవ్యాకరణం 'అందు' అనేసప్తమీవిభక్తి లోపించనిసమాసాన్ని ప్రస్తావించింది. 'న' అనేసప్తమీవిభక్తి లోపింపనిసమాసాలు కూడా ఉన్నా యని తెలపడానికి ప్రౌఢవ్యాకర్త యీలక్షణం చెప్తున్నాడు.

చిత్తమునను అనేసప్తమ్యంతశబ్దానికి దుఃఖములు అనేపదంతో తత్పురుషసమాసం కలిగి చిత్తమునను + దుఃఖములు 'సమాసవిభక్తికి లోపం బగు, లట్టునకుఁ గాదు' అనేసూత్రంచేత రావలసినవిభక్తిలోపం ప్రస్తుతసూత్రంచేత పూర్వపదంలో ఉన్న 'న' విభక్తికి రాదు. ఉత్తరపదంలో విభక్తిమాత్రం లోపిస్తుంది. చిత్తమునను + దుఃఖ, 'సమాసంబునయందు ద్రుతంబునకు లోపం బగు' అనేసూత్రంచేత ద్రుతం లోపించి 'చిత్తమున దుఃఖ' ఈసమాసప్రాతిపదికపై ప్రథమావిభక్తిని వివక్షించగా బహుత్వార్థాన్ని బట్టి బహువచనం వచ్చి 'చిత్తమునదుఃఖంబుల్'.

'కొన్నియెడల' అనడంచేత నవర్ణకం లోపింపనిసమాసాలు అరుదు. వీటిని ప్రయోగానుసారంగా గ్రహించాలి. కువలయంబుఁ నవారు నవర్ణకం లోపిస్తే కువలయంబువారు.

'నవర్ణకంబును' అనేచోటిసముచ్చయంచేత అందు లోపింపనిసమాసాలు గ్రహింపబడతాయి. కువలయంబునందలివారు మొ॥

సప్తమియం దైనయీ 'నవర్ణకం' అంతకుముందు అక్కడ ఉన్నదే. నవర్ణకంబు నగు అంటూ 'అగు' అని విధించడం సరికాదు. సమాసంలో లోపించవలసినఈవిభక్తి లోపించడం లేదు. కాబట్టి లోపాభావాన్ని చెప్పడం ఉచితం.

**డాక్టర్. అంబడిపూడి నాగభూషణం**

**పాఠం - 9**

# ప్రౌఢవ్యాకరణం

# వాక్యవివరణం

## 1. అంచపదము అంచయాన లోనగువానివంటిది (సం. 12)

ప్రాణగొడ్డ మగ్రామ్యంబు నాఁదగు అని లక్షణం.

తెలుగులోని ప్రాణగొడ్డము అనేశబ్దం ప్రాణకుట్టక అనేసంస్కృతసమాసంనుండి తద్భవంగా ఏర్పడింది. వైకృతదీపికలో ఈవ్యాకర్త 'ప్రాణకుట్ట' శబ్దభవం అన్నాడు.

ఇది అంచపదము అంచయాన మొద లైనతద్భవాలవంటిది. 'హంసపద, హంసయాన' అనేసంస్కృతసమాసాల నుంచి అంచపదము అంచయాన అనేతద్భవశబ్దాలు ఏర్పడ్డాయి. ఈవిధంగా సంస్కృతంలోని సమాసరూపం మొత్తం తెలుగులో తద్భవం కావడం అనే పద్ధతిఉంది. అదే మార్గంలో 'ప్రాణకుట్టక' అనేసంస్కృతసమాసంనుంచి 'ప్రాణగొడ్డము' అనేతద్భవం ఏర్పడడంలో వింత లే దని ఈవివరణం తాత్పర్యం. ప్రత్యేకశబ్దంనుంచే కాక సమాసాలనుంచి కూడా తద్భవా లేర్పడతా యనడానికి వ్యాకర్త అంచపదము అంచయాన అనేవాటిని ప్రాణగొడ్డానికి పోలికగా చూపా డని గ్రహించాలి.

అయితే పై తద్భవాల్లో సంస్కృతసమాసంలోని పూర్వపదం మారింది. ఉత్తరపదం అలాగే ఉంది. 'ప్రాణగొడ్డము' అనేతద్భవంలో ఉత్తరపదం మార్పు చెందగా పూర్వపదం అలాగే ఉంది. ఈవిషయంలో వీటికి పోలిక కుదరలేదు. యోగపాదుకా-యోగవాగె, నాగస్వరః - నాగసరము అనేరీతివాటిని పోలికగా ఒక టయినా ఇస్తే సమాసాలనుంచి తద్భవం ఏర్పడవ చ్చని మాత్రమే కాక పూర్వపదం తద్భవంలో మార్పు చెందక పోవడానికి కూడా పోలిక సరిపోయేది.

## 2. అంతట ననగా సాంస్కృతికాదులు మూట నని యర్థము (సమా. 2)

'కర్మధారయంబు బిరుదాద్యుత్తరపదం బయ్యె నేని ద్వ్యక్షరాదంత స్త్రీ పుం సంజ్ఞావాచకం బగు పూర్వపదంబు నంత్యాక్షరంబున కంతట దీర్ఘంబు బహుళంబుగా నగు' అనేసూత్రంలో 'అంతట' అనేశబ్దం అర్థాన్ని వివరిస్తున్నది ఈవాక్యం.

అంతట అంటే అన్ని విధ మయినసమాసాలలో అని అర్థం. అవి సాంస్కృతికాదులు మూడు. 'సాంస్కృతికాచ్ఛిక మిశ్ర భేదంబుచే సమాసంబు త్రివిధంబు' అని చెప్పిన మూడువిధా లయినసమాసాలలోనూ ఈదీర్ఘకార్యం జరుగుతుం దని తాత్పర్యం.

1. సాంస్కృతిక సమాసం ః ఇది సిద్ధం, సాధ్యం అని రెండు విధాలు. ప్రస్తుతసందర్భంలో సిద్ధసమాసాలు మాత్రమే ఉంటాయి. రామశాస్త్రి - రామాశాస్త్రి. 'సంస్కృతసమశబ్దాలకు అయ్యేసాధ్యసాంస్కృతికాలు ఉండవని చెప్పాలి.

2. ఆచ్ఛిక సమాసం ః రెండూ అచ్చతెలుగుపదాల కయినసమాసం ఆచ్ఛికం. సుబ్బారెడ్డి, మొ॥.

3. మిశ్ర సమాసం ః సంస్కృతసమము ఆచ్ఛికముతో కలిసింది మిశ్రసమాసం. రామారావు, సుబ్బాశాస్త్రి మొ॥

ఇటువంటి మూడురకాలసమాసాల్లోనూ పయి కార్యం అవడంకోసం సూత్రంలో 'అంతట' అన్నాడు.

'అంతట' అనేదళం లేకపోయినా అర్థానికి భంగం లేదు. సమాసంలో అంటే ఏసమాసంలో నైనా చేయవచ్చు.

**4. అక్షరంబుల కనుటచే ఎనుబంఁడ్రు లోనగువానియం దుపాంత్యవర్ణంబునకును లోపంబు** (శబ్ద. 92)

'సంఖ్యావాచకంబులకు విభక్తి పరం బగునపుడు కొన్నింటియంత్యాక్షరంబులకు లోపం బగు' అనేసూత్రం విభక్తి పర మవుతుండగా కొన్ని సంఖ్యావాచకాలలో చివరి 'అక్షరంబులకు' లోపం చెప్తున్నది. ఏ(ను)గురు, వేగురు మొ॥. చివరిఅక్షరం ఒక్కటి మాత్రమే లోపించేపక్షంలో 'అక్షరంబునకు' అని ఏకవచనం చాలు. కాగా 'అక్షరంబులకు' అని బహుత్వార్థంతో (బహువచనంలో) చెప్పడంచేత అంత్యాక్షరం ఒక్కటి మాత్రమే కాక దానికి సమీపంలో పూర్వంలో ఉన్నమరొకఅక్షరం కూడా కొన్ని సంఖ్యావాచకాల్లో లోపిస్తుంది. అని బహువచనానికి ప్రయోజనాన్ని వ్యాకర్త వివరించారు.

ఎనిమిది + పది అని ఉండగా చివరిఅక్షరం 'ది' తోపాటు దానికి సమీపంలో పూర్వంలో ఉన్న 'మి' అనేఅక్షరం కూడా లోపించి ఎని+పది– పది యుత్తరపదం బగుచో (సమా. 24) అనేసూత్రంచేత ఎను+పది, ఎనుబది అని అవుతుంది. వ్యాకర్త 'ఎనుబంఁడ్రు' అని చూపడం ప్రమాదం. 'ఎనుబది+రు' అన్నపుడు అంత్యాక్షరం ఒక్కటే లోపిస్తుంది. 'ఎనిమిది+పది' అన్నపుడు విభక్తి పరంగా లేదు. సమాసంలో కూడా వస్తుం దని (విభక్తి పరంగా లేకున్నా) చెప్పుకోవాలి.

**5. అది వికృతి యందు సహజంబ** (సం॥ 11)

పేఁట శబ్దార్థంబు ప్రకృతియగు పింఠా .... 72 వాక్యవివరణం.

**6. అది శబ్దాలంకారతత్పరత్వమునఁ బ్రౌఢముగాఁ జెప్పబడిన దని గ్రహింపవలయును** (శబ్ద. 32)

'సమానార్థకము లయిన యీ డెన సరి సాటి లోనగుదేశ్యవిశేషణశబ్దములును' అనేసూత్రాన్నిబట్టి సమానార్థక మైన 'సరి' అనేశబ్దం నిత్యైకవచనాంతం. కాబట్టి దీనిపై ఏవిభక్తిలోనూ బహువచనం ఉండదు. బహుత్వార్థంలో గూడా ఏకవచనమే ఉంటుంది. అవి దీనికి సరిగావు మొ.

'సరులు లేని దృక్ఖంజనశాబకముల' అనేప్రయోగంలో 'సరి' శబ్దం బహువచనాంతంగా ఉన్నది. అపుడు 'సరి' శబ్దం నిత్యైకవచనాంత మెలా అవుతుంది? అంటే శబ్దాలంకారం మీదితాత్పర్యంతో కవిశబ్దసాధుత్వాన్ని పట్టించుకోలే దని వ్యాకర్త సమాధానం. అలంకారం కుదిరితే చాలు అన్న ఉద్దేశంతో చేసిన ఈప్రయోగాన్నిబట్టి ఆబహువచనరూపాన్ని ప్రమాణీకరించవలసిన అవసరం లే దనీ. 'సరులు' అనేరూపం లక్షణవిరుద్ధం అని వ్యాకర్తతాత్పర్యం.

**7. అపుడు తత్సమంబునందలిచజలు దంత్యములు కా వని యూహించునది.** (సం. 6)

'రాజుశబ్దం బొక్కటి దంత్యయుక్తంబు గానంబడియెడి' అని సూరి సంస్కృతసమాలలో 'రాజు' అనేశబ్దం ఒక్కదానిలో మాత్రమే దంత్య (జకారం) ఉన్న దని చెప్పాడు. 'రాజు వైకృతం బని కొంద ఱందురు' అనేప్రౌఢసూత్రాన్నిబట్టి కొందరిమతంలో రాజు –తద్భవం. కాగా దంత్యం ఉన్న రాజుశబ్దం ఒక్కటీ అచ్చతెలుగు కాబట్టి ఇక తత్సమాలలో అంటే సంస్కృతసమాలలో చజలు దంత్యాలు లేవు. అన్నీ తాలవ్యాలే. అని దీని కర్థం.

కొన్ని అచ్చతెలుగునిఘంటువులు, కేతన మొద లైనలాక్షణికులు దీన్ని అచ్చతెనుగుగా చెప్పారు. అచ్చతెనుగు కావ్యంలో ప్రయోగింపబడింది. కాబట్టి వైకృత మని 'కొంద ఱుదురు' – 'అప్పుడు' అంటే వైకృత మని అంగీకరించినపుడు దంత్యా లుండవు. తద్భవంగా రాజుశబ్దం ఒకటి ఉన్నది. అయినా తత్సమం గూడా మరొకటి ఉంది. అందులోనూ జకారం దంత్యమే.

వైకృత మని అంగీకరించకపోవడానికీ అవకాశా లున్నాయి. శబ్దరత్నాకరంలో రాజు వైకృతం అనడం చింత్యం అన్నాడు. అది తన కిష్ట మైతే 'రాజు వైకృతంబు' అని చెప్తే చాలు. జకారం బుభయంబు అనేసూత్రందగ్గర పాండురాజులో జకారం దంత్యం అన్నాడు. అందుకే ఈవాక్యాలలో 'అపుడు' అనవలసివచ్చింది.

కాగా నిశ్చయానికి రాని వ్యాకర్త ఈసూత్రం చెప్పకుండా ఉంటే బాగుండేది.

## 8 అయ్యది మంత్రశాస్త్రప్రసిద్ధము (సం. 1)

'ఆంధ్రభాషకు వర్ణంబు లేఁబదియైదు' అని సూత్రంబున ప్రౌఢవ్యాకర్త ఆవర్ణమాలలో '   ' కారం గూడ చూపాడు. కాని   కారస్య ద్వాదశ, తస్యదీర్ఘాభావాత్. పాణినీయాన్ని బట్టి సంస్కృతంలో దీర్ఘమయిన   కారం లేదు. అందువల్ల దాన్ని తొలగించి క్ష కారాన్ని కలిపి సంస్కృతానికి 50 వర్ణాలు చూపారు. కాబట్టి వర్ణమాలలో   కారం చూపరాదనే పూర్వపక్షానికి సమాధానం ఈ వివరణం.

పాణినీయం అంగీకరించకపోయినా ఇతరసంస్కృతవ్యాకరణాలు సంస్కృతంలో   కారం ఉన్న దని చెప్పాయి. సంస్కృతంలోని   లు ప్రాకృతంలో లే వంటూ వరరుచి హేమచంద్రుడు మొ॥ ప్రాకృతవైయాకరణులు సంస్కృతంలో ()తో పాటు   కూడా ఉన్న దన్నారు. సంస్కృతకావ్యాదుల్లో   కారం కన్పించదు కానీ మంత్రశాస్త్రంలో ప్రసిద్ధంగా ఉన్నది మాతృకా పూజలో   కారం వాగ్దేవి వామగండం (లేదా దంతం) గా పూజిస్తారు.

కాబట్టి కారం వర్ణమాలలో చేర్చవలసినదే అని సిద్ధాంతం. కాని   కారం ఉన్నపదం సంస్కృతంలో ఒక్కటి గూడా లేదు. ('   కారం' అనేది ఆవర్ణాన్ని చెప్పేది కాబట్టి పదంగా లెక్కలోకి రాదు).

కారం ప్రయోజనం భాషలో ఒకప్పుడు పరిమితం. ఇపుడు అసలు లేదు. (   కారం స్థితీ అంతే).

## 9. అసమాసంబునం బూశబ్దము పూవుశబ్దముయొక్క పర్యాయముగా గానంబడియెడి నని యర్థము.

చూ. పూపూవు సూత్రవ్యాఖ్య

## 10. ఆంధ్రశబ్దచింతామణియందుఁ గల ఇద మద సిత్యాది సూత్రమందలి యదః ప్రభృతులు వ్యర్థము లగుచు స్వేతరంబులకును నక్కార్యం బని తెలుపుచున్నవి. (సమా. 10)

'ముయ్యేడ్వాదులందు హ్రస్వద్విత్వంబులు నిత్యంబులు'

అని సూత్రించిన ప్రౌఢవ్యాకర్త ఆలక్షణం చింతామణికి సమ్మతమే అని నిరూపించడానికి ఇలా వివరించాడు.

ఆంధ్రశబ్దచింతామణి "ఇదమద ఏద్యత్తచ్ఛబ్దా శ్శబ్దాంతరాన్వయే బహులం హ్రస్వం ప్రపద్య దీర్ఘాః ద్విత్వ ముపర్యక్షరస్య

జనయంతి" అనేలక్షణం ఈ, ఏ, ఆ (త్రికం) అనేశబ్దాలలో దీర్ఘానికి బహుళంగా హ్రస్వం వచ్చి, పై హల్లుకు ద్విత్వం వస్తుందని చెప్పింది. ఈసూత్రంలో ఇదం, అదస్, ఏతత్ అనేమూడుశబ్దాలు గూడా 'ఈ' అనేదాన్నే బోధిస్తున్నాయి. అటువంటపుడు మొదటి దైన 'ఇదం' శబ్దం ఒక్కదానివల్లనే 'ఈ' శబ్దం బోధింపబడుతుండగా 'అదస్, ఏతత్' అనేశబ్దాలను సూత్రంలో ఉచ్చరించడం వ్యర్థం.

ఇలా 'అదస్ -ఏతత్' శబ్దాలు - వ్యర్థమై - ఆసూత్రంలో పఠింపబడినవాటికి మాత్రమే కాక ఇతరశబ్దాలకు గూడా ఆ సూత్రం విధించినకార్యం వస్తుంది అనేఅర్థాన్ని తెలియజేస్తాయి (జ్ఞాపకం చేస్తాయి).

జ్ఞాపకసిద్ధ మైనఈఅర్థంవల్ల సూత్రంలో పఠింపబడిన -ఆ-ఈ-ఏ అనేశబ్దాలకంటె వే రయిన మూ (ఁడు) శబ్దానికి కూడా ఈకార్యం అంటే బహుళంగా హ్రస్వమూ, మీది హల్లుకు ద్విత్వమూ వస్తాయి.

బహుళంగా చెప్పబడిన ఆహ్రస్వద్విత్వాలు ముయ్యేడు మొద లైనస్థలాల్లో మూ(ఁడు) శబ్దవిషయంలో నిత్యంగా వస్తా యని ప్రౌఢవ్యాకరణం చెప్పడం చింతామణికి సమ్మతమె అని తాత్పర్యం.

దీనివలన ముజ్జగములు మూడుజగములు అనేరీతిని బాలవ్యాకరణం సాధించినరూపాలు పై చింతామణిసూత్ర సిద్ధాలే కాబట్టి అందులో విశేషం లేదు. బహుళప్రయోజనంగా నిత్యస్థలాలను పేర్కొంటున్న ముయ్యేడ్వాదులందు - అనే తన లక్షణమె విశేష మని కూడా వ్యాకర్త భావించిఉండవచ్చు.

ఇక్కడ ప్రౌఢవ్యాకర్త సమన్వయం సరి కాదు. వైయర్థ్యం, అర్థాంతరజ్ఞాపనం. స్వాంశంలో చారితార్థ్యం, అన్యత్ర ఫలం అని ఇటువంటిచోట్ల ఉండవలసిన నాలుగు అంశాల్లో జ్ఞాపకసిద్ధ మైన అర్థంవల్ల వ్యర్థ మైన అంశం, చరితార్థం కావడం అనే అంశం ఇక్కడ లేదు. 'అదస్-ఏతత్' లు వ్యర్థం కావడం అనేది జ్ఞాపకసిద్ధమైన అర్థంవల్ల సిద్ధించడం లేదు. కాబట్టి ఈసమన్వయం సంప్రదాయానుగుణం కాదు. వ్యర్థం కావడం మాత్రమే ఇక్కడ జరిగింది. కాబట్టి ముజ్జగము లిత్యాదులు చింతామణిసిద్ధాలు కావు. వాటిని బాలవ్యాకర్త చెప్పడం విశేషమే. చింతామణిచేత సాధించాలనుకుంటే వ్యర్థప్రసంగం లేకుండా చింతామణి సూత్రంలోనిబహుళపదంచేత అన్యకార్యంగా మూఁడు లో డుజ్లోపంతో సహా హ్రస్వద్విత్వాలు గూడా సాధించుకోవచ్చు.

**11. ఇక్కడఁ దృతీయకుఁ బంచమిగా మార్పు గలిగె నని తెలియవలయు.** (కార.)

చూ కొన్నియెడల విభక్తిపరిణామంబు గ్రాహ్యంబు . సూత్ర వ్యాఖ్య.

**12. ఇక్కడ నిది షష్ఠ్యంతమునకు విశేషణము గనుక ప్రథమ** (కార. 16)

'వారివ . . . . . . . . . . పుష్పదామములయు' అనేప్రయోగంలో 'పుష్పదామములయొక్కయును' అనేచోట యొక్క 'యొక్కకు లోపంబు బహుళంబు' అనేసూత్రం చేత లోపించిం దని వ్యాకర్త ఉదాహరిస్తున్నాడు.

లోపించడానికి ఇక్కడ యొక్క ఉన్నదా? దీనికి విశేషణ మైన వారివి (+అ) అనేది ప్రథమలో ఉన్నది గదా అని సందేహం కల్గవచ్చు నని వ్యాకర్త ఇలా వివరించాడు.

'దామములయొక్క' అనేది షష్ఠి. అయితే 'వారివి' అనేవిశేషణం గూడా 'విశేష్యంబులకుంబోలె' - అనేసూత్రంచేత ఉండాలి గదా. వారివానియొక్క షష్ఠిలో కొన్నియెడల విశేషణంబులషష్ఠికిం బ్రథమ విభాష నగు'. -వారివి.

షష్ఠీ విశేషణానాం ప్రథమా స్యాత్ అనేచింతామణిసూత్రంచేత ప్రథమ వచ్చి వారివి. దానిపై అవధారణార్థంలో 'అ' కారం చేరి (వారివి+అ) వారివ = వారివే అయిన అని అర్థం.

కాగా 'వారివ' అన్నప్పుడున్న ప్రథమ షష్ఠికి వచ్చింది. ఆషష్ఠి 'దామములయొక్క' అన్నప్పుడున్న విశేష్యషష్ఠి ననుసరించి వచ్చింది. దామములయొక్క (యును) అన్నపుడున్న యొక్క కు లోపం, 'యొక్కకు లోపంబు బహుళంబు' అనేసూత్రంచేత వచ్చింది. కాబట్టి యిది యీసూత్రానికి లక్ష్యం అయిం దని వ్యాకర్త వివరణ తాత్పర్యం.

## 13. ఇటఁ జేత విభక్త్యర్థక ల వర్ణముపై నెల్లెడల నుండవలసిన చేసి యొక్క చోటనె యున్నది (కార. 5)

'స్తనముల, -చూడ్కుల, -అధరముల, అలకంబుల, గతుల, పిఱుందుల, -భాషితములఁజేసి' అనేప్రయోగాన్ని గురించి ప్రౌఢ వ్యాకర్త ఈవివరణం చేస్తున్నాడు.

స్తనములచేత - చూడ్కులచేత మొదలైన ఈశబ్దాలు అన్నింటిలోనూ 'జడంబు తృతీయాసప్తములకు ద్వితీయ బహుళంబుగా నగు' అని తృతీయకు ద్వితీయ వచ్చి స్తనములన్ - చూడ్కులన్ -- మొ. చింతామణి ననుసరించి ఇక్కడి ల ద్వితీయావిభక్తి (బాలవ్యాకరణంలో 'ను' అనేదే ద్వితీయ -ల- ఆగమం) కాగా ఈ 'ల' వర్ణం, తృతీయావిభక్త్యర్థకం కాబట్టి కొన్నియెడలఁ జేతవిభక్త్యర్థకవర్ణకంబులకును వలన వర్ణకంబునకును దఱచుగఁ జేసి యనుప్రయుక్తం బగు' అనేసూత్రంచేత చేతవిభక్త్యర్థక ల వర్ణాలు అన్నింటిమీద 'చేసి' అనుప్రయుక్త మై - స్తనములఁజేసి చూడ్కులఁజేసి ఇత్యాదిగా ఉండవలసివచ్చేది. 'అయ్యది యొక్కచోఁ బెక్కుచోట్ల కొక్కటియ చాలెడి' అనేసూత్రంప్రకారం అన్నింటిపైని కాకుండా చివరిదానికి ఒక్కదానికే వచ్చి స్తనముల, - - చూడ్కుల - - - - 'భాషితములఁజేసి' అని అయింది.

## 14. ఇటఁ బోఁడి పరం బగుచో నెల్లెడల ను మ్మగు (సమా. 19)

'అలరుఁబోఁ డీత్యాదు లుపమానపూర్వపదకర్మధారయంబులు' అనేసూత్రం ఉపమానవాచకాలకు 'పోఁడి' అనే (సామాన్య వచన) శబ్దంతో (ఉపమానపూర్వపద) కర్మధారయ సమాసాన్ని చెప్తున్నది.

ఉపమానపూర్వపదకర్మధారయంలో 'పోఁడి' అనేది పరంగా ఉండగా కల్గినచోట (ఎల్లెడల) ఉపమానశబ్దాలకు అన్నింటికీ, (నుమ్ము) 'నుమ్' అనేఆగమం వస్తుంది. అని ఈవివరణవాక్యానికి అర్థం. 'నుమ్' లో మకారం ఇత్తు. కాబట్టి లోపిస్తుంది. మకారం ఇత్తుగా కలిగినది కాబట్టి 'ను' వర్ణం మిత్తు. కాబట్టి 'మిదచో-న్త్యాత్పరః' అనేసంస్కృతసంప్రదాయాన్ని అనుసరించి ఉపమానశబ్దంలో చివరిఅచ్చుకు పరంగా వచ్చి చేరుతుంది. ఇక్కడిపూర్వపదాలు ఉపమానాలు - అన్నింటికీ అచ్చే చివర ఉంటుంది. కాబట్టి ఆశబ్దానికి చివర ఆగమంగా వస్తుంది. (హలంతా లున్నసంస్కృతంలో మిత్తుకు ప్రత్యేక ప్రయోజనం ఉంది. అజంతాలే ఉండేతెలుగులో కిత్తుకూ మిత్తుకూ తేడా లేదు. అందుకే సూరి ఈసందర్భంలో ఆగమాలను కిత్తులుగా మాత్రమే చెప్పాడు) ఆగమాత్మక మైననువర్ణం ద్రుతం. కాబట్టి దీనికి ద్రుతకార్యాలు వస్తాయి.

'అలరు' -కు 'పోఁడి' తో పైసూత్రంప్రకారం సమాసం కాగా విభక్తిలోపానంతరం ఈవివరణవాక్యంచేత నుమాగమం వచ్చి అలరును + పోఁడి. సరళాదేశాదిద్రుతకార్యాలు వచ్చి అలరుఁబోఁడి - అలరుంబోఁడి మొ.

'ఇట' అనడం చేత 'దానిపోఁడి' ఇత్యాదు లైనఇతరసమాసాలలో నుమాగమం రాదు.

'పోఁడి పరం బగునపుడు' అనడంచేత ఉపమానపూర్వపదకర్మధారయ మైనా పోఁడికంటె భిన్న మైనశబ్దం పర మైతే నుమాగమం రాదు. 'జుంటిమోవి'.

'ఎల్లెడల' అనడంచేత పూర్వపదంచివర ఏఅచ్చు ఉన్నా ఈఆగమం వస్తుంది. ననఁబోడి, విరిఁబోఁడి మొ.

'అగు' అనడంచేత నుమాగమం రాకుండ 'ననపోఁడి, విరిపోఁడి' ఇత్యాదిగా ఉండదు.

**15. ఇట జకారము భారతార్థమునందు దంత్యము రామాయణార్థమునందుఁ దాలవ్యము నగు నని యెఱుంగవలయును** (సం. 5)

'ఒకానొకచో జకారం బుభయంబు నగు' సూత్రవ్యాఖ్య.

**16. ఇట నొకానొకచోఁ గొఱకు కయి వర్ణకంబులు నయ్యెడి** (కార. 13)

'షష్ఠీస్థానికం బగు కువర్ణకం బొక్కొక్కచో ద్వితీయాదివిభక్తులకు మాఱుగాఁ దత్తదర్థంబులం జూపట్టెడి' అనేసూత్రం చేత వేటను బోయిరి మొద లైనకొన్నిస్థలాలలో ద్వితీయకు 'కు' అనేషష్ఠీవిభక్తి వస్తుంది. వేటకుఁ బోయిరి.

ఇలా ద్వితీయకు షష్ఠి వచ్చేస్థలాలు కొన్నింటిలో కొఱకు, కయి అనేచతుర్థీవిభక్తులు గూడా అవుతా యని ఈవివరణం తాత్పర్యం. ద్వితీయకు చతుర్థి వస్తే వేటకొఱకుఁ బోయిరి, వేటకై పోయిరి మొ.

ఇట అంటే సందర్భాన్నిబట్టి ద్వితీయకే. అది గూడా (ఒకానొకచో) కుషష్ఠి వచ్చేసందర్భాలలో అని గ్రహించాలి. ద్వితీయకు షష్ఠి ఉద్దేశార్థంలోనే వస్తుంది. రాముని జూచెను రామునకు జూచె నని కాదు. కాగా ద్వితీయ వచ్చినచోట ఉద్దేశార్థం కూడా ఉన్న ట్లయితే అపుడు ద్వితీయకు మాఱుగా కు షష్ఠి రాకుండా, కొఱకు – కయి వస్తాయి. ఇవీ రాకపోతే ద్వితీయ అలాగే ఉంటుంది.

చతుర్థి (కొఱకు, కయి) 'కొన్నియెడల నుద్దేశమాత్రంబున కగు' నని సూరి చెప్పాడు. ఇక్కడ ద్వితీయకు ఉద్దేశార్థం ఉన్నపుడే రావడం గమనించాలి.

**17. ఇట్టిప్రయోగములచేత 'అన్యస్యాః క్వచి ద్భవే చ్చాన్యా' అనుశబ్దశాసనులసూత్రము సార్థక మగుచున్నది** (కార. 20)

తీర్థమందు ఆడి – తీర్థమాడి, చిచ్చునందు ఉఱికిన – చిచ్చుఱికిన, మొద లయిన యీప్రయోగాలలో (జడవాచకాల మీది) సప్తమీవిభక్తికి ప్రథమావిభక్తి వచ్చింది. అందుకే ప్రౌఢవ్యాకరణం 'ఒక్కొకచో జడంబు సప్తమికిం బ్రథమయు నగు' అని పేర్కొన్నది. ఈలక్షణం చింతామణిసమ్మతమె అని వ్యాకర్త వివరిస్తున్నాడు.

చింతామణి 'ఇతరత్ర చ ద్వితీయా, తస్యాః ప్రథమా చ జడపదానాం స్యాత్' అని ఆయావిభక్తులకు వేరే విభక్తులు రావడం చెప్పింది. కాని సప్తమికి ప్రథమ రావడం (ప్రౌఢవ్యాకరణంలో లాగా) సూత్రించలేదు. (బాలవ్యాకరణం కూడా జడంబు ద్వితీయకే ప్రథమను విధించింది. కాని సప్తమికి చెప్పలేదు).

అయినా 'అన్యస్యాః క్వచి ధ్రువే చ్చాన్యా' అని చింతామణి 'ఒకానొకవిభక్తికి మఱి యొకవిభక్తియు నగు' అని చెప్పింది. సప్తమికి ప్రథమ వచ్చిన ఇటువంటిప్రయోగాలు (ఇలాగే ఇతరా లే మైనా ఉంటే అవీ) అన్యస్యాః అనేసూత్రానికి లక్ష్యా లయి ఆ లక్షణం ప్రయోజనవంత మవుతున్నది. ఆయావిభక్తులకు ఆయావిభక్తులు ప్రత్యేకించి చెప్పినవి పోగా వానికి భిన్నంగా విభక్తి మారినస్థలాలను 'అన్యస్యాః' అనేలక్షణం సాధిస్తుంది.

కాబట్టి 'అన్యస్యాః' అనేసూత్రం సాధిస్తున్నది కాబట్టి సప్తమికి ప్రథమ అనేయీవిధానం చింతామణిసమ్మతం.

**18. ఇ ట్లనుటచే అయ్య దీత్యాదులందు ద్విత్వంబు గలుగ దని యూహింపవలయును** (శబ్ద. 59)

'హ్రస్వవ్యస్తత్రికంబుమీఁది దివులకు ద్విత్వంబు నగు' అనేసూత్రంలో 'వ్యస్త' అనడంచేత ప్రత్యేకంగా ఉన్న త్రికం మీద మాత్రమే 'ది-వి' లలో దకార వకారాలకు ద్విత్వం వస్తుంది. కాబట్టి సమాసం మొ॥ ఇతరస్థితిలో దివులకు ఈకార్యం రాదు.

'ఆ' శబ్దానికి 'కొన్నియెడల - - - - ద్రికంబున కదియవులును - - ననుప్రయుక్తంబు లగు' (శబ్ద. 54) అనేసూత్రం చేత 'అది' అనేతచ్ఛబ్దం అనుప్రయుక్త మై ఆ + అది - ఆయది, (ఆయవి) అనేతీరుగా ఉన్నచోట (హ్రస్వ) త్రికం ప్రత్యేకంగా లేదు. ఇంక తచ్ఛబ్దం (త్రికం) మీద అనుప్రయుక్త మైఉన్నది. కాబట్టి సూత్రంలో 'వ్యస్త' అనడంచేత ఇటువంటిచోట్ల ద్విత్వం రాదు. ఆయది, ఆయవి అని అలాగే ఉంటుంది. ఆయద్ది, ఆయవ్వి అనేవిధంగా ద్విత్వం వచ్చినరూపాలు ఉండవు.

**19. ఇట్లనుటచే 'ఇవ్విధము నాననముల్ గలవారు' అనునిట్టిప్రయోగములు నిర్దుష్టము లగుచున్నవి.** (కార. 4)

'ఇతరత్ర చ ద్వితీయా' అనేచింతామణిసూత్రం ద్వితీయ ఇతర (విభక్తి) స్థలంలో కూడా అవుతుం దని సామాన్యంగా చెప్తున్నది. కాని ఎక్కడ (ఏవిభక్తికి) వస్తుందో ఆస్థానాన్ని స్పష్టంగా నియమించలేదు, కాబట్టి కవిప్రయోగాలలో ఇతర విభక్త్యర్థంలో ఎక్క డెక్కడ ద్వితీయావిభక్తి కనిపిస్తున్నదో ఆఅన్నితావుల్లోనూ 'ఇతరత్ర' అనేచింతామణిలక్షణంచేత ద్వితీయ వస్తుంది.

ఇవ్విధ మయిన ఆననములు - అన్నచోట 'ఆననములు' అనేప్రథమాంతవిశేష్యానికి విశేషణ మయిన 'ఇవ్విధ' శబ్దానికి ప్రథమావిభక్తి వచ్చి, (బహువచనానికి ఏకవచన మై) ఇవ్విధము. ఇక్కడి ప్రథమావిభక్తికి 'ఇతరత్ర చ ద్వితీయా' అని ద్వితీయ వచ్చి ఇవ్విధమున్ - (ఆననముల్) - అని అవుతుంది. కాగా ఇక్కడ ప్రథమకు ద్వితీయ రావడం 'ఇతరత్ర చ' అనే లక్షణానికి అనుగుణమై ఈప్రయోగం లక్షణబద్ధ మయింది. కాబట్టి ఇటువంటిప్రయోగాలు దోషగ్రస్తాలు కావు.

**20. ఇ ట్లనుటచేఁ బూర్వపదంబు లుప్తవిభక్తికం బయి యవికృతాంతం బగు నని యెఱుంగవలయు**(సమా. 6)

చూ. కర్మధారయం బియ్యది మిశ్రంబు సిద్ధ సమాసం బట్ల యగు. సూత్రవ్యాఖ్య.

**21. ఇయ్యది తదితరంబులకు నుపలక్షణం బని యెఱుంగునది** (సంధి. 4)

'చిట్టడవిఁ జిట్టి' అనేసూత్రంలో ఉచ్చరింపబడిన 'చిట్టడవి' అనేశబ్దం ఇటువంటి ఇతరశబ్దాలకు ఉపలక్షకం అంటే వాటిని గూడా తెలియజేస్తుంది.

'చిట్టడవిం జిట్టి' అనేసూత్రం 'చిట్టడవి' అనేదానిలో పూర్వపదం 'చిట్టి' అని పేర్కొంటున్నది. సూత్రంలో ఉచ్చరించినది 'చిట్టడవి' శబ్దం ఒక్కటే కాబట్టి ఆఒక్కచోట మాత్రమే పూర్వపదం చిట్టి. కాబట్టి చిట్టెలుక ఇత్యాదుల్లో చిన్నయసూరి చెప్పినట్లుగా పూర్వపదం చిఱు(త) అవుతుంది.

సూత్రంలోని 'చిట్టడవి' అనేశబ్దం చిట్టెలుక మొద లయినఇతరశబ్దాలను గూడ తెలియజేస్తుంది. అని యీవివరణం అభిప్రాయం. దీనివల్ల చిట్టెలుక మొద లయినవాటిల్లో గూడా చిట్టి అనేదే పూర్వపదం. కాబట్టి సూరి చెప్పినట్లుగా 'చిఱు' కాదు. కుఱు చిఱు సూత్రంలో 'చిఱు' శబ్దం చేర్చడం అనవసరం అని తాత్పర్యం.

'ఉపలక్షణమార్గంకంటె 'చిట్టడవిప్రభృతుల' ఇత్యాదిగా సూత్రంలోనే ఈఅంశం స్పష్టం చేయడం యుక్తం.

### 22. ఇయ్యది ప్రాణకుట్టక శబ్దభవము (సం. 12)

చూ. అంచపదము – అంచయాన . . . . (వాక్యవివరణం – 1)

### 23. ఇవి ధాన్యవాచకము లయ్యును నిత్యైకవచనాంతములే యని గ్రహింపవలయు (శబ్ద. 37)

'తఱచుగ ధాన్యవాచకశబ్దములును' అనేసూత్రం ధాన్యవాచకాలు తఱుచుగా నిత్యంగా బహువచనంతో మాత్రమే ఉంటా యని చెప్తున్నది. సూత్రంలో 'తఱచుగ' అనడంచేత అరుదుగ బహువచనాంతం కాకపోవడం కూడా ఉంటుం దని అర్థం. అపు డవి ఏకవచనాంతాలు మాత్రమే అవుతా యని గ్రహించాలి. 'ఏకవచనాంతములే' అన్నప్పటి అవధారణార్థక 'ఏ' కారంచేత నిత్య ఏకవచనాంతా లవుతా యని అర్థం.

బియ్యము – జీలకఱ్ఱ మొ॥ ఇవి ధాన్యాన్ని బోధించేశబ్దాలే. అయినప్పటికీ సూత్రంలోని 'తఱచు' శబ్దంచేత బహువచనాంతాలు కాక ఏకవచనాంతా లయినాయి. 'కతిపయసంభారవాచకశబ్దములును' అనేసూత్రంప్రకారం నిత్యైకవచనాంతాలు. కాబట్టి బియ్యములు ఇత్యాదిగా బహువచనరూపా లుండవు. 'పుణ్యాహములబియ్యముల' అన్నచోట్ల బహువచనం, అర్థవిశేషంలో అయిందిగా గ్రహించాలి.

### 24. ఇవి వృత్తియం దేకవచనాంతముల యగు (శబ్ద. 36)

'అదరులు లోనగుశబ్దములు' నిత్యబహువచనాంతములు. (ఇవి) అందరులు మొద లయినశబ్దములు, (వృత్తి యందు) సమాసంలో మాత్రం ఏకవచనాంతాలు మాత్రమే అవుతాయి.

'అదరుటగ్గి' 'మిడుగుఱుంబుర్వు' అనే ఈ సమాసాల్లో అదరు, మిడుగుఱు అని యీశబ్దాలు ఏకవచనాంతా లయినాయి.

కాని అదరులయగ్గి, మిడుగుఱులమెఱుంగులు. ఇత్యాదులుగా కర్మధారయేతరసమాసంలో బహువచనం ఉండగూడదనవచ్చునా? ఈకార్యం కర్మధారయంలో మాత్రమే అయితే ఈవివరణం అనవసరం అనిపిస్తుంది. అదరులు + అగ్గి, మిడుగుఱులు+పుర్వు – ఇత్యాదిగా బహువచనాంతమె అయినా 'సమాసవిభక్తికి లోపం బగు' అని ఆప్రథమాబహువచనం లోపిస్తుంది. కాబట్టి ఈవివరణం ప్రయోజనం పరిశీలించి కనుక్కోవాలి.

## 25. ఇవి సంజ్ఞావాచకంబులు గాన సంధి నిత్యము (సంధి. 4)

'చిట్టడవిఁ జిట్టి' అనేసూత్రం చిట్టడవి, చిట్టెలుక మొద లైనస్థలాలలో పూర్వపదం 'చిట్టి' అని పేర్కొన్నది. కాబట్టి చిట్టి+అడవి, ఇత్యాదిగా ఉండగా సంధి జరిగేవిషయాన్ని ఈవాక్యం వివరిస్తున్నది.

చిట్టడవి మొదలుగా 'చిట్టి' శబ్దం పూర్వపదంగా ఉన్న ఈశబ్దాలు సంజ్ఞావాచకాలు. అంటే పేర్లు. కాబట్టి సంధి నిత్యంగా వస్తుంది. అని ఈవివరణం తాత్పర్యం. సంధి నిత్యం గాబట్టి చిట్టడవి, చిట్టెలుక అని మాత్రమే అవుతుంది. కాని చిట్టియడవి అనేవిధంగా సంధిరాని యడాగమ రూపా లుండవు.

చిట్టిశబ్దాన్ని ఏమ్యాదుల్లో చేర్చుకుంటే 'ఏమ్యాదులయిత్తునకు సంధి వైకల్పికము' కాబట్టి సంధి రాని (యడాగమం వచ్చిన) రూపాలు ఉండవలసివస్తుంది. దాన్ని వారించడానికి ఈవివరణం నిత్యసంధిని పేర్కొన్నది.

కాని ఈవివరణం నిత్యసంధిని విధించకుండా అది పూర్వసిద్ధం అన్నట్లుగా చెప్తున్నది. సంజ్ఞావాచకంబులు కాబట్టి సంధి నిత్యం అంటే సంజ్ఞావాచకాల్లో సంధి నిత్యంగా వస్తుం దని ఎవరు చెప్పారు? చింతామణి గాని, చిన్నయసూరి గాని చెప్పలేదు ప్రౌఢవ్యాకరణమూ చెప్పలేదు. రామయ్య మొదలైనవి సంజ్ఞావాచకాలే. అక్కడ సంధి నిత్యమే. బహుశః ఈవివరణం దానిని ఉద్దేశించే చెప్పడం జరిగిందేమొ. 'శ్రేష్ఠతావాచకంబు లగునార్యాంబాద్యర్థకంబులు పరంబు లగునపుడు, ఆసూత్రం సంధిని చెప్పింది. అడవి, ఎలుక ఇత్యాదిగా ఇక్కడి ఉత్తరపదాలు శ్రేష్ఠతావాచకాలు కాదు గదా. పయిఁగా 'చిట్టడవి' ఇత్యాదులను సంజ్ఞలుగా పేర్కొనడం గూడా విచార్యమె.

చిట్టిశబ్దేకారానికి ఇక్కడ సంధి నిత్యంగా రావడం (వివరణంలో నైనా) విశేషంగా విధించడం ఉచితం.

## 26. ఈకవి పాపజాతికాన అని ప్రయోగించినాఁడు అది విచార్యము (శబ్ద. 15)

'దేశ్యంబులం గొన్నియెడల స్త్రీవాచక స్త్రీసమంబు లగుసంబోధ్యవాచకశబ్దంబులమీఁద నేకవచనంబునఁ గాన శబ్దం బొందును అల యనునవ్యయం బొందును గానంబడియెడి. అల దీర్ఘాంతంబు నగు' అనేసూత్రం దేశ్య స్త్రీ వాచక స్త్రీ సమాలమీద కొన్నియెడల 'కాన' (అల) వస్తుం దని చెప్తున్నది.

'మాసామికాన' అన్నపుడు 'సామి' అనే దేశ్య(ఆచ్ఛిక)శబ్దం మీద 'కాన' ప్రయోగించిన చేమకూర వేంకటకవి స్థలాంతరంలో 'పాపజాతికాన' అని ప్రయోగించాడు. ఆప్రయోగం విచారింపదగినది. అంటే సరి కాదు అని ప్రౌఢవ్యాకర్త వివరణానికి తాత్పర్యం.

ఇక్కడ పాపజాతి అనేశబ్దం దేశ్యం (అచ్చతెలుగు) కాదు. సంస్కృతసమం. దేశ్యములమీద చెప్పిన 'కాన' తద్భిన్న మైన సంస్కృతసమంమీఁద రావడం లక్షణానికి విరుద్ధం. అయితే దీన్నిబట్టి సూత్రంలోనే 'దేశ్యము' అనడం సరి గా దని, సంస్కృతసమాలమీద కూడా వస్తుం దనీ చెప్పవచ్చు కదా. అనే సందేహానికి సమాధానం ఈ వివరణం. సంస్కృతసమాలపై కాన లక్షణబద్ధం చేయదగినంతటి ప్రయోగప్రామాణ్యం ఉన్నది కాదు. కాబట్టి కవిప్రయోగానుగుణంగా చెప్పి 'దేశ్యంబుల' అనేదానికి విరుద్ధంగా ఉన్న 'పాపజాతికాన' అనేప్రయోగం విలక్షణంగా ప్రస్తావింపవలసిందే నని తాత్పర్యం.

'మద్యభిచారులారకాన' అని మరొకకవి సంస్కృతసమంమీద బహువచనంతం మీద కూడా కాన చేయడం మరీ విశేషం.

**27. ఈయర్థమునకు 'ఇతరత్ర చ ద్వితీయా' అనుస్థాననియమశూన్యవిధియు నవకాశ మిచ్చుచున్నది.**
(కార. 4)

కొన్నియెడలఁ జేతవిభక్త్యర్థకవర్ణంబులకును వలనవర్ణకంబునకును దఱచుగఁ జేసి యనుప్రయుక్తం బగు' అనే సూత్రంలోని తఱచు శబ్దంచేత "ఉదంతము పైని ఏకవచనమునను ద్వితీయ తృతీయార్థక మగుట ఒకానొకచోఁ గల దని వ్యాకర్త పేర్కొన్నాడు. అంటే ఉదంత మైన జడశబ్దానికి ఏకత్వంలో కూడా తృతీయకు ద్వితీయ వస్తుం దని అర్థం. తృతీయకు వచ్చింది కావడంచేతనే యిక్కడిద్వితీయ తృతీయార్థక మవుతున్నది.

సూరి యిక్కడ బహుత్వంలోనే వస్తుం దని చెప్పగా తాను ఏకత్వంలో గూడా వస్తుం దని చెప్పిన ఈఅర్థానికి చింతామణి ఆమోదం కూడా ఉన్న దని యిలా వివరించాడు.

'ఇతరత్ర చ ద్వితీయా' అనేచింతామణిలో 'ఇతరత్ర' అని సామాన్యంగా చెప్పడంచేత ద్వితీయ ఏ విభక్తిస్థానంలో వస్తుందో ఆస్థానం నియమించకపోవడంవల్ల కవిప్రయోగానుసారంగా ఏ విభక్తి కైనా ఎక్క డయినా ద్వితీయ వస్తుం దని చెప్పవచ్చు. ఉదంతాలకు బహుత్వంలో మాత్రమే అని (సూరిలాగా) చింతామణి నియమించడం లేదు. కాబట్టి ఏకత్వంలో గూడా ఉదంత జడాలపై తృతీయకు ద్వితీయ చేయడానికి చింతామణిలక్షణంప్రకారం అవకాశం ఉన్నది.

పనుపుచేత – తృతీయకు ద్వితీయ వచ్చి పనుపున్. చేసి అనుప్రయుక్త మై – పనుపుఁజేసి.

కాగా 'తఱచు' శబ్దానికి ప్రయోజనంగా చెప్పినఅర్థం చింతామణిసమ్మతం. కాబట్టి ప్రామాణికం అని యీ వివరణంలో ప్రౌఢవ్యాకర్త తెలుపుతున్నాడు.

**28. ఈసూత్రము నిట్లు చెప్పుటకు నంద్వితరసప్తమ్యర్థకవర్ణకంబులమీఁదియుండికి లోపంబు వచ్చుట ప్రయోజనంబు** (కార. 11)

"వలన కాదేశంబు లగుద్వితీయాసప్తములమీఁదియుండికి లోపంబు బహుళంబుగా నగు" అనేసూత్రంలోని బహుళ శబ్దంచేత 'అందు' అనేసప్తమీవిభక్తిమీది ఉండి లోపింప దని వ్యాకర్త వివరించాడు. 'అందు – న – సప్తమి' అని సప్తమిలో అందు, న అనేవి రెండే విభక్తులు. అందు పై లోపం రాకపోతే ఇక మిగిలింది 'న' వర్ణకం ఒక్కటే కదా. అటువంటపుడు సూత్రంలో సప్తమి అని సామాన్యంగా చెప్పడం దేనికి? అని శంకించుకుని ఇలా వివరించాడు.

'సప్తమి' అని సూత్రంలో సామాన్యంగా చెప్పడంచేత 'అందు' విభక్తి కంటె వే రయినవీ, సప్తమీఅర్థాన్ని బోధించేవీ అయిన అన్నివర్ణాలపై గూడా 'ఉండి' పదం లోపిస్తుంది.

1. గహ్వరమున – – పాఱు. ఇక్కడ 'న' అనేసప్తమిపై ఉండి లోపించింది.
2. ఒడలన్ వెలువడి, ఎక్కడన్ వచ్చియొ. ఇక్కడ 'అందు' అనేసప్తమికి ఆదేశంగా వచ్చి (సప్తమ్యర్థకమై)న 'అత్వం' మీద ఉండి లోపించింది.

3. నూతిలో వెలువడి, నూతియొక్కలోను–నూతిలోను నూతిలోనువలననుండి, నూతిలోనుండి. చోటన్ – చోన్– అయినట్లు, లోనన్ – లోన్ శబ్దంలో నవర్ణం లోపించి 'నూతిలోనుండి' ఇట సప్తమి కయినఅత్వం లోపించినా 'నూతిలోన్' అనేది సప్తమ్యంతమే. కాబట్టి దానిపై ఉండి లోపించి నూతిలో వెలువడి.

సప్తమిలో అందుపై లోపించకపోయినా మిగిలినసప్తమ్యర్థకాలు అన్నింటిపై గూడా ఉండికి లోపం వస్తున్నది. కాబట్టి సూత్రంలో 'సప్తమి' అని సాధారణంగా చెప్పబడిం దని తాత్పర్యం.

'బహుళగ్రహణముచే నందుమీఁదియుండికి లోపంబు కలుగ దని' యింతకు ముందు చెప్పినవాక్యం అభిప్రాయాన్నే ప్రస్తుతవాక్యం వివరిస్తున్నది.

### 29. ఉన్నాను ఇత్యాదులయందు ద్రుతంబునందలియుకారంబునకు లోపంబు గలుగదు (సం. 7)

"నకారం బసాధారణంబు ద్రుతంబు" అనేసూత్రాన్ని అనుసరించి ప్రత్యయం గానీ, ఆగమం గానీ, అవ్యయం గానీ అయి ఉత్వంతో కూడిననకారం (నువర్ణం) ద్రుతం. అవసర మయితే ఈనువర్ణంలోనిఉత్వం లోపిస్తుం దన్నాడు ప్రౌఢవ్యాకర్త. అలా రావలసిన (ఉత్వ) లోపం 'ఉన్నాను' మొద లయినవాటిల్లోనిఉకారానికి మాత్రం రాదు అని ప్రస్తుతవాక్యం వివరిస్తున్నది. 'ఉన్నాను' లో చివరిఉత్వం లోపిస్తే ఉన్నాన్, ఇటువంటిరూపాలు కవులు ప్రయోగించలేదు. ఇలాగే చదువుచున్నాను మొ॥ వాటిల్లో గూడా ఉత్వానికి లోపం రాదు.

'ఉన్నాను మొద లయినవాటిల్లో ద్రుతానికి కూడా లోపం రావడం లేదు. ఉన్నా, మొ॥ రూపాలు కవిప్రయోగాలలో మృగ్యం. 'అవసానంబునందు ద్రుతస్వరంబున కేని ద్రుతంబున కేని లోపంబు బహుళంబుగా నగు' అనేబాలవ్యాకరణలక్షణంలోని బహుళపదంచేత ఇక్కడ ద్రుత, ద్రుతస్వరలోపాలు రా వని, అప్రవృత్తిగా గ్రహించవచ్చు. ప్రౌఢవ్యాకర్త బాలవ్యాకరణ లక్షణాన్ని ఉద్ధరించడం లేదా సూటిగా ప్రస్తావించడం కానరాదు.

### 30. కారగ్రహణము సంస్కృతప్రాకృతభాషావ్యాకరణజ్ఞుల సమ్మతము (సం. 1)

చూ. అయ్యది మంత్రశాస్త్ర ప్రసిద్ధము 7 వాక్యవివరణం

### 31. ఒకచో ననుటచే ఒకఁడు ఒకతె ఒకటి (శబ్ద. 85)

"ఒకానొకచో ననిర్దిష్టార్థమం దొక శబ్దమునకుం బూర్వాగమం బగు" అనేసూత్రంలో 'ఒకచో' అని చెప్పబడింది. దీనివల్ల 'ఒకాన్' పూర్వాగమం కావడం అనిర్దిష్టార్థంలో కూడా సార్వత్రికం కాదు, కాబట్టి 'ఒకాన్' రాకపోవచ్చు. ఒకడు, ఒకతె, ఒకటి అనే శబ్దాలకు ఒకాన్ పూర్వాగమ మైతే ఒకానొకఁడు, ఒకానొకతె, ఒకానొకటి. 'ఒకాన్' రాకపోతే అదే అర్థంలోనే ఒకడు, ఒకతె, ఒకటి అనేవిధంగా కూడా ఉంటుంది.

### 32. ఒకశబ్ద మొక్కాదుల కుపలక్షణము (శబ్ద. 85)

'ఒకానొకచో ననిర్దిష్టార్థమం దొకశబ్దమునకుం బూర్వాగమం బగు' అనేసూత్రం 'ఒక' అనేశబ్దానికి పూర్వంలో 'ఒకాన్' అనేఆగమాన్ని చెప్పింది. ఒకాన్ + ఒకతె, ఒకానొకతె. సూత్రంలోని 'ఒక శబ్దమునకు' అనేదళం ఒక్క మొద లైనవాటిని గూడా

బోధిస్తుంది. ఒక్క ఒక్కొ ఒకొ అనేవి ఒక్కాదులు. (ఒకశబ్దంతోపాటు) వీటికి గూడా పయిసూత్రంప్రకారం అనిర్దిష్టార్థంలో 'ఒకాన్' పూర్వంలో ఆగమంగా వస్తుంది. ఒకానొక్కఁడు, ఒకానొక్కొతె ఒకానొకొటి మొ॥

**33.ఒకానొకకవి యిందుఁ గొన్నిటి నేకవచనాంతములుగాఁ బఠించియున్నాడు. అది విచార్యము** (శబ్ద. 38)

"క్రీడావిశేషవాచకశబ్దములును" అనేసూత్రం కొన్ని ప్రత్యేక మైనఆటలను బోధించేశబ్దాలు నిత్యబహువచనాంతాలు అని చెప్పింది. అందుచేత అచ్చనగాయలు మొద లైన ఈక్రీడావిశేషవాచకశబ్దాలమీద ఎప్పుడూ బహువచనమే కాని ఏకవచనం ప్రయోగించడానికి అవకాశం లేదు. అయినా ఒకానొకకవి కొన్నిటిని ఏకవచనాంతంగా ప్రయోగించాడు.

'బిల్లగోల్లు' నిత్యబహువచనాంతంగా ఈవ్యాకరణం చెప్తుండగా ధూర్జటి 'బిల్లగోడు' అని ఏకవచనాంతంగా ప్రయోగించాడు. అలాగే 'కనుమూసిగంతలు' నిత్యబహువచనాంత మని ఈవ్యాకరణం చెప్తుండగా పింగళి సూరన 'కనుమూసిగంత' అని ఏకవచనాంతంగా ప్రయోగించాడు.

ఇది పై లక్షణానికి విరుద్ధం. కాబట్టి ఈప్రయోగాలు సరిగావు అని అభిప్రాయం.

వీటిలో ఏకవచనాంతతను స్వీకరించి లక్షణంలో దోషం చెప్పాలా? లక్షణాన్ని ప్రమాణీకరించి ప్రయోగాలలో దోషం ఎంచాలా అనేవిషయం ఇంకా పరిశీలించాలి అని కూడా అర్థం అవుతుంది.

**34. ఒకానొకయాధునికగ్రంథమునందు 'అన్నరో, ఏనుంగురో' అని కవిప్రయోగములు కానంబడుచున్నవి. వానికిఁ బ్రామాణికప్రయోగములు కానంబడవు.** (శబ్ద. 14)

'రో శబ్దం బొందు సంబోధనంబున స్త్రీవాచకంబునకుం బరంబుగ నగు' అనేసూత్రం రో శబ్దాన్ని స్త్రీవాచకాలమీద విధించింది. మహాకవిప్రయోగాలు కూడా అలాగే ఉన్నాయి. కాని ఆధునికు డైన కూచిమంచి తిమ్మకవి తన అచ్చతెనుగు రామాయణంలో అన్నరొ, ఏనుంగురొ అని ప్రయోగించాడు. ఇందులో 'అన్న' అనేది మహత్తు. ఏనుంగు అనేది తిర్యక్కు. స్త్రీ వాచకాలకు చెప్పిన యీకార్యం స్త్రీవాచకేతరాలపై రావడం ఈలక్షణానికి విరుద్ధం.

'క్వచి ద్రో ఇతి స్త్రీ వాచకో భవేత్ పరత్రైవ' అని స్త్రీ వాచకాలమీద 'రో' ను విధించినఅధర్వణుఁడు 'అన్యత్రాపి క్వచిద్రో స్యా ద్రూఢదేశ్యప్రయోగతః' అని స్త్రీవాచకేతరాలపై గూడ 'రో' శబ్దాన్ని చెప్పాడు. అమ్మచెల్లరో. మొ॥ దానిప్రకారం ఈ ప్రయోగాలు లక్షణబద్ధాలే అవుతాయి.

అయినా ప్రౌఢవ్యాకర్త – స్త్రీవాచకేతరాలమీద రోశబ్దం ప్రామాణికకవిప్రయోగాలలో కనబడడం లేదు. కాబట్టి ఈ ఆధునికప్రయోగాలను లక్షణబద్ధం చేయలేదు. ఈకవి యితరప్రయోగాలను ప్రామాణికప్రయోగాలనుబట్టి గ్రహించా దన్నమాట.

ఆధునికకృతులలో గంగను కాసె, నెలఁతిచ్చెను అనేప్రయోగా లున్నా అధర్వణుడు సంస్కృతీయాచ్చుకు సంధి చెప్పినా చిన్నయసూరి విశేషంగా ప్రస్తావించడం ఇక్కడ స్మరించాలి.

**35. ఒక్కచో ననుటచే ఆచార్యుఁడు ద్రోణునకున్ శిష్యుఁడ** (శబ్ద. 43)

'పూజ్యతయం దొక్కచో నామతదేతద్యుష్మదస్మచ్ఛబ్దంబులయేకవచనంబునకు బహువచనం బగు' అనేసూత్రం పూజ్యతలో నామాదులకు ఏకత్వంలో బహువచనం విధించింది.

ఈసూత్రంలో 'ఒక్కచో' అనడంచేత బహువచనం రావడం సార్వత్రికం కాదు. కాబట్టి పూజ్యతార్థంలో ఏకవచనం అలాగే ఉండవచ్చు. ఏకవచనంలో ఉన్నమాత్రంచేత పూజ్యార్థం లే దని భావించరా దని తాత్పర్యం.

'ఆచార్యుఁడు ద్రోణునకున్ శిష్యుఁడ' ఇక్కడ గురువులనుగూర్చి పేర్కొనడంవల్ల పూజ్యార్థం ఉన్నది అయినా, ఆచార్యుడు, ద్రోణునకున్ అనేశబ్దాలను ఏకవచనంలో ప్రయోగించడం జరిగింది. సూత్రంలోని 'ఒక్కచో' అనేదళంవల్ల ఇక్కడ పూజ్యార్థం ఉన్నా బహువచనం రాలే దని గ్రహించాలి. బహువచనం వస్తే 'ఆచార్యులు ద్రోణులకున్' అని అవుతుంది.

### 36. కృష్ణమ్మ యనుచో అమ్మ ప్రేమసూచకం బని యెఱుంగునది (సమా. 5)

కృష్ణుడు అనేసంజ్ఞకు పంతులు అనేబిరుదవాచకంతో కర్మధారయ మై విభక్తిలోపాదులతో కృష్ణపంతులు అని కాగా 'కొన్నియెడల' ననాపామాయాగమంబు లగు' అని అమ ఆగమమై (కృష్ణనిచ్ఛో ఆ అమ) సంధి జరిగి కృష్ణమపంతులు. 'పైయాగమంబులు కొన్నియెడల ద్విత్వయుక్తంబు లగు' అనేసూత్రంచేత (అమ అనేఆగమంలో) మకారం ద్విరుక్త మై కృష్ణమ్మపంతులు అని అవుతుంది.

ఇక్కడ కృష్ణమ్మ (పంతులు) అన్నచోట అమ్మశబ్దం ఉన్నది. అమ్మ అనేది స్త్రీవాచకం. 'కృష్ణమ్మపంతులు' అనేది పురుషసంజ్ఞ. పురుషుడిపేరులో 'అమ్మ' అనేస్త్రీవాచకం ఉండడం యుక్తమా? రామన్నసెట్టి, మల్లయ్యశాస్త్రి అని మొ॥ చోట్ల అన్న, అయ్య – మొ॥ పురుషవాచకాలే కాబట్టి పురుషసంజ్ఞలలో అవి చేరవచ్చును గాని స్త్రీవాచకం అయిన అమ్మ చేరడం ఎలా? అని శంకించుకుని వ్యాకర్త యీవివరణంలో సమాధానం చెప్తున్నాడు.

కృష్ణమ్మపంతులు అనేచోట అమ్మ అనేది ప్రేమను సూచించేదే కాని స్త్రీని బోధించేది కాదు. కాబట్టి పురుషసంజ్ఞలో 'అమ్మ' ఉండడాన్ని శంకించనవసరం లేదని భావం. ఇలాగే కృష్ణమరాజు మొ॥.

దీన్నిబట్టి కొండమాంబ – సూరమాంబ అన్నపుడు అమ స్త్రీవాచకమా? నన్నయ్యభట్టులో అయ్య పురుషవాచకమా? అనేఅభిప్రాయం కలుగుతుంది. కాని ఆగమాలుగా చెప్పిన అన – మొ॥ అర్థవంతాలుగా భావించడమే సరి కాదు. ఇవి దేనికి ఆగమం వస్తాయో ఆశబ్దాలఅర్థంలో అంటే స్వార్థంలో ఉంటాయి. నిగాగమ, లడాగమాదుల్లాగా. స్త్రీపురుషవాచకా లవుతా యని సందేహించడమె పొరపాటు. వ్యాకర్త చెప్పినట్లు ప్రేమసూచకం అయితే ఆవిషయాన్ని అంటే ఆయాఅర్థవిశేషాలలో ఆగమం విధించాలి. లేకపోతే ప్రేమాద్యర్థాలను అది ఎలా సూచిస్తుంది. 'కృష్ణమ్మపంతులు' లో ప్రేమ సూచక మైతే కృష్ణమపంతులులో ఏమిటి. నన్నయభట్టు ఇత్యాదులలో అయ మొ॥ వాటిపరిస్థితి ఏమిటి.

ఈవివరణం అనవసరమే కాక అనర్థకం కూడా అవుతున్నది.

### 37. కృష్ణశాస్త్రిత్యాదులందు దీర్ఘంబు గలుగదు (సమా. 2)

"కర్మధారయంబు బిరుదాద్యుత్తర పదం బయ్యె నేని ద్వ్యక్షరాదంతస్త్రీపుంసంజ్ఞావాచకం బగుపూర్వపదంబు నంత్యాక్షరంబున కంతట దీర్ఘంబు బహుళంబుగా నగు' అనేసూత్రంలోని 'బహుళంబు' అనేపదంచేత 'కృష్ణశాస్త్రి' మొద లైనసమాసాలలో దీర్ఘం కాదు అని పై వివరణవాక్యాని కర్థం.

'కృష్ణశాస్త్రి' అనేసిద్ధసమాసంలో ('శాస్త్రి' అనేబిరుదవాచకం పరంగా ఉండగా రెండక్షరాల పురుషసంజ్ఞ అయిన 'కృష్ణ' శబ్దంలో చివరిఅచ్చుకు పై సూత్రంప్రకారం దీర్ఘం ప్రాప్తిస్తున్నది. సూత్రంలోని బహుళపదంచేత దీర్ఘానికి అప్రవృత్తి. దీర్ఘం రాదు కాబట్టి కృష్ణశాస్త్రి అని హ్రస్వంతో మాత్రమే రూపం ఉంటుంది. ఇత్యాదు లనడంచేత శివరావు మొ॥ చోట్ల దీర్ఘం రాదు.

**38. కొందఱు ఇరులు కేలు శబ్దములు నిత్యబహువచనాంతములందురు. అట్లు కాదు** (శబ్ద. 28)

ఇరులు ఇత్యాదులు బహువచనాంతాలు అని అహో మొ॥ చెప్పారు. (కేలు బహువచన మన్నది యెవరో తెలుసుకోవాలి) దానిని తిరస్కరించడానికి ఈవివరణం చెప్పబడింది.

'దేశ్యమునం దక్కడాదులు నిత్యైకవచనాంతములు' అనేసూత్రంలోని ఆదిశబ్దంచేత ఇరులు, కేలు అనేశబ్దాలు గ్రహింపబడి అవి నిత్యైకవచనాంతా లవుతున్నాయి.

'ఇరులునన్' – ఇక్కడ ఇరులుశబ్దంమీద 'న' అనేసప్తమీవిభక్తి ఉన్నది. 'డుమువున లేకవచనంబులు' సప్తమీ నవర్ణకం (బహువచనం కాదు) ఏకవచనం మాత్రమే అవుతుంది. కాబట్టి 'ఇరులునన్' అనేది సప్తమ్యేకవచనాంతం. ఇరులు (కేలు) అన్నప్పటి లువర్ణం ప్రథమాబహువచనం లాగా, ఇరులకు' ఇరులగొంగ ఇత్యాదులలో 'ల' వర్ణం లడాగమంలాగా కనబడుతుంది. కాని ఇరులున అనేప్రయోగాన్నిబట్టి ప్రాతిపదిక ఇరులు. 'ఇరు' అని లేదు. ఇరులకు ఇత్యాదులలో అత్వం విశేషంగా సాధించుకోవాలి. ఇరులులు ఇరుళ్లు, మొ॥ రూపాలు లేవు. కాబట్టి 'ఇరులు' నిత్యైకవచనాంతం.

ఒకకేలఁబట్టి, కేలితో లేదా కేలిచేత అనేఔపవిభక్తిక మైన కేలుశబ్దంమీద తృతీయకు అత్త్వం వచ్చి 'కేలన్' అయింది. కాబట్టి 'కేలు' లో 'లు' వర్ణం బహువచనం కాదు. ప్రాతిపదికావయవమె.

అయితే ఇది కూడా నిత్యైకవచనాంత మంటున్న ప్రౌఢవ్యాకర్త 'పెఱకేలులు' అని దీనిపై బహువచనం చూపాడు. కేలులు, కేళ్లు అనేప్రయోగాన్నిబట్టి కేలుపై బహువచనం గూడా ఉంది. కాబట్టి కేలు నిత్యైకవచనాంతం కాదు.

**39. కొన్నింటి యనుటచే అయిదుగురు, ఆఱుగురు ఇత్యాదులందు లోపంబు లేదు** (శబ్ద. 92)

"సంఖ్యావాచకంబులకు విభక్తి పరం బగునపుడు కొన్నింటియంత్యాక్షరంబులకు లోపం బగు' అనేసూత్రం విభక్తి పర మవుతుండగా కొన్ని సంఖ్యావాచకాలలో చివరిఅక్షరాలకు లోపం చెప్తున్నది. మూ(ఁడు)గురు నలుగురు మొ.

అయితే సూత్రంలో 'కొన్నింటి' అనడంచేత సంఖ్యావాచకాలకు అన్నింటిలోనూ ఈలోపం రాదు. కాబట్టి కొన్ని సంఖ్యా వాచకాలలో చివరిఅక్షరాలు లోపించవు.

అయిదుగురు, ఆఱుగురను. ఇక్కడ విభక్తి (రు–ర) పరంగా ఉండగా అయిదు, ఆఱు అనేసంఖ్యావాచకాలలో చివరి అక్షరం లోపించలేదు. ఇలాగే ఒకరు.

మూఁడు, నాలుగు, ఏను, ఎనిమిది, తొమ్మిది, వేయి శబ్దాలలో, సమాసాంతంలో పది శబ్దంలోను, ఈలోపం వస్తున్నది.

### 40. కొన్ని యనఁగాఁ గీడుప్రభృతులును నల్లాదులును (శబ్ద. 10)

'తెనుఁగునం గొన్ని శబ్దములు విశేషణవిశేష్యంబు లుభయంబులు నగు' అనేసూత్రంలోని 'కొన్ని' శబ్దాన్ని వివరిస్తున్నది ఈవాక్యం.

తెలుగులో కీడు మొద లైనవీ, నల్ల మొద లైనవీ, విశేషణాలూ, విశేష్యాలూ రెండూ అవుతాయి అని అర్థం.

కీడు దొలగునట్లు. ఇక్కడ కీడు అనేది పాపం అనేఅర్థంతో విశేష్య మై 'తొలగు' అనేక్రియలోనికి అన్వయిస్తూ ప్రధాన మైంది. ఇలాగే కీడు లేదు. పెద్ద కీడు మొ.

నీ వేమిట నిమ్మహాధ్వరంబు కీ డంటి. ఇక్కడ మహాధ్వరంబు అనేదానికి 'కీడు' విశేషణం.

కీడు ప్రభృతు లంటే మేలు మొ. కర్మములు మేలు నిచ్చును – విశేష్యం. యుగంబులఁ గృతంబు మేలు. కృతంబు అనే దానికి మేలు విశేషణం.

ధవళదేహంబునందు నల్ల గలిగిన. ఇక్కడ నలుపు అనేఅర్థంలో నల్ల – విశేష్యం – కలుగు క్రియతో అన్వయం.

'నల్లతిరునామము' – ఇక్కడ తిరునామము అనేదానికి నల్ల విశేషణం.

### 41. కొన్నియెడల ననఁగాఁ బ్రాసంబులం దని యర్థము (సంధి. 5)

'కొన్నియెడలఁ దెనుఁగులమీఁదిసాంస్కృతికకతపలకు గదవలు గానంబడియెడి' అనేసూత్రంలోని కొన్నియెడల అనేపదానికి ప్రాసలలో అని అర్థం.

ప్రథమాంతా లయిన అచ్చతెలుగుశబ్దాలకు పరంగా, ప్రాసస్థానంలో ఉన్న సంస్కృతసమశబ్దంమొదటి క–త–ప అనే వర్ణాలకు గ–ద–వ అనేవర్ణాలు రావడం కనబడుతున్న దని సారాంశం.

వీర లోపించిన ఇట్లు దపంబు, వేవణములు ఇ వన్నీ ప్రాసగతాలే.

నిజానికి కొన్నియెడల అనేదానికి ప్రాసంబులందు అనే అర్థం సూత్రకర్త చెప్తే తప్పు తెలియదు. కొన్నియెడల అనడానికి బదులుగా సూత్రంలోనే 'ప్రాసంబులందు' అంటే బాగుండేది. కాని ఈకార్యం ప్రాసలోనే వస్తుంది అని చెప్పడం యుక్తి యుక్తం గాదు. ప్రాసఘటితం ప్రమాణం అవుతుంది. ప్రాసేతరస్థలాల్లో రా దని నిషేధించడం ఎంతవరకు సమంజసం. సూత్రం బాగానే ఉంది. వివరణమె అనవసరం అనిపిస్తుంది.

### 42. కోట్టశబ్దపర్యాయంబుగా సంస్కృతంబునఁ గోట శబ్దంబు నొక్కండు గానంబడియెడి (సం. 11)

'కోటపేఁటలు వైకృతములు' అనేసూత్రా న్ననుసరించి 'కోట్టశబ్దభవము కోట' అని చెప్పబడింది. 'కోట్ట' అనే సంస్కృతశబ్దంనుంచి తెలుగులోని 'కోట' అనేశబ్దం తద్భవంగా ఏర్పడింది.

కాని సంస్కృతంలోనే 'కోట్ట' అనేశబ్దానికి పర్యాయంగా అదే అర్థంలో కోట అనేశబ్దం కూడా సంస్కృతంలో కనబడుతున్న దని చెప్తున్నది ఈవివరణవాక్యం.

'కోట్ట, కోట' – అనేరెండుశబ్దాలు సంస్కృతంలో ఉన్నపుడు కోట్టనుండి వచ్చిం దనడం దేనికి? తెలుగులోని 'కోట' శబ్దానికి దగ్గరగా ఉన్న కోటశబ్దంనుంచి ఏర్పడింది అని చెప్పవచ్చు గదా. అని శంకించుకుని వ్యాకర్త ఇలా వివరించాడు.

'కోట' శబ్దంనుండి ఐనా తెలుగు కోట పుట్టిం దనవచ్చు. సమంగా ఉన్నది గదా అని సంస్కృతసమం అనుకోడానికి వీల్లేదు. తద్భవమే. మార్పు ఏమీ లేకపోయినా సంస్కృత 'కుండ' నుంచి ఏమార్పు లేకుండా తెలుగు 'కుండ' తద్భవంగా ఏర్పడినట్లె కోటనుండి కోట పుట్టిం దనీ చెప్పవచ్చు అని తాత్పర్యం.

### 43. క్షారశబ్దము కటుశబ్దపర్యాయంబు నగు (సం. 10)

'కారము క్షారశబ్దభవము' అని ప్రౌఢవ్యాకరణం తెలుగులోని కారము సంస్కృతంలోని క్షారశబ్దంనుంచి పుట్టిం దన్నాడు. సూరి 'కటుః – కారో – కారము'– అని కారము ప్రాకృతసమం అన్నాడు. సంస్కృతంలోని కటుశబ్దానికీ తెలుగులో కారము అనేదానికీ రూపంలో సామ్యం లేకపోవడంవల్ల సూరి ప్రాకృతాన్ని ఆశ్రయించవలసివచ్చింది. అందుకని ప్రౌఢ వ్యాకర్త 'క్షార' శబ్దంతో రూపంలో సామ్యం ఉంది కాబట్టి 'క్షార' నుండి పుట్టిం దన్నాడు. రూపం మాత్రమే సమానంగా ఉంటే సరిపోతుందా అర్థం సరిపోవాలి కదా. అని శంకించుకుని సమాధానంగా ఈవివరణం చెప్పాడు.

సూరి కారము (కారో) అనేదానికి సంస్కృతంలోని 'కటు' శబ్దం మూలంగా చూపాడు. అది ప్రమాణమే కదా. క్షార శబ్దం కటుశబ్దార్థం కలిగి ఉంది. అర్థంతోపాటు రూపంలో గూడా సామ్యం ఉంది. కాబట్టి క్షారశబ్దభవం అనడం న్యాయం అని తాత్పర్యం.

'క్షార' కంటే – ప్రాకృతంలోని 'కారో' అనేదానికి రూపంలో (అర్థంలోనూ) సామ్యం ఇంకా ఎక్కువగా ఉంది. ప్రౌఢ వ్యాకరణం తెలుగులోకి ప్రాకృతంనుంచి పదాలు రావడం అంగీకరించదు. ప్రాకృతసమభవాలు సంస్కృతభవాలుగా చెప్తుంది. క్షారశబ్దానికి కటుశబ్దార్థం ఉన్న దనడానికి ప్రౌఢవ్యాకర్త ప్రమాణంగా చూపిన 'క్షారలవణవర్జనం చ' అనే స్మృతివాక్యంలో క్షారశబ్దానికి కారం అనే అర్థంలేదు. 'పప్పుదినుసులు' ఇత్యాదిగా అర్థం భిన్నంగా ఉంది. క్షార–కారశబ్దాలకు అర్థంలో సామ్యం లేదు. కాబట్టి కారం క్షారశబ్దభవం కాదు.

### 44. చతుర్థికి నుదాహరణంబులు పూర్వవ్యాకరణంబులం జూచునది (కార. 13)

'షష్ఠీస్థానికం బగు కువర్ణకం బొక్కొకచో ద్వితీయాదివిభక్తులకు మాఱుగాఁ దత్తదర్థంబులం జూపట్టెడి' అని చెప్పి ప్రౌఢవ్యాకరణం ఉదాహరణలు ద్వితీయ, తృతీయ, పంచమి, సప్తమి – లకు మాత్రమే చూపింది. ఈ కు వర్ణకం షష్ఠీ విభక్తే కాబట్టి షష్ఠిలో 'కు' రావడం విశేషంగా చూపనవసరం లేదు. మఱి చతుర్థికి కుషష్ఠి అయినఉదాహరణలు ఎందు కీయలేదు? చతుర్థికి కుషష్ఠి రాదా? అనేసందేహానికి సమాధానం ప్రస్తుతవివరణం.

చతుర్థ్యర్థంలో కుషష్ఠి కావడం పూర్వవ్యాకరణాలలో చెప్పబడిఉంది. కాబట్టి దానిని ఆవ్యాకరణాలలో చూడవలసిన దని అర్థం.

ఇక్కడ పూర్వవ్యాకరణం అంటే బాలవ్యాకరణం. ప్రౌఢవ్యాకర్త బాలవ్యాకరణం అనేపేరుగాని చిన్నయసూరి అనే పేరు గాని ప్రౌఢవ్యాకరణంలో ఉచ్చరించలేదు. సూరి 'చతుర్థికి మాఱుగా షష్ఠియె తఱుచుగాఁ బ్రయోగంబులం గానంబడియెడి' అని పేర్కొని జనకుండు రామునకుం గన్య నిచ్చెను. పురుషార్థంబునకు యత్నింపవలయు అని ఉదాహరించాడు.

చింతామణి వ్యాఖ్యలలోను చతుర్థికి షష్ఠి చెప్పబడింది రామునికి మ్రొక్కులు మొ.

కాగా చతుర్థికి కుషష్ఠి కావటం పూర్వప్రసిద్ధం కాబట్టి ఇక్కడ ఉదాహరింపలే దని తాత్పర్యం.

**45. చిట్టడవి - - - ఇత్యాదులందుఁ బూర్వపదము చిట్టిశబ్ద మని యర్థము** (సంధి. 4)

చూ. చిట్టడవిఁ జిట్టి సూత్రవ్యాఖ్య

**46. టవర్ణకం బిటఁ గృత్ప్రత్యయంబున కుపలక్షణంబు** (సమా. 31)

'భావద్వంద్వంబునం దొలిపదంబు టవర్ణకంబునకు లోపం బగు' అనేసూత్రంలోని 'ట' వర్ణకంబు ఇతరకృత్ప్రత్యయాలను గూడా బోధిస్తుం దని అర్థం. ధాతువుమీద విధింపబడిన డుఞ్ (క్రియావిభక్తి)కంటె భిన్న మైనప్రత్యయం కృత్తు. ఇది భావద్వంద్వం కాబట్టి కృత్‌ప్రత్యయం అంటే భావార్థకమైన కృత్ ప్రత్యయం అని అర్థం.

పై సూత్రంచేత భావార్థకశబ్దాలకు అయినద్వంద్వసమాసంలో మొదటిపదంలోని 'ట' మొద లైనభావార్థక కృత్ప్రత్యయాలు అన్నింటికీ లోపం వస్తుంది. సూత్రంలో ఉచ్చరించిన ట వర్ణకం దాని ఒక్కదానికి మాత్రమే కాక భావార్థంలో వచ్చిన 'ఇకి' మొ॥ ప్రత్యయాలకు గూడా ఈలక్షణంచేత లోపం రావడం ఈవివరణానికి ప్రయోజనం.

'వినికి + వినమి' అనేద్వంద్వంలో మొదటిపదంలోని 'ఇకి అనే కృత్ప్రత్యంలోని కి వర్ణం లోపించి విని వినమి - విని వినములు అవుతుంది. 'ఇకి' మొత్తం ప్రత్యయం అయి ఉండగా ఇ లోపింపకపోవడం విశేషం.

**47. తఱచుగ ననుటంజేసి పదియాఱు పదా ఱిత్యాదిరూపంబులు గ్రాహ్యంబులు** (సమా. 22)

'ఒకండ్వాదులు పరంబు లగుచోఁ దఱచుగ నున్ బది కగు' అనేసూత్రం ఒకఁడు మొద లైనవి పరంగా ఉన్నపుడు పూర్వంలో ఉన్న 'పది' శబ్దానికి 'ఉన్' అనేది తఱచుగా వస్తుంది అని చెప్తున్నది. 'తఱచుగా' అనడంవల్ల ఈకార్యం అరుదుగా రాకపోవడం కూడా ఉన్నది అని పైవాక్యానికి అర్థం.

ఒకండ్వాదులలో లేనిది పర మైనపుడు 'ఉన్' ఎలాగూ రాదు. ఒకండ్వాదులలో ఉన్నశబ్దం పరంగా ఉన్నా కూడా అప్పుడప్పుడు 'ఉన్' రాకపోవచ్చు. 'పది+ఆఱు' అన్నపుడు ఒకండ్వాదులలోని ఆఱు పరంగా ఉండగా 'ఉన్' వచ్చి (పది+ఉన్+ఆఱు) పదునాఱు. 'తఱచు' అనడంవల్ల ఉన్ రాని పక్షంలో 'పది+ఆఱు' అని ఉండగా 'ఏమ్యాదులయిత్తునకు సంధి వైకల్పికముగా నగు' అనేసూత్రంచేత సంధి వస్తే - పదాఱు. వైకల్పికం కాబట్టి సంధి రానిపక్షంలో యడాగమం వచ్చి పదియాఱు.

ఇలాగే పదేను, పదియేను, మొ॥

**48. తఱచుగ ననుటచే అన్విష్టసఖినూఁదియున్నదాని ఇత్యాదులు గ్రాహ్యంబులు** (సంధి. 9)

తఱచుగఁ గర్మధారయసమాసంబునం బెన్వాదుల కడహల్లున కచ్చు పరం బగునపుడు ద్విత్వంబు గానంబడియెడి' అనేసూత్రంలోని తఱచు శబ్దానికి ప్రయోజనాన్ని ఈవాక్యం వివరిస్తున్నది.

సూత్రంలోని తఱచు శబ్దంచేత అన్నిష్టసఖి (అను+ఇష్టసఖి) అన్నుర్వీశుఁడు (అను+ఉర్వీశుఁడు); పెన్నురము (పెను+ఉరము) మొద లైనవి గ్రహింపదగినవి అని వాక్యాని కర్థం.

వీటిలో విశేషం వ్యాకర్త స్పష్టం చేయలేదు. 'పెన్నురము' అన్నపుడు 'పెను' పెన్వాదులలోదే. ఆదిశబ్దంచేత 'అను' గ్రహింపవచ్చు.

సూత్రానికి సాధారణ మైనఉదాహరణలుగా చూపిన 'పెన్నదరులు, పెన్నరదము, కన్నాకు పల్లఱపు అనేవాటిల్లో అన్నింట్లోనూ ఉత్తరపదం ఆచ్చికమే. విశేషంగా చూపిన వీటిఅన్నింట్లోనూ (ఇష్టసఖి, ఉర్వీశుఁడు, ఉరము) ఉత్తరపదాలు సంస్కృతసమాలు. కాగా తఱచుశబ్దంచేత మిశ్రసమాసాలలోనూ, సంస్కృతసమం పరంగా ఉండగా ద్విత్వం వస్తుం దని చెప్పాలి. ఆచ్ఛికసమాసాల్లో సాధారణ మన్నమాట.

కాని 'ఆచ్ఛికసమాసంబులందు' అనక కర్మధారయసమాసములం దని సామాన్యంగా చెప్పడంచేత ఆచ్ఛిక సమాసాల్లోలాగానే మిశ్రసమాసాల్లో కూడా ఈకార్యం సాధారణంగానే అవుతుంది. కాబట్టి యీప్రయోజనానికే అయితే సూత్రంతో 'తఱచుగ' అనడం అనవసరం. కర్మధారయేతరసమాసంలో ద్విత్వం మొ॥ ఇతరవిధమైనప్రయోగం ఉంటే ప్రయోజనంగా చూపాలి.

**49. తఱచుగ ననుటచే ఇరువుర నిత్యాదులయం దిత్వంబు కలుగదు** (శబ్ద. 90)

'ద్వితీయాదులం దసంయుక్తరవర్ణకంబునత్వంబున కిత్వంబు తఱచుగ నగు' అనేసూత్రంలోని తఱచు శబ్దానికి ప్రయోజనాన్ని ఈవాక్యం వివరిస్తున్నది.

'తఱచుగ' అనడంచేత ద్వితీయాదులం దసంయుక్తరవర్ణంబునత్వంబునకు కూడా ఇరువురకు మొదలైన వాటిల్లో ఇత్వం రా దని అర్థం.

ఇరువురన్, మూగురచేత మొ॥ ఇక్కడ 'లులలకు రుర లగు' అని వచ్చినరవర్ణం ద్వితీయాదులకు సంబంధించినది. అసంయుక్తం కూడా అయింది. కాబట్టి పై సూత్రంచేత ఇక్కడి రవర్ణంలోని అత్వానికి ఇత్వం రావలసిఉంది. తఱచు శబ్దంచేత ఈచోట్ల ఇత్వం రాదు. కాబట్టి ఇరువురిన్, మూగురిచేత ఇత్యాదిగా కావు. ఇరువుర నిత్యాదిగా అత్వం అలాగే ఉంటుంది.

**50. తఱచుగ ననుటచేఁ గేవలవర్ణోచ్చారణమునం దీవిధి నిత్యము గా దని తెలియునది** (సం. 9)

'నిర్దేశవిధానోచ్చారణంబులం దఱచుగ అవర్ణాదులు కారప్రత్యయాంతములును, రవర్ణ మిఫ ప్రత్యయాంతము నగు' అనేసూత్రంలోని తఱచు శబ్దానికి ప్రయోజనాన్ని వివరిస్తున్నది ఈవాక్యం.

పై సూత్రం నిర్దేశం, విధానం, ఉచ్చారణం అనేమూడర్థాలలో అవర్ణాదులకు కారప్రత్యయాన్ని, రవర్ణానికి ఇఫ ప్రత్యయాన్నీ చెప్తున్నది. తఱచు అనేశబ్దంచేత 'ఉచ్చారణం' అనేఅర్థంలో మాత్రం కార, ఇఫ ప్రత్యయాలు రావడం నిత్యం

గాదు. అంటే నిర్దేశ విధానాలలో కార, ఇఫ ప్రత్యయాలు రావడం నిత్యం. లకారమునకు రేఫ వచ్చును. విశేషవిధినిబట్టి కారేఫలను బాధించి దీర్ఘం వస్తే లాకు రావచ్చును. అంతే కాని లకు రవచ్చును అనగూడదు.

ఉచ్చారణం అనేమూడోఅర్థంలో మాత్రం కార, ఇఫలు నిత్యం కాదు. కాబట్టి రాకపోవచ్చును. అ-ఇ-ఉ మొ.

'ఆంధ్రభాషకు వర్ణంబు లేఁబదియైదు' అనేసూత్రంవద్ద ఉదాహరణలను అ-ఆ-ఇ-ఈ- ఇత్యాదిగా వర్ణోచ్చారణలో కార - ఇఫ - ప్రత్యయాలు లేకుండా చూపడం గమనించాలి.

దీర్ఘాలకు నిర్దేశవిధానాలలోనూ కార, ఇఫలు రాకపోవడం ఉన్నది. ఐకి ఔ వచ్చును. దీన్ని గూడా తఱుచుశబ్దంచేతనే సాధించుకోవాలి.

### 51. తఱచుగ ననుటచే తడవకు ఇత్యాదు లెఱుంగునది (సమా. 21)

'వారార్థకశబ్దంబు లద్విరుక్తంబులు తఱచుగ సంఖ్యాపూర్వకంబు లగు' అనేసూత్రంలోని 'తఱచు' శబ్దానికి ప్రయోజనాన్ని ఈవాక్యం వివరిస్తున్నది.

వారార్థకశబ్దాలు ద్విరుక్తాలు కాకపోతే (ఒకేసారి ఉచ్చరించినపుడు) పూర్వంలో తఱచుగా ఏదో ఒకసంఖ్యావాచకం కలిగి ఉంటుంది. తఱచు అనడంచేత ద్విరుక్తం కానప్పుడు కూడా అరుదుగా పూర్వంలో సంఖ్యావాచకం లేకపోవచ్చు.

తడవకు, మాటికి - మొ॥ వీటిని తడవతడవకు, మాటిమాటికి అనేవిధమైనఅర్థంతో సంఖ్యాపూర్వం అయినదానికంటె 'అర్థం' భిన్నంగా ఉండడం గమనించవలసిఉంది.

### 52. తఱచుగ ననుటచే తాము, మేము, తమ్మున్, మమ్మున్ ఇత్యాదిరూపంబు లగు నని యెఱుంగునది (శబ్ద. 86)

'సర్వనామంబులకు మహదర్థంబునం దఱచుగ లులలకు రుర లగు' అనేసూత్రంలోని తఱచుశబ్దానికి ప్రయోజనాన్ని ఈవాక్యం వివరిస్తున్నది.

మహత్తులమీది బహువచన లులలకు తఱచుగా రురలు వస్తా యని చెప్తున్నది సూత్రం, తఱచు అనడంచేత ఈ కార్యం అరుదుగా రాకపోవచ్చును.

తాము - మేము మొద లైనవాటిలో తా-నా- అనేశబ్దాలమీది ప్రథమాబహువచన 'లు' వర్ణానికి రు వర్ణం లేదు. ఇలాగే మనము మొ.

తమ్మున్, మమ్మున్ అన్నపుడు ద్వితీయలో 'ర' వర్ణం రాలేదు. ఇలాగే తనచేత, మాకు - మనయందు మొ॥

బహువచనంలో రు రలు లేనిసర్వనామాల నుద్దేశించి సూత్రంలో తఱచుశబ్దం ప్రయోగింపబడిం దని వ్యాకర్త తాత్పర్యం.

వీటిప్రక్రియ ప్రౌఢవ్యాకరణం చెప్పలేదు. బాలవ్యాకరణం గూడా చెప్పలేదు. చింతామణి చెప్పింది. కాని అక్కడ సంస్కృతవిభక్తులస్థానంలో సరాసరిగా ము- మొద లైనవి చెప్పబడ్డాయి. కాని లుల లు చేయడమే లేదు. రు ర లు వచ్చే చోట్ల నిత్యమే. రానిచోట్ల అసలు రావు. కాగా ఈసూత్రంలో తఱచు శబ్దం అవసరం గా దని చెప్పవచ్చు.

**53. తఱచుగ ననుటచే నొకానొకచో నేకవచనంబున నుకారంబు మీఁది ద్వితీయయుఁ దృతీయావిభక్త్యర్థక మయ్యెడు నని తెలియవలయు** (కార. 4)

'కొన్నియెడలఁ జేతవిభక్త్యర్థకవర్ణంబులకును, వలనవర్ణకంబునకును దఱచుగ 'జేసి యనుప్రయుక్తం బగు' అనే సూత్రంలోని 'తఱచు' అనేశబ్దానికి ప్రయోజనాన్ని వ్యాకర్త ఈవాక్యంలో వివరిస్తున్నాడు.

'తఱచు' శబ్దంచేత అరుదుగా ఏకత్వంలో సైతం ఉదంత (జడ) శబ్దానికి పైనున్న ద్వితీయ కూడా తృతీయావిభక్తి (చేత) యొక్క అర్థాన్ని తెలుపుతుంది. అపుడు దానిపై చేసి అనుప్రయుక్త మవుతుంది.

అంటే ఉదంతజడశబ్దాల కేకత్వంలోనూ తృతీయకు ద్వితీయ వస్తుం దని తాత్పర్యం. సూరి 'ఉదంతంబులకు బహుత్వ మందే యీకార్య' మని చెప్పగా ఏకత్వంలో గూడ తృతీయకు ద్వితీయ వస్తుం దని ప్రౌఢవ్యాకర్త ఇక్కడ పేర్కొంటున్నాడు.

తంఁడ్రిపనుపుచేత, అన్నచోట పనుపు అనేఉదంతజడం మీది తృతీయకు ప్రస్తుతసూత్రంలోని తఱచు శబ్దంచేత ద్వితీయ వచ్చి, చేసి అనుప్రయుక్తం కాగా పనుపుఁజేసి - ఇలాగే తప్పుచేత - తప్పును - తప్పుఁజేసి మొ.

ఈవివరణం సమంజసంగా కనిపించదు. చేసి తఱచుగా అనుప్రయుక్తం అవుతుం దనేవిధానానికి తృతీయకు ద్వితీయ కావడానికి సంబంధం ఏమీ లేదు. ఈప్రయోగంకోసమే అయితే తఱచు శబ్దం అనవసరం. పనుపున్, తప్పున్ అనే విధంగా చేసి లేకుండా తృతీయకు ద్వితీయ ఉంటుందా. ఏదైనా ఈద్వితీయను మరొకతీరుగా సాధించుకోవలసిందే.

**54. తఱచుగ ననుటచే నొక్కొకచో ననుకరణసహితంబు నగు నని యెఱుంగవలయు** (సం. 16)

'జయపదం బనుకరణ విరహితంబ తఱచుగ నగు' అనేసూత్రంలోని తఱచుశబ్దం ప్రయోజనాన్ని ఈవాక్యం వివరిస్తున్నది.

అనుకరణవిరహితం కావడం తఱచు అనడంవల్ల అరుదుగా అనుకరణసహితం కూడా కావ చ్చని అర్థం. 'జయ' సంస్కృతక్రియాపదం. తెలుగులో అనుకరణవిరహితంగానే తఱచుగా ప్రయోగింపబడుతున్నది. జయపూతనాఘాత. అరుదుగా అనుకరణం ఉండి కూడా ప్రయోగించవచ్చు.

కాని అటువంటిప్రయోగాన్ని వ్యాకర్త చూపలేదు. జయ పూతనాఘాత అనేవిధంగా జయపదం అనుకరణం లేకుండా ప్రయోగించినస్థలాల్లో ఎక్కడా గూడా 'జయ యని పూతనాఘాత' ఇత్యాదిగా అనుకరణం ఉండేఅవకాశం లేదు. అలాగే 'నన్ను జయింపుము, చూతము' అనేవిధ మైనస్థలాల్లో 'నన్ను జయ చూతము' అనేవిధంగా ప్రయోగింపబడదు.

'విరహితంబ' అని అవధారణార్థకం చేర్చి 'తఱచుగా' అనడం కొంత విలక్షణంగా ఉంది. అవధారణార్థకం చేర్చడంలో వ్యాకర్త అభిప్రాయ మేమో. ఈవివరణం లక్ష్యానుగుణం కాదు. 'జయ పూతనాఘాత' ఇత్యాదుల్లో జయ అవ్యయంగా తెలుగులో ప్రయోగింపబడిందా అని సందేహం. పరిశీలించాలి.

**55. తఱచుగ ననుటచే బాహుకుండు రథంబు గడపునేర్పునకు ఇత్యాదు లెఱుంగునది.** (కార. 15)

'ధాతుజవిశేషణ భావార్థక పూర్వ వ్యవహితావ్యవహిత కర్తృపదప్రథమకుఁ దఱచుగ యొక్క షష్ఠి యగు' అనేసూత్రంలోని తఱచు అనేశబ్దానికి ప్రయోజనాన్ని ఈవాక్యం వివరిస్తున్నది.

పైసూత్రంలో కర్తృపదప్రథమకు యొక్క తఱచుగా వస్తుంది అనడంచేత అరుదుగా యొక్క షష్ఠి రాదు. అపుడు అంతకు ముం దున్న ప్రథమ అలాగే ఉంటుంది అని ఈవివరణం తాత్పర్యం.

'బాహుకుండు రథము గడపునేర్పు' - ఇక్కడ కర్త అయిన బాహుక శబ్దానికి 'భావార్థకాదియోగంబునఁ గర్తకుం బ్రథమ యగు' అని ప్రథమ రాగా ఆప్రథమకు ప్రస్తుతసూత్రంచేత 'యొక్క' వచ్చి 'యొక్కకు లోపంబు బహుళంబు' గాబట్టి లోపించగా 'బాహుకు రథంబు గడపునేర్పు'. తఱచు అనడంచేత యొక్క రానిపక్షంలో ప్రథమ అలాగే ఉండి బాహుకుండు రథము గడపు నేర్పు. ఇలాగే పరీక్షి జ్జనపాలు చనుట మొ.

## 56. తెనుఁగున సాధారణంబుగ విశేషణంబు లవిభక్తికంబులు (సమా. 15)

'అట్టి యిట్టి యెట్టి విశేషణంబులమీఁదితచ్ఛబ్దవకారంబునకు లోపంబు విభాష నగు' అనేసూత్రంచేత 'అట్టి+వాఁడు' ఇత్యాదుల్లో 'వా' కు లోపం చెప్పి అట్టిఁడు - ఇట్టిరు మొ. రూపాలను ప్రౌఢవ్యాకర్త సాధించాడు. ఇలా తచ్ఛబ్దం పెట్టుకోడం 'వా'కు లోపం చేయడం ఎందుకు? అట్టి ప్రాతిపదికపై ప్రథమైకవచనంలో డుజు వచ్చి అట్టిఁడు - బహువచనంలో 'లు' కు 'రు' వచ్చి అట్టిరు - సిద్ధిస్తాయి గదా. కాగా 'వా' లోపవిధి అనవసరం అని శంకించుకుని దానికి సమాధానంగా వ్యాకర్త పై వివరణం చెప్పాడు.

తెలుఁగులో విశేషణాలు అంటే అచ్చతెలుగు లయినవిశేషణశబ్దాలు విభక్తి పొందవు అని అర్థం. అయితే విభక్తిని పొందకపోతే అవి పదాలే కావు. పదం కాకపోతే 'అపదం న ప్రయుంజీత' అని ప్రయోగించడానికే అర్హాం కావు. కాబట్టి అసలు విభక్తి ఉండ దని అర్థం కాదు. ఇంక విశేషణాలమీద సరాసరిగా విభక్తులు చేరవు. అట్టి - ప్రథమైకవచనంలో డుజ్. అట్టిఁడు. ఇలా ఉండవు. అందువల్లనే ద్వితీయాదుల్లో అట్టిని, ఇట్టికొఱకు ఎట్టివలన ఇత్యాదు లుండవు. ఇంకా విభక్తివివక్షలో తచ్ఛబ్దం చేరి ఆయావిభక్తులు అనుప్రయుక్త మైన తచ్ఛబ్దంమీద వస్తాయి. ('ధాతుజవిశేషణంబులకు విభక్తి వివక్షించునపుడు తచ్ఛబ్దంబను ప్రయుక్తం బగు' అనేసూరిసూత్రంలోని ధాతుజవిశేషణం ఇతర మైనవిశేషణాలకు ఉపలక్షకంగా గ్రహించి తచ్ఛబ్దం చేసుకోవచ్చు) అలా అట్టివాఁడు. ఇట్టివానిని మొ. అవుతాయి. ఇపుడు (ప్రథమావిభక్తిలో) 'వా' లోపం చేస్తేనే అట్టిఁడు'. ఇట్టిరు ఇత్యాది రూపా లవుతాయి. అందుకని తచ్ఛబ్దవకారలోపవిధానం సార్థకం అని వ్యాకర్త సమన్వయం.

## 57. దంష్ట్రా శబ్దంబును బుంలింగముగాను గానంబడియెడి (శబ్ద. 24)

సంస్కృతంలో 'దంష్ట్రా' అనేస్త్రీలింగమే కాక 'దంష్ట్ర' అని పుంలింగశబ్దం కూడా ఉన్న దని ఈవాక్యాని కర్థం. స్త్రీలింగ మైన దంష్ట్రాశబ్దం తెలుగులోకి వచ్చినపుడు దీర్ఘానికి హ్రస్వము, 'స్త్రీలింగంబుల ప్రథమైకవచనంబునకు లోపం బగు' అని ప్రథమైకవచనలోపాదిక మయిన స్త్రీలింగకార్యాలతో దంష్ట్ర, దంష్ట్రను మొ. తత్సమరూపా లవుతాయి. 'దంష్ట్ర' అనేపుంలింగ శబ్దం తెలుగులోకి వచ్చినపుడు అదంత అమహత్వా న్ననుసరించి' అమహన్నపుంసకముల కదంతములకు ము వర్ణకం బగు' అని ము వర్ణకాదికార్యాలు వచ్చి దంష్ట్రము, దంష్ట్రములు మొ॥ తత్సమరూపా లవుతాయి.

చిన్నయసూరి దంష్ట్రా అనేస్త్రీలింగశబ్దాన్ని మాత్రమే గ్రహించి, 'దంష్ట్రము' అనేము వర్ణకాంతరూపంకోసం దీన్ని కంధరాదుల్లో చేర్చి 'కంధరాదులు క్లీబతుల్యంబులు బహుళంబుగా నగు' అని క్లీబతుల్యతను విధించాడు. (స్త్రీలింగపక్షంలో దంష్ట్ర - దంష్ట్రలు మొ.).

మువర్ణకాంతరూపాలకోసం సూరి క్లీబతుల్యత చెప్పడం అనవసర మనీ పుంలింగశబ్దంనుంచి అవి సాధింపబడతా యనీ ఈవివరణంలో తాత్పర్యం.

అప్రసిద్ధ మైనపుంలింగశబ్దాన్నించి సాధించడంకంటే ప్రసిద్ధస్త్రీలింగశబ్దంనుంచి తత్సమాలు సాధించడం యుక్తం గాబట్టి సూరిమార్గమే మేలు.

**58. దానివలనఁ గలిగిన దందు రేని యపు డది కుండ లోనగువానివంటి దని యెఱుంగవలయును** (సం. 11)

చూ. కోట్టశబ్దము పర్యాయముగా - 41 వాక్యవివరణం.

**59. దీనికిఁ దత్సమంబునం బుంలింగరూపముతోనె ప్రయోగము గాని స్త్రీలింగరూపముతో లేదు** (శబ్ద. 24)

సంస్కృతంలో 'విధా' అనేస్త్రీలింగశబ్దం ప్రసిద్ధం. ప్రౌఢవ్యాకర్త 'విధాశబ్దంబు సంస్కృతంబునం బుంలింగంబు నగు' అని పుంలింగ మైన 'విధః' అనేశబ్దం కూడా ఉన్న దని చెప్తున్నది.

స్త్రీలింగశబ్దంనుంచి ప్రథమైకవచనలోపాది స్త్రీలింగకార్యాలతో -విధ-విధలు- అనేవిధ మైనరూపా లవుతాయి. పుంలింగ శబ్దంనుంచి ఇది అదంతామహత్తు కాబట్టి మువర్ణకాదులతో విధము - విధములు అనేవిధ మైనరూపాలవుతాయి. తెలుగులో విధ- మొద లయిన స్త్రీలింగరూపాలు లేవు. మువర్ణకాంతరూపాలు మాత్రమే ఉన్నాయి. దానిని సమన్వయించడానికి అంటే స్త్రీలింగ రూపాలను వారించడానికి వ్యాకర్త పుంలింగశబ్దం మాత్రమే తత్సమ మవుతుం దనీ స్త్రీలింగరూపం తెలుగులోకి అసలు రా దని పై రీతిగా వివరించాడు.

ప్రసిద్ధ మైన స్త్రీలింగరూపాన్ని గ్రహించినసూరి విధాశబ్దాన్ని కంధరాదుల్లో చేర్చి 'కంధరాదులు క్లీబతుల్యంబులు బహుళంబుగా నగు' అని క్లీబతుల్యతను చెప్పి, స్త్రీలింగరూపాలను వారించడంకోసం 'విధాశబ్దమునకు 'గ్లీబతుల్యత్వంబు నిత్యంబు' అని చెప్పాడు.

పుంలింగశబ్దంనుంచి ఈరూపాలు సిద్ధిస్తాయి. కాబట్టి నిత్యక్లీబతుల్యతావిధానం అనవసరం అని ప్రౌఢవ్యాకర్త ఆంతర్యం.

అప్రసిద్ధ మైన పుంలింగశబ్దం మాత్రమే తెలుగులోకి రావడమూ, ప్రసిద్ధ మైన స్త్రీలింగశబ్దం అసలు రాకపోవడమూ యుక్తి యుక్తంగా కనబడవు. సూరిమత ముచితం .

**60. దీని నహోబలపండితుఁడు మిశ్రబహువ్రీహి యనెఁ గాని యది య ట్లగుట దుర్ఘటము** (సమా. 27)

చూ. కఱకంఠుడు బహువ్రీహి సూత్రవివరణం.

**61. ద్రుత మనఁగా నొల్లనియెడ మఱఁగిపోవునది యనుట** (సం. 4)

'నకారం బసాధారణంబు ద్రుతంబు' అని ద్రుతం ఏదో సూత్రించి ద్రుతసంజ్ఞకు అర్థాన్ని వ్యాకర్త ఇలా వివరించాడు.

'అక్క ర్లేదనుకుంటే తొలగిపోయేది' అని 'ద్రుత' శబ్దానికి అర్థం. అనవసర మనుకుంటే లోపిస్తుంది అని తాత్పర్యం. శబ్దంలో ఏవర్ణం లేకపోతే అర్థానికి భంగం కలుగుతుందో అది అవసరం. ఏవర్ణం లేకపోయినా (లోపించినా) అర్థసిద్ధికి బాధ ఉండదో అది అనవసరం అనుకోవచ్చు. దానిని ఒల్లకపోవచ్చును. 'నేను' – ఇందులో నువర్ణం లోపించి 'నే' – అని ఉన్నా దానికి నేను అనే అర్థం. నువర్ణం లేకపోయినా బాధ లేదు గాబట్టి ఒకప్పుడు అక్కర్లేదనుకుంటే అది (లోపించి) పోతుంది. కాబట్టి 'నేను' లో 'ను' ద్రుతం. 'చేను' అనేశబ్దంలో 'ను' వర్ణం లేకపోతే పొలము – అనే ఆ అర్థం ఉండదు. అర్థసిద్ధికి ఇందులో నువర్ణం అవసరం. కాబట్టి ఇది తొలగిపోదు. అందుచేత ఇది ద్రుతం కాదు.

చరిత్రము – అన్నపుడు ముువర్ణం పోయి చరిత్ర అని ఉంటుంది. 'ము' ద్రుతం కాదు. పై ద్రుతనిర్వచనం ఇక్కడ అతి వ్యాప్త మవుతున్నది. ఉన్నాను, చదువఁగలను ఇత్యాదుల్లో నువర్ణం ద్రుతమే దానికి లోపం రాదు. ఇటువంటిచోట్ల అవ్యాప్తి. ఏ మైనా ద్రుతం ఏదో వివరంగా నిరూపించినతర్వాత ఆసంజ్ఞకు వ్యుత్పత్తి చెప్పడం అవసరం గూడా కాదు.

**62. నన్నయభట్టారకుఁడు 'అన్నిష్టసఖి నూదియున్నదాని అని ప్రయోగించి 'లుక్సంశ్లేషానాచి ద్రుతస్య' అని సంశ్లేషమును నిషేధించుట ప్రయోగవైరళ్యసూచనార్థం బని యెఱుంగునది.** (సంధి. 3)

'కొన్నియెడలఁ బ్రామాణిక ప్రయోగంబులం ద్రుతంబున కచ్చు పరం బగుచో ద్విత్వంబు చూపట్టెడి' అని ప్రౌఢవ్యాకరణం (అచ్చు పరంగా ఉండగా ద్రుతానికి ద్విత్వం చెప్పింది. లాక్షణికులు పెక్కురు దీన్ని దుస్సంది అని తిరస్కరించారు. లుక్సంశ్లేషా నాచి ద్రుతస్య అని చింతామణిలో నన్నయ ద్రుతానికి సంశ్లేషం నిషేధించాడు. అచ్చు పరంగా ఉండగా ద్రుతానికి సంశ్లేషం అంటే ద్రుతద్విత్వం అని అప్పకవ్యాదులు చెప్పారు. చింతామణి నిషేధించిన ద్రుతద్విత్వాన్ని ప్రౌఢవ్యాకరణం విధించడం యుక్తమా అని సందేహం.

నన్నయ అన్+ఇష్టసఖి అన్నపుడు ద్రుతానికి ద్విత్వం చేసి అన్నిష్టసఖి అని ప్రయోగించాడు కాబట్టి ద్రుతద్విత్వ విధానం నన్నయాది ప్రామాణిక కవి సమ్మతమె. అందుచేత చెప్పడం యుక్తమె.

అయితే నన్నయ, భారతంలో ద్రుతద్విత్వాన్ని ప్రయోగించి చింతామణిలో 'లుక్సంశ్లేషా న' అని నిషేధించడం ఏమిటి? తనప్రయోగాలకే తాను విరుద్ధంగా లక్షణం చెప్పి తన ప్రయోగాలను గ్రామ్యాలను చేయడం సక్రమమా?

నిషేధించడాన్నిబట్టి ద్రుతానికి ద్విత్వం చేయరాదు. ప్రయోగించాడు గాబట్టి చేసుకోవచ్చు. అంటే అరుదుగా ద్రుతానికి ద్విత్వం చేయవచ్చు అని తాత్పర్యం. ఇలా ఈ ప్రౌఢ లక్షణం నన్నయ లక్ష్యాలక్షణాలకు అనుగుణం. సూత్రంలో కొన్నియెడల అన్న దందుకే.

ద్రుతద్విత్వానికి నన్నయ ప్రయోగం ఇదొక్కటి చూపాడు. ఇది గూడా పెన్వాది సూత్రం దగ్గర పెన్నరదము ఇత్యాదుల వలె ద్రుతేతరమైన హల్లుకు ద్విత్వంగా సమన్వయించాడు. అది యుక్తం. ఈ 'అను' – అన్ లో నకారం ద్రుతం కాదుకాగా అన్నిష్టసఖిలో ద్రుతద్విత్వమే లేదు.

**63. నాయఁడు గారు, దేవి గారు దీనికిఁ దఱచుశబ్దంబు శరణంబు** (శబ్ద. 39)

'తఱచుగా స్త్రీసమంబులగుదేశ్యశబ్దములకుఁ గ డ ప లఁ గొన్నింటి కేకవచనంబునం బూజ్యతయందు గారు శబ్దం బగు' అనేసూత్రం గారుశబ్దాన్ని స్త్రీసమా లయిన ఆచ్ఛికశబ్దాలకు చివర విధించింది. దేశ్య మన్నమాటను ఈవ్యాకర్త ఆచ్ఛికం అనేఅర్థంలో ఉపయోగిస్తుంటాడు.

కాని నాయఁడుగారు దేవి గారు – అనేవి దీనికి భిన్నంగా ఉన్నాయి. 'నాయఁడు' శబ్దం ఆచ్ఛికమే. కాని స్త్రీసమం కాదు. డుమంతం అంటే పుంలింగతుల్యం అయింది, దేవి శబ్దం. (స్త్రీసమం అని ప్రౌఢవ్యాకర్త ఉద్దేశం) ఆచ్ఛికం కాదు. ఇది సంస్కృతసమం. పై సూత్రం ప్రకారం వీటికి పైన గారు శబ్దం రావడానికి వీలులేదు. గారు చేయడం ఎలా కుదురుతుంది. అంటే సూత్రంలోని 'తఱచు' శబ్దాన్ని ఆశ్రయించుకుని 'స్త్రీసమమైనదేశ్యం' కాని యీశబ్దాలమీద గారు వచ్చిం దని సమర్థించుకోవాలి.

'శరణంబు' అనడంలో ఈపుంలింగతుల్యాదులపై గారు రావడం సమ్మతం కా దనీ అయినా 'స్థితస్య గతి శ్చింతనీయా' అన్నమార్గంలో అటువంటిప్రయోగా లే వైనా ఉంటే తఱచుశబ్దాన్ని ఆశ్రయించడం ఒకటే మార్గ మనీ వ్యాకర్త అభిప్రాయాన్ని గుర్తించాలి.

**64.నిర్దేశవిధానంబులం గారేఫప్రత్యయములు రానియెడల హ్రస్వమునకు దీర్ఘము వచ్చు నని యర్థము** (సం.3)

చూ. ఒకచో హ్రస్వంబు దీర్ఘం బగు. సూత్రవివరణం.

**65. నిర్దేశవిధానవిషయము లయినవర్ణములు దీర్ఘము లయ్యె నేని యవి యట్లే యుండు నని యర్థము.**

చూ. దీర్ఘంబు దీర్ఘంబ – సూత్రవివరణం.

**66. నుశబ్దంబుచేఁ గువలయంబునందలివారు మొ.** (సమా. 37)

"కొన్నియెడల సప్తమీతత్పురుషంబునందు న వర్ణకంబు నగు' – అనేసూత్రంలో 'నవర్ణకంబును' అనేచోటి ను శబ్దం యొక్క ప్రయోజనాన్ని ఈవాక్యం వివరిస్తున్నది.

ఈసూత్రం సప్తమీతత్పురుషంలో నవర్ణకాన్ని విధించింది. కువలయంబునవారు. 'అందున సప్తమి' అని సప్తమిలో నవర్ణంతోపాటు అందు ప్రత్యయం ఇం కొకటి ఉంది. కాగా పై సూత్రంలో సముచ్చయార్థక నుశబ్దంచేత నవర్ణకంతోపాటు సప్తమి అయిన అందు వర్ణకం కూడా ఒకపక్షంలో వస్తుం దని అర్థం సిద్ధిస్తుంది. కువలయంబునందు+వారు 'అంద్వాదుల కలిగాగమంబు సమాసంబునం దగు' అని అలిగాగమం వచ్చి కువలయంబునందలివారు అని కూడా ఉంటుంది. ఇలాగే చిత్తమున దుఃఖంబుల్ – చిత్తమునందలిదుఃఖంబుల్ – మొ.

అందువిభక్తి లోపింపనిరూపాలు పూర్వవ్యాకరణాల్లో చెప్పబడ్డాయి (అందలివారు మొ॥). కాబట్టి వాటిని 'ను' శబ్దంతో సంగ్రహిస్తూ విశేష మయిన నవర్ణకాన్ని ఇక్కడ విధించాడు వ్యాకర్త. సమాసంలో సప్తమీ నవర్ణకలోపాభావం చెప్పదగు.

**67.ను శబ్దంబుచేఁ గూరగాయ లిత్యాదులు బహువచనాంతంబులు నగు నని యెఱుంగవలయు**(సమా. 30)

'ద్వంద్వం బప్రాణివాచకకృదంతశబ్దఘటితం బేకవచనాంతంబు నగు' అనేసూత్రంలో 'ఏకవచనాంతంబును' అని సముచ్చయార్థక మై నను శబ్దానికి ప్రయోజనాన్ని ఈవాక్యం వివరిస్తున్నది.

ఏకవచనాంతం కూడా అవుతుంది అనడంవల్ల ఏకవచనాంతం కాకపోవడమూ ఉంది అనేఅర్థం కలుగుతున్నది. కాబట్టి ను శబ్దంవల్ల బహుత్వార్థాన్నిబట్టి వచ్చినబహువచనం అలాగే ఉన్నరూపం కూడా ఉంటుంది అని గ్రహించాలి. కూర, కాయ అనేశబ్దాలకు ద్వంద్వ సమాస మై 'కూరగాయ' అని కాగా బహుత్వార్థాన్నిబట్టి బహువచనం వచ్చి కూరగాయలు.

అందులో బహువచనానికి ఏకవచనం వస్తే కూరగాయ. 'ను' శబ్దంచేత ఏకవచనం గానిపక్షంలో 'కూరగాయలు' ఇత్యాదిగా బహువచనాంత మయిన రూపం కూడా ఉంటుంది.

**68.నెన్నడ – నెన్నడుము ఇత్యాదులయందు నెఱిశబ్దము పూర్వపదంబుగా నుండుట యుక్త మగు నని యర్థము.** (సంధి. 14)

**69. నెఱ పూర్ణార్థకము – నెఱి రమ్యార్థకము** (సంధి. 14)

చూ. నెన్నడాదుల న్నెఱి దగు. సూత్రవివరణం.

**70. పింఠా విటజనాశ్రయః అని అమరపదపారిజాతము (సం.11)**

**71. పింఠాశబ్దభవము పేఁట** (సం. 11)

చూ. కోట పేఁటలు వైకృతములు సూత్రవివరణం.

**72. పు వర్ణాంతశబ్దములమీఁద నకారాగమము వచ్చుట కేతత్సూత్రారంభప్రవృత్తి యైయుండు.** (శబ్ద. 19)

'కు వర్ణకంబు పరం బగునపు దుకారబుకారంబులకు నగాగమం బగు' అనేబాలవ్యాకరణసూత్రం కువిభక్తి పరంగా ఉండగా నగాగమం (నిత్యంగా) విధించింది. కాని ఉత్సవముకు, బచ్చుకు – మొ॥ రీతిగా కవిత్రయేతర మహాకవి ప్రయోగాలలో అరుదుగా ఈనగాగమం లేదు. 'ఆగమశాస్త్ర మనిత్యమ్' అనేసంస్కృతసంప్రదాయా న్ననుసరించి ఆగమంగా చెప్పినవిధి నిత్యం కాదు. కాబట్టి యీనగాగమం ఉత్సవముకు మొ॥ కొన్నిచోట్ల లేకపోవడం లక్షణానుగుణమే. అందుకే ప్రౌఢవ్యాకర్త 'కువర్ణకంబు పరం బగునపుడు కవిత్రయంబు వారి ప్రయోగంబులం దక్కఁ దక్కిన మహాకవిప్రయోగంబులందునుం గొన్నియెడల నగాగమంబు చూపట్టదు' అని చెప్పాడు.

అయినా నీచార్థం స్ఫురింపకుండా ఉండడానికిగాను 'పు' వర్ణాంతశబ్దాలకు కువర్ణకం పరంగా ఉండగా నగాగమం నిత్యంగా రావడం అవసర మనీ, అందుకే ఈసూత్రం ఆరంభింపబడిం దనీ వ్యాకర్త ఈవివరణలో పేర్కొంటున్నాడు.

తూపు+కు, వీఁపు+కు – మొ॥ చోట్ల పు వర్ణం మీద నగాగమం చేయకపోతే నీచార్థం స్ఫురింపవచ్చు. ఇలాగే ఏకాక్షర పూ శబ్దంపై (పూపువు) కూడా నని గ్రహింపవచ్చు. కాబట్టి ఇక్కడ నగాగమం నిత్యంగానే చేయాలి. తూపునకు పూనకు మొ॥ నగాగమంతో వ్యవధానంవల్ల నీచార్థస్ఫూర్తి వారింపబడుతుంది.

ఈ ప్రౌఢవ్యాకరణాభిప్రాయం యుక్తంగానే ఉన్నది. కాని కవి ప్రయోగాలే ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. నీ తూపుకోర్వక, సొంపుకు ఇత్యాదిగా పువర్ణం పై గూడా ఈ ఆగమం రాకపోవడం ప్రయోగాల్లో కనబడుతున్నది.

**73. పేఁట శబ్దార్థము ప్రకృతి యగు పింఠాశబ్దార్థముకంటె నించుక భిన్నముగా నున్నది.** (సం. 11)

సూరి పేటశబ్దం దేశ్యం అనగా 'కోటపేటలు వైకృతములు' అనేసూత్రం 'పేఁట' శబ్దం తద్భవం అని చెప్పింది. 'పింఠా శబ్దభవము పేఁట' అని పేఁట సంస్కృతంలోని పింఠా అనే శబ్దం నుండి పుట్టిందని చెప్పాడు ప్రౌఢవ్యాకర్త.

అయితే 'పింతా విటజనాశ్రయః' అని పింతాశబ్దానికి విటులు ఉండేచోటు అని అర్థం. తెలుగులో పేట శబ్దం సామాన్యంగా జనం నివసించే చోటు అనే అర్థం మాత్రం తెలుపుతుంది. అర్థంలో ఈభేదాన్నిబట్టి పేఁటశబ్దం పింతాశబ్దభవం అనడం కుదరదు. అందుచేత వైకృతం అనడం త ప్పనీ, సూరి చెప్పినట్లు దేశ్యమే అనీ చెప్పాలి.

అర్థంలో కొంచెం భేదం ఉన్నా తద్భవమె అని వివరిస్తున్నాడు ప్రౌఢవ్యాకర్త. మూలసంస్కృతశబ్దార్థం తద్భవమైనపుడు తెలుగులో కొంచెం భిన్నంగా ఉండడం సహజమె. గౌరవమ్ అనే సంస్కృతశబ్దానికి లేని వాత్సల్యం మొద లైనఅర్థాలు తద్భవమైన గారవము శబ్దానికి ఉన్నాయి. దీన్ని వైకృతదీపికలో ఈవ్యాకర్త అనేకతద్భవాల్లో ప్రస్తావించాడు. కాగా ప్రకృతిఅర్థం వికృతిలో మారడం ఇతరస్థలాల్లోవలెనే ఇక్కడ గూడ ఉన్నది. అందుచేత అర్థంలో భేదం ఉన్నా ఇది తద్భవమె – పేట – పింతా శబ్దభవమే అని సారాంశం.

### 74. ప్రత్యయాగమావ్యయాత్మకమై యుత్వవిశిష్ట మైన నకారంబు ద్రుతసంజ్ఞకం బని యర్థము (సం. 7)

చూ. నకారం బసాధారణంబు ద్రుతంబు - సూత్రవివరణం.

### 75. బహుళంబుగా ననుటచే రామరాయఁడు సుబ్బరావు ఎఱ్ఱప్రెగ్గడ యిత్యాదులందు దీర్ఘంబు వైకల్పికంబు (సమా. 2)

"కర్మధారయంబు బిరుదాద్యుత్తరపదం బయ్యె నేని ద్వ్యక్షరాదంత స్త్రీపుంసంజ్ఞావాచకం బగు పూర్వపదంబు నంత్యాక్షరంబున కంతట దీర్ఘంబు బహుళంబుగా నగు' అనే సూత్రంలోని బహుళపదం ప్రయోజనాన్ని వివరిస్తున్నది ఈ వాక్యం.

బహుళం అంటే ఆసూత్రంలో చెప్పినకార్యం ప్రవృత్తి, అప్రవృత్తి, విభాష, అన్యకార్యం. అని నాలుగు విధాలుగా ప్రవర్తిస్తుంది. కాగా రామరాయఁడు, సుబ్బరావు, ఎఱ్ఱప్రెగ్గడ మొద లయినవాటిల్లో దీర్ఘం వికల్పంగా వస్తుంది. దీర్ఘమయితే రామారాయఁడు మొ॥ ఇక్కడ రామరాయఁడు మొదలుగా చూపడంచేత అంతకు ముందున్న 'రామాశాస్త్రి' ఇత్యాదుల్లో దీర్ఘం నిత్యం అనేఅర్థం వస్తున్నది. రామనాయఁడు, రామరెడ్డి ఇత్యాదులు వినిపించవు కాని రామశాస్త్రి, సుబ్బశాస్త్రి అనేరీతివి వ్యవహారంలో ఉన్నాయి.

### 76. బహుళగ్రహణముచే ధాతుజవిశేషణభావార్థకములముందటి కర్తృపదంబులయొక్కకు నిత్యంబుగ లోపం బని యెఱుంగవలయు (కార. 16)

'యొక్కకు లోపంబు బహుళంబు' అనేసూత్రం యొక్క షష్ఠికి బహుళంగా లోపం చెప్తున్నది. బహుళం అంటే ఆ కార్యం ప్రవృత్తి అప్రవృత్తి విభాష అన్యకార్యం అని నాలుగు విధాలుగా ప్రవర్తించవచ్చు. అందులో ప్రవృత్తిస్థలాన్ని ఈవాక్యం వివరిస్తున్నది.

'ధాతుజవిశేషణ భావార్థక పూర్వ వ్యవహితావ్యవహిత కర్తృపదప్రథమకు దఱచుగ యొక్కషష్ఠి యగు' అనేసూత్రం ధాతుజవిశేషణాలకూ, భావార్థకాలకు ముందటికర్తృపదాలకు యొక్క అనేషష్ఠీవిభక్తిని చెప్తున్నది. బాహుకుఁడు – కడపు – బాహుకుయొక్క – కడపు. ధాతుజవిశేషణం. జనపాలకుడు చనుట – జనపాలకుయొక్క చనుట – ఇక్కడ వచ్చిన యొక్క విభక్తికి 'యొక్కకు లోపంబు బహుళంబు' అనేసూత్రంలోని బహుళపదంచేత లోపం నిత్యంగా వస్తుంది. బాహుకు – – గడపు, జనపాలకు చనుట మొ॥

కావ్యాలలో ఎక్కడా 'యొక్క' ప్రయోగం కానరాదు. కాబట్టి యొక్క అనేవిభక్తి ఎక్క డైనా నిత్యంగానే లోపిస్తుం దని చెప్పాలి.

**77. బహుళగ్రహణముచే నందు మీఁదియుండికి లోపంబు గలుగు దని యెఱుంగునది** (కార. 11)

'వలన కాదేశంబు లగుద్వితీయాసప్తములమీఁదియుండికి లోపంబు బహుళంబుగా నగు' అనేసూత్రం వలన స్థానంలో ఆదేశంగా వచ్చిన ద్వితీయ, సప్తమీవిభక్తులకు పైనున్న ఉండిపదానికి లోపం బహుళంగా చెప్తున్నది. బహుళం అనడంచేత ఈ కార్యం ప్రవృత్తి, అప్రవృత్తి, విభాష, అన్యకార్యం అని నాలుగు విధాలుగా ప్రవర్తించవచ్చు. వాటిలో 'అప్రవృత్తిని' ప్రస్తుతవాక్యం వివరిస్తున్నది.

'అందు' అనేది సప్తమీవిభక్తి కాబట్టి సప్తమిమీద ఉండి లోపిస్తుం దంటే 'అందు' అనేసప్తమిమీద ఉండికి లోపం ప్రాప్తిస్తున్నది. అయితే సూత్రంలోనిబహుళపదంచేత సప్తమిలో అందుమీద మాత్రం ఉండికి లోపం రాదు. గహ్వరమున వరదవార, ఎక్కడన్ వచ్చియె ఇత్యాదిగా సప్తమ్యర్థంలో ఇతరవిభక్తులపై మాత్రమే ఉండి లోపిస్తుంది.

వనమందుండి వచ్చె – ఇక్కడ ఉండికి లోపం రాదు. అప్రవృత్తి. కాబట్టి వనమందు వచ్చె అని ఉండి లోపించినరూపం ఉండదు.

కాని 'నాయందు ధనముఁ గొనిపొమ్ము' ఇత్యాదిగా తిక్కనాదులప్రయోగాలలో అందుమీఁద కూడా ఉండి లోపించడం కనబడుతూనే ఉన్నది.

**78. బహువచనాంతము గాక యేకవచనాంత మైనచోఁ దెరువు లై దుండవలెను** (కార. 25)

కొన్నియెడల విధేయవిశేషణ మొండ బహువచనాంతం బయి విశేష్యంబులు పెక్కింటి కన్వయయోగ్యం బగు' అనే సూత్రంప్రకారం విధేయవిశేషణం బహువచనాంత మై ఒకటే ఉండి, అనేక మైనవిశేష్యాలతో ప్రత్యేకంగా అన్వయిస్తుంది.

ఇది దక్షిణాపథంబున కిది విదర్భాపురమున కిది కోసల కిం

దిది యుజ్జయినికిఁ దెరువులు మది నిన్నిటిలోన నరుగ మన కెద్ది యగున్

ఇక్కడ 'తెరువు' అనేవిధేయవిశేషణాన్ని ఏకవచనాంతంగా ప్రయోగిస్తే ఇది దక్షిణాపథమునకు తెరువు, ఇదియు విదర్భాపురమునకు తెరువు, ఇది కోసలకు తెరువు, ఇది యుజ్జయినికి తెరువు, మన కేది తెరువగు – అనే విధంగా 'తెరువు' శబ్దాలు అయిదు ఉండవలసి వస్తుంది. అని యీవాక్యం తాత్పర్యం.

**79. భూతకాలికాసమాపకక్రియయొక్క యికారమునకుఁ బ్రామాణికప్రయోగములందును గొన్నియెడల సంధి గనఁబడుచున్న దని యర్థము** (సంధి. 2)

చూ. ఇప్రత్యయాంతావ్యయంబునకు సంధియుఁ జూపట్టెడి. సూత్రవివరణం.

**80. యవలలవలె రేఫంబును బ్రయత్నభేదంబుచే ద్వివిధంబు గాన శబ్దశాసనాదులచేత నలఘురేఫము వర్ణాంతరముగాఁ బరిగణింపఁబడ దయ్యె** (సం. 1)

'ఆంధ్రభాషకు వర్ణంబు లేఁబదియైదు' అని సూత్రించిన ప్రౌఢవ్యాకరణం వర్ణమాలలో శకటరేఫను చూపలేదు. దానికి కారణాన్ని ఇలా వివరిస్తున్నది.

అప్పకవి మొద లయినవారు శకటరేఫను వర్ణమాలలో పరిగణించారు. 'యరలవలు లఘువులు నలఘువు లని ద్వివిధంబు లగు' - య-వ-ల- అనేవాటిలాగానే రేఫ కూడా లఘువు. అలఘువు అని రెండు విధాలు. ఈభేదం ఉచ్చారణలోని ప్రయత్నంభేదంవల్ల వచ్చిందే. స్థానకరణభేదం ఉంటేనే వర్ణాలను భిన్నంగా పరిగణించవలసిఉంది. అందువల్లనే దంత్యతాలవ్యచజలు వేరుగా పరిగణింపబడ్డాయి. లఘ్వలఘువులవిషయంలో స్థానకరణభేదం లేకపోవడంవల్ల ఇవి వేరేవర్ణాలు గావు. య-వ-ల- అనేవి గూడా లఘువులు అలఘువులు వేరుగా రెండు రెండు చొప్పున వర్ణమాలలో చెప్పలేదు. అలానే రేఫ గూడా. అందుకే చింతామణిలో నన్నయ కూడా 'షట్త్రింశ దత్ర' అని శకటరేఫను వర్ణమాలలో చేర్చలేదు.

(యవలలతో పోలికవల్ల శకటరేఫ చేరిస్తే యలవలు చేర్చా లని భావం. నన్నయ చేర్చలేదు. తాను గూడా శకటరేఫను వర్ణమాలలో చేర్చకపోవడం ప్రామాణికమె అని తాత్పర్యం.

**81. రామిసెట్టి సుబ్బిసెట్టి యిత్యాదులం దిత్వంబు నిత్యంబు** (సమా. 4)

'ఇటఁ బూర్వపదంబునత్వంబున కిత్వంబు బహుళంబుగా నగు' అనేసూత్రంలో బహుళం అనడంచేత ఆకార్యం, ప్రవృత్తి, అప్రవృత్తి, విభాష, అన్యకార్యం అని నాలుగు విధాలుగా ప్రవర్తిస్తుంది. అందులో ప్రవృత్తిని ఈవాక్యం వివరిస్తున్నది.

కర్మధారయసమాసంలో బిరుదాద్యుత్తరపదం పరంగా ఉండగా పూర్వంలోనిద్వ్యక్షరాదాంత స్త్రీ పుంసంజ్ఞావాచకశబ్దానికి బహుళంగా వచ్చే ఇత్వం - రామిసెట్టి, సుబ్బిసెట్టి మొ॥చోట్ల నిత్యంగా వస్తుంది.

రాముఁడు + సెట్టి. విభక్తిలోపాదులతో రామ + సెట్టి అని కాగా "కర్మధారయంబు బిరుదాద్యుత్తరపదం బయ్యె నేని" అనేసూత్రంప్రకారం రావలసినదీర్ఘాన్ని బాధించి 'ఇటఁ బూర్వపదంబు' అనేసూత్రంచేత ఇత్వం నిత్యంగా వచ్చి రామిసెట్టి. ఇలాగే సుబ్బఁడు + సెట్టి సుబ్బిసెట్టి. నిత్యంగా రావటంవల్ల రామసెట్టి, సుబ్బసెట్టి వంటి ఇత్వం రానిరూపాలు ఉండవు.

**82. వర్గువునందలివువర్ణకం బొండె లోపించు** (శబ్ద 25)

వర్గువు అనేశబ్దంలోనివువర్ణకం ఒకపక్షంలో లోపిస్తుంది. అంటే మరొకపక్షంలో లోపించదు. వికల్పంగా లోపిస్తుంది అని తాత్పర్యం.

వర్గ అనేశబ్దానికి ప్రథమైకవచనంలో 'అమహన్నపుంసకములకు' అని ప్రాప్తిస్తున్న మువర్ణకాన్ని బాధించి 'అర్ఘాదుల కడయచ్చున కుత్వంబును మీఁద వువర్ణకంబును వైకల్పికంబుగా నగు' అనేసూత్రంచేత ఉత్వము (వర్గు), పైన వువర్ణకము వచ్చి 'వర్గువు' అని అవుతుంది. ఈశబ్దంలోని 'వు' ప్రత్యయానికి ఈవివరణ ననుసరించి లోపం రాగా 'వర్గు'. ఒండె అనడంచేత లోపం రానిపక్షంలో 'వర్గువు'.

వైకల్పికం కాబట్టి ఉత్వవువర్ణకాలే రాకపోతే 'అమహన్నపుంసకముల కదంతములకు మువర్ణకం బగు' అని మువర్ణకం వచ్చి వర్గము.

'వువర్ణకంబు' అనడంచేత ఈలోపం ప్రథమైకవచనంలోనే. వర్గులు - వర్గును. ఇత్యాదిగా ఇతరవిభక్తి స్థలాలు 'వువర్ణకేతర విభక్తిపరం బగునపుదు' అనేబాలవ్యాకరణసూత్రంచేత వుగాగమం రాకుండడంచేత ఏర్పడినరూపాలుగా గ్రహించాలి. వువర్ణం లోపించినవి కాదు.

దీన్ని రాహుబాహుశబ్దాలలో కలిపి తరువాతసూత్రంలో చెప్తే ఇబ్బంది ఉందా ? విచారించాలి.

### 83. వలయుచో నీద్రుతంబునందలియుత్వంబునకు లోపం బగు (సం. 7)

'నకారం బసాధారణంబు ద్రుతంబు' అని సూత్రించి ప్రౌఢవ్యాకరణం ప్రత్యయం గానీ, ఆగమం గానీ, అవ్యయం గానీ అయిననకారం ఉత్వంతో కూడి 'ను' అనేరూపంతో ఉన్నవర్ణం ద్రుతం అని వివరించింది.

ద్రుత మయిన ఆ నువర్ణంలోని ఉకారానికి అవసర మయితే లోపం వస్తుం దని ఈవివరణం చెప్తున్నది. 'వలయుచో' అంటే ఛందస్సులో గల గణాలు మొద లైనవాటిని అనుసరించి అని గ్రహించాలి. ఉత్వానికి లోపం వస్తే గణభంగం అయ్యేపక్షంలో లోపం రాదు. గణభంగం కాకపోతే లోపం వస్తుంది. ఇలా అవకాశాన్నిబట్టి స్వరలోపం గ్రహించాలి.

అతిశయముగ బుద్ధిమంతుఁ డగు బుధసేవన్' ఇక్కడ ద్రుతంలో ఉత్వం లోపించకపోతే చివరివర్ణం లఘు వై గణ భంగ మవుతుంది. కాబట్టి ఇటువంటిచోట్ల ఉత్వం నిత్యంగా లోపిస్తుంది.

ఇలాగే వైజయంతీనవాంశుకవ్యాజమునను - ఇక్కడ ఉత్వం లోపిస్తే గణభంగం. కాబట్టి ఉత్వం అసలు లోపించదు.

అవసానంలో ఈస్వరలోపం వికల్పంగా రావడం ఛందస్సులో గణానుగుణంగా కుదరదు.

అవసానంలో ద్రుతస్వరలోపాన్ని బాలవ్యాకరణం చెప్పింది. చింతామణి ద్రుతలోపం మాత్రమే చెప్పింది. అందుకే యీవ్యాకర్త స్వరలోపాన్ని వివరించిఉండవచ్చు.

### 84. వ్యతిరేకార్థక భూతకాలికాసమాపకక్రియ ద్రుతకృతికము కా దని యర్థము (సం. 8)

చూ. అకప్రత్యయాంతావ్యయంబు కళయ - సూత్రవివరణం.

### 85. శబ్దశాసనుడు తచ్ఛబ్దాతః అని సూత్రించిన సూత్రమునందలితచ్ఛబ్ద మంతప్రభృతులకు నుపలక్షణ మని తెలియునది (శబ్ద51)

'ఈ ఏ ఒక శబ్దములకంటెంబరంబయినయంతశబ్దమునకారంబునకు లోపం బగు. . .' అని ప్రౌఢవ్యాకర్త అంత శబ్దం మొదటిఅకారానికి లోపం చెప్పాడు. ఈప్రక్రియ నన్నయకు కూడా సమ్మతమే అని నిరూపించడానికే ఈవివరణం చేశాడు.

చింతామణి 'శబ్దాత్తచ్ఛబ్దాతః' అనేసూత్రంచేత తచ్ఛబ్ద + అతః అని తచ్ఛబ్దం (అది, అవి) లోని అకారానికి లోపం చెప్పింది. నీ + అది - నీది మొ॥. ఆ సూత్రంలోని తచ్ఛబ్దం తద్ వ్యాఖ్యాతలు, సూరి పేర్కొన్న అది - అవి శబ్దాలనే కాక అంత మొద లైన వాటిని గూడా బోధిస్తుంది. కాబట్టి 'అంత' లో కూడా అకారం లోపిస్తుంది అని ఈ వివరణం తాత్పర్యం.

కాని యిందులో ఇబ్బందులు ఉన్నాయి.

1. అంత 'ప్రభృతులు' అని వివరణంలో చెప్పిన ప్రభృతులను ఈవ్యాకర్త కూడా వివరించలేదు.

2. చింతామణివ్యాఖ్యాతలు ఎవరూ అంతలో అకారలోపం వ్యాఖ్యానించలేదు.

3. ఈలోపం ఈ, ఏ, ఒక లపై అని ప్రౌఢవ్యాకర్త చెప్పాడు. చింతామణిలో ఆనియమం లేదు. కాబట్టి ఇతరశబ్దాలలో వలె ఈలోపాన్ని సామాన్యంగా చేసుకోవలసివస్తుంది. నీ + అంత = నీ(ం)త - నా(ం)త మొ॥ అపరూపాలు గావాలి చింతామణిలో.

4. అంతశబ్దం తదర్థకం అనడానికి చింతామణిలో ఆధారం లేదు. ప్రౌఢ వ్యాకర్త గూడా 'ఆ' శబ్దం నుండి సాధించలేదు.

5. ఆశబ్దంనుంచి 'అంత' ఏర్పడినట్లే 'ఈ' శబ్దంనుంచి ఇంత, ఏశబ్దంనుంచి ఎంత - ఆక్రమంలోనే సాధించుకోవడం న్యాయం. ఈ + అంత అని ఇక్కడ మళ్ళీ అంత శబ్దం తీసుకోవడం సరిగా లేదు.

**86. శబ్దశాసనుఁడు ద్రుతాఖ్యోనః అని కేవలనకారగ్రహణము చేయుట ద్రుతమునకు స్థిరత్వ సిద్ధికై యని తెలియవలయు** (సం. 7)

నన్నయ చింతామణిలో 'ద్రుతాఖ్యో నః' అనే సూత్రం చేత 'నకారంబు ద్రుతంబు' అని చెప్పాడు. దాన్నిబట్టి వ్యాఖ్యాతలు పొల్లునకారమే చింతామణిమతంలో ద్రుతం అని వివరించారు. 'నకారం బసాధారణంబు ద్రుతంబు' అని సూత్రించిన ప్రౌఢవ్యాకర్త (ప్రత్యయాగమావ్యయాత్మకమైన) నువర్ణం ద్రుతం అన్నాడు.

ఇది పై నన్నయ అభిప్రాయానికి విరుద్ధం గదా అని శంకించుకొని ఈవివరణం చేశాడు.

చింతామణిమతంలో గూడా 'ను' వర్ణమే ద్రుతం. అటువంటప్పుడు ద్రుతాఖ్యోనః అని నకారం ద్రుతం అనడం ఎందుకు? 'ద్రుతాఖ్యో నుః' అని నువర్ణం ద్రుతం అని చెప్పాలి గదా ! అంటే ద్రుతానికి స్థిరత్వం సిద్ధించడంకోసం 'న' అన్నాడు. (అంతే కాని పొల్లు నకారమే ద్రుతం అని చెప్పడానికి కాదు).

వనమును జూచెద, రాముని గొలుతు, అదియునున్ గాక మొదలైనస్థలాలను పరిశీలిస్తే ద్రుతము, 'ను - ని -న్' అని మూడు ఆకారాలతో ఉండటం గుర్తించవచ్చు. బాలవ్యాకరణం నువర్ణంలో ఉన్న ఉత్వానికి ఇత్వం చెప్పి 'ని' వర్ణాన్నీ, ను(ని)లో స్వరలోపంచేత 'న్' అనేదాన్నీ సాధించింది. 'ఏకదేశవికృత మనన్యవత్' అనేన్యాయా న్ననుసరించి ద్రుతమైన నువర్ణం వికృతులైన -న్ ని అనేవి కూడా ద్రుతసంజ్ఞను కలిగి ఉంటాయి. కాబట్టి బాలవ్యాకరణమార్గంలో ద్రుతం నువర్ణం అన్నా పెద్దగా ఇబ్బందిలేదు. అదియునున్ గాక వంటి స్థలాలు కొన్నింట్లో భేదం ఉన్నది.

కాని చింతామణిలో నువర్ణంలాగానే నివర్ణం గూడా ప్రత్యేకంగా విధింపబడింది. 'ఉత్వయుతౌ వనకారౌ' అన్నప్పుడు ను వర్ణం విధింపబడింది. 'నిరమో మహతా' మ్మన్నప్పుడు ని వర్ణం చెప్పబడింది. 'నుమ్సోచ్చైతః' ఇత్యాదుల్లో నకారపుపొల్లే చేస్తారు. కాగా వీటన్నింటికీ ద్రుతసంజ్ఞ కలగాలంటే 'ను – ని – న్' అనేవాటికి వేర్వేరుగా ద్రుతత్వాన్ని విధించవలసి ఉంటుంది. ఆ స్థితిలో ఈమూడింట్లో స్థిరంగా ఉన్నది 'న' కారం ఒక్కటే. 'ఆ' నకారాన్ని గ్రహించి 'ద్రుతోఖ్యో నః' అని చింతామణి చెప్పింది.

అంతే తప్ప చింతామణివ్యాఖ్యాతలు చెప్పినట్లు నకారపు పొల్లే ద్రుతం అని చింతామణి అభిప్రాయం కా దని చెప్పడం ప్రౌఢవ్యాకర్త యీవివరణం తాత్పర్యం.

ఇక్కడి స్థిరశబ్దం పరుషసరళేతరం అనేఅర్థం కలిగినసంజ్ఞ గాదు.

## 87. శ్లేషయందు జకార మొక్కటియ యొకయర్థమున దంత్యమును వేఱొకయర్థమునఁ దాలవ్యము నయ్యెడు నని యర్థము (సం. 5)

చూ. ఒకానొకచో జకారం బుభయంబు నగు – సూత్రవివరణం.

## 88. షష్ఠీ విశేషణానా మ్మను బహువచనస్వారస్య మిట్టిప్రయోగముల కుత్పాదకముగా నున్నది (కార. 22)

'కొన్నియెడల విశేషణంబు ద్వితీయాదులకుఁ బ్రథమ చూపట్టెడి' అని ప్రౌఢవ్యాకర్త విశేషణం ద్వితీయాదివిభక్తులకు ప్రథమ విధించాడు. ఈలక్షణం నన్నయకు సమ్మతం కాబట్టి ప్రామాణికం అని నిరూపించడానికి ఈవివరణం చేశాడు.

చింతామణి 'షష్ఠీ విశేషణానాం ప్రథమా స్యాత్' అని విశేషణముల షష్ఠికి ప్రథమ విధించింది. ఇలా నన్నయ షష్ఠికి మాత్రమే చెప్పగా ప్రౌఢవ్యాకర్త ద్వితీయాదులకు చెప్పడం నన్నయమతానికి విరుద్ధం కదా అని సందేహం. కాని షష్ఠికి ఒక్క దానికి మాత్రమే (ప్రథమ) రావడం చింతామణి ఉద్దేశించి ఉంటే 'విశేషణస్య' అని ఏకవచనంలో చెప్తే చాలు. 'విశేషణానాం' అని బహువచనంలో చెప్పడం దేనికి?

'కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపు లగు' అన్నపుడు బహువచనంవల్ల కర్మధారయేతరసమాసంలో అంటే వ్యధికరణంసమాసంలోనూ పుంపులు రావడం, సింగపుంగొదమ ఇత్యాదుల్లో స్పష్టం.

అలాగే ఇక్కడ 'షష్ఠీ విశేషణానాం' అన్నప్పటి బహువచనంస్వారస్యంచేత షష్ఠ్యంతా లయినవిశేషణాలకే కాక, ఇతర విభక్త్యంతవిశేషణాలకు కూడా ప్రథమ వస్తుంది అనేఅర్థం కలుగుతున్నది. దానివల్ల విశేషణంబు ద్వితీయాదులకు గూడ అరుదుగా చింతామణిసూత్రంచేత ప్రథమ వస్తుంది. ఘనుల్ – దైత్యపతులను, తల్లి ద్రౌపదితోడ – మొదలైన షష్ఠికి భిన్నమైన విశేషణవిభక్తికి ప్రథమ వచ్చినప్రయోగాలకు 'విశేషణానాం' అన్నప్పటి బహువచనం సాధకం అని తాత్పర్యం.

కాగా ఈలక్షణలక్ష్యాలు చింతామణిసమ్మతాలు.

**89. సముచ్చయగ్రహణము కూర్చి జ్ఞాపనార్థము** (కార. 2)

'ఉద్దేశార్థమునందు ద్వితీయకు గుఱిచియు ననుప్రయుక్తం బగు' అనేసూత్రం కర్మ కయిన ద్వితీయపై ఉద్దేశార్థంలో 'గుఱిచి' అనుప్రయుక్తం అవుతుం దని చెప్పింది 'మమ్ముగుఱించి' మొ. 'గుఱించియు' అన్నప్పటి సముచ్చయార్థక నుశబ్దం ప్రయోగించడంలోని ప్రయోజనాన్ని వ్యాకర్త యీవాక్యంతో వివరిస్తున్నాడు.

గుఱిచి కూడా వస్తుం దనడంవల్ల గుఱిచి ఒక్కటి మాత్రమే కాక (ప్రసిద్ధ మైన) కూర్చి అనేది కూడా అనుప్రయుక్త మవుతుం దని వివరించాడు. వర్షముం గూర్చి జపము మొ.

'కర్మప్రవచనీయకే కూర్చిః' అని చింతామణి కూర్చిని చెప్పిఉండడంచేత అది ప్రసిద్ధం గాబట్టి ప్రౌఢవ్యాకర్త విశేషమయిన 'గుఱిచి'ని ఉచ్చరించి కూర్చిని నుశబ్దంచేత జ్ఞాపకం చేశాడని ఊహించవచ్చు. అయితే చింతామణిలో కూర్చి ద్వితీయావిభక్తి. ఇక్కడ కూర్చి మొ. ద్వితీయకుపైన అనుప్రయుక్తాలు.

'కూర్చి' ప్రత్యేకంగా అన్వయించేపదం. కాబట్టి దాన్ని అనుప్రయుక్తం చేయనవసరం లేదు. కాని యిక్కడ గుఱించి గుఱియించి అనేవి కూడా కనబడుతున్నాయి. వాటిని గూడ ఈనుశబ్దం సంగ్రహించగలదు లేదా గుఱిచి ప్రభృతలని స్పష్టంగా చెప్పవచ్చు.

**90. సరులు లేని దృక్పంజనశాబకములను అని యొక్కచోఁ బ్రయోగము కనఁబడుచున్నది.** (శబ్ద. 32)

చూ. అది శబ్దాలంకార - 5 వాక్యవివరణం.

**91. సాధారణంబుగ ననుటచే ఎనమండ్రు తొమ్మండ్రు ఇత్యాదులందు రా దని యెఱుంగునది.** (శబ్ద. 91)

'రురవర్ణకంబులు పరంబు లగునపుడు సాధారణంబుగ సంఖ్యావాచకంబులకు గువర్ణంబు పూర్వాగమం బగు' అనే సూత్రంలోని 'సాధారణంబుగ' అనేదళానికి ప్రయోజనాన్ని ఈవాక్యం వివరిస్తున్నది.

బహువచనం (రురల) పరంగా ఉండగా సంఖ్యావాచకాలకు చివర సాధారణంగా 'గు' అనేవర్ణం ఆగమ మవుతుంది అని సూత్రం చెప్తున్నది. సాధారణంగా అనడంవల్ల అసాధారణంగా అంటే కొన్ని విశేషస్థలాల్లో అరుదుగా 'గు' ఆగమం రాకపోవడం కూడా ఉన్న దనేఅర్థం సిద్ధిస్తున్నది.

ఒక+రు - ఇక్కడ గుగామం లేదు. ఒకరు.

ఇలాగే ఎనమండ్రు, (ఎనిమిది+రు), తొమ్మండ్రు (తొమ్మిది+రు) మొ. వాటిల్లో గువర్ణాగమం రాదు (ఎనమండుగురు తొమ్మండుగురు అని వ్యవహారంలో ఉంది) పదుగురు - పదురు, పదుండ్రు-పదుగుండ్రు-అన్నచోట గువర్ణాగమం వికల్పంగా వస్తున్నది.

**92. స్వార్థంబునం గప్రత్యయంబురా - ఎవ్వతుక** (శబ్ద. 70)

'తవర్ణకంబు స్త్ర్యర్థకం బగు' అని స్త్రీని బోధించేసందర్భంలో వచ్చిన తప్రత్యయం చివర గలిగిన' అన్యఏకార్థక (ఒక) యత్కిమర్థక (ఏ) శబ్దాలకు స్వార్థంలో క అనేప్రత్యయం వస్తుంది. స్వార్థం అంటే ఇక్కడ ప్రాతిపదికార్థం. కాబట్టి కప్రత్యయం వచ్చినా రాకున్నా అర్థం ఒకటే.

'ఉకవర్ణకంబు చిఱుతాదులకు స్వార్థంబునం దగు' అని సూరి ప్రత్యయం 'ఉక' అని చెప్పాడు. చింతామణి 'నామ్నః కవర్ణక స్స్యాత్ స్వార్థే స్యా దుత్వ మపి పరే తస్మిన్' అని ప్రత్యయాన్ని 'క'– అని చెప్పి ముందు ఉత్వం చెప్పింది. ప్రౌఢవ్యాకర్త చింతామణి ననుసరించి ప్రత్యయాన్ని కవర్ణకంగా చెప్పాడు. కాగా స్వార్థంలో కప్రత్యయం, ముందు ఉత్వం వస్తుం దని గ్రహించాలి. ఎవ్వత+క – ఎవ్వతుక– ఒక్కర్తి+క – ఒక్కర్తుక – మొ॥

**93. హల్లు పరం బగుచో ద్విత్వంబునకు లోపంబు వైకల్పికంబు.** (సంధి. 4)

'చిట్టడవిఁ జిట్టి' అనేసూత్రం చిట్టడవి, చిట్టెలుక మొద లైనసమాసాల్లో పూర్వపదం 'చిట్టి' అని పేర్కొంది. ప్రసంగవశంగా చిట్టిశబ్దాన్నిగురించి వేరే విషయం ఈవాక్యంలో వ్యాకర్త ప్రస్తావిస్తున్నాడు.

హలాదిశబ్దంతో సమాసం జరిగినపుడు చిట్టిశబ్దానికి హల్లు పరంగా ఉంటుంది. అప్పుడు చిట్టిశబ్దంలో ద్విత్వానికి (ఒక టకారానికి) వికల్పంగా లోపం వస్తుంది. చిట్టితాళము. (ద్విత్వం లోపిస్తే) చిటితాళము – (లోపించకుంటే) చిట్టితాళము. కాగా అచ్చు పరంగా ఉంటే లోపం రాదు. చిట్టడవి. చిటడవి అని ఉండదు.

'అక్కటాదులజడ్డకు లోపంబు విభాష నగు' అనేసూత్రంచేత ఈద్విత్వలోపం బాలవ్యాకరణం సాధించింది. అక్కటాదుల్లో సూరి చిట్టిశబ్దాన్ని చూపాడు కూడా. అచ్చు పరంగా ఉండగా లోపం లేకపోవడం విషయం "జడ్డక్కరంబుతోఁ బదాది స్వరంబు గూడుచో జడ్డకు లోపంబు లేదు' అనే సూత్రం చేత బాలవ్యాకరణం చెప్పే ఉంది. దీనివల్ల సంధి ప్రసంగం లేనపుడు గూడా ద్విత్వం లోపిస్తుంది. చిటి.

ఈ వివరణంలో వ్యాకర్త ప్రస్తావించిన అంశం పూర్వోక్తమే కాబట్టి దీనికి ప్రయోజనం స్పష్టతే అనుకోవాలి.

**డాక్టర్. అంబడిపూడి నాగభూషణం**

**పాఠం - 10**

# ప్రౌఢవ్యాకరణం
# రూపప్రక్రియావివరణం
# సంజ్ఞాపరిచ్ఛేదం

**1. అంటితి నమ శ్శివాయ పాపాత్మురాలి:** (సం.15) 'అంటితి పాపాత్మురాలి' అనేతెలుగువాక్యం మధ్యలో 'నమ శ్శివాయ' అనేసంస్కృతవాక్యం ప్రయోగింపబడింది. 'న పదా న్యవ్యయ సుప్ తిఙ్ క్త్వా తుమునామ్, అనుకృతే కస్తి వాక్యం తు' అనే చింతామణిలక్షణం ప్రకారం అనుకరణం లేకుండా సంస్కృతవాక్యాన్ని తెలుగులో ప్రయోగించు కోవడానికి వీలు లేదు. 'ఒకానొకచో ననుకరణవిరహితంబుగ సంస్కృతవాక్యంబు గానంబడియెడి' అనేసూత్రంప్రకారం పైప్రయోగం సాధువు అవుతున్నది.

**2. అకారము:** (సం.2) 'అ' అనేవర్ణానికి ఉచ్చారణంలో 'నిర్దేశనిధా నోచ్చారణంబులం దఱచుగ అవర్ణాదులు కారప్రత్యయాంతములును రవర్ణ మిఫప్రత్యయాంతము నగు' అనేసూత్రంచేత 'కార' ప్రత్యయం వచ్చి 'అకార' అని అవుతుంది. తద్ధితప్రత్యయాంత మయిన ఈప్రాతిపదిక అదంత మయిన అమహద్వాచకం కాబట్టి ప్రథమావిభక్తి ఏకవచనవివక్షలో 'అమహన్నపుంసకముల కదంతములకు మువర్ణకం బగు' అనేసూత్రంచేత ముప్రత్యయం వచ్చి 'అకారము' అని అవుతుంది.

**3. అకారమునకు ఉకారము వచ్చును: ఆకు ఊ వచ్చును :** (సం.3) 'అ' అనేవర్ణానికి 'ఉ' అనేవర్ణం వస్తుంది. అని దీని కర్థం. ఇందులో 'అ' నిర్దేశం. 'ఉ' విధానం. ఈరెండింటికి 'ఒకచో హ్రస్వంబు దీర్ఘం బగు' అనేసూత్రంచేత దీర్ఘం వచ్చి ఆకు ఊ వచ్చును. దీర్ఘం రాకపోతే 'నిర్దేశవిధానోచ్చారణంబులం దఱచుగ అవర్ణాదులు కారప్రత్యయాంతములును, రవర్ణ మిఫప్రత్యయాంతము నగు' అనేసూత్రంచేత కారప్రత్యయం వచ్చి 'అకారమునకు ఉకారము వచ్చును' అని అవుతుంది.

**4. కఱకంఠుడు:** (సం.9) కఱ అయిన కంఠము కలవాడు అనేఅర్థంలో కఱ అనే అచ్చతెలుగుశబ్దానికి కంఠము అనేసంస్కృతసమశబ్దానికి బహువ్రీహి సమాసం ఏర్పడింది. తెలుగులో మిశ్రబహువ్రీహి 'స్త్రీసమఘటితంబ...బహువ్రీహి' అనేలక్షణానికి విరుద్ధం.కాబట్టి 'లక్షణవిరుద్ధం బగుభాష గ్రామ్యంబు' అనేసూత్రంప్రకారం గ్రామ్యం. అయినా నన్నయ ప్రయోగించాడు. కాబట్టి 'ఆర్యవ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు' అనేసూత్రంచేత గ్రహింపదగినదే అని చిన్నయసూరి పేర్కొన్నాడు.

'తద్భవములందును నలఘురేఫము గలదు' అని ప్రౌఢవ్యాకర్త 'గరళకంఠ' అనేసంస్కృతసమాసంనుండి 'కఱకంఠ' అనేపదం మొత్తం తద్భవంగా ఏర్పడిం దని (ఆతద్భవంలో శకటరేఫ ఉన్న దనీ) చెప్పాడు. అప్పుడు ప్రకృతి అయిన గరళకంఠ శబ్దంవలె తద్భవ మైన 'కఱకంఠ' శబ్దం బహువ్రీహి అవుతుంది. ఇక్కడ కఱ – కంఠము అనేవాటికి తెలుగులో సమాసం చేయడం అనే విధానమే లేదు. కాబట్టి ఇది మిశ్రబహువ్రీహి కాదు, లక్షణవిరుద్ధమూ కాదు, కాగా కఱకంఠుడు గ్రామ్యమే కాదు. అని ప్రౌఢవ్యాకర్తమతం.

**5. కవిలకన్నులు (కవిలగడ్డము-కవిలజడలు):** (సం.13) ఈశబ్దాలను సూరి కపిలక న్నులు ఇత్యాదిగా కపిలశబ్దంతో (పకారమధ్యంగా)గ్రహించాడు. అపుడు కపిల అనేసంస్కృతశబ్దానికి కన్నులు, (గడ్డము, జడలు) అనేఅచ్చతెలుగుశబ్దంతో

సమాస మవుతుంది. అటువంటిసమాసం లక్షణానికి విరుద్ధం. కాబట్టి గ్రామ్యం. అయినా నన్నయ ప్రయోగించాడు. కాబట్టి 'ఆర్యవ్యవహారంబుల దృష్టంబు గ్రామ్యంబు' అని గ్రహించదగినదే. అని సూరిమతం.

ప్రౌఢవ్యాకర్త ఈశబ్దాలను కవిలకన్నులు ఇత్యాదిగా కవిలశబ్దంతో (వకారమధ్యం) గ్రహించాడు. 'కపిలశబ్దభవంబు కవిలశబ్దం బొందు కానంబడెడి' అనేసూత్రంప్రకారం కపిల శబ్దంనుండి పుట్టి తద్భవ మయినఅచ్చతెలుగుకవిలశబ్దానికి, కన్నులు శబ్దంతో సమాస మయింది. ఇవి రెండు అచ్చతెలుగుశబ్దాలే కాబట్టి ఈసమాసం లక్షణబద్ధమే. కాబట్టి గ్రామ్యం కాదు. అని ప్రౌఢవ్యాకర్తమతం.

**6. కాకు గా వచ్చును:**(సం. 3) చూ. ఆకు ఊ వచ్చును.

**7. కాదన కిట్టి:**(సం. 8) (కాదు) అనక+ఇట్టి. ఇక్కడ అను ధాతువుపై వ్యతిరేకక్త్వార్థంలో 'క'ప్రత్యయమూ, ముందు అత్వమూ కలిసి అక (ప్రత్యయం) రాగా 'అనక' అని అయింది. కాబట్టి అనక అనేది అకప్రత్యయాంతం. 'అకప్రత్యయాంతావ్యయంబు కళయ' అనేసూత్రం చేత ఇది కళ. అనక+ఇట్టి అనేచోట 'అత్తునకు సంధి బహుళంబుగా నగు' అనేసూత్రంచేత సంధి జరిగి 'అన కిట్టి' అయింది.

ద్రుతప్రకృతికం అయితే అనకన్+ఇట్టి అని ఉండాలి. 'అత్తునకు- రావలసినసంధి 'ఇకాదులకు దప్ప ద్రుతప్రకృతికములకు సంధి లేదు' అనేసూత్రంచేత రాదు. అపుడు అనక నిట్టి అని ఉండాలి. 'అన కిట్టి' అనేవిధంగా సంధి జరగడాన్నిబట్టి అనక ద్రుతప్రకృతికం కాదు. అకప్రత్యయాంతావ్యయం కళ అనడానికి 'అన కిట్టి' అనేచోటి సంధి ప్రమాణం అని తాత్పర్యం.

**8. కారము:** (సం. 10) 'సంస్కృతప్రాకృతతుల్యం బగుభాష తత్సమంబు' అనిసూత్రించి, సూరి (కటుః)కారో-కారము అని కారము అనేశబ్దం కారో అనేప్రాకృతానికి తుల్య మనీ, తత్సమ మనీ పేర్కొన్నాడు. (అయినా ప్రాకృతసమం కాబట్టి ఆచ్ఛికమే)

'కారము క్షారశబ్దభవము' అని సూత్రించి ప్రౌఢవ్యాకర్త 'క్షార' అనేసంస్కృతశబ్దంనుంచి పుట్టిం దన్నాడు. తెలుగు 'కారము' తద్భవం (సంస్కృతభవం) అని ప్రౌఢవ్యాకర్తమతం.

క్షారశబ్దానికి తెలుగులోని 'కారము' అనేఅర్థం లేకపోవడంచేత రూపసామ్యమే కాని, అర్థసామ్యం లేదు. అవి రెండూ ఉన్న తత్సమం (ప్రాకృతసమం) అనేసూరిమతమే యుక్తం.

**9. కోట:** (సం. 11) 'త్రిలింగదేశవ్యవహారసిద్ధం బగుభాష దేశ్యంబు' అని సూత్రించి సూరి 'కోట' శబ్దాన్ని ఉదాహరణల్లో చూపాడు. కాబట్టి కోటశబ్దం దేశ్యం అని సూరిమతం.

'కోటపేటలు వైకృతములు' అని ప్రౌఢవ్యాకర్త కోటశబ్దం తద్భవం అన్నాడు. 'కోట్టార ఘట్ట హట్టా శ్చ' అనే నిఘంటువునుబట్టి సంస్కృతంలో 'కోట్ట' అనేశబ్దం ఉంది. దానినుండి తద్భవంగా తెలుగులో 'కోట' శబ్దం పుట్టింది.

సంస్కృతంలోనే 'కోట' అనేశబ్దం కూడా ఉంది. ఒకవేళ దానినుంచి కలిగినా తెలుగులోని కోట తద్భవమే. సంస్కృతం కోటతో సమంగా ఉంది కదా అని తెలుగు కోట తత్సమం అనుకోగూడదు. సంస్కృతంలోని 'కుండ' అనేశబ్దం ఏమార్పులు లేకుండా సమంగా ఉన్నా తెలుగులో 'కుండ' తద్భవ మయింది. అలాగే కోట కూడా. కోట్ట లేదా కోట అనే సంస్కృతశబ్దంనుంచి పుట్టిం దనీ, తెలుగులో కోట తద్భవమే కాని సూరి చెప్పినట్లు దేశ్యం కా దనీ ప్రౌఢవ్యాకర్తమతం.

**10.జయ పూతనాఘాత (జయ నారాయణ, జయ దైత్యదమన):**(సం.16) జయ అనేది మధ్యమపురుష ఏకవచనాంత మయినసంస్కృతక్రియాపదం. పూతనాఘాత అనేది సంబోధనాంత మైనతెలుగు(తత్సమ)పదం.'న పదా న్యవ్యయ సుప్ తిఙ్ క్త్వా తుమునామ్, అనుకృతే కస్తి వాక్యం తు' అనేచింతామణిలక్షణంప్రకారం సంస్కృతపదం అనుకరణం లేకుండా తెలుగులో ప్రయోగించుకోడానికి వీలు లేదు. 'జయపదం బనుకరణవిరహితంబ తఱచుగ నగు'. అనే ప్రౌఢవ్యాకరణసూత్రంప్రకారం 'జయ' అనేసంస్కృతపదం అనుకరణం లేకుండానే తెలుగులో ప్రయోగించడం సాధువు అవుతున్నది.

**11.పాండురాజయశము:**(సం.5) 'ఒకానొకచో జకారం బుభయంబు నగు' అనేసూత్రంప్రకారం 'పాండురాజయశము' అనేశ్లేషస్థలంలోనిజకారం, దంత్యమూ, తాలవ్యమూ రెండూ అయిం దని ప్రౌఢవ్యాకరణమతం.

పాండురాజ! (యశము) అనేవిధంగా భారతార్థంలో 'రాజ'శబ్దంలోనిజకారం దంత్యం. 'మఱియు రాజుశబ్దం బొక్కటి దంత్యయుక్తంబు గానంబడియెడి' అని బాలవ్యాకరణం చెప్పింది. కాబట్టి (పాండు) రాజ శబ్దంలో జకారం దంత్యం.

పాండుర – అజయశము అనేవిధంగా రామాయణార్థంలో 'అజ' శబ్దంలోనిజకారం తాలవ్యం. (సంస్కృతంలో దంత్యచజలు లేవు.) భారతార్థంలో దంత్యమూ, రామాయణా ర్థంలో తాలవ్యమూ రెండు విధాలు అయింది. కాబట్టి ఈశ్లేషస్థలంలోనిజకారం ఉభయం అని ప్రౌఢవ్యాకర్తమతం.(రాజు అని ఉదంతంగా ఉన్నపుడే దంత్యం కాబట్టి పాండురాజ లో భారతార్థంలో కూడా తాలవ్యమే. ఉభయం కాదు.)

**12.పేట:**(సం.11) 'త్రిలింగదేశవ్యవహారసిద్ధం బగుభాష దేశ్యంబు' అని సూత్రించి సూరి 'పేట' అనేశబ్దాన్ని ఉదాహరణల్లో ఇచ్చాడు. కాబట్టి పేటశబ్దం దేశ్యం అని సూరిమతం.

'కోటపేఁటలు వైకృతములు' అని ప్రౌఢవ్యాకర్త పేఁట శబ్దం తద్భవం అన్నాడు.'పింఠా విటజనాశ్రయః' అనే నిఘంటువునుబట్టి సంస్కృతంలో పింఠాశబ్దం ఉంది. దానినుంచి తద్భవంగా తెలుగులో పేఁటశబ్దం పుట్టింది.

పింఠ అంటే విటు లుండేచోటు. తెలుగులో పేఁట అంటే సామాన్యజనావాసం అని అర్థం మారింది. ఇలా ప్రకృతిశబ్దార్థం వికృతిలో మారడం అక్కడక్కడా ఉంది. కాబట్టి ఇది తద్భవమే అని ప్రౌఢవ్యాకర్తమతం.

సూరి ఉదాహరించిన 'పేట' శబ్దంలో అరసున్న లేదు. (పింఠలో నిండుసున్న పేఁటలో అరసున్న అయింది.) కాబట్టి బిందువు లేని పేట సూరి చెప్పినట్లు దేశ్యం, అరసున్న ఉన్న పేఁటశబ్దం ప్రౌఢవ్యాకర్త చెప్పినట్లు తద్భవం.

**13. ప్రాణగొడ్డము:**(సం.12) ప్రాణ అనే కేవలసంస్కృతశబ్దానికి, గొడ్డము అనేవికృతిశబ్దంతో సమాసం చేయడంవల్ల ప్రాణగొడ్డము అనేశబ్దం ఏర్పడింది. కాని ఇలా సమాసం చేయడం 'కేవలసంస్కృతశబ్దంబు వికృతిశబ్దంబుతోడ సమసింపదు' అనే లక్షణానికి విరుద్ధం. కాబట్టి 'లక్షణవిరుద్ధం బగుభాష గ్రామ్యంబు' అనేసూత్రంచేత గ్రామ్యం. అయినా తిక్కనమహాకవి ప్రయోగించడంచేత 'ఆర్యవ్యవహారంబులదృష్టంబు గ్రాహ్యంబు' అనేసూత్రంచేత గ్రహింపదగినది అని సూరి పేర్కొన్నాడు.

'ప్రాణగొడ్డ మగ్రామ్యంబు నాఁ దగు' అనేసూత్రంచేత 'ప్రాణకుట్టక' అనేసంస్కృత శబ్దంనుంచి తద్భవంగా ప్రాణగొడ్డము ఏర్పడిం దనీ, ఇక్కడ తెలుగులో సమాసం చేయడం అనేప్రక్రియే లేదు, కాబట్టి ఇది గ్రామ్యమే కా దనీ ప్రౌఢవ్యాకర్త మతం. ఇది ఉచితం.

**14. మొక్కేము సామి:** (సం.14) వ్యాకరణం సాధిస్తున్న 'మ్రొక్కెదము' అనేరూపానికి భిన్నంగా ఉన్న మొక్కేము అనేపదం 'లక్షణవిరుద్ధం బగుభాష గ్రామ్యంబు' అనేసూత్రం ప్రకారం గ్రామ్యం.కాబట్టి కావ్యాలలో ప్రయోగించడానికి వీలు లేదు. 'గ్రామ్యంబు తత్తజ్జాతివర్ణనంబునం బ్రయోగార్హం బగు' అనేప్రౌఢవ్యాకరణసూత్రంచేత కిరాతజాతిసంభాషణలో ఈగ్రామ్యపదప్రయోగం సాధు వవుతున్నది.

**15. రేఫము:** (సం.2) 'ర' అనేవర్ణంమీద 'నిర్దేశవిధానోచ్చారణంబులం దఱచుగ అవర్ణాదులు కారప్రత్యయాంతంబులును రవర్ణ మిఫప్రత్యయాంతంబు నగు' అనేసూత్రంచేత 'ఇఫ' అనేప్రత్యయం వచ్చి ర-ఇఫ. ఇఫ అనేది సంస్కృతప్రత్యయం.కాబట్టి ఇక్కడ సంస్కృతం ప్రకారం గుణసంధి జరిగి 'రేఫ' అవుతుంది. (తద్ధితాంత మయిన) ఈప్రాతిపదికపై ప్రథమావిభక్తి ఏకవచనంలో తెలుగులో 'అమహన్నపుంసకములకు- అనేసూత్రంచేత మువర్ణకం వచ్చి రేఫము అని అవుతుంది.

## సంధిపరిచ్ఛేదం

**1. (అబ్జాసన) అంకముల్ పెంపు:** (సంధి.17)

అంకముల(యొక్క) - పెంపు. చూ.ఇంద్రున్ వలెన్.

**2. అందచందములు:** (సంధి.6) అందమును, చందమును అనే అర్థంలో ద్వంద్వసమాసం ఏర్పడి, సమాసవిభక్తి లోపించి, అంద - చంద అని ఉండగా, 'ద్వంద్వంబునం బదంబుపయి పరుషములకు గసడదవ లగు' అనే (బాల.) సూత్రంచేత నిత్యంగా గసడదవాదేశం రావలసిఉండగా 'కొన్నియెడల ద్వంద్వంబునం బదంబుమీది చతపలకు సదవలు గానంబడవు' అనే(ప్రౌఢ) సూత్రంచేత(సకార)ఆదేశం రాక అందచంద. ఈసమాసప్రాతిపదికపై ప్రథమావిభక్తి (బహువచనం)లో అందచందములు.

**3. అందిమ్ము:** (సంధి.2)+ అంది+ ఇమ్ము అని ఉండగా 'క్త్వార్థం బైనయిత్తునకు సంధి లేదు' అనేబాలవ్యాకరణలక్షణంచేత సంధి రాదు. కాబట్టి 'సంధి లేనిచోట స్వరంబు కంటెం బరం బయినస్వరంబునకు యడాగమం బగు' అనేసూత్రంచేత యడాగమం వచ్చి అందియిమ్ము. అని మాత్రమే కావాలి.(అని ప్రౌఢ.అభిప్రాయం)

అంది+ఇమ్ము అనేచోట 'ఇప్రత్యయాంతావ్యయంబునకు సంధియు జూపట్టెడి' అనే సూత్రంచేత సంధి జరిగి 'అందిమ్ము' అని కూడా అవుతుం దని ప్రౌఢవ్యాకర్తమతం.

అందు+ఇచ్చు- అం దిచ్చు. అనేశబ్దపల్లవధాతువునుంచి అందిచ్చెను, అందీయడు, ఇత్యాదిగా అందిమ్ము అని అవుతుంది. ఇక్కడ క్త్వార్థకేకారమే లేదు. కాబట్టి ఇది క్త్వార్థకేకారానికి సంధి జరిగినందుకు ఉదాహరణం కాదు.

**4. అన్నిష్టసఖి (అన్నూర్వీశుడు) :**(సంధి.9) అను-ఇష్టసఖి అని ఉండగా 'ఉత్తున కచ్చు పరం బగునపుడు సంధి యగు' అనేసూత్రాన్ని బాధించి 'ఉదంత మగు తద్ధర్మార్థకవిశేషణముల కచ్చు పర మగునపుడు నుగాగమం బగు' అనేసూత్రంచేత నుగాగమం వచ్చి 'అనునిష్టసఖి' అని బాలవ్యాకరణాన్నిబట్టి ఏర్పడుతుంది.

అను-ఇష్టసఖి అని ఉండగా నుగాగమాన్ని కూడా బాధించి 'తఱచుగ గర్మధారయ సమాసంబునం బెన్వాదులకడహల్లున కచ్చు పరం బగునపుడు ద్విత్వంబు గానంబడియెడి' అనేసూత్రంచేత అచ్చు లోపించి (అన్-ఇష్ట) కడహల్లుకు ద్విత్వం వచ్చి (అన్న్-ఇష్ట) అన్నిష్టసఖి అని అవుతుంది. ద్విత్వం రానిపక్షంలో అనునిష్టసఖి.

**5. (గిరి(వ్రజము) అన్పురంబు:** (సంధి. 13) అను-పురంబు అని ఉండగా, 'అనుకొను లోనగుధాతుజవిశేషణములయంత్యోకారమునకు హల్లు పరం బగునపుడు లోపంబు వైకల్పికంబు' అనేసూత్రంచేత ఉత్వం లోపించగా 'అన్ పురంబు' అవుతుంది. వైకల్పికం అనడంచేత ఉత్వం లోపింపనిపక్షంలో 'అనుపురంబు' అని ఉంటుంది.

**6. అప్పాచెల్లెండ్రు:** (సంధి. 6) అప్పయును, చెల్లెలును అనే అర్థంలో ద్వంద్వసమాసం ఏర్పడి విభక్తి లోపించి (అప్ప+చెల్లెలు) పూర్వపదం చివర దీర్ఘం వచ్చి అప్పా+చెల్లెలు. 'ద్వంద్వంబునం బదంబుపయి పరుషములకు గసడదవ లగు' అనే (బాల.) సూత్రంచేత నిత్యంగా గసడదవాదేశం రావలసిఉండగా 'కొన్నియెడల ద్వంద్వంబునం బదంబుమీది చతపలకు సదవలు గానంబడవు' అనే(ప్రౌఢ) సూత్రంచేత(సకార)ఆదేశం రాక అప్పాచెల్లెలు. ఈసమాసప్రాతిపదికపై ప్రథమావిభక్తి (బహువచనం)లో అప్పాచెల్లెండ్రు.

**7. ఆ డిదె:** (సంధి. 18) ఆడుము - ఇదె, అని ఉండగా 'ఉత్తున కచ్చు పరం బగునపుడు సంధి యగు' అనేసూత్రాన్ని బాధించి 'మధ్యమపురుషమువర్ణకంబున కచ్చు పరం బగునపుడును గొన్నియెడల లోపంబు చూపట్టెడి' అనేసూత్రంచేత మువర్ణకం లోపించి ఆడు- ఇదె, ఇపుడు 'ఉత్తున కచ్చుపరం బగునపుడు' అనేసూత్రంచేత సంధి జరిగి 'ఆ డిదె' అని అవుతుంది.

'కొన్నియెడల, చూపట్టెడి' అనడంచేత మువర్ణకం లోపించనిపక్షంలో ఆడుము-ఇదె, ఉత్వసంధి జరిగి, ఆడు మిదె అని అవుతుంది.

ఆడితె అనేముద్రితపాఠమే అర్థవంతం కావడంచేత ఇక్కడ 'ము' లోపం లేదు.

**8. ఇంద్రు న్వలెన్:** (సంధి. 5) ఇంద్రునియొక్క అనే ష ష్ఠ్యంతానికి వలె అనే పైపదంతో షష్ఠీతత్పురుషసమాసం ఏర్పడి 'సమాసవిభక్తికి లోపం బగు, లట్టునకు గాదు' అని విభక్తి లోపించి, ఇంద్రుని-వలె. 'షష్ఠీసమాసమందలినిలలమీదియచ్చులకు హల్లు పరం బగుచో గొన్నియెడల లోపంబు గానంబడియెడి' అనేసూత్రంచేత 'ని' వర్ణంలోని ఇకారం లోపించగా ఇంద్రున్ వలెన్. 'కానంబడియెడి' అనడంచేత లోపం రానిపక్షంలో 'ఇంద్రునివలెన్'.

**9. ఉండె దిదే:** (సంధి. 16) ఉండెదిది (ఉండెదు-ఇది) -ఏమి (ఏమ్యాదిసంధి జరిగి) ఉండెది దేమి. 'హలవసానంబులు పరంబు లగునపు దేమిశబ్దముయొక్క మికారమునకు లోపంబు వైకల్పికంబు' అనేసూత్రంచేత అవసానంలో మి వర్ణం లోపించగా ఉండెదిదే, అని అవుతుంది. వైకల్పికంబు అనడంచేత మివర్ణం లోపించనిపక్షంలో ఉండెది దేమి అని ఉంటుంది.

**10. ఎటిం గెటింగి:** (సంధి. 3) ఎటింగి- ఎటింగి అని ఉండగా 'అచ్చున కామ్రేడితంబు పరం బగునపుడు సంధి తఱుచుగ నగు' అనేసూత్రంచేత ప్రాప్తిస్తున్నసంధిని బాధించి 'క్త్వార్థం బయినయిత్తునకు సంధి లేదు' అని సంధి నిషేధం రాగా, దానిని బాధించి 'ఇప్రత్యయాంతావ్యయంబునకు సంధియు జూపట్టెడి' అనే ప్రౌఢ. సూత్రంచేత సంధి జరిగి 'ఎటిం గెటింగి' అని అవుతుంది.

'సంధియు, చూపట్టెడి' అనడంచేత సంధి రానిపక్షంలో యడాగమం వచ్చి ఎటింగి యెటింగి అని తఱుచుగా ఉంటుంది.

**11. ఎల్లన్ శిష్యులన్:** (సంధి. 7) బాలవ్యాకరణం 'సర్వపర్యాయం బయినయెల్ల శబ్దంబు ద్రుతాంతం బయినయవ్యయంబు, దీని కసమాసంబున విశేష్యంబునకు ముందు ప్రయోగంబు లేదు.' అనడంచేత సమాసం చేయకపోతే ('శిష్యులన్' అనే) విశేష్యానికి పూర్వంలో ఎల్లన్ అనే విశేషణం ప్రయోగించడానికి వీలు లేదు. సమాసం కానపుడు 'శిష్యుల నెల్లన్' అని 'ఎల్లన్

విశేష్యానికి తర్వాత ఉండాలి. ముందు ప్రయోగించా లంటే సమాసం జరిగి ద్రుతం లోపించి 'ఎల్ల శిష్యులన్' అని ఉండాలి. కాగా ఎల్లన్ శిష్యులన్ అని ఉండడం లక్షణవిరుద్ధం.

'సర్వపర్యాయం బయినయెల్లశబ్దమునకు సప్తమియు అసమాసంబున విశేష్యంబునకు ముందు ప్రయోగంబునుం జూపట్టెడు' అనేసూత్రంచేత సమాసం కాకపోయినా ఎల్లన్ విశేష్యానికి పూర్వంలో ప్రయోగించడం సాధువు.

ఇందులో ఎల్లన్ విశేష్యం. శిష్యులన్ విశేషణం. ఇది బాలవ్యాకరణలక్షణానుగుణం.

**12. ఎల్లయందు:** (సంధి. 16) 'సర్వపర్యాయం బయినయెల్లశబ్దంబు ద్రుతాంతం బయిన యవ్యయంబు' అనే బాలవ్యాకరణలక్షణంచేత ఈ ఎల్లన్ అవ్యయం. 'అవ్యయము లనగా లింగ విభక్తి వచన శూన్యములు.' కాబట్టి ఎల్లన్ అవ్యయ మయితే దానిపై ఏవిభక్తీ నిలవడానికి వీలు లేదు. ఎల్లయందు అనేచోట ఎల్లశబ్దం మీద అందు అనే సప్తమీవిభక్తి కనబడుతున్నది. అది పై బాల. వివరణం ప్రకారం లక్షణవిరుద్ధం.

'సర్వపర్యాయం బయినయెల్లశబ్దమునకు సప్తమియు. అసమాసంబున విశేష్యంబునకు ముందు ప్రయోగంబునుం జూపట్టెడు' అనేప్రౌఢ. సూత్రంచేత 'అందు' అనే సప్తమీవిభక్తితో 'ఎల్లయందు' అని అవుతుంది.

(కలుగంగబట్టి లాగా ద్రుతాంత మైన) అవ్యయం అయినా ఎల్లశబ్దంపై అందు విభక్తి ఉంటుం దని ప్రౌఢ. అభిప్రాయం. ఎల్లనందు అని కాకపోవడం విశేషం. ఎల్లదాని యందు అనేచోట తచ్ఛబ్దలోపంచేత ఏర్పడినరూపమే కాని ఇది ఎల్ల పై సప్తమి కాదు.)

**13. కందతుండెములు:** (సంధి. 6)కందలును,తుండెములును. చూ. అందచందములు.

**14. కనకన మను:** (సంధి. 19) కనకన- అను, అని ఉండగా 'అత్తునకు సంధి బహుళంబుగా నగు' అని ప్రాప్తిస్తున్న అత్వసంధిని బాధించి 'ధ్వన్యనుకరణశబ్దముల కనుధాతువు పరం బగుచో గొన్నియెడల ముగాగమం బగు' అనేసూత్రంచేత కనకన అనే ధ్వన్యనుకరణశబ్దానికి చివర మకారం ఆగమంగా చేరి కనకనమ్-అను, కనకన మను అని అవుతుంది. ఇక్కడ కనకనను, అని సంధి అయినరూపం గానీ, కనకన యను అని సంధి రాక యడాగమం అయినరూపం గానీ ఉండదు. ముగాగమం నిత్యం.

**15. కన్నాకు:** (సంధి. 9) కను-ఆకు. చూ. పెన్నరదము.

**16. గోకుల మిల్లిలు:** (సంధి. 10) చూ. బచ్చింట.

**17. చన్ త్రోవ:** (సంధి. 13) చను-త్రోవ. చూ. అన్పురంబు.

**18. చిట్టడవి (చిట్టెలుక):** (సంధి. 4) చిఱు- అడవి అని ఉండగా (ఉత్వసంధిని, టుగాగమాన్నీ బాధించి)'కుఱు చిఱు కడు నడు నిడు శబ్దంబుల అడల కచ్చు పరం బగునపుడు ద్విరుక్తటకారం బగు' అనేసూత్రంచేత 'ఱు' వర్ణం స్థానంలో 'ట్ట్' ఆదేశ మై చిట్టడవి అవుతుంది. ఇందులో మొదటిపదం 'చిఱు' అనీ, అందులో ఱు వర్ణానికి 'ట్ట్' ఆదేశ మవుతుం దనీ సూరిమతం.

'చిట్టడవిఁ జిట్టి' అనేసూత్రాన్నిబట్టి చిట్టడవి మొ. వాటిలో పూర్వపదం చిట్టి. కాబట్టి చిట్టి- అడవి అని ఉండగా 'ఇవి సంజ్ఞావాచకములు గావున సంధి నిత్యము' అనే సూత్రకర్తవివరణాన్నిబట్టి సంధి నిత్యంగా జరిగి చిట్టడవి అవుతుంది. ఇందులో పూర్వపదం చిట్టి అనీ, సంజ్ఞలలో దీనికి అచ్చు పర మైనపుడు సంధి నిత్యంగా వస్తుం దనీ ప్రౌఢవ్యాకర్తమతం.

సూరిప్రక్రియ సమగ్రమూ, చరిత్ర కనుగుణమూ కనుక యుక్తం.

**19. చెప్పంపడే:** (సంధి. 2) చెప్పి- అంపడే. చూ. అందిమ్ము.

'చెప్పండె' అనేముద్రితపాఠాన్నిబట్టి ఇక్కడ ఇప్రత్యయసంధి లేదు.

**20. చె ప్పునినన్:** (సంధి. 18) చెప్పుము-నినున్. చూ. ఆడిదె.

'చెప్పు నినున్ ... పుణ్యుండుగా' అనేయతిస్థలా న్ననుసరించి ఇక్కడ (చెప్పుము-నినున్) మధ్యమపురుషమువర్ణకం హల్లు పరంగా ఉండగా బాలవ్యాకర ణానుగుణంగానే లోపించింది. అచ్చు పర మవుతుండగా లోపించినందుకు ఇది ఉదాహరణం కాదు.

**21. చేసె మ్మహానది:** (సంధి. 22) చేసెను- మహానది, అని ఉండగా 'ద్రుతమునకు సరళస్థిరంబులు పరంబు లగునపుడు లోపసంశ్లేషంబులు విభాష నగు' అనేసూత్రాన్ని బాధించి 'ప్రాసంబున మకారంబు పరం బగుచో ద్రుతంబునకు మకారాదేశం బగు' అనేసూత్రంచేత 'ను' అనేద్రుతంమొత్తానికి మకారపుపొల్లు ఆదేశంగా వచ్చి చేసెమ్-మహానది, చేసె మ్మహానది అని అవుతుంది. ద్విత్వమకారప్రాసకంటె ఇతరస్థలాల్లో ద్రుతానికి లోపం వస్తే- చేసె మహానది, సంశ్లేషం వస్తే- చేసె న్మహానది, స్వత్వంతో - చేసెను మహానది, అని ఏర్పడతాయి.

**22. జడి గొన్ కోర్కులు:** (సంధి. 13) జడిగొను-కోర్కులు. చూ. అన్‌పురంబు.

**23. తామరపాకు:** (సంధి. 8) తామర-ఆకు అని ఉండగా 'అత్తునకు సంధి బహుళంబుగా నగు' అనేసూత్రంచేత ప్రాప్తిస్తున్న సంధిని బాధించి 'తామర కాకు పరం బగునపుడు పుగాగమం బగు' అనేసూత్రంచేత పకారం పొల్లు ఆగమంగా చేరి తామరప్-ఆకు, తామరపాకు అవుతుంది. (పుగాగమం రాకుండా అత్తుకు సంధి వస్తే తామరాకు, సంధి రాకపోతే యడాగమం వచ్చి తామరయాకు అని కూడా కావచ్చు.)

**24. నీకే బ్రాతియే:** (సంధి. 16) నీ కేమి-బ్రాతియే. చూ. ఉండె దిదే.

**25. నెన్నడ, నె న్నడుము :** (సంధి. 14) నెఱ-నడ అని ఉండగా 'అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచో గానంబడియెడి' అనేబాలవ్యాకరణసూత్రంచేత 'నడ' పరంగా ఉండగా, నెఱలోని తొలియచ్చుమీదివర్ణాలు లోపించి (నె-నడ) మీది హల్లుకు ద్విత్వం రాగా నెన్నడ. ఇందులో పూర్వపదం 'నెఱ' (నిం డైన) అని బాలవ్యాకరణమతం.

'నె న్నడాదులన్ నెఱి దగు' అనేసూత్రంప్రకారం ప్రౌఢ.మతంలో 'నెఱి-నడ' అని ఉండగా తొలియచ్చుమీదివర్ణాలు లోపించి, పైహల్లుకు ద్విత్వం వచ్చి, నెన్నడ అని అవుతుంది. ఇందులో పూర్వపదం సూరి చూపిన నెఱ కా దనీ, 'రమ్య మైన' అనే అర్థా న్నిచ్చే నెఱి అని సవరించిన ప్రౌఢ.మతం బాగానే ఉంది.

**26. (పల్లఅపు**(పలు-అఅపు), **(పెన్నుద్ది, పెన్నురము,మొ.)పెన్నరదము:**(సంధి.9) పెనుపు అనేవిశేషణానికి అరదము అనేవిశేష్యంతో కర్మధారయసమాసం ఏర్పడి విభక్తిలోపాదులు వచ్చి పెను-అరద అని ఉండగా ఉత్త్వసంధిని బాధించి రావలసిన టుగాగమాన్ని బాధించి 'తఱచుగ గర్మధారయసమాసంబునం బెన్వాదులగడహల్లున కచ్చు పరం బగునపుడు ద్విత్వంబు గానంబడియెడి' అనేసూత్రంచేత (ఉత్వం లోపించి, పెన్-అరద) చివరిహల్లుకు ద్విత్వం వచ్చి, పెన్నరదము అని అవుతుంది. ఇది తఱచు. కాబట్టి పెనుటరదము, లేదా పెనరదము అనేరూపాలు ఉండవు.

**27. పోపొమ్ము:**(సంధి.23) పొమ్ము-పొమ్ము అని ఉండగా 'ఆమ్రేడితంబు పరం బగునపుడు మధ్యమముదుజులకు లోపంబు విభాష నగు' అనేసూత్రంచేత 'మ్ము' వర్ణకం లోపించి 'పొ-పొమ్ము'. 'ఆమ్రేడితంబు పరం బగునపుడు కృతహ్రస్వంబునకు దీర్ఘం బగు' అనేసూత్రంచేత దీర్ఘం వచ్చి 'పోపొమ్ము' అని అవుతుంది.

**28. బచ్చింట:**(సంధి.10) బచ్చుయొక్క అనే షష్ఠ్యంతానికి 'ఇల్లు' అనేమీదిపదంతో షష్ఠీతత్పురుషసమాస మేర్పడి, విభక్తి లోపించి బచ్చు-ఇల్లు అని ఉండగా, 'ఉత్తున కచ్చు పరం బగునపుడు సంధి యగు' అనేసూత్రాన్ని బాధించి, షష్ఠీసమాసంబునం దుకారఋకారంబుల కచ్చు పర మగునపుడు నుగాగమం బగు' అనే సూత్రంచేత నుగాగమం వచ్చి బచ్చున్-ఇల్లు అని కాగా 'కొన్నిచోట్ల షష్ఠీసమాసంబునం దుకారంబున కచ్చు పరం బగునపుడు నుగాగమంబునకు లోపంబు నగు' అనే ప్రౌఢ.సూత్రంచేత నుగాగమం లోపించి బచ్చు-ఇల్లు. 'ఉత్తున కచ్చు-' అనేసూత్రంచేత ఉత్త్వసంధి జరిగి బచ్చిల్లు. సప్తమీ ఏకవచనంలో బచ్చింట. 'లోపంబును' అనేచోటిసముచ్చయంచేత నుగాగమం లోపింపనిపక్షంలో బచ్చునిల్లు, బచ్చునింట అవుతుంది.

**29. బింబముల్ రుచుల్:**(సంధి.17) చూ. ఇంద్రున్ వలెన్.

(బింబములు, రుచులు అనేవిధంగా ఇక్కడ మొదటిశబ్దం ప్రథమాంతం కావడంవల్ల 'ల' లేదు. హల్పరకతలో లు వర్ణకంలో ఉత్వలోపం. ఈఉదాహరణం ఈలక్షణానికి సంబంధించింది కాదు.)

**30. ముంగోపము:**(సంధి.12) చూ.వింజామరము.

**31. మూన్నాళ్లు:**(సంధి.15) మూఁడు-నాళ్లు, అని ఉండగా 'కొన్నియెడల నవర్ణంబు పరం బగునపుడు పూర్వపదాంత్యడకారంబు నకారం బగు' అనేసూత్రంచేత (మూఁడు అనేపూర్వపదంలో చివరిఅచ్చు లోపించి, మూఁడ్-నాళ్లు) దకారంస్థానంలో నకారం ఆదేశంగా వచ్చి మూన్-నాళ్లు, 'సంస్కృతసమేతరంబు లయిన తెలుగుశబ్దములయందు బరుషసరళములకు ముందే బిందువు గానంబడుచున్నది' అనేబాల. సూత్రంచేత స్థిరానికి ముం దున్న అరసున్న లోపించి మూన్నాళ్లు అవుతుంది. నకారం రానిపక్షంలో (ఉత్వం గూడా ఉండి) మూఁడునాళ్లు అని ఉంటుంది.

**32. లక్ష్మమ్మ:**(సంధి.1) లక్ష్మి-అమ్మ అని ఉండగా 'శ్రేష్ఠతావాచకంబు లగునార్యాంబాద్యర్థకశబ్దంబులు పరంబు లగుచో నన్నియచ్చులకు సంధి నిత్యము' అనే సూత్రంచేత సంధి నిత్యంగా జరిగి లక్ష్మమ్మ అని అవుతుంది.

**33. లతాంతములకు మ్మొనసి:**(సంధి.22) చూ. చేసె మ్మహానది.

**34. లేలెమ్ము:**(సంధి.23) చూ. పోపొమ్ము.

**35. రాకపోకలు:** (సంధి.6) చూ. అందచందములు.

**36. రామయ్య :**(సంధి. 9) రామ-అయ్య, అని ఉండగా 'అత్తునకు సంధి బహుళంబుగా నగు' అనేసూత్రంలోనిబహుళపదంచేత తత్సమాకారానికి సంధి రానిస్థితిలో 'శ్రేష్ఠతావాచకంబు లగునార్యాంబాద్యర్థకశబ్దంబులు పరంబు లగుచో నన్నియచ్చులకు సంధి నిత్యము' అనే సూత్రంచేత సంధి నిత్యంగా జరిగి రామయ్య అని అవుతుంది.

**37. రెన్నాళ్లు :**(సంధి. 15) చూ. మూన్నాళ్లు.

**38. వడవడ జమదగ్నిసూతి వడకెన్ :**(సంధి. 21) 'వడవడ' అనేది ధ్వన్యనుకరణ శబ్దం. 'వడకుట' అనేక్రియలోని ధ్వనిని ఇది అనుకరిస్తున్నది. కాబట్టి 'వడవడ వడకెన్' అని ఇవి రెండూ ఎడం లేకుండా ప్రయోగింపబడడం సహజం. కాని 'ఇయ్యవి క్రియావ్యవహితంబులు నగు' అనేసూత్రం ప్రకారం వడవడ అనే ధ్వన్యనుకరణశబ్దానికీ, వడకెన్ అనేక్రియాపదానికీ మధ్యలో 'జమదగ్నిసూతి' అనేపదం ప్రయోగించడంవల్ల క్రియతో వ్యవధానం ఏర్పడడం సాధువు అవుతున్నది.

**39. వింజామరము :**(సంధి. 12) వెల్ల-చామరము అని ఉండగా 'సమాసంబునం బ్రాతాదులతొలియచ్చుమీదివర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు' అనేసూత్రంచేత తొలియచ్చుమీదివర్ణాలు లోపించి, వె-చామర. (అదే సూత్రంలోని బహుళపదంచేత అన్యకార్యంగా) 'సమాసమునందు వర్ణవికారము'. 'వె' లోని ఎత్వానికి ఇత్వం ఆదేశ మై, 'వి-చామర'. 'సమాసమందు దత్సమంబు పరం బగునపుడును నుమాగమాదులు గానంబడియెడి' అనేసూత్రంచేత నుమాగమం వచ్చి విను-చామర. ద్రుతకార్యా లయి, ప్రథమైకవచనంలో- వింజామరము.

**40. వీరల్ గోపించిన :**(సంధి. 5) వీరల్-కోపించిన అని ఉండగా 'ప్రథమ మీదిపరుషములకు గసడదవలు బహుళంబుగా నగు' అనేసూత్రంచేత రావలసిన గసడదవాదేశం 'తెనుగులమీదిసాంస్కృతికపరుషములకు గసడదవలు రావు' అనేనిషేధం చేత రాదు. 'కొన్నియెడల దెనుగులమీదిసాంస్కృతికకతపలకు గదవలు గానంబడియెడి' అనేప్రౌఢ.సూత్రంచేత కకారానికి గకారం ఆదేశ మై, 'వీరల్ గోపించిన' అని అవుతుంది. ఆదేశం రావడం అరుదు. కాబట్టి 'వీరల్ కోపించిన' అనేవిధంగా ఆదేశం రానిరూపాలే తఱుచుగా ఉంటాయి.

**41. వెఱ చిట్లు:** (సంధి. 2) వెఱచి-ఇట్లు. చూ. అందిమ్ము.

**42. వేన్నీళ్లు:** (సంధి. 15) వేఁడి-నీళ్లు. చూ. మూన్నాళ్లు.

**43. వేవణములు:** (సంధి. 5) వే-పణములు. చూ. వీరల్ గోపించిన.

**44. శిరసందము:** (సంధి. 10) చూ. బచ్చింట.

**45. శిరసుపూ :** (సంధి. 11) 'పూ పూవు' అనేప్రౌఢ. సూత్రంప్రకారం తెలుగులో పూవుశబ్దానికి పర్యాయంగా అంటే పూవు అనేఅర్థంలో పూవుశబ్దంతోపాటు 'పూ' అనేశబ్దం కూడా ప్రత్యేకంగా ఉంది. 'శిరసు పూ' అనే కవిప్రయోగంలో సమాసంలో చివర 'పూ' అనే ఏకాక్షరశబ్దం ప్రయోగింపబడింది. (ఇక్కడ 'సమాసంబునం బ్రాతాదులతొలియచ్చుమీది వర్ణాలు లోపించవు, కాబట్టి పూవులో వు లోపించి పూ ఏర్పడిం దనరాదు. ఈ'పూ'శబ్దం ప్రత్యేకం అని ప్రౌఢవ్యాకర్త అభిప్రాయం.)

**46. సలసల మను:** (సంధి. 20) చూ. కనకన మను.

**47. సర్వము న్నతని:** (సంధి. 3) సర్వమున్-అతని, అని ఉండగా 'ఉత్తున కచ్చు పరం బగునపుడు సంధి యగు' అనేసూత్రంచేత రావలసినసంధిని బాధించి 'ఇఁకాదులకు దప్ప ద్రుతప్రకృతికములకు సంధి లేదు' అనేసూత్రంచేత సంధి రాదు. 'కొన్నియెడల బ్రామాణికప్రయోగంబుల ద్రుతంబున కచ్చు పరం బగుచో ద్విత్వంబు చూపట్టెడి' అనేప్రౌఢ.సూత్రంచేత ద్రుతంపైన ఇంకో నకారం చేరి, సర్వమున్న్-అతని, సర్వము న్నతని, అని అవుతుంది. కొన్నియెడల - చూపట్టెడి' అనడంచేత ద్విత్వం రానిపక్షంలో ద్రుతం మీది అచ్చుతో కలిసి 'సర్వము నతని' అని అవుతుంది.

**48. సీతమ్మ:** (సంధి. 1) చూ. రామయ్య.

# 3. శబ్దపరిచ్ఛేదం

**1. అప్రియంబులు గావించి:** 'అప్రియములు' అనేది విశేషణం. దీని విశేష్యం ప్రయోగింపబడలేదు. 'విశేషణంబులు కొన్నియెడల విశేష్యలక్షకంబు లగు' అనేసూత్రం ప్రకారం, ఈవిశేషణం అప్రియము లైనపనులు అనేవిధంగా పనులు అనేవిశేష్యాన్ని లక్షణావృత్తి చేత తెలియజేస్తుంది.

**2. ఓ వినువీధి నున్నఖచరోత్తములార!:** (ఉన్న) 'ఖచరోత్తములార' అనేసంబోధ్యవాచకానికి పూర్వంలో ' ఓ యామంత్రణంబునం దగు' అనేసూత్రంచేత 'ఓ' అనేశబ్దం ప్రయోగింపబడగా ఓ-ఖచరోత్తములార! ఓ శబ్దానికి ఖచరోత్తములార అనే సంబోధ్యవాచకానికీ మధ్యలో ఉన్న అనేధాతుజవిశేషణంతో అన్వయించే 'వినువీధిన్' అనేశబ్దంతో, వ్యవధానం ఉంది. 'ఓ శబ్దం బొక్కచో సంబోధ్యవాచకంబునకు ముం దితరశబ్దవ్యవహితం బయి కానంబడియెడి' అనేసూత్రంప్రకారం ఇటువంటివ్యవధానం యుక్తమే.

**3. రమణిరొ :** 'రమణి' అనేది సంబోధ్యవాచకం. సంబోధనంలో దీనికి పరంగా "రో శబ్దం బొందు సంబోధనంబున స్త్రీవాచకంబునకుఁ బరంబుగ నగు, అయ్యది హ్రస్వాంతంబును నయ్యెడి' - అనేసూత్రంచేత 'రో' అనేశబ్దం చేరగా రమణిరో. ఈసూత్రంచేతనే దానికి హ్రస్వం వచ్చినపక్షంలో రమణిరొ. సముచ్చయంచేత హ్రస్వం రానిపక్షంలో రమణిరో అని దీర్ఘం అలాగే ఉంటుంది.

**4. తల్లికాన :** 'తల్లి' శబ్దం స్త్రీని బోధించే శబ్దం. సంబోధనంలో దీనికి పరంగా అదేశ్యంబులం గొన్నియెడల స్త్రీవాచక స్త్రీ సమంబు లగుసంబోధ్యవాచకశబ్దంబులమీఁద నేకవచనంబునఁ గానశబ్దం బొందును, అల యనునవ్యయం బొందును గానంబడియెడి అల దీర్ఘాంతంబు నగు' అనేసూత్రంచేత 'కాన' అనేశబ్దం చేరి తల్లికాన! 'కానంబడియెడి' అనడంచేత కాన శబ్దం రానిపక్షంలో తల్లి, తల్లీ-అని మొ॥ విధంగా ఉంటుంది.

**5. అన్నలా :** 'అన్న' సంబోధ్యవాచకం. దేశ్యశబ్దం. అదేశ్యంబులం గొన్నియెడల స్త్రీవాచక స్త్రీ సమంబు లగుసంబోధ్యవాచకశబ్దముల మీఁద నేకవచనంబునఁ గాన శబ్దం బొందును, అల యనునవ్యయం బొందును గానంబడియెడి, అల దీర్ఘాంతంబు నగుని అనేసూత్రంచేత 'అల' శబ్దం చేరి దానికి చివర దీర్ఘం రాగా అన్న+అలా. సంధిజరిగి - అన్నలా. సముచ్చయంచేత దీర్ఘం రానిపక్షంలో 'అన్నల' అని హ్రస్వాంతంగా కూడా ఉంటుంది.

**6. తత్పాలు ర్భయం బందఁగన్** : తత్పాలురు + భయం బందఁగన్ అని ఉండఁగా 'హలవసానంబులు పరంబు లగునపుడు లురు వర్ణకంబులయుత్వంబునకు లోపంబు వైకల్పికంబుగ నగు' అనేసూత్రంచేత ఉత్వం లోపించగా తత్పాలుర్ భయంబు అని అవుతుంది. వైకల్పికం కాబట్టి ఉత్వం లోపింపనిపక్షంలో తత్పాలురు భయంబు అని ఉంటుంది.

**7. మునినికాయము.... పూజించిరి** : 'మునినికాయము' అనేసమూహార్థకశబ్దం అమహత్కార్యంతో ఉండడంచేత అది కర్తగా గలిగిన క్రియకు కూడా అమహద్రూపమే కావలసియుండఁగా "మహత్సమూహార్థకశబ్దం బమహత్కార్యయుక్తం బయ్యుఁ దద్విశేషణక్రియలు మహత్కార్యయోగ్యంబులు విభాష నగు' అనేసూత్రంచేత మహత్కార్యం గలిగి 'పూజించిరి' అని అవుతుంది. విభాష కాబట్టి మహత్కార్యం రానిపక్షంలో అమహత్కార్యం కలిగి 'పూజించెను' అని అవుతుంది. విభాష కాబట్టి మహత్కార్యం రాని పక్షంలో ఆమహత్కార్యం కలిగి 'పూజించెను' అని అవుతుంది.

**8. అర్ధిమెయిన్:** అర్ధి అనేశబ్దంమీద సహార్థంలో 'కరణసహార్థతుల్యార్థయోగంబులం దృతీయకుం దోడ వర్ణకం బగు' అనేసూత్రం చేత 'తోడ' ప్రత్యయం వచ్చి అర్ధితోడ అని యుండఁగా 'జడపదంబుమీఁదితోడకు మెయిమైలు వికల్పంబుగ నగు' అనేసూత్రంచేత-తోడకుబా మెయి ఆదేశం అయి అర్ధిమెయిన్, మై అనేది ఆదేశమైతే అర్ధిమైన్, ఏదీ రాకపోతే అర్ధితోడ.

**9. ఉత్సవము కేఁగెదు:** ఉత్సవశబ్దం షష్ఠీ ఏకవచనంలో ఉత్సవము + కును అని ఉండగా 'కువర్ణకంబు పరం బగునపు డుకార ఋకారంబులకు నగాగమం బగు' అనేసూత్రంచేత నగాగమం రావలసిఉంది. 'కువర్ణకంబు పరం బగునపుడు కవిత్రయంబువారి ప్రయోగంబులం దక్కఁ దక్కినమహాకవిప్రయోగంబులందునుం గొన్నియెడల నగాగమంబు చూపట్టదు' అనేసూత్రా న్ననుసరించి న వర్ణం రాకుండగా ఉత్సవముకును, 'కొన్నియెడల చూపట్టదు' అనడంచేత నగాగమం వచ్చినపక్షంలో ఉత్సవమునకును.

**10. తత్రృతుశతంబునకంటె :** తత్రృతుశబ్దం పంచమి ఏకవచనంలో తత్రృతుశతంబు + కంటె అని ఉండఁగా "కంటె వర్ణకము పరం బగునపుడును గొన్నియెడల నగాగమంబు చూపట్టెడి' అనేసూత్రంచేత నగాగమం వచ్చి 'తత్రృతుశతంబునకంటె' – అవుతుంది. అరుదు గాబట్టి నగాగమం రానిపక్షంలో తత్రృతుశతంబుకంటె అని కూడా ఉంటుంది.

**11. జవ్వనంబునయందు:** దా జవ్వనశబ్దం సప్తమీ ఏకవచనంలో జవ్వనంబు + అందు. 'ఉకారఋకారంబుల కందువర్ణకము పరం బగునపుడు నుగాగమం బగు' అనేసూత్రాన్ని బాధించి, 'ఆగమ ము వు వర్ణంబుల కందువర్ణకము పరం బగునపుడు నుగాగమంబు విభాష నగు' అనేసూత్రంచేత వచ్చే వైకల్పిక మైననుగాగమాన్ని బాధించి 'ఉదంతము లగునమహత్తుల కందువర్ణకము పరం బగునపుడు నగాగమంబు కొన్నియెడల గానంబడియెడి' అనేసూత్రంచేత నగాగమం వచ్చి, జవ్వనంబున + అందు. అని ఉండగా నగాగమవిధానసామర్థ్యంచేత 'అత్తునకు సంధి బహుళంబుగా నగు' అని రావలసిన సంధి రాదు. కాగా యడాగమం వచ్చి జవ్వనంబునయందు. 'కొన్నియెడల' అనడంచేత నగాగమం రాకపోతే వైకల్పిక నుగాగమం వచ్చి-జవ్వనంబునందు, జవ్వనంబందు అని కూడా ఉంటుంది.

**12. బాలిగాఁడు:** 'బాల' అనేశబ్దం మీద నీచార్థంలో ఏకవచనంలో 'తెనుఁగునం గొన్ని తత్సమ దేశ్య శబ్దములకంటెం బరంబుగ నేక వచనంబున నీచత్వద్యోతకం బయి గా యనునొక్కశబ్దంబును దానిపై డువర్ణకాదులునుం జూపట్టెడి. సంబోధనంబున డు వర్ణకంబు చూపట్టదు. తుదిదీర్ఘంబునకు హ్రస్వంబు వైకల్పికంబు' – అనేసూత్రంచేత, పైన ఇగా శబ్దం చేరి బాల+ఇగా 'అంద్వవగాగమంబులం దప్ప- అని సంధి జరిగి-బాలిగా. ప్రథమైకవచనంలో డుఙ్ వచ్చి – బాలిగాఁడు.

**13. మల్లురు:** మల్ల ప్రాతిపదికపై ప్రథమా బహువచనవివక్షలో 'లువర్ణంబు బహువచనంబు' – మల్ల+లు. అపుంలింగం బయి మహద్వాచకం బయిననామంబు తుదియత్వంబున కుత్వం బగు అ–మల్లు+లు. 'ద్విత్వయుక్త లాంతంబుమీఁది లులలకు రుర లాదేశంబు లగు' అనేసూత్రంచేత లు 'వర్ణానికి 'రు' ఆదేశం కాఁగా 'మల్లురు'. ఆదేశం రాని 'మల్లులు' అనేరూపం కూడా ఉంది.

**14. ధర్మువు:** ధర్మ ప్రాతిపదిక. ప్రథమైకవచనవివక్షలో 'అమహన్నపుంసకముల కదంతములకు ముువర్ణకం బగు' అనేసూత్రాన్ని బాధించి' అర్ఘాదులకడయచ్చున కుత్వంబును మీఁద వు వర్ణకంబును వైకల్పికంబుగాఁనగు' అనేసూత్రంచేత ఉత్వమూధర్మ్ ధర్మువు అవుతుంది. వైకల్పికం కాబట్టి ఇవి వువర్ణకమూ వచ్చి రాకపోతే ముువర్ణకం వచ్చి ధర్మము.

**15. రాహు:** 'రాహు' అనేశబ్దంమీద ప్రథమైకవచనాన్ని వివక్షించగా (పుంలింగ మగు మహద్వాచకంబునకు డుఙ్గు'

అనేసూత్రంచేత వచ్చే దుజ్‌ను బాధించి' ఉకారాంతగోశబ్దంబుల కంతట వువర్ణకంబగు' అనేసూత్రంచేత నిత్యంగా వచ్చే వువర్ణాన్ని బాధించి. ఉకారాంతం బగుమహుత్తునకు వువర్ణకం బహుళంబుగా నగు' అనేసూత్రంచేత బహుళంగా వువర్ణకం వచ్చినపక్షంలో 'రాహువు' 'రాహుబాహుశబ్దంబుల కంతట వువర్ణకలోపంబు వైకల్పికంబు' అనేసూత్రంచేత వువర్ణకం లోపిస్తే రాహు. 'వు' లోపింపని పక్షంలో రాహువు. బహుళ మైన 'వు' రాకపోతే దుజ్ వచ్చి రాహుఁడు.

**16. బాహు:** – బాహు ప్రాతిపదిక. ప్రథమైకవచనవివక్షలో 'ఉకారాంత గోశబ్దంబుల కంతట వు వర్ణకంబు బహుళంబుగా నగు అనేసూత్రంచేత వు వర్ణకం వచ్చి 'బాహువు' అని కాగా 'రాహుబాహుశబ్దంబుల కంతట వు వర్ణకలోపంబు వైకల్పికంబు' అనేసూత్రంచేత వు వర్ణకం లోపించగా 'బాహు' అని అవుతుంది. వైకల్పికం కాబట్టి లోపం రాని పక్షంలో బాహువు.

**17. అయ్యగారు:** అయ్య అనేదేశ్యశబ్దంమీద పూజ్యతలో "తఱచుగా స్త్రీసమంబు లగు దేశ్యశబ్దంబులకుఁ గడపలఁ గొన్నింటి కేకవచనంబునం బూజ్యతయందు గారుశబ్దం బగు' అనేసూత్రంచేత గారు అనేశబ్దం చేరి 'అయ్యగారు' అవుతుంది.

**18. శ్రీరాములవారు:** 'శ్రీరామ' శబ్దంమీద పూజ్యతలో 'డుమంతంబు లగు తత్సమాదిశబ్దములకుం గొన్నింటికి ద్వితీయాది బహువచనంబుమీఁదం బూజ్యతయందు గారునకు మాఱుగ వా రగు' అనేసూత్రంచేత ద్వితీయా బహువచనాంత మైన 'శ్రీరాములన్' అనేరూపం వచ్చి దానిమీద 'వారు' అనేశబ్దం చేరుతుంది. (నడుమ ద్రుతం లోపించి) శ్రీరాములవారు.

**19. అయ్యవారు:** అయ్య శబ్దంమీద ఉపాధ్యాయుఁడు మొదలైన విశేషార్థాలలో 'అర్థవిశేషంబునం దేకత్వంబునను గొన్ని శబ్దముల మీఁద వారు చూపట్టెడు' అనేసూత్రంచేత వారు అనేశబ్దం చేరి 'అయ్యవారు' అని అవుతుంది.

**20.మద్గురువుల నడిగిను:** మద్గురు అనేశబ్దంమీద ద్వితీయలో ఏకత్వంలో పూజ్యతను వివక్షించినపుడు " పూజ్యతయం దొక్కచో నామతదేతద్యుష్మదస్మచ్ఛబ్దంబులయేకవచనంబునకు బహువచనం బగు' అనేసూత్రంచేత బహువచనం రాగా 'మద్గురువులను' అని అవుతుంది.

**21 చూచివత్తమమ్మ సుదతులార !:** సుదతులార ! అనే సంబోధ్యవాచకం బహువచనాంతమైనా, చూచివత్తము అనేక్రియా పదంపై ఉన్న అమ్మ అనేశబ్దం 'సంబోధ్యవాచకంబు బహువచనాంతం బయ్యు గ్రియలమీఁదియమ్మాదు లేకవచనాంతంబుల యగు' అనేసూత్రా న్ననుసరించి ఏకవచనాంత మైంది.

**22. స్వామీ తాము దయచేయవలయును:** పూజ్యార్థంలో నీవు అనేదానికి 'పూజ్యతయం దొక్కచో నామతదేత ద్యుష్మదస్మచ్ఛబ్దంబుల యేకవచనంబునకు బహువచనం బగు అనేసూత్రంచేత బహువచనం వచ్చి 'మీరు' అవుతుంది. 'పూజ్యతాతిశయంబున యుష్మదర్థబహువచనంబునకు మాఱుగా నాత్మార్థబహువచనంబు ప్రయుక్తం బగు' అనేసూత్రంచేత ఆత్మార్థక బహువచనరూపం రాగా 'తాము దయచేయవలయును' అని అవుతుంది.

**23 మాయత్త :** నాయొక్క అత్త అనేఅర్థంలో 'సంబంధంబున యుష్మదస్మచ్ఛబ్దములకుం గొన్నియెడల బహుత్వం బగు' అనేసూత్రంచేత బహువచనం రాగా సమాసంలో విభక్తి లోపించి యడాగమ మై, మాయొక్క+అత్త-మాయత్త అవుతుంది.

**24. వారలు :** ఆ అనేప్రాతిపదికకు ప్రథమాబహుత్వంలో 'దేశ్యంబునం గొన్నియెడల మహన్మహత్యర్థకనామంబులపై మఱల బహువచనప్రత్యయంబులు చూపట్టెడు. 'అచ్చో వారు వీరు మీరు శబ్దంబుల యంత్యోకారంబున కకారం బగు'

అనేసూత్రంచేత, 'వారు' అనేరూప మై దానిపై 'లు' అనేబహువచనం చేరి (వారు+లు) ముందు అత్వం రాగా 'వారలు' అవుతుంది.

**25. పళ్యము**: 'పల్లియము' అనేశబ్దంలో "ముత్తియశబ్దేతరంబులయందును దఱచుగ నిత్వలోపంబు గానంబడియెడి 'అనేసూత్రంచేత ఇత్వానికి లోపం రాఁగా, పళ్ళ్యము. భిన్న హల్సంయోగంలో సమానమైన నడిమిహల్లు (ళ కారం) లోపించి 'పళ్యము' అవుతుంది. లోపం రాకపోతే పళ్ళియము (పళ్ళెము).

**26. కోడండ్రురయందు:** కోడలు ప్రాతిపదిక. సప్తమీ బహుత్వంలో "దేశ్యంబునం గొన్నియెడల మహన్మహత్యర్థక బహువచనాంత నామంబులపై మఱల బహువచనంబులు చూపట్టెడు ' అనేసూత్రంచేత కోడండ్రు అనేరూపం పొంది దానిపై సప్తమీ బహువచనం చేరి కోడండ్రురయందు అవుతుంది.

**27. ఎడ్లు: – 'ఎద్దు'** ప్రాతిపదిక. ప్రథమాబహువచనవివక్షలో 'లువర్ణంబు బహువచనంబు' ఎద్దు+లు అని ఉండఁగా "ఎద్దు దేవరశబ్దములకు లులలు పరంబు లగునపుడు దకారంబునకు డకారంబును డకారంబునుత్వంబునకు లోపంబును వైకల్పికముగాను రేఫమునకు ళకారమును ళకారంబునత్వంబునకు లోపంబును నిత్యముగాను గ్రమంబుగనగు" అనేసూత్రంచేత దకారానికి డ కారమై ఉత్వం (ఒకడకారం) లోపించి ఎడ్లు. ఈకార్యం రాకపోతే ఎద్దులు.

**28. కొంత :** ఒక+అంత అని ఉండగా 'ఈ ఏ ఒక శబ్దములకంటెం బరం బయిన యంతశబ్దమునకారమునకు లోపం బగు అగుచో నీయేలదీర్ఘమునకు హ్రస్వమును ఒకకు వర్ణవ్యత్యయసంహితలు నగు'. అనేసూత్రంచేత అకారం లోపించి ఒక+ంత లవర్ణ వ్యత్యయమయి క+ఒ+ంత. సంధి జరిగి కొంత అని అవుతుంది.

**29. అన్ని:** భిన్న వస్తుసముదాయం అర్థ మైనపుడు అంత – అనే శాబ్దానికి 'అమహదర్థంబున భిన్న సముదాయాల బర్థ మగుచో బహువచనంబున నంతాదులతకారంబునకు దిరుక్త నివర్ణం 'బగు' అనేసూత్రంచేత 'త' వర్ణం మొత్తానికి 'న్ని' ఆదేశ మై అం+న్ని సంస్కృత సమేతమైన తెలుగు శబ్దములయందు బరుషసరళములకు ముందే బిందువు గానంబడు చున్నది అనేసూత్రం ప్రకారం స్థిరానికి ముందు సున్న లోపించి అన్ని' అని అవుతుంది.

**30. అద్ది :** 'ఆ' అనేప్రాతిపదికపై అమహత్త్వంలో ప్రథమైకవచనవివక్షలో 'త్రికంబున కమహదర్థంబునం బ్రథమైకవచన బహువచనంబులం గ్రమంబుగ దివి వర్ణకంబు లగు' అనేసూత్రంచేత 'ది' ప్రత్యయం వచ్చి ఆ+ది. "ఆ ఈ శబ్దములును ఏ శబ్దమును నమహదర్థంబునం బ్రథమావిభక్తి పరం బగునపుడు నిత్యముగాను వైకల్పికముగాను గ్రమంబున హ్రస్వంబు లగు' అనేసూత్రంచేత హ్రస్వం వచ్చి, అ+ది. 'హ్రస్వవ్యస్త త్రికంబుమీఁది దివులకు ద్విత్వంబు నగు' అని ద్విత్వం వచ్చి అద్ది. ద్విత్వం రానిపక్షంలో అది.

**31. దానన్:** ఆశబ్దానికి తృతీయ (సప్తమి) ఏకవచనవివక్షలో "అదియిదియెది యనువానికి ఁదృతీయా సప్తమ్యేకవచనంబులయందు దాన దీన దేన ననియు వానిబహువచనంబులయందు వాన వీన వేన ననియు రూపంబు లగు" అనేసూత్రంచేత దానను అనేరూపం గల్గుతుంది.

**32. పువ్వులయవ్విధంబునన్:** పువ్వుల (యొక్క) విధము–అనేసమాసంలో "పదాద్యంతగతం బాశబ్దం బమహదర్థకంబు సమస్తంబు వ్యస్తంబు నయి కొన్నియెడల నర్థశూన్యం బగు' అనేసూత్రంచేత విధ మనే ఉత్తరపదానికి మొదట ఆశబ్దం చేరి 'త్రికంబుమీఁది యసంయుక్తహల్లునకు ద్విత్వంబు బహుళంబుగా నగు' అనేసూత్రంచేత మీఁదిహల్లుకు ద్విత్వమూ' 'ద్విరుక్తం

బగుహల్లు పరంబగునపు డాచ్ఛికం బగుదీర్ఘంబునకు హ్రస్వం బగు' అని హ్రస్వమూ వచ్చి, యడాగమంతో 'పువ్వులయవ్విధము' అని అవుతుంది.

**33. ఈవు:** నీవు అనేశబ్దంలో "నీమీనేమే హల్లులకు లోపంబు విభాష నగు" అనేసూత్రంచేత న కారం లోపించగా ఈవు అవుతుంది. విభాష గాబట్టి లోపం రానిపక్షంలో నీవు అనే ఉంటుంది.

**34. తా వచ్చె సుదర్శనాయుధుఁడు:** 'సుదర్శనాయుధుఁడు' అనే నామార్థాన్ని గ్రహించేటపుడు'' నామతదేద్యత్మిమర్థంబులకుం బునర్గ్రహణంబునఁ బ్రథమాద్యంత మయి పూర్వపరంబులుగ నాత్మార్థం బభిహితం బగు' అనేసూత్రంచేత పూర్వంలో 'తాను' అనేది ప్రయోగింపబడి (స్థిరపరకద్రుతలోపంతో) పై రూప మయింది.

**35. ఒకానొకఁడు:** ఒకఁడు అనేశబ్దానికి "ఒకా నొకచో నర్దిష్టార్థమం దొకశబ్దమునకుం బూర్వాగమం బగు' అనేసూత్రంచేత పూర్వంలో 'ఒకాన్' అనేది ఆగమమై (ఒకాన్+ఒకడు) 'ఒకానొకఁడు' అవుతుంది.

**36. ఎల్లరు :** ఎల్ల అనే శబ్దానికి ప్రథమావిభక్తిలో 'లువర్ణంబు బహువచనంబు' అని లువర్ణ మై ఎల్ల+లు అని కాగా 'సర్వనామంబులకు మహదర్థంబున దఱచుగ లులలకు రుర లగు' అనేసూత్రంచేత లు వర్ణానికి 'రు' అనేది ఆదేశమై 'ఎల్లరు' అని అవుతుంది.

**37. అందఱు:** అంత+వారు అని ఉండగా " అంతాదులకు వారు పరంబగుచో వాకు లోపంబును రురలకు ఱుఱ లాదేశంబు నగు' అనేసూత్రంచేత 'వా'లోపించి, రువర్ణానికి 'ఱు' ఆదేశ మై, అంత+ఱు. "వాలోపంబుతతి వానితకారంబునకు దకారం బగు' అనేసూత్రంచేత 'త' కారానికి దకార మై – అందఱు.

**38. ముగ్గురు**: మూఁడు అనేశబ్దానికి ప్రథమాబహువచనంలో 'లువర్ణంబు బహువచనంబు' మూఁడు+లు. 'సంఖ్యావాచకంబులకు విభక్తి పరం బగునపుడు కొన్నింటియంత్యాక్షరంబులకు లోపం బగు' – మూ+లు. 'సర్వనామంబులకు మహదర్థబునఁ దఱచుగ లులలకు రుర లగు' 'మూ+రు'. 'రురవర్ణకంబులు పరంబు లగునపుడు సాధారణంబుగ సంఖ్యావాచకంబులకు గువర్ణంబు పూర్వాగమం బగు' – మూగురు. 'విభక్తి పరం బగుచో మూఁడు నాలుగుల దీర్ఘంబునకు హ్రస్వంబు బహుళంబుగా నగు' – ముగురు. 'ప్రాప్తహ్రస్వంబు లగుమూ డేల మీఁదివర్ణంబులకు ద్విత్వంబు బహుళంబుగా నగు' ముగ్గురు.

**39. ఏడగుపర్వము :** ఏడు అనేశబ్దంమీద పూరణార్థంలో ఆ సంఖ్యకుం బూరణార్థంబునం దవగాగమం బగు' అనేసూత్రంచేత అవగాగమం వచ్చి ఏడు+అవ అని ఉండగా, "కొన్నియెడల నవ కగు కానంబడియెడి' అనేసూత్రంచేత 'అవ' స్థానంలో అగు ఆదేశ మై ఏడు+అగు అని ఐనతర్వాత 'ఉత్తున కచ్చు పరం బగునపుడు సంధి యగు' అనేసూత్రంచేత సంధి జరిగి 'ఏడగుపర్వము' అని అవుతుంది. అగు రాకపోతే అవతో ఏడవపర్వము.

**40. అసురు లరువదివేలు :** 'అసురులు' అనేమహత్తుకు విశేషణమైన 'అరువదివేలు అనేశబ్దం " మహద్విశేషణ సంఖ్యా వాచకంబులకుం గొన్నియెడల నమహత్కార్యంబు చూపట్టెడి' అనేసూత్రంచేత '(అసురులు) అరువదివేలు' అనేరూపంఅవుతుంది. అమహత్కార్యాలు గలుగనిపక్షంలో విశేష్యా న్ననుసరించి మహత్కార్యంతో 'అసురు లరువదివేగురు' అని అవుతుంది.

**41. చెయ్యి :** చేయి అనేశబ్దానికి ఔపవిభక్తికాంతంబు లగు చేయి నేయి లోనగుశబ్దంబులయాద్యచ్చునకు హ్రస్వంబును మీఁది హల్లునకు ద్విత్వంబును బ్రథమైకవచనంబునందు వైకల్పికంబుగ నగు' అనేసూత్రంచేత హ్రస్వద్విత్వాలు రెండూ వచ్చినపక్షంలో చెయ్యి. హ్రస్వం మాత్రం వస్తే- చెయి, రెండూ రాకపోతే చేయి.

**42. ఊరన్:** ఊరు శబ్దంమీద సప్తమ్యేకవచనంలో 'ఉదంతజడంబుసప్తమికి న వర్ణకం బగు' అనేసూత్రంచేత నవర్ణక మయి 'తృతీయాదులకు నుగాగమం బగు' అని ద్రుతం చేరగా ఊరునను. 'ఊరుచోటు మేన్వాదు లున్లుగ్విషయంబులు' అనేసూత్రంచేత 'ఉన్' లోపించి ఊర్+అను 'ఊరను' అని అవుతుంది. ఉన్ లోపం రాని పక్షంలో- ఊరునన్ అని ఉంటుంది.

**43. పాడియయ్య:** 'పాడి' అనేశబ్దంమీద 'నామపదంబు లార్యార్థపరకంబు లయి వ్యతిరేకవ్యంజక ప్రశ్నార్దకంబు లగు' అనేసూత్రంచేత 'అయ్య' అన్నది చేరి 'పాడియయ్య' అని అవుతుంది. ఇది 'పాడికాదు' అని వ్యతిరేకార్థాన్ని వ్యక్తం చేస్తూ 'పాడి యగునా' అనేవిధంగా ప్రశ్నార్థకం అవుతుంది.

# 4. కారకపరిచ్ఛేదం

**1. మముగుఱిచి :** (2) 'నా' అనే (అస్మద్) ప్రాతిపదికకు 'కర్మంబున ద్వితీయ యగు' అనేసూత్రంచేత ద్వితీయావిభక్తి వచ్చి, బహువచనంలో మమున్ అని అవుతుంది. ఇక్కడ ఉద్దేశార్థం కూడ ఉండడంచేత ఉద్దేశార్థంబునందు ద్వితీయకు గుఱిచియు నను ప్రయుక్తం బగు' అనేసూత్రంచేత ద్వితీయావిభక్తి మీద 'గుఱిచి' అనేశబ్దం చేరి (సరళపరకతలో ద్రుతం లోపించి) 'మముగుఱిచి'. 'గుఱిచియు' అన్నప్పటి సముచ్చయంచేత కూర్చి వస్తే (ద్రుతకార్యాలతో) మముఁగూర్చి అని అవుతుంది.

**2. తన్ను నర్థితో గుఱిచి :** (3) తాశబ్దానికి ఉద్దేశార్థంలో ద్వితీయ వచ్చి ఏకవచనంలో 'తన్నున్' అని అవుతుంది 'ఉద్దేశార్థంబునందు ద్వితీయకు గుఱిచియు నను ప్రయుక్తం బగు' అని గుఱిచి చేరగా తన్నున్+గుఱిచి 'అయ్యది వ్యవహితంబు నగు' అనేసూత్రంచేత 'తన్నున్ అర్థితో గుఱిచి, అన్నపుడు ద్వితీయకూ దానికి అనుప్రయక్తమైన గుఱిచికీ నడుమ 'అర్థితో' అనేపదంతో వ్యవధానం సాధువవుతున్నది.

**3. సంబోధనఁజేసి :** (4) సంబోధనశబ్దంమీద హేత్వర్థంలో ('చేత వర్ణకంబు హేతుకరణంబులకు గ్రహ్యోదియోగజంబగుపంచమికిని బహుళంబుగా నగు') చేతప్రత్యయం వచ్చి 'సంబోధనచేతన్'. జడంబు తృతీయా సప్తములకు ద్వితీయ బహుళంబుగా నగుని అనేసూత్రం ప్రకారం 'చేత' అనేతృతీయకు ద్వితీయ(ను) వచ్చి'సంబోధనన్'. కొన్నియెడల, జేతవిభక్త్యర్థకవర్ణకంబులకును వలనవర్ణకంబునకుఁ దఱచుగఁ జేసి యనుప్రయుక్తం బగు' అనేసూత్రంచేత 'చేసి' అనేపదం చేరి (ద్రుతకార్యాలతో) సంబోధనఁజేసి. 'తఱచుగ' అనడంచేత చేసి రాకుంటే సంబోధనన్. బహుళం అనడంచేత ద్వితీయ కూడా రాకుంటే తృతీయతో సంబోధనచేతన్.

**4. తోడమాటాడక :** 'తోడ' అనేది తృతీయావిభక్తి ప్రత్యయం. కాబట్టి పదం కాదు. పదం కాకపోతే 'ఆపదంనప్రయుంజీత' ప్రయోగార్హం కాదు. అయినా 'ఒకానొకచో తోడకు ప్రత్యేక ప్రయోగంబునుం జూపట్టెడి' అనేసూత్రంప్రకారం ప్రాతిపదికను ఆశ్రయించకుండా స్వతంత్రంగా ప్రయోగించడం సాధువు అవుతున్నది. ఇందులో ('తోడ' విభక్తి కాదు. 'తోడు' శబ్దం నుంచి ఏర్పడిన ప్రత్యేకపదం. తోడఁబుట్టువు. తోడికోడలు మొ॥.)

**5. ప్రాణముతోడుతన్:** ప్రాణశబ్దం మీద సహార్థంలో(కరణసహార్థతుల్యార్థయోగంబునం దృతీయకుం దోడవర్ణకం బగు అని) తోడ ప్రత్యయం వచ్చి ప్రాణముతోడన్. 'ఒకానొకచోఁ దోడకుఁ దోడుత నని రూపాంతరంబును గలదు. అయినను దానికి వలె దీని కితర కార్యంబు గలుగదు' అనేసూత్రంచేత తోడ ప్రత్యయం 'తోడుత' అని మార్పు చెందగా 'ప్రాణముతోడుతన్' అని అవుతుంది.

**6. కార్యసంప్రయోగముపొంటెన్ :** 'కార్యసంప్రయోగ' శబ్దంమీద ఉద్దేశార్థంలో 'సంప్రదానంబునకుం జతుర్థి యగు' అని చతుర్థీ విభక్తి వస్తుంది. కొఱకు వస్తే సంప్రదానముకొఱకున్. కయి ప్రత్యయం అయితే సంప్రదానముకై. 'చతుర్థికిం బొంటె వర్ణకంబు నగు.' అనేసూత్రంచేత చతుర్థికి పొంటె రాగా సంప్రయోగముపొంటెన్. 'పొంటెయు' అన్నప్పటిసముచ్చయంచేత పొంటె రానిపక్షంలో కొఱకు, కయి అలాగే ఉంటాయి.

**7. బ్రహ్మలోకంబుననుండి :** బ్రహ్మలోక శబ్దంపై అపాయార్థంలో (అపాయ భయ జుగుప్సా పరాజయ ప్రమాద గ్రహణ భవన త్రాణ విరామాంతర్ధివారణంబు లెద్దాన నగు దానికి వలన వర్ణకం బగు) వలన ప్రత్యయం వచ్చి 'బ్రహ్మలోకంబువలనన్'. ఉండి పదం బొకానొకచో వలనవర్ణకంబున కనుప్రయుక్తం బగు' అని వలనపై 'ఉండి' చేరి 'బ్రహ్మలోకంబువలనన్+ఉండి' అని ఉండగా 'ఉండి పదంబు పరం బగునపుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికంబుగ నగు' అనేసూత్రంచేత వలనకు సప్తమి. ఆ సప్తమికి ఉండి పదంబు పరం బగుచో వలన కందువర్ణక మట్లు నవర్ణకంబు నగు' అనేసూత్రంచేత 'న' ప్రత్యయం వచ్చి బ్రహ్మలోకంబుననుండి. (సప్తమికి అందు వస్తే బ్రహ్మలోకంబునందుండి, ద్వితీయ వస్తే బ్రహ్మలోకంబునుండి, ఏదీ రాకుంటే బ్రహ్మలోకంబువలననుండి ఉండి కూడా రాకపోతే- బ్రహ్మలోకంబువలనన్).

**8. అదితిగర్భమున్ వెలువడు :** (అదితి) గర్భశబ్దంపై అపాయార్థంలో (అపాయభయజుగుప్సా--) వలన ప్రత్యయం. గర్భమువలనన్, 'ఉండిపదం బొకానొకచో వలనవర్ణకంబున కనుప్రయుక్తం బగు' అని వలనపై ఉండి చేరి గర్భమువలనన్+ఉండి. 'ఉండి పదంబు పరం బగునపుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికంబుగ నగు' అని వలనకు ద్వితీయ వచ్చి గర్భమున్+ఉండి అని ఉండగా 'వలన కాదేశంబు లగుద్వితీయాసప్తములమీఁదియుండికి లోపంబు బహుళంబుగా నగు' అనేసూత్రంచేత ఉండి లోపించి (అదితి) గర్భమున్ అని అవుతుంది. ఉండి లోపించకపోతే గర్భమునుండి.

గర్భశబ్దంపై 'అపాయభయ-- సూత్రంచే రావలసిన వలన విభక్తిని బాధించి' ఒకానొక విభక్తికి మఱి యొకవిభక్తియు నగు' అనే సూత్రంచేత ద్వితీయ రాగా 'గర్భమున్' అని అవుతుంది అని బాలవ్యాకరణమతం.

**9. కలుగంగఁబట్టి:** (కలుగుధాతువుపై నుజి ప్రత్యయమై కలుగన్. దానిమీద 'నుజి' అంతమైన అగుధాతువు చేరి, కలుగంగాన్-దానికి హ్రస్వం రాగా) కలుగంగన్- అనేఅవ్యయశబ్దంపై "కొన్నియెడల హేతువునం దన్వంతక్రియలమీఁదను బట్టి వర్ణకంబు విభాష నగు' అనేవిశేషవిధానంచేత 'పట్టి' అనేపంచమీవిభక్తిప్రత్యయం వచ్చి ద్రుతకార్యాలతో – కలుగంగఁ బట్టి.

**10. వేటకుఁ బోయిరి:** వేట అనేశబ్దం మీద కర్మార్థంలో 'కర్మంబున ద్వితీయ యగు' అని ద్వితీయ వచ్చి పొలమును. ఆద్వితీయకు 'షష్ఠీస్థానికం బగుకువర్ణకం బొక్కొకచో ద్వితీయాదివిభక్తులకు మాఱుగాఁ దత్తదర్థంబులం జూపట్టెడి' అని 'కు' అనే షష్ఠీవిభక్తి వచ్చి పొలమునకున్ అని అవుతుంది. కుషష్ఠి రాకపోతే ద్వితీయతో పొలమున్.

**11. కొండొకసేపునకున్:** కాలపరిమాణాన్ని తెలియజేసే 'కొండొకసేవు' అనేశబ్దంమీద' 'వీప్సయందును గాలపరిమితియందును నామంబులకు గువర్ణకం బగు' అనేసూత్రంచేత 'కు' అనేషష్ఠీవిభక్తి వచ్చి 'కొండొకసేపునకున్' అవుతుంది.

**12. బాహుకు రథంబు గడపునేర్పు:** కడపు అనేధాతుజవిశేషణంతోటి అన్వయం కలిగిన 'బాహుక' అనేకర్తకు అభావార్థకాది యోగంబునం గర్తకుం బ్రథమ యగు' అని ప్రథమావిభక్తి వచ్చి బాహుకుడు.... కడపు. ఆప్రథమకు" ధాతుజవిశేషణభావార్థక పూర్వవ్యవహితావ్యవహిత కర్తృపదప్రథమకుఁ దఱచుగ యొక్క షష్ఠి యగు' అనేసూత్రంచేత 'యొక్క' అనే షష్ఠీవిభక్తి వచ్చి బాహుకు యొక్క'-'యొక్కకు లోపంబు బహుళంబు' అనేసూత్రం (లోని బహుళపదం) చేత యొక్క నిత్యంగా లోపించి బాహుకు రథంబు కడపు నేర్పు. యొక్కవిభక్తి రానిపక్షంలో ప్రథమ విభక్తి అలాగే ఉండి, బాహుకుఁడు రథము గడపు నేర్పు.

**13. ఏనుఁగున నేనుఁగు:** ఏనుఁగు శబ్దంమీద కరణార్థంలో 'కరణ సహార్థ తుల్యార్థ యోగంబులం దృతీయకుం దోడవర్ణకం బగు' అనేసూత్రంచేత తోడప్రత్యయం వచ్చి ఏనుఁగుతోడ. ఈతృతీయకు ('ఒక్కచో ఉదంతజడంబు తృతీయకు నవర్ణకం బగు' అని బాలవ్యాకరణసూత్రంచేత రాకుండగా) 'ఒక్కచో నుదంతం బగునజడంబు తృతీయకును నవర్ణకంబు గానంబడియెడి - అనేసూత్రంచేత (సప్తమీ) నవర్ణకం వచ్చి ఏనుఁగునన్ - (ఏనుఁగు) అయింది.

**14. మనుజుల విప్రుండు:** 'మనుజ' శబ్దంమీద నిర్ధారణలో(అనిర్ధారణషష్ఠికి లోపల వర్ణకం బగు' అని రావలసిన లోపల విభక్తికి బదులు) అందు అనేసప్తమీవిభక్తి వచ్చి మనుజులయందు. ఈ సప్తమికి (జడంబు తృతీయాసప్తములకు ద్వితీయ బహుళంబుగా నగు' అనేసూత్రంచేత ప్రాప్తింపకుండగా) 'కొన్నియెడల నజడంబు తృతీయాసప్తములకును బహుత్వంబున ద్వితీయ చూపట్టెడి' అనేసూత్రం చేత ద్వితీయావిభక్తి వచ్చి మనుజులన్-విప్రుడు. స్థిరపరకతలో ద్రుతం లోపించి-మనుజుల విప్రుండు.

**15. మదనాగ మెదిర్చి:** మదనాగ శబ్దానికి కర్మార్థంలో 'కర్మార్థంబున ద్వితీయ యగు' అని ద్వితీయ వచ్చి మదనాగమును. ఈద్వితీయ (జడంబుద్వితీయకుం బ్రథమ బహుళంబుగా నగు 'అని ప్రథమ రాకుండగా) 'కొన్నియెడల నజడంబు ద్వితీయకును బ్రథమ కానంబడియెడి' అనేసూత్రంచేత ప్రథమావిభక్తి వచ్చి మదనాగము (ఎదిర్చి) - మదనాగ మెదిర్చి.

**16. చిచ్చుఱికిన:** చిచ్చుశబ్దంపై అధికరణార్థంలో 'అధికరణంబునకు సప్తమి యగు' అని సప్తమీవిభక్తి వచ్చి చిచ్చునందు (చిచ్చున) అని కాగా 'ఒక్కొకచో జడంబు సప్తమికిం బ్రథమయు నగు' అనేసూత్రంచేత ప్రథమావిభక్తి వచ్చి (ఉఱికిన)=చిచ్చుఱికిన 'ప్రథమయు అనేచోటిసముచ్చయంచేత ప్రథమ రానిపక్షంలో సప్తమితో-చిచ్చునం దుఱికిన.

**17. తల్లి ద్రౌపదితోడన్ :** ద్రౌపదితోడన్ అనేవిశేష్యాన్ని అనుసరించి తల్లి అనేవిశేషణానికి 'విశేష్యంబునకుంబోలె విశేషణంబునకు లింగవిభక్తివచనంబు లగు' అనేసూత్రంచేత తృతీయా (ఏకవచన) విభక్తి వచ్చి తల్లితోడన్- 'కొన్నియెడల విశేషణంబు ద్వితీయాదులకుఁబ్రథమ చూపట్టెడి' అనేసూత్రంచేత ప్రథమావిభక్తి వచ్చి ' తల్లి(ద్రౌపదితోడన్) ప్రథమ. రానిపక్షంలో తల్లితోడన్ అని తృతీయ అలాగే ఉంటుంది.

**18. ఈతనితో సాటి యనంగ మే లన :** మేలు అనేదానితో అన్వయించేటప్పుడు 'ఈతనితో' అనేచోటి తృతీయావిభక్తికి కొన్ని యెడల విభక్తిపరిణామంబు గ్రాహ్యంబు' అనేసూత్రంచేత - (కంటె వర్ణకం బన్యార్థాదియోగజం బగుపంచమి కగు- అనేసూత్రానికి అనుగుణంగా) ఈతనికంటె (మేలు)- అని పంచమిగా మార్పు చెందుతుంది.

19. నన్ను చెట్టవట్టినన్ : 'చెట్ట' అనేదానికి స్వామి యైన 'నా' శబ్దానికి సంబంధార్థంలో 'శేషషష్ఠికి యొక్కయుగు' అని 'యొక్క' అనేషష్ఠీవిభక్తి వచ్చి నాయొక్క చెట్టవట్టినన్, 'క్రియాన్వయంబున రెండుపదంబులకు స్వ స్వామి సంబంధము గలచో సంబంధిపదంబు షష్ఠికి ద్వితీయ యగు' అనేసూత్రంచేత యొక్కకు ద్వితీయ వచ్చి 'నన్ను' చెట్టవట్టినన్.

20. (మీరు) చూచినారు : చూచిన-అనేధాతుజవిశేషణం తచ్ఛబ్దాంతమై (చూచిన+వారు) చూచినారు అని కాగా ఇది మీరు అనే యుష్మదర్థానికి విశేషణం కాబట్టి 'ప్రథమాంతంబు లగుయుష్మదస్మద్విశేషణంబుల కేకత్వంబున వునులును బహుత్వంబున రు ములు నంతాగమంబులు ప్రాయికంబుగ నగు' అని 'రు' ఆగమమూ. 'ఈయాగమంబులు పరంబు లగునపు డుత్వంబున కత్వం బగు' అని దానిముందు అత్వము(అరు) రావలసి ఉండగా' తచ్ఛబ్దాంతము లగుధాతుజవిశేషణంబులమీఁద నరు చూపట్టదు' అనేసూత్రం చేతరాదు. కాబట్టి చూచినారరు అని కాక, చూచినారు అనే ఉంటుంది.

## 5. సమాసపరిచ్ఛేదం

**1. అరదంబునయురవడి:** అరదంబుయొక్క ఉరవడి అనేఅర్థంలో షష్ఠీతర్పురుష సమాసమై 'సమాసవిభక్తికి లోపం బగు లట్టునకుఁగాదుం అని విభక్తులు లోపించి, అరదంబు + ఉరవడి అని ఉండగా (ఉత్వసంధిని బాధించి) షష్ఠీసమాసమునం దుకారబుకారముల కచ్చు పరం బగునపుడు నగాగమం బగు' అనేసూత్రాన్ని బాధించి 'షష్ఠీతత్పురుషంబులందు నగాగమంబు విభాష నగు' అనే సూత్రంచేత నగాగమం వచ్చి అరదంబున + ఉరవడి. సంధి రాక యడాగమం వచ్చి-అరదంబునయురవడి. విభాష గాబట్టి నగాగమం రాకపోతే బాలవ్యాకరణం ప్రకారం నుగాగమం వచ్చి అరదంబునురవడి. (ఈసమాసప్రాతిపదికపై ఇగ్లౌరై సూత్రంచేత ప్రథమైకవచనలోపం)

**2. రామారావు:** రాముఁడు అనే పురుషసంజ్ఞకు 'రావు' అనే బిరుదవాచకంతో కర్మధారయసమాసం ఏర్పడి రాముఁ డు+రావు. 'కర్మధారయం బియ్యది మిశ్రంబు సిద్ధసమాసంబట్ల యగు' అనేసూత్రంచేత ప్రాతిపదికరూపం మాత్రమే మిగిలి, మిగిలిన దంతా లోపించగా రామ+రావు "కర్మధారయంబు బిరుదాద్యుత్తంపదం బయ్యె నేని ద్వ్యక్షరాదంత స్త్రీ పుం సంజ్ఞావాచకం బగుపూర్వపదంబు నంత్యాక్షరంబున కంతట దీర్ఘంబు బహుళంబుగా నగు' అనేసూత్రంచేత దీర్ఘం వచ్చి రామారావు-ఈసమాసప్రాతిపదిక స్త్రీసమం కాబట్టి దీనిపై ప్రథమైకవచనం లోపించి 'రామారావు' అనేపదం ఏర్పడుతుంది. బహుళం అనడంచేత దీర్ఘం రానిపక్షంలో రామరావు.

**3. సుబ్బిసెట్టి:** సుబ్బఁడు అనేపురుషసంజ్ఞకు సెట్టి అనేబిరుదవాచకంతో కర్మధారయసమాసం అయి సుబ్బఁడు+సెట్టి. 'సమాసవిభక్తి కి లోపం బగు లట్టునకుఁ గాదు' అని విభక్తి లోపించి సుబ్బ+సెట్టి 'ఇటఁ బూర్వపదంబునత్వంబున కిత్వం బగు' అనే సూత్రంలోనిబహుళపదంచేత మొదటిపదం చివరిఅత్వానికి నిత్యంగా ఇత్వం వచ్చి సుబ్బిసెట్టి. ఈసమాసప్రాతిపదిక స్త్రీసమం కాబట్టి ప్రథమైకవచనం లోపించి సుబ్బిసెట్టి-అనేపదం ఏర్పడుతుంది.

**4. నన్నయభట్టు :** నన్న అనేపురుషసంజ్ఞకు 'భట్టు' అనేబిరుదవాచకంతో కర్మధారయసమాసం ఏర్పడి (కర్మధారయం బియ్యది మిశ్రంబు సిద్ధసమాసం బట్ల యగు) నన్న+భట్టు 'కొన్నియెడల నిచ్చో ననాపామాయాగమంబు లగు' - అనేసూత్రంచేత 'అయ' ఆగమమై నన్న+అయ+భట్టు. 'అంద్వవగాగమంబులం దప్ప' అని సంధి జరిగి నన్నయభట్టు. (ఈ సమాసప్రాతిపదికపై ప్రథమైకవచనం లోపించింది).

**5. ముంగోపము:** క్రొత్తాదులలోని 'ముందు' అనే(ఆచ్ఛిక)శబ్దానికి కోపము అనేతత్సమశబ్దంతో సమాసం చేయదలచినపుడు 'క్రొత్తాదులు లుప్తశేషంబులు దేశ్యంబులతోడంబలె 'దత్సమంబులతోడం గొన్నియెడలఁ గర్మధారయం బగు' అనేసూత్రంచేత

మొదటిఅక్షరం మిగిలి దానికి పై తత్సమశబ్దంతో సమాసమై (విభక్తులు లోపించి) ము+కోప. "సమాసమందుఁ దత్సమంబు పరం బగునపుడును నుమాగమాదులు గానంబడియెడి' అనేసూత్రంచేత నుమాగమం వచ్చి మును+కోప-ద్రుతకార్యాలతో (ప్రథమైకవచనంలో) ముంగోపము.

**6. చదువునట్లు:** చదువు అనేధాతుజవిశేషణానికి "ధాతుజవిశేషణంబులు తథార్థకావ్యయంబుతోడం గర్మధారయం బగు' అనే సూత్రంచేత 'అట్లు' అనేఅవ్యయంతో కర్మధారయసమాసమై చదువు+అట్లు. 'ఉదంత మగుతద్ధర్మార్థకవిశేషణంబుల కచ్చు పరం బగునపుడు నుగాగమం బగు' అనేసూత్రంచేత నుగాగమం వచ్చి చదువునట్లు.

**7. అట్టిండు:** అట్టి అనేవిశేష్యణంపై విభక్తివివక్షలో తచ్ఛబ్దంచేరి మహదర్థంలో ప్రథమావిభక్తి ఏకవచనంలో అట్టి+వాఁడు అని ఉండగా 'అట్టి యిట్టి యెట్టి విశేషణంబులమీఁది తచ్ఛబ్దవకారంబునకు లోపంబు విభాష నగు' అనేసూత్రంచేత 'వా' అనేఅక్షరం లోపించి అట్టిఁడు. 'జిత్తు బిందుపూర్వం బగు' అనేసూత్రంచేత డువర్ణానికి పూర్వంలో నిండుసున్న వచ్చినపక్షంలో అట్టిండు.

**8. ముయ్యేడు:** మూఁడు శబ్దానికి ఏడు శబ్దంతో కర్మధారయసమాస మై మూఁడు + ఏఁడు- అని ఉండగా 'సమానాధికరణం బగునుత్తరపదంబు పరం బగునపుడు మూఁడుశబ్దము డుజ్వర్ణంబునకు లోపంబును, మీఁదిహల్లునకు ద్విత్వంబు నగుం అనేసూత్రంచేత డుజ్‌లోపించి (మూ+ఏడు)(యడాగమమై, -మూ+యేడు) మీది హల్లుకు ద్విత్వం వచ్చి ముయ్యేడు. అద్విరుక్తం బగు హల్లు పరం బగునపు మొదటడాచ్చికం బగుదీర్ఘంబునకు హ్రస్వం బగు' అని హ్రస్వం వచ్చి ముయ్యేడు. 'ముయ్యేడ్వాదులందు హ్రస్వద్విత్వంబులు నిత్యంబులు' అనేసూత్రంప్రకారం హ్రస్వద్విత్వాలు నిత్యం కాబట్టి మూడేడు-అనే విధంగా హ్రస్వద్విత్వాలు రానిరూపాలు ఉండవు.

**9. గనగననినిప్పులు :** గనగన అనే ధ్వన్యనుకరణ విశేషణశబ్దానికి నిప్పులు అనేవిశేష్యంతో కర్మధారయసమాసం ఏర్పడి విభక్తులు లోపించి గనగన + నిప్పు అని ఉండగా "ధ్వన్యనుకరణశబ్దంబులు కొన్నింటినందు నిగాగమం బగు' అనేసూత్రంచేత నిగాగమం వచ్చి గనగననినిప్పు. ఈసమాసప్రాతిపదికపై ప్రథమాబహువచనంలో 'లువర్ణంబు బహువచనంబు' అని లువర్ణకమై గనగననినిప్పులు.

**10. కమ్మందేనె :** కమ్మనయిన తేనె అనేఅర్థంలో కమ్మ అనేవిశేషణానికి తేనె అనేవిశేష్యంతో కర్మధారయసమాసమై (విభక్తులు లోపించి) కమ్మ+తేనె. 'గుణవచనంబు లగునల్లాదులకుం గర్మధారయంబునందు నిగాగమంబు బహుళంబుగా నగు' అని నిగాగమం వచ్చి కమ్మని+తేనె. 'గుణవాచకంబులు కొన్నింటినిగాగమంబునకుఁ బరుషంబులు పరంబు లగునపుడు బిందు వగు' అనేసూత్రంచేత నివర్ణానికి అరసున్న వస్తే కమ్మఁదేనె. నిండుసున్న వస్తే కమ్మందేనె. ఈబిందువు వచ్చేటప్పుడు పైపరుషం సరళం అవుతుం దని వ్యాకర్త చెప్పలేదు. లక్ష్యానుగుణంగా గ్రహించాలి.

**11. చక్కంగ:** (చక్క అనేగుణవాచకానికి ' నవర్ణకంబు గుణవచనంబు లగునల్లాదుల కగు' అని నవర్ణకం వచ్చి చక్కన. ఇది క్రియకు విశేషణ మైనపుడు 'నుజ్యంతం బగునగుధాతువు క్రియావిశేషణంబుల కనుప్రయుక్తం బగు, నుజ్‌కి విభాష నగు అని 'కాను' అనేది చేరి చక్కన+కాను. 'దానికి హ్రస్వంబు విభాష నగు' అని హ్రస్వం వచ్చి చక్కన+కను. 'ప్రథమమీఁదిపరుషములకు గసడదవలు బహుళంబుగా నగు' అనేసూత్రంలో బహుళశబ్దంచేత గకారం నిత్యంగా వచ్చి) చక్కన+గను అని ఉండగా అగుణవాచకంబు క్రియావిశేషణం బగుచో నొక్కెడ నవర్ణకంబునకు బిందువు గానంబడియెడి' అనేసూత్రంచేత నవర్ణంస్థానంలో అరసున్న వస్తే చక్కఁగను. నిండుసున్న వస్తే చక్కంగను.

**12. తమ్ముఁగుఱ్ఱలు:** కుఱ్ఱలైన తమ్ములు అనేఅర్థంలో కుఱ్ఱలు అనేవిశేషణానికి తమ్ములు అనేవిశేష్యంతో కర్మధారయసమాసం ఏర్పడి కుఱ్ఱలు+తమ్ములు అని ఉండగా 'తమ్ముఁగుఱ్ఱలు చిలుకమొకరి యిత్యాదులు విశేష్యపూర్వపదకర్మధారయంబులు' అనే సూత్రంచేత విశేష్యమైన 'తమ్ములు' అనేది సమాసంలో పూర్వపదంగా మారి (తమ్ములు+కుఱ్ఱలు) విభక్తులు లోపించి (తమ్ము+కుఱ్ఱ) సూత్రనిర్దేశసామర్థ్యంచేత నుగాగమం వచ్చి ద్రుతకార్యాలతో (తమ్ముఁ గుఱ్ఱ) ప్రథమాబహువచనంలో తమ్ముఁగుఱ్ఱలు అని అవుతుంది.

**13. అలరుఁబోఁడి :** అలరువంటి పోఁడి (మనోజ్ఞత్వము కలది) అనేఅర్థంలో 'అలరు' అనే (ఉపమాన) విశేషణానికి, పోఁడి అనే విశేష్యంతో 'అలరుఁబోఁడీత్యాదు లుపమానపూర్వపదకర్మధారయంబులు' అనేసూత్రంచేత (ఉపమానపూర్వపద) కర్మధారయసమాసం ఏర్పడి 'అలరు+పోఁడి'. – అని ఉండగా 'ఇటఁ బోఁడి పరం బగుచో నెల్లెడల ను మ్మగు' అనే ప్రౌఢవ్యాకర్త వివరణాన్ని అనుసరించి నుగాగమం వచ్చి ద్రుతకార్యాలు జరిగి 'అలరు'బోఁడిం అని అవుతుంది.

**14. నల్దిక్కు:** నాలుగైన దిక్కులు అనేఅర్థంలో నాలుగు అనేసంఖ్యావిశేషణానికి 'దిక్కు' అనేసంస్కృతసమవిశేష్యంతో మిశ్రకర్మధారయసమాస మై నాలుగు+దిక్కు అని ఉండగా సామాసికవర్ణవికారాలతో నలు+దిక్కు – నల్దిక్కు. అని కాగా బహుత్వార్థంలో ఉంది కాబట్టి ఈసమాసప్రాతిపదికపై బహువచనం రావాలి. ('ద్విగువున కేకవచనంబు ప్రాయికంబుగ నగు మిశ్రంబునకు ఁగాదు' అనే సూత్రంచేత ఈమిశ్రద్విగువుకు ఏకవచనం రాకపోతుంటే) 'ఒక్కచో ద్విగువు మిశ్రం బేకవచనాంతంబు నగు' అనేసూత్రంచేత ఏకవచనం వస్తుంది. ప్రథమావిభక్తిలో (ప్రథమైకవచనం లోపించి) నల్దిక్కు. ఏకవచనం రానిపక్షంలో బహువచనంతో నల్దిక్కులు అని ఉంటుంది.

**15. పండ్రెండు:** (పది అధిక మైనరెండు అనేఅర్థంలో) పది + రెండు అని ఉండగా 'పదికి రెం డిరు తొమ్మిదులు పరంబు లగునపుడు బిందుపూర్వకడకారంబును, ద్విరుక్తనివర్ణంబును బిందువును గ్రమంబున దివర్ణంబున కగు' అనేసూత్రంచేత 'ది'వర్ణం స్థానంలో 'ండ్' అనేది ఆదేశ మై పండ్+రెండు. పండ్రెండు.

**16. ఏఁబది:** ఏను (ఐదు) అయిన పదులు అనేఅర్థంలో ఏను అనేవిశేషణానికి, పది అనేవిశేష్యంతో కర్మధారయసమాస మేర్పడి ఏను+పది అని ఉండగా "పది యుత్తరపదం బగుచో నేను దొమ్మిలనుమ్ములకు బిందువును ఎని కెనును, ఏడునకు వర్ణవ్యత్యయంబును, ఆపరుషంబునకు సరళంబును గ్రమంబుగ నగు' అనేసూత్రంచేత 'ఏను' లో నువర్ణానికి అరసున్న వచ్చి (ఏఁ+పది) పది పకారానికి బకారమై ఏఁబది. 'పది యుత్తరపదం బగుచోఁబూర్వపదంబుదీర్ఘంబునకు హ్రస్వం బగు' అని రావలసిన హ్రస్వం' ఏను నేకు రాదు' అని ఏనులో ఏకు రాదు. కాబట్టి దీర్ఘం అలాగే ఉండగా 'దీర్ఘముమీఁద సాధ్యపూర్ణము లేదు' కాబట్టి నిండుసున్న రాదు. (ఏంబది అని కాదు).

**17. ముప్పది**: మూఁడు + పది అని ఉండగా 'సంఖ్యావాచకంబులకు విభక్తి పరం బగునపుడు కొన్నింటియంత్యాక్షరంబులకు లోపం బగు' అనేసూత్రంచేత సమాసంలో 'డుజ్' లోపించి మూ+పది. 'పది యుత్తరపదం బగుచోఁబూర్వపదంబు దీర్ఘంబునకు హ్రస్వం బగు, ఏనునేకు రాదు' అని మూదీర్ఘం హ్రస్వ మై ము+పది. " ప్రాప్తహ్రస్వంబు లగు మూ డేలమీఁదివర్ణంబులకు ద్విత్వంబు బహుళంబుగా నగు అనేసూత్రంచేత మీదిహల్లుకు ద్విత్వ మై ముప్పది.

**18. నలువది :** నాలుగు+పది అని ఉండగా 'సంఖ్యావాచకంబులకు విభక్తి పరంబగునపుడు కొన్నింటియంత్యాక్షరంబులకు లోపం బగు' అని 'గు' వర్ణం లోపించి నాలు+పది. 'పది యుత్తరపదం బగుచోఁ బూర్వపదంబు దీర్ఘంబునకు హ్రస్వం బగు,

ఏను నేకు రాదు' అనేసూత్రంచేత దీర్ఘానికి హ్రస్వం వచ్చి, నలు+పది. ప్రథమమీఁదిపరుషములకు గసడదవలు బహుళంబుగా నగు' అనేసూత్రంలోని బహుళశబ్దంచేత ఇక్కడ పకారానికి వకారం నిత్యంగా వచ్చి నలువది.

**19. ఎనుబది:** ఎనిమిది + పది అని ఉండగా 'సంఖ్యావాచకంబులకు విభక్తి పరం బగునపుడు కొన్నింటియంత్యాక్షరంబులకు లోపం బగు' అనేసూత్రంచేత అంత్యాక్షరమూ (ది), 'అక్షరంబులకు' అనడంచేత ఇక్కడ ఉపాంత్యాక్షరం(మి) కూడా లోపించి ఎని+పది. 'పది యుత్తరపదం బగుచో నేనుదొమ్ముల నుమ్ములకు బిందువును, ఎని కేనును, ఏడునకు వర్ణవ్యత్యయంబును ఆపరుషంబునకు సరళంబును గ్రమంబుగ నగు' అనేసూత్రంచేత 'ఎని'కి ఎను ఆదేశ మై (ఎను+పది) పదిలో పకారం బకార మై ఎనుబది అని అవుతుంది.

**20. డెబ్బది:** ఏడు + పది అని ఉండగా. పది యుత్తర పదం బగుచో...... అనే సూత్రంచేత ఏడులో వర్ణాలు తారుమా రయి (డు+ఏ=)డే- పది పకారం బకార మై డే+బది. 'పది యుత్తరపదం బగుచోఁ బూర్వపదంబు దీర్ఘంబునకు హ్రస్వం బగు. ఏను నేకు రాదు' అని 'డే' కు హ్రస్వం వచ్చి డె+బది. 'ప్రాప్తహ్రస్వంబు లగు మూ డేలమీఁదివర్ణంబులకు ద్విత్వంబు బహుళంబుగ నగు' అని బహుళగ్రహణంచేత ద్విత్వం నిత్యంగా వచ్చి డెబ్బది.

**21. పన్నిద్దఱు:** పది+ఇరుగురు అని ఉండగా 'పదికి రెం డిరు తొమ్మిదులు పరంబు లగునపుడు బిందుపూర్వకడకారంబును, ద్విరుక్తనివర్ణంబును బిందువును గ్రమంబున దివర్ణంబున కగు' అనేసూత్రంచేత 'ది' వర్ణం స్థానంలో, 'న్ని' వర్ణం వచ్చి పన్ని + ఇరుగురు 'ఇరుగురున కిద్ద ఱాదేశం బగు' అని ఇరుగురు శబ్దం స్థానంలో ఇద్దఱు ఆదేశ మై పన్ని+ఇద్దఱు-(సంధి జరిగి) పన్నిద్దఱు. ఇద్ద ఱాదేశం కాకపోత ఇరుగురు అలాగే ఉండి పన్నిరుగురు.

**22. అన్నాదమ్ములు :** అన్నయును, తమ్ముఁడును అనేఅర్థంలో 'ఆచ్ఛికశబ్దంబుతోడ స్త్రీసమంబు ప్రాయికంబుగ ద్వంద్వం బగు' అని ద్వంద్వసమాస మేర్పడి అన్న + తమ్ముఁడు. సమాసవిభక్తి లోపించి అన్న + తమ్ము. 'కొన్నియెడల మహద్వంద్వంబునం బూర్వ పదాంత్యస్వరంబునకు దీర్ఘంబునుం జూపట్టెడు' అనేసూత్రంచేత మొదటిపదం చివరిఅచ్చుకు దీర్ఘం వచ్చి అన్నా + తమ్ము (ద్వంద్వంబునం బదంబుపయిపరుషములకు గసడదవ లగు' అని దకారం వచ్చి అన్నా దమ్ము) ఈసమాసప్రాతిపదికపై ప్రథమా విభక్తిలో 'లు వర్ణంబు బహువచనంబు' అని లు వర్ణకమై అన్నాదమ్ములు.

**23. వెచ్చసచ్చములు:** వెచ్చమును సచ్చమును అనేఅర్థంలో "ఆచ్ఛికశబ్దంబుతోడ స్త్రీసమంబు ప్రాయికంబుగ ద్వంద్వం బగు' అనేసూత్రంచేత క్లీబసమానికి (వెచ్చము) ద్వంద్వసమాసం కలగకపోతుండగా 'ఒకానొకచో ద్వంద్వంబునం బూర్వపదంబు క్లీబసమం బగు నగుచో నాముపర్ణకంబునకు లోపం బగు' అనేసూత్రంచేత ద్వంద్వ సమాస మై, ముపర్ణకం లోపించి, ఉత్తరపదంలో సమాసవిభక్తి లోపించి, వెచ్చ + సచ్చ - ప్రథమాబహువచనంలో వెచ్చసచ్చములు అని అవుతుంది.

**24. కూరగాయ**: కూరయును, కాయయును అనేఅర్థంలో ద్వంద్వసమాస మై, గసడదవాదేశంతో కూరగాయ - అనే సమాసప్రాతిపదిక-ఏర్పడుతుంది. ఇది బహుత్వార్థంలో ఉన్నది కాబట్టి బహువచనం రావలసిఉండగా ' ద్వంద్వం బప్రాణివాచక కృదంత శబ్దఘటితం బేకవచనాంతంబు నగు' అనేసూత్రంచేత ఏకవచనం వస్తుంది. ఇది స్త్రీసమం కాబట్టి ప్రథమావిభక్తిలో 'స్త్రీలింగంబుల ప్రథమైకవచనంబునకు లోపం బగు' అని ఏకవచనం లోపించగా - కూరగాయ. 'ఏకవచనాంతంబును' అనేచోటిసముచ్చయంచేత ఏకవచనం రానిపక్షంలో బహువచనంతో కూరగాయలు.

**25. ఔగాములు:** ఔట(అగుట)యును, కామియును అనేఅర్థంలో ఔట, కామి అనేశబ్దాలకు "ఆఛ్చికశబ్దంబుతోడ స్త్రీసమంబు" అనేసూత్రంచేత ద్వంద్వసమాస మేర్పడి ఔట+కామి అని ఉండగా 'భావద్వంద్వంబునం దొలిపదంబు ట వర్ణకంబునకు లోపం బగు' అనేసూత్రంచేత మొదటిపదం చివర ట ప్రత్యయం లోపించి ఔ+కామి (ద్వంద్వంబునం బదంబుపయి పరుషములకు గసడదవ లగు అని) గసడదవాదేశం. వచ్చి ఔగామి. ఈసమాసప్రాతిపదిక ప్రథమావిభక్తిలో బహువచనంతో ఔగాములు అని అవుతుంది.

**26. తొవదమ్మివిందు** : తొవవిందును, తమ్మివిందును అనేఅర్థంలో 'ఆఛ్చికశబ్దంబుతోడ స్త్రీసమంబు' అనేసూత్రంచేత ద్వంద్వసమాసమై (సమాసవిభక్తి లోపించి) తొవవిందు+తమ్మివిందు. "ద్వంద్వంబునం బూర్వపదాంత్యావయవంబునకు లోపం బొండె నగు' అనేసూత్రంచేత మొదటిపదంలో రెండవభాగం లోపించి తొవ+తమ్మివిందు, 'ద్వంద్వబునం బదంబుపయి పరుషములకు గసడదవ లగు' అని గసడదవాదేశం వచ్చి తొవదమ్మివిందు. 'ద్వంద్వం బప్రాణివాచకకృదంతశబ్దఘటితం బేకవచనాంతంబు నగు' అని ఏకవచనం వస్తుంది. స్త్రీసమం కాబట్టి ప్రథమావిభక్తిలో ఏకవచనం లోపించి – తొవదమ్మివిందు. 'ఏకవచనాంతంబును' అనేచోటిసముచ్చయంచేత ఏకవచనం రాకపోతే బహువచనంతో తొవదమ్మివిందులు.

**27. అవసరమక్కఱలు :** అవసరమును అక్కఱయును అనేఅర్థంలో తత్సమ మైన అవసరము (స్త్రీసమం కాదు) శబ్దానికి 'ఆఛ్చికశబ్దంబుతోడ స్త్రీసమంబు' అనేసూత్రంచేత ద్వంద్వసమాసం కలుగకపోతుండగా 'ఒకానొకచో ద్వంద్వంబు మిశ్రంబుగను నందలిపూర్వపదంబు క్లీబసమంబుగను గానంబడియెడి' అనేసూత్రంచేత ద్వంద్వసమాస మై అవసరము + అక్కఱ 'సమాసవిభక్తికి లోపం బగు' అని ఉత్తరపదవిభక్తి లోపించగా కవిప్రయోగానుగుణంగా పూర్వపదవిభక్తిమాత్రం లోపించక ఉత్వసంధి జరిగి 'అవసరమక్కఱ'. ఈసమాసప్రాతిపదిక ప్రథమాబహువచనంలో 'అవసరమక్కఱలు' అవుతుంది.

**28. పదికడవలనేయిఁ బెరుగు:** "ఒక్కొకచో సమాసగతపూర్వపదంబు వ్యవహితోత్తరపదం బొంటితోడను, వానిపెక్కింటితోడను నన్వయించెడి' అనేసూత్రంప్రకారం 'పదికడవలనేయి' అనేసమాసంలో పూర్వపద మయిన 'పదికడవల' అనేశబ్దం 'నేయి' అనే ఉత్తరపదంతోపాటు పెరుగు, పాలు మొద లైనతరువాతిపదాలతో గూడా అన్వయిస్తుంది. పదికడవలపెరుగు, పదికడవలపాలు మొ॥.

**29. వారణావతంబునవారు** : వారణావతంబునన్ అనే సప్తమీవిభక్త్యంతపదానికి 'వారు' అనేమీదిపదంతో (సప్తమీ)తత్పురుష సమాసం ఏర్పడగా 'సమాసవిభక్తికి లోపం బగు లట్టునకుఁ గాదు' అనేసూత్రంచేత (ఉత్తరపదవిభక్తితోపాటు) పూర్వపదవిభక్తి అయిన 'న' వర్ణకం లోపించవలసి ఉండగా' కొన్నియెడల సప్తమీతత్పురుషమునందు నవర్ణకంబు నగు' అనేసూత్రంప్రకారం లోపించదు. 'సమాసంబునయందు ద్రుతంబునకు లోపం బగు' అని ద్రుతం మాత్రం లోపించి ప్రథమాబహువచనంలో వారణావతంబునవారు అని అవుతుంది.

**30. అందాఁక:** అంత+దాఁక – అనే ఆఛ్చికశబ్దాలకు ఏర్పడినసమాసంలో అంత+దాఁక, అని ఉండగా. 'ఆఛ్చిక సమాసములం దఱచుగ వర్ణలోపాగమాదేశవికారంబులు నిత్యవైకల్పికములుగా 'బెక్కులు గానంబడియెడి' అనేసూత్రంచేత 'త' వర్ణం లోపించి. క అని అవుతుంది. ఈలోపం వైకల్పికం. కాబట్టి లోపం రాని పక్షంలో అంతదాఁక.

**డాక్టర్. అంబడిపూడి నాగభూషణం**

**పాఠం - 11**

# ప్రౌఢవ్యాకరణం

## పారిభాషికపదవివరణం

**1. అంతస్థము :** ( యరలవా అంతస్థాః) య-ర-ల-వ. అనే నాలుగు వర్ణాలకు అంతస్థాలు అని పేరు. స్పర్శ (క కారంనుంచి మ కారం వరకున్న ) వర్ణాలకూ, ఊష్మ (శషసహ) వర్ణాలకు నడుమ (అంతః) ఉన్న (స్థ) వర్ణాలు కాబట్టి వీటికి అంతస్థాలు అని సంజ్ఞ, ఉచ్చారణంలో గాలి లోపల నిలిచిఉండడంచేత కూడ ఇవి అంతస్థాలు.

**2. అకప్రత్యయాంతావ్యయం :**(సంజ్ఞ. 8) అక అనేప్రత్యయం అంతంలో కలిగిన అవ్యయం అకప్రత్యయాంతావ్యయం. 'కజి వ్యతిరేకక్త్వార్థంబునం దగు' అని వ్యతిరేకక్త్వార్థంలో విధింపబడిన 'క' ప్రత్యయానికి ముందు ఉత్వానికి అత్వం వస్తుంది. అవి రెండూ కలిపి 'అక' ప్రత్యయం అన్నాడు ప్రౌఢవ్యాకర్త. అను- అక, అనక. మొ. ఇలాగే లేక, ఈక మొ. కూడా అక ప్రత్యయాంతాలే. కాగా అకప్రత్యయాంతం అంటే వ్యతిరేకక్త్వార్థకం అని అర్థం. ఇది క్రియయొక్క అపరిసమాప్తిని తెలియజేసేది కాబట్టి అసమాపకక్రియ. ఆక్రియార్థ మైనవ్యాపారం జరిగిపోవడంచేత భూతకాలిక అసమాపకక్రియ. అది వ్యతిరేకార్థంతో ఉండడంవల్ల వ్యతిరేకార్థక భూతకాలిక అసమాపకక్రియ అని వ్యాకర్త వివరించాడు.

**3 అక్షరము :** ( ఉభయే త్వక్షరాణి, అనుస్వారో వ్యంజన శ్చాక్షరాంగమ్) హ్రస్వం, దీర్ఘం (ప్లుతం) అనేభేదం కలిగిన అచ్చు- అక్షరం. అనుస్వారం, (విసర్గ) పొల్లుహల్లు అనేవి అక్షరంలో భాగాలే కాని అక్షరాలు కావు. 1 అచ్చు (అ మొ॥) 2 అచ్చుతో గూడిన హల్లు(లు) 3(క, క్ర, మొ.) 3.అనుస్వార, విసర్గలతో గూడిన అచ్చు (అఁ, అం, అః), అనేవి అక్షరం అనే సంజ్ఞ కలిగినవి.

**4. అగ్రామ్యం :**(సంజ్ఞ. 12) 'లక్షణవిరుద్ధం బగుభాష గ్రామ్యంబు' వ్యాకరణానికి విరుద్ధంగా ఉన్నశబ్దానికి గ్రామ్యం అని పేరు. గ్రామ్యం కానిది అగ్రామ్యం. అంటే లక్షణబద్ధ మైనది అని అర్థం. 'ప్రాణగొడ్డ మగ్రామ్యంబు నాఁ దగు' అంటే ప్రాణగొడ్డము అనేశబ్దం లక్షణబద్ధ మై, సాధు వయినపదమే అని తాత్పర్యం. ఇలాగే కఱకంఠుఁడు మొ.

**5 అనుస్వారము :** (అనుగతః స్వరాన్ ఇతి అనుస్వారః) స్వరాలను అంటే అచ్చులను (ఉచ్చారణంలో, లేఖనంలో కూడా) అనుసరించి ఉండేది కాబట్టి అనుస్వారం. ఇది తెలుగులో పూర్ణానుస్వారం (నిండుసున్న) అర్ధానుస్వారం (అరసున్న) అని రెండు రకాలు. అం- అఁ, అనుస్వారం కాబట్టి పూర్వంలో అచ్చు లేకుండా ఇది ఉండదు. (పొలఁతి, పొత్తి)

**6. అన్నంత(క్రియ)ము:** 'అన్' అనేప్రత్యయం చివర కలిగినది అన్ప్రత్యయాంతం. అన్+అంత – అన్నంతము. 'తుమర్థభావ లక్షణంబులందు నుజి యగు' అని వచ్చిన ను(జి) ప్రత్యయం, 'జీత్తు పరం బగునపుడుత్వంబున కత్వం బగు' అని దానికి ముందు (ధాతువు చివరి ఉత్వానికి) వచ్చే అత్వం, కలిసి (అను) ప్రత్యయంగా ప్రౌఢవ్యాకర్త వ్యవహరించాడు. ఇది నుజ్యంతం, తుమర్థక్రియ మొ॥ వండు – వండన్ – మొ॥

6. అప్రాణివాచకము - (చూ. జడము.)

**7. అలఘురేఫం :**(సంజ్ఞ.9) 'విఱుగు, మెఱుగు ఇత్యాదులందలిరేఫం బలఘువు. ఇదే శకటరేఫ మని చెప్పంబడు' అనేవివరణాన్నిబట్టి శకటరేఫ, అంటే బండిఱాకు అలఘురేఫ అని పేరు. 'య స్యోచ్చారణే జిహ్వాగ్రోపాగ్ర మధ్య మూలానాం శైథిల్యం జాయతే స లఘూచ్చారణః' అని చెప్పబడినలఘుత్వం లేనిది కాబట్టి శకటరేఫ అలఘువు. ఉచ్చారణలోని లఘుత్వంవల్ల సాధురేఫ లఘువు. కరుగు, పెరుగు మొ.

**8. అవ్యయం :**(సంజ్ఞ.8) 'సదృశం త్రిషు లింగేషు, సర్వాసు విభక్తిషు, వచనేషు చ సర్వేషు య న్న వ్యేతి త దవ్యయమ్' అవ్యయం అంటే లింగ, విభక్తి, వచన శూన్యం. లింగం, విభక్తి, వచనాలకు సంబంధించి శబ్దంలో ఎటువంటి మార్పు లేక స్థిరంగా ఉండేశబ్దం అవ్యయం. వ్యాకరణంచేత సాధింపబడినఅవ్యయాలను లాక్షణికాలు అంటారు. అకప్రత్యయాంతాలు మొ. అనక, అని, మొ. శబ్దం పుట్టుకతోటే అవ్యయా లయితే అవి ప్రతిపదోక్తాలు. ఆహా, ఓహో. మొ.

**9. ఆంధ్రం :**(సంజ్ఞ.1) 'ఆంధ్రభాషకు వర్ణంబు లేబది యైదు' అని యీసంజ్ఞను ప్రౌఢవ్యాకరణం సూత్రంలో ఉపయోగించింది. 'తెనుగునకు వర్ణములు ముప్పదియాఱు' అని చెప్పిన(సంస్కృతసమేతర మయిన) తెనుగుభాషే ఆంధ్రం. 'ఋఋ ....సంస్కృతసమంబులనుగూడి తెలుగున వ్యవహరింపబడు' అని తెనుగునే తెలుగు అని కూడా అంటారు. సంస్కృతసమంతో కలిసిన(55 వర్ణాల) భాషకు గూడా తెనుగు, తెలుగు, ఆంధ్రం అనే వ్యవహారం సమానం.

**10. ఇప్రత్యయాంతావ్యయం :**(సంధి.12) 'ఇ' అనేప్రత్యయం అంతంలో కలిగిన అవ్యయం ఇప్రత్యయాంతావ్యయం. ఇక్కడి ఇ ప్రత్యయం 'సమానాశ్రయంబులం బూర్వకాలంబునం దివర్ణకం బగు' అని చెప్పబడింది. వచ్చు- ఇ. వచ్చి. చను-ఇ. చని. మొ. ఈ ఇప్రత్యయం చివర కలిగినశబ్దాలు అవ్యయాలు. వీటినే క్త్వార్థకాలు అని వ్యవహరిస్తారు. ఇది క్రియయొక్క అపరిసమాప్తిని బోధించడంచేత అసమాపకక్రియ. ఆక్రియ (జరిగిపోయినదిగా) భూతకాలానికి చెందినది గావడంచేత భూతకాలికాసమాపకక్రియ, అని వివరించాడు ప్రౌఢవ్యాకర్త.

**11. ఉద్దేశార్థము (ఉద్దేశ్యము) :** (కార2) క్రియకు లక్ష్యభూతం కావడం ఉద్దేశం. అలా లక్ష్యభూత మైనది ఉద్దేశ్యం. 'మముగుఱిచి అర్చన చేయగా'. అర్చించడం అనేక్రియకు 'మేము' లక్ష్యంగా చేసికొనడం(ఉద్దేశించడం) ఉద్దేశార్థం. అలా ఉద్దేశింపబడింది కాబట్టి 'మేము' అనేది ఉద్దేశ్యం. (దానికి ద్వితీయావిభక్తి, పైన గురిచి మొ॥ స్తాయి మముగుఱిచి)

5. ఉపమానపూర్వపదకర్మధారయము: - చూ. పుట .

**12. ఏకార్థీభావసామర్థ్యము :** (ఏకార్థీభావలక్షణసామర్థ్యం తు ప్రక్రియాదశాయాం ప్రత్యేక మర్థవత్త్వేన పృథ గ్గృహీతానాం పదానాం సముదాయశక్త్యా విశిష్టైకార్థప్రతిపాదకతారూపమ్) అర్థవంతాలై, ప్రక్రియాదశలో, వేర్వేరుగా ఉన్నపదాలు, సముదాయశక్తిచేత విశిష్టమైన ఒక్కఅర్థాన్ని బోధించడం ఏకార్థీభావసామర్థ్యం. రామునిబాణము (1) రామునియొక్క, (2) బాణము అని వేర్వేరుగా అర్థవంతాలైన పదాలు కలిసి రామునికి సంబంధించినదయిన బాణం అని ఏకార్థాన్ని తెలుపుతుంది. కాబట్టి ఇది ఏకార్థీభావసామర్థ్యం, (వృత్తి రేకార్థీభావ:) ఇటువంటిచోట్ల సమాసం అవుతుంది.

**13. క్రియాజన్యవిశేషణము :** క్రియనుంచి ఏర్పడిన విశేషణరూపం క్రియాజన్యవిశేషణం. క్రియ అంటే ధాతువు అని చింతామణి పేర్కొంది. దానినిబట్టి క్రియాజన్యవిశేషణం అంటే ధాతుజవిశేషణం. ఎడి ప్రభృతి వర్ణకాంతంబు లేదును ధాతుజవిశేషణంబులు. చదివెడువాఁడు. చదువనివాఁడు మొ॥ (చూ. ధాతుజవిశేషణము)

**14. క్రియాప్రయుక్త విశేషణము –** చూ. పుట.

**15. గుణప్రయుక్త విశేషణము –** చూ. పుట.

**16. జాతిప్రయుక్త విశేషణము –** చూ. పుట.

**17. ద్రవ్యప్రయుక్త విశేషణము –** చూ. పుట.

**18. ద్రుతం :**(సంజ్ఞ. 9) ప్రౌఢవ్యాకరణం 'నకారం బసాధారణంబు ద్రుతంబు' అని విశేషంగా పేర్కొన్నది. 'ప్రత్యయం గానీ, ఆగమం గానీ, అవ్యయం గానీ అయి హ్రస్వ మయిన ఉకారంతో కూడిన నకారానికి (ను) ద్రుతం అని సంజ్ఞ. నేను, (ప్రత్యయం) నాచేతను (ఆగమం), రాముడును (అవ్యయం), మొ. 'వలెను' మొ. అవ్యయాలలో చివరి నువర్ణం ద్రుతం. వలెను, పోలెను, మొ. ఈనువర్ణంలో ఉత్వం ఇత్వ మైనా, లేదా ఉత్వ, ఇత్వాలు లోపించి పొల్లునకారంగా మిగిలి ఉన్నా అది ద్రుతమే. హరిని, నాచేతన్ మొ.

**19. ధాతువు :** (భూవాదయో ధాతవః. క్రియావాచినః భ్వాదయః ధాతుసంజ్ఞాః స్యుః) క్రియను (వ్యాపారాన్ని) బోధించే 'భూ' మొదలైన వాటికి ధాతువులు అని పేరు. తెలుగులో గూడ ఇలాగే పనిని తెలియజేసే ప్రకృతులకు ధాతువులు అని పేరు. తిను–చదువు– మొ॥

**20.ధ్వన్యనుకరణం :**(సంధి. 19) ఇతరులు పలికినదానిని యథాతథంగా గ్రహించడం అనుకరణం. ధ్వనిని అనుకరించేశబ్దం ధ్వన్యనుకరణం. గడగడ మొ. ఇక్కడ 'గడగడ' అనేశబ్దం వణకడం(మొద లయినవాటి)లోని ధ్వనిని అనుకరించి చెప్తున్నది. కాబట్టి ధ్వన్యనుకరణం.ఇలాగే సలసల, పుటుక్కున మొ.

**21. నిత్యం :** (సంధి. 1) (నియమేన నియతం వా భవతి ఇతి నిత్యః) లక్షణంచేత చెప్పబడినకార్యం లక్ష్యాలలో నియతంగా అంటే తప్పకుండా వర్తించడం నిత్యం. 'శ్రేష్ఠతావాచకంబు లగునార్యాంబాద్యర్థకశబ్దంబులు పరంబు లగునపు డన్నియచ్చులకు సంధి నిత్యము' రామ–అయ్య. రామయ్య. ఇక్కడ రామయయ్య ఇత్యాదిగా సంధి రాకపోవడం ఉండదు. కాబట్టి నిత్యం.

**21. నిత్య బహువచనాంతము –** చూ. పుట.

**22. నిత్యైకవచనాంతము –** చూ. పుట.

**23. నిర్దేశము :**(సంజ్ఞ. 2) (నిర్దిశ్యతే అభిధీయతే ఇతి నిర్దేశః') లక్షణంచేత కార్యం దేనిని ఉద్దేశించి విధింపబడుతుందో అది నిర్దేశం. 'అకారమునకు ఉకారము వచ్చును' ఇక్కడ ఉకారం విధింపబడింది. అది 'అ' అనేవర్ణానికి చెప్పబడింది. కాబట్టి 'అ' నిర్దేశం.దానికి కార ప్రత్యయం లేదా దీర్ఘం వచ్చి, 'అకారమునకు' లేదా 'ఆకు' అని అవుతుంది.

**24. పూర్వాగమము :** (శబ్ద. 91) ఆగమం బనఁగా వర్ణాధిక్యంబు. వర్ణం (వర్ణాలు) అధికంగా వచ్చి చేరడం ఆగమం. విధింపబడే దానికి పూర్వంలో అంటే మొదట్లో వచ్చి చేరేది పూర్వాగమం. ఉదా : ఇరుగురు. ఇక్కడ 'రు' అనేవిభక్తికి పూర్వంలో ఆగమంగా వచ్చింది కాబట్టి 'గు' అనేవర్ణం పూర్వాగమం.

**25. ప్రధానము :** (శబ్ద.6) 'విశేష్యంబు ప్రధానం బితరంబ ప్రధానంబు' విశేషణం అప్రధానం కాగా విశేష్యం ప్రధానం. కర్త, కర్మ మొద లైనరూపంలో క్రియతో అన్వయం కలిగి (ఉండడం ప్రాధాన్యం) నది ప్రధానం. "ఆర్తరక్షకు శ్రీరాము నభినుతింతు' ఇక్కడ (కర్మగా క్రియతో ఆన్వయిస్తున్న) విశేష్యం అయిన 'శ్రీరాముడు'- ప్రధానం.

**26. భావద్వంద్వము:** (సమా.31) భావార్థకాలు అయిన (కృదంత) శబ్దాలకు చేసినద్వంద్వసమాసం భావద్వంద్వం. ఉదా : చెల్లు చెల్లములు, చెల్లుట, చెల్లమి అనే భావార్థకశబ్దాలకు ఏర్పడింది కాబట్టి ఈద్వంద్వసమాసం భావద్వంద్వం, భావద్వంద్వంలో మొదటి శబ్దం స్వార్థంతో ఉన్నభావార్థకం, రెండవది వ్యతిరేకార్థంతో కూడినభావార్థకం కావడం గమనింపవచ్చు.

**27. భూతకాలికాసమాపకక్రియ :**(సంధి.2) చూ. ఇ ప్రత్యయాంతావ్యయం.

**28. మహద్ద్వంద్వము :** (సమా.28) మహత్తు లయినశబ్దాలకు ఏర్పడినద్వంద్వసమాసం మహద్ద్వంద్వం. మహత్ (మహత్ చ- మహతీ చ) అనేఏకశేషసమాసంచేత మహత్తు – మహతి అనేరెండింటిని బోధిస్తుంది. కాబట్టి స్త్రీ(మహతీ) పురుష (మహత్) వాచకాలకు ప్రత్యేకంగా కానీ, కలిపి కాని ఏర్పడినద్వంద్వం మహద్ద్వంద్వం. అన్నదమ్ములు (పురుష) అక్కచెల్లెండ్రు (స్త్రీ) తల్లిదండ్రులు (స్త్రీపురుష) మొ॥.

**29. లుక్సమాసము :** 'సమాస మనఁగా సంయోగదశయందుఁ గలిగెడు విభక్తిలోపాత్మకపదస్వరూపసంగ్రహము. ఇది లుక్సమాసవిషయము' అని ప్రౌఢవ్యాకర్త సమాసనిర్వచనంలో లుక్సమాసాన్ని వివరించాడు. విభక్తులు లోపించేసమాసం లుక్సమాసం. రామునియొక్క – బాణము అనేపదాలకు సమాసం ఏర్పడగా విభక్తులు లోపించి – రామునిబాణ. ఈసమాసంలో విభక్తులు లోపించాయి కాబట్టి ఇది లుక్సమాసం.

**30. విధానం :**(సంజ్ఞ.2) (అప్రాప్తప్రాపణం విధానమ్.) కలుగజేయబడింది విధానం. దేనికి విధింపబడుతుందో అది నిర్దేశం. దానికి ఏది విధింపబడుతుందో అది విధానం. 'అకారమునకు ఉకారము వచ్చును.' ఇక్కడ 'అ' అనేవర్ణానికి (నిర్దేశం) 'ఉ' అనేవర్ణం వచ్చేటట్లు చెప్పబడింది కాబట్టి 'ఉ' విధానం. దీనికి కార ప్రత్యయం (లేదా దీర్ఘం) వచ్చి ఉకారము (ఊ) అని వ్యవహరింపబడుతుంది. (విధానం సాధారణంగా ప్రథమావిభక్త్యంతంగా ఉంటుంది.)

**31. విధేయవిశేషణము :** దేని నైన (ఉద్దేశ్యాన్ని) గురించి ఏమి చెప్పబడుతుందో అది విధేయం. విశేష్యం (కర్త, కర్మ) లోని జాతి, మొద లైనవిశేషాన్ని తెలిపేది విశేషణం. విధేయం అయిన విశేషణం విధేయవిశేషణం. 'వాని నెఱుఁగు బ్రాహ్మణకులుఁ గాన్' – ఇక్కడ 'వానిని' అనేవిశేష్యం (కర్మ) ఉద్దేశ్యం. దానిలోనిజాతిరూప మైనవిశేషాన్ని చెప్తున్న 'బ్రాహ్మణకులున్' అనేది విశేషణం. ఉద్దేశ్యమైన 'వాని' ని గురించి తెలియవలసినఅంశాన్ని చెప్తున్నది. కాబట్టి 'బ్రాహ్మణకులున్' అనేవిశేషణం విధేయ మై, విధేయవిశేషణమయింది.

**32. విభక్తిపరిణామము:** (కార.26) విభక్తిపరిణామం అంటే విభక్తికి సంబంధించినమార్పు. లక్ష్యంలో ఉన్న నామవిభక్తి అన్వయానికి అనుగుణంగా వేరొకవిభక్తిగా మార్పు చెందడం అని తాత్పర్యం. ఈతనితో సాటి యనంగ మేలన, ఇక్కడ 'ఈతనితో సాటి' అన్నపుడు సాటిశబ్దంతో అన్వయించే 'తో' అనేతృతీయావిభక్తి 'మేలు' తో అన్వయించేటపుడు 'ఈతనికంటె మేలు' అని పంచమిగా మార్పు చెందుతుంది. కాబట్టి ఇది విభక్తిపరిణామం.

**34. విశేషణోభయపదకర్మధారయము :** చూ.పుట

25. విశేష్యలక్షకం: (శబ్ద.12) (ముఖ్యార్థానికి భాధ కలగగా, రూఢి, లేదా ప్రయోజనాన్నిబట్టి ముఖ్యార్థానికి సంబంధించిన వేరొక అర్థాన్ని బోధించే శక్తితో) లక్ష్యార్థాన్ని తెలిపేశబ్దం లక్షకం. విశేష్యాన్ని లక్ష్యార్థంగా చెప్పే విశేషణం విశేష్యలక్షకం. ఉదా: అప్రియంబులు కావించి. ఇక్కడ అప్రియములైన 'పనులు' అనేవిధంగా పనులు అనే విశేష్యార్థాన్ని లక్ష్యార్థంగా చెప్పడంచేత 'అప్రియములు' అనే విశేషణం–విశేష్యలక్షకం.

**35. వీప్స:** (కార.14) (క్రియాగుణద్రవ్యేషు యుగపద్ వ్యాప్తుం ఇచ్ఛా వీప్సా) అనేకమైన వస్తువులు మొ. వానిలో ఒకేసారిగా వ్యాపించే కోరిక వీప్స. 'వీప్సయందును గాలపరిమితియందును నామంబులకుం గువర్ణకం బగు' మ్రానిమ్రానికి. అనేకమయిన మ్రాకులకు – అని అర్థం. అలాగే పోయి, పోయి పుల్లపుల్లగా మొ॥

**36. వైకృతం :**(సంధి.12) చూ. వికృతి.

**36. వ్యత్యయము (వ్యత్యస్తము):** వ్యత్యయం అంటే (విపర్యయం) తారుమారు కావడం. ముందరివర్ణం తరువాతిదీ, తరువాతి వర్ణం ముందరిదీ కావడం వ్యత్యయం. ఒక+అంత. ఇక్కడ 'ఒక'కు వర్ణవ్యత్యయం రాగా క+ఒ. (అంత) కొ (అంత) – కొంత అవుతుంది. ఇలా వ్యత్యయాన్ని పొందినవర్ణం వ్యత్యస్తం. ఇక్కడ క+ఒ= కొ అనేది వ్యత్యస్తం.

**37. వ్యస్తము:** (శబ్ద.4) వ్యస్తం అంటే విడిగా–వేరుగా ఉన్నది. సమాసంగా వేరొకపదంతో కలియకుండా ప్రత్యేకంగా ఉన్నపదం వ్యస్తం. 'రథములు డెబ్బదియొక్కటి' ఇందులో పదాలు రెండూ సమాసంగా కూడా వేరుగా ఉన్నాయి. కాబట్టి వ్యస్తాలు. సమాసంలో ఉంటే సమస్తాలు – డెబ్బదియొక్క రథములు)

**డాక్టర్. అంబడిపూడి నాగభూషణం**

## పాఠం - 12

# ప్రౌఢవ్యాకరణం

## విషయవివరణం


### సంజ్ఞాపరిచ్ఛేదం

1. ఆంధ్రవర్ణాలు
2. చజలు - ప్రౌఢ. చెప్పిన విశేషాలు
3. ద్రుతం - ప్రౌఢ. మతం
4. తత్సమాలు - బాల, ప్రౌఢ. మతభేదాలు
5. దేశ్యాలు - బాల, ప్రౌఢ. మతభేదాలు
6. అనింద్యగ్రామ్యాలు - బాల, ప్రౌఢ. మతభేదాలు
7. అనుకరణసంధికార్యాలు

### సంధిపరిచ్ఛేదం

1. స్వరసంధి - బాల, ప్రౌఢ. మతభేదాలు
2. ప్రౌఢ. చెప్పిన లోపసంధికార్యాలు
3. ప్రౌఢ. చెప్పిన ఆగమసంధికార్యాలు
4. ప్రౌఢ. చెప్పిన ఆదేశసంధికార్యాలు
5. ప్రౌఢ. చెప్పిన గసడదవాదేశవిశేషాలు

### శబ్దపరిచ్ఛేదం

1. సంబోధనంలో చేరేశబ్దాలు
2. విశేషణాలు
3. నిత్యైకవచనాంతాలు
4. నిత్యబహువచనాంతాలు

### కారకపరిచ్ఛేదం

1. కారకాలు
2. ఒకవిభక్తికి మరొకవిభక్తి
3. విశేషణలింగవిభక్తివచనాలు

### సమాసపరిచ్ఛేదం

1. ప్రౌఢ. చెప్పినసమాసవిశేషాలు
2. ప్రౌఢ. చెప్పినద్వంద్వంలో విశేషకార్యాలు

### అనుబంధం
### సామాన్యవిషయప్రస్తావనం

1. ప్రయోగశరణం వ్యాకరణం
2. సూరిసూత్రాలు - సూత్రలక్షణం
3. సూరిసూత్రభేదాలు
4. సూరిసూత్రరచనాపటిమ
5. బాలప్రౌఢవ్యాకరణాలు - సంస్కృతవ్యాకరణప్రభావం
6. ప్రౌఢవ్యాకరణరచనాప్రణాళిక
7. ప్రౌఢవ్యాకరణనామసార్థక్యం
8. త్రిలింగలక్షణశేషనామసార్థక్యం
9. ప్రౌఢవ్యాకరణం బాలవ్యాకరణానికి శేషగ్రంథం

**పాఠం - 12**

# ప్రౌఢవ్యాకరణం

# విషయవివరణం

## 1.సంజ్ఞాపరిచ్ఛేదం

### 1. ఆంధ్రవర్ణాలనుగూర్చి ప్రౌఢవ్యాకర్త చెప్పినవిశేషాలు తెలపండి.

'ఆంధ్రభాషకు వర్ణంబు లేబది యైదు.' అని ప్రౌఢవ్యాకర్త ఆంధ్రభాషకు 55 వర్ణాలు ఉన్నా యని చెప్పాడు. అంతకు ముందు చిన్నయసూరి 'తెనుగునకు వర్ణములు ముప్పదియాఱు' అని తెనుగుభాషకు వర్ణాలు 36 మాత్రమే అన్నాడు. అయితే 'ఋౠ

విసర్గ ఖఛఠథఫ ఘఝఢధభ జఞ శషలు సంస్కృతసమంబులను గూడి తెలుగున వ్యవహరింపబడు' అని సంస్కృతసమాలద్వారా మరో 19వర్ణాలు కొత్తగా తెలుగులో వచ్చి చేరతా యన్నాడు. దీనితో తెనుగు అన్నా తెలుగు అన్నా ఒకటే ననీ, సంస్కృతసమం కలియని అచ్చు మయినతెలుగుకు 36 వర్ణాలు కాగా, సంస్కృతసమాలద్వారా చేరే 19 వర్ణాలతో కలుపుకొని మొత్తం తెలుగుకు వర్ణాలు (36-19) 55 అని స్పష్టం. కాగా 55వర్ణాలుగా ప్రౌఢవ్యాకర్త చెప్పిన ఆంధ్రం కూడా ఆభాషే. తెనుగు, తెలుగు రెండుసంజ్ఞలను సూరి పేర్కొనగా ప్రౌఢవ్యాకర్త మనభాషకు 'ఆంధ్రం' అనే మరోసంజ్ఞను ఈసూత్రంతో పరిచయం చేస్తున్నాడు.

ఆ55వర్ణాలు ఏవి అనేవిషయంలో శాస్త్రకర్తలు విచారణ చేశారు. అహోబలాదులు చేసిన చర్చ సారాంశాన్ని ప్రౌఢవ్యాకర్త సంగ్రహించాడు.

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఎ ఏ ఐ ఒ ఓ ఔ అఁ అం అః. క ఖ గ ఘ ఙ చ ౘ ఛ జ ౙ ఝ ఞ. ట ఠ డ ఢ ణ, త థ ద ధ న, ప ఫ బ భ మ, య ర ల వ, శ, ష, స హ ళ.

**కారం వర్ణాంతరం :** కారస్య ద్వాదశ. తస్య దీర్ఘాభావాత్. అని పాణినీయం సంస్కృతంలో ' ' అనేదీర్ఘం లే దని చెప్పింది. కాబట్టి దీర్ఘ మైన కారం సంస్కృతంలో లేదు. 1. అయినా ఇతరసంస్కృతవ్యాకర్తలు సంస్కృతంలో కారం ఉన్న దన్నారు. 2.వరరుచి, హేమచంద్రుడు మొద లయిన ప్రాకృతవ్యాకర్తలు కూడా సంస్కృతంలో

కారం ఉన్న దన్నారు. 3. మాతృకాపూజనాదులలో (సరస్వతీదేవి ఎడమచెక్కిలిగా) ఉపయోగింపబడుతూ మంత్రశాస్త్రంలో సంస్కృతంలో ప్రసిద్ధం. కాబట్టి కారం వర్ణాంతరంగా అంగీకరించవలసిందే.

యథార్థానికి సంస్కృతంలో గూడా ' కార' శబ్దం తప్ప ' ' కారం ఉన్నపదాలు లేవు. కప్త, (కప్తి) శబ్దంలో ఒకటి రెండుచోట్ల హ్రస్వ మయిన కార మయినా ఉన్న దేమో కాని కారం కనబడదు. కారం అంగీకరించకపోతే భాషకు కలిగే నష్టం ఏమిటో పరిశీలించాలి. ఇపుడు రెండూ పూర్తిగా వ్యవహారంనుంచి పోయాయి.

**అకారం వర్ణాంతరం కాదు :** 'యరలవలు లఘువు లని యలఘువు లని ద్వివిధంబు లగు' అని సాధురేఫ లఘువు కాగా శకటరేఫ అలఘువు. ఈబండిఱాను కొంతమంది వర్ణమాలలో చేర్చారు. 'సప్త త్రింశ దిహ' '...రయుగ' అని అప్పకవి చింతామణిలోనే బండిఱా వర్ణమాలలో చేరింది. అహోబలుడు ఇదీ బాగానే ఉంది అన్నాడు. ప్రౌఢవ్యాకర్త దానిని తిరస్కరించాడు సూరిలాగానే. 'యవల'లలాగా రేఫ కూడా రెండువిధాలు గావడానికి ఉచ్చారణలో ప్రయత్నభేదం మాత్రమే కారణం. స్థాన, కరణ భేదం లేకుంటే వేటినీ, వేరు వర్ణాలుగా పరిగణించడానికి వీలు లేదు. యవల లు అందుకే లఘువులూ అలఘువులూ విడిగా వర్ణమాలలో చెప్పలేదు. లఘు, అలఘురేఫలు కూడా అలాగే, స్థాన, కరణాలు సమానం కావడంవల్ల వేరు వర్ణాలు గావు. కాబట్టి అలఘురేఫ (బండి ఱా)ను వర్ణమాలలో చేర్చరాదు.

**క్షకారం వర్ణాంతరం కాదు :** అనంతుడు మొద లయినతెలుగులాక్షణికులు క్ష కారాన్ని వేరే వర్ణంగా పరిగణించారు. అకారాది క్షకారాంతం అని (అక్షమాల ఇత్యాదులలో) సంస్కృతంలో క్షకారం వర్ణాంతరంగా పేర్కొన్నారు. అచ్చతెలుగులో ఈవర్ణం లేదు. కాబట్టి సంస్కృతసమాలద్వారా సంస్కృతంనుంచి తెలుగులోకి రావాలి. అయితే ఇది కకారం షకారంతో కూడడంవల్ల ఏర్పడినసంయుక్తవర్ణం. వర్ణద్వయమే కాని ఏకవర్ణం కాదు. క్ష అనేది వేరే వర్ణ మయితే అకారాదిక్రమంలో క్షకారాంతశబ్దాలను వేరుగా చూపాలి. కాని సంస్కృతం నిఘంటువుల్లోనూ, ధాతుపాఠంలోనూ అక్ష, భిక్ష ఇత్యాదులను షకారాంతశబ్దాలుగా చూపించారు. కాగా క్షకారం సంయుక్తవర్ణమే కాని, వర్ణాంతరం కాదు.

అయితే క్-ష్ అనేసంయుక్తవర్ణధ్వనికి, క్ష అనేవర్ణం ధ్వనికి భేదం ఉంది. ఆభేదం వల్లనే అది వర్ణాంతర మనే అభిప్రాయానికి అవకాశం గలిగింది. ఏసంయుక్తవర్ణానికి లేనిసందేహం క్ష విషయంలో కలగడానికి కారణం అదే.

**ళకారం :** యవ లకు (సంస్కృతంలోలాగానే) లఘుత్వం కొత్తగా కలిగిన విశేషం. అంటే వర్ణమాలలో ఉన్న యవలు అలఘువులు. ల,ర, విషయంలో అలా కాకుండా అలఘుత్వం విశేషంగా విహితం. అలఘు వనీ, వర్ణాంతర మనీ, సూరి ళకారాలు రెండు చెప్పాడు. యవలకు లేని లఘ్వలఘులిపిభేదం లర (ళఱ) లకు మొదటినుంచీ ఏర్పడింది. సూరి వర్ణాంతర మన్న ళకారాన్ని ప్రాచీనలాక్షణికులు కొందఱు అలఘు వన్నారు. ళకారంగూర్చినవివాదం గురించి ప్రౌఢవ్యాకర్త ప్రస్తావించలేదు.

ఏ మైనా వర్ణమాలను గురించి విస్తృతంగా పరిశోధన జరగవలసింది.

## 2. చజలవిషయంలో ప్రౌఢవ్యాకర్త పేర్కొన్నవిశేషాలను తెలపండి.

'ఇఈఎఏలం గూడినచజలు తాలవ్యంబులు', 'అఆఉఊఔలం గూడినచజలు దంత్యంబులు'. తెలుగులో చకారం. జకారం, అనేహల్లులు వాటిమీద చేరేఅచ్చునుబట్టి తాలవ్యాలు, దంత్యాలు అని రెండు రకాలు. చిలుక, జముదు. మొ. ఈభేదం అచ్చతెలుగులోనే. సంస్కృతంలో చజలు పైన ఏఅచ్చు లున్నా, తాలవ్యాలు మాత్రమే. కాబట్టి తెలుగులోని సంస్కృతసమాల్లోనూ చజలు తాలవ్యాలు మాత్రమే అవుతాయి. అర్చులు, వాజులు, మొద లైనచోట్ల బహువచనంలోనూ, రాజు అనేశబ్దం ఒక్కదానిలోనూ, మాత్రం సంస్కృతసమాల్లో దంత్యత విశేషంగా సూరి పేర్కొన్నాడు.

**ఉభయాలు-**

ఇక్కడ ప్రౌఢవ్యాకర్త 'ఒకానొకచో జకారం బుభయంబు నగు.' అన్నాడు. శ్లేషస్థలంలో జకారం ఒకఅర్థంలో దంత్యమూ, ఇంకో అర్థంలో తాలవ్యమూ అవుతుం దని వివరించాడు.

'పాండురాజయశము' ఇక్కడ పాండు 'రాజ' అన్నపుడు భారతార్థంలో దంత్యం. పాండుర–అజ, అన్నపుడు రామాయణార్థంలో తాలవ్యం.కాబట్టి ఉభయం.

రాజు అనేతీరుగా ఉదంత మయితేనే జకారం దంత్యం. పాండు 'రాజ' అని ఉన్నచోట జకారం తాలవ్యమే. కాబట్టి రెండర్థాలలోనూ ఇక్కడి జకారం తాలవ్యమే. కాబట్టి ఇది సరి ఐనలక్ష్యం కాదు. ధర్మరాజితరక్షమాపాల– మొ. ఉదాహరించుకోవచ్చు.

'తీయగ బంచదార వెనుదీయగ గైకొను నన్ ద్వితీయగన్.' చక్కెర అనేఅర్థంలో ఈఅచ్చతెలుగుశబ్దంలో చకారం దంత్యం. ఐదుగురి(పంచ) భార్య (దార)అనే మరో అర్థంలో సంస్కృతసమంలో తాలవ్యం. ప్రౌఢవ్యాకర్త జకారానికి చెప్పినస్థితి చకారానికి గూడా ఉన్నది.

అయినా ఒకే (అర్థంలో)సారి దంత్యమూ, తాలవ్యమూ, రెండూ కావడం లేదు. అందుచేత ఉభయత్వప్రతిపాదనం సరి కాదు.

**రాజు :**

'రాజు వైకృతం బని కొంద ఱందురు' అని ప్రౌఢవ్యాకర్త రాజుశబ్దం కొందఱిమతంలో తద్భవం అన్నాడు. తద్భవం అయితే అచ్చతెనుగు అవుతుంది. సూరి చెప్పినట్లుగా రాజులో జకారం దంత్యమే అని ప్రౌఢవ్యాకర్త అంగీకరిస్తున్నాడు. కాని సూరి 'రాజు' సంస్కృతసమం అంటే ప్రౌఢవ్యాకర్త అచ్చతెనుగు అంటున్నాడు. అంటే పాండురాజు వంటితత్సమాల్లో జకారం తాలవ్యమే అనాలి. అని ప్రౌఢవ్యాకర్త అభిప్రాయంగా చెప్పాలి. అటువంటపుడు 'జకారం బుభయంబు నగు' అనేసూత్రం దానివివరణం సరి కాకుండాపోతాయి. (రెం డర్థాలలోనూ జకారం తాలవ్యమే అవుతున్నది కదా.)

రాజు తద్భవం అనేవిషయంలో ప్రౌఢవ్యాకర్తకు నిశ్చయం లే దనిపిస్తుంది. అందుకే వైకృతం బని 'కొంద ఱందురు' అని ఉండాలి.

**అర్చులు, వాజులు –**

రాజు వైకృత మయితే 'అపుడు తత్సమంబునందలిచజలు దంత్యములు కా వని యూహించునది.' అన్నాడు ప్రౌఢవ్యాకర్త. అంటే సూరి తత్సమాల్లో దంత్యాలుగా చెప్పిన అర్చులు, వాజులు మొద లయినస్థలాల్లో కూడా చజలు తాలవ్యాలే అని ప్రౌఢవ్యాకర్త భావించిఉండాలి. కాని ఆవిషయం స్పష్టంగా చెప్పలేదు.

ఇంకా అచ్చు మొద లయినసంస్కృతసమాల్లో దంత్యత వినిపిస్తున్నది.

ఏది ఏ మైనా సంస్కృతసమాల్లో దంత్యచజలవిషయమై ప్రౌఢవ్యాకర్తకు ఒకనిశ్చయాభిప్రాయం ఏర్పడలే దని తోస్తుంది.

### 3. ద్రుతాన్నిగూర్చి ప్రౌఢవ్యాకర్త పేర్కొన్నవిశేషాలను తెలపండి.

చూ. 'నకారం బసాధారణంబు ద్రుతంబు' సూత్రవ్యాఖ్య.

## 4. తత్సమాలవిషయంలో బాలప్రౌఢవ్యాకర్తలమతభేదాలను పేర్కొనండి.

సూరి తత్సమాలుగా పేర్కొన్నశబ్దాలు కొన్ని తత్సమాలు గా వని వాటిని వేరేవిధంగా నిరూపిస్తూ ప్రౌఢవ్యాకర్త సూరిమతంతో భేదించటం గమనింపవచ్చు.

**1. కారము :** 'సంస్కృతప్రాకృతతుల్యం బగుభాష తత్సమంబు' అని సూత్రించి సూరి 'కటుః– కారో – కారము' అని 'కారము' అనే తెలుగుశబ్దం 'కారో' అనేప్రాకృతశబ్దంతో తుల్య మనీ, తత్సమ మనీ చెప్పాడు. కాని ప్రౌఢవ్యాకర్త 'కారము క్షారశబ్దభవము' అని సూత్రించి 'క్షార' అనేసంస్కృతశబ్దంనుంచి పుట్టిం దనీ, 'కారము' తద్భవ మనీ చెప్పాడు. కాని క్షారశబ్దానికి కారం అనేఅర్థం లేకపోవడంచేత సూరిమతమె ఉచితం.

**2. విశ్వకర్ముఁడుః** 'విశ్వకర్మాదులకు స్త్రీత్వం బగు' అని సూత్రించి సూరి స్త్రీత్వాతిదేశంచేత దీనికి ఉత్వడుజులు లే వని స్పష్టం చేశాడు. అందువల్ల సూరిలక్షణంచేత, 'విశ్వకర్మ' అనే ఉంటుంది. కాని 'విశ్వకర్ముడు' అని ఉండరాదు. ప్రౌఢవ్యాకర్త 'విశ్వకర్ముఁ డనియు రూపంబు' అని సూత్రించి విశ్వకర్మశబ్దానికి ఉత్వడుజులు (పుంలింగకార్యం) రావడం కూడా ఉన్న దని పేర్కొన్నాడు. 'విశ్వకర్మునికూఁతు' అనేఎఱ్ఱనగారి ఒకే ఒక్క ప్రయోగం గుర్తింపదగియే ఉన్నది.

**3. రాజు :** "మఱియు రాజు శబ్దం బొక్కటి దంత్యయుక్తంబు గానంబడియెడి" అని సూరి సంస్కృతసమ మైన 'రాజు' అనేశబ్దంలో జకారం దంత్య మని వివరించాడు. కాని ప్రౌఢవ్యాకర్త 'రాజు వైకృతం బని కొంద ఱందురు' అని సూత్రించి 'రాజు' అనేది తద్భవంగా కొందఱమతాన్ని ప్రస్తావించాడు. తద్భవ రాజుశబ్దం ఉన్నా 'మహారాజు', 'ఖగరాజు' మొద లైనచోట్ల 'రాజు' సంస్కృతసమం కూడా ఉంది. 'ఒకానొకచో జకారం బుభయంబు నగు' అని చెప్పి 'పాండురాజ' అన్నపుడు తత్సమరాజశబ్దంలో జకారం దంత్యం కావడాన్ని ప్రౌఢవ్యాకర్త కూడా పేర్కొన్నాడు. కాబట్టి ఈవిషయంలో ప్రౌఢవ్యాకర్త నిశ్చయంగా సూరిమతాన్ని విభేదించా దనడానికి లేదు. కాని 'రాజు' అని ఉత్వంతో గూడిఉన్నపుడే తత్సమశబ్దంలో జకారం దంత్య మవుతుం దని సూరిమతం. 'పాండురాజ' అన్నపుడు అత్వంతో గూడినది సూరిమతంలో కూడా తాలవ్యమె. అదీ దంత్యమే అనేప్రౌఢవ్యాకర్తమతం సరి కాదు. అటువంటిఉచ్చారణమూ లేదు.

**4. విధము :** 'కంధరాదులు క్లీబతుల్యంబులు బహుళంబుగా నగు' అని సూత్రించి బహుళశబ్దంచేత విధా అనేస్త్రీలింగశబ్దానికి క్లీబతుల్యత నిత్యంగా వచ్చి విధము అనురూప మేర్పడు నని సూరి పేర్కొనెను. ఇచట ప్రౌఢవ్యాకర్త 'విధాశబ్దంబు సంస్కృతంబునం బుంలింగంబు నగు' అని సూత్రించి పుంలింగ మగు 'విధ' శబ్దమె తత్సమ మయి విధము (వృక్షః – వృక్షము) అని యగు ననియు, స్త్రీలింగ మగు విధా శబ్దమునకు తెలుగున ప్రయోగము లేదనియు చెప్పెను. అనగా 'విధా' శబ్దమునకు సూరి క్లీబతుల్యతను చెప్పుట అనవసర మని ప్రౌఢవ్యాకర్తమతము. కాని యెటనో యొకకోశములో నున్నను పుంలింగ మగు విధ శబ్దము అప్రసిద్ధము. కావున ప్రసిద్ధ మగు స్త్రీలింగశబ్దమునుండియే తత్సమరూపమును సాధించినసూరిమతము సముచితము.

**5. దంష్ట్ర :** 'కంధరాదులు క్లీబతుల్యంబులు బహుళంబుగా నగు' అని సూత్రించి సూరి 'దంష్ట్రా' అనేస్త్రీలింగశబ్దాన్ని కంధరాదులలో చేర్చి వైకల్పికక్లీబతుల్యత్వంచేత దంష్ట్రము-దంష్ట్ర అనేరూపాలను సాధించాడు. ప్రౌఢవ్యాకర్త 'దంష్ట్ర' అని సంస్కృతంలో ఇది పుంలింగం కూడ అయిఉన్నట్లు పేర్కొన్నాడు. పుంలింగశబ్దంనుంచి దంష్ట్రము (వృక్షః-వృక్షము) అనీ, స్త్రీలింగశబ్దంనుంచి దంష్ట్ర అనీ తత్సమరూపం లేర్పడుతుంది. కాబట్టి సూరి దంష్ట్రా శబ్దాన్ని కంధరాదులలో చేర్చి వైకల్పికక్లీబతుల్యత

చెప్ప నవసరం లే దని ప్రౌఢవ్యాకర్తమతం. కాని పుంలింగ దంష్ట్రశబ్దం ఏదో ఒకకోశంలో ఉన్నా అప్రసిద్ధం కావడంచేత ప్రసిద్ధ మైనస్త్రీలింగశబ్దంనుంచే తత్సమరూపాలను సాధించినసూరిమతం ఉచితం.

**6. అర్ఘువు – ధర్మువు:** 'అమహన్నపుంసకముల కదంతములకు ముపర్ణకం బగు' అనేసూత్రంచేత సూరి వీటిమువర్ణ కాంతరూపాలను మాత్రమే సాధించాడు. అర్ఘము–ధర్మము మొ॥ 'అర్ఘాదులకడయచ్చున కుత్వంబును మీఁద వువర్ణకంబును వైకల్పికంబుగా నగు' అని సూత్రించి ప్రౌఢవ్యాకర్త అర్ఘువు, ధర్మువు అనేరీతిరూపాలను విశేషంగా సాధించాడు. ఇలాంటివువర్ణకాంతాలను సూరి తనసూత్రాంధ్రవ్యాకరణంలో సాధించాడు.

**7. రాహు :** 'ఉకారాంతం బగుమహత్తునకు వువర్ణకంబు బహుళంబుగా నగు' అని సూత్రించి రాహువు,(రాహుఁడు) అనేరూపాలను సూరి సాధించాడు. ప్రౌఢవ్యాకర్త 'రాహుబాహుశబ్దంబుల కంతట వువర్ణకలోపంబు వైకల్పికంబు' అని సూత్రించి 'రాహు' అనురూపాన్ని సాధించాడు. పై సూరిసూత్రంచలోని బహుళశబ్దంచేత ఈరూపం బాలవ్యాకరణంలోనూ సాధింపబడుతుంది.

**8. బాహు:** 'ఉకారాంతగోశబ్దంబుల కంతట వువర్ణకం బగు' అనేసూత్రంచేత 'బాహు' అనేరూపం మాత్రమె బాలవ్యాకరణంచేత సిద్ధిస్తుంది. 'రాహుబాహుశబ్దంబుల కంతట వువర్ణకలోపంబు వైకల్పికంబు' అనేసూత్రంచేత ప్రౌఢవ్యాకర్త వువర్ణకం లోపించిన 'బాహు' అనేరూపాన్ని గూడ సాధించాడు. కాని 'బాహు' అను ప్రథమైకవచనాంతరూపం కనబడడం లేదు.

**9. మల్లురు :** 'మల్ల' అనేశబ్దం లోపధం. కాని దీర్ఘపూర్వకం గాకపోవడంచేత 'అదంతం బయి దీర్ఘపూర్వలోపధం బయినమహత్తు మీఁదివిభక్తిలకారంబునకు రేఫం బగు' అనేసూత్రంచేత దానిపైన లకారానికి రేఫం రాదు. కాబట్టి బాలవ్యాకరణంచేత 'మల్లులు' అనే అవుతుంది గాని 'మల్లురు' అని కాదు. 'ద్విత్వయుక్తలాంతంబుమీఁదిలులలకును రుర లాదేశంబు లగు' అనేసూత్రంచేత 'మల్లురు' అనేరూపాన్ని ప్రౌడవ్యాకర్త సాధించాడు. అటువంటిరూపాలు అరుదు. తిక్కనాదులు ప్రాసఘటితంగా 'మల్లులు' అని ప్రయోగించారు.

## 5. దేశ్యశబ్దాలవిషయంలో బాలప్రౌఢవ్యాకర్తలమతభేదాలను పేర్కొనండి.

బాలవ్యాకర్త దేశ్యాలుగా చెప్పిన కొన్ని శబ్దాలను ప్రౌఢవ్యాకర్త దేశ్యాలు కావన్నాడు. మఱి కొన్నింటి విషయంలలోనూ భేదాభిప్రాయాలు గోచరిస్తున్నాయి.

**1. కాఱియ :** 'శకటరేఫము తత్సమతద్భవములందు లేదు' అని బాలవ్యాకర్త పేర్కొన్నాడు. కాని సూరి తననిఘంటువులో 'తద్భవములందును అరుదుగ శకటరేఫము గల' దని చెప్పి 'కాఱియ' అని చూపించాడట. బాలవ్యాకరణంలో తద్భవాలలో శకటరేఫ లే దని నిశ్చయించి, 'ఇయకు మాఱుగా నామాంతంబున కెత్వంబు బహుళంబుగా నగు' అనేచోట 'కాఱియ' శబ్దాన్ని చూపించాడు. దీనినిబట్టి బాలవ్యాకర్త ఇది దేశ్య మని తలచా డేమో అని సందేహం కల్గుతుంది. ప్రౌఢవ్యాకర్త 'తద్భవములందును నలఘురేఫము గలదు' అని సూత్రించి తద్భవాలలో శకటరేఫ ఉండటాన్ని పేర్కొన్నాడు. కారికాశబ్దభవంగా కాఱియ తద్భవ మనీ, ఇలా తద్భవాలలో శకటరేఫ ఉన్న దనీ ప్రౌఢవ్యాకర్తమతం.

**2. కోట :** 'త్రిలింగదేశవ్యవహారసిద్ధం బగుభాష దేశ్యంబు' అని సూత్రించి బాలవ్యాకర్త 'కోట' అనేశబ్దం దేశ్యంగా ఉదాహరించాడు. ప్రౌఢవ్యాకర్త 'కోటపేటలు వైకృతములు' అని సూత్రించి దీన్ని తద్భవంగా పేర్కొన్నాడు. కోట్ట లేదా కోట, అనేసంస్కృతశబ్దాలనుంచి ఇది తద్భవంగా ఏర్పడిం దని ప్రౌఢవ్యాకర్త మతం. ఏ దైన నిఘంటువులో ఉన్నా ఈశబ్దాలు

అప్రసిద్ధాలు కావటంచేత వీటినుంచి తద్భవంగా కోట ఏర్పడిం దనేప్రౌఢవ్యాకర్త మతంకంటె బాలవ్యాకర్తమతం యుక్తంగా తోస్తున్నది.

**3. పేట** ః 'త్రిలింగదేశవ్యవహారసిద్ధం బగుభాష దేశ్యంబు' అని సూత్రించి బాలవ్యాకర్త 'పేట' శబ్దాన్ని దేశ్యంగా ఉదాహరించాడు. కాని ప్రౌఢవ్యాకర్త 'కోటపేఁటలు వైకృతములు' అని సూత్రించి పేఁట తద్భవ మనీ, పింఠా (విటజనాశ్రయ) శబ్దంనుంచి పుట్టిం దనీ పేర్కొన్నాడు. ప్రౌఢవ్యాకర్త ఇలా పేర్కొనడంలో ఇది దేశ్యం అనేబాలవ్యాకర్తమతం సరి గా దని అభిప్రాయం. కాని బాలవ్యాకర్త దేశ్యంగా చూపిన పేట శబ్దంలో అరసున్న లేదు. దీనికి హారంలోనివరుస మొద లయినవి అర్థాలు. శబ్దరత్నాకరంలో దీనిని ప్రౌఢవ్యాకర్త దేశ్యంగానే పేర్కొన్నాడు. ప్రౌఢవ్యాకర్త తద్భవ మని సూత్రించిన 'పేఁట'లో అఱసున్న ఉన్నది. (నగరం-నగరశాఖ) సూరి ఉదాహరించింది ఇది కాదు. కాబట్టి ఇక్కడ ఇద్దరిమతంలోనూ భేదం లే దనవచ్చు.

**4.కన్య** ః 'ఇయకు మాఱుగా నామాంతంబున కెత్వంబు బహుళంబుగా నగు' అనేసూత్రందగ్గర బాలవ్యాకర్త 'ముత్తియశబ్దంబునందు మాత్ర మిత్వలోపంబు గానంబడియెడి' అని వివరించాడు. 'ముత్తియ' అనేదానికంటె వేఱైనశబ్దంలోని ఇయలో ఇకారానికి లోపం లే దని బాలవ్యాకర్తమతం. ప్రౌఢవ్యాకర్త 'ముత్తియశబ్దేతరంబులయందును దఱుచుగ నిత్వలోపంబు గానంబడియెడి' అని సూత్రించి ఇతరశబ్దాలలో గూడా 'ఇ' కారలోపాన్ని పేర్కొన్నాడు. కన్నియ -కన్య. వీడియము – వీడ్యము మొ॥ ప్రౌఢవ్యాకర్త అభిప్రాయం కొంతవఱ కుచితమే.

**5. ఎల్లను** ః బాలవ్యాకర్త "సర్వపర్యాయం బయినయెల్లశబ్దంబు ద్రుతాంతం బయినయవ్యయంబు' అని చెప్పాడు. ప్రౌఢవ్యాకర్త 'సర్వపర్యాయం బయినయెల్లశబ్దమునకు సప్తమియు విశేష్యమునకు ముందు ప్రయోగంబునుం జూపట్టెడు" అని సూత్రించి ఎల్ల శబ్దంమీద సప్తమీవిభక్తి ఉన్న దన్నాడు. విభక్తి ఉన్న దనడాన్నిబట్టి యిది అవ్యయం కా దనీ, సర్వనామ మనీ ప్రౌఢవ్యాకర్త తలచినట్లు పైకి తోస్తుంది.

కాని ప్రౌఢవ్యాకర్త శబ్దరత్నాకరంలో సమస్తం అనేఅర్థంలో ఇది ద్రుతాంత మైనఅవ్యయమే అని బాలవ్యాకర్తమతాన్నే అనుసరించాడు. అవ్యయ మైనా, ఎల్లయందు అని ఎల్లశబ్దంమీద సప్తమీవిభక్తి ఉండడాన్ని అక్కడ వివరించాడు. ఎల్లయందు అన్నది మార్గాంతరంలో సాధించుకోవచ్చును. ఏ మైనా సర్వపర్యాయ మైన ఎల్ల శబ్దం ద్రుతాంతమైన అవ్యయం అనడంలో బాలప్రౌఢవ్యాకర్తలమతంలో భేదం లేదు. అవ్యయంమీద 'అందు' అనేసప్తమీవిభక్తి ఉండడం అనేవిశేషాన్ని ప్రౌఢవ్యాకర్త పేర్కొన్నాడు.

**6. ఎల్లన్ శిష్యులన్** ః 'సర్వపర్యాయం బయినయెల్లశబ్దంబు ద్రుతాంతం బయినయవ్యయంబు' అని చెప్పిన బాలవ్యాకర్త 'దీని కసమాసంబున విశేష్యంబునకు ముందు ప్రయోగంబు లే' దన్నాడు. దీన్ని తిరస్కరిస్తూ ప్రౌఢవ్యాకర్త 'సర్వపర్యాయం బయినయెల్లశబ్దమునకు సప్తమియు విశేష్యమునకు ముందు ప్రయోగంబునుం జూపట్టెడు' అని సూత్రించి 'ఎల్లన్ శిష్యులన్' అనేశ్రీనాథప్రయోగాన్ని చూపాడు. ఇక్కడ సమాసము గాకపోయినా, శిష్యులన్ అనేవిశేష్యానికి ముందు "ఎల్లన్" అనేది ప్రయోగింపబడింది.

కాని యిక్కడ శిష్యులన్ అనేదే విశేషణంగానూ, ఎల్లన్ అన్నది విశేష్యంగానూ తోస్తున్నది. ఈ పక్షంలో బాలవ్యాకర్త మతంతో విరోధం లేదు.

## 6. అనింద్యగ్రామ్యాలవిషయంలో బాల, ప్రౌఢ వ్యాకర్తల మతభేదాలను తెలపండి.

'లక్షణవిరుద్ధం బగుభాష గ్రామ్యంబు' అని చెప్పినసూరి 'ఆర్యవ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు. అని సూత్రించి, 1.కఱకంఠుడు 2.కపిలగడ్డము, కపిల కన్నులు, కపిలజడలు, 3.ప్రాణగొడ్డము 4.జీవగఱ్ఱ అనేవి పెద్దలు వ్యవహరించినమాటలు కాబట్టి గ్రామ్యా లయినా గ్రహించాలి అన్నాడు. వీటినే అనింద్యగ్రామ్యా లని వ్యవహరిస్తుంటారు.

వీటిలో 'జీవగఱ్ఱ' విషయంలో ప్రౌఢవ్యాకర్త ఏమీ మాటాడలేదు. దానినిగూర్చి సూరి చెప్పినఅంశాన్ని అంగీకరించా డన్నమాట.కాని మిగిలినవి మాత్రం అసలు గ్రామ్యాలే కావు అని ప్రతిపాదించాడు.

చూ. రూపప్రక్రియ. 1. కఱకంఠుడు 2. కవిలగడ్డము, కవిలకన్నులు, కవిలజడలు, 3.ప్రాణగొడ్డము.

## 7. అనుకరణసంధికార్యాలనుగూర్చి ప్రౌఢవ్యాకర్త పేర్కొన్నవిశేషాలు తెలపండి.

'న పదా న్యవ్యయ సుప్ తిఙ్ క్త్వా తుమునామ్' అనుకృతే కస్తి వాక్యం తు' అని చింతామణి సంస్కృతవాక్యాన్ని తెలుగులో అనుకరణం లేకుండా ప్రయోగించరాదు అని చెప్తున్నది.'వినానుకరణం కేచి దాద్యశబ్దం ప్రయుంజతే' అని అధర్వణుడు అనుకరణం లేకుండా ప్రయోగింపబడుతున్నవిషయాన్ని ప్రస్తావించాడు. చిన్నయసూరి ఈవిషయాలను స్పష్టంగా చెప్పలేదు.

అధర్వణుడి అభిప్రాయాన్ని అంగీకరిస్తూ ప్రౌఢవ్యాకర్త ఇలా చెప్పాడు.

### అనుకరణరాహిత్యం

**1.సంస్కృతవాక్యం**– 'ఒకానొకచో ననుకరణవిరహితంబుగ సంస్కృత వాక్యంబు గానంబడియెడి' అనుకరణం లేకుండా కూడా సంస్కృతవాక్యాన్ని తెలుగులో ప్రయోగించుకో వచ్చును. 'అంటితి నమ శ్శివాయ పాపాత్మురాలి' ఇక్కడ 'అంటితి పాపాత్మురాలి' అనేతెలుగువాక్యం మధ్యంలో 'నమ శ్శివాయ' అనేసంస్కృతవాక్యం ప్రయోగింపబడింది.ఇలాగే 'నమో విశ్వసృజే విన మింతకు' మొ.

**2.సంస్కృతపదం** – 'జయపదం బనుకరణవిరహితంబ తఱచుగ నగు' సంస్కృత(మధ్యమపురుష ఏకవచనక్రియా) పద మైన 'జయ' అన్నది తెలుగులో అనుకరణం లేకుండా ప్రయోగింపబడుతున్నది. ఉదా. జయ పూతనాఘాత, మొ.

ప్రౌఢవ్యాకర్త ప్రదర్శించినఈలక్ష్యసందర్భాలలో సంస్కృతవాక్యం లేదా పదం తర్వాత అనుకరణం ఉండే అవకాశమే లేదు. ఇక్కడ అనుకరింపబడేది సంస్కృతవాక్యం ఒక్కటే కాదు. అనుకరింపబడే పాత్రసంభాషణలో మధ్యలో ఉండటంచేత ఇక్కడ సంస్కృతవాక్యం తరువాత అనుకరణం కుదరదు. కాబట్టి లక్ష్యాలు ఈలక్షణానికి అనుగుణ మైనవి కావు.

### ధ్వన్యనుకరణాలు–

'ధ్వన్యనుకరణశబ్దంబుల కనుధాతువు పరం బగుచో గొన్నియెడల ముగాగమం బగు' అనుకరణం పరంగా ఉన్నపుడు ధ్వనిని అనుకరించేశబ్దాలకు పైన మకారం ఆగమంగా వస్తుంది.

కనకన–అను. కనకన అనేధ్వన్యనుకరణశబ్దానికి చివర మకారం ఆగమ మై, కనకనమ్–అను. కనకన మను. మొ.

'ఇయ్యవి క్రియావ్యవహితంబులు నగు' అని ధ్వన్యనుకరణశబ్దాలకూ, వాటిక్రియాపదాలకూ మధ్య వేరే పదాలతో వ్యవధానం ఒకవిశేషంగా చెప్పాడు.

వడవడ జమదగ్నిసూతి వడకెన్. ఇక్కడ వడవడ అనే ధ్వన్యనుకరణశబ్దానికీ, వడకెన్ అనేక్రియాపదానికీ మధ్యలో 'జమదగ్నిసూతి' అనేపదంతో వ్యవధానం ఏర్పడింది.

## 2. సంధిపరిచ్ఛేదం

**1.స్వరసంధివిషయంలో బాల,ప్రౌఢ వ్యాకర్తల మతభేదాలను పేర్కొనండి.**

| | | | |
|---|---|---|---|
| 1. ఆర్యాద్యర్థపరకసంధి. | చూ. | రామయ్య. | (రూపప్రక్రియ) |
| 2. క్త్వార్థకేకారసంధి. | | ఎటిం గెటింగి | ,, |
| 3. ద్రుతద్విత్వం. | | సర్వము న్నతని. | ,, |
| 4. ద్విరుక్తటకారం. | | చిట్టడవి. | ,, |

**2. ప్రౌఢవ్యాకర్త చెప్పిన లోపసంధికార్యాలను పేర్కొనండి.**

| | | |
|---|---|---|
| 1. మధ్యమములోపం. | ఆడిదె. | ,, |
| 2. నుగాగమలోపం | బచ్చింట | ,, |
| 3. ని,ల - స్వరలోపం | ఇంద్రున్ వలెన్. | ,, |
| 4.ధాతుజవిశేషణాలు-ఉత్వలోపం | అన్పురంబు. | ,, |
| 5 మికారలోపం. | ఉండె దిదే(మి). | |

**3. ప్రౌఢవ్యాకర్త చెప్పిన ఆగమసంధికార్యాలను పేర్కొనండి.**

| | | |
|---|---|---|
| 1. నుమాగమం. | ముంగోపము. | ,, |
| 2. పుగాగమం | తామరపాకు. | ,, |
| 3. ముగాగమం | కనకన మను. | ,, |

**4. ప్రౌఢవ్యాకర్త చెప్పిన ఆదేశసంధికార్యాలను పేర్కొనండి.**

| | | |
|---|---|---|
| 1. నకారాదేశం. | రెన్నాళ్లు. | ,, |
| 2. మకారాదేశం. | చేసె మ్మహానది. | ,, |

**5. ప్రౌఢవ్యాకర్త చెప్పిన గసడదవాదేశవిశేషాలను పేర్కొనండి.**

| | | |
|---|---|---|
| 1. ఆదేశం. | వీరల్ గోపించిన | ,, |
| 2. ఆదేశాభావం. | అందచందములు. | ,, |

# 3. శబ్దపరిచ్ఛేదం

## 1. సంబోధనంలో సంబోధ్యవాచకానికి చేరే ఆయాశబ్దాలనుగూర్చి వ్యాకర్తలు పేర్కొన్న అంశాలను తెలపండి.

సంబోధ్యవాచకాలకు ముందుగానూ, వెనుకగానూ చేరే ఆయాశబ్దాలనుగూర్చి బాలప్రౌఢవ్యాకరణాలు ఇలా పేర్కొన్నాయి.

**1. ఓ** : 'ఓ యామంత్రణంబునం దగు' – సంబోధ్యవాచకం (మహ త్తయిమైనా, అమహ త్తయినా, ఏకవచనాంత మయినా, బహువచనాంత మయినా) ముందుగా 'ఓ' అనుశబ్దం చేరుతుంది. ఓరామ, ఓరాములార.

**వ్యవధానం :** ఇక్కడ ప్రౌఢవ్యాకరణం 'ఓశబ్దం బొక్కచో సంబోధ్యవాచకంబునకు ముం దితరశబ్దవ్యవహితం బయి కానంబడియెడి' అన్నది. ధాతుజవిశేషణాలసందర్భంలో ఓశబ్దానికీ, సంబోధ్యవాచకానికీ నడుమ వ్యవధానం ఉంటుది. 'ఓ వినువీధి నున్నఖచరోత్తములార'.

2. ఓయి : 'ఓశబ్దంబునకుం బురుషనీచస్త్రీపురుషామంత్రణంబులందు యిసిరివర్ణంబులు విభాష నంతాగమంబు లగు' పురుషసంబోధనంలో ఓశబ్దానికి పైన యివర్ణం చేరి ఓయి అని అవుతుంది. ఓయి రామ – (ఓరామ) ఇది బహువచనస్థలంలో చాలా అరుదు. ఓయి వెఱ్ఱులార.

**3. ఓసి** : పయిసూత్రంచేత నీచస్త్రీసంబోధనంలో 'సి' వర్ణం చేరి ఓసి అనేదిది కూడా అవుతుంది. ఓసి దుష్టురాల. (ఓ దుష్టురాల) ఓరి యోసి మైత్రియందుం గలవు. అని ఓసి మైత్రిలో కూడా వస్తుంది. ఓసి ముద్దుబాల.

**4. ఓరి** : పయిసూత్రంచేతనె నీచపురుషసంబోధనంలో ఓశబ్దానికి 'రి' వర్ణం చేరి ఓరి అని కూడా అవుతుంది. ఓరి దుష్టుఁడ. (ఓ దుష్టుఁడ) ఇదియు మైత్రిలో కూడా ప్రయోగింపబడుతుంది. ఓరి చిన్నికృష్ణ.

ఓరి ఓసి అనేవి సంబోధ్యవాచకం లేకుండ స్వతంత్రంగా ప్రయోగింపబడటం కూడా ఉంది. సంగతియ యోయి. మొ॥.

**5. రో, రొ :** 'రోశబ్దం బొందు సంబోధనంబున స్త్రీవాచకంబునకుఁ బరంబుగ నగు, అయ్యది హ్రస్వాంతంబును నయ్యెడి' అని ప్రౌఢవ్యాకరణం. స్త్రీవాచకాల కేకత్వంలో సంబోధ్యవాచకానికి పరంగా రో అనేది వస్తుంది. కమలదళాక్షిరో. దానికి హ్రస్వం కూడా వస్తుంది. రమణిరొ. ఇంకా అన్నరో, ఏనుంగురో అని కూడా ప్రయోగా లున్నాయి.

**6. కాన :** 'దేశ్యంబులం గొన్నియెడల స్త్రీవాచక స్త్రీసమంబు లగుసంబోధ్యవాచకశబ్దములమీఁద నేకవచనంబునఁ గానశబ్దం బొందును అల యనునవ్యయం బొందును గానంబడియెడి – అల దీర్ఘాంతంబు నగు' అని ప్రౌఢ. కొన్ని శబ్దాలకు పరంగా సంబోధనంలో 'కాన' అనేశబ్దం చేరుతుంది. తల్లి కాన. ఇంకా పాపజాతికాన, దురాచారులారకాన అని కూడా ప్రయోగాలు ఉన్నాయి.

**7. అల–అలా :** పయిసూత్రంచేత కొన్ని శబ్దాలకు పైన 'అల' అనేశబ్దం చేరుతుంది. అమ్మలక్క లని. అల అనేదానికి చివర దీర్ఘం కూడా వస్తుంది. అన్నలా. అల, అలా అనేవి సంబోధనంలో వచ్చాయి అనడం విచార్యం.

| సంబోధనశబ్దం | సంబోధ్యవాచకం | ఉదాహరణం |
| --- | --- | --- |
| 1. ఓ | అన్ని శబ్దాలకు - పూర్వంలో | ఓరామ, ఓ సీతలార |
| | వ్యవధానంతో | ఓ వినువీధినున్న ఖచరోత్తములార ! |
| 2. ఓయి | పురుషసంబోధనంలో | ఓయి రామ. |
| | సంబోధ్యవాచకం లేకుండ | సంగతియ యోయి |
| 3. ఓరి | నీచపురుష సంబోధనంలో | ఓరి దుష్టుఁడ |
| | మైత్రియందు | ఓరి చిన్నికృష్ణ |
| | సంబోధ్యవాచకం లేకుండ | ఓరోరి ! |
| 4. ఓసి | నీచస్త్రీసంబోధనంలో | ఓసి దుష్టురాల |
| | మైత్రియందు | ఓసి ముద్దుబాల |
| | సంబోధ్యవాచకం లేకుండ | ఓసి పోవే |
| 5. రో | స్త్రీవాచకానికి-పరంగా | కమలదళాక్షిరో |
| 6. రొ | స్త్రీవాచకానికి-పరంగా | రమణిరొ |
| 7. కాన | స్త్రీసమానికి - పరంగా | తల్లి కాన |
| 8. అల | స్త్రీసమానికి - పరంగా | అమ్మ లక్కల |
| 9. అలా | స్త్రీసవమానికి - పరంగా | అన్నలా |

## 2. విశేషణబేధాలను ప్రౌఢవ్యాకర్త పేర్కొన్నప్రకారంగా నిరూపించండి.

"శబ్దములు విశేష్యములు విశేషణము లని ద్వివిధంబులు" అయ్య - అక్క మొద లైనవి విశేష్యాలు. మిగిలినవి విశేషణాలు. కీడుతలపులు మొ॥చోట్ల కీడు మొద లయినకొన్ని విశేషణాలు విశేష్యాలు కూడా అవుతాయి. విశేషణాలు కొన్ని చోట్ల విశేష్యలక్షకాలు కూడా అవుతాయి. అప్రియములు గావించి = అప్రియ కార్యములు గావించి

**విశేషణం** ః 'విశేషణము నా జాత్యాదివిశేషములను దెలుపునది' జాతి - గుణము మొద లయినవిశేషాలను తెలియజేసేశబ్దం విశేషణం. క్షత్రియుడు - క్షత్రియత్వం అనేజాతిరూప మయినవిశేషాన్ని తెలియజేయడంచేత "క్షత్రియుడు" అనేది విశేషణం. విశేష్యాలను భేద్యము లనీ, విశేషణాలను భేదకా లనీ కూడా వ్యవహరిస్తారు.

**విశేషణభేదాలు:** "విశేషణము జాత్యాదిభేదంబుచే షడ్విధంబు' జాతి మొద లయినవిశేషాలను తెలిపేదే విశేషణం. కాగా విశేషణం తెలిపే ఈ జాతి మొద లయినవిశేషాల ననుసరించి ఇది ఆరు విధాలు.

**1. జాతిప్రయుక్తవిశేషణం :** జాతి ననుసరించి ప్రయోగింపబడినవిశేషణం జాతిప్రయుక్త విశేషణం. ఈవిశేషణం జాతివిశేషాన్ని తెలుపుతుంది. ద్రోణుడు బ్రాహ్మణుడు. ఇక్కడ బ్రాహ్మణుడు అనేది ద్రోణు డనేవిశేష్యంలోని బ్రాహ్మణత్వం అనేవిశేషాన్ని తెలుపుతూ విశేషణ మయింది. బ్రాహ్మణత్వం జాతిరూప మయినది, కాబట్టి జాతినిబట్టి కూర్చబడిన 'బ్రాహ్మణుడు' అనేశబ్దం జాతిప్రయుక్తవిశేషణం అవుతున్నది.

**2. క్రియాప్రయుక్తవిశేషణము :** క్రియ అంటే వ్యాపారం (పని). క్రియను గూర్చి తెలిపేవిశేషణం క్రియాప్రయుక్తవిశేషణం. వచ్చినవాడు ఫల్గునుడు. ఇక్కడ వచ్చినవాడు అనేది ఫల్గుణుడు అనేవిశేష్యంలోని – వచ్చిఉండటం అనేవిశేషాన్ని తెలుపుతూ విశేషణ మైనది. 'వచ్చుట' అనేవిశేషం క్రియారూప మైనది. క్రియారూప మయినవిశేషాన్ని తెలపుతుండడంచేత 'వచ్చినవాడు' క్రియాప్రయుక్తవిశేషణం. (ధాతుజవిశేషణాలే క్రియాప్రయుక్తవిశేషణాలు అని గుర్తించవచ్చు)

**3. గుణప్రయుక్త విశేషణం :** గుణాన్ని తెలియజేసేవిశేషణం గుణప్రయుక్తవిశేషణం.'నల్లనివాడు రాముడు' ఇక్కడ 'నల్లనివాడు' అనేది రాముడు అనేవిశేష్యంలోని నల్లగా ఉండటం అనేవిశేషాన్ని తెలుపుతూ విశేషణ మైంది. నలుపు అనేది గుణం. కాబట్టి గుణమూలక మైన 'నల్లనివాడు' అనేఈవిశేషణం గుణప్రయుక్తవిశేషణం.

**4. ద్రవ్యప్రయుక్తవిశేషణం :** ద్రవ్యం (వస్తువు – ధనం, మొ॥)ను అనుసరించి ప్రయోగింపబడినవిశేషణం ద్రవ్యప్రయుక్తవిశేషణం. ధనవంతుడు, ధనము (కలిగిఉండటం) అనేద్రవ్యరూప మైనవిశేషాన్ని ప్రస్తావింస్తున్నది గాబట్టి ఇది ద్రవ్యప్రయుక్తవిశేషణం.

**5. సంఖ్యాప్రయుక్తవిశేషణం :** 'సంఖ్యను తెలియజేసేవిశేషణం సంఖ్యాప్రయుక్తవిశేషణం. ఒక్కఁడు, ఒక్క – అనేసంఖ్య ననుసరించి ప్రయోగింపబడినది కాబట్టి ఇది సంఖ్యాప్రయుక్తవిశేషణం.

**6. సంజ్ఞాప్రయుక్తవిశేషణం :** సంజ్ఞ (పేరు)ను తెలిపేవిశేషణం సంజ్ఞాప్రయుక్తవిశేషణం. దేవదత్తుఁడు. 'దేవదత్త' అనేసంజ్ఞను గూర్చి ప్రయుక్త మైనది గాబట్టి ఇది సంజ్ఞాప్రయుక్తవిశేషణం.

ఇలా విశేషణాన్ని ఆరు విధాలుగా ప్రౌఢవ్యాకరణం నిరూపించింది.

## 3. తెలుగులోని నిత్యైకవచనాంతశబ్దాలను గూర్చి తెలపండి.

నిత్యంగా ఏకవచనాంతాలు అయిఉండేశబ్దాలు నిత్యైకవచనాంతాలు. ఎల్లవిభక్తులలోనూ, ఎల్లపుడూ ఏకవచనమె కాని యాశబ్దాలమీద బహువచనం చేరదు. అంటే బహుత్వార్థంలో సయితం ఏకవచనమే వస్తుంది. అప్పుడు. మొ.

**1. అప్పుడు – మొ :** "అప్పు డిప్పు డిప్పు డనుశబ్దములు నిత్యైకవచనాంతము" లని చిన్నయసూరి ఒకసందర్భంలో పేర్కొన్నాడు. అప్పుడు, ఇప్పటికి, ఎప్పటన్ మొ॥.

ఇటువంటివాటిని ప్రౌఢవ్యాకర్త మఱి కొన్నిటిని నిరూపించాడు.

**2. అక్కడాదులు** : 'దేశ్యమునం దక్కడాదులు నిత్యైకవచనాంతములు' అక్కడ మొద లయినదేశ్యశబ్దాలు లెప్పుడును ఏకవచనాంతములె అయిఉంటాయి. అక్కడ, ఇక్కడికి, ఎక్కడన్ మొ॥

ఇరులు కేలు అనేశబ్దాలు బహువచనాంతాలు అని కొందరు చెప్తారు, కానీ అవి కూడా నిత్యైకవచనాంతాలె. ఇరులున–మొ॥ ఇవి అక్కడ మొదలయినవాటిలో చేరిఉన్నాయి.

**3. సస్యవాచకాలు** : 'సస్యవాచకశబ్దములును' పైరును బోధించే శబ్దాలు కూడా నిత్యైకవచనాంతాలే. కంది(పైరు) పెసర–మినుము మొ॥ బియ్యము– జీలకఱ్ఱ – మొ॥ ధాన్యవాచకశబ్దాలు కూడా నిత్యైకవచనాంతాలె.

**4. సంభారవాచకాలు** : 'కతిపయసంభారవాచకశబ్దములును' గృహోపయోగు లయిన వస్తువులను బోధించేశబ్దాలు కొన్ని ఎప్పుడూ ఏకవచనాంతాలే అయిఉంటాయి. ఉప్పు, చింతపండు మొ॥

**5. లోహవాచకాలు** : 'లోహవాచకశబ్దములును' లోహాలను బోధించే శబ్దాలు కూడా ఎప్పుడూ ఏకవచనాంతాలే అవుతాయి. వెండి, బంగారము మొ॥

**6. సమానార్థకాలు** : 'సమానార్థకము లయిన యీ డెన సరి సాటి లోనగుదేశ్యవిశేషణశబ్దములును' సమానం అనేఅర్థాన్ని ఇచ్చే – ఈడు, ఎన, సరి, సాటి మొద లయినవిశేషణశబ్దాలు నిత్యం ఏకవచనాంతాలే అవుతాయి. అవి సరి గావు. సతు లెనయే మొ॥.

'సరులు లేని' అనేరీతిగా ఒకటి, రెండు ప్రయోగాలు విశేషస్థలాలు.

**7. గుణరసవాచకాలు** : 'గుణరసవాచకములైన దేశ్యవిశేషణశబ్దములును' గుణాన్నీ రసాన్నీ (రుచి) బోధించేశబ్దాలు నిత్యైకవచనాంతాలు. గుణము–కాళ్లు 'నలుపు'; రసము–పండ్లు 'తీపు'.

## 4. తెలుగులోని నిత్యబహువచనాంతశబ్దాలను గూర్చి తెలపండి.

ఎప్పుడూ చివర్లో బహువచనమె కలిగిఉండేశబ్దాలు నిత్యబహువచనాంతాలు. ఇటువంటిశబ్దాలమీద అన్నివిభక్తులలోనూ ఎల్లప్పుడు బహువచనం మాత్రమె ఉంటుంది. ఎక్క డైనా ఏకత్వార్థాన్ని చెప్పదలుచుకున్నా ఈశబ్దాలమీద బహువచనం మాత్రమే అవుతుంది.

**1. అందఱ్ఱాదులు** : 'అందఱ్ఱాదులు నిత్యబహువచనాంతములు'. అందఱు మొద లయినుమహత్సర్వనామశబ్దాలు ఎప్పుడూ బహువచనంతోనె ఉంటాయి. అందఱు, ఇందఱను, ఎందఱకు, పలుగురు మొ॥

**2. అదర్వాదులు** : 'అదరులు లోనగుశబ్దములును' అదరులు మొద లయినశబ్దాలు ఎప్పుడూ బహువచనాంతాలే అవుతాయి. అదరులు. మిడుగురులు మొ॥

ఇవి వృత్తిలో ఏకవచనాంతా లయి కూడ కనబడతాయి. అదరుటగ్గి. మిడుగురుంబురువు.

**3. ధాన్యవాచకములు :** 'తఱచుగ ధాన్యవాచకశబ్దములును' ధాన్యాన్ని బోధించేశబ్దాలు చాలవరకు నిత్యం బహువచనాంతా లైఉంటాయి. కందులు-పెసలు-మినుములు. మొ॥ తఱచుగ అనడంచేత బియ్యము, జీలకఱ్ఱ మొద లయిన కొన్ని నిత్యైకవచనాంతాలు గ్రహింపబడతాయి.

**4.కొన్ని క్రీడావాచకాలు:** 'క్రీడావిశేషవాచకశబ్దములును' కొన్ని ప్రత్యేక మయినఆటలను బోధించేశబ్దాలు నిత్యబహువచనాంతాలు అవుతాయి. అచ్చనగాయలు-గుజ్జెనగూళ్ళు, కుప్పిగంతులు మొ॥

# 4. కారకపరిచ్ఛేదం

## 1. కారకం అంటే ఏమిటో పేర్కొని వివిధకారకాలను వివరించండి.

**కారకం :** 'కారక' శబార్థాన్నీ, ఆయాకారకాలనూ సూరి ప్రత్యేకంగా పేర్కొనలేదు. మిగిలిన కొన్ని సంజ్ఞాదులవలె ఈఅంశం కూడా సంస్కృతంనుండే గ్రహించాలి అని సూరిఅభిప్రాయం గావచ్చు.

'క్రియాజనకమ్'-క్రియను గూర్చిన ఆకాంక్షను గలుగజేసేది కారకం. 'రాముడు' అని ఉచ్చరిస్తే 'ఏమి చేశాడు అనేవిధంగా క్రియను గూర్చినఆకాంక్ష కలుగుతుంది. ఇటువంటివి కారకాలు. 'రామునియొక్క' అన్నపుడు పైరీతిగా క్రియాకాంక్ష ఉండదు. కాబట్టి అది (యొక్క షష్ఠి) కారక మనిపించుకోదు.

'క్రియాన్వయమును కలిగించునది అనగా క్రియాన్వయము గలది' అని కారకశబ్దముయొక్క అర్థాన్ని ప్రౌఢవ్యాకరణం వివరించింది.

**కారకబేధాలు :** 'కారకంబు లనం గర్మాదులు' అని సూత్రించిన ప్రౌఢవ్యాకర్త కర్మ మొద లయినుకారకాలను ఆరింటిని పేర్కొన్నాడు.

**1.కర్తృకారకము:** "చేతవర్ణకంబు కర్త కగు" అని కర్తృవాచక మయినశబ్దానికి 'చేత' అనేతృతీయావిభక్తిప్రత్యయం వస్తుంది. "ధాత్వర్థవ్యాపారాశ్రయం కర్త. దేవదత్తునిచేత వంటకము వండబడెను. ఇక్కడ చేత అనేతృతీయావిభక్తి కర్త్రర్థంలో వచ్చి కర్తృరూపంలలో క్రియతో అన్వయం గలిగిఉన్నది. కాబట్టి 'చేత' అనేతృతీయ కర్తృకారకం.

2. కర్మకారకము : కర్మ అయిన కారకము. 'కర్మంబున ద్వితీయ యగు' అని కర్మకు ద్వితీయావిభక్తి వచ్చును. ధాత్వర్థఫలాశ్రయము కర్మము. దేవదత్తుడు వంటకమును వండెను. ఇచట 'ను' అనుద్వితీయావిభక్తి కర్మార్థమున వచ్చి కర్మరూపమున క్రియతో అన్వయించును. కావున ఈ 'ను' ద్వితీయావిభక్తి కర్మకారకము.

**3. కరణకారకము:** కరణం అయిన కారకం కరణకారకం. 'కరణ సహార్థ తుల్యార్థ యోగంబులం దృతీయకుం దోడవర్ణకం బగు' అని కరణానికి 'తోడ' (చేత) అనేతృతీయావిభక్తి వస్తుంది. 'క్రియాసిద్ధిం బ్రకృష్టోపకారకంబు కరణంబు'. కోలతోడ (చేత) కూల్చె. ఇక్కడ తోడ(చేత) అనేతృతీయావిభక్తి కరణార్థంలో వచ్చి కరణరూపంలో క్రియతో అన్వయిస్తున్నది. కాబట్టి ఈతృతీయావిభక్తి కరణకారకం.

**4. సంప్రదానకారకం:** 'సంప్రదానంబునకుం జతుర్థి యగు' అని సంప్రదానానికి చతుర్థీవిభక్తి వస్తుంది. 'త్యాగోద్దేశంబు సంప్రదానంబు నాబడు'. రామునికొఱకు కన్య నిచ్చెను. ఇక్కడ కొఱకు అనేది సంప్రదానార్థంలో వచ్చి సంప్రదానరూపంలో క్రియతో అన్వయిస్తున్నది. కాబట్టి చతుర్థీవిభక్తి సంప్రదానకారకం.

**5. అపాదానకారకం:** అపాయము మొద లయినువాటివలన కలిగే ఎడబాటు అపాదానం. (అపాయభయజుగుప్సా - మొద లయినసూత్రంచేత) ఇక్కడ వలన అనేపంచమీవిభక్తిప్రత్యయం వస్తుంది.. రాజ్యమువలన భ్రష్టు డయ్యె. ఇక్కడ వలన అనేపంచమి అపాదానార్థంలో వచ్చి అపాదానరూపంలో క్రియతో అన్వయిస్తున్నది. కాబట్టి ఈ 'వలన' పంచమి అపాదానకారకం.

**6. అధికరణకారకం :** అధికరణంబు నా నాధారంబు. 'అధికరణంబునకు సప్తమి యగు' అని ఇక్కడ సప్తమీవిభక్తి వస్తుంది. ఘటమందు జల మున్నది. ఇక్కడ అందు అనేసప్తమి అధికరణార్థంలో వచ్చి అధికరణరూపంలో క్రియతో అన్వయిస్తున్నది. కాబట్టి సప్తమీవిభక్తి అధికరణకారకం.

## 2. ప్రౌఢవ్యాకర్త పేర్కొన్న ఒకవిభక్తికి మ ఱొకవిభక్తి వచ్చేస్థలాలను తెలపండి.

తెలుగులో ఆయాఅర్థాలలో విధింపబడిన ఆయావిభక్తులకు మాఱుగా వేఱొకవిభక్తి రావటం కొన్నిచోట్ల కనబడుతున్నది.

*ప్రథమ :*

**1. ద్వితీయకు :** 'జడంబుద్వితీయకుం బ్రథమ బహుళంబుగా నగు' అని సూరి జడవాచకాలకు పైన ఉన్నద్వితీయకు మాఱుగా ప్రథమావిభక్తి చెప్పగా ప్రౌఢవ్యాకర్త "కొన్నియెడల నజడంబు ద్వితీయకును ప్రథమ కానంబడియెడి" అని జడాలు గానిశబ్దాలపైన గూడా పయి కార్యాన్ని సాధించాడు. అమ్మదనాగ మెదిర్చి (మదనాగమును ఎదిర్చి. మదనాగము - ఏనుగు - తిర్యక్కు కాబట్టి అజడం. అయినా ద్వితీయకు ప్రథమ వచ్చింది. కాని ఈకార్యానికి ఈఒక్కప్రయోగం మాత్రమే లభిస్తున్నది. అందుచేత ఇది విశేషస్థలంగా గుర్తింపదగినది.

**2. సప్తమికి :** 'ఒక్కొకచో జడంబుసప్తమికిం బ్రథమయు నగు' జడశబ్దాలమీద సప్తమీవిభక్తికి ప్రథమావిభక్తి వస్తుంది.. 'తీర్థమందు ఆడి ఇక్కడ తీర్థమందు అన్నచోట జడంమీద ఉన్నసప్తమీవిభక్తికి ప్రథమావిభక్తి వచ్చి తీర్థము ఆడి- తీర్థమాడి అని అవుతుంది. ఇలాగే నెఱకులాడి మొ.

**ద్వితీయ :**

**1. తృతీయాసప్తములకు :** 'కొన్నియెడల నజడంబు తృతీయాసప్తములకును బహుత్వంబున ద్వితీయ చూపట్టెడి' అని సూత్రించాడు. చక్రవాకములతో నలరు. ఇక్కడ సహార్థంలో చక్రవాక అనేతిర్యక్కు అయిన అజడవాచకం మీదవచ్చిన తోడ అనేతృతీయావిభక్తికి ద్వితీయావిభక్తి వచ్చి 'చక్రవాకములను'అలరు అని ప్రయోగింపబడింది.

మనుజులందు విప్రుండు. ఇక్కడ మనుజ అనే మహత్తు అయిన అజడవాచకంమీద నిర్ధారణార్థంలో షష్ఠికి(మనుజులలోపల విప్రుడు)' బదులుగా వచ్చిన సప్తమికి ద్వితీయావిభక్తి వచ్చి 'మనుజులను' విప్రుండు సూరి 'జడంబుతృతీయాసప్తములకు ద్వితీయ బహుళంబుగా నగు' అనిజడవాచకాలకు పైన మాత్రమే ఈకార్యం చెప్పాడు.

**2.షష్ఠికి** : 'క్రియాన్వయంబున రెండుపదంబులకు స్వస్వామిసంబంధము గలచో సంబంధిపదంబుషష్ఠికి ద్వితీయ యగు' ద్వితీయ కొన్నిచోట్ల షష్ఠీవిభక్తికి మాఱుగా వస్తుంది. ఉదా. నాయొక్క చెట్టపట్టినన్– ఇక్కడ సంబంధార్థంలో సంబంధిపదానికి షష్ఠీవిభక్తి వచ్చి నాయొక్క అని ఉండగా ఈసూత్రంచేత షష్ఠికి ద్వితీయ వచ్చి 'నన్ను' చెట్ట వట్టిన అని ప్రయోగింపబడింది.

తృతీయ, చతుర్థి, పంచమీ విభక్తులు వేరొకదానికి రావటం కనబడదు.

**షష్ఠి :**

**ద్వితీయాదులకు 'కు' షష్ఠి :** 'షష్ఠీస్థానికం బగు కు వర్ణకం బొక్కొక్కచో ద్వితీయాదివిభక్తులకు మాఱుగా దత్తదర్థంబులం జూపట్టెడి' షష్ఠి ఐన కు విభక్తి షష్ఠికంటె ఇతర మైనవిభక్తులకు మాఱుగా వస్తుంది.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1. | **ద్వితీయకు** | - | ఉద్దేశార్థంలో | - | పొలమున కేగెను | (పొలమును) |
| 2. | **తృతీయకు** | - | తుల్యార్థయోగంలో | - | చైత్రునకు మైత్రుండు తుల్యుండు | (చైత్రునితో) |
| 3. | **చతుర్థికి** | - | సంప్రదానంలో | - | రామునకు గన్య నిచ్చెను. | (రామునికొఱకు) |
| | | | ఉద్దేశమాత్రంలో | - | పురుషార్థమునకు యత్నింపవలె. | (పురుషార్థముకొఱకు) |
| 4. | **పంచమికి** | - | అపాదానంలో | - | చోరునకు భయపడె. | (చోరునివలన) |
| | | | అన్యార్థాదియోగంలో | - | రామునకు నన్యంబు దైవంబు లేదు | (రామునకంటె) |
| 5. | **యొక్క షష్ఠికి** | - | సంబంధంలో | - | నాకు తమ్ముడు | (నాయొక్క) |

**ప్రథమకు యొక్క :** 'ధాతుజవిశేషణభావార్థకపూర్వ వ్యవహితావ్యవహితకర్తృపదప్రథమకు యొక్క షష్ఠి యగు' ప్రథమకు యొక్క అనేషష్ఠీవిభక్తి వస్తుంది. మాపఠింపనిశాస్త్రము మేము పఠింపని శాస్త్రము. పఠింపని అనేధాతుజవిశేషణంతో యోగంవల్ల నా అనేశబ్దానికి 'భావార్థకాదియోగంబునం గర్తకుం బ్రథమ యగు' అని ప్రథమావిభక్తి వచ్చి బహుత్వార్థంలో 'మేము' పఠింపని అని ఉండగా ఆప్రథమకు యొక్క అనే షష్ఠీవిభక్తి వచ్చి 'మాయొక్క' పఠింపని. యొక్కకులోపంబు బహుళంబు కాబట్టి యొక్క లోపించి 'మా' పఠింపనిశాస్త్రము.

***సప్తమి :***

**తృతీయకు 'న' :** 'ఒక్కచో నుదంతం బగునజడంబు తృతీయకును నవర్ణకంబు గానంబడియెడి' అజడవాచకశబ్దాలమీద ఉన్న తృతీయకు 'న' అనే సప్తమి వస్తుంది. 'ఏనుగుతో ఏనుగును' ఇక్కడ కరణార్థంలో ఏనుగు అనేతిర్యక్కు అయిన అజడశబ్దంమీద తోడ అనేతృతీయావిభక్తి వచ్చి 'ఏనుగుతో' అని ఉండగా ఆతృతీయకు మాఱుగా 'న' అనేసప్తమీవిభక్తి వచ్చి ఏనుగున నేనుగు అని ప్రయోగింపబడింది. ఇటువంటి ప్రయోగ మిం కొకటి లేదు. సూరి 'ఉదంతజడంబుతృతీయకు నవర్ణకం బగు' జడం పైన మాత్రమే ఈకార్యాన్ని అంగీకరించాడు.

## 3. ప్రౌఢవ్యాకర్త పేర్కొన్న విశేషణలింగవిభక్తివచనాలలోనివిశేషాలను పేర్కొనండి.

**విశేష్యానుగుణం :** 'విశేష్యంబునకుంబోలె విశేషణంబులకు లింగవిభక్తి వచనంబు లగు' విశేష్యం ఏలింగం, ఏవిభక్తి, ఏవచనంలో ఉంటుందో విశేషణం కూడా అదే లింగం, అదే విభక్తి, అదే వచనంలో ఉంటుంది.

రాముఁడు సుగుణాభిరాముఁడు. సీత సుగుణాభిరామ.

సుగుణాభిరాములను సీతారాములను. మొ.

కొన్నిచోట్ల విశేషణం లింగవిభక్తివచనాలు విశేష్యంకంటె భిన్నంగా ఉండటం కూడా కనిపిస్తున్నది.

### *1. లింగవ్యత్యాసం :*

**మహత్తు - అమహత్కార్యం :1.** 'మహద్విశేషణ సంఖ్యావాచకంబులకుం గొన్ని యెడల నమహత్కార్యంబు చూపట్టెడి' మహ త్తయినవిశేషణానికి ఆయాస్థలాల్లో మహత్కార్యానికి బదులుగా అమహత్కార్యం వస్తుంది.ంచింది. అసురులు 'అరువదివేలు' మహత్తు అయిన అసురులు అనేదానికి విశేషణం అయిన పదివేయి అనే సంఖ్యావిశేషణానికి మహత్కార్యమే రావాలి. కాని అమహత్కార్యం వచ్చి 'పదివేలు' అని ప్రయోగింపబడింది.మహత్కార్యం వచ్చినపక్షంలో 'అసురులు పదివేవురు' అని ఉంటుంది.

**2.మహత్కార్యం :**'మహత్సమూహార్థకశబ్దం బమహత్కార్యయుక్తం బయ్యు దద్విశేషణక్రియలు మహత్కార్యయోగ్యంబులు విభాష నగు' విశేష్యం మహత్తే. కాని సమూహార్థకం అయి అమహత్కార్యంతో ఉండగా దానివిశేషణానికి (క్రియకు) విశేష్యానుగుణంగా అమహత్కార్యానికి బదులుగా మహత్కార్యం రావడం కనిపిస్తున్నది. ఉదా. గీర్వాణగణంబు....చేసిరి అఖర్వపరాక్రములు...ఉద్ధతులై. ఇక్కడ అఖర్వపరాక్రములు, ఉద్ధతులు అనేరెండు విశేషణాలు మహత్కార్యాన్ని పొందాయి. అమహత్కార్యం వచ్చినపక్షంలో 'పరాక్రమములు, ఉద్ధతములు' అని ఉండాలి.

### *2. విభక్తివ్యత్యాసం :*

'విశేష్యవిభక్తికంటె భిన్నంగా విశేషణానికి ఇంకొక విభక్తి రావటం కొన్నిచోట్ల కనబడుతున్నది.

**1. షష్ఠికి - ప్రథమ :**'ఒక్కచో సమాసాంతర్గతవిశేష్యంబుల కగువిశేషణంబులషష్ఠికిని బ్రథమ చూపట్టెడి' షష్ఠ్యంతవిశేష్యం సమాసగత మై ఉండగా విడిగా ఉన్న విశేషణంయొక్క షష్ఠికి కూడా ప్రథమ రావటం కవిప్రయోగాలలో ఉన్నది. ఉదా. 'దేవుఁడు' త్రివిక్రము సొమ్ములు. త్రివిక్రముయొక్క అని విశేష్యం షష్ఠ్యంతం. కాబట్టి విశేషణ మైన దేవ శబ్దానికి కూడా షష్ఠి వచ్చి దేవునియొక్క అని ఉంటుంది. త్రివిక్రముయొక్క అనేవిశేష్యం సమాసంలో ఉండి యొక్క విభక్తి లోపించి త్రివిక్రముసొమ్ములు అని ఉండగా విశేషణం షష్ఠికి ప్రథము వచ్చి 'దేవుడు త్రివిక్రముసొమ్ములు'.

**2.ద్వితీయకు - ప్రథమ :** 'ఒక్కచో ద్వితీయాంతవిధేయవిశేషణంబునకుం బ్రథమయు నగు'. విధేయవిశేషణాలద్వితీయావిభక్తికి ప్రథమావిభక్తి వస్తుంది. 'ఎవ్వనిం బురోహితుఁడు'గా చేకొనువారము. ఎవ్వనిన్ అనేవిశేష్యం ద్వితీయలో ఉంది. కాబట్టి దానికి విశేషణ మైన పురోహిత శబ్దానికి కూడా ద్వితీయావిభక్తి వచ్చి 'పురోహితునిగా' అని ఉంటుంది. ప్రస్తుతసూత్రంచేత ఆవిధేయవిశేషణం ద్వితీయకు ప్రథమ వచ్చి ఎవ్వనిని 'పురోహితుడుగా' అని ప్రయోగింపబడింది.

ప్రథమ రానిపక్షంలో ద్వితీయతో 'పురోహితునిగా' అని ఉంటుంది

3.**ద్వితీయాదులు – ప్రథమ** : సూరి విశేషణం షష్ఠికి మాత్రమే ప్రథమ చెప్పగా ప్రౌఢవ్యాకరణం 'కొన్నియెడల విశేషణంబు ద్వితీయాదులకుఁ బ్రథమ చూపట్టెడి' అని అగు మొద లయినవాటితో వ్యవధానం లేకపోయినా, విశేషణంయొక్క ద్వితీయ మొదలుగా అన్నివిభక్తులకు కూడా ప్రథమ వస్తుం దని పేర్కొన్నది. ఉదా : ఘనుల్ ... దైత్యపతులను. ఇక్కడ దైత్యపతులను అని విశేష్యం ద్వితీయ ననుసరించి 'ఘనులను' అని విశేషణానికి వచ్చిన ద్వితీయకు ప్రథమ వచ్చి 'ఘనుల్' అని &ప్రయోగింపబడింది. ఇలాగా 'తల్లి' ద్రౌపదితోడన్ మొ.

**విశేష్యం– వచనవ్యత్యాసం**

ప్రౌఢవ్యాకరణంలో ఒకచోట విశేష్యానికి వచనంలో మార్పు చెప్పబడింది.'సంఖ్యాప్రయుక్తవిశేషణ మేకాంతం బయి యమహద్విశేష్యక మయ్యు, దదంశాంతం బయి మహదమహద్విశేష్యక మయ్యు, సమస్తంబు వ్యస్తంబు నగుచో విశేష్యంబు క్రమంబుగ నుత్తరపదంబు నేకవచనాంతంబును, పూర్వపదంబు బహువచనాంతంబు నగు'. ఒకటి,అర,పాతిక మొద లైనశబ్దాలు చివర ఉన్నసంఖ్యావిశేషణాల విశేష్యం బహుత్వార్థంలో ఏకవచనాంతం కావడం విశేషం. డెబ్బదియొక్క రథము. సమాసం కాకపోతే బహువచనాంతం అవుతుంది. రథములు డెబ్బదియొక్కటి. ఇలాగే రెండున్నర రూపాయ, రూపాయలు రెండున్నర.

# 5.సమాసపరిచ్ఛేదం

## 1.ప్రౌఢవ్యాకర్త పేర్కొన్నసమాసవిశేషాలను గూర్చి వివరించండి.

తత్పురుషం, ద్వంద్వం, బహువ్రీహి అనేసమాసాలను వాటిలక్షణాలతోనూ, భేదాలతోనూ చిన్నయసూరి బాలవ్యాకరణంలో వివరించెను. అందు స్పష్టం చేయబడనిమతి కొన్ని సమాసవిశేషాలను ప్రౌఢవ్యాకర్త ప్రస్తావించింది.

**కర్మధారయవిశేషాలు :**

తత్పురుషభేద మయినకర్మధారయంలో కొన్ని విశేషాలను ప్రౌఢవ్యాకరణం ఇలా పేర్కొన్నది.

**1. అవ్యయంతో కర్మధారయం** : 'ధాతుజవిశేషణంబులు తథార్థకావ్యయంబుతోడం గర్మధారయం బగు' ధాతుజాలు లైనవిశేషణాలకు 'తథా' అనేసంస్కృతావ్యయంయొక్క అర్థాన్ని తెలియజేసే 'అట్లు' అనేఅవ్యయంతో కర్మధారయసమాస మవుతుంది. చదువునట్లు, పోయినయిట్లు మొ॥. దీనినిబట్టి 'అట్లు' అనేది తప్ప మిగిలిన యేఅవ్యయంతోనూ కర్మధారయసమాస ముండ దని గ్రహింపవచ్చు. అలాగే ధాతుజవిశేషణాలు తప్ప ఇతర మైనయేవిశేషణాలకూ 'అట్లు' అనేదానితో గూడా సమాసం లేదు. కర్మధారయంలో ఉత్తరపదం అవ్యయం కావటం ధాతుజవిశేషణం పూర్వపదం కాగా 'అట్లు' అనేఅవ్యయంతో మాత్రమే.

**2. అవయవితో సమాసం** : 'ఒకానొకచో గుణవాచకధాతుజవిశేషణంబు లవయవవిశేష్యపూర్వకంబు లై యవయవితో సమసించెడి'. కర్మధారయం అంటే విశేషణానికి విశేష్యంతో చేసినసమాసం. గుణవాచకాలూ, ధాతుజా లైన కొన్ని విశేషణాలు కొన్నిచోట్ల విశేష్య మైన అవయవవాచకంతో సమాసం పొందక, విశేష్యం పూర్వప్రయుక్తం అవుతుండగా, విశేష్యం కానిఅవయవితో,

కర్మధారయసమాసాన్ని పొందుతున్నాయి. 'తనువు మీన్నొలవల్చు జాలరిదాన' ఇందులో 'వల్చు' అనేది ధాతుజవిశేషణం. దానివిశేష్యం 'తనువు'. 'మీన్నొల వల్చు తనువు' అని కర్మధారయం కావటం సామాన్యం. కాని యీవిశేషణాను పూర్వంలో ఉంచుకొని 'తనువు' (మీన్నొలవల్చు) ఆఅవయవం గలిగిన అవయవి అయిన 'జాలరిది' అనేశబ్దంతో సమాసాన్ని పొందింది.

ఇలాగే 'ఒడలు తెల్లనితురగోత్తము' తెల్ల గుణవిశేషణం. ఒడలు విశేష్యం. విశేషణానికి పూర్వంలో ఉన్నది. ఇది కలిగిన తురగోత్తమ' మనేశబ్దంతో, అది విశేష్యం గాకపోయినా కర్మధారయం ఐంది.

**3. లుప్తశేషం – మిశ్రసమాసం :** 'క్రొత్తాదులు లుప్తశేషంబులు దేశ్యంబులతోడంబలెఁ దత్సమంబులతోడం గొన్నియెడలం గర్మధారయం బగు' అనేలక్షణంలో లుప్తశేషా లయిన క్రొ (త్ర) మొద లయిన ఏకాక్షర లేదా ద్వ్యక్షర శబ్దాలు తత్సమాలతో గూడ సమాసం పొందుతాయి. క్రొంబులకలు మొ॥

లుప్తశేషానికి సమాసం చెప్పటం ఇందులో విశేషం.

**1. బిరుదాద్యుత్తరపదకర్మధారయం :** 'కర్మధారయంబు బిరుదాద్యుత్తరపదం బయ్యె నేని ద్వ్యక్షరాదంతస్త్రీపుంసంజ్ఞావాచకం బగుపూర్వపదంబునంత్యాక్షరంబున కంతట దీర్ఘంబు బహుళంబుగా నగు' మొద లైనలక్షణంచేత రామాశాస్త్రి, సుబ్బిశెట్టి, నన్నపార్యుడు మొ॥ బిరుదాద్యుత్తరపదకర్మధారయాలు ప్రస్తావించబడ్డాయి. 'కర్మధారయం బియ్యది మిశ్రంబు సిద్ధసమాసం బట్ల యగు'.

**2. విశేష్యపూర్వపదకర్మధారయం :** 'తమ్ముఁగుజ్జులు చిలుకమొకరి యిత్యాదులు విశేష్యపూర్వపదకర్మధారయంబులు' విశేషణానికి విశేష్యంతో అయినసమాసం కర్మధారయం. ఇందులో విశేషణం పూర్వపదంగానూ విశేష్యం ఉత్తరపదంగానూ ఉంటుంది. అటువంటిసమాసాలు కొన్నింటిలో విశేష్యం పూర్వపద మై, విశేషణం ఉత్తరపద మవుతుంది. కుజ్జ లైనతమ్ములు, తమ్ముఁగుజ్జులు. విశేష్యం పూర్వపదం కావడంచేత వీటిని విశేష్యపూర్వపదకర్మధారయా లని ప్రౌఢవ్యాకర్త పేర్కొన్నాడు. ఇవే విశేషణోత్తరపదకర్మధాంయా లనీ వ్యవహరింపబడుతుంటాయి.

**3. విశేషణోభయపదకర్మధారయం:** 'ఆయీత్యాదిఘటితంబులు విశేషణోభయపదకర్మధారయంబులు' ఆ – ఈ మున్నగువిశేషణాలు ఒకటికంటె ఎక్కువ కూడి విశేష్యంతో సమాసం పొందడం ఉన్నది. ఆయీనేరములు – తెలినునుసోగవెన్నెలలు మొ॥ అనేకవిశేషణాలు ఉన్నకర్మధారయమె విశేషణోభయపదకర్మధారయంగా ఈలక్షణంచేత ప్రౌఢవ్యాకర్త చెప్పదలచుకున్నాడు. 'పూర్వోత్తరపదాలు' రెండూ విశేషణా లయినపుడే యీపేరు తగును అనిపిస్తుంది.

**ద్వంద్వవిశేషాలు :**

**1. క్లీబసమానికి ద్వంద్వం:** 'ఆచ్ఛికశబ్దంబుతోడ స్త్రీసమంబు ప్రాయికంబుగ ద్వంద్వం బగు' అనేసూరిలక్షణంచేత ద్వంద్వంలో పూర్వపదం స్త్రీసమమే కావాలి.

'ఒకానొకచో ద్వంద్వంబునం బూర్వపదంబు క్లీబసమంబు నగు, అగుచో నాముపర్ణకంబునను లోపంబు నగు' అని క్లీబసమానికి సైతం ద్వంద్వం కావడాన్ని ప్రౌఢవ్యాకర్త పేర్కొన్నాడు. అందచందములు–వెచ్చసపచ్చములు. సూరి సూత్రంలోని ప్రాయికశబ్దంచేత ఇటువంటి అరు దయినగుసమాసాలను సంగ్రహించుకోవడానికి అవకాశం ఉన్నా, ప్రౌఢవ్యాకరణం స్పష్టం చేయడం మేలె.

**2. మిశ్రద్వంద్వం** : 'ఒకానొకచో ద్వంద్వంబు మిశ్రంబును అందలిపూర్వపదబు క్లీబసమంబునుగ గానంబడియెడి' అని ప్రౌఢవ్యాకర్త ద్వంద్వంలో మిశ్రసమాసాలను బాలవ్యాకరణంకంటె విశేషంగా ప్రతిపాదించాడు. అవసరమక్కఱలు, ఇటువంటిప్రయోగ మిం కొక్కటి కనబడదు. ఇది కూడా 'మొక్కేము సామి' అనేసందర్భంలో ఉండి అటువంటిదిగా గ్రహింపదగిఉండడం గమనించవలసిఉంది.

**అలుక్సమాసం** :

**నవర్ణకాలుక్సమాసం** : 'చేత - తోడ - వలన - అందు' అలుక్సమాసములను బాలవ్యాకరణం సందర్భవశంగా చూపింది. 'కొన్నియెడల సప్తమీతత్పురుషమునందు నవర్ణకంబు నగు' అని ప్రౌఢవ్యాకర్త సప్తమీ నవర్ణకం లోపింపనిసమాసాలను మార్గాంతరంలో పేర్కొన్నాడు. కువలయంబునవారు, మొ॥

**లుగలుక్సమాసాలు** :

అట్లు, కరణి, పోలె, బలె, వలె మొ॥ ఇవార్థకాలతోనూ, 'అట్టి, పోని, బోటి, వంటి' అనువదర్థకాల తోనూ లుగలుక్సమాసాలను ప్రౌఢవ్యాకర్త విశేషంగా ప్రస్తావించాడు. నారాయణునట్లు - నన్ను వంటి మొ॥.

## 2. ద్వంద్వసమాసంలో ప్రౌఢవ్యాకర్త విశేషంగా చెప్పినకార్యాలను తెలపండి.

'ద్వంద్వంబునం బదంబుపయి పరుషములకు గసడదవ లగు' అని సూరి ద్వంద్వసమాసంలో గసడదవాదేశాన్ని పేర్కొన్నాడు.

**1. (సదవ) ఆదేశాభావం** : 'కొన్నియెడల ద్వంద్వంబునం బదంబుమీఁది చతపలకు సదవలు గానంబడవు' అని ప్రౌఢవ్యాకర్త ఆదేశం రాకపోవడాన్ని పేర్కొన్నాడు. అందచందములు, కండతుండెములు, రాకపోకలు.మొ.

**2. లోపం** : 'భావద్వంద్వంబునం దొలిపదంబుటవర్ణకంబునకు లోపం బగు' భావార్థకకృదంతశబ్దాలకు జేసినద్వంద్వసమాసంలో మొదటిపదంలో చివరి 'ట' మొదలైనభావార్థక కృత్ ప్రత్యయాలకు లోపం వస్తుంది. చెల్లుటయును చెల్లమియును - చెల్లుచెల్లములు, వినికియును, వినమియును, వినివినములు మొ॥

**3. అంత్యావయవలోపం** : 'ద్వంద్వంబునం బూర్వపదాంత్యావయవంబునకు లోపం బొందె నగు' రెండుఅవయవాలు గలిగి, రెండుపదాలలోనూ రెండవఅవయవం సమానంగా ఉన్నపదాలకు ఏర్పడినద్వంద్వసమాసంలో మొదటిపదంలో చివరి (రెండవ) అవయవానికి (వికల్పంగా) లోపం వస్తుంది. పుట్టుగట్టును క్రుంకుగట్టును - పుట్టుగ్రుంకుగట్లు.

**4. దీర్ఘం** : 'కొన్నియెడల మహద్ద్వంద్వంబునం బూర్వపదాంత్యస్వరంబునకు దీర్ఘంబునుం జూపట్టెడు' స్త్రీ పురుషవాచకా లయినశబ్దాలకు కలిగినద్వంద్వసమాసంలో మొదటిపదం చివరిఅచ్చుకు కొన్నిచోట్ల దీర్ఘం వస్తుంది. అన్నాదమ్ములు (అన్నదమ్ములు), అప్పాచెల్లెంఢ్రు (అప్పచెల్లెంఢ్రు), తల్లీదండ్రులు (తల్లిదండ్రులు) మొ.

**5) ఏకవచనం** : 'ద్వంద్వం బప్రాణివాచకకృదంతశబ్దఘటితంబేకవచనాంతంబు నగు' ప్రాణం లేని వాటిని బోధించేశబ్దాలు కృదంతాలు అయినశబ్దాలకు కలిగినద్వంద్వసమాసం చివర బహువచనం రావలసిఉండగా ఏకవచనం రావటం కొన్నిచోట్ల కనబడుతున్నది. కూరగాయ (కూరగాయలు) కూడుగుడ్డ (కూడుగుడ్డలు) మొ॥.

# అనుబంధం

# సామాన్యవిషయప్రస్తావనం

## 1 ప్రయోగశరణం వ్యాకరణమ్ - నిరూపించండి.

వ్యాకరణం ప్రయోగాన్నే ఆశ్రయించే ఉంటుంది. అంటే కవిప్రయోగానికి అనుగుణంగానే వ్యాకరణం చెప్పబడుతుంది అని అర్థం.

లక్ష్యం లేకుండా లక్షణం ఏది అయినా పుట్టటం అసంభవం. 'ఆవు' అనేజంతువు ఒకటి ఉన్నపుడు 'నాలుగు కాళ్లు కలిగిఉండడం' మొదలుగా దానిలక్షణం ఏర్పరచటానికి వీలు కలుగుతుంది. అసలు ఆవే లేకపోతే 'ఈలక్షణాలు కలిగింది ఆవు' అని చెప్పడం ఎలా కుదురుతుంది?

అలాగే భాషకు కూడా లక్ష్యం లేనిదే లక్షణం ఏర్పడేవీలు లేదు. ఆలక్ష్యం కవిప్రయోగం. రాముడు+అతడు=రాముడతడు. అనేవిధంగా సంధి జరగటం కవిప్రయోగాలలో ఉన్నది. కాబట్టే 'ఉత్తున కచ్చు పరం బగునపుడు సంధి యగు' అనేలక్షణం పుట్టింది. వచ్చియిచ్చెను అనేవిధంగా కవిప్రయోగాలలో సంధి లేదు. కాబట్టే 'క్త్వార్థం బైనయిత్తునకు సంధి లేదు' అనేలక్షణం ఏర్పడింది. అలా కాకపోతే ఒకచోట సంధి అవుతుం దనీ, వేరొకచోట సంధి లే దనీ, చెప్పడం ఎలా? చెప్తే స్వీకరించడం ఎలా?

**ప్రయోగమూలకత్వం :**

బాలవ్యాకరణం పీఠికలో చిన్నయసూరి స్వయంగా 'పెక్కు లక్ష్యములు సావధానముగా పరిశీలించి, రచనాప్రణాళిక నిర్ణయించుకొని', తా నొకలక్షణగ్రంథాన్ని రచించినట్లు పేర్కొన్నాడు. దీనినిబట్టి లక్షణానికి కవిప్రయోగమే మూలంగా సూరి స్పష్టం చేసిన ట్లయింది. 'ఒకానొకచో ననుటచే ప్రయోగవైరళ్యంబు సూచింపబడియె' . మొద లైనవివరణ లిటువంటివే.

శబ్దరత్నాకరం నిర్మించడానికి సంపాదించినకవిప్రయోగాలలోని విశేషాలు నిరూపించడానికే త్రిలింగలక్షణశేషం రచిస్తున్నట్లు ప్రౌఢవ్యాకర్త స్పష్టం చేశాడు.

కాబట్టి కవిప్రయోగాలలో ఆయాశబ్దాలు ఏయే తీరుగా ఉన్నాయో చూసి అవి ఆతీరుగానే ఉంటాయని వ్యాకరణం పేర్కొంటుంది. కాబట్టి ప్రయోగంలో లేనిదానికి లక్షణం ఏర్పడడమే ఉండదు.

**ప్రయోగప్రదర్శనం :**

కొందరు లాక్షణికులు తాము చేసినలక్షణానికి ఉదాహరణలుగా కవిప్రయోగాలనే చూపించారు.అప్పకవి తాను చెప్పినయతిప్రాసాదులకు ఆయాకవులప్రయోగాలు అనేకం ఉదాహరించడం ప్రసిద్ధమే. స్పష్టంగా చెప్పీ, చెప్పకా, చిన్నయసూరి కూడా తనలక్షణాలకు పెక్కు కవిప్రయోగాలను ఉదాహరించాడు.

వ్యతిరేకమధ్యమమువర్ణకానికి లోపం రావడానికి ఉదాహరించిన 'నమ్మ కిట' అనేది ఉత్తరహరివంశంలో (సోమన)ప్రయోగం. సంబంధార్థంలో కు-విభక్తి కావడానికి ఉదాహరించిన 'నాకుం దమ్ముడు మీకు నెచ్చెలి' అనేది (పోతన)భాగవతంలోది.

స్థలాంతరంలో 'ఆఋషీశ్వరుండు వచ్చెనా ఫలించుఁ గార్యముల్' అనేది రామాభ్యుదయంలోది. ఇలా పెక్కుచోట్ల ఉదాహరణలు కవిప్రయోగాలె కావడం గుర్తింపవచ్చు.

ప్రౌఢవ్యాకర్త కవిప్రయోగాలను అన్నిచోట్లా చూపడం ప్రసిద్ధమే.

ఇలా లక్షణానికి కవిప్రయోగాలను ఉదాహరణలుగా ఇవ్వడ్ లక్షణం ప్రయోగాల ననుసరించి ఉండడాన్నీ, అందువల్ల ప్రయోగశరణం కావడాన్నీ సూచిస్తుంది.

**ప్రయోగప్రామాణ్యవర్ణనం:**

జవ్వని+ఆలు=జవరాలు. ఇక్కడ జవ్వనిశబ్దానికి జవ ఆదేశం అవుతుం దని చెప్పిన చిన్నయసూరి 'ఏకాంతమునందు నున్నజవరాంధ్ర నని కవిప్రయోగము' అని వివరించాడు.

జవ్వని శబ్దానికి జవ అనేది ఆదేశం అవుతుం దని తాను చేసినలక్షణానికి జవరాంధ్ర అనే (పెద్దన మనుచరిత్ర) ప్రయోగం ప్రమాణం అని సూరి చెప్తున్నాడు. ఇది లక్షణం చెప్పడానికి కవిప్రయోగం మూలం అని స్పష్టంగా చెప్పిన ఇటువంటిస్థలాలు వ్యాకరణం ప్రయోగశరణం అని నిరూపిస్తాయి.

విశేషంగా కన్పించే ప్రయోగాలను నిరూపించడానికే వ్రాయబడినప్రౌఢవ్యాకరణంలో ఇటువంటిస్థితి సాధారణమే.

**భిన్నలక్షణతిరస్కారం:**

సూరి ఒకచోట 'అనుకృతిని నిదుదకుం గుఱుచ యగు నని యొకండు వలికె నది నిరాకరంబు' అని చెప్పాడు. అలా పలికినఅప్పకవి అటువంటిప్రయోగాన్ని చేసి చూపాడు. అంటే కవిప్రయోగాలలో ఇక్కడ దీర్ఘానికి హ్రస్వం రావడం లేదు కాబట్టి అలా వస్తుం దని చెప్పినఅప్పకవిలక్షణం అంగీకరింపరాని దని అర్థం. ప్రయోగాలకు విరుద్ధంగా ఉంటే లక్షణమే తిరస్కరించాలి అనీ, కాగా లక్షణం ప్రయోగశరణ మై ఉండా లనీ, లక్షణకర్తే స్పష్టం చేశాడు. 'ఇట్టి ప్రయోగములచేత అన్యస్యాః క్వచి ద్భవే చ్చాన్యా అనుశబ్దశాసనులసూత్రము సార్థక మగుచున్నది' అనే ప్రౌఢవ్యాకర్త వివరణం దీనిని ఇంకా స్పష్టం చేస్తున్నది.

**ప్రయోగవర్ణనం:**

ప్రయోగసామాన్యాన్ని అనుసరించి లక్షణం చేసినా ఆలక్షణానికి భిన్నంగా ఉన్న ప్రయోగాలను ప్రత్యేకంగా వర్ణించడం వ్యాకరణంలో కనిపిస్తున్నది. నమ శ్శబ్దంలో మాత్రమే ఓత్వాన్ని చెప్పినసూరి'ఈకార్యము లాతిచో సహితము కానంబడియెడి' అని వివరించి 'గతానుగతికో లోకో యటంచు' అనేకళాపూర్ణోదయప్రయోగాన్ని చూపాడు. 'కెంధూళి, కెంజడ లనియు ప్రయోగంబులు గానంబడియెడి', 'ఇచట మఱియుం బ్రయోగవైచిత్ర్యంబు గల దది ప్రయోగంబుల నెఱుంగునది,' మొ. అనేకస్థలాలు ఇటువంటివి.

'కొన్నియెడల ద్రుతంబుమీద నకారంబు గానంబడియెడి' స్త్రీసమఘటితంబ యొకానొకండు బహువ్రీహి చూపట్టెడు' మొద లైనవిధంగా లక్షణంలో 'కానంబడియెడి'మొ. శబ్దాలు ప్రయోగాలను వర్ణిస్తున్నాయి.

ఇటువంటిలక్షణాలు ప్రౌఢవ్యాకరణంలో అధికం.

**ప్రయోగప్రాశస్త్యప్రకటనం :**

'ఆర్యవ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు' అని సూరి మహాకవులప్రయోగాలలో లక్షణానికి విరుద్ధ మై ఉన్నా, అవి అలాగే గ్రహింపదగినవే అని పేర్కొన్నాడు. ఇటువంటి లక్షణాలు (లక్షణంకంటే) ప్రయోగాలబలీయతను నిరూపిస్తాయి. వ్యాకరణం ఏదో ఒకమార్గంలో ప్రయోగాలను ఆశ్రయించాలి అని సూచిస్తుంది.

**ప్రయోగలక్షణం:**

భాషాస్వరూపం తెలియడంలో లక్షణంకంటే లక్ష్యాలలోనే లాఘవం ఉన్నపుడు ఆయావాటిని నిపాతలుగా పేర్కొనడమూ, ప్రయోగాలనుబట్టి లక్షణం తెలియజెప్పడమూ తెలుగువ్యాకరణంలోనూ ఉన్నది. 'కద్రువ నాగమాత, అందదుకు ప్రభృతులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబులు' మొద లైనలక్షణాలు ఇటువంటివి. ఇలాగే తద్ధితాలు, కృత్తులు మొ.

**అనేకవ్యాకరణోత్పత్తి:**

లక్షణం ప్రయోగశరణం కావడంచేతనే ఏభాష కయినా వ్యాకరణగ్రంథాలు అనేకం ఏర్పడుతుంటాయి. పూర్వలాక్షణికులు చెప్పక విడిచినదానినీ, తరువాతి, తరువాతి కవులప్రయోగాలలో కనిపించేవిశేషాలను లక్షణబద్ధం చేయటానికి వ్యాకరణాలు వ్రాస్తుండడం జరుగుతుంది. బాలవ్యాకరణానికి పిదప ప్రౌఢవ్యాకరణం ఏర్పడడం కవిప్రయోగాలకు లక్షణం చేయడానికే కదా.

లక్షణం ప్రయోగాల నాశ్రయించి, దాని కనుగుణంగానే చెప్పబడుతుంది. కాని కవులు స్వతంత్రు లై ప్రయోగించడమూ ఉన్నది. అందువల్లనే నన్నయ కున్నప్రామాణ్యం ఆధునికకవులు మొద లైనవారివిషయంలో ఉండదు కదా. 'వనమునుంచి, ధనమునుంచి యని యుంచిశబ్దానుప్రయోగముతో కొందఱు వ్యవహరింతురు. కాని యది సాధుకవి ప్రయోగారూఢంబు కా' దని సూరి తిరస్కరించాడు. ఇలాగే ప్రౌఢవ్యాకర్త కూడా 'ఒకానొకయాధునికగ్రంథమునందు అన్నరో, ఏనుంగురో అని ప్రయోగములు కానంబడుచున్నవి. వానికి బ్రామాణికప్రయోగంబులు కానంబడవు' అని తిమ్మకవి ప్రయోగాలను నిరసించాడు.

వ్యాకరణం (సాధుకవి)ప్రయోగశరణ మై ఉండడం అన్నది యితరభాషలకులాగా ఆంధ్రభాషకుకూడా చెల్లడం పెక్కు ఆధారాలతో గుర్తింపవచ్చు.

## 2. సూరిసూత్రాలలో సూత్రలక్షణాలు ఎలా ఉన్నాయో పేర్కొనండి.

**సంస్కృతసంప్రదాయం:**

తెలుగువ్యాకరణాలు ఒకటి రెండు స్వతంత్రమార్గంలో రచింపబడినా, చాల వఱకు సంస్కృతసంప్రదాయానుసారంగా కూర్పబడినవే. సూరి బాలవ్యాకరణంతో గూడ తనవ్యాకరణాలు అన్నీ ఆమార్గంలోనే రచించాడు. అలాగే సూత్రాలు కూడా.

**సూత్రలక్షణం:**

సూత్రయతి అర్థం గ్రథ్నాతి ఇతి సూత్రమ్. ఇలాంటి సూత్రానికి కొన్ని ప్రత్యేకలక్షణాలు ఉండాలి. అని సంస్కృతసంప్రదాయం.

**'అల్పాక్షర మసందిగ్ధం సారవద్ విశ్వతోముఖమ్,**

**అస్తోభ మనవద్యం చ సూత్రం సూత్రవిదో విదుః.** (ముగ్ధబోధవ్యాకరణం. సంజ్ఞాపాదాంతసూత్రదుర్గాదాసవ్యాఖ్య.)

అని సంస్కృతంలో సూత్రానికి ఆరు లక్షణాలు చెప్పారు. సూరిసూత్రాలు అన్నీ ఈలక్షణాలు మొత్తం కలిగిఉన్నవే. ఆయాసూత్రాలలో ఈలక్షణాలు ఇంకా విశేషంగా గోచరిస్తాయి.

**1. అల్పాక్షరం:** సూత్రం తక్కువ అక్షరాలతో స్వల్పపరిమాణంలో ఉండాలి. అంటే చెప్పదలచిన అర్థం మొత్తం సాధ్య మైనంత తక్కువ అక్షరాలలో చెప్పాలి.

కొన్నిచోట్ల వివరణరూపంలో చెప్పడంచేతా, కొన్నిచోట్ల విస్తృతవిషయం ఒక్కచోట కూర్చాలనుకోవడంచేతా, ప్రౌఢవ్యాకరణసూత్రాలు అధికాక్షరాలతో వ్యాఖ్యానప్రాయాలు కావడం గుర్తింపగలం. సూరిసూత్రాలు అలా కాదు.

'వానిలో రుములు బహువచనంబులు, పెఱ లేకవచనంబులు' ఈసూత్రంలో 'డురువురునుము' అనేక్రియావిభక్తులలో ముందుగా బహువచనాలు చెప్పబడ్డాయి. నిజానికి ముందు ఏకవచనాలను చెప్పి ఇతరాలు బహువచనాలు అనడం క్రమం. అయినా రురుము అనేబహువచనాలలో రువర్ణాలు రెండూ ఒక్క 'రు' వర్ణంచేత సంగ్రహింపబడుతూ, 'రుములు బహువచనము' లనడంలో ఒక్కఅక్షరం తగ్గింది. ఇది అల్పాక్షరత్వసాధనకే అని స్పష్టం.

**2. అసందిగ్ధం:** సూత్రం సందేహరహితం కావాలి. అల్పాక్షరం కావాలి అని సంక్షేపించడంవల్ల గానీ, ప్రమాదాదులవల్ల గానీ, చెప్పవలసినఅర్థం మొత్తం చెప్పకపోతే అక్కడ సందేహాలు కలుగుతాయి. ఉదాహరణకు 'గుణవాచకంబులు గొన్నింటి నిగాగమంబునకుఁ బరుషంబులు పరంబు లగునపుడు బిందు వగు'. అనే ప్రౌఢవ్యాకరణ సూత్రంలో మీదిపరుషం ఏ మవుతుందో చెప్పలేదు. ఇంకా కమ్మనితేనె అనే రూపం ఉంటుందా? లేదా? అనేసందేహం కలుగుతుంది. సూరి లక్షణాలలో ఇలాంటి స్థితి లేదు.

'యకారంబును వువూవొవోలును దెలుగుమాటలకు మొదట లేవు' ఇక్కడ తెలుగుమాటలు అంటే సంస్కృతసమాలు గ్రహించాలా? కూడదా అని సందేహం కలగవచ్చు. కాని 'సంస్కృతసమేతరంబు లయినతెలుగుశబ్దములయందుఁ బరుషసరళములకు ముందే బిందువు గానంబడుచున్నది' అనేపూర్వసూత్రంనుంచి 'సంస్కృతసమేతరంబు లయిన' అనేది అనువృత్తం కాగా అచ్చతెలుగుమాటలు అనేఅర్థం సిద్ధించి ఆసందేహం తొలగిపోతుంది. కాగా సంస్కృతసమం మొదట యకారం ఉండవచ్చు. యముడు, యాత్ర మొ.

**3. సారవంతం :** సందిగ్ధత ఉండ రా దని వివరిస్తూ సి ద్ధిస్తున్న అర్థాన్నే మళ్లీ, మళ్లీ చెప్పడం, ప్రయోజనం లేనిపదాలు కూర్చడం, మొద లైనవాటిచేత సూత్రం నిస్సారం కాకూడదు. అంటే సూత్రంలోని పదాలు అన్నీ మార్పరానివై, సార్థకాలు ఐ ఉండాలి. 'ఊరు చోటు మేన్వాదు లున్లుగ్విషయంబులు' అనేసూత్రంలో ఆదిశబ్దం అవసరం. కాగా చెటు, మేనులను కూడా సూత్రంలోనే ఉచ్చరించడంలో ప్రయోజనం లేదు. సూరి సూత్రాలు ఇలా కాక దళసార్థక్యంతో ఉండడం సామాన్యం. పైన 'రుములు బహువచనంబులు' అన్నచోట రువర్ణం ఒక్కటే ప్రథమ మధ్యమపురుషలు రెంటిని బోధిస్తూ సారవల్లక్షణంతో ఉండడం గమనింపవచ్చు.

**4. విశ్వతోముఖం :** సూత్రం భాష మొత్తంలో అత్యధికలక్ష్యాలలో వర్తించేది కావాలి. 'ద్విరుక్తం బగుహల్లు పరం బగునపు డాచ్ఛికం బగుదీర్ఘంబునకు హ్రస్వం బగు' 'ఇత్వంబు గాని యెత్వంబు గాని కూడుచో ననాద్యం బయినయుత్వంబున కిత్వం బగు' మొ, రీతిగా సూరిసూత్రాలు భాషాసామాన్యలక్షణాన్ని పేర్కొంటూ, అత్యధికలక్ష్యాలలో వర్తిస్తున్నాయి.

ని,కి, మొ. వాటిని విభక్తులుగా చెప్పకుండా నుకు-లనుండే సాధించడం మొ. వాటిలో భాషాలక్షణాన్ని, బహులక్ష్యాలలో సారభూత మైనదానిని గుర్తించి పేర్కొనడం సూరిసూత్రరచనలోని ప్రత్యేకత.

అందదుకు మొ. చోట్ల ఒక్కొక్కరూపంలో మార్పులు పెక్కుతీరులుగా ఉన్నాయి. వాటిని సాధించా లంటే ఒక్కొక్కరూపానికి పెక్కు సూత్రాలు చెప్పవలసిఉంటుంది. అదిసూత్రలక్షణం కాదు. అందుకే సూరి సంస్కృతమార్గంలో అందదుకు ప్రభృతులు, నిక్కలాదులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబులు' మొ. రీతిగా సూత్రించాడు. 'కద్రువ నాగమాతా' మొ. నిపాతస్థలాలు మొ. ఇలాంటివి.

**5. అస్తోభం:** స్తోభం అంటే అవరోధం. అంటే ఇక్కడ అర్థం తెలియడంలో క్లేశం. అర్థం విశ్వతోముఖం కావాలి అని లాఘవాపేక్షతో అన్వయాదులతో సూత్రం క్లిష్టం అయిఉండరాదు. అపుడే ఆలక్షణం సమ్మాన్య మై, గ్రాహ్యం అవుతుంది.

సూరి బాలవ్యాకరణాన్ని బాలావబోధ మగుభంగి వ్రాస్తున్నట్లు పేర్కొన్నాడు. అందుకై తనయితర(సూత్రాంధ్రాది)వ్యాకరణాలకంటే గూడ బాలవ్యాకరణసూత్రాలలో, అనువృత్తి అపకర్ష వంటివాటి అవసరాన్ని తగ్గించాడు. బాలవ్యాకరణసూత్రాలు అన్నీ సాధారణంగా స్వయంగా సమగ్రంగా చెప్తాయి. సంధిపరిచ్ఛేదంలో 'అచ్చు పరం బగునపుడు', క్రియాపరిచ్ఛేదంలో 'ముత్తు పరం బగునపుడు' మొ. బహులక్షణాలలో చేరుతూ ఎల్లెడల ప్రయోగింపబడుతున్నా సూత్రాలు అర్థావగతిలో అవరోధం లేని వై ఉండడం గమనింపవచ్చు

**6. అనవద్యం:** అవద్యం అంటే చెప్పదగనిది. అనవద్యం అంటే చెప్పదగినది. లక్ష్యాలు అన్నీ సాధించాలి అని విశ్వతోముఖత్వంకోసం గ్రహింపదగనిశబ్దాలను గూడా లక్షణబద్ధం చేయరాదు. కూతురిని, చేతురు, మొ. అసాధువులుగా సూరి పేర్కొన్నాడు. ప్రౌఢవ్యాకర్త సైతం అన్నరో, ఏనుంగురో ఇత్యాదిప్రయోగాలను అంగీకరించకపోవడం గమనింపవచ్చు. అంటే కవిప్రయోగలలో ఉన్న వని అన్నింటినీ కాక, సాధుకవిప్రయోగారూఢాలు ఐనయోగ్యశబ్దాలను మాత్రమే లక్షణం సాధించాలి. ఇలాగే అతివ్యాప్తి, అవ్యాప్తి మొ. దోషాలచేత సూత్రం నింద్యం కాకుండాలి.

## 3. విషయాన్నిబట్టి సూరిసూత్రాలలోని భేదాలను గూర్చి వివరించండి.

**సూత్రభేదాలు :**

**సంజ్ఞా చ పరిభాషా చైవ విధి ర్నియమ ఏవ చ**
**అతిదేశో ఽధికార శ్చ షడ్విధం సూత్రలక్షణమ్.**

చెప్పేవిషయాన్నిబట్టి సూత్రం ఆఱువిధాలు.

**1. సంజ్ఞ :** విధిఘటకసంకేతపదీయశక్తి గ్రాహకం సంజ్ఞా. లక్షణంలో కూర్పబడినపదంయొక్క అర్థాన్ని తెలిపేది సంజ్ఞ. 'నకారంబు ద్రుతంబు' 'స్త్రీతిర్యగ్జడభిన్నంబులును వానివిశేషణంబులును మహత్తు లనంబడు'. మొ.

**2.పరిభాష :** లింగవత్త్వే సతి సందిగ్ధార్థనిశ్చాయికా పరిభాషా. సప్రమాణంగా సందేహాన్ని నివారించి అర్థాన్ని సంక్షిప్తంగా నిశ్చయించి చెప్పేది పరిభాష. 'ఇట విశేషం బుత్సర్గంబునకు విభాషను బాధకం బగు'.

**3.విధి :** అప్రాప్తప్రాపకో విధిః. అప్పటివరకు లేని (వివక్షింపని) కార్యాన్ని కలుగజేసేది విధి. ఉదా. ఉత్తున కచ్చు పరం బగునపుడు సంధి యగు.

క్త్వార్థం బైనయిత్తునకు సంధి లేదు. మొ.

4.నియమం :సామాన్యప్రాప్తస్య విశేషావధారణం నియమః.సామాన్యంగా (అన్నిచోట్లా) ప్రాప్తిస్తున్నదానిని విశేషంగా కొన్నిప్రత్యేకస్థలాలలో మాత్రమె వస్తుం దని నిశ్చయించేది నియమం. 'ఉదంతస్త్రీసమంబులకుం బుంపులకు నదంతగుణ వాచకంబులకుఁ దనంబు పరం బగునపుడు నుగాగమం బగు'. ఇక్కడ ఉదంతస్త్రీసమాదులకు చెప్పిననుగాగమవిధి 'తన' కంటే ఇతర మయిన(పరుషసరళాది)తద్ధితం పర మైనపుడు నుగాగమం లే దని నియమం చేస్తుంది. సొగసుకాఁడు. మొ.

**5.అతిదేశం :** అవిద్యమానధర్మప్రాపకశాస్త్ర మతిదేశః. లేనిధర్మాన్ని ప్రాప్తింపజేసే శాస్త్రం అతిదేశం. 'విశ్వకర్మాదులకు స్త్రీత్వం బగు' 'కంధరాదులు క్లీబతుల్యంబులు' 'మిత్రాదులు– పుంలింగతుల్యంబులు' మొ.

**6.అధికారం :** స్వదేశే ఫలశూన్యత్వే సతి విధిశాస్త్రేణ సాక మేకవాక్యతయా అర్థబోధకః అధికారః. స్వయంగా వాక్యార్థాన్ని సంపూర్ణంగా తెలుపకుండా, తరువాతివిధివాక్యంతో కలిసి ఆవాక్యాలఅర్థాన్ని బోధించేది అధికారం. 'ధాతువునకు' (క్రియ. 1)

## 4.సూరి సూత్రరచనాపటిమను గూర్చి వివరించండి.

**సూత్రాత్మకరచనం:**

తెలుగువ్యాకరణాలు కొన్ని సంస్కృతంలోనూ, తెలుగులోనూ ఛందోబద్ధ మై ఉన్నాయి.ఛందోబద్ధం అయినపుడు పాదపూరణార్థకాలు మొ. అనవసరశబ్దాలమూలంగా శాస్త్రానికి ఉండవలసిన కట్టుదిట్ట మైనరూపానికి కొద్దో, గొప్పో భంగం వాటిల్లక తప్పదు. సూరికూడా పద్యాంధ్రవ్యాకరణం అని వ్యాకరణాన్ని పద్యాలలో వ్రాయడం ప్రారంభించి కూడా తర్వాత సూత్రాత్మకంగా చెప్పడమే శాస్త్రానికి ఉచితం అని యితరవ్యాకరణాలు అన్నీ సూత్రాత్మకంగానే చెప్పాడు.అలా బాలవ్యాకరణం కూడా సూత్రాత్మకంగా రచింపబడింది.

**సూరిసూత్రవైశిష్ట్యం:**

(ఇక్కడ 2, 3 వ్యాసవిషయాలను సంగ్రహించిచెప్పాలి.)

ఈలక్షణాలతోపాటు సూత్రరచనలో సూరి ఇంకా ప్రత్యేకతలు చూపాడు.

**గ్రహణధారణయోగ్యత:**

అనల్పార్థాన్ని స్వల్పాక్షరాలతోనే చెప్పడంతోపాటు ఉపయోగించినపదాలలోనూ వాటిని కూర్చటంలోనూ సూరి లాలిత్యాన్ని సంపాదించాడు. గద్యం అయినా ఛందోబద్ధంలాగా 'లలితోక్తులతో నొనరుపడం గూర్చి'నది బాలవ్యాకరణం. ఇలాంటిశైలివల్ల (అర్థం) సులభంగా ధారణ చేయడానికి కూడా సూరిసూత్రాలు అను వై ఉన్నాయి.

**లక్షణక్రమం :** పరిచ్ఛేదాలే కాకుండా అందులోని విషయాన్ని ఒకక్రమంలో పూర్వోత్తరసంబంధంతో కూర్చడంవల్ల ఏసూత్రానికి ఆసూత్రం మాత్రమే కాకుండా మొత్తం లక్షణం బుద్ధిలో స్థిరంగా నిలుపుకోడానికి వీ లయింది.

'కచటతపలు పరుషంబులు, గజడదబలు సరళంబులు' అనేచోట ఉచ్చరింపబడని దంత్యచజలు 'ఇతరము లగుహల్లులు స్థిరములు' అన్నచోట ఇతరాల్లో కూడా చూపలేదు. అవి ఏ మవుతాయి? అని సందేహం కల్గగా 'దంత్యతాలవ్యంబు లయినచజలు సవర్ణంబులు' అనేసూత్రం చెప్పబడింది. ఇపుడు దంత్యాలు ఏవి? తాలవ్యాలు ఏవి? అనేసందేహం కల్గగా 'ఇఈఎఏలం గూడిన– మొద లైనసూత్రాలు చెప్పబడ్డాయి. ఇలా సూరిసూత్రాలు ఒకక్రమంలో ఆకాంక్షతో కూర్పబడడం విశేషం.

ఈక్రమంవల్ల 'ఇకారవక్రంబు లుక్తంబులందలివి–' ఇత్యాదులలో లాఘవం సంపాదింపబడింది. పూర్వవ్యాకరణాలకంటే లక్షణంలో పరిణతీ, సమాసంబునయందు, అడంగ్వాదులకు– మొద లయినరీతిగా సూత్రాలలో విశేషలక్షణమూ, మొ. సూరిసూత్రరచనంలో ఇంకా పెక్కు ప్రత్యేకతలను గమనింపవచ్చు.

ఇలా సంస్కృతసంప్రదాయానుగుణంగానూ, స్వీయ మైన ప్రత్యేకతలతోనూ, బాలవ్యాకరణసూత్రాలు సూరి సూత్రరచనాసామర్థ్యాన్ని స్పష్టం చేస్తున్నాయి

## 5. బాలప్రౌఢవ్యాకరణాలమీద ఉన్నసంస్కృత వ్యాకరణప్రభావాన్నిగురించి తెలపండి.

**తెలుగువ్యాకరణం :**

అత్యంతప్రాచీనకాలంలోనే ఏర్పడి విస్తరించిన తెలుగు వ్యాకరణం రచనావిధానంలో మూడు భేదాలు గోచరిస్తాయి. కొన్ని సంస్కృతప్రాకృత వ్యాకరణప్రభావంతో తన్మార్గంలో రచింపఁబడినవి. ఆంధ్రకౌముది మొద లయినువాటిలో ఈఅనుసరణం అత్యధికం. ఆంధ్రభాషాభూషణం మొద లయినకొన్ని వ్యాకరణాలు స్వతంత్రమార్గంలో రచింపబడ్డాయి. ఆధునికాంధ్రవ్యాకరణాలు కొన్ని ఆంగ్లవ్యాకరణప్రభావానికి లోనయి రచింపబడ్డాయి. ప్రౌఢవ్యాకరణంలో అపూర్వంగా వాక్యపరిచ్ఛేదం ఆరంభించడంలో ఆంగ్లవ్యాకరణ ప్రభావం ఉన్న దంటారు. కాని అందులో లక్షణం మాత్రం సంస్కృతసంప్రదాయానుగుణమే కావడం గమనింపవచ్చు.

**సంస్కృతవ్యాకరణప్రభావం :**

చింతామణీ, మరి కొన్ని వ్యాకరణాలలో సంస్కృతంతోపాటు కొద్దిగా ప్రాకృత వ్యాకరణంప్రభావం కూడా గోచరిస్తుంది. చింతామణిమార్గంలో రచింపబడినవే అయినా చింతామణికోవవ్యాకరణాలలో ఉన్న ప్రాకృతవ్యాకరణప్రభావం బాలప్రౌఢ వ్యాకరణాలమీద లేదు. సంస్కృతవ్యాకరణాలలోనూ పాణినీయం (వైయాకరణసిద్ధాంత కౌముది) ప్రభావమే తెలుగువ్యాకరణాలమీద కనబడుతుంది.

బాహ్య, అభ్యంతరవిషయాలలో తెలుగువ్యాకరణంమీద దీనిప్రభావం ఇలా గుర్తింపవచ్చు.

**బాహ్యనిదర్శనాలు – 1.పరిచ్ఛేదవిభాగం :**

బాలవ్యాకరణంలో తెలుగుభాషాలక్షణం 'సంజ్ఞా–సంధి– తత్సమ–ఆచ్ఛిక– కారకాదిపరిచ్ఛేదాలుగా విభజింపబడింది. ఇందలి తత్సమాచ్ఛికాలను శబ్దపరిచ్ఛేదంగా ఏకం చేసిన ప్రౌఢవ్యాకరణంలోనూ పరిచ్ఛేదవిభాగం ఇంతే. ఈపరిచ్ఛేదవిభాగం

వైయాకరణసిద్ధాంతకౌముదిలోని పరిచ్ఛేదవిభాగాన్ని అనుసరించిఉన్నది. సంస్కృతభాష కున్నవిస్తృతి తెలుగుకు లేకపోవడంచేత, సంధి శబ్ద, సమాస, తద్ధితాదులలో కౌముదిలో ఉన్న విశేష విభాగం తెలుగులో లేకపోయినా, తెలుగుకు తగినరీతిలో అవాంతరవిభాగం ఉన్నది. తత్సమపరిచ్ఛేదంలో - అజంతహలంత ప్రకరణాలు, ఆచ్ఛికపరిచ్ఛేదంలో- సర్వనామ, ఔపవిభక్తిక ప్రకరణాలు మొద లయిన విటువంటివి.

కాగా లక్షణవిషయం తెలుగుకు తగినరీతిలో సంస్కృతవ్యాకరణమార్గాన్ని అనుసరించి ఆక్రమంలోనే ఆయాపరిచ్ఛేదాలుగా విభజింపబడిం దని గుర్తింపవచ్చు.

ఆంధ్రకౌముది మొద లయినవాటిలో గ్రంథనామంనుంచీ, సంస్కృతప్రభావం గోచరిస్తుంది.

**2.సూత్రాత్మకరచనం** :

అల్పాక్షరత్వాదిలక్షణాలతో పాణినీయంలాగా ఈవ్యాకరణాలు సూత్రాత్మకాలుగా రచింపబడ్డాయి. (ప్రౌఢవ్యాకరణంలో మాత్రం కొన్నిసూత్రాలు వివరణలవలె సాగాయి.) 'జిత్తు బిందుపూర్వం బగు- అనుసూత్రముచేత' మొద లైనవిధంగా వీటిని సూత్రాలుగా సూరి కూడా స్పష్టంగా పేర్కొన్నాడు.

**3. వృత్తిరచనం** :

సిద్ధాంతకౌముదిలోలాగా ఈవ్యాకరణాలలో సూత్రాలకు సంగ్రహంగా వృత్తి వ్రాయడం అక్కడక్కడ కనిపిస్తుంది.

జిత్తు బిందుపూర్వం బగు.

జకార మిత్తుగా గలదానికి ముందు బిందువు వచ్చు నని యర్థము.

అకప్రత్యయాంతావ్యయంబు కళయ.

వ్యతిరేకార్థకభూతకాలికాసమాపకక్రియ ద్రుతప్రకృతికము కా దని యర్థము. మొ.

కొన్నిచోట్ల సూత్రాలలోని ముఖ్యపదాల కర్థం వ్రాయబడింది. కొన్ని చోట్ల- స్పష్టము, ఉక్తము అనేవిధంగా వివరించదమూ చూడవచ్చు.

**4.వార్తికాలు:**

సంస్కృతవ్యాకరణంలోలాగా సూత్రంకంటె విశేషాంశాలను వార్తికాలుగా వివరణంలో చెప్పడం ఈవ్యాకరణాలలో ఉన్నది.

పత్వంబు హెచ్చునకుం గలుగదు. వర్గువునందలివువర్ణకం బొండె లోపించు. మొ.

**5. ఉదాహరణలు:**

ఉదాహరణలు, ప్రత్యుదాహరణలతో లక్షణాన్ని స్పష్టం చేయడం కౌముదిలోలాగా ఇక్కడా ఉన్నది.

విను మనియె. ఇచ్చట నచ్చుపరం బయినది కాబట్టి లోపము లేదు.

అద్విరుక్తం బనుటచే – తేపతేపకు – మొ.

ఉదాహరణలుగా బాలవ్యాకర్త కొన్నిచోట్ల కవిప్రయోగాలను ప్రదర్శించాడు. కవిప్రయోగమూలకం కావడంచేత ప్రౌఢవ్యాకరణంలో కవిప్రయోగప్రదర్శనం దాదాపు సర్వత్ర కనపిస్తుంది.

**ఆభ్యంతనిదర్శనాలు:**

గ్రంథాంతర్విషయాలలో సంస్కృతవ్యాకరణప్రభావం ఇంకా గాఢం. సంస్కృతలక్షణాన్నే సమన్వయించుకోవలసిన తావులు కొన్ని కాగా, సంస్కృతలక్షణాన్ని అనువదించిన తావులూ, అనుసరించి స్వతంత్రంగా చెప్పిన తావులూ ఈవ్యాకరణాలలో చాలా ఉన్నాయి.

**1. సంజ్ఞలు :**

ఉపధ, ఆమ్రేడితం, ఉత్తమం, అవసానం మొద లయిన అనేక సంజ్ఞలు సంస్కృతం నుంచే గ్రహింపబడ్డాయి. 'ఉపధ యనగా తుదివర్ణమునకు ముందువర్ణము' మొద లయిన రీతిగా కొన్ని సంజ్ఞల అర్థం సంస్కృతంనుంచి అనువదింపబడింది. ఇటువంటిస్థితి కారక (సమాస) ప్రకరణంలో అధికంగా కనబడుతుంది. ఉత్తమం, అవసానం మొద లయిన సంజ్ఞలు తెలుగులో వివరింపబడలేదు. సంస్కృతలక్షణాన్ని ఆశ్రయించే వీటిని గూర్చి తెలియాలి.

పరుషం, సరళం మొద లైనవాటిని పూర్వాంధ్రవ్యాకరణాలనుంచి స్వీకరించిన యీ వ్యాకరణాలు సంస్కృతసంప్రదాయానుగుణంగా లాఘవాది ప్రయోజనాలకై– ముత్తు, త్రికము మొద లయినసంజ్ఞలను స్వతంత్రంగా ఏర్పరచాయి.

**2. ఇత్తులు :**

నుక్, లట్, మొద లయినురీతిగా కకారం, టకారం మొద లయినవి సంస్కృతాను సారంగా ఇత్తులుగా స్వీకరింపబడ్డాయి. నుమ్ అన్నపుడు ప్రౌఢవ్యాకర్త మిత్తు స్వీకరించాడు. లజీ, ముఞ్ ఇత్యాదిగా తత్తత్ప్రయోజనాలకై జీ, ఞ్ మొద లైనవి సంస్కృతసంప్రదాయంలో స్వతంత్రంగానే అయినా ఇత్తులుగా చెప్పబడ్డాయి.

**3. ప్రత్యాహారాలు :**

'లకారంబునకు దుగ్రువురునుము ఞ్గు' అనేచోట 'ఞకారంబు ప్రత్యాహారార్థంబు' అని చెప్పి సూరి రుఞ్లు, వుఞ్లు, మొద లయిన ప్రత్యాహారాలను ప్రయోగించాడు. ఇలా ప్రత్యాహారాలు చేసేవిధానం సంస్కృతవ్యాకరణాన్ని అనుసరించిందే.

**4.పరిభాషలు :**

లక్షణవిధానం సంస్కృతపరిభాషల ననుసరించి ఉండడం ఈవ్యాకరణాలలో సమానం. 'ప్రథమేతరవిభక్తివిధి నిరవకాశంబు గావున దీనిని బాధించెడిని' అనేసూరివివరణం 'నిరవకాశా హి విధయ స్సావకాశాన్ విధీన్ బాధన్తే' అనేసంస్కృతపరిభాష మూలంగా ఏర్పడిందే. నుక్, టుక్ అన్నపుడు 'ఆద్యన్తౌ టకితౌ' అనేదీ, ప్రౌఢవ్యాకర్త చెప్పిన 'నుమ్' అనేచోట 'మి దచో కన్త్యా త్పరః ' అనేదీ, మొదలుగా సంస్కృతపరిభాషలు అక్కడక్కడ సమన్వయించినపుడే ఆవిధానాలు అర్థవంత మవుతాయి. ఇలాగే షష్ఠీస్థానే యోగా, విభక్తిలకారము అన్నపుడు 'యదాగమా స్తద్గుణీభూతా స్తద్గ్రహణేన గృహ్యన్తే' అని మొదలుగా పెక్కుపరిభాషలు ఈవ్యాకరణాలలో సమన్వయింపవలసిఉన్నాయి.

**5. కార్యవిధానాలు :**

నిత్యము - విభాష- వైకల్పికము- బహుళము మొదలుగా ఆయాకార్యాలు విధింపబడినతీరు సంస్కృతానుగుణం. వాటిస్వరూపం సంస్కృతంనుంచే తెలియాలి. ఇలాగే, ఆగమ- ఆదేశాదిపద్ధతులు, మొ.

'విధానసామర్థ్యముచే నీద్రుతమునకు లోపము లేదు'

'వ్యవస్థితవిభాషచే నీద్రుతంబునకు సంశ్లేషంబు లేదు'- అనేతీరుగా విధానసానుర్థ్య మార్గం, విభాషకు వ్యవస్థ చేయడం మొద లయినపద్ధతులు సంస్కృతవ్యాకరణాన్ని అనుసరించినవే.

**6. జ్ఞాపనవిధానం:**

'ఈజ్ఞాపకంబుచేతనె నామంబులకు ధాతుత్వవివక్షయం దించుగాగమం బగు- ఆంధ్రశబ్దచింతామణియందుఁ గల ఇదమదసిత్యాదిసూత్రమందలి యదః ప్రభృతులు వ్యర్థము లగుచు స్వేతరంబులకును నక్కార్యంబు లని తెలుపు'- మొద లైనవిధంగా ఆయా లక్షణభాగాలు వ్యర్థం అయి అర్థాంతరాన్ని సాధిస్తూ ప్రయోజనవంతా లై సార్థకం అయ్యేటట్లు వర్ణించడం సంస్కృతపద్ధతే.

**7. (అధికార) సూత్రవిశేషం:**

సంజ్ఞా, పరిభాష, మొదలుగా విధానంతీరునుబట్టి సూత్రాలలో గలభేదాలు బాలప్రౌఢవ్యాకరణాలలో కనబడతాయి. 'ధాతువునకు' - ఇయ్యది యధికారసూత్రంబు' అనేచోట సూరి అధికారసూత్రంగా స్పష్టంగా చెప్పిన యీ 'అధికార' పద్ధతి సంస్కృత సంప్రదాయమె. సంజ్ఞాదు లుభయవ్యాకరణాలలోనూ ప్రసిద్ధాలే.

**8.సాధనవిధానం:**

ఈ శబ్దం ఇలా ఉంటుంది. అని పదస్వరూపాన్ని నిర్దేశించడం కాకుండా, ఆయాపదాలలో కలిగేవర్ణవికారాలను చెప్తూ, రూపాలను సాధించేవిధానం సంస్కృతానుగుణంగానే ఈవ్యాకరణాలలో కనవచ్చు. అంద్వాదులు, అందఱ్వాదులు అనేవిధంగా గణంగా ఏర్పఱచడం మొద లయినవి ఈపద్ధతిలోవే.

9. **నిపాతలు :**

శాస్త్రంచేత ఒకతీరుగా ఏర్పడవలసినరూపాన్ని ప్రయోగానుసారంగా ఇంకొకతీరుగా ఉండేటట్లు నియమించడాన్ని నిపతించడం అంటారు. 'వేధ పురోధ పురోధసుఁడు.' 'తాము తమరు తారు నగు' అనేరీతిగా బాలప్రౌఢవ్యాకరణాలలో ఈనిపాతవిధానాలు కనబడతాయి.

10. **ఇతరాలు :**

సంస్కృతశబ్దాల లింగం, కవిప్రయోగపరామర్శనం మొ. అనేకవిధాలుగా తెలుగు వ్యాకరణాలు సంస్కృతవ్యాకరణప్రభావంతో తత్సంప్రదాయానుగుణంగా రచింపబడి శాస్త్రగౌరవం అందుకున్నాయి. బాలప్రౌఢవ్యాకరణాలు రెండూ సంస్కృత సంప్రదాయానుగుణంగానే రచింపబడినా అందుకు నిదర్శనాలు బాలవ్యాకరణంలో అధికంగా స్పష్టంగా కనబడతాయి.

## 6. ప్రౌఢవ్యాకరణరచనాప్రణాళికను గురించి తెలపండి.

ఆధునికాంధ్రవ్యాకరణాలలో బాలవ్యాకరణానికి తర్వాత ప్రౌఢవ్యాకరణం పేరు ప్రసిద్ధం. బాలవ్యాకరణంతోటిసంబంధమూ, ప్రౌఢవ్యాకరణం అనేపేరూ,దీని ప్రసిద్ధికి కారణాలు కావచ్చు.

**త్రిలింగలక్షణశేషం:**

సీతారామాచార్యులుగారు తమయీలక్షణగ్రంథంపేరు గ్రంథపీఠికలోనూ, పరిచ్ఛేదాంతగద్యలలోనూ త్రిలింగలక్షణశేషం అని మాత్రమే పేర్కొనడం కనబడుతుంది. త్రిలింగలక్షణం అంటే తెలుగువ్యాకరణం. కాబట్టి త్రిలింగలక్షణశేషం అంటే తెలుగువ్యాకరణంలో మిగిలింది. ఈపేరునుబట్టి తనకు పూర్వంలోని తెలుగువ్యాకరణాలలో చెప్పగా మిగిలినలక్షణం ఇందులో గ్రంథకర్త చెప్పదలుచుకున్నాడు అనాలి.

**రచనాలక్ష్యం :**

'భారతాదిగ్రంథపరిశోధనంబుచే దొరకినవిశేషలక్షణప్రయోగముల నేర్చి కూర్చి త్రిలింగలక్షణశేషం బనునొకయపూర్వవ్యాకరణము దీని వ్రాసితిని'. అని గ్రంథకర్త పీఠికలో చెప్పాడు. కాగా కవిప్రయోగాలలోనివిశేషాలను లక్షణబద్ధం చేయడం ఈగ్రంథరచనాలక్ష్యం.

**అసాధారణలక్షణం :**

'ఇందలిలక్షణము లసాధారణములు' అని ప్రౌఢవ్యాకర్త పేర్కొన్నాడు.బాలవ్యాకరణం భాషాసామాన్యలక్షణం తెలుపుతూ, సాధారణలక్షణం కాగా కవిప్రయోగాలలోని అరు దైనవిశేషాలు అంటే అసాధారణలక్షణాలు ప్రౌఢవ్యాకరణం తెలుపుతుంది. అందుకే ఇందులోనిలక్షణాలు అసాధారణాలు ఐనాయి. ఈఅసాధారణత కవిప్రయోగాలమూలంగా లక్షణాలకు కలిగిం దని తెలియాలి.

**రచనాప్రణాళిక :**

సంస్కృతసంప్రదాయానుసరణం, సంజ్ఞాదు లైనఅంశాలలో చింతామణి, బాలవ్యాకరణాలమార్గంలో వాటికి శేషగ్రంథంగా ఇది రచింపబడింది.

**చింతామణిశేషం :**

చింతామణి అభిప్రాయాలను వివరించేసందర్భాలను పరిశీలిస్తే ఇది చింతామణిని అనుసరించినగ్రంథంగా తెలియవచ్చు.

'ఊరుచోటుమేన్వాదు లున్లుగ్విషయంబులు' ఇక్కడ 'ఉన్లుక్' అనేఅంశం 'కేషాంచిదుదంతానాం నేతి విభక్తా వునో లుక్ స్యాత్' అనేచింతామణిలక్షణం లేక అర్థం కాదు. ఇలాంటిలక్షణాలు చింతామణికి వ్యాఖ్యలలాగా ఉంటాయి.

'ఇట్టిప్రయోగములచేత 'అన్యస్యాః క్వచి ద్భవే చ్చాన్యా' అనుశబ్దశాసనులసూత్రము సార్థక మగుచున్నది'.

'ఆంధ్రశబ్దచింతామణియందు గల ఇద మద సిత్యాదిసూత్రమందలియదఃప్రభృతులు వ్యర్థము లగుచు స్వేతరంబులకును నక్కార్యం బగు నని తెలుపుచున్నవి'.

మొద లైనప్రౌఢవ్యాకరణవివరణలు ఆగ్రంథం చింతామణిని ఎంతగానొ వివరణాత్మకంగా అనుసరించడాన్ని స్పష్టం చేస్తుంది.

బాలవ్యాకర్త కిత్తుగా జెప్పిన ఆగమం ఒక్కచో చింతామణి మిత్తుగా చెప్పింది. 'షష్ఠ్యా ఉతో ఽచి నుమ్ సే' ప్రౌఢవ్యాకర్త 'పోఁడి పరం బగుచో నెల్లెడల ను మ్మగు' అని మిత్తుగా చెప్పడంలో చింతామణ్యనుసరణం గమనింపవచ్చు.

'గోకుల మిల్లిలు' ఇత్యాదిసందర్భాలలో లక్ష్యసాధనైకదృష్టితో కాని చింతామణి అభిప్రాయానికి భిన్నంగా గూడా చెప్పడం కనబడుతుంది.

**బాలవ్యాకరణానుసరణం :**

ప్రౌఢవ్యాకరణం కేవలం బాలవ్యాకరణానికే శేషం కాదు. సూరి బాలవ్యాకరణంలో సర్వనామాలప్రక్రియ చెప్పలేదు. ప్రౌఢవ్యాకర్త చెప్పాడు. కాని అందులో చింతామణి నిరూపించిన 'నేను, నన్ను', మొద లైనవాటిప్రక్రియ ప్రౌఢవ్యాకర్త చెప్పలేదు.

అయినా చింతామణితో సంబంధం కలిగిఉన్న బాలవ్యాకరణంలో ఉక్త మైన విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని కూడ ప్రౌఢవ్యాకరణం రచింపబడింది. 'ఉండిపదంబు పరం బగుచో వలన కందువర్ణక మట్లు నవర్ణకంబు నగు' మొద లైన ఆయాసూత్రాలు బాలవ్యాకరణానికి వివరణప్రాయాలే అనవచ్చు.

'ముత్తియశబ్దేతరంబులయందును దఱుచుగ నిత్వలోపంబు చూపట్టెడి' మొద లైనలక్షణాలలో విశేషప్రయోగసాధనదృష్టికంటె సూరిఅభిప్రాయాన్ని తిరస్కరించే ఆకాంక్ష అధికంగా కనబడుతుంది.

ఇలాంటివాటివల్ల బాలవ్యాకరణశేషం అనదగి ఆపోలికతో ప్రౌఢవ్యాకరణం అనేపేరు ప్రసిద్ధి కెక్కింది.

**ఇతరలక్షణవివేచనం :**

బాలవ్యాకరణంలో ఉక్త మైనదానిని విడిచిన ప్రౌఢవ్యాకర్త చింతామణికి శేషగ్రంథ మనదగిన వికృతివివేకం మొ. పూర్వలక్షణగ్రంథాలలో చెప్పబడినఅంశాలను తెలుగుచేశాడు. 'రోశబ్దం బొందు సంబోధనంబున స్త్రీవాచకంబునకుం బరంబుగ నగు' అన్నది 'రో ఇతి స్త్రీవాచకో భవేత్ పర త్రైవ' అనేవికృతివివేకలక్షణానికి అనువాదమే. అయినా 'అయ్యది హ్రస్వాంతంబును నయ్యెడి' అనేది ప్రౌఢవ్యాకర్త విశేషంగా చెప్పాడు.

మొత్తం మీద ప్రౌఢవ్యాకర్త వికృతివివేకం మొ. ఇతరవ్యాకరణాలు ఆధారంగా కొంత లక్షణం చేసినట్లు గుర్తింపవచ్చు.

**విశేషలక్షణం :**

ప్రౌఢవ్యాకర్త అపూర్వవ్యాకరణం అని చెప్పినయిందులో లక్షణం అపూర్వం కొంత లేకపోలేదు.

వాక్యప్రకరణం అపూర్వంగా ఇందులో చేరింది. అన్వయవిశేషాలు, కొంతసర్వనామ ప్రక్రియ మరి కొన్ని లక్షణాలు ప్రౌఢవ్యాకర్త లక్ష్యానుగుణంగా స్వతంత్రంగా చేసినది.

**ఆంగ్లవ్యాకరణప్రభావము :**

పూర్వాంధ్రవ్యాకరణాలకంటే అధికంగా ప్రౌఢవ్యాకరణంలో చేరినవాక్యపరిచ్ఛేదం ఆంగ్లవ్యాకరణప్రభావంచేతనే అంటారు.వాక్యాన్నిగూర్చి చెప్పదలచుకోవడం, నామాలు, క్రియలు, అవ్యయాలు అని పదాలను వర్గీకరించడం, సమాపకక్రియలు, అసమాపకక్రియలు అని క్రియలను వింగడించడం, మొద లైనకొన్ని అంశాలలో ఆంగ్లవ్యాకరణప్రభావం ఉన్నది. అయినా ఇందులో లక్షణం మాత్రం సంస్కృతసంప్రదాయానుగుణమె.వాక్యలక్షణమె సాహిత్యదర్పణంనుంచి స్వీకరింపబడింది. ఇలాగే మహావాక్యలక్షణం, విశేష్యాదులు నామభేదాలుగా చెప్పడం, కర్తరిప్రయోగాదులవివరణం మొదలుగా లక్షణం సంస్కృతసంప్రదాయానుగుణమే.

**ప్రయోగప్రదర్శనం :**

'విశేషప్రయోగముల నేర్చి కూర్చి యీవ్యాకరణ మసాధారణలక్షణములతో' వ్రాసినట్లు గ్రంథకర్త స్వయంగా చెప్పుకున్నాడు. విశేషకవిప్రయోగాలకు లక్షణం చెప్పబడుతున్నది. కాబట్టి (అసాధారణలక్షణం) ఇందలిలక్షణానికి కారణ మైనప్రయోగాన్ని తప్పకుండా ప్రదర్శింపవలసిందే. ఏనుఁగున నేనుఁగు, అవసర మక్కఱలు మొద లైనచోట్ల ఒక్కొక్కప్రయోగానికే లక్షణం ఏర్పడింది. ఇది ప్రౌఢవ్యాకర్త ప్రయోగపరిశీనాపటిమను తెలుపుతుంది.దీనిని శబ్దరత్నాకరనిర్మాణం ఇంకా నిరూపిస్తుంది.

సూత్రనిర్మాణాదులలో ఏ వయినా లోటుపాట్లు ఉన్నా బహుముఖశ్రమతో అరు దైన కవిప్రయోగవిశేషాలతో అసాధారణలక్షణం చేయడంలో ప్రౌఢవ్యాకరణం రచనాప్రణాళిక చక్కగా ఉపయోగించింది.

## 7. ప్రౌఢవ్యాకరణం నామసార్థక్యాన్ని గురించి వివరించండి.

శ్రీబహుజనపల్లి సీతారామాచార్యులుగారు తాము వ్రాసినవ్యాకరణాన్ని 'త్రిలింగలక్షణశేషము అను ప్రౌఢవ్యాకరణము' అని పేర్కొన్నారు.త్రిలింగలక్షణం అంటే తెలుగువ్యాకరణం. కాబట్టి త్రిలింగలక్షణశేషం అంటే అంతకు పూర్వం తెలుగువ్యాకరణాలలో చెప్పగా మిగిలినలక్షణం. అదే ప్రౌఢవ్యాకరణం.

**ప్రౌఢవ్యాకరణం :**

పీఠికలోనూ, ఇతరస్థలాలలోనూ వ్యాకర్త ఈగ్రంథానికి త్రిలింగలక్షణశేషం అనేపేరే తప్ప 'ప్రౌఢవ్యాకరణం' అనేపేరు ఎక్కడా ప్రస్తావించలేదు. కాని గ్రంథకర్త పర్యవేక్షించినమొదటిముద్రణంనుంచి ప్రౌఢవ్యాకరణం అనేది దీనికి నామాంతరంగా ఈగ్రంథం ముఖపత్రం మీద ఉండడంచేత ఈపేరు గూడా గ్రంథకర్త ఉద్దేశపూర్వకంగానే ఏర్పఱచినట్లు గుర్తింపవచ్చు. త్రిలింగలక్షణశేషం అనేపేరుకంటే ప్రౌఢవ్యాకరణం అనేపేరే ఈగ్రంథానికి ప్రసిద్ధ మైంది.

**సంజ్ఞార్థం :**

ప్రౌఢవ్యాకరణం అనేపేరు ముందుగా బాలవ్యాకరణాన్ని స్ఫురింపజేస్తుంది.దీనివల్ల ఇది బాలవ్యాకరణంకన్న మిన్న అనేఅభిప్రాయం కలిగిస్తుంది. అందువల్లనే కొందఱు బాలురకొఱ కయినవ్యాకరణం - బాలవ్యాకరణం కాగా, ప్రౌఢులకొఱ కయినవ్యాకరణం ప్రౌఢవ్యాకరణం అని చెప్తారు. సూరివ్రాతలనుబట్టి బాలవ్యాకరణం బాలురకొఱకయి చేయబడినదే అని చెప్పాలి.

కాని ప్రౌఢవ్యాకరణం అలా కాదు. తమగ్రంథాన్ని గురించి ఆచార్యులుగారు 'విశేషప్రయోగముల నేర్చి కూర్చి త్రిలింగలక్షణశేషం బనునొకయపూర్వవ్యాకరణము దీని వ్రాసితిని. ఇందలిలక్షణము లసాధారణములు.ఇయ్యది విద్యార్థుల కత్యంతోపకారకము' అని పేర్కొన్నారు. ప్రౌఢవ్యాకరణం కూడా విద్యార్థులకొఱకు వ్రాయబడిందే.ఇందలిలక్షణాలు అసాధారణాలు. విశేషాలూ, అపూర్వాలూ కావడంచేత విషయగతప్రౌఢివల్ల ప్రౌఢవ్యాకరణం అయిం దన్నమాట.

బాలవ్యాకరణానికి తరువాతిగ్రంథం అనేఅర్థాన్ని స్ఫురింపజేస్తూ భాషాసాధారణలక్షణాన్ని (బాలవ్యాకరణంద్వారా) తెలుసుకున్నతరువాత అసాధారణ మైన విశేషలక్షణాన్ని తెలుపుతూ, ప్రౌఢ మైన ఈవ్యాకరణం మూలంగా భాషాస్వరూపం సమగ్రంగా తెలిసి విద్యార్థులు ప్రౌఢు లవుతారని గూడా గ్రంథకర్త తలపు కావచ్చు.

ప్రౌఢ మైనవ్యాకరణం కాబట్టి ఇది ప్రౌఢవ్యాకరణ మని ఈగ్రంథకర్త వచనాలనుబట్టి ఊహింపవచ్చు.

**సార్థక్యం :**

రచనాప్రణాళిక, సూత్రనిర్మాణచాతుర్యం మొద లైలక్షణాలనుబట్టి ప్రౌఢవ్యాకరణంకంటే బాలవ్యాకరణమే ప్రౌఢం అని చెప్పడంలో తప్పు లేదు. అయినా-

**రచనాలక్ష్యం :**

బాలవ్యాకర్త అది బాలురకు సుసాధంగా ఉండేవిధంగా కూర్చాడు. ప్రౌఢవ్యాకరణం అటువంటి ఉద్దేశంతో రచింపపబడింది కాదు. అసాధారణమూ, విశేషమూ ఐనలక్షణం చెప్పబూనింది.

**లక్షణం అసాధారణం :**

భాషాసాధారణలక్షణం తెలిసినవాడికే విశేషలక్షణం తెలియజేయాలి. పూర్వ వ్యాకరణాల చేత ఆంధ్రభాషాసామాన్యలక్షణం తెలిసినవారికి విశేషాలు చెప్పడానికి పూనుకుంది. కాబట్టి ఇందులో విషయం ప్రౌఢం అవుతున్నది.

**అరుదయినప్రయోగాలు :**

విశేషప్రయోగాలను గుర్తించి ఇందులో లక్షణం చేయబడింది. విశేషప్రయోగాలు వెదకి చూపినది కాబట్టి ఇది ప్రౌఢం. ఉదా. బాలవ్యాకరణం ముత్తియశబ్దంలో మాత్రం ఇత్వలోపం చెప్పగా ప్రౌఢవ్యాకరణం 'ముత్తియశబ్దేతరంబులయందును దఱుచుగ నిత్వలోపంబు చూపట్టెడి' అన్నది. ముత్తియేతరము లైనఏయేశబ్దాలలో ఈకార్యం అవుతున్నది అన్నది ఇక్కడ ప్రయోగానుగుణంగా మాత్రమే గుర్తింపవలసిఉన్నది.

మిశ్రద్వంద్వం, అజడంబు తృతీయకు నవర్ణకం మొద లైనకొన్నిలక్షణాలకు లభ్య మైనది ఒక్కొక్క ప్రయోగమే.

కవిప్రయోగాలలో మూలమూలలలో ఉన్న ఇలాంటి విశేషాలను గూడా తెలియజేస్తున్నఈవ్యాకరణం ప్రతిపాదించేలక్షణం తత్కర్త పేర్కొన్నట్లుగా అసాధారణమే. ఇలాటిఅసాధారణవిషయాలు కలిగిన ఈగ్రంథం ప్రౌఢమే.

**వాక్యప్రకరణము :**

'వాక్యపరిచ్ఛేదము' అనేది ఇందులో అపూర్వంగా ప్రవేశించినవిభాగం. పదవాక్యగతవిశేషాలు అన్వయవిశేషాలు మొద లైనవి ఇందులో చేర్పబడ్డాయి. ఇలాటివిషయాలు పూర్వవ్యాకరణాలలో ప్రత్యేకంగా ప్రస్తావింపబడలేదు.

ఇలా ఈవ్యాకరణం తత్కర్త పేర్కొన్నట్లు అపూర్వలక్షణాలతో ఆంధ్రభాషలోని సాధారణస్థితులను స్పష్టం చేస్తూ విషయగత మైనప్రౌఢిమూలంగా ప్రౌఢ మయిన వ్యాకరణం అయి ప్రౌఢవ్యాకరణం అనేపేరు సార్థకం చేసికొన్న దని చెప్పవచ్చు.

## 8. 'త్రిలింగలక్షణశేషము' నామసార్థక్యం గురించి వివరించండి.

పీఠికలోనూ, పరిచ్ఛేదాంతగద్యలలోనూ "త్రిలింగలక్షణశేషము"గా తనవ్యాకరణాన్ని సీతారామాచార్యులుగారు పేర్కొన్నారు. ముఖపత్రంలో త్రిలింగలక్షణశేషము అను ప్రౌఢవ్యాకరణము' అని పేర్కొనబడింది. చివరిలో (గ్రంథముద్రణంనాఁటికి )'ప్రౌఢవ్యాకరణం' అనేపేరుమీద గూడా దృష్టి ఏర్పడినా గ్రంథకర్త మొదటినుంచీ తన ఈగ్రంథానికి 'త్రిలింగలక్షణశేషము' అనేపేరే ఉద్దేశించా డని పీఠికాదులనుబట్టి నిశ్చయంగా చెప్పవచ్చు.

త్రిలింగం అంటే తెలుగు. శేషం అంటే చెప్పగా మిగిలింది. అంటే తనకు పూర్వం (తెలుఁగు) వ్యాకరణాలలో చెప్పగా మిగిలిఉన్నభాషాలక్షణం త్రిలింగలక్షణశేషం.

'త్రిలింగలక్షణం' అనేపేరుతో తెలుఁగులో ఈత్రిలింగలక్షణశేషానికి ముందు ఒకవ్యాకరణం కనబడదు. రావిపాటి గురుమూర్తి శాస్త్రి 'తెలుగువ్యాకరణం' ఉన్నది. అదే 'త్రిలింగలక్షణం' అని చెప్పడానికి ప్రౌఢవ్యాకరణంలోని అంతర్విషయాలు సహకరించవు.

కాగా ఈప్రౌఢవ్యాకరణం అంతకు పూర్వం ఉన్న ఏదో ఒకతెలుఁగువ్యాకరణానికి మాత్రమే శేషం అనడానికి వీలు లేదు. ముం దున్న తెలుగువ్యాకరణాలలోని త్రిలింగలక్షణం మొత్తానికి శేషం ఈత్రిలింగలక్షణశేషం.

**సార్థక్యం :**

ఇంతటిపేరు ఈవ్యాకరణానికి తగ దేమో అని కొందఱు అనుమానిస్తున్నారు. ఇది ఎంతవరకు సార్థకం అనడానికి గ్రంథకర్తవచనాల్లో ఆధారాలు చూద్దాం.

**ఆధారాలు :**

'తుద కిప్పుడు తద్భారతాదిగ్రంథపరిశోధనంబుచే దొరకినవిశేషలక్షణప్రయోగముల నేర్చి కూర్చి త్రిలింగలక్షణశేష మనునొకయపూర్వవ్యాకరణము దీని వ్రాసితిని. ఇందలిలక్షణము లసాధారణములు-' అని గ్రంథకర్త పీఠికలో పేర్కొన్నాడు.

**1. అపూర్వవ్యాకరణం :**

క్త్వార్థ మయినయిత్తుకు సంధి లేకపోవడం ఈభాషకు సాధారణలక్షణం. 'ఇప్రత్యయాంతావ్యయంబునకు సంధియుఁ జూపట్ట'టం అసాధారణం. భాషలోని ఇలాటి అసాధారణలక్షణాలను పేర్కొనడంచేత ఇందలి లక్షణాలు అసాధారణాలు. అనడం ఉచితమే.

పూర్వవ్యాకరణాలు భాషాసాధారణలక్షణాలను చెప్తుండగా తద్భిన్నంగా అసాధారణాలు చెప్తూ అపూర్వవ్యాకరణం అవుతున్నది. అంటే సాధారణలక్షణాలు చెప్పేపూర్వాంధ్ర వ్యాకరణాల కిది శేషం అన్నమాట.

కాబట్టి పూర్వవ్యాకరణనిరపేక్షంగా ఇందులో లక్షణం సరిగా తెలియదు. అసాధారణలక్షణం తెలియడానికి ముందు భాషాసామాన్యలక్షణం తెలియాలి కదా.

ప్రౌఢవ్యాకర్త 'అక ప్రత్యయాంతావ్యయంబు కళయ' అన్నాడు. అంతకు ముందు కొందరు వ్యాకర్తలు ఇది ద్రుతప్రకృతికం కూడా అవుతుందనడం తెలిస్తే కానీ ఈలక్షణం ఆరంభించడానికి మూలం తెలియదు. ఇలా పూర్వాంధ్రవ్యాకరణాలు చదివి అందులో లోటుపాట్లను ప్రౌఢవ్యాకరణంతో సరి చేసుకోవాలి. ఇలా ఇది పూర్వం రచింపబడిన త్రిలింగలక్షణాలకు (తెలుగువ్యాకరణాలకు) అన్నింటికీ శేషమే అవుతున్నది.

**2. బాలవ్యాకరణానికి మాత్రమే శేషమా?**

ప్రౌఢవ్యాకరణం అనేపేరునుబట్టి కావచ్చు, ఇది బాలవ్యాకరణానికి శేషగ్రంథంగా పేర్కొంటారు. కాని బాలవ్యాకరణానికి ఒక్కదానికె శేషంగా చెప్పాలనుకుంటే, 'త్రిలింగలక్షణశేషం' అనేపేరు పెడతాడా? త్రిలింగలక్షణం అంటే బాలవ్యాకరణం ఒక్కటే కాదు గదా. ఇంకా ప్రౌఢవ్యాకర్త తనగ్రంథంలో సూరిపేరును గానీ, బాలవ్యాకరణాన్ని గానీ స్పష్టంగా పేర్కొననేలేదు. 'బాలవ్యాకరణశేషమే' వ్రాయదలిస్తే అలా చెప్పకుండా ఉంటాడా?

కజ్వంతం, నుజ్వంతం అని కాక అక-ప్రత్యయాంతం అన్-ప్రత్యయాంతం అనే తీరుగా వ్యవహరించడం మొద లైనకారణాలనుబట్టి ఇది బాలవ్యాకరణాని కొక్కదానికే శేషం అనడానికి వీలు లేదు.

'తద్భవములందును నలఘురేఫము గలదు'. 'నెన్నడాదులన్ నెఱి దగు' మొ. పెక్కువిధానాలు బాలవ్యాకరణాన్ని ఉద్దేశించే చెప్పబడిన వనడం స్పష్యం. బాలవ్యాకరణం కూడా ఒకత్రిలింగలక్షణమే కాబట్టీ, ప్రసిద్ధం గూడా కాబట్టీ, దానికి శేషంగా వివరణా ద్యాత్మకలక్షణాలు ప్రౌఢవ్యాకరణంలో (అధికంగా) ఉండడంలో వింత లేదు. కాగా ఇది బాలవ్యాకరణానికి గూడా శేషమే కాని బాలవ్యాకరణానికి మాత్రమే శేషం అనడానికి లేదు.

**3. చింతామణిశేషం :**

బాలవ్యాకరణంలో సర్వనామప్రక్రియ చెప్పబడలేదు. ప్రౌఢవ్యాకరణం చెప్పింది. కాని చింతామణిలో చెప్పబడిన నీనాతాశబ్దాలప్రక్రియ ప్రౌఢవ్యాకర్త విడిచిపెట్టాడు. 'ఊరు చోటు మేన్వాదు లున్లుగ్విషయంబులు' అన్నపుడు 'కేషాంచిత్..' అనేచింతామణిలక్షణంచేతనే ఉన్లోపం అవుతుం దని ప్రౌఢవ్యాకర్త వివరించాడు. ఇలాటి చింతామణి వివరణలు ఇందులో ఇంకా ఉన్నాయి. ఇటువంటికారణాలనుబట్టి ప్రౌఢవ్యాకరణం చింతామణికి శేషం అవుతుంది.

**4. త్రిలింగలక్షణా లన్నింటికీ శేషమే :**

చింతామణి బాలవ్యాకరణాలకే కాదు, అంతకు పూర్వం ఉన్న త్రిలింగలక్షణాలకు అన్నింటికీ ప్రౌఢవ్యాకరణం శేషమే.

'దీర్ఘ స్స్యాద్ వర్ణనిర్దేశే' అన్నది వికృతివివేకం.'విధానోచ్చారణముల' నధికంగా చేర్చి ప్రౌఢవ్యాకర్త ఆలక్షణాన్ని తెలుగు చేశాడు.

'పురమునందలివా రని పొసఁగఁ బలుకునెడ పురంబున వా రని ఇడగవచ్చు' అని కవిసంశయవిచ్ఛేదం. 'సప్తమీతత్పురుషమునందు నవర్ణకంబు నగు' అనిప్రౌఢవ్యాకర్త లక్షణం.

'రాహువు బాహువు తరు వనంగ రాహు బాహు తరు వన రాజభూష' అని సర్వలక్షణసారసంగ్రహంలోనూ, ఆంధ్రకౌముదిలోనూ చెప్పబడింది.ప్రౌఢవ్యాకర్త లక్ష్యాను గుణంగా ఈలక్షణాన్ని 'రాహు, బాహుశబ్దాలకే పరిమితం చేశాడు.

ఇలా ఇతరపూర్వవ్యాకరణాలనుంచి కూడ గ్రహింపవచ్చు.

300 పైగా సూత్రాలు ఉన్న ప్రౌఢవ్యాకరణంలో ఆమ్రేడితస్థలాలు, అన్వయవిశేషాలు, మొదలైన అనేకాంశాలను చెప్పేసూత్రాలు అంటే సగం గ్రంథం ప్రౌఢవ్యాకర్త స్వతంత్రంగా చెప్పిందే అనవచ్చు.

కొన్ని అంశాలు పూర్వవ్యాకర్తలు చెప్పినవిగానే తోచినా, అక్కడ అభిప్రాయభేదాలను పరిష్కరిస్తూ ఉచితపక్షాన్ని నిర్ధారించడంచేత అలాటిలక్షణాలు (పూర్వవ్యాకరణాలలో చెప్పబడినట్లు తోచినా) అవి యథాతథానువాదాలు కాక వివరణాద్యాత్మకాలు ఐ ఉండడం గుర్తిస్తే ఇది వాటికీ శేషగ్రంథమే అని తెలియవచ్చు.

కాగా త్రిలింగలక్షణం ఏర్పరచడంలో ప్రౌఢవ్యాకర్త మరి కొంత జాగ్రత్త తీసుకుని ఉంటే ఈనామం ఇంకా దృఢంగా కుదిరేదే కాని, ప్రస్తుతలక్షణంతో గూడా ఈగ్రంథానికి 'త్రిలింగలక్షణశేషం' అనేపేరు చాలవరకు సార్థకమే.

## 9. ప్రౌఢవ్యాకరణం బాలవ్యాకరణానికి శేషగ్రంథం- నిరూపించండి.

**ప్రౌఢవ్యాకరణం :**

'త్రిలింగలక్షణశేషము అనుప్రౌఢవ్యాకరణము' అని సీతారామాచార్యులుగారు తమ వ్యాకరణానికి ప్రౌఢవ్యాకరణం అనేపేరు ముఖపత్రంమీద ఉంచారు. ఈపేరు గ్రంథాంతర్భాగంలో కనబడదు. ప్రౌఢవ్యాకరణం అనేపేరుపై మక్కువ ఈవ్యాకర్తకు తరువాత కలిగింది.

కాని ప్రౌఢవ్యాకరణం అనేపేరు బాలవ్యాకరణాన్ని స్మరింపజేస్తుంది. ఈపేరు బాలవ్యాకరణాన్ని మించింది, దానికి తరువాతి గ్రంథం, దానికి పై గ్రంథం అనేఅభిప్రాయాన్ని గల్గిస్తుంది. అందుకే ప్రౌఢవ్యాకరణం అనేపేరు గ్రంథకర్త తరువాత తగిలించా డేమొ. ప్రౌఢవ్యాకరణం అనేపేరె ప్రచారంలోకి రావడానికి గానీ, ఇది బాలవ్యాకరణశేషం అనేఉద్దేశం కలగడానికి గానీ బాలవ్యాకరణానికి ఉన్న ప్రసిద్ధి కారణం కావచ్చు.

**బాలవ్యాకరణశేషం :**

గ్రంథకర్త తఱుచుగా ప్రస్తావించిన 'త్రిలింగలక్షణశేషము' అనేపేరునుబట్టి ఇది బాలవ్యాకరణానికి కూడా శేషం అవుతుంది. బాలవ్యాకరణమూ త్రిలింగలక్షణమే కదా. ప్రచారంలో ఉండి ప్రసిద్ధం కావడమూ, చింతామణిప్రభావం గలిగిఉండడమూ అనేవాటిని బట్టికూడా బాలవ్యాకరణాన్ని ఉద్దేశించే ఇందులో పెక్కులక్షణాలు చేయబడినాయి అని తోస్తుంది. అందువల్లనే చింతామణ్యాదులు ఇతరాంధ్ర వ్యాకరణశిష్టా లయినలక్షణాలు గూడ ఇందులో చెప్పబడినా ఆధిక్యం, స్పష్ట మైన సంబంధం అనుసరించి ఇది బాలవ్యాకరణ శేషం అనేఅభిప్రాయం ప్రబలింది.

ఇందలి లక్షణానికి బాలవ్యాకరణంతో ఉన్నసంబంధం ఇలా గమనింపవచ్చు.

**. 1. వివరణాత్మకాలు:**

బాలవ్యాకరణంలో ఆయాలక్షణాల అభిప్రాయం అక్కడ స్పష్టంగా లేక, సందేహం కలుగుతుం దని నని తలచినచోట సూరిసూత్రాలచేత సిద్ధించే అర్థాన్నే స్పష్టం చేస్తూ ప్రౌఢవ్యాకరణం వివరణాత్మకాలు అయినలక్షణాలు చేసింది.

'ఉండిశబ్దము పరం బగునపుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికంబుగ నగు' అని బాలవ్యాకరణం. ఇక్కడ 'సప్తమి' అని సామాన్యంగా చెప్పటంచేత సప్తమీవిభక్తు లయిన 'అందు-న' ప్రత్యయాలు రెండూ లక్షణసిద్ధం అవుతున్నాయి. 'సంప్రదానంబునకుం జతుర్థి యగు' అనేచోట చతుర్థు లయిన కొఱకు-కయి అనేవి రెండూ అవుతునే ఉన్నాయి కదా. సూరి 'వనమందుండి వచ్చె' అని అందు ప్రత్యయం ఒక్కటే ఉదాహరించాడు. సూరి ఉదాహరింపని కారణంగా సప్తమే అయినా 'న' వర్ణకం రా దని సందేహిస్తా రేమొ అని శంకించుకొని ప్రౌఢవ్యాకరణం 'ఉండిపదంబు పరం బగుచో వలన కందువర్ణక మట్లు నవర్ణకంబు నగు' అన్నది. ఇది బాలవ్యాకరణసిద్ధమె కాబట్టి దానిఅభిప్రాయాన్ని ఈలక్షణం వివరిస్తున్న దని తెలియవచ్చు. ఈసూత్రంలోని 'అందువర్ణక మట్లు' అనేదళం బాలవ్యాకరణోదాహృతిని పరామర్శిస్తూ బాలవ్యాకరణాన్ని ఉద్దేశించే చెప్పబడినట్లు స్పష్టం చేస్తుంది. ఇలాటివి ప్రౌఢవ్యాకరణానికి బాలవ్యాకరణంతో గలసన్నిహిత సంబంధాన్ని నిరూపిస్తాయి.

'ఓశబ్దము సంబోధ్యవాచకమునకు ముందే ప్రయోగింపఁబడు' అని చెప్పినసూరి వచనంలోని 'ముందే' అనేమాటలో అవ్యవహితం కావాలేమొ అని సందేహం కలుగుతుండగా 'ఓశబ్దం బొక్కచో సంబోధ్యవాచకమునకు ముం దితరశబ్దవ్యవహితం బయి కానంబడియెడి' అనే ప్రౌఢవ్యాకరణలక్షణం దానిని వారిస్తున్నది.

'నకారం బసాధారణంబు ద్రుతంబు' అనే ప్రౌఢ, సూత్రమూ, దాని వివరణమూ బాలవ్యాకరణంలో ద్రుతప్రకృతికాలను అక్కడక్కడ సాధించి ఉదాహరించిన సూరి అభిప్రాయాలను ఒకచోటికి తెచ్చి చెప్తూ, బాలవ్యాకరణానికి ఈలక్షణం వివరణాత్మకం అవుతున్నది.

'ఒకానొకచో ద్వంద్వంబునం బూర్వపదంబు క్లీబసమం బగు' అనేప్రౌఢ. లక్షణం "ఆచ్ఛికశబ్దంబుతోడ స్త్రీసమంబు ప్రాయికంబుగ ద్వంద్వం బగు" అనేబాలవ్యాకరణ లక్షణంలోని ప్రాయిక శబ్దానికి వివరణమె.

**2. సవరణలు :**

బాలవ్యాకరణంలోని అభిప్రాయం కవిప్రయోగాదులకు భిన్నంగా కనబడినచోట్ల లక్ష్యానుగుణంగా ప్రౌఢవ్యాకరణం దానిని సవరించింది.

'విను మనియె – ఇచ్చట నచ్చు పరం బయినది కాబట్టి లోపము లేదు' అనేబాలవ్యాకరణలక్షణాన్ని సవరిస్తూ 'మధ్యమ పురుషమువర్ణకంబున కచ్చు పరంబగునపుడును లోపంబు చూపట్టెడి' అని ప్రౌఢవ్యాకరణం పేర్కొన్నది. (న ప్రాణే తు కదాచన' అని అధర్వణుడు కూడా నలాగే చెప్పాడు.) ఇక్కడి 'అచ్చు పరంబగు నపుడును' అనేదళం బాలవ్యాకరణాన్ని యుద్దేశించి చెప్పడాన్ని సూచిస్తుంది.

'ఇయలోని ఇకారమునకు కొందరులోపము చెప్పిరి గాని అది కవిప్రయోగములందు మృగ్య' మనీ "ముత్తియశబ్దమునందు మాత్ర మిత్వలోపంబు గానంబడియెడి" అనీ బాలవ్యాకరణం పేర్కొన్నది. 'ముత్తియశబ్దేతరంబులయందును దఱుచుగ నిత్వలోపంబు గానంబడియెడి' అని ప్రౌఢవ్యాకరణం ఆఅభిప్రాయాన్ని సవరించింది. ఇందలి 'ముత్తియశబ్దేతరంబులయందును (తఱుచుగ కానంబడియెడి) అనేదళం ఈలక్షణం బాలవ్యాకరణాన్ని ఉద్దేశించే చెప్పబడిం దని స్పష్టం చేస్తున్నది.

'బహువ్రీహిని స్త్రీవాచ్యం బగుచో నుపమానంబు మీఁది మేనునకు బోఁడి యగు' అని బాలవ్యాకరణం. 'అలరుబోఁడీత్యాదు లుపమానపూర్వ పదకర్మధారయంబులు' అని ప్రౌఢ వ్యాకరణం సవరణం. ఇట అలరు+మేను అనేబాలవ్యాకరణప్రక్రియనుగూడ అలరు+పోఁడి అనేతీరుగా ప్రౌఢవ్యాకరణం సవరించింది.

'అలఘురేఫము తత్సమతద్భవములందు లే' దని బాలవ్యాకరణం. 'తద్భవంబులందును నలఘురేఫము గల' దని ప్రౌఢవ్యాకరణం సవరణం.

'విశ్వకర్మాదులకు స్త్రీత్వం బగు' అని బాలవ్యాకరణం. 'విశ్వకర్ముఁ డనియు రూపంబు' అని ప్రౌఢవ్యాకరణం సవరణం.

ఇట్లె కపిలగడ్డము, ప్రాణగొడ్డము మొద లయినవాటివిషయంలో ప్రౌఢవ్యాకరణం బాలవ్యాకరణాభిప్రాయాన్ని సవరించింది.

**3. పూరణలు :**

బాలవ్యాకరణంలో ప్రతిపాదింపబడిన లక్షణాన్ని ఆమోదిస్తూ దానికి సంబంధించిన విశేషాంశాలను పేర్కొంటూ, ఆలక్షణాన్ని సమగ్రపఱచటం ప్రౌఢవ్యాకరణంలో కొన్ని చోట్ల కనబడుతుంది.

లెమ్ము+లెమ్ము అని ఉండగా 'ఆమ్రేడితంబు పరం బగునపుడు మధ్యమము డుజులకు లోపంబు విభాష నగు' అనేబాలవ్యాకరణలక్షణంచేత 'ము' లోపించి లెలెమ్ము – అని అవుతుంది. 'లేలెమ్ము' అని కావలసినరూపం బాలవ్యాకరణంలో అసమగ్రంగ నిలిచిపోయింది. 'ఆమ్రేడితంబు పరం బగునపుడు కృతహ్రస్వంబునకు దీర్ఘం బగు' అనేలక్షణంచేత ప్రౌఢవ్యాకరణం దానిని పూరించింది.

'షష్ఠీసమాసమునం దుకారఋకారముల కచ్చు పరం బగునపుడు నుగాగమం బగు' అని బాలవ్యాకరణం చెప్పిననుగాగమాన్ని అంగీకరిస్తూనే ప్రౌఢవ్యాకరణం 'కొన్నిచోట్ల షష్ఠీసమాసంబునం దుకారంబున కచ్చు పరం బగునపుడు నుగాగమంబునకు లోపం బగు' అని దానికి క్వాచిత్కంగా లోపం చెప్పింది. నుగాగమం రా దనకుండా (వచ్చి) లోపిస్తుం దనడంచేత ఈ ప్రౌఢవ్యాకరణలక్షణం బాలవ్యాకరణానికి పూరక మనవచ్చు.

ఇలాగే కంటె –అందు పరకనగాగమం, శత్రర్థ 'చు' పరకపత్వం మొద లయినగువిధులు బాలవ్యాకరణానికి పూరణలుగా చెప్తారు.

బాలవ్యాకరణంలో సర్వనామరూపాలకు పట్టిక ఇవ్వబడింది. ప్రౌఢవ్యాకరణం వాటిప్రక్రియ నిరూపించింది. ఇలాటివి పూరణలు.

**4. విశేషలక్షణం :**

బాలవ్యాకరణం స్పృశింపని అనేక మైనఅంశాలు ప్రౌఢవ్యాకరణం చెప్తున్నది. విశేషణాలు, జాత్యేకవచనాదులు, ద్విరుక్తిస్థలాలు, వాక్యప్రకరణం మొద లైనవి ఇలాటివి.

ఇలా బాలవ్యాకరణానికి వివరణాద్యాత్మకంగా ప్రౌఢవ్యాకరణం బాలవ్యాకరణానికి శేషగ్రంథం అని పేర్కొనదగిన విధంగా మిక్కిలి సన్నిహితసంబంధంతో రచింపబడింది.

**డాక్టర్. అంబడిపూడి నాగభూషణం**

**పాఠం - 13**

# తెలుగులో ఛందో గ్రంథాలు

## 13.1. ఛందస్సు ఆవిర్భావం :

**ఆచార్య నేతి అనంతరామశాస్త్రి**

అపౌరుషేయములయిన వేదాలు ఛందోబద్ధములగుటచేతను వేదాంగముల యందు 'ఛందస్సు' పరమ ప్రయోజనకారి అవటంచేతను ఛందశ్శాస్త్రప్రయోక్త కూడా పరమేశ్వరుడనియే లాక్షణికుల విశ్వాసం. వ్యాకరణం శాస్త్రంవలె ఛందశ్శాస్త్రం కూడా పరమ శివుని నుండి గురుపరంపరాగతంగా వ్యాప్తిలోనికి వచ్చిందని తెలుస్తున్నది. సాహిత్య రత్నాకరంలో -

"ఛందోజ్ఞాన మిదం పురా త్రిణయనా ల్లేభే శుభం నందిరాట్

తస్మాత్ప్రాప సనత్కుమారక తతోగస్త్యస్తతోవాక్పతిః

తస్మాద్దేవపతి స్తతః ఫణిపతి స్తస్యానుజః పింగళ

స్తచ్ఛిష్యైర్మునిభి ర్మహాత్మభి రిదం భూమౌ ప్రతిష్ఠాపితమ్"

అనిచెప్పటాన్ని బట్టి ఛందస్సు యొక్క సృష్టికర్త త్రినేత్రుడని తెలుస్తున్నది. ఆ మహేశ్వరుని నుండి నందికేశ్వరుడు, సనత్కుమారుడు, అగస్త్యుడు, బృహస్పతి, ఇంద్రుడు, ఆదిశేషుడు, పింగళుడు, వరుసగా ఒకరి నుండి మరొకరు ఛందోవిద్యను పొంది భూలోకంలోకి ప్రచారం చేసినట్లు తెలుస్తున్నది. భూలోకంలోకి ప్రచారానికి తెచ్చిన ఛందోవేత్తల్లో 'పింగళుడు' చివరివాడు. ఈతని ఛందశ్శాస్త్రానికి పింగళ ఛందమని పేరు. మనకు లభిస్తున్న సంస్కృత ఛందో గ్రంథాలయందు ఇదియే ప్రాచీనమైంది. ఇది వైదిక వాఙ్మయ ఛందస్సు, ఇది లౌకిక వాఙ్మయ ఛందస్సు అని చెప్పబడింది.

### 13.1.2 ఛందస్సు - నిర్వచనము

ఛందస్సు - అనే యీ శబ్దానికి అనేక నిర్వచనాలున్నాయి

(1) 'ఛందస్' - అనే సంస్కృత శబ్దం 'ఛది ఆహ్లాదనే' అనే ధాతువు నుండి ఏర్పడింది. అంటే ఆహ్లాద ప్రదమైన లయ విశేషమే ఛందస్సు అని అర్థం.

2. **'ఛది సంవరణే** - అని భట్టోజీ దీక్షితుని నిర్వచనం. ఇక్కడ సంవరణం అంటే చక్కగా ఆవరించుట అని అర్థం.

3. ఇచ్ఛచేత ఉద్భవించే వాక్యసముదాయం ఒకానొక విలక్షణమైన నిర్మాణాన్ని పొంది 'ఛందస్సు' అయిందని ఒక అభిప్రాయం.

4. **'ఛందాసి ఛాదనాత్'** - యాస్కముని నిర్వచనము. ఇక్కడ ఛాదకమంటే ఆచ్ఛాదకమని అర్థం. ఆచ్ఛాదకమంటే కప్పటం అని అర్థం. ఇచ్ఛచేత బహిర్గతములయిన వాగ్భావాలను సంపూర్ణంగా కప్పిఉంచేది ఛందస్సు అని అర్థం. గణ-పాద-యతి-ప్రాసాదులతో చక్కని ఆవరణ కలిగి ఉండటాన్ని ఛందము అంటారు.

### 13.1.3. ఛందస్సు - సంస్కృతచ్ఛాయ :

సంస్కృత భాషా సాహిత్యచ్ఛాయలలో దేశభాషా సాహిత్యాలు అభివృద్ధి చెందాయి. ఈ కారణంచేత ఛందస్సు - వ్యాకరణం - అలంకారం ఆదిగాగల శాస్త్రాలు తెలుగులోకి సంస్కృతం నుండి అనువర్తింపబడ్డాయి. శాస్త్ర సంబంధమైన సంజ్ఞా (Technical terms) పదాలు సంస్కృతం నుండి యథాతథంగా గ్రహింపబడ్డాయి.

**13.1.4. ఆంధ్రవాఙ్మయము - ఛందస్సు :**

ఆంధ్రవాఙ్మయ ఆరంభదశను పరిశీలిస్తే గేయాత్మకమైన రచనలు వెలువడ్డాయి. తర్వాత పద్య కవిత్వం అవతరించినట్లు తెలుస్తున్నది. గేయకవిత్వం దేశిఛందమని, పద్యకవిత్వం మార్గఛందమని వ్యవహారము. తెలుగులో దేశిఛందో జాతమయిన రచనలు వెలువడుచున్నప్పటికీ సంస్కృత ప్రభావంతో తెలుగు కవులు మార్గ ఛందస్సును చేపట్టారు. తెలుగులోని ఛందము సంస్కృత ఛందమును అనుసరించినదే అయినప్పటికీ కొంతప్రత్యేకతను వైలక్షణ్యమును కలిగి ఉంది. ఇందులోని అక్షరగణాలు, వృత్తాలు, సంస్కృత ఛందము నుండి గ్రహింపబడ్డవి. సంస్కృతంలో లేని అక్కరాదిజాతులు, సీసము, ఆటవెలది, తేటగీతి మొదలైన ఉపజాతులు, యతి, ప్రాసములు దేశీయములు. ఇందులోని అక్కరలు మున్నగునవి కర్ణాటక భాషా సాంప్రదాయానికి చెందినవి. సంస్కృతంలో యతి ప్రాసలు లేవు. కన్నడభాషలో ప్రాస ఉంది. తమిళంలో యతిప్రాసలున్నాయి. ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన తెలుగు, సంస్కృత, ద్రావిడ ఛ్ఛందస్సంప్రదాయాల రెంటిని పాటించింది.

తెలుగు భాషలో పద్యరచన క్రీ.శ. 9వ శతాబ్ది నుండి ఉందని పద్యమయశాసనం ద్వారా తెలుస్తున్నది. పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రలో

'జాతులు మాత్రాను సంధాన గణవి
నీతులు గాన అనియత గణైః" - అని

'ప్రాసోవా' - అని; 'యతిర్వా' అని, 'ఛందో వినిహితోక్తి గాన' అని ద్విపద ప్రాసయతికి ఆధారంగా చెప్పబడింది. అందుచేత సోమనకు పూర్వమే సంస్కృతభాషలో ఆంధ్రఛందశ్శాస్త్రము ఒకటి రచింపబడి ఉంటుందని తెలుస్తున్నది. తమిళ భాషలో 11వ శతాబ్దంలో వెలసిన "యాప్పి రుంగులము" అను ఛందోగ్రంథంలో ఇతర భాషలలో వచ్చిన ఛందో గ్రంథాలను గురించి చెప్పే సందర్భంలో 'వాంచియర్ శెయిద వడుగ ఛందము' పేర్కొనబడింది. అంటే వాంచియ రచించిన తెలుగు ఛందమని దాని అర్థం.

నన్నయ నాటి నుండి నేటి వరకు ఎన్నో ఛందోగ్రంథాలు పుట్టాయి. ఇందులో కొన్ని గ్రంథాలయందు ఛందస్సు మాత్రం చెప్పబడింది. మరికొన్ని గ్రంథాలయందు ఛందస్సు - వ్యాకరణం - అలంకారాలను సమిష్టిగా చెప్పబడ్డాయి.

తెలుగు ఛందస్సులో సాధారణంగా చెప్పే విషయవిభాగం ఇట్లా ఉంటుంది.

గణములు - వృత్తములు - జాతులు - యతులు - ప్రాసములు - గణాక్షర శుభాశుభఫలాలు మొదలగునవి. అయితే తెలుగులో ఛందో గ్రంథాలు ఎన్నో పుట్టాయి. కాని పెక్కులు నశించిపోయాయి. ఉన్నవానిలో సుమారు పది ఛందో గ్రంథాలు ముద్రితములై ప్రచారంలో ఉన్నాయి. వ్యాకరణాల్లో బాల వ్యాకరణం లాగా ఛందోగ్రంథాల్లో అప్పకవీయం ప్రామాణికమే, గాక మిక్కిలి ప్రచారం పొందింది.

**13.1.5. తెలుగులో వచ్చిన ఛందోగ్రంథాలు :**

తెలుగులో దాదాపు 41 ఛందో గ్రంథాలున్నాయి. ఇందులో 13 గ్రంథాలు మాత్రం ముద్రితాలు. కొన్నిటిలో ఇతర కవుల గ్రంథాల నుండి పద్యాలు ఉదాహరింపబడ్డాయి. విద్యార్థికి తెలుగులో వచ్చిన ఛందో గ్రంథాల వివరాలు తెలియజేయుట కోసం వీటిని చెప్పటం జరిగింది.

**1. ఆంధ్రశబ్ద చింతామణి :** (క్రీ.శ. 1022-63) ఇది సంస్కృత భాషలో రచింపబడినదని చెప్పబడు తెలుగు వ్యాకరణం. ఇందులో సంజ్ఞాపరిచ్ఛేదంలో ఐదు శ్లోకాలలో ఆంధ్రచ్ఛందో లక్షణాన్ని, సూత్రప్రాయంగా చెప్పటం జరిగింది. ఇది ముద్రితము. ఇది గాక నన్నయ 'లక్షణసారము' అనే ఛందస్సును కూడా రచించినట్లు రంగయ ఛందమువల్ల తెలుస్తున్నది. కాని అది అతని రచనకాదని పండితుల అభిప్రాయం. ఆ గ్రంథము అలభ్యము.

**2. కవిజనాశ్రయము :** (క్రీ.శ. 1080-1150) దీనికే భీమన ఛందమని ప్రసిద్ధి. దీన్ని వేములవాడ భీమకవి రచించాడు. ఇది రేచనకృతమని కొందరి అభిప్రాయం. తర్వాతి లక్షణ గ్రంథకారులు అందరూ భీమనను లాక్షనికునిగా స్తుతించటంచేత, భీమన ఛందమనియే దీన్ని పేర్కొనటంచేత కవిజనాశ్రయ గ్రంథాన్ని రేచనపేర భీమకవే రచించాడని భావించటం యుక్తము. ఇది ముద్రితము.

**3. కావ్యాలంకార చూడామణి :**(క్రీ.శ. 1402 - 1407) విన్నకోట పెద్దన దీన్ని రచించాడు. దీన్ని చాళుక్య విశ్వేశ్వరభూపతికి అంకితమివ్వడం జరిగింది. ఇది 9 ఉల్లాసముల గ్రంథము. ఇందులో కావ్యాలంకార ఛ్ఛందోవ్యాకరణ విషయాలు వివరింపబడ్డాయి. ఇందులోని 7, 8 ఉల్లాసాలు ఛందో లక్షణాల గూర్చి చెప్పబడ్డాయి. ఈ గ్రంథం ముద్రింపబడింది.

**4. లక్షణదీపిక :** (క్రీ.శ. 1385-1445) దీన్ని గౌరన రచించాడు. ఇందులో వర్ణ, గణ, మాత్ర కార్చనాది విషయాలున్నాయి. లక్షణము సంస్కృతంలో రచింపబడింది. తెలుగు ఛందముల నుండి పద్యాలు ఉదాహరింపబడ్డవి.

**5. ఛందోదర్పణము :** (క్రీ.శ. 1435) అనంతామాత్యుడు దీన్ని రచించాడు. ఇతడు 1. భోజరాజీయము; 2. ఛందో దర్పణము; 3. రసావర్ణవము అనే గ్రంథాల్ని రచించాడు. అనంతుని ఛందమని కూడా దీన్ని పిలుస్తారు. ఇందులో నాల్గు ఆశ్వాసాలున్నాయి. ఇందులో మొదటి ఆశ్వాసంలో : గద్య పద్య లక్షణాలు, గురు లఘు నిర్ణయం - గణాష్టక లక్షణాలు - ఇంద్ర చంద్రాది గణ భేదాలు - సంయుక్త వర్ణగణాలు - గణాధి దైవతములు - కృత్యాది వర్జనీయ గణాలు - అక్షరాలు - ప్రాసలు - అందలి భేదాలు - యతి సంజ్ఞలు - 24 యతుల లక్షణ - లక్ష్యములు - చెప్పబడ్డాయి. ప్రస్తుతం మనకున్న పాఠ్యభాగమిదియే - ఇది ముద్రితము.

ఇంతేగాక ద్వితీయాశ్వాసంలో 26 ఛందములు - లక్ష్యలక్షణ సమన్వయం - సమవృత్త - విషమ వృత్తభేదాలు - లయగ్రాహి - లయ విభాతి. లయ హారి త్రిభంగి - దండకం మొదలుగాగల విశేషాలను గూర్చి చెప్పటం జరిగింది. తృతీయ శ్వాసంలో - జాతులు - ఉపజాతులు - అక్కరలు - రగడలు షట్ప్రత్యయములు మొదలైన విషయములు చర్చింపబడింది. చతుర్థాశ్వాసంలో : దశదోషాలు - షట్పదులు - వ్యంజన సంధి - విసర్గసంధి - సమాసములు చెప్పబడింది.

**6. కవి గజాంకుశము :** (క్రీ.శ. 1410 - 1460) దీన్ని గౌరన పుత్రుడైన భైరవకవి రచించాడు. ఇందులో గణములు. వర్ణములు - వాని శుభలక్షణములను మాత్రం చెప్పబడింది.

**7. కవి సర్పగారుడము :** (క్రీ.శ. 1480-1530) కాచన బసవన దీన్ని రచించాడు. చిత్రకవి పెద్దన - అప్పకవి ఈతనిని పేర్కొనటం జరిగింది.

**8. కవి చింతామణి :** (క్రీ.శ. 1480 - 1520) వెల్లంకి తాతంభట్టుచే రచింపబడ్డ ప్రసిద్ధమైన లక్షణ గ్రంథమిది. ఇందులో భాషాలక్షణాధికారం, వర్ణనిర్ణయాధికారం, వళిప్రాసాదికారం, దోషాధికారం అనే నాల్గు అధికారాలున్నాయి.

**9. ఛందోదర్పణము :** దీన్ని కూడా వెల్లంకి తాతంబట్టే రచించాడు. అనంతుడు వ్రాసిన ఛందోదర్పణం వేరుగా ఉన్నది. దాన్ని గురించి పైన వివరించడం జరిగింది.

**10. లక్షణసార సంగ్రహము :** (క్రీ.శ. 1550) రచయిత చిత్రకవి పెద్దన. ఇందులో మూడాశ్వాసాలు ఉన్నాయి. మొదటి రెండాశ్వాసాల యందు ఛందో లక్షణాల గూర్చి చెప్పబడింది. మూడవ ఆశ్వాసంలో రేఫ అకార నిర్ణయము, నాటక లక్షణము - చిత్రకావ్య లక్షణము చెప్పబడింది. నాటక లక్షణాలను తెలుగులో వ్రాసిన మొదటికవి ఇతడే. పెద్దిరాజు ఛందమని దీనికి ప్రసిద్ధి. ఇది ముద్రితము.

**11. సులక్షణసారము :** (క్రీ.శ. 1560) లింగమగుంట తిమ్మన దీన్ని వ్రాశాడు. ఇది చాలాకాలంగా తాతంభట్టు కృతముగా ముద్రింపబడి ప్రచారంలో ఉంది. తరువాత రావూరి దొరస్వామిచే పరిష్కరింపబడి తిమ్మన కృతిగా 1950లో వావిళ్ళ వారిచే ప్రకటింప బడింది. అప్పకవి దీనిని ఉదాహరించాడు. గ్రంథాలయాల్లో వ్రాతప్రతులు కొన్ని ఈ ముద్రిత ప్రతికి భిన్నంగా ఉన్నవి. ఇది ముద్రితము.

**12. బాలబోధచ్ఛందము :** ఇది లింగమగుంట తిమ్మన రచించాడని కాలూరి ఆంజనేయ కవి తన సుకవి కర్ణామృతంలోచెప్పాడు. ఇందులో ప్రాచీన గ్రంథాలు అనేకం ఉదాహరింపబడినవి.

**13. లక్షణ మంజరి :** (క్రీ.శ. 1550) దీనికి గరళపురీ ఛందమని నామాంతరం కలదు. దీన్ని రచించింది నైషధము తిమ్మయ మంత్రి.

**14. కవిజన సంజీవని :** (క్రీ.శ. 1580 - 1650) కర్త ముద్దరాజు రామన. ఇందులో ఛందోవ్యాకరణాలు చెప్పబడ్డవి. నాల్గుతరంగాలున్నాయి. ప్రథమ తరంగంలో యతిప్రాసలక్షణాలు చెప్పబడ్డవి. ఇతని అన్న ముద్దరాజు పెద రామన పింగళిసూరన కృత రాఘవ పాండవీయానికి వ్యాఖ్యానం వ్రాశాడు. ఇది ముద్రితము.

**15. లక్షణ విలాసము :** (క్రీ.శ. 1600) దీనికి యతిప్రాసవిలాసమని మరొకపేరు కలదు. కర్త పెనుమర్తి వేంకటాచార్యుడు

**16. సుకవి కర్ణామృతము :** (క్రీ.శ. 1600) కర్తకొలురి ఆంజనేయకవి.

**17. సకల లక్షణసార సంగ్రహము :** (17వ శతాబ్ది) దీని రచయిత రత్నాకరం గోపాలకవి.

**18. లక్షణ దీపిక :** (క్రీ.శ. 1650) దీన్ని రచించింది వార్తా కవి రాఘవయ్య. ఛందస్సుకు సంబంధించిన అనేక విషయాల్ని విపులంగా తెల్పుతున్నది. ఇందులో ప్రాచీన గ్రంథాల నుండి లక్ష్యలక్షణాలు ఉదాహరింపబడినవి.

**19. అప్పకవీయము :** (క్రీ.శ. 1656) రచయిత కాకునూరి అప్పకవి. ఇది ఆంధ్రశబ్ద చింతామణికి విపుల వ్యాఖ్యాన రూపమైన పద్యాత్మక లక్షణ గ్రంథం. కవి 8 ఆశ్వాసాలుగా వ్రాయాలని తలంచినట్లు తెలుస్తున్నది. కాని 5 ఆశ్వాసాలు మాత్రమే లభ్యమవుతున్నది. అవి భాషా, వర్ణ, వళిప్రాస, పద్య, సంధి పరిచ్ఛేదాలు. ఇది వ్యాకరణ గ్రంథానికి అనువాదమైనప్పటికీ ఇందులోని 3,4 ఆశ్వాసాలు ఛందశ్శాస్త్రాన్ని సమగ్రంగాను, సవిస్తరంగాను బహులక్ష్య లక్షణాలతో వివరిస్తున్నది. కాబట్టి ఇది ఛందశ్శాస్త్రంగా ప్రసిద్ధి చెందింది. చింతామణి చెప్పిన ఛందో లక్షణాన్ని తెలియజేసే ఐదుసూత్రాల్ని ఆధారంగా చేసుకొని ఇందులో రెండు పరిచ్ఛేదాలుగా పద్యభేదాలు ప్రపంచింపబడ్డాయి. ఇందులో సుమారు 75 ప్రాచీన గ్రంథాల నుండి 300 పైగా పద్యాలు ఉదాహరింపబడినాయి. ఇది ముద్రితము.

**20. కవిసర్పగారుడము :**(17వ శతాబ్ది) దీన్ని రచించింది పట్టాభిరామకవి.

**21. సకల లక్షణసార సంగ్రహ చింతామణి :** (17వ శతాబ్ది) రచయిత ఉప్పులూరి వెంకటరెడ్డి. అప్పకవీయంలోని విషయాలే ఇందున్నవి.

**22. లక్షణ శిరోమణి :** (17వ శతాబ్ది) కర్త పొత్తపి వేంకటరమణకవి. ఇది నాల్గు ఆశ్వాసాలలో ఛందోలక్షణాన్ని సవిస్తరంగా వివరించిన ఉద్గ్రంథము. అప్పకవీయముతో సమానమైంది.

**23. సర్వలక్షణ శిరోమణి :** (క్రీ.శ. 1676) దీని రచయిత గణపవరపు వేంకటకవి. పది ఉల్లాసముల గ్రంథము. ఇందుకొన్ని మాత్రమే లభిస్తున్నవి. నాల్గు ఉల్లాసాల్లో ఛందో విషయముంది. ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాస కృతికర్త ఈతడే.

**24. ఆంధ్రప్రయోగ రత్నాకరము :** దీన్నికూడా గణపవరపు వేంకటకవే రచించాడు.

**25. లక్షణసారము :** (క్రీ.శ. 1690 - 1750) శుద్ధాంధ్ర రామాయణ కర్తయైన అడిదము బాలభాస్కర కవి దీన్ని రచించాడు. ఇతడు అడిదము సురకవి తండ్రి.

**26. సర్వలక్షణసార సంగ్రహము :** (క్రీ.శ. 1740) కర్త కూచిమంచి తిమ్మకవి. ఇందులో ఛందో వ్యాకరణ విషయాలు ప్రయోగ సహితంగా వివరింపబడ్డాయి. ప్రాచీన కావ్యాల నుండి అనేక లక్ష్యాలు ఇవ్వబడినవి. రెండవ ఆశ్వాసంలో ప్రాస - వళి ప్రకరణాలు ఉన్నాయి. ఇది ముద్రితము.

**27. వీరభూపాలీయము :** (క్రీ.శ. 1732-1759) వచన భారత కర్తయు, మైసూరు ప్రభువు అగు కళువె వీరరాజు పేర రచితము.

**28. కవితా లక్షణసారము :** (క్రీ.శ. 1710) కర్త ఓరుగంటి రామకవి.

**29. ఆనంద రంగరాట్ఛందము :** (క్రీ.శ. 1750) లక్షణ చూడామణి అని దీనికి నామాంతరముంది. కస్తూరి రంగకవి దీన్ని రచించాడు. ఫ్రెంచి దొరతనం వారి గవర్నరు డూప్లేవద్ద దుబాసిగా ఉన్న ఆనంద రంగపిళ్ళైకి ఆశ్రితుడు. ఆనంద రంగ పిళ్ళైకు ఈ కృతి అంకితము. ఇందులో నేడు లభింపని అనేక ప్రాచీన లక్ష్యలక్షణ గ్రంథాలు ఉదాహరింపబడ్డాయి. ఇది ముద్రితము.

**30. కవిదర్పణ ఛందము :** (క్రీ.శ. 1836) దీనికర్త ఫక్కి వెంకట నరసయ్య.

**31. సుకవి మనోరంజని :** (క్రీ.శ. 1850) దీన్ని రచించింది ఆంధ్ర లాక్షణిక చక్రవర్తి కూచిమంచి వెంకట్రామకవి. కూచిమంచి తిమ్మకవి ఈతని ప్రపితామహుడు. ఇది అప్పకవీయాన్ని ఖండిస్తూ వ్రాసిన ఛందో విమర్శ గ్రంథము.

**32. శ్రీ కృష్ణ భూపాలీయము :** (క్రీ.శ. 1799-1868) కర్త చంద్రకవి. మైసూరు ప్రభువైన కృష్ణ రాజేంద్రునికి అంకితంగా రచించాడు. ఇది ముద్రితము.

**33. ఛందో రత్నాకరము :** (క్రీ.శ. 1830 - 1880) రచయిత త్యాగరాజు మొదలి.

**34. ఛందశ్శాస్త్ర లక్షణసార సంగ్రహము :** (క్రీ.శ. 1860) కర్త పాపినేని వెంకటసామినాయుడు. ఇది ముద్రితము.

**35. ఛందో లక్షణము :** (క్రీ.శ. 1864-1939) కర్త శృంగార కవి సర్వారాయుడు.

**36. సరసాంధ్ర వృత్త రత్నాకరము :** దీనికి నృసింహ మాల్యాద్రి ఛందమని నామాంతరం కలదు. దీని రచయిత వెల్లలూరి లింగన మంత్రి

**37. లక్షణసార సంగ్రహము :** రచయిత దంతిని అప్పకవి.

**38. సకల లక్షణ సారము :** కర్త అద్దనూరు రామదాసు.

**39. ఛందో నిరంకుశము:** పైన సుబ్రహ్మణ్యం రచించాడు.

**40. వీరన ఛందస్సు :** రచయిత - వీరన

**41. లక్షణ చంద్రిక :** రచయిత పేరు తెలియదు.

ఇవికాక కవిపేరు, కృతిపేరు తెలియని ఛందో గ్రంథాలు ఎన్నో గ్రంథాలయాల్లో మూల్గుతున్నవి. ఇవే కాకుండా లక్షణ గ్రంథాలు పేర్కొనబడి కాలగర్భంలో లీనమైనవి మరికొన్ని ఉన్నాయి. అవి గోకర్ణ ఛందము, కవి వాగ్బంధము (తిక్కన?), అధర్వణ ఛందము, శ్రీధర ఛందము, కవి రాక్షస ఛందము, ఉత్తమ గండ ఛందము, జయదేవ ఛందము, నీలకంఠ ఛందము, విశ్వేశ్వర ఛందము, మల్లన వాదాంగ చూడామణి, శారదా దర్పణము, యాదవామాత్యచ్ఛందము, లక్షణ తిలకము, లక్షణ రాజీయము మొదలగునవి.

20వ శతాబ్దంలో విద్యార్థులకు ఉపయోగపడేటట్లు వచన రూపంలో ఛందో లక్షణము ప్రత్యేకంగాను, వ్యాకరణాలతో చేర్చియు పలువురిచే వ్రాయబడెను. అందు వేదము వేంకట్రామ శాస్త్రి, తేకుమళ్ళ రాజగోపాలరావుల ఛంద శ్శాస్త్రాలు పేర్కొన తగినవి. మీదుమిక్కిలి ఛందో విమర్శలు అనేకం వచ్చాయి. దీన్నిబట్టి చూస్తే 'పద్యకవితకు ఛందంబు పట్టుకొమ్మ'గా చెప్పవచ్చు. పైన పేర్కొనబడిన ఛందో గ్రంథములందు అధిక భాగం యతి - ప్రాసల లక్షణ మాక్రమించుటయు, ఛందమునకు వ్యాకరణాన్ని జోడించి చెప్పుటయు తెలుగు ఛందో గ్రంథాల ప్రత్యేకత.

# ఛందో దర్పణము

## ప్రథమాశ్వాసము

### 13.2. సంజ్ఞా ప్రకరణము

**13.2.1 గద్యపద్యలక్షణాలు :** ఛందః ప్రాశస్త్యం : కావ్యము పద్యమని, గద్యమని రెండు విధాలుగా ఉంటుంది. గద్యకావ్యాలు పాద నియమంలేని శబ్దసమూహంచేత వెల్లడింపబడి నవరసబంధురమైన అర్థ రచనలతో ఒప్పుతుంది. పాద నియమం కలిగి ఉండి, నాలుగు పాదాలయందు యతి, ప్రాసలను కలిగి ఉండటం పద్యం యొక్క సాధారణ లక్షణం. పద్యాల లక్షణాలను తెలియజేయటాన్నే ఛందస్సు అంటారు. పద్యాల రచనకు అవసరమైన ఒక విధమైన గమనాన్నే ఛందస్సు అని అంటారు. 'రమణీయమైన అర్థాన్ని ప్రతిపాదించే శబ్దాన్ని కావ్యం అంటారు. ఈవిధంగా కావ్యలక్షణాన్ని నిర్వచించిన ప్రాచీన ఆలంకారికుల దృష్టిలో వచనమైనా, పద్యమైనా రమణీయంగా ఉంటే అది కావ్యమని వారి సిద్ధాంతం.

లోక వ్యవహారంలో కవిత్వం అనగానే 'ఛందస్సుతో కూడిన రచన అనే అభిప్రాయం రూఢమై ఉంది. ఛందస్సులో 'గీతి' ఉన్నది కాబట్టి ఛందస్సుతో కూడిన రచనయే 'కవిత్వం' అని పెక్కుమంది అభిప్రాయమై ఉంది.

'శ్రుతి', 'లయ'లను గ్రహించేది శ్రవణేంద్రియం (చెవి). ఈ శ్రవణేంద్రియం ద్వారా మనస్సుకు ఆహ్లాదాన్నికలిగించే కళే 'కవిత్వం' అందువల్లనే 'సంగీతం' వలె 'కవిత్వం' కూడా శ్రవ్యకళ అయింది. ఈ శ్రుతి - లయలను సాధించటానికే ఛందస్సు ఏర్పడింది.

'ఛందస్సు' లేకుండా శ్రుతియుతంగా లయబద్ధంగా గద్యంలో రచనలు చేసి ఛందో రచనలాగా ఆహ్లాదాన్ని కలిగింప కూడదా? అంటే గద్యరచయిత ఎంత ప్రయత్నం చేసినప్పటికీ పద్యంలోని శ్రుతిలయల వంటి వానిని గద్యంలో సాధింపలేడు. అందువల్లనే అనేకులు కవిత్వానికి ఛందస్సు మిక్కిలి అవసరమనీ 'ఛందస్సు' లేకపోతే కవిత్వం పరిపూర్ణంకాదు అని అంటారు.

ఈ పద్యాలు కూడా వృత్తములనీ, జాతులనీ రెండువిధాలు. వృత్తాలు వర్ణగణ సమూహాలచే ఏర్పడతాయి. జాతులు మాత్రాగణ సమూహాలచే ఏర్పడతాయి. గురు, లఘువుల కూడికచే గణాలను గణాల కలయికచే పద్యాలు ఏర్పడుతాయి.

**13.2.2. గురు - లఘు నిర్ణయము :**

గురువును 'U' గుర్తుతోను, లఘువును 'I' గుర్తుతోను సూచిస్తారు.

ఒక సెకండులో అయిదవ వంతు కాలాన్ని మాత్రాకాలమంటారు. లఘువునకు ఒక మాత్ర. అంటే ఒక మాత్రాకాలంలో ఉచ్చరింపబడేది. గురువుకు రెండుమాత్రలు. అంటే రెండు మాత్రలకాలంలో ఉచ్చరింపబడేది. ఈ సంజ్ఞలు ఉచ్చారణ కాలాన్ని బట్టి చేయబడింది.

గురు - లఘు వివేచనము :

గురువు : 1. దీర్ఘాక్షరాలన్నీ గురువులే

ఉదా : ఆ, ఐ, ఔ, కా, రా శ్రీ మొదలైనవి.

2. విసర్గతో కూడి ఉన్న అక్షరాలు గురువులు

ఉదా : అః, కః, ఫః మొదలైనవి.

3. పూర్ణబిందువు (నిండుసున్న) తో కూడియుండు అక్షరాలు గురువులు

ఉదా : అం, కం, దం, మొదలైనవి.

4. పొల్లు హల్లుతో కూడియుండు అక్షరాలన్నీ గురువులే

ఉదా : అన్, కన్, చన్ మొదలైనవి.

5. ద్విత్వాలకు, సంయుక్తములైన అక్షరాలకు ముందున్న అక్షరాలు గురువులు.

ఉదా : అమ్మ, అష్ట, లక్ష మొదలైనవి.

లఘువు : 1. పైన చెప్పిన లక్షణాలు లేనివన్నీ లఘువులు.

ఉదా : అ, క, చ, ట, త, ప, మొదలైనవి.

అంటే హ్రస్వాక్షరాలన్నీ లఘువులు

2. సంయుక్త వర్ణం పరమైన తెలుగుపదాంత వర్ణము

ఉదా : రాముడు క్షత్రీయుడు - అన్నప్పుడు తెలుగు పదాంతమైన 'డు' అను అక్షరానికి సంయుక్తాక్షరమైన 'క్ష' పరమైయినది. అయినప్పటికినీ ఇచట 'డు' గురువు కాకుండా లఘువే అవుతుంది.

3. అద్రుచు, విద్రుచు, ఎద్రుచు, పద్రుచు - అనే పదాలలోని రేఫసంయుక్తాలకు ముందున్న అక్షరాలు గురువులు కాకుండా లఘువులే అవుతాయి. అంటే 'అద్రుచు' లోని 'ద్రు' అనే రేఫ సంయుక్తానికి ముందున్న 'అ' లఘువు. ఇట్లే "విద్రుచు, ఎద్రుచు, పద్రుచు' అనే పదాల్లో క్రమంగా 'ద్రు' అను సంయుక్తము పరంగానున్న 'వి', 'ఎ', 'ప' - అనే అక్షరాలు లఘువులే.

### 13.2.3 గణాష్టక లక్షణము :

గురు - లఘువులు కూడికచే గణాలు ఏర్పడతాయి. గణాలు రెండు విధాలు. 1. నిసర్గ గణాలు, 2. ఉపగణాలు.

1. నిసర్గ గణాలు అంటే సహజమైన గణాలని అర్థం. ఇవి మూడేసి అక్షరాలతో ఏర్పడతాయి. ఈ నిసర్గ గణాలు ఎనిమిది.

"ఆది మధ్యావసానే షు / యరతా యాంతి లాఘవమ్॥

భజసా గౌరవం యాంతి / మనౌతు గురులాఘ వౌ"

యగణ, రగణ, తగణములు క్రమంగా మొదట, మధ్య, చివరి భాగాల యందు లఘువులు కలిగి ఉంటాయి.

| | | |
|---|---|---|
| యగణము -IUU | - | ముకుందా |
| రగణము -UIU | - | మాధవా |
| తగణము -UUI | - | వైకుంఠ |

భ గణ, జ గణ, స గణములు క్రమంగా మొదట, మధ్య, చివరి భాగాల యందు గురువులు కలిగి ఉంటాయి.

| | | |
|---|---|---|
| భ గణము -UII | - | విష్ణుడు |
| జ గణము -IUI | - | మురారి |
| స గణము -IIU | - | వరదా |

'మ' గణ, 'న' గణాలు క్రమంగా 'గురువులు' 'లఘువులు' కలిగి ఉంటాయి మగణము - UUU - శ్రీనాథా; న గణము - విభుడుIII

2. గురువునకు 'గ' అని; లఘువునకు 'ల' ని సంకేతాలు. ఇవి ఉచ్చారణమునందు, వ్రాతయందు కూడా ఉపయోగింతురు. లఘువును, గురువును కలిసినచో 'లగము' అగును. దీనికి 'వగణము (IU) అని పేరు కూడా కలదు. గురువును లఘువును కలిపినచో 'గలము' అగును. దీనికి హగణమను పేరు కూడా కలదు (UI). గణాన్ని దీర్ఘంగా ఉచ్చరిస్తే రెండు గణాలని అర్థం. 'భా' అని అంటే రెండు 'భ' గణాలని, 'తా' అని అంటే రెండు తగణాలని గ్రహించాలి. అట్లే గురు - లఘువులకు సంకేతాలయిన 'గ' అనే వర్ణాన్ని 'ల' అను వర్ణాన్ని దీర్ఘంగా పలికితే రెండేసి గ్రహించాలని అర్థం. 'గా' అంటే రెండు గురువులు (UU) 'లా' అంటే రెండు లఘువులు. (II)

1. హగణము - UI - శౌరి; 2. వగణము - IU - హరీ; 3. గగము (-గా) - UU - కృష్ణా; 4. లలము (-లా) - II - హరి.

ఈవిధంగా ఏర్పడ్డ మాత్రాగణాల కోవలోకి చేరినవే : 1 సూర్య గణములు; 2. ఇంద్ర గణములు; 3. చంద్ర గణములు.

### 13.2.4 సూర్య గణములు (2)

1. నగణము - మూడు లఘువులు - III - విభుడు

2. హగణము (లేక) - గురువు, లఘువు - UI - శౌరి (గలము)

### 13.2.5 ఇంద్ర గణములు ఆరు (6)

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | నలము | - | నగణము తర్వాత లఘువు - | IIII | - నరహరి |
| 2. | నగము | - | నగణము తర్వాత గురువు - | IIIU | - నరహరీ |
| 3. | సలము | - | నగణము తర్వాత లఘువు - | IIUI | - నరసింహ |
| 4. | భగణము | - | | UII | - విష్ణుడు |
| 5. | రగణము | - | | UIU | - మాధవా |
| 6. | తగణము | - | | UUI | - వైకుంఠ |

### 13.2.6 చంద్రగణములు పదునాలుగు (14)

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | నగగము | - | నగణము తరువాత రెండు గురువులు | - IIIUU | - కమలనాభా |
| 2. | నహము | - | నగణము తరువాత గురువు, లఘువు | -IIIUI | - కమఠరూప |
| 3. | సలలము | - | సగణము తరువాత రెండు లఘువులు | -IIUII | - అసురాంతక |
| 4. | భలము | - | భగణము తరువాత లఘువు | - UIII | - అద్రిధర |
| 5. | భ గురువు | - | భగణము తరువాత గురువు | - UIIU | - భద్రయశా |
| 6. | మ లఘువు | - | మగణము తరువాత లఘువు | - UUUI | - అంభోజాక్ష |
| 7. | సవము | - | సగణము తరువాత లఘువు గురువు | - IIUIU | - భువనేశ్వరా |
| 8. | సహము | - | సగణము తరువాత గురువు, లఘువు | - IIUUI | - మఘవిద్వేషి |
| 9. | తలము | - | తగణము తరువాత లఘువు | -UUII | - పీతాంబర |
| 10. | రలము | - | రగణము తరువాత లఘువు | -UIUI | - కైటభారి |
| 11. | నవము | - | నగణము తరువాత లఘువు, గురువు | -IIIIU | - గజవరదా |
| 12. | నలలము | - | నగణము తరువాత లఘువు, లఘువు | -IIIII | - మహిశయన |
| 13. | రగము | - | రగణము తరువాత గురువు | -UIUU | -దేవరాజా |
| 14. | తగము | - | తగణము తరువాత గురువు | -UUIU | - పద్మావతీ |

ఈ క్రింది పద్యాన్ని కంఠస్థం చేసినట్లయితే సూర్యగణాలు, ఇంద్ర గణాలు, చంద్ర గణాలను జ్ఞప్తియందుంచుకొనవచ్చును.

పద్యం

గల, నగణము లినుఁ, డింద్రుడు

నల, నగ,సల, భరత లింక, నగగ, నహ, సలా

భల, భగురు, మలఘు, సవ, సహ

తల, రల, నవ, నలల, రగురు తగ లిందుఁడజా !

(ఇనుడు - సూర్యుడు; సలాః సగణం తరువాత రెండు లఘువులు ఇంద్రుడు - చంద్రుడు)

1. గల, నగణములు : ఇన (సూర్య) గణాలు
2. నల, నగ, సల, భ, ర, తలు : ఇంద్రగణాలు
3. నగగ, నహ, సలల, భల, భగుడ, మలఘు, సవ, సహ, తల, రల, నవ, నలల, రగ, తగ - గణాలు (ఇందు) చంద్రగణాలు

### 13.2.7 గణముల ఫలాలు :

ఈ క్రింది గణాలతో కావ్యాన్ని రచించిన వానికి గానీ, కృతి పతికిగానీ శుభములు - అశుభములు కలుగుతాయి. ఆ గణాలేమంటే కావ్యం

1. భ గణాది ఐతే - నూతనమైన సుఖాల్ని కలిగిస్తుంది.
2. జ గణాది ఐతే - రోగాన్ని కలిగిస్తుంది.
3. న గణాది ఐతే - ద్రవ్యం లభిస్తుంది.
4. స గణాది ఐతే - లయకరము.
5. మ గణాది ఐతే - శుభాలుకలుగాయి.
6. య గణాది ఐతే - శ్రేష్ఠమైన సువర్ణాన్ని పొందవచ్చు
7. రేఫ గణాది ఐతే - బాధను కలిగిస్తుంది.
8. త గణాది ఐతే - ఐశ్వర్యం కలుగుతుంది.

### 13.2.8 గణాధి దైవతములు :

ఒక్కొక్క గణానికి ఒక్కొక్క దైవం అధిదేవతగా ఏలుతున్నట్లు స్పష్టమౌతున్నది. ఎలాగంటే :

| | | |
|---|---|---|
| భగణాన్ని | - | చంద్రుడు |
| జగణాన్ని | - | సూర్యుడు |
| నగణాన్ని | - | నిర్జరులు |
| మగాణాన్ని | - | భూమి |
| యగణాన్ని | - | నీరు |
| సగణాన్ని | - | వాయువు |
| రగణాన్ని | - | అగ్ని |
| తగణాన్ని | - | ఆకాశము ఏలుతున్నట్లుగా చెప్పబడింది. |

## 13.3. యతి ప్రాసల ప్రయోజనము :

ఆంధ్రభాషకు యతిప్రాసలు ప్రాణభూతమైనట్టివి. ఆంధ్ర ఛందస్సుకు ఇవి ప్రధానమైన అంగాలు. సంస్కృతాది భాషలకంటే తెలుగులో ఇవి విలక్షణమై భాషకు పరమ ప్రామాణికంగాను, కవిత్వానికి అమూల్యమైన అలంకారాన్ని సమకూర్చునట్టివిగాను ఉన్నాయి. తెలుగు కవిత్వం అనేక విషయాలయందు సంస్కృత ఛందో మర్యాదను అనుసరించి యతిప్రాసల విషయంలో దేశీయతా వైలక్షణ్యాన్ని నిలుపుకొంది.

**13.3.1 యతి స్వరూపము :**

యతి అను శబ్దం సంస్కృతము. ఛందః పరిభాషలో ఈ శబ్దానికి విచ్ఛేదమని అర్థము. 'యతిర్విచ్ఛేద సంజ్ఞకః' అని వృత్త రత్నాకరంలో చెప్పబడ్డ నిర్వచనము. విచ్ఛేదము అంటే పరిచ్ఛేదము అని అర్థం. పద్యం యొక్క ప్రతిపాదంలోనూ యతి స్థానముంటుంది. ఆ చోట పదచ్ఛేదం కావలెను. ఆ స్థానం పూర్వాపరాల అఖండ శబ్దం (ఏక శబ్దం) ప్రయోగింపరాదని సంస్కృత ఛందోనియమం. పదమధ్యంలో యతిరాకూడదు. యతిస్థానంలో అట్టి పదచ్ఛేదము లేకపోతే యతిభంగ దోషం కలగుతుందని సంస్కృత లాక్షణికులు శాసించారు.

వక్త యొక్కయు, శ్రోత యొక్కయు సౌలభ్యం కోసం పాదాంతము నందు నియమితస్థానంలో పదచ్ఛేదంకావాలి. సాధారణ పదచ్ఛేదం విరామం కాగా, ఛందస్సుకు ఆధారభూతమై లయను ఆశ్రయించి అంటే నియమిత స్థానాన్ని శ్రావ్యత కలిగి ఉండేటువంటి పదచ్ఛేదము యతి అవుతుంది. సంస్కృతంలో యతి పాదమధ్యమందును, పాదాంతమందును నియమితమైనట్టిది. పాదమధ్య యతియే తెలుగు ఛందస్సుకు ప్రశస్తమైంది.

సంస్కృత భాషలో విచ్ఛేదం వల్లనే యతి ఏర్పడుచుండగా తెలుగులో మాత్రం పాదాది అక్షర మైత్రి విధిగా పాటింపబడుతుంది. తెలుగులో పదవిచ్ఛేద యతి, పాదాంత యతులు ఆవశ్యకాలు కావు.

కన్నడంలో తెలుగులో వలె అక్షరమైత్రి అక్కరలేదు. అందు సంస్కృతంలోలాగా పదవిచ్ఛేద రూపయతిని యతి పాటింపబడుతుంది. తెలుగు - కన్నడ భాషలకు అనేక విషయాల్లో పోలికలు ఉన్నాయి. అందువల్ల ప్రాచీన కవులకు కర్ణాట - ఆంధ్రభాషలు రెండూ బాగా పరిచయం ఉండటం వల్ల, తెలుగులోని అక్షర సాజ్యాత రూపయతి మనోజ్ఞంగా ఉన్నట్లు పరికించిన కన్నడ పండితులు ఆ ప్రకారం తమ భాషలో శ్రావ్యమైన అక్షరమైత్రి లేకపోవడంచేత అసహ్యించుకొని 'కన్నడక్కి యతి యిల్ల కొణక్కిమతియిల్ల' అనే సామెతను సృష్టించారు. కన్నడంలో యతి ఉన్నది కానీ సంస్కృతంలోవలె పదవిచ్ఛేద రూపమే అక్షరమైత్రిలోనున్న సొగసు పదచ్ఛేదంలో రాదు. అందువల్ల తెలుగులోని యతి శ్రుతి సుఖాన్ని కల్గిస్తుంది.

యతి ప్రాసలు దేశీయ ఛందో విశేషములగుట వల్ల తెలుగులోవలె తమిళంలోను ఉన్నాయి.

తమిళంలో 'అక్షరమైత్రి'కి 'తొడై' అనిపేరు. యతి 'మోనై' అనీ, ప్రాసను 'యెదుగై' అని అంటారు. తమిళ ఛందస్సులో 'తొడై' భేదాలు అనేకం ఉన్నాయి. ఇందులోని మోనై తొడై, యెదుగై తొడైలు తెలుగులోని యతిమైత్రి, ప్రాసమైత్రులకు సంబంధించినవి. అంటే 'మోనైతొడై' పాద ప్రథమాక్షర మైత్రి అనీ, 'ఎదుగైతొడై' పాద ద్వితీయాక్షర మైత్రి అని చెప్పవలెను. తెలుగు యతి మైత్రితో సమానమైన 'మోనైతొడై' గణాద్యక్షర మైత్రులను కలిగి ఉంది. భిన్నగణాల మైత్రిని బట్టి మోనై తొడై ఎనిమిది విధాలుగా ఉంది, తమిళంలోని అక్షర మైత్రులగు మోనైతొడై, ఎదుగై తొడైలలో ఎదుగై తొడైలలో దేన్నైనా కూర్చటం లక్షణమవటంచేత వానిని అలంకారాలని చెప్పవచ్చు. అవి తెలుగులోవలె నియత లక్షణాలు కావు.

సంస్కృతాది భాషలకంటే తెలుగులో ఉన్న యతి విలక్షణమై భాషకు పరమ ప్రామాణికమును, కవిత్వానికి అమూల్య అలంకారాన్ని సమకూర్చి పెడుతుంది. తెలుగు కవిత్వం అనేక విషయాల యందు సంస్కృత ఛందో మర్యాదను అనుసరించి దేశీయతా వైలక్షణ్యాన్ని నిలుపుకుంది.

'ఉత్పలమాల' మొదలైన వృత్తాల్లో ఇన్నవ అక్షరం 'యతి' అనియు, 'కందము' 'ద్విపద' 'ఆటవెలది' 'తేటగీతి' 'సీసము' మొదలగు జాతి, ఉపజాతి పద్యాలయందు ఇన్నవ అక్షరం యొక్క మొదటి అక్షరం 'యతి' అనియు లక్షణం చెప్పబడింది. స్రగ్ధర - క్రౌంచపదము మొదలగు పద్యాల్లో రెండు, మూడు యతి స్థానాలుంటాయి. అట్టి పద్యాల్లో పాదం యొక్క మొదటి అక్షరంతో మైత్రి కలిగిన అక్షరాలనే ఆ రెండు మూడు చోట్ల ఉంచవలెను.

ప్రతిపాదనమునందును ఆవిధంగా యతిస్థానం నిర్దేశింపబడిన స్థలమందు 'యతి' అని పిలవబడు పాదముయొక్క మొదటి అక్షరం కానీ, లేదా దానితో మైత్రి కలిగిన అక్షరాలు కానీ ఉండాలి. యతికి నిర్దేశింపబడ్డ నియమిత స్థలాన్ని 'యతి' స్థానమని 'యతి' అని కూడా అంటారు.

యతులలో నియమిత స్థలంలో సంధ్యక్షరముంటే పరిచ్ఛేదము (విభజన) చేసి రెండవ పదము యొక్క మొదటి అక్షరంతో మైత్రి కలిగిన అక్షరాన్నే గ్రహించాలి. యతిని చూచుకొనవలెను. సంధ్యక్షరం కాకపోతే యతికి హల్లుల యొక్కయు, అచ్చుల యొక్కయు, రెండింటి మైత్రికావలెను. అంటే యతి స్థానమందున్న అక్షరంలోని హల్లుతోను, అచ్చుతోను మైత్రిని కలిగిన అక్షరాలు నియమితస్థలంలో ఉండాలి.

తెలుగులో 'వళి' అనే దేశ్య శబ్దం సంస్కృతంలోని 'యతి' శబ్దానికి పర్యాయపదంగా వాడబడుతున్నది.

### 13.3.2. యతి భేదాలు :

ప్రారంభంలో యతిమైత్రి ఏ అక్షరానికి ఆ అక్షరమే ఉండి ఉంటుంది. కాలక్రమంలో అక్షరాలు దగ్గరి సంబంధాన్ని అనుసరించి ఒక్కొక్క అక్షరానికి సజాతీయమగు అక్షరాలతో యతిమైత్రి ఏర్పడుతుంది. యతిమైత్రిని బట్టి యతి భేదాలు ఏర్పడ్డవి. యతుల భేదాల విషయంలో లాక్షణికుల్లో వేరువేరు అభిప్రాయాలున్నాయి.

'కవిజనాశ్రయమనే' లక్షణ గ్రంథాన్ని రచించిన 'భీమన' యతి భేదాలను పదింటిని చెప్పాడు. 'కావ్యాలంకార చూడామణి'లో యతి భేదాలు పండ్రెండు చెప్పబడ్డవి. అనంతుని 'ఛందోదర్పణము' నందు యతిభేదాలు ఇరువది నాలుగని చెప్పటం జరిగింది. 'లక్షణసార సంగ్రహకర్త' ఇరువది యేడు యతులను పేర్కొన్నాడు. 'అప్పకవి' నలుబది యొక్క యతి భేదాలను వివరించాడు. ఈవిధంగా యతి భేదాల విషయంలో లాక్షణికుల్లో భిన్నాభిప్రాయాలు కనబడుతున్నవి. లాక్షణికులు ఎన్ని చెప్పినప్పటికిని ఆయా అక్షరాలకు యతిమైత్రి ఈ క్రింది విధంగా కన్పడుచున్నది.

### 13.3.3 పరస్పరం యతి మైత్రి కలిగిన అక్షరాలు :

1. అ, ఆ, ఐ, ఔ, య, హ
2. ఇ, ఈ, ఎ, ఏ, ఋ, ౠ
3. ఉ, ఊ, ఒ, ఓ
4. క, ఖ, గ, ఘ, జ
5. చ, ఛ, జ జ, ఝ, శ, ష, స
6. ట, ఠ, డ, ఢ
7. త, థ, ద, ధ
8. ప, ఫ, బ, భ, వ
9. న, ణ, జ్ఞ
10. ల, ళ, డ
11. ర, ల, ళ
12. ంక, ంఖ, ంగ, ంఘ, జ
13. ంచ, ంఛ, ంఛ, ంజ, ంజ, ంఝ, ఞ

**14.** ంట, ంఠ, ండ, ంఢ, ంత, ంథ, ంద, ంధ, ణ, న

**15.** పు, ఫు, బు, భు, ము, పో, ఫో, బొ, భో, మొ.

ఇవి దీర్ఘాలతో కలిసి ఉన్నా యతిమైత్రి ఉంటుంది.

ఈపైన చెప్పిన పదునేను విధాలుగా నున్న అక్షరాలకు పరస్పర యతి మైత్రి కలదు. అంతే గాకుండా పూర్ణ బిందువు ముందు కలిగిన 'య, ర, ల, వ, శ, ష, స,హ,' - లు మకారంతో యతి మైత్రి ఉంటుంది. పూర్ణ బిందువు ముందు కలిగిన 'య, ర, ల, వ, శ, ష, స, హ' లకు పరస్పర యతి మైత్రిలేదు. అంటే 'మ' కారానికి ంయ, ంర, ంల, ంవ, ంశ, ంష, ంస, ంహ అను అక్షరాలతో ఏ అక్షరానికైనా యతి చెల్లుతుంది. అంతేగాని 'ంయ' కును 'ంర' కును యతిమైత్రి లేదు. ఇట్లే మిగిలిన అక్షరాలను కూడా గ్రహించాలి.

ఛందో దర్పణంలో : 'వాసనగల మొదటి వ్రాయి వడియన బరగున్'

'వడులు పాద పాదముల హరీ! ఎన్నిట యతి రావలెనని,

రన్నిటఁ దెలుగునకు మొదలి అక్షరమమరున్'

- అని చెప్పిన తీరు శాస్త్రీయ గుణ సంపన్నమై ఉంది 'వాసన' అంటే గంధము, సంబంధము, స్నేహము, మైత్రి అని అర్థాలను గ్రహింపదగి ఉండటంచే, 'వాసన గల మొదటి వ్రాయి వడి అనెడి వాక్యానికి,' మైత్రీ స్వభావంగల పాదాద్యక్షరాన్ని 'వడి' యని పిలవాలని అర్థం. అనంతుని నిర్వచనాన్ని అనుసరించి తెలుగులో ప్రయోగింపబడేట్టి యతిమైత్రి కల పాదాది అక్షరానికి 'వళి' (వడి) అని సంజ్ఞ కాబట్టి అతడే స్పష్టమైన ప్రతిపాదనమునకై పద్యపాదమునందెక్కడ యతి రావాలని నియతి ఉందో, అచ్చట పాదాద్యక్షరాన్ని (వాసనా ధర్మంచే తన్మిత్రమునుగాని) ప్రయోగించాలని రచించాడు. సంస్కృతయతి, తెలుగువళిమైత్రుల ప్రయోగాలందలి సంబంధాన్ని తెలుపుతూ రెండును విరామ ప్రయోజన సాధకాలేయని ధ్వనించేటట్లు అనంతుడు ప్రకటించిన తీరు ప్రశంసావహం.

### 13.3.4. ఆద్యోవళిః :

విరతి, విశ్రాంతి, విశ్రామము, శ్రాంతి, విరమణము, విరమము, విరామము, వడి, వళి - అనే పదాలు యతికి పర్యాయపదాలుగా వాడుబడుచున్నాయి.

యతి మైత్రి గల ఆద్యక్షరం 'వళి' అనే తాత్పర్యంతో 'ఆద్యోవళిః' అనే సూత్రం ఏర్పడింది. 'వళి' అనే శబ్దానికి మైత్రీ స్వభావం అనేటువంటి అర్థాన్ని లక్షణమునందు స్ఫురింపచేసిన తొలి లాక్షణికుడు 'విన్నకోట పెద్దన' అనీ, ఆ అర్థాన్ని సుస్పష్టంగా ప్రకటించి భావసౌష్టవంతో లక్షణ రచన చేసినవాడు అనంతుడనీ నిర్ణయమవుతున్నది. 'లక్షణసార సంగ్రహంలో (పెద్దన) 'వడియగు బాదాదుల యందిడు నక్షరమని' చెప్పబడి అది యతిస్థానంలో ప్రయోగింపబడితే తెలుగు యతికి సంజ్ఞయగునని వివరింపబడింది. ప్రామాణిక లక్షణ గ్రంథమైన 'అప్పకవీయం'లో వళి పరిచ్ఛేదమంతా 'ఆద్యోవళిః' అనే సూత్రానికి వివరణ ప్రాయంగా రచింపబడినట్లు పేర్కొనబడి

"చరణ చరణమున కాద్య

క్షరములు వళులయ్యె ననియె క్రమ్మఱ దత్త

చ్చరణములలోనఁ జెప్పిన

యిరవులఁ బొందింప వలయు నెల్లకృతులలోన్" (3.5)

అని వళి లక్షణము నిర్వచింపబడింది. ఇది చింతామణి సూత్రానికి వ్యాఖ్య అవుతుంది. అనంతుని అనుసరించి అప్పకవియు సంస్కృతాంధ్ర యతులకు గల భేద సాదృశ్యాలను వివరించాడు.

పాదాది అక్షరాన్ని 'వళి' అని లాక్షణికులందరూ ప్రకటించారు. కొఱవి గోపరాజు మొదలైనవారు 'వళి' శబ్దాన్నేప్రయోగించారు. పొత్తపి వేంకటరమణకవి మొదలైనవారు 'వళి' కి పర్యాయములనదగిన శబ్దాలను ప్రయోగించారు. అర్వాచీన లక్షణ గ్రంథమైన ఛందో రత్నాకరంలో

'పద్య చరణాది అక్షర ప్రతతి తోడ
పాదమధ్య సంక్లుప్తార్ణ పటలి కెలమి
మీర సంబంధములు కూర్చుతీరు వళి'...

అనే నిర్వచనం ఆధునికమైనప్పటికీ, పూర్వలాక్షణికుల అభిప్రాయాలకు సారభూతమును 'వళి' శబ్దం యొక్క వ్యుత్పత్త్యర్థాన్ని ప్రతిపాదించేదిగా ఉంది.

తెలుగు ఛందస్సున పద్యపాదమునందలి నియమితాక్షరాలతో మైత్రిని కలిగి ఉండు పాదాద్య క్షరానికి వళి (వడి) అని సంజ్ఞ. అంటే వళి అక్షరానికి సాజాత్యమైన అక్షరం పాదమందలి నియమిత స్థానంలో ప్రయోగింపబడుతున్నాయి. సంస్కృత యతికి తెలుగువళికి సామ్యం లేనప్పటికీ వృత్త పద్యాలయందు పాదమధ్య యతిస్థానంలో తెలుగువళి ధర్మాన్ని ఆపాదింపబడటంచేత వళి - యతులు పర్యాయంగా ప్రాచుర్యాన్ని పొందాయి.

### 13.3.5. వళి స్వరూప స్వభావాలు :

ఆంధ్ర ఛందో లాక్షణికుల నిర్వచనాలననుసరించి పాదమధ్యస్థ నియమిత అక్షరంతో మైత్రీ భావాన్ని కలిగియుండే పాదాద్యక్షరానికి వళి అను నామం రూఢి అవుతున్నది. మిత్రత్వం అంటే వర్ణసాజాత్యత్వం. వళి సంజ్ఞకల అక్షరంతో స్వర - వ్యంజన సాజాత్యంకల అక్షరం పాదమందు లాక్షణికులు చెప్పినట్లు ప్రయోగించుటయే తెలుగువళి స్వభావం. పాదమధ్యస్థ స్థానమంటే ఇంచుమించు మధ్యమైనట్టిది.

ఉదా : 'అతని కంటె ఘనుడు - ఆచంట మల్లన్న
కలిమిలేములు - కావడి కుండలు
కోటి విద్యలు - కూటి కొఱకే
తానొకటి తలచిన - దైవమొకటి తలచు
కాళ్లగజ్జా - కంకాళమ్మా
వేపాచెక్కా - వెలగామొగ్గా'

మొదలైన జాతీయాలూ, సామెతలు మార్గకవితాచ్ఛాయకు ఏ మాత్రం లోను కానట్టివి. జానపదగేయాలు, పదచ్ఛేద రూపమైన విరామంగాని, వళిమైత్రి గాని కలిగి ఉండి తెలుగు యతియొక్క సహజత్వాన్ని ప్రకటిస్తున్నవి. దేశికవిత్వమందు వళిమైత్రియే కాక, పదచ్ఛేదము రూపమైన విరామంకూడా అవిరళంగా ప్రయోగింపబడడం గమనించదగింది. శిష్టసాహిత్యం అభివృద్ధిగాంచినప్పటి నుండి విరామం వెనుకబడి వళిమైత్రియే సంప్రదాయంగా స్వీకరింపబడి స్థిరత్వంగాంచి, తెలుగు ఛందస్సుకు అంగమై అందాన్ని కూర్చింది.

### 13.3.6. 'వడి' శబ్ద వ్యుత్పత్తి :

'వడి' శబ్దమును దేశ్యమయి, 'వళి'యను రూపాంతరంతో సంజ్ఞగ స్థిరపడింది. 'వడి' శబ్దానికి ఏ లాక్షణికులచేత ఇదమిత్థంగా వ్యుత్పత్తి నిరూపించబడలేదు. ప్రాచీనాంధ్ర ఛందోవేత్తలందరు పాదప్రథమాక్షరాన్ని 'వడి' అన్నారేకాని ఆ శబ్దాన్ని నిర్వచించలేదు.

ఆధునికులు ఈ 'వడి' శబ్దాన్ని గురించి అనేక విధాలుగా నిర్వచిస్తున్నారు. 'వడి విభాజనే అని ధాతుపాఠము.' విభాజనార్థం కలదవటంచేత వడి యతికి పర్యాయపదమౌతుందని కొందరు నిరూపించారు.

### 13.3.7. ఛందస్సు - లయ :

ఛందస్సులో 'లయ' అనేది ఆయా పద్యాల్లో ఉచ్చరింపబడు వర్ణ సముదాయాల యొక్క ఆరోహణ అవరోహణముల క్రమాన్ని అనుసరించును. ఇట్లా ఒక పద్యంలోని స్వరలహరిని ఉచ్చరించటంలో పాటించిన ఆరోహణ అవరోహణాదుల క్రమం ఒక గమక మేర్పరచి

పద్యాన్నే కాదు పద్యభావాన్ని కూడా గతిమంత మొనరుస్తుంది. ఇట్టి వైశిష్ట్యమున్నందుననే ఛందస్సులో ఈ 'లయ' అనేక విధాలుగా సాధింపబడుతుంది. పద్యపాదంలోని వర్ణసముదాయాన్ని లేదా మాత్రా సముదాయాన్ని చిన్న చిన్న ఖండాలుగా విభజించి పేర్చి, ఆయా ఖండాలపై విశ్రాంతి పాటించి చదవటం కూడా పైన వివరించినట్టి 'లయ'ను సాధించటానికే అనుట స్పష్టం. ఆయా ఖండాలను ఆవిధంగా వేర్పరచి ఉచ్చరించటంవల్ల వానిలోని పరస్పర సామరస్యమనేది సాధింపబడి మొత్తం పద్యమంతటికీ ఒక తూగు, ఒక ధ్వనన సౌందర్యం, ఒక నిశ్చితమైన గతివిన్యాసం, మున్నగునవి సంపాదింపబడును. ఒక చరణంలో రెండుమూడు విరతులుంచడంలో గల రహస్యము అట్టి నాద లయాత్మకమైన గతి సంపదను ఆర్జించుటయే కావచ్చును. వర్ణాల లేదా గణాల పరస్పర మైత్రీ విరోధాదులు ఈవిధమైన గతి సంపాదనకు సంబంధించినవే యని భావింపవచ్చును. వైదిక ఛందస్సులో కూడా స్వరము, ఊత, విరతి మున్నగు వాటితో ఇట్టి 'లయ' సాధింపబడుతుంది.

త్రిష్టుప్ ఛందస్సు నాల్గవచోట యతితో శాలినీవృత్తంగాను, అయిదవచోట యతితో ఇంద్ర వజ్రా, ఉపేంద్ర వజ్రా వృత్తాలుగాను వికసించింది. అంటే పాదంలోని వర్ణాలుగాని, గురు, లఘు మాత్రాక్రమంకాని మారకపోయినా యతిస్థానం మారటంతో ఛందస్సులోని గతి మారిపోయి, వృత్తమునే వేరొకటిగా మార్చుచున్నదని గ్రహింపవచ్చును. ఉదాహరణమునకు నాల్గు 'న' గణములు, ఒక 'స' గణముతో ఏర్పడు 'శశికళా' లేదు 'శరభ' వృత్తము పాదాంత యతినేగాని, పాదమధ్యయతి అంగీకరింపదు. కాని పాదమధ్యంలో ఆరింట యతి నిల్పినచో నిదే వృత్తము 'స్రక్' ఛందముగా మారును. ఆరింటమాని ఎనిమిదింట విరతి కల్పిస్తే మరల ఇదే వృత్తం. 'మణి గుణనికరము'గా మారుతుంది. కాబట్టి మన లాక్షణికులు 'మధురతా నిమిత్తం యతి రిష్యతే' అని చెప్పారు. అంటే యతివల్ల మధురతయే కాదు; ఛందోగతి, ఛందః స్వరూపములు కూడా సాధింపబడు చుండును.

### 13.3.8. అనంతుని ఛందస్సు : యతి పర్యాయ పదములు :

అనంతుని ఛందోదర్పణంలో 'వాసనగల మొదలి వ్రాయివడి' అని నిర్వచింపబడినప్పటికి.

"విరతులు విశ్రాంతులు మఱి - విరామములు విశ్రమములు విశ్రామంబుల్

విరమంబులు యతులనగా - విరమణంబులు నాగవళ్ల నెలయుమురారీ! (1.78)

అని రచింపబడిన పద్యమునందు యతి పర్యాయపదాలలో పూర్వంలేనట్టి వడి శబ్దం కూడా చేర్చి చెప్పబడింది. విరతి, విశ్రాంతి మొదలైన పదాలచే వళ్ళు వ్యవహరింపబడునని చెప్పటం ఇందలి విశేషం

యతి భేదాలను చెప్పేటప్పుడు కవిజనాశ్రయ, కావ్యాలంకార చూడామణులందు తప్పకుండా వడి శబ్దాన్నే ప్రయోగింపబడి ఉంది. ఇందు 'స్వరయతులు వర్గయతులు - ఇత్యాదిగా యతి శబ్దమే ఉపయుక్తమైంది. ఇందు వడి శబ్దానికి విరళంగాను, యతి శబ్దానికి అవిరళంగాను ప్రయోగాలున్నాయి. అనంతుని కాలానికి పాద ఆద్యక్షరానికి వళిని మాత్రమే సంజ్ఞగా స్వీకరించి. ఇతర స్థలాల్లో వడి, యతులను పర్యాయంగా గ్రహించటం ప్రాచుర్యాన్ని పొందింది. లక్షణ సారసంగ్రహమునందు, సులక్షణ సారమునందు పాదాద్యక్షరానికి సంజ్ఞగా వడి శబ్దము గ్రహింపబడియు, వడి, యతులు పర్యాయాలుగా ప్రయోగింపబడ్డాయి.

ఛందోదర్పణం తరువాత పేర్కొనదగ్గ అప్పకవీయంలో 'చరణ చరణమున కాద్యక్షరములు వళు'లని నిర్వచింపబడినప్పటికీ 'విరతి విశ్రాంతి... విరామయతులు, ననగ నివి తొమ్మిదియు వళి కాఖ్యలయ్యె' అని స్పష్టంగా చెప్పబడింది. అనంతుడు చెప్పిన యతి, విరామాదులచే వళ్ళు వ్యవహరింపబడును అను అభిప్రాయంకంటె, అప్పకవి చెప్పిన యతి విరామాదులగు తొమ్మిదియు వళికి పేర్లు అనే అభిప్రాయం ఆర్వాచీనమైనట్టిదియు, పరిణామాన్ని సూచించునట్టిదియు 'అనంతామాత్యుడు చేసె వెనుక యతు లిరువది నాల్గ'నియు 'విశ్రమంబులేను విరచింతు...' ననియు వడికి పర్యాయంగా యతి, విశ్రమములు ప్రయోగింపబడ్డవి. వడి - యతి శబ్దాల సబంధాన్ని పాటించుటయందు అప్పకవి అనంతుని అనుకరించియు, యతిశబ్దాన్ని ప్రయోగించటంలో బాహుళ్యాన్ని అధిగమించాడు. దీన్నిబట్టి అప్పకవి కాలానికి తెలుగు ఛందస్సునందు ప్రాచీనమైనట్టియు, దేశీయమైనట్టియు 'వళి' శబ్దము వెనుకబడి, దానికి పర్యాయంగా

సంస్కృతయతి శబ్దం ప్రాచుర్యాన్ని పొందింది.

ఈ విషయాన్ని బట్టి అనంతుని కాలం నుండి వడిశబ్దంతో అభేదంగా యతిని ప్రయోగించుటయు పదాది అక్షరానికి తప్పకుండా వడిని మాత్రమే సంజ్ఞగా పేర్కొనుటయు, సామాన్యమై, కడమ భాగములందంతట వడికిమారు యతిని ప్రయోగించుట క్రమంగా అధికం అయిందని తెలుస్తున్నది.

విశ్రాంతి - విరమణము మొదలైన పదాలు వాక్యమధ్య విరామాన్ని సూచించటంచేతను, విరామానికి యతి సంజ్ఞావాచకమవటం చేతను, ఇవన్నీ పర్యాయాలైనవి. సంస్కృతయతి లక్షణానికి పర్యాయంగా తెలుగులో వళి మైత్రి లక్షణము వెలయుటచేతను, రెండూ ఒకే ప్రయోజనానికి ఉద్దిష్టములవటంచేత, వళికి యతి పర్యాయమై వళి - యతి - విరామాదులన్నీ సార్థకత పొందుచున్నవి.

తెలుగులో యతి మైత్రివలెనే తమిళంలోని 'మోనైత్తోడై' లోను స్వర - వ్యంజన మైత్రులు కలవు. అందు సాధారణంగా ఏ అక్షరానికి ఆ అక్షరమే మైత్రిని కలిగి ఉంటుంది. కన్నడము నందలి ఛందోరీతులు తెలుగుతో సంపూర్ణంగా ఏకీభవిస్తాయి. తెలుగులో వలెనే మార్గఛందో రీతులును, తల్లక్షణాలును, కన్నడమునకు సంస్కృతం నుండే ప్రవేశించాయి. యతి ప్రాసలను పోలిన అక్షరమైత్రులు భాషకు సహజములు అనదగు సామెతల్లోనూ, జానపద గేయాల్లోనూ విశేషంగా ఉండటంవల్ల తెలుగు భాషా ఛందములకు అవి సహజ అలంకారములే కాని పెట్టుబడు సొమ్ములు కావు.

## 13.4 ప్రాస

**13.4.1. ప్రాస స్వరూప స్వభావాలు :** ఛందోదర్పణంలో అనంతుడు 'ప్రాసంబగు రెండవయది, ప్రాసంబులన్ని యెడలను భాసురముగ" అని చెప్పాడు.

కవిజనాశ్రయంలో '..... చరణంబు ద్వితీయ వర్ణసమితియె ప్రాసం బరయగ బ్రాసంబొక్కటి చరణంబుల (1.61) అని నిర్వచింపబడింది.

చింతామణిలో : 'ద్వితీయో వర్ణః ప్రాసః' - స్వస్వచరణేషు పూర్వః ప్రాసస్సర్వేషుచైక ఏవస్యాత్' అని నిర్వచింపబడింది. అంటే ప్రతిపాదమందలి ద్వితీయ వర్ణానికి 'ప్రాస' యని సంజ్ఞ. పద్యమందలి ప్రథమ పాద ప్రాసాక్షరమును చివరి పాదములన్నిటి యందలి ప్రాసాక్షరాలు ఒకటిగా ఉండాలి. ప్రాస స్వరూపానికి ఇది సంక్షేప లక్షణం. ప్రాసాక్షరములు ఒక్కటియై ఉండాలంటే ప్రథమ పాదప్రాసముపై మిగిలిన పాదముల ప్రాసములు ఆధారపడి ప్రయోగింపబడాలని తాత్పర్యం. యతితోపాటు ప్రాసకూడ పాద చతుష్కానికి ప్రాణమని విన్నకోట పెద్దన్న చెప్పటం వల్ల తెలుగు ఛందస్సునందు ప్రాసయొక్క ఆవశ్యకం తెలుస్తున్నది. పై అనంతుని లక్షణానికి కవిజనాశ్రయకర్త లక్షణంతో సమ్మేళనం గావిస్తే ప్రాసకు సంపూర్ణమైన లక్షణము ఏర్పడుతుంది. హ్రస్వము మీద సున్నయుండగా. ఆవలి అక్షరమును ద్విత్వంగా వ్రాస్తే అదేవిధంగా, అద్విరుక్తంగా వ్రాస్తే ఇదే రీతిని ప్రాసాక్షరాలన్నిటా నిలపవలయునని అనంతుడొక్కడే తెలిపినాడు.

"కుఱుచ మీఁద సున్న మఱి తేల వ్రాయఁబ్రా

సద్వయాది నిట్లు జరగు నచ్యు

తుఁడు సమస్త వల్లభుఁడు నాఁగ నయ్యచ్యు

తుండు సకల వల్లభుండనంగ" (1-34)

ప్రథమ ప్రాస స్థానంలో నిండు సున్న ఉంటే నిండు సున్నను, అర సున్న కలదేని అరసున్నను తక్కినప్రాస స్థానములందు ఇడవలయునని తెలుస్తున్నది. అర్ధ బిందువునకు ఉచ్చారణ లేకపోవడంచేత, ప్రాస పూర్వాక్షర నియమాన్ని అనుసరించి సార్ధబిందుక, నిర్బిందుకమైన ప్రాసయు అర్వాచీనమైనట్టిది కలదని అనంతుడు పేర్కొన్నాడు.

'పదములందును, పద్యములందును ప్రథమపాద ద్వితీయాక్షరము ప్రాసము' - ఈ అక్షరమునే తక్కిన పాదాల యొక్క ప్రాస స్థానంలో నిలపాలి. ఈ నియమం సీస, గీత, దండక, మంజరీ కృతులకు నియతంకాదని అప్పకవి (3:281), ప్రాస పూర్వాక్షర నియమము ఉపజాత్యాదులకు లేదని అనంతుడు (1.30) పేర్కొని ఆయా లక్ష్యలక్షణాన్ని గీత పద్యంలో రచించటం ఒక విశేషం.

తెలుగులో ఛందోమయ వాక్యాలు వళిని గాని, ప్రాసనుగాని కలిగి ఉండి రమ్యతరములగుచున్నవి. వడివలె ప్రాసకూడా సహజ సుందరమైనట్టిది. ప్రాచీనాంధ్ర దేశీ సాహిత్య ప్రక్రియలను పరిశీలిస్తే ప్రాసయొక్క ప్రథమావతారాన్ని గుర్తింపవచ్చు.

'ఏదారి అంటే - గోదారి అన్నట్లు
నీతిలేనివాడు - కోతికంటె పాడు
ఎరవు సొమ్ము - బరువు చేటు
తెల్లనవన్నీ పాలు - నల్లనివన్నీ నీళ్లు.'
మొదలైన జాతీయములనదగు సామెతలయందు,
'అమ్మణ్ణి కన్నుల్లు - తమ్మి పువ్వుల్లు
తమ్మిపువ్వుల్లోని - కమ్మతేనెల్లు'
'జోలల్లు పాడితే - బాలలకు నిద్ర
నాగస్వరము పట్టితే - నాగులకు నిద్ర'

మొదలుగా గల స్వచ్ఛమైన జానపద గేయాలలోను సహజంగా, ప్రాథమికమునైన ప్రాసస్వరూపం గోచరిస్తున్నది. ఇందులో ఒక వాక్యం రెండర్ధభాగాలై ప్రథమార్థం యొక్క ద్వితీయాక్షరం, ద్వితీయార్థం యొక్క ద్వితీయక్షరంగా పునరావృతమైంది. దీన్నిబట్టియు వళి లక్షణాల్నిబట్టియు, ప్రాథమిక దేశి కవితా స్వరూపాలయందు, ప్రథమార్థ భాగము యొక్క ప్రథమ ద్వితీయక్షరాలు, ద్వితీయార్ధము యొక్క ప్రథమ ద్వితీయములుగా క్రమంగా ప్రయోగింపబడినట్లు తెలుస్తున్నది. సామెతలందు, గేయములందును రెండర్ధ పాదాలను కలిపి ఒకే పాదంగా స్వీకరించినప్పుడే వాని భావమునందొక సమానత్వము కలిగి వాక్యములవలె ఒప్పుతున్నవి. వళి ప్రాసలతో పాటు సంస్కృతంలో పాదమధ్యంలోనున్న పదచ్ఛేదాత్మక విశ్రాంతియు వీనియందు సహజంగా ఉంది. ఈ కారణాలచేత ప్రాస ప్రయోగం వళికంటె విరళమగుట చేతను, ఒక పూర్తి పాదమున యతిమైత్రి తప్పనిసరి అవటం వల్ల శిష్ట సాహిత్యము నందొక ఛందో నియమంగా పరిణమించింది. తెలుగు సాహిత్యంలో ప్రాసలేని పద్యములు ఉండవచ్చుకాని, వళిలేని పద్యములు ఉండనేరవు. ప్రాసను చెప్పినప్పుడు వళిని చెప్పవలసిన అగత్యమున్నదనియు భావించ వచ్చును. కాబట్టి వళిమైత్రిని పాటింపని సన్నివేశాల్లో పాదమధ్యంలో పాటింపబడు ప్రాసమైత్రికి ప్రాసయతి అని లక్షణం ఏర్పడింది. సీస-గీతాది ఉపజాతులు శిష్టులాదరించిన దేశీ ఛందోరీతులగుట వల్ల వానిలో యతికి మారు ప్రాసయతిని ప్రయోగింపవచ్చును. ఇట్టి ప్రాసయతియే. తెలుగు ఛందస్సులో ప్రాసకు ప్రథమ అవతారమన వలసి ఉంది. ఇదియే తాళలయాత్మకములైన గేయాలయందు శ్రావ్యతాహేతువవుతున్నది. పద్యం పాదనియమము కలది అవటంచేత వళి ఏ పాదానికి ఆ పాదమే మైత్రిని కలిగి ఉండి, ప్రాసమాత్రము అన్ని పాదాలకును ద్వితీయాక్షర మైత్రిగా పరిణమించింది. ప్రాస మైత్రియందు చెప్పుకొనదగిన భేదాలు లేవు. అయిన్పటికీ దాని రామణీయకమును, ధ్వని రూపకమైన శ్రుతిని ఆశ్రయించి స్వల్పమైన భేదాలుకలిగి

ఉన్నది, వ్యంజనము యొక్క ఆవృత్తిచే కలుగు శ్రవణానందం స్వరం వల్ల కలగక పోవుటచే ప్రాసమైత్రిలో వ్యంజనము ప్రధానమైనది. స్వరము అప్రధానమైంది.

సంస్కృతంలో ఇట్టి ద్వితీయక్షర ప్రాసని యతిలేకున్నా శబ్దాలంకారమైన ప్రాస ఒకటి కలదు. సంస్కృతమునందలి ప్రాస అనియత ప్రయోగము కలది. శబ్దాలంకారము, ఛందఃప్రమేయము లేనట్టిది.

ఆది లాక్షణికుడైన భీమన, ద్వితీయ వర్ణసమితి ప్రాసమని స్పష్టంగా నిర్వచించి.

"భాసురములగుచు సుకర - ప్రాసాను ప్రాసదుష్కర ప్రాసాంత్య

ప్రాస ద్విప్రాసత్రి - ప్రాసములన షడ్విధముల "బరగునుగృతులన్" అని ప్రాసలను పేర్కొనెను. ఇందు సుకర, దుష్కరములను రెండువిధములైన ప్రాసలే అతడు చెప్పిన ప్రాస నిర్వచనమునకు తగి ఉన్నది. అనుప్రాస అంత్యప్రాస - ద్విప్రాస - త్రిప్రాస అనువానిని ప్రత్యేకంగా వేరొకచోట చెప్పుట యుక్తము. ఛందః ప్రాసయొక్క స్వరూపాన్ని గుర్తించిన భీమన, ఆలంకారిక ప్రాసల యొక్క సామ్యముచే కలిగిన ప్రభావంచే పైవిధంగా చెప్పాడు. అంటే ప్రాసను ఒక అలంకారముగా గుర్తించినట్లు నిర్ణయమవుతున్నది. కావ్యాలంకార చూడామణి యందు ఇట్లే విభేదము పాటింపకయే చెప్పబడినది. అనంతామాత్యుడు ఈ రెండిటిని వింగడించి సుస్పష్టంగా ప్రాసలకు లక్షణం చెప్పినాడు. ఈతడు చెప్పిన ద్వాదశ విధ ప్రాసములు ద్వితీయాక్షర ప్రాసము యొక్క భేదాలు. విశేష పరిశీలనచే నతడు పూర్వాక్షర నియమమును చెప్పి, ప్రాసకు వ్యంజన సామ్యము ప్రధానమనియు, స్వరసామ్యము నిరపేక్షమనియు ప్రకటించి, అప్పకవి వంటి లాక్షణికులకు మార్గదర్శికాగల్గెను. ద్వితీయాక్షర ప్రాసము ప్రత్యేకించి చెప్పటంచే ఇది ఛందోవిధియనియు, ఆలంకారిక ప్రాస కాదనియు సుస్థాపితము చేసినవాడయ్యను. ఈతడు చెప్పిన సమప్రాసము ప్రాథమికమనియు తదితరములైనవి దాని పరిణామ భేదాలనీ చెప్పవచ్చును.

### 13.4.2. (ii) ప్రాస శబ్దము యొక్క వ్యుత్పత్తి :

"ప్రకృష్టో వర్ణ విన్యాసః ప్రాసః" - నిర్వచనాన్నిబట్టి - ప్రకృష్టమైన వర్ణ విన్యాసము ప్రాసమగుచున్నదని ప్రాస శబ్దానికి వ్యుత్పత్తి, 'అస - భువి. భూసత్తాయామ్' 'అస' ధాతువునకు ముందు 'ప్ర' అను ఉపసర్గచేరటం చేత 'ప్రాస' శబ్దమేర్పడింది.

ప్రాస శబ్దానికి సంస్కృత నిఘంటువులో throwing, casting, discharging, a dart, a barbed missile, insertive 'అనే అర్థాలు చూపబడ్డవి. వీనిని బట్టి 'ఒక్క insertive అంటే' మధ్యలో పొదుగుట' అనేదే ప్రాస ప్రయోగాన్ని బట్టి ఆ శబ్దానికి యుక్తమైన అర్థంగా తోస్తున్నది. "ఆద్యోవళి ద్వితీయో వర్ణః ప్రాసో త్రిపాదపాదేషు, స్వస్వచరణేషు పూర్వః ప్రాస స్సర్వేషు చైక ఏవస్యాత్' అనే లక్షణమందు పూర్వ ప్రాసాక్షరమును (మొదటి పాదమందలిది) మిగిలిన అన్ని పాదముల యందలి ప్రాసాక్షరమును ఒకటియే అయి ఉండవలయునని చెప్పటాన్ని బట్టి మొదటి పాదముయొక్క ప్రాసాక్షరాన్నే మిగిలిన పాదములందును ద్వితీయాక్షరంగా చొప్పించవలసి ఉన్నదని నిర్ణయమగుచున్నది. కాగా ప్రాస శబ్దానికి ప్రయోగధర్మాన్ని బట్టి ఒక నియమితాక్షరాన్ని చొనుపుట అనే అర్థం తగి ఉన్నదని తోస్తున్నది. చొనిపెడి అక్షరం తిరిగి తిరిగి స్థాన నియతి లేక ప్రయోగింపబడుట 'అనుప్రాసము' ఇది అలంకార శాస్త్రమునందొక శబ్దాలంకారంగా చెప్పబడింది.

### 13.4.3. ప్రాస పూర్వాక్షర నియమము :

లాక్షణికులందరు ద్వితీయాక్షరం ప్రాసమని ఏకవాక్యంగా నిర్వచనం చెప్పారు. అనంతుడు. అప్పకవి - ఇరువురును సంపూర్ణమైన లక్ష్యానుశీలనం చేసి "ప్రథమ పాద ప్రాస పూర్వాక్షరము గురు లఘువులల్లో ఏదిఉంటే, దానినే మిగిలిన పాదాల యందు ప్రాస పూర్వాక్షరంగా ప్రయోగింపవలయును. అది గురువైనచో సమ గురువు గాని, అసమ గురువుగాని కావచ్చుననియు ప్రతిపాదించారు. దీనికంటె

అధికంగా అనంతుడు ప్రాస పూర్వాక్షర నియమము ఉపజాత్యాదులకు, మిశ్రపద్యాలకు వర్తింపదని చెప్పాడు. సీస గీతాది ఉపజాతులకు ప్రాసనియతము కాదు. మిశ్రపద్యము ప్రాసనియమము కల భిన్నవృత్తముల కలయిక అగుటచే, దానికి ప్రాస నియమమున్నా పూర్వాక్షరము నియతము కాజాలదు. ఈ విషయంలో అనంతుడు చెప్పింది స్పష్ట ప్రతిపత్తికని తెలుస్తున్నది. అర్ధబిందువునకు ఉచ్చారణము లేకపోవటంచే, ప్రాసగతమైన అర్ధబిందువునకు పూర్వమున దీర్ఘగురువుంటే అది దీర్ఘాక్షరము (సమ గురువు)నే ప్రాస పూర్వాక్షరంగా ప్రయోగించాలని అనంతుడొక్కడే చెప్పినాడు. దీనిననుసరించే సార్ధబిందుక నిర్బిందుక ప్రాసను తెలుగు లాక్షణికుల్లో తొలుత తెల్పినవాడు అనంతుడగుచున్నాడు.

### 13.4.5 ప్రాస లక్షణము :

ప్రాసాక్షరాలకు హల్సామ్యముంటే చాలు. స్వరసామ్యమక్కరలేదు. ఋత్వముగాని, ద్విత్వము గాని ప్రథమ పాద ప్రాసస్థానంలో ఉంటే మిగిలిన పాదాల యందలి ప్రాసాక్షరాలను వ్యంజన సామ్యమున్న ఏ స్వరంతోనైనా ప్రయోగించవచ్చు. విరామము స్వర ప్రధానమైంది. ప్రాసవ్యంజన ప్రధానమైంది అవటంచేత ప్రాసస్థానంలో స్వరసంధి జరిగిన యెడల ఆసంధి గత హల్లునకేప్రాసము కూర్పవలయునని ప్రాస స్వరూపానికి విపులమును, నిర్దుష్టమునైన రచనగావించాడు. ప్రాస వ్యంజన ప్రధానమవుటంచేత స్వరసంధిగత హల్లునకేప్రాసను కూర్పవలెనని ప్రత్యేకంగా చెప్పబనిలేదు. ఋత్వము స్వరమవటంవల్ల ఋత్వసహితమైన వ్యంజనం ఏ స్వరంతోనైనా ప్రాసగా కూర్పవచ్చుననియు చెప్పనక్కరలేదు. యతిలో సంధిని వేరుపాటుచేసి పరపదాది స్వరానికి మైత్రిని కూర్చినట్లు, ప్రాసలో కూర్పరాదనియు, వట్రుసుడికి రేఫముతో గల ఉచ్చారణ సామ్యంచేత, దాన్ని లేఖనంలో వ్యంజనానికి ఎడంగా వ్రాయుటవల్లను కలుగు పొరపాటును వారింపవలెనని ఈవిధంగా విశదపరచినాడని గ్రహించాలి. ఐనప్పటికీ సర్వసంధిగత ప్రాసయందు యతిలోవలె స్వరానికి కాక వ్యంజనానికి ప్రాసను ఘటింపవలెనని చెప్పటం వ్యర్థమనదగును. ఈ విషయం వ్యంజన సంధియందు చెప్పవలసిఉంది. వ్యంజన సంధిలోని ఆదేశాగమాత్మకమైన హల్లునకే ప్రాసను కూర్పవలయునని అప్పకవి సంధిగతప్రాస నామంతో ప్రత్యేక ప్రాసభేదంగా చెప్పాడు. నిజానికి ఈవిధంగా చెప్పటంకంటే దీన్ని ప్రాస లక్షణమునందు చెప్పటం యుక్తం. లింగమగుంట తిమ్మకవి తదితర లాక్షణికులు గావించిన ప్రాస నిర్వచనములందు ఎట్టి విశేషములేదు.

సంస్కృతంలో ప్రాసము లేదు. ప్రాకృతంలో కూడా అంతే.

(i). అనంతామాత్యుడు - అప్పకవుల లక్షణాలను సమన్వయంచేసి ఛందోంసమైన ప్రాసను ఇట్లు సమీక్షింప వచ్చును :

1. ఏ వ్యంజనానికి ఆవ్యంజనంతోనే మైత్రిగాని, యతిలోవలె సవర్ణాలను ప్రాసస్థానమున కూర్పరాదు (నగ - యగ - రగ - తగ).
2. ప్రథమపాద ప్రాసాక్షరము సంయుక్తము, ద్విత్వము, పూర్ణబిందు పూర్వకము, విసర్గపూర్వకము అయిన యెడల కడమపాదాలయందు అట్లే ప్రయోగింపవలెను (విద్య - హృద్య - అమ్మ - దమ్మ; దంతి - శాంతి)
3. ప్రథమపాద ప్రాసానికి పూర్వాక్షరం గురు - లఘువులలో ఏదియైన దానినే మిగిలిన పాదాలయందును ప్రయోగింపవలెను. (దాస - వాస; ఘన - దను; పక్షి - రాక్షస, ఇంద్ర - సాంద్ర)

### 13.4.6. తెలుగు యతి - ప్రాసల ప్రాధాన్యము :

లఘు రేఫ - శకట రేఫ నిర్ణయానికి, సార్ధబిందుక శబ్ద నిర్ధారణకు యతి, ప్రాస స్థలాలే ప్రధాన ఆధారములు. 'తెనుగునకుఁ బ్రావళ్ళుంగడు వ్వన్నియల్' అని కొలవి గొపరాజు అభిప్రాయము తిక్కన యభిమతంలో

**యతి - ప్రాసలు**

"తెలుగు కవిత్వము చెప్పం;

దలచిన కవి యర్థమునకుఁ దగియుండెడు మా

టలు గొని వళులుం బ్రాసం,

బులు నిలుపక మొగిని బులిమి పుచ్చుట చదురే'

'ప్రాసమంత్యంబయౌ మహారాష్ట్రభాష, సాధ్యమౌనది నన్నపమందు,

నఱవమందును యతియును గలదింద నినవో,

యతులు ప్రాసంబు లధికములాదినవెవి' -

ఆంగ్లభాషలో కూడ అంత్యప్రాసనియమము కొన్నింటికి కలదు. వారు దానిని Rhyme అంటారు. హిందీ భాషాప్రాచీన కవితలో అంత్యానుప్రాస నియతమై కనిపించును. తెలుగునందు శబ్ద స్వరూప నిర్ణయ విషయమున యతిప్రాసముల మించిన సాధనము లేదని చెప్పవచ్చును. తెలుగుభాషకు వళిప్రాసములు అనాది సిద్ధములైన సహజాలంకారములు మీదుమిక్కిలి అవిశ్రవణ సుభగత్వాన్ని కలిగించేవి. అనాది సిద్ధములైన తెలుగు సామెతల్లో ఈ వళిప్రాసములు కోకొల్లలుగా కన్పించును. పద కవిత యందు అంతటా యతిప్రాస విన్యాసాన్ని గమనించవచ్చు. చివరకు తెలుగుయతి ప్రాసల విన్యాసాన్ని గమనించవచ్చు. చివరకు తెలుగు యతిప్రాసల ప్రభావం సంస్కృతంపైన కూడా ప్రసరించింది. ఉదా: ధవళ గుణోదవళయశో, ధవళిత దిఙ్మండలోవ + దమిత్రారాతిః

భవభక్తో భవకరుణో, ధ్రువ భవభోగాన్వితోవి + భాతి సుకీర్తిః దీన్నిబట్టి తెలుగులోని యతిప్రాసల వైశిష్ట్యమెట్టిదో తెలుస్తున్నది.

పాఠం - 14

## ఛందోదర్పణము - ప్రథమాశ్వాసము

# ప్రాసభేద పరిశీలనము

ఆచార్య నేతి అనంతరామశాస్త్రి

## 14.0 ఉపోద్ఘాతము :

పద్యపాదం యొక్క ప్రథమ, ద్వితీయ స్వరాలకు మధ్యస్థమైన వర్ణసముదాయము ప్రాసము. పద్యమందు అన్నిపాదాలయందును అట్లే ఉండటాన్ని ప్రాస లక్షణం అంటారు. ప్రాసాక్షరంలో వ్యంజనము ప్రధానము స్వరము అప్రధానము. వ్యంజనావృత్తియే ప్రాస అన్న లక్షణం ఏర్పడటం వల్ల ప్రాసమైత్రియందు యతిమైత్రిలోవలె భేదాలుండటానికి అవకాశం లేదు. ఐనప్పటికీ భాష పరిణామశీలం అవటంవల్ల మహాకవులు అచ్చటచ్చట స్వల్పమైన భేదాలను సృష్టించటం తటస్థించింది. లాక్షణికులు ఆయా ప్రాస విశేషాలను గుర్తించి ప్రాసభేదాలను చెప్పారు.

ప్రాసాక్షరం అన్నిపాదాలయందు తుల్యంగా ఉండాలని మొదట చెప్పబడింది. 'ప్రాసస్సర్వేషు చైక ఏవస్యాత్' ప్రథమ పాదంలో రెండవచోట ఏ వ్యంజనముంటుందో అదే తక్కిన పాదాల్లో ప్రాసస్థానాల్లో ఉండాలని అనుశాసించటం చేత ప్రాసభేదాలకు అవకాశంలేదనవలెను. కానీ జీవద్భాషలో నానాటికీ మార్పులు చేర్పులు సహజం కాబట్టి యతిభేదాలవలె కాలక్రమంలో ప్రాసమైత్రిలో భేదాలు పెరిగాయి. తుల్యాక్షర నియమం కొంత సడలింది. కవులు నిరంకుశులు కాబట్టి ప్రాసలలో కొన్ని సృష్టించారు. లాక్షణికులట్టి మహాకవుల ప్రయోగాలకు గతి కల్పించక తప్పదు. కాబట్టి ప్రాసవిశేషాలను చేర్చి ప్రాస భేదాలను కల్పించారు.

కవిజనాశ్రయ, కావ్యాలంకార చూడామణుల యందు ద్వితీయాక్షర ప్రాసభేదాలు చెప్పలేదు. దీన్నిబట్టి ఆ గ్రంథాల ప్రాచీనత తెలుస్తున్నది. తరువాత అనంతుడు, అతన్ని అనుసరించి చిత్రకవి పెద్దన 12 ప్రాసభేదాలను చెప్పారు. పిమ్మట అప్పకవి 17 విధాలైన ప్రాసభేదాలను చెప్పాడు. ప్రస్తుతం అనంతుడు పేర్కొన్న ఈ క్రింది 12 ప్రాసభేదాలను పరిశీలిద్దాం.

1. సమప్రాసము; 2. ప్రాసమైత్రి; 3. ఋప్రాసము; 4. త్రిప్రాసము; 5. ప్రాదిప్రాసము; 6. సమలఘుప్రాసము; 7. వికల్పప్రాసము; 8. బిందుప్రాసము; 9. అర్థబిందుప్రాసము; 10. ఉభయప్రాసము; 11. సంయుతప్రాసము; 12. సంధిగత ప్రాసము ఇవికాక అనంతుడు శబ్దాలంకార విశేషంతో ఏర్పడ్డ షడ్విధప్రాసలనుకూడా చెప్పాడు. 1. దుష్కరప్రాసము; 2. ద్వంద్వప్రాసము; 3. త్రిప్రాసము; 4. చతుష్ప్రాసము; 5. అంత్యప్రాసము; 6. అనుప్రాసము.

## 14.1 సమప్రాసము

ఒక పద్యంలోని పాదములన్నింటి యందును ప్రాసాక్షరమొకే విధంగా ఉండాలని ఇందు చెప్పబడింది. ఇది ప్రాసను కూర్చుటయందు పాటించాల్సిన ప్రప్రథమ కారణం. కాబట్టి ప్రాసభేదాలకు ఆరంభంలో అనంతుడు (1-36-39) చెప్పాడు.

ప్రథమ పాద ద్వితీయాక్షరానికి పూర్వమున అర్ధానుసారమున్నా, పూర్వానుస్వారమున్నా, నిర్బిందుకంగా ఉన్నా, దీర్ఘమున్నా, హ్రస్వమున్నా, ద్విత్వమైనా, సంయుక్తమైనా ప్రాసాక్షరమున అదేవిధంగా తక్కిన పాదాలయందు ప్రయోగించటాన్ని సమప్రాసమంటారు.

సమప్రాస అనేది ప్రాసను పాటించటంలోని ప్రప్రథమ నియమం కాని ప్రాసభేదం కాదని కొందరి అభిప్రాయము.

ఇందులో ఆరు విషయాలు చెప్పబడ్డవి. వీనికి లక్ష్యాలు కూడా కలవు. ఇక్కడ ఉదాహరణలో ప్రాసలేని ఆటవెలదిగా స్వీకరించటంచేత ఈ ప్రాసభేదాలన్ని ప్రాసయతిలో తెలుసుకోవలెను.

1. ప్రాసాక్షరానికి పూర్వం అర్ధబిందువు ఉండుట.

   ఉదా: వీఁడె కృష్ణుఁడల్ల వాఁడె ప్రలంబరి

2. ప్రాసాక్షరానికి పూర్వం పూర్ణబిందువు ఉండటం

   ఉదా: కొండ యెత్తె నితండు ద్రవ్వె

3. ప్రాసాక్షరం ద్విత్వమై ఉండుట.

   ఉదా: నొడ్డ గెడవు గాఁగ దొడ్డరాజేలెడి

4. ప్రాసాక్షరానికి పూర్వం నిర్బిందుకంగా ఉండుట

   ఉదా: వీడు నాఁగ బ్రాస మీడువచ్చు

5. ప్రాసాక్షరానికి పూర్వం దీర్ఘముండటం

   ఉదా : ఆ యుపేంద్రుని బొడగాంచుటే యుపాయము

6. ప్రాసాక్షరానికి పూర్వం హ్రస్వముండటం.

   ఉదా: అయ్యుపేంద్రుని బొడగాంచుటేయ్యుపాయము

అనంతుని అనుసరించి చిత్రకవి పెద్దనయు, రమణ కవియు ఒకే ప్రాసభేదంగా చెప్పారు. స్పష్ట ప్రతిపత్తికై అప్పకవి ఈ సమప్రాసను అర్ధబిందు సమప్రాస, పూర్ణబిందు సమప్రాస, అని వేర్వేరుగా రెండు ప్రాసభేదాలను చెప్పటం అనవసరం. సమప్రాసమని ఒక్క భేదముగా చెప్పిన చాలును. సమప్రాసము ప్రాసకు ప్రాథమిక లక్షణమైన కారణాన కూచిమంచి కవులు, రంగకవి మొదలైనవారు దీన్ని చెప్పలేదు.

## 14.2. ప్రాసమైత్రి

పూర్ణబిందు పూర్వక బకారము ద్విత్వ మకారానికి ప్రాసకు మిత్రములని అనంతుడు (1-40-42) చెప్పాడు.

ఈ ప్రాసమైత్రిని ముప్రత్యయం యొక్క చరిత్రను బట్టి ఊహింపవచ్చును.

'బింబము - బింబమ్ము - బింబంబు' - వంటి రూపాలు ప్రయోగార్హములు, శాస్త్రసమ్మతాలు. ఈ కారణాలచేత 'మ్ము - ంబు' లు ప్రాసకు చెల్లుచున్నవి.

(1) అనంతుడీ ప్రాసకు 'బిందుపూర్వమై తమలోనఁ బొందు బమలు - అని లక్షణాన్ని చెప్పి ఈ క్రింది లక్ష్యాన్నిచ్చాడు.

'లో, కంబు లెల్లనుండి నెమ్మితోడ' - అనంతుని లక్షణాన్ని బట్టి 'ంబ - ంమ'లు మిత్రములని చెప్పవలసి ఉంది. ఇది ప్రాచీన లేఖన విధాన్ని బట్టి ఏర్పడ్డ లక్షణం. ఇది 'లతాంతములకుం మొనసి' వంటి బింద పూర్వక మకారమును పోలినది. అర్వాచీనకాలంలో

తెలుగులో స్థిరపరకత్వమున బిందువు లేకపోవుటం వల్ల అది ద్విత్వమకారమైంది.

అనంతుడు బిందుపూర్వక 'బ, మ'లనుటను బట్టి ఆయన చూపిన లక్ష్యమునంద '.... లో, కంబు లెల్ల నుండి నెంమితోడ' అనియే చూపవలసి ఉన్నది. కొన్ని కొన్ని ఛందోదర్పణ ముద్రిత ప్రతులందలి లక్ష్యమున 'నెమ్మి' అని ద్విత్వమకారము కలదు. అప్పుడది అతని లక్షణానికి తగినది కాదనవలసి ఉన్నది. ఇచ్చట బిందుపదానికి 'కేచి ద్వదంత్య భేదత్వ మనుస్వార మకారయోః' అనెడి అధ్వరణుని సూత్రాన్నిబట్టి అనుస్వారానికి మకారమని అర్ధముకలదని, అనంతుడు 'ంబ - మ్మ'లకే మైత్రి చెప్పెననవచ్చును. కాని అతని 'బిందుపూర్వకబమలనెడి' రచనా విధానము ననుసరించి బిందు పూర్వకములయిన బకార - మకారములను (ంబ - ంమ) గ్రహించటయే ఋజుమార్గము. కాబట్టి అనంతుని లక్ష్యమును 'లోకంబు లెల్లనుండు నెంమితోడ అని చూపుట యుక్తము. చిత్రకవి పెద్దన, రమణ కవులు అనంతుని మార్గాన్నే అనురించారు.

2) ల - ళలకును ప్రాసమైత్రికలదని ఈ క్రింది లక్ష్యాన్ని అనంతుడు చూపాడు.

ఉదా : నీల వర్ణ గర్భగోళంబునందు, లో

3) ఋకారాన్వితంబు ద్వితంబుగాగ'

బరగు నచ్చపు జడ్డతోఁ బ్రాసమైత్రి' అని అనంతుడు చెప్పడంతో ఋయుతాయుతములకును అన్యోన్యము మిత్రములని తెలుస్తున్నది అంటే

1. వట్రువ సుడితోడి ద్విత్వానికి - వట్రువసుడి లేని ద్విత్వానికి మైత్రి ఉంది.

ఉదా : యక్కృపానిధి హరిగని మ్రొక్కిరనగ'

2. ఋకార కేవల వ్యంజనానికి - వట్టి వ్యంజనానికి ప్రాసమైత్రికలదు.

ఉదా : సంభృతాశ్రితు డతిశయోజ్జృంభుడనగ'

3. ఋ - ఋత్వములేనిదానికి

ఉదా : శ్రీకి నొడయఁడుజ్జ్వలా కృతి యితఁడన్న

దీనికి ప్రాసమైత్రి ప్రాసమనేపేరు అంత సముచితంగా లేదు. ప్రాసమైత్రి కల ప్రాసయని అర్ధం చెప్పాల్సి ఉంటుంది. ఇట్టి అర్ధము నందౌచిత్యము కనిపించదు. ప్రతిప్రాసభేదమును ప్రాసమైత్రికలదే కదా!

## 14.3. ఋప్రాసము :

1. ఋ - ర ల యొక్క ప్రాసమైత్రిని ఋ ప్రాసమంటారు. ఋ కారముయొక్క స్వర - వ్యంజన స్వభావము వివరింపబడిన కారణం చేత ఋ - ర ల ప్రాసము చెల్లుబడి అగును.

ఉదా : చేరి తన యురముఁ దన్నిన

యా ఋషి పాదలంబుఁబిసికె నచ్యుతుఁడనఁగన్!

2. ఆ + ఋషి - ఇందచ్చంది కలుగదు. ఋ కారానికి ఈవిధమైన హల్సామ్యము చేత వ్యాకరణంలో 'పదాద్యంబులు ఋ ౠ వర్ణంబులు రల తుల్యంబులు' అని సూత్రింపబడ్డది. అంటే హల్లుతో సమానమని అర్ధం.

3. సంస్కృతమున యణాదేశ సంధిలో ఋ కారమునకు ర వర్ణమగును.

పితృ + ఆజ్ఞ ----- పిత్రాజ్ఞ - ఈ కారణంచే ఋ - కారస్వరమునకు ర వర్ణము ప్రాసలో చెల్లును.

ఈ కారణాలచేత ఋ కారము రేఫతో ప్రాసమైత్రి చెల్లుతున్నది. ఈ మైత్రివళిలో చెల్లదని అప్పకవి సూచించాడు.

## 14.4. త్రిప్రాసము :

'సంఖ్యఁ బలుకు త్రికారంబుఁ జనుఁ దకార

సదృశమై త్రికార ప్రాస సంజ్ఞ గలిగి.

సంఖ్యా వాచకమగు త్రిశబ్దము రేఫ యుక్తముకాని 'త' కారముతో ప్రాసవేయుటను త్రి ప్రాసవేయుటను త్రిప్రాసమందురు.

ఉదా : యాత్రి విక్రముఁ డభయ ప్రదాతయనగ

వాక్త్రి పథ గోజ్జ్వలులు విష్ణుభక్తులనఁగ

అనంతుడు సంఖ్యార్థక త్రికారమునకే యీ ప్రాసమైత్రి చెప్పి త్రిప్రాసయని నామకరణ మొనర్చెను. త్రికారమునకు మాత్రమే సంయుతాసంయుత ప్రాస విధించటానికి కారణమేమో! అతనికి ముందున్న గ్రంథాల్లో ఒక్క త్రికారమునకు మాత్రమే యీ ప్రాసకూర్పబడి యున్నచో ఈ త్రిప్రాసయను సంజ్ఞయు లక్షణములు సరియైనవని చెప్పవచ్చును. త్రికార ప్రాస సంయుతాసంయుత ప్రాస లక్షణములలో ఒప్పును. ఈ పద్యము ప్రాచీన గ్రంథము లందెచ్చటను కానరాదు. నన్నయ భారతమున ఈ క్రింది పద్యములో ఈ ప్రాస విశేషముగా గోచరించుచున్నది.

ఉదా : క్షత్రియవశ్యులై .......
క్షత్రియ వైశ్యశూద్రు........ స్వచా
రి త్రముఁ దప్పకుండ ..... రామ మాం
ధాతృ రఘుక్షి తీశుల్ (భార - ఆది. 2-173).

ఇందు త్రకార ప్రాసకలదే కాని త్రికార ప్రాస (సంఖ్యార్థక) త్రి శబ్దము కల ప్రాసలేదు. ఇక్కడ 'రామమాంధాతృ + రఘుక్షితీశుల్' అనుచోట 'మాంధాత్ర రఘుక్షితీశుల్' అని 'ఋ' కార స్థానమున రేఫ రావలయునని కొందరి మతము. అడిదము సూరకవి ఈ పద్యమునే రేఫాదేశము వచ్చినందులకు ఉదాహరించెను. అప్పకవి 'మతమున రేఫా దేశము రాకూడదు.

అంతేగాక అనంతుడు ఈ త్రిపాసమును ఈ క్రింది విధముగాకుండా మైత్రిని కూర్చవచ్చునియును చెప్పెను.

'ఇ - ఉ - ఋ - ' కు అసమానమైన అచ్చుపరమైనచో 'య - వ - ర - లు' క్రమముగా వచ్చుటను యణాదేశమందురు. అట్లుగాక 'య, వ, ర, లకు అసమానమైన అచ్చు పరమైనచో 'ఇ - ఉ - ఋ' - వచ్చుటను సంప్రసారణమందురు. అనగా యణాదేశమునకు వ్యతిరేకముగావచ్చు ప్రక్రియను సంప్రసారణమందురు 'త్రి' కారమును విడదీయగా 'త్ర్ ఇ - త్రి అగును. త్ ఋ ఇ - తృ అని సంప్రసారణము వలన అగును. కావున 'తృ'కి 'త్రి' కారముతో ప్రాసవేసిన దానిని కూడా త్రిప్రాసమందురు.

## 14.5. ప్రాదిప్రాసము :

'ప్రాదియై యనశబ్దము ప్రాణమగుటఁ

బరఁగ నణలకు వేర్వేఱ ప్రాసమయ్యె.

ఇక్కడ ప్రాదులనగా సంస్కృతంలో 'ప్ర, పర, అప, ని, నిస్,' మొదలగు ఇరువది నాలుగు ఉపసర్గలున్నవి. వీటన్నింటిని ప్రాదులందురు. ప్రాదులలో మొదటిది 'ప్ర' అను అక్షరము. దీనికి 'అన' శబ్దము పరమైనచో (ప్ర + అన) 'ప్రాణ' అను రూపమేర్పడును. ఇక్కడ ఆదేశ 'ణ' కారానికి సహజ 'నణ' లతో ప్రాసమైత్రి కలదు. కావున ఇది ప్రాది ప్రాసమనబడును.

ఉదా : క్షోణి ధరుఁ డెత్తె నేనుఁగు ప్రాణమనఁగ

దానవారాతి వ్రేతల ప్రాణమనగ'

అనంతుడు, చిత్రకవి పెద్దన; ముద్దరాజురామన, రమణకవి, కూచిమంచి తిమ్మకవి మొదలైనవారు ఈ ప్రాదిప్రాసను వాడిరి. ఋ - ర - ష - లకు పరమైన నకారముకు 'ణ' కారమాదేశమనెడు వ్యాకరణ విధిచేత ప్ర + అన - ప్రాణ అని ఏర్పడును.

'ప్రాణ' శబ్దగతమైన 'ణ' కారమునకే ఈ ప్రాస చెల్లుటను లక్ష్యమునందు చూపియుండుట వలన వ్యాకరణ కార్యముచే న కారమునకు ఆదేశమైన ణ కారములకెల్ల శబ్దములందు ఈ ప్రాస చెల్లునని తెలియుచున్నది.

ఉపసర్గయుతమైన ప్రాణ శబ్దమునకే ప్రాసమైత్రిని చెప్పుట వలన అనంతుడు ప్రాదిప్రాసమని నాడు. కాబట్టి సహజ 'ణ - న' లకు కూడ ఈ ప్రాసమైత్రి చెల్లునని చెప్పవచ్చు. దీనిని ఎల్లరు స్వీకరించి యుండగా అప్పకవి మాత్రము దీనికి ఉభయ ప్రాసమని నామముంచినాడు.

## 14.6. సమ లఘు ప్రాసము :

గీ. ఒలి రేఫతోఁ గూడియు నూఁదఁబడక
తేలి తెలుఁగునఁ దమయట్టి వ్రాలతోన
సమలఘు ప్రాసమగు .......

సాధారణంగా ఏక పదములోని సంయుక్తాక్షరము యొక్క పూర్వ హ్రస్వము గురువగును. కాని కొన్ని పదాలలో రేఫ సంయుక్తాక్షరము ప్రాస స్థానమునందున్నప్పుడు తేల్చి పలకబడుటచే పూర్వ హ్రస్వము లఘువగుచున్నది.

"అద్రుచు, విద్రుచు' మొదలగు పదములలోని రేఫ సంయుక్తముల యొక్క పూర్వ హ్రస్వములూదబడక గురువులు కానేరవు. అట్టి సంయుక్తాక్షరము ప్రథమ పాద ప్రాసస్థానమునందున్నచో మిగిలిన పాదములయందును అట్లే ఉండవలయును. ఇదియును ప్రాస పూర్వాక్షరనియమమును చెప్పునట్టిది.

తెలుగులో 'అద్రుచు, విద్రుచు, ఎద్రుచు, పద్రుచు' మొదలగు వాని యందలి సంయుక్త పూర్వాక్షరములు లఘువులు.

ఉదా : .............. తెక్క లమరఁబట్టి

విద్రిచె నసురఁ గృష్ణుఁడు దిక్కులద్రువ ననగ, దీనినే అప్పకవి "లఘుద్విత్వ ప్రాసము'గా పేర్కొనెను. రమణ కవి "సమలఘు ప్రాసమని' అనంతుని లక్షణమునే పేర్కొనెను. లద్రువ ననఁగ

ఇందు 'విద్రిచె - అద్రువ' - అనువాని మైత్రిని సమలఘు ప్రాసమనబడును.

ఉత్తర హరి వంశంలో :
ఎద్రిచిన .............
పద్రిచిన ............
విద్రుపగ ...........
చిద్రుపలు........... ఉ.హరి. 4:109.

సమలఘు ప్రాసకు ప్రయోగమున్నది.

## 14.7 వికల్ప ప్రాసము :

గీ. సానునాసిక లౌ వర్గహల్లులకుఁ దృ

తీయములు వికల్ప ప్రాసమై యెలర్చు'

అనునాసిక సంధియందు ఆదేశానునానికమునకు తద్వర్గ తృతీయ క్షరమునకు ప్రాసవేయుటను వికల్పప్రాసమందురు.

అయిదు వర్గములలోని పొల్లు హల్లులు అనగా క - చ - ట - త - ప లు (స్వరముతో చేరనివి) అనునాసికములు పరంబులగు నప్పుడు తమ వర్గములలోని పంచమాక్షరములు గానో (ఙ, ఞ, ణ, న మ) తృతీయాక్షరములుగానో (గ, జ, డ, ద, బ) వికల్పముగా మారును. దీనికి అనునాసిక సంధి అని పేరు. ఈ సంధిలో వర్గ తృతీయ పంచమాక్షరములుభయమాదేశమగుటచే ప్రాసలో నీ యుభయా క్షరములకు మైత్రి కూర్పవచ్చును.

ఉదా : ప్రాఙ్ను గంబు పై రవిదోఁచె నగ్ని వోలె

బ్రాఙ్ముఖుండై నుతించె నీవాగ్మియనగ.'

ప్రాక్ + నగ - ప్రాఙ్నగ; ప్రాగ్నగ అను రెండు రూపములు ఏర్పడును. ఈ కారణంచేత వర్గ పంచమాక్షరములు తత్తద్వర్గ తృతీయాక్షరములతో ప్రాసమైత్రినొందును. వికల్ప సంధి వశమున వచ్చు రూపములనుబట్టి ప్రాసమైత్రి సాధింపబడుట వలన వికల్ప ప్రాసమనబడినది. ఇట్టిచోట ఙ కారమునకు గాని గ కారమునకు గాని ప్రాసచెల్లును.

పైన చూపిన ఉదాహరణములను పరిశీలించినచోః ప్రాక్ + నగ - ప్రాఙ్నగ; అగ్ని అనుచోట ఙ కార - గ కారములకు ప్రాస కూర్చబడినది. అట్లే ప్రాక్ + ముఖుడు - ప్రాఙ్ముఖుడు - వాక్ + మి - వాగ్మి అను సందర్భమున కూడ వికల్పసంధి వశమున వచ్చిన రూపములను బట్టి ప్రాసమైత్రి సాధింపబడినది. అనంతుని లక్షణము ననుసరించి అప్పకవి మొదలగు వారు ఈ ప్రాసను చెప్పిరి.

## 14.8. బిందు ప్రాసము :

'పేర్చి పొల్లు నకారంబు బిందువగుచు

మీఁద నున్న ధకారంబునూఁదఁ బ్రాస

బంధమగు....

సిద్ధ పూర్ణ బిందు పూర్వక 'ధ' కారమునకు, ద్రుత సంధి వలన వచ్చిన పూర్ణ బిందు పూర్వక 'ధ' కారమునకు ప్రాసమైత్రి వేయుటను బిందు ప్రాసమనబడును.

ఉదా : బంధమగుఁ గృష్ణుఁడుదయించినంధరిత్రి.

ఇక్కడ స్వతసిద్ధంగా ఉన్న బిందు పూర్వక 'ంధ' కారమునకు, ద్రుత సంధివల్ల ఏర్పడిన (ఉదయించినన్ + ధరిత్రి - ఉదయించనం ధరిత్రి) బిందు పూర్వక 'ధ' కారమునకు ప్రాసమైత్రి వేయుటను బిందుప్రాసమందురు. అప్పకవ్యాదులు దీనిని పేర్కొనలేదు.

## 14.9. అర్ధ బిందు ప్రాసము :

గీ. సార్ధ బిందువలై తేలినట్టి పట ల

కరయఁ బ్రాసంబు నిర్బిందులైనఁ జెల్లు

సార్ధ బిందుకమగు 'ప - ట' వర్ణములకు, నిర్బిందుకమగు ప, ట వర్ణములకు ప్రాస వేయుటను బిందు ప్రాసమనబడును. అప్పకవి దీనిని ఖండా ఖండప్రాసమని చెప్పెను.

ఇక్కడ అనంతుడు 'ప - ట' లకు మాత్రమే యర్ధబిందు ప్రాసమును చెప్పినాడు. కాని మిగిలిన లాక్షణికులు దీర్ఘము మీద అరసున్న పూర్వమందుగల క, చ, ట, త, ప లకు (పరుషములకు) అరసున్న పూర్వమున లేని క, చ, ట, త, ప లకు ప్రాస చెల్లునని చెప్పిరి. అంటే సార్ధబిందుకములైన క, చ, ట, త, ప లు ఒక పాదమున, ప్రాస స్థానముననుండగా మరొక పాదమున నిర్బిందుకములైన కచటతపలు ప్రాసలో నిలుపవచ్చును.

కాని చిత్రకవి పెద్దన మాత్రము 'ప - ట' లకు మాత్రమేయని యనలేదు కాని లక్ష్యమున ఆ రెంటినే అనంతుని ఛాయలో వ్రాసెను. అనంతుడిచ్చిన లక్ష్యము :

'వీఁపు మూఁపులు మఱి తల మోపులయ్యె

మాట లేఁటికి మేటి తాఁ బేఁటి కనఁగ

ఇందు దీర్ఘము మీది ('ఁపు') ఖండబిందువు పూర్వమందున్న 'పు'కు దీర్ఘము మీది ఖండ బిందువు లేని (పు) కు ప్రాసమైత్రి చెల్లినది. అట్లే 'ట', 'టి' లకును : (వీఁపు - మోపు; మాట - తాఁ బేఁటి)

ఇక్కడ ఒక విషయము గమనింపవలెను. ఒకరు సార్ధబిందుకముగా ప్రయోగించిన శబ్దమును మఱొకరు నిర్బిందుకముగా ప్రయోగించుట కలదు. కాబట్టి ఒక పదము సబిందుకము? నిర్బిందుకము? అనే విషయము తేలవలయును. ఖండబిందువును ప్రాసములో అవ్యభిచరితముగ పాటించుట ఒక నన్నయ భారతములోనే కన్పించుచున్నది.

## 14.10. ఉభయ ప్రాసము :

చూడఁగ లకార రేఫలు
గూడు డకారంబు చను నకుంఠితగతిఁ దో
డ్తో డన నుభయ ప్రాసము

రేఫముతోగాని, లకారముతో గాని సంయుక్తమైన డకారము, రేఫము గాని, లకారముగాని సంయుక్తత లేని అదే డకారముతో ప్రాస కూర్చుటను ఉభయ ప్రాసమందురు.

1. "పాఁడి మరగి బ్రతుకు వాండ్రిల ద్రేఁతలు"

2. "పండు కొఱకు వింత యిండ్లకు ఁబోకు కృ

3. ష్ణుండ నీకు బ్రాతె పండ్లు నిచట

4. వాండ్ల లేఁ జూపు మోములఁ దీండ్రమారె

ఇక్కడ 1. పాఁడి - వాండ్రిల - రేఫము సంయుక్తముకాని డకారమునకు, రేఫ సంయుక్తమైన డకారమునకు ప్రాసమైత్రి కూర్చబడినది.

2. పండు - ఇండ్లకు - లకారము సంయుక్తము కాని డకారమునకు, లకార సంయుక్తమయిన డకారమునకు ప్రాసమైత్రి కూర్చబడినది.

3. కృష్ణుండ .... పండ్లు - ఇది కూడ పై మాదిరే.

4. వాండ్ల .... తంద్ర - ఇక్కడ లకార సంయుక్తముతో కూడిన 'డ' కారము, రేఫ సంయుక్తముతో కూడిన 'డ' కారముతో ప్రాస మైత్రిని పొందుచున్నది.

దీనిని బట్టి తేలిన సారంశమేమనగా :

1. పాఁడి - వాండ్రి - రేఫ సంయుతా సంయుత డకారములకు

2. పండు - ఇండ్ల
కృష్ణుడు - పండ్లు ల కార సంయుతా సంయుత డ కారములకు

3. వాండ్ల - తీండ్ర - ల కార, రేఫల సంయుత డ కారములకు ప్రాస కూర్చబడినది.
దీనిని అప్పకవి - సంయుతా సంయుత ప్రాసమని పేర్కొనెను.

## 14.11 సంయుత ప్రాసము :

పాడు, నూరు, ప్రోలు, బహువచనంబులై
పరఁగుచుండు నూఁది పలుకునపుడు
తేల్చి పలుకునపుడు దీపించు సంయుత
ప్రాస మిరు దెఱఁగుల ఁబద్మనాభ!

1. పాడు, నూరు, ప్రోలు - ఇవి ఔప విభక్తిక శబ్దములు. పాడు - నూరు - ప్రోలు - అను శబ్దాలు బహువచనాన్ని పొంది ఊది పలుకబడునప్పుడు గాని, తేల్చి పలుకబడునప్పుడు గాని కలుగు ప్రాసను సంయుత ప్రాసమనబడును.

ఏకవచనము బహువచనము.

| | | |
|---|---|---|
| పాడు | పాళ్లు | |
| నూరు | నూళ్ళు | ఇవి సంయుక్తమైనవి |
| ప్రోలు | ప్రోళ్లు | |
| ప్రోళులు, నూళులు; | పాళులు | అసంయుక్తమైనవి |

సంయుతముగాను - అసంయుతముగా రెండు రూపములకు విడివిడిగా ప్రాసను కూర్పవచ్చును.

ఉదా : పాళ్లు మనుజు లెక్క నూళ్లుగాఁ దొడఁగె న
యూళ్లు మిగుల బలసెఁ బ్రోళ్లు గాఁగ
భాగ్యవంతుఁ డేలు పాళులు, నూళులు
ప్రోళులయ్యె బ్రాతె కూళు లిచట.

ఇక్కడ పాడు, నూరు, ప్రోలు అనునవి బహువచనములో తేల్చి పలుకునప్పుడు - పాళులు, నూళులు, ప్రోళులు - అని అసంయుక్తమగును.

ఊది పలుకునప్పుడు - పాళ్లు - నూళ్లు - ప్రోళ్లు - అని సంయుక్తమగును. ఈ రెండు రూపములకు విడివిడిగా ప్రాసను కూర్చుటను సంయుత ప్రాసమందురు.

తెలుగునందు లేదు లలిఁగ్రింద సుడి గ్రుచ్చె
గ్రుమ్మెనాఁగ రేఫ కొమ్ముకాని
ప్రాసమైత్రి చొరదు దా సంయుత ప్రాస
మగును రేఫయుతము ననుసరించి

వట్రుసుడి కల వ్యంజనము (కృ), ఉకార రేఫకల వ్యంజనమును (క్రు) ప్రాసయందు దేనికి దానితోనే మైత్రి చెల్లుటను సంయుత ప్రాసమనబడును.

ఉదా : ఈ క్రిందటి రేఫలు సమ
మైత్ర్రాలుచుఁ దేవి ప్రాసమగు సంయుక్తం
బాక్రూర నక్ర భయమున
వాక్రువ్వదె గజము భక్తవత్సలుననఁగన్.

తెలుగు శబ్దములందు వట్రువసుడులుండవు. తెలుగనగా ఇందు అచ్చ తెలుగు. తత్సమేతర భాష. తత్సమములందు ఋకారము వట్రువ సుడికలదు. కృష్ణుడు, కృతవంటి పదములలోని వట్రుసుడితో, తెలుగు భాషా వ్యవహారమున సామ్యోచ్చారణము గల పదములు ఉకార రేఫ విశిష్టములగు 'క్రూరము, క్రుమ్మరు, క్రువ్వదె' వంటివి. ఉచ్చారణ మైత్రిని పురస్కరించుకొని 'కృ - క్రు' లకు ప్రాసమైత్రిని కూర్పరాదు. అందువల్ల వీని యొక్క భేదమును గురించి దేనికి దానితోనే ప్రాసవేయుటను అనంతుడు సంయుత ప్రాసమనినాడు. ఇందలి అంశములను గ్రహించి అప్పకవి రేఫయుత ప్రాసముగ ప్రత్యేకముగ ప్రాస భేదములు చెప్పెను.

ఈ నాటి వ్యవహారమున వట్రువసుడి గల వర్ణము, ఉకార రేఫగల వర్ణముగ ఉచ్చరింపబడుచున్నది. పిదప రెంటియొక్క వ్యత్యాసము తొలగిపోయి ఒకదానికొకటి తార్మారు చేసి వ్రాయుట ప్రాచుర్యమునొందినది (కృ - క్రు) బహుశః వీనియొక్క అభేదత్వము ప్రాచీన కాలము నుండియే యుండినట్లు తెలియుచున్నది. కాబట్టి వీని భేదాన్ని గుర్తించి ప్రాసయందు ఒకదానితో వేరొక దానికి మైత్రి కూర్పరాదని అనంతాదులు చెప్పియున్నారు.

## 14.12 సంధిగత ప్రాసము

ధ్రువముగ సంధిజనిత రూ
ప విశేష ప్రాసమనఁగఁ బరఁగు పకారం
బవిరళ వకార మగు న
య్యవ్వదాఆవ పాలెఉంగ ననఁగ ముకుందా!

ప్రాసస్థానమున సంధిగతమైన వ్యంజనమున్నచో దానికి మైత్రి కూర్పవలయునని యీ ప్రాసము చెప్పుచున్నది. వ్యాకరణ విశేషములను గుర్తించుటకే ప్రాస అత్యంత సహకారి. ప్రాసలో వ్యంజనము ప్రధానము కాబట్టి సంధియందు నిలిచిన ఆగమాదేశ వ్యంజనములకే ప్రాసమైత్రి పాటింపవలెను. దీనికి సంధిగత ప్రాసమని పేరు. సంధివలన కలిగిన వర్ణమునకు ప్రాస కూర్పబడును. కాన దీనికీ పేరు తగియున్నది.

సాధారణంగా జరుగునట్టి సరళాదేశ, గసడదవాదేశ, యడాగమ, కర్మధారయ సంధులలో వచ్చు ఆగమాదేశ వ్యంజనములకు, ప్రథమా విభక్తిపైన 'కచటతపలకు గసడదవలు' సంధి వశమున వచ్చును. వీనికి ప్రాసమైత్రిని కూర్చినచో దానిని సంధిగత ప్రాసమందురు.

ఉదా : వాఁడు గను వాఁడు సేకొను వాడు డెక్కు

లాఁడు వాఁడు దపోనిధి వాడు వెద్ద
చిక్కఁగరి మ్రొక్కఁజెవి వాక్కుఁ డక్కు వెట్టె
శౌరిఁ దలచె నిన్ బిలిచె నా సంధులిట్లు.

అచ్చునకు అచ్చు పరమైతే యకారము వచ్చును. సంధివశమున వచ్చినట్టి 'య' కారమునకు ప్రాసమైత్రి వేయవచ్చును.

వాఁడు - కను - వాఁడుగను; వాఁడు చేకొను - వాఁడు సేకొను
వాఁడు - టెక్కు - వాఁడుడెక్కు; వాఁడు తపోనిధి - వాఁడుదపోనిధి
వాఁడు - పెద్ద - వాఁడువెద్ద; చిక్కన్ - కరి - చిక్కఁగరి
మ్రొక్కె - చెవి - మ్రొక్కఁజెవి; టక్కు - పెట్టె - టక్కువెట్టె
శౌరి - తలచె - శౌరిఁదలచె; నిన్ - పిలిచె - నిన్‌బిలిచె
కఱకు - అగచరులు - కఱకుటగచరులు;
అక్కజపు - ఉదధి - అక్కజపుదధి - అక్కజపుటుదధి.
రాజు - ఆనతి - రాజునానతి - ఇత్యాదులన్నిట సంధివశమున ఏర్పడిన వ్యంజనముతో ప్రాసమైత్రిని కూర్చిన యెడల దానిని సంధిగత ప్రాసమందురు.

## 14.13 షడ్విధ ప్రాసములు

ఇంత వరకు తెలుగు పద్యములలో నియతముగా ఉండదగిన ద్వితీయాక్షర సామ్యరూపమగు ప్రాసమును తద్భేదములను వివరించడమైనది. ఇక పద్యరచనలో అలంకార ప్రాయములును, ఐచ్ఛికములునగు శబ్దాలంకారప్రాస విశేషాలను షడ్విధప్రాసల రూపమున చెప్పబడుచున్నది. ఇక్కడ చెప్పబడు షడ్విధప్రాసములలో అనుప్రాసము తప్ప తక్కినవి అలంకార ప్రోక్తములు కావు. శబ్దాలంకార ప్రాసములు కవి యిచ్ఛానుసారముగా ప్రయుక్తములగును. శబ్దశోభను కలిగించునవి శబ్దాలంకారములు. అనుప్రాసాదులు శబ్దాలంకారములని అలంకారికోక్తి. అనంతునిచే చెప్పబడిన షడ్విధప్రాసలలో ఒక్క అనుప్రాసము తప్ప తక్కినవి అలంకార శాస్త్ర ప్రోక్తములు కావు. అనంతుడు చెప్పిన షడ్విధప్రాసలివి.

1. దుష్కర ప్రాసము; 2. ద్వంద్వ ప్రాసము; 3. త్రిప్రాసము; 4. చతుష్ప్రాసము; 5. అంత్యప్రాసము; 6. అనుప్రాసము.

**14.13.1 దుష్కర ప్రాసము :** సుకరము కానివి. సులభముగా సిద్ధింపనివి. బహు ప్రయత్న సాధ్యములగు సంయుక్తాది వర్ణములతోడి కూడిన ప్రాసను దుష్కరప్రాసమనబడును ఉదా: ష్క; జ్ఞ; స్త్ర; ఃక, ఃఖ, ఃఫ ఇత్యాది వర్ణములతో ప్రాసవేయుట దుష్కరప్రాసమగును.

ఉదా : దోః క్లీలిత మణి కటక యు
రః కలిత రమాభిరామ రంజిత సుజనాం
తః కరణ ఖండితారిశి
రః కందుక యనఁగ దుష్కర ప్రాసమగున్

ఈ పద్యంలో విసర్గముతోడి కవర్ణము ప్రాస స్థానమున నున్నది. ఇట్లు విసర్గ పూర్వకమైన కకారము సహజముగానే ఏ పదము నందును సన్నిహితమై ఉండదు. ప్రయత్న పూర్వకముగా రెండు పదములకు సన్నికర్ష కల్పించి విసర్గముతోడి క వర్ణమును సాధించుట పైన కన్పించుచున్నది. ఇట్లు దుష్కరముగా ఉండు వర్ణ సముదాయమును ప్రాసమునందు నిల్పుటచే నిది దుష్కర ప్రాసమైనది.

**14.13.2. ద్వంద్వ ప్రాసము :** అన్ని పాదముల యందు రెండవ, మూడవ యక్షరములు (రెండక్షరములు) సమముగా నుండు ప్రాస. ఇందు ప్రాసాక్షరమును దాని తర్వాతి అక్షరమును నాల్గు పాదములు సమముగా నుండవలెను. దీనికి ద్విప్రాసమని నామాంతరము.

ఉదా : కం జనయన భవభీతి వి
భంజన శుకశౌనకాది బహుముని చేతో
రంజన ద్వంద్వ ప్రాస మ
నంజన నిప్పాటఁ బల్కినం గృతులందున్

ఈ పద్యములో ప్రాస స్థానమునందు 'ంజ' అను అక్షరముతో పాటు 'న' వర్ణము కూడ నున్నది. అనగా ప్రాసస్థానమునుండి రెండక్షరములు పాదమున సమానములై వ్యవహరించుచున్నది.

ప్రాసమునందు వ్యంజనాక్షరము ప్రధానము. స్వరము మారుచుండును. కావుననే నాల్గుపాదముల యందు 'ంజన' అను శబ్దములు వాడబడినవి. కావుననే నిది ద్వంద్వ ప్రాసమైనది.

**14.13.3. త్రిప్రాసము :**

ప్రతి పాదమునందును 2, 3, 4 అక్షరములు సమముగా నుండు ప్రాసను త్రిప్రాసమందురు.

ఉదా : తా నవనీత ప్రియుఁడన
దానవనిర్మూలనైక తత్పరుఁడన స
న్మౌనివినుతుఁడన నతసుర
ధేనువనం గృతుల యందు ద్రి ప్రాసమగున్

ఈ పద్యంలో ప్రాసమునందు వరుసగ 'నవనీ' - 'నవని' - 'ని విను' 'నువన'. అని ఉండి మూడక్షరముల సామ్యమును చూపుచున్నవి. కావున దీనిని త్రిప్రాసమని యందురు. అనగా ప్రతిపాదమునందును రెండవ - మూడవ - నాల్గవ అక్షరములు వరుసగా ప్రాసమైత్రిని కలిగి ఉన్నందున ఇది త్రిప్రాసమైనది.

**14.13.4. చతుష్ప్రాసము :** నాల్గక్షరములు ప్రతిపాదమున సమముగానుండు ప్రాసం అనగా 2, 3, 4, 5 అక్షరములు సమముగా నాల్గు పాదములలో ఉండుటను చతుష్ప్రాసమనబడును.

'వారణవరద నిశాట వి

దారణ వీరావతార ధరణీ వలయో

ద్ధారణ విరచిత సత్యవ

దూరణ వర జయ యనం జతుష్ప్రాసమగున్.

ఇందులో నాల్గు పాదములలోను 2, 3, 4, 5 (రణవర) వర్ణములు నాలుగు సమముగా కూర్పబడియున్నవి. ఇవి వరుసగా ప్రాసమైత్రిని కలిగి ఉన్నవి.

**14.13.5. అంత్య ప్రాసము :** ప్రతి పాదమున చివరి వర్ణములకు సామ్యముగల ప్రాసను అంత్యప్రాసమందురు.

అగణిత విభవ స్ఫూర్తీ!
నిగమాగమ సతత వినుత నిర్మల మూర్తీ!
జగదభిరక్షణ వర్తీ!
యగు నంత్యప్రాస మిట్లు దంచిత కీర్తీ!

పాదాంత్యమున నున్న అక్షరమే యితర పాదాంత్యములందు వచ్చిన యెడల అంత్య ప్రాసమనిపించుకొనును. ప్రథమ పాదాంతమున 'స్ఫూర్తీ' అనియు, రెండవ పాదాంతమున 'మూర్తీ' అనియు, మూడవ పాదాంతమున 'వర్తీ' అనియు, నాల్గవ పాదాంతమున 'కీర్తీ' అని వాడబడినది కాబట్టి ఇది అంత్య ప్రాసమునకుదాహరణమైనది.

**14.13.6. అనుప్రాసము :** ఒక్క అక్షరము మొదటి నుండి చివరి వరకు పెక్కుసారులు వెంబడి ఆవృత్తి చేయుటను అనుప్రాసమందురు.

ఉదా : విప్ర ప్రకరముని ప్రీ
తిప్రద సుప్రభవ య ప్రతిమదోః ప్రభవా
విప్రణుత సుప్రసన్న య
ను ప్రాస ప్రవణ మిది మను ప్రియచరితా!

పై పద్యమున ప్రాసస్థానమునందు 'ప్ర' అను సంయుక్తాక్షరమున్నది. అది ప్రాసమునందే కాక, యితర స్థానములందును బహు పర్యాయములు ఆవృత్తినందినది. ఇట్లొక అక్షరము పెక్కుపర్యాయములు వాడబడిన యెడల అనుప్రాసమగును.

ఇందు అనుప్రాసమొక్కటే అలంకార శాస్త్రములో చెప్పబడినది అంత్య - అనుప్రాసమందొక్క దానియందు మాత్రము వ్యంజనములయు, వానిమీద స్వరములయు సామ్యమావశ్యకమగును.

పాఠం - 15

## ఛందోదర్పణము - ప్రథమాశ్వాసము

# యతి ప్రకరణము

ఆచార్య నేతి అనంతరామశాస్త్రి

### 15.0. ఉపోద్ఘాతము

'యతిర్విచ్ఛేదసంజ్ఞకః' - అని సంస్కృత వృత్తరత్నాకర నిర్వచనము. విచ్ఛేదకమంటే పదచ్ఛేదము. పద్యంలోని ప్రతిపాదానికి యతిస్థానముంటుంది. అక్కడ పదవిచ్ఛేదము కావాలి. పదమధ్యంలో యతిరాదు. యతిస్థానంలో అట్టి పదచ్ఛేదము లేకపోలేదు సంస్కృతంలో యతిభంగ దోషంకలుగుతుందని లాక్షణికులు శాసించారు. సంస్కృతంలో యతి స్థానం పదవిచ్ఛేదం ఉంటే సరిపోతుంది. కాని తెలుగులో యతిస్థానమందు పాదాద్యక్షరమైత్రి ఉండాలి. అనంతుని ఛందస్సులో ఈ యతిని గురించి ఇట్లాచెప్పాడు.

ఎన్నిట యతి రావలెనని
రన్నిట సంస్కృతమునందు నగువిచ్ఛేదం
బెన్నిట యతి రావలెనని
రన్నిటఁ దెలుగునకు మొదలి యక్షరమమరున్ - ఛందో - 1-129

సంస్కృత వృత్తాలను తెలుగులో ఉపయోగించేటప్పుడు సంస్కృతంలో ఎన్నోవచోటయతి చెప్పబడిందో తెలుగులో అక్కడ పాదాద్యక్షరాన్ని నిలుపవలెను.

అనంతుడు 'యతి, వడి' పర్యాయపదాలుగా వాడాడు. అంతేగాక విరతి-విశ్రాంతి -విరామము - విశ్రమము - విశ్రామము - విరమము - అని యతికి పర్యాయపదాలు పేర్కొన్నాడు.

### 15.1. యతిభేదాలు :

యతులను ఐదువిధాలుగా విభజించెను. 1 స్వరయతులు 2. వర్గయతులు 3. సరసయతులు 4. సంయుక్త యతులు. 5. ప్రత్యేకయతులు. వీనిలోని అంతర్భేదములు క్రింద తెలుపబడును. ఈ ఐదు సామాన్య యతిభేదాలలోని అంతర్భేదాలన్నీ కలిపి 24 యతి భేదములుగ అనంతుడు నిరూపించెను.

1. స్వరయతి 2. గూఢ స్వరయతి 3. ఋకారస్వరూపయతి. 4. రీవిరమము 5. ఇకార విరతి 6. ప్రాదియతి. 7. కాకుస్వరయతి 8. నిత్యసమాసయతి 9. నిత్యయతి 10. వర్గయతి 11. పోలికవడి 12. సరసయతి 13. సంయుక్తయతి 14. తద్భవవ్యాజయతి 15. రేఫయుతయతి 16. అనుస్వారయతి. 17. మకారయతి 18. ఎక్కటియతి 19. ప్రభునామాంతరయతి 20. విభాగయతి 21. భిన్నయతి 22. వికల్పయతి 23. యుక్తవికల్పయతి 24. అభేవిరతి - వీటికిచ్చిన లక్ష్య లక్షణములను పరికిద్దాం.

### 15.2. స్వరయతి :

ఆ.వె. అగునకారమునకు నైత్వౌత్వములు వడి
ఈ కి ఋత్వమునకు నేత్వమమరు

నుత్వమునకు నోత్వ మొనరు నీగతి స్వర
యతులు విస్తరిల్లు నబ్జనాభ!

స్వరముల యొక్క మైత్రి చెప్పబడుటచే నివి స్వరయతులైనవి. (1) అ ఆ ఐ ఔ (2) ఇ ఈ ఋ ౠ ఎ ఏ (3) ఉ ఊ ఒ ఓ - అనే మూడు వర్గల్లోని అచ్చులు తమలో తాము మైత్రిని పొందుతాయి. ఈ వర్గము అన్యోన్యము మిత్రములు కావు. ఇది ప్రధాన యతి భేదక సూత్రం. దీనిపై ఆధారపడి యతులన్నీ నిర్మింపబడ్డాయి. ఇందలి మూడు వర్గాలైన మైత్రీభేదాలు భాషాశాస్త్ర సమ్మతములవడంచేత ఈ త్రివర్గాన్ని గూర్చి లాక్షణికాభిప్రాయములందు భేదము లేదు.

ఇందలి అ ఆ ప్రభృతులైన జంటవర్ణాలు ఒకేస్వరము యొక్క హ్రస్వదీర్ఘాలవటంచేత ఒక దానికి మైత్రి చెప్పిన మిగిలిన దానికి చెల్లునని తెలుస్తుంది. ఈ విషయాన్నే అనంతుడు ఈ విధంగా చెప్పాడు. "స్వరములు దీర్ఘము హ్రస్వము - నరయంగా నొక్కవిధమెన్న యతులకు" ఐ - ఔ లు ఒక్కొక్కటియు రెండు భిన్నస్వరాలు కూడికచే ఏర్పడునట్టిది.

(1) అకారయతి : అ ఆ ఐ ఔ లు ఒక వర్గానికి చెంది పరస్పరం మిత్రాలవుతాయి, అకారము కంఠస్థాన జన్యము. ఐకార - ఔకారములు క్రమంగా అ, ఇ, ఉ లను స్వరద్వయంచే ఏర్పడేటువంటి గురుస్వరాలు. ఐన - అయిన; ఐదు - అయిదు; ఔర - అవుర, ఔను - అవును అనే రూపద్వయాలు లాక్షణిక సమ్మతాలు. ఐ ఔ ల ఉచ్చారణమునందు ప్రథమోచ్చారణముగల అకారస్వరము కంఠ్యమై గురుతరమైనట్లును అనంతరోచ్చారణముగల ఇ - ఉ లు క్రమంగా తాలవ్యము; ఓష్ఠ్యము అయి లఘుతరమైనట్లును, పై రూపాలను బట్టి గ్రహింపవచ్చును. ఈ కారణాలచేత ఐ ఔలు అకారానికి సన్నిహితోచ్చారణము కలవియై అ ఆ ఐ ఔ లు యతిమైత్రి చెల్లుతున్నవి.

ఉదా : 1. అగు నకారముకు నైత్వౌత్వములువడి ఇక్కడ 'అ' - 'ఔ'లకు యతిచెల్లింది.

(2) ఆదిగర్భేశ్వరుండౌట అనుచితంబు - (కాశీ 4.200)
ఇక్కడ 'ఆ' - 'ఔ' ల'కు మైత్రి చెల్లింది.

2. ఇత్వవళి : ఇ, ఈ, ఋ, ౠ, ఎ, ఏ లు కవర్గానికి చెంది పరస్పరము మిత్రములగును. ఇ ఈ ఎ ఏ లు తాలవ్యములు. ఋ - ౠ మూర్ధన్యములు. ఎకారము అకార ఇకార సంయోగము (గుణము)చే ఏర్పడి కంఠతాలవ్యమయ్యును తాలవ్యోచ్చారణము గురుత్వముచే తాలవ్యమే అగుచున్నది. ఉదా : **గృ**హము - **గీ**ము; **హృ**దయము - **ఎ**ద మొదలగు తద్భవములందు ఋకారము ఇ - ఎల రూపము నొందుచున్నది - ఈ విధమైన ఉచ్చారణమైత్రిచే ఇ ఈ ఋ, ౠ, ఎ ఏ లు యతికి మిత్రములగుచున్నవి.

ఉదా : **ఈ** కి ఋత్వమునకు **నే**త్వమమరు
**ఈ** శ్వర ద్రోహిగర్వాంధ **ఋ**షి వరేణ్య (కాశీ 7.95)

3. ఉద్విరామము : ఉ, ఊ ఒ ఓ లు ఒక వర్గము. ఈ నాల్గు స్వరములు ఓష్ఠస్థాన జనితములు. ఒకారము అకార ఉకార సంయోగము (గుణము) చే ఏర్పడి కంఠోష్ఠ్యమయ్యును ఓష్ఠ్యోచ్చారణ గురుత్వముచే ఓష్ఠ్యమే అగుచున్నది. ఈ నాల్గు వర్ణములు ఉచ్చారణ సామ్యముచే యతికి మిత్రములగుచున్నవి.

ఉదా : ఉత్వమునకు నోత్వ మొనరు నీగతి స్వర.
ఉరగరాజ శాయి ఊర్ధ్వ విష్ణ పదాయి

అ ఆ ఐ ఔ లు అవర్గముగను; ఇ ఈ ఋ ౠ ఎ ఏ లు, ఇవర్గముగను, ఉ ఊ ఒ ఓ లు ఉవర్గముగను స్వీకరించి అవర్గయతి, ఇవర్గయతి; ఉవర్గయతి అను శీర్షికలనుంచుట సమంజసము.

## 15.3. గూఢస్వరయతి :

స్వరము తుద నుండి లుప్త విసర్గకోత్వ
మైన స్వర విరామంబు **దాసో** **ఉ**హమనఁగ
నచ్యుతాశ్రితు లుర్వి నన్యోన్య మిత్రు
లనఁగ నమ్మకుందుండు **యశో** **ఉ**ర్థి యనఁగ

సంస్కృత భాషయందు 'అస్' అంతమైన శబ్దానికి హ్రస్వమగు అకారము పరమైతే ఆరెండింటికీ చేరి ఓకారమాదేశమౌతుంది. దీనిని అనంతుడు గూఢస్వరయతి అని పేర్కొన్నాడు. ఇక్కడ చూపిన లక్ష్యాన్ని బట్టి 'దాసో ఉహమ్; **అన్యోన్య; యశో ఉ**ర్థి' ఇత్యాది పదాల్లో ఈ యతి చెల్లుబడి అగునని తెలుస్తున్నది.

అన్యోన్య శబ్దమునందలి పూర్వపదము సకారంతముకాదు.

ఇట్టి పదసంధులలో అత్తు పరమగుటయు పూర్వమున ఓత్వమాదేశమగుటయు అప్పుడా అత్తునకు లోపమగుటయు జరుగుటవల్ల సంస్కృత వ్యాకరణమునందు వీని యొక్కపూర్వ పదాలకు సుడాగమము విధింపబడింది. కాగా 'అన్యోన్య' శబ్దము నందలి పూర్వపదము స్ (ః) అంతములగుచున్నవి.

'అస్' అంతపదాలకు సంధిలో విసర్గలోపించగా ఓత్వమాదేశమైన యెడల స్వరవిరామము పాటించాలని పైలక్షణం చెప్తున్నది.

| | |
|---|---|
| దాసః + అహమ్ | దాసో ఉమ్ |
| అన్య + అన్య | అన్యోన్య (వ్యాకరణ విధిచేత అన్యః + అన్య) |
| యశః + అర్థి | యశో ఉర్థి |

ఈ సంధి నిఘటితమైన పదాలయందు స్వరయతి పాటింపవలెనని నిర్దేశింపబడింది. అంటే పరస్వరానికి మైత్రికూర్చుట. ఈ పదాల యందు పరపదాది హ్రస్వ అకారమునకు మైత్రిచెల్లింది. దీన్నే అప్పకవి 'లుప్తవిసర్గక స్వరవళి' అని పేర్కొనెను కాని దానికంటె అనంతుడు చెప్పినది కొంత అనురూపముగానున్నది.

ఇక్కడ ఓత్వమాదేశమయినపుడు సంధియందు గూఢముగానున్న (లోపించిన) పరపదాది స్వరానికి మైత్రిపాటింపబడుటచే దీనిని గూఢస్వరయాలియనుట యుక్తము.

**ఋకారస్వరరూపయతి :**

క్షితి ఋకార రూప స్వరయతులు పరఁగు
ఋ గ్యజు స్సామ వినుతుండు కృష్ణుఁడనగ
వృష్ణి కులజుండు కరుణా సమృద్ధుఁడనఁగ
హేమ పీతాంబరుఁడు దేవ వృషభుఁడనఁగ

ఋత్వము యొక్క సంబంధముచే మైత్రి చెప్పబడుటచే ఋకార స్వరూపయతి అగుచున్నది.

కేవల ఋకార, ౠకారంబులు కకారము మొదలగు హల్లులతో చేరిన వట్రువసుడులన్నింటికిని చెల్లును. ఇ, ఈ, ఋ, ౠ, ఎ, ఏ అను ఈ అచ్చులతో కూడిన హకార యకారములు వట్రువ సుడితో మైత్రినొందును.

ఈ పద్యంలో రెండవ పాదమున ఋ కారమునకును కకారము మీది వట్రువసుడికిని యతి చెప్పబడెను. మూడవపాదమున వకారము మీద నున్న వట్రువ సుడికిని మకారము మీది వట్రువ సుడికిని యతి చెప్పబడింది. నాల్గవపాదమందు 'హే'యను చోట హకారము మీద నున్న 'ఏ'కారమునకు 'వృషభ' అనుచోటనున్న వకారము మీది వట్రువసుడితో యతిచెల్లును. దీనినే ఋకారస్వర రూపయతి యని చెప్పబడింది.

స్వరయతులలో ఋ కారమునకు ఇ కారవర్గముతో మైత్రి కలదు. కకారాదులు పై గల వట్రువ సుడికి (కృ - గృ) ఇ ఈ ఋ ౠ ఏ ఏ లు మిత్రములని ఈ యతి నిర్దేశిస్తున్నది. మరియు ముందు చెప్పబోవు సరసయతి ప్రకారం అకారస్వరంతో య - హ లకు మైత్రి చెల్లును. ఈ కారణంచే ఇకారవర్గ విశిష్ఠములైన య - హ లకును ఋ కారముతో మైత్రికలదని ఈ వళి చెప్తున్నది. అంటే ఇ - ఈ - ఋ - ౠ - ఎ - ఏ లు కృ గృ ఇత్యాదులు, యి, యీ, యృ యౄ, యె, యే లు హి, హీ, హృ, హౄ, హె, హే లు పరస్పరము మిత్రములు. ఇతర వర్ణముల యొక్క ప్రమేయము లేకయే ఋకారముయొక్క సంబంధము చేత ఇవన్నియు యతిమైత్రినందుచున్నవి.

ఋత్వము (వట్టసుడి) యొక్క సామ్యంవల్ల ఇందుమైత్రి చెప్పబడుతున్నది. అంటే పాదాదియందును యతిస్థానమందును వట్రుసుడితో కూడియున్న రెండు వ్యంజనములు, వ్యంజనమైత్రి లేకయే యతిచెల్లును.

ఋ కారము ర వర్ణతుల్యము అనగా వ్యంజనత్వముకలది. సంయుక్త విశ్రమముచే సంయుక్తాక్షరములందొక హల్లునకు మైత్రి చెల్లించిన యతిపాటించినట్లే అగుచున్నది. ఈ కారణాన్ని పురస్కరించుకొని ఋత్వవిశిష్టములైన వ్యంజనములన్నియు యతికి మిత్రములనెడి సంప్రదాయ మేర్పడి ఉండును.

L^¥: **గృ**హసమ్మార్జనమో జలాహరణమో **శృం**గారపల్యంకికా (ఆము. 2.91)

అనంతుడు చెప్పిన ఋకారస్వరూపయతిని అప్పకవి ఋత్వ సంబంధ, ఋత్వసామ్యవళులని రెండు విధములుగా చెప్పెను. ఇక్కడ అనంతునిది సంక్షేపదృష్టి.

## 15.5 రీవిరమణము :

విలస ద్రికారమును వ [ద్ర] - పాఠాంతరం.
త్రిల రీవిరమంబు శౌరి ఋషులకు శశ్వ
త్సులభుఁడనఁగ నీ యేలకుఁ
దలఁప ఁగ రీతోడి విరతి తలకొన దెందున్

ఇకార యుక్తరేఫమునకును ఋకారమునకును యతి చెల్లుటను రీవిరమమందురు. రి - రీ - రె - రే లకు ఋ చెల్లును. పై పద్యంలో రెండవ పాదమున రి - ఋ లకు యతి ఘటింప బడింది.

ఇ ఈ ఎ ఏ లతో కూడిన రేఫము (రి రీ రె రే ) కేవల ఋకారమునకును, హల్లుతోకూడియున్న ఋకారము (వట్రుసుడి)నకును యతి మైత్రినందును. ఇక్కడ వట్రుసుడిని కలిగి యున్న హల్లుతో ప్రమేయములేదు. ఏహల్లైనను కావచ్చును. రేఫము సంయుక్తాక్షర గతమై కూడ ఉండవచ్చును.

ఉదా : **ఋత్వి**జుండని విచారించి పూజించితే (సభా 2.11)

ఋ-ర వర్ణములు మూర్ధన్యములు. ఋ కారము రేఫతుల్యము. ఉచ్చారణ సామ్యముచేత ఋక్షము - రిక్కవంటి తద్భవరూపములలోను; పితృ + ఆర్జితము ⟶ పిత్రార్జితము వంటి యణాదేశసంధులలోను ఋకారము రేఫముగా మారుచున్నది. ఇంకా అనంతుడు ఇట్లా రీవిరమమును గూర్చి చెప్పాడు.

తెల్లముగ ఋకారము యణాదేశశక్తిఁ
గలుగు రేఫయిత్వము నందుఁగదిసి యతికి
నట్టి రీకి నీయేలతో నన్వయించు
నట్టి సత్త్వంబు లేదది హల్లుగాన

రేఫము హల్లగుటచేత సహజమైన ఇఎ లతో మైత్రి ఒప్పదని చెప్తున్నాడు

## 15.6. ఇకారవిరతి :

(1) మును ఋకార మీ యేలతో నొనరినట్లు
చేర దొకట యణాదేశ కారణమున
ఘన లకారంబ యగును ఌకారవిరతి
క్లుప్తి లేదు శౌరిగుణావళికి ననంగ.

ఋకారము ఇత్వ ఏత్వయుత రేఫముతో యతి మైత్రినందినట్లు ఇకారము ఇత్వాది విశిష్టలకార ళకారములతో యతిమైత్రి నందును. ఇక్కడ నాల్గవ పాదమున '...-ళి' యతి మైత్రిపొందింది.

ఋకారముఌ ..కారము కేవలం ఇ ఈ ఋ ౠ లతో చేరదు. యణాదేశాన్ని బట్టి .... ఌకారము లకారమవుతుంది. కావున ఇ - ఈ - ఎ - ఏ లు ఋవర్ణముతోడి ల (ళ - డ) కారము లతోయతి యగును.

(2) స్వరములు కాదుల నొందిన
నరుదుగ స్వరయతులు దగును బ్రాదులు గాకు
స్వరమును నిత్య సమాసా
క్షర సంధులు రెండు నగు భుజంగమ శయనా!
ప్రాదినిత్యసమాస శబ్దములు గాక
పెర పదంబులపైనచ్చు బెరసినప్పు
డన్నియును స్వరయతులగు సాంబగురుడు
శ్రీశుఁడ మరాన్వయాబ్ధి పూర్ణేందుఁడనఁగ

అచ్చులు కాది హల్లులతో సంధియైన కేవలస్వరయతులగును. అనంతుడు దీన్నొక యతి భేదముగా చెప్పక పోయినప్పటికీ ఒక లాక్షిణికసూత్రమువలె లక్ష్యసమన్వితంగా రచించాడు. అప్పకవి దీనినొక ప్రత్యేక యతిగా పేర్కొని "స్వరప్రధానవళి' అని పేరు పెట్టినాడు

అవ్యవహి తోచ్చారణముగల రెండు పదాలమధ్య సంధి జరుగుతుంది. అట్టి పూర్వ పరస్వరాలకు జరిగిన సంధిని స్వర సంధి అంటారు. సాధారణంగా జరుగు ఇటువంటి స్వరసంధుల్లో పరపదాది స్వరానికి యతి మైత్రి కూర్చవచ్చును.

వంశ + అబ్ది → వంశాబ్ది వంటి సంధికార్యాలు జరిగినపుడు ఆ సంధ్యక్షరము యతి స్థానమైతే, ఉత్తరపదాద్యచ్చు (అ) నకే యతి మైత్రి కూర్పవలెనని యీవడి చెప్తున్నది. ఇట్టి స్వర సంధులందు పరస్పరమునకే మైత్రిపాటింపవలెను. కాని వ్యంజనము (శ) నకు కూర్పరాదు. ఈ స్వర సంధియతిస్థానమందే కాక పాదాదియందు వచ్చినప్పటికీ ఈ నియమాన్నే పాటించాలి.

ప్ర మున్నగు ఉపసర్గలు, నిత్యసమాసాదులును తప్ప మిగిలిన పదాలు అచ్చుతో సంధియైనపుడు కేవలం స్వరాలకే యతి మైత్రి కలుగుతుంది.

ఉదా : "శ్రీశుఁడ మరాన్వయాబ్ధి పూర్ణేందుఁడనఁగ"

స్వరయతులందు ఈ లక్షణాన్ని లాక్షణికులందరూ చెప్పినప్పటికీ అనంతుని లక్షణాన్ని ఆధారంగా చేసుకొని ఉభయయతి యొక్క ప్రయోగాన్ని పరిమితము చేసి స్వరమైత్రివళిని విస్తృతపరచటానికి ఈ మైత్రీ భేదాన్ని అప్పకవి చెప్పియుండవచ్చును.
ఉపసర్గలు

## 15.7. ప్రాదియతి :

ధర నుసర్గలు ప్రాన్వవ
దురపాభిప్రతి సువిన్యు దుపర్యధిసమ్
నిరతి పరాజపులిరువది,
పరాజపులు చొరవు తెలుఁగు బాసను నెందున్.

సంస్కృతంలో : ప్ర, అను, అవ, దుర్, అప, అభి, ప్రతి, సు,వి,ని, ఉత్ ఉప, పరి, అభి, సమ్, నిర్, అతి, పరా, ఆజ్, అపి - అనేవి 20 ఉపసర్గలు. ప్రమొదలగునవి కాబట్టి ప్రాదులయినవి. ఇవి సహజంగా ప్రయోగ యోగ్యములు కావు. అవి ధాతువులతో కూడియే ప్రయోగింపబడతాయి. ఉపసర్గలు అజాది పదాలతో సంధించినప్పుడు ఉభయయతి చెల్లును. వీనిలో పరా, ఆజ్, అపి అన్నవికాక మిగిలిన 17ను పరస్పరము సంధియైనపుడు స్వరయతి యైనను, వ్యంజన యతియైనను యతిని పాటింపవచ్చును.

వీనికుదాహరణము :

ఉ॥ ప్రాంతనిరంతరాన్విత దురంత సమస్తపరాక్రమంబున
త్యంత మదాప్తిశోభన మపాయముపాయము వీక్షణంబు ప్ర
త్యంత మభీష్టమధ్యయము స్వాంతము నీతముదంచితంబుప
ర్యంత మనంగ సంధిలుఁ దిరంబుగ రెంటను బ్రాదులచ్యుతా !

మొదటి పాదంలోని ప్ర + అంత - ప్రాంత దుర్ + అంత - దురంత (స్వరమైత్రి)
రెండవ పాదంలోని అతి + అంత - అత్యంత - అప + అయ - అపాయ (స్వరమైత్రి)
నాల్గవ పాదంలోని పరి + అంత - పర్యంత - తిరంబుగ (వ్యంజనమైత్రి)
ప్రయోగ బాహుళ్యముగల యతులలో ప్రాదియతి ఒకటి, లాక్షణికులందరు దీన్ని గురించి చెప్పారు.

## 15.8. కాకుస్వరయతి :

కాకుస్వరయతి యగు నిత
డే కదలక జలధిఁ బవ్వళించె ననఁగఁ బ్ర

శ్వాకలిత దీర్ఘమగు నితఁ
డే ! కవ్వడి రథముఁ గడపె నిమ్ముల ననఁగన్.

నాలుగవపాదమున : పూర్వమున ప్రశ్నార్థకము. ఉత్తరమున ఏవకారార్థము,
రెండవ పాదమున : ళ-డ లకభేదయతి.

శోకభయాదులవల్ల కలుగు ధ్వని వికారాన్ని కాకువు అంటారు. ఇది స్వరగతమైయుండి దీర్ఘతరముగ ఉండును. ఇది కాకు స్వరయుతమగు అక్షరానికి ఉభయయతి చెల్లుతుంది. ఈ పద్యంలో అతడే అను శబ్దమునందలి 'డే' అను శబ్దమునందలి 'డ' కారానికి 'పవ్వళించె'లోని 'ళ' కారానికి యతివేయడం జరిగింది. ప్రశ్నార్థకంగాను, ఆశ్చర్యార్థకంగాను, సంబోధనార్థకంగాను కాకుస్వరయతి ఒప్పుచుండును. పై పద్యంలో కాకువు ఆశ్చర్యార్థకాన్ని సూచిస్తున్నది. నాల్గవపద్యంలో ప్రశ్నార్థక కాకువు ఉంది.

అప్పకవి యీ యతికి కాకుస్వరవళి, ప్లుతవళి అను రెండు పేర్లు పెట్టెను.

అనంతుడిచ్చిన మరొకలక్ష్యము :
వరుస దీర్ఘాంతసంబుద్ధి వచనయతుల
కమరుఁ గా కుస్వరం బుపరమఁ సహస్ర
నామశోభిత గోప కృష్ణాయనంగ
నమరవందిత గోపకృష్ణా యనంగ

ఈ పద్యంలో సంబోధన దీర్ఘాంత, కాకుస్వరయతిని చెప్తున్నాడు. మూడవపాదమున 'నా' - 'ష్ణా' -లకుయతి. హల్లులమైత్రి. నాల్గవ పాదమున 'అమర - ష్ణా' అకారమునకు సంబుద్ధి దీర్ఘాకారమునకు యతి. అచ్చులమైత్రి.

## 15.9. నిత్యసమాస యతి :

పదము విభజించి చెప్పఁ జొప్పడని యవియు
నన్యశబ్దంబుఁగొని విగ్రహంబుఁజెప్పు
నవియు నిత్యసమాసమై యతిశయిల్లు
నట్టి సంధుల నచ్చు హల్లైన విరతి.

రెండు పదాలుచేరి ఒక్కపదమైనట్లుండి పదవిభాగము చేయటానికి యుక్తముకాని చోటను, ఆ స్వపద విగ్రహ సమాసమునందును అచ్చులతోఁగాని హల్లులతో గాని యతి చెల్లునని అభిప్రాయము.

స్వర సంధి ఉండియు పదాలను వేర్పరుపరాని శబ్దములందు ఉభయయతి చెల్లుటను నిత్యసమాసయతి అందురు.

ఒకే సమాసమున స్వరసంధిచేత రెండు శబ్దాలు కూర్పబడియు వేర్పాటు చేయవీలుగాక, ఏకశబ్దము వలె భాసించునట్టివి నిత్యసమాసములు. అట్టివాని సంధ్యక్షరమున కుభయయతి చెల్లును. ఇదియే నిత్యసమాసయతి లేక అఖండయతి.

కర్ణాట, వనౌక, ద్వీప, అంతరీప, నాస్తి, పదార్థ అనేక, జనార్దన, నాక, అనంత, నారాయణ, రసాయన మొదలైనవి నిత్యసమాసాలు.

ఉదా : నాస్తి యనక మహి ననంత సంపదలు నా

రాయణుం డొసంగు రమ్య మగుర
సాయనంబు బుధుల కత డన్న నిత్యస
మాస యతులు రెంట నంటియుండు

నాస్తి, నారాయణ, రసాయన, సమాస - ఇత్యాది శబ్దాలు నిత్య సమాసాలు. వీనికి స్వరముగాని, వ్యంజనముగాని యతిమైత్రి చేయనగు. పై పద్యమున నిత్యసమాస శబ్దములకు మొదటి రెండు పాదాల్లో వ్యంజనమైత్రియు, తక్కిన రెండు పాదాల్లో స్వరమైత్రియు ఘటింపబడినది. మొదటి పాదమున స్వరమైత్రి అనియుగ్రహింపదగు, నిత్యసమాసములందన్నిట స్వర సంధి ఉండియు, పదములను వేరుచేయలేనట్టివి అగుటచే ఇట్టిచోట్ల పూర్వవ్యంజనమునకే గాని, పరస్వరమునకేని యతి చెల్లింపదగును.

అనంతుడును నిత్యసమాసయతిపేర అఖండయతి అనిపేర్కొనెను. అఖండములుగా స్వీకరించు శబ్దములందు కూర్చెడి వ్యంజనమైత్రియే అఖండయతి అని ఆర్వాచీనుల అభిప్రాయం.

**"అవిగ్రహో అస్వపద విగ్రహోవా నిత్యసమాసః"**- అనెడి వ్యాకరణ సూత్రాన్ని అనంతుడు గ్రహించి నిత్యసమాసయతికి లక్షణాన్ని వ్రాసెను. అంటే విగ్రహవాక్యము లేనట్టిదియు, సమాసపదాలతో కాక భిన్న పదాలతో విగ్రహవాక్యము కలదియునైనట్టివి నిత్య సమాసాలు. అట్టి సమాసపదములయొక్క సంధులలో అచ్చునకు గాని, హల్లునకుగాని మైత్రి కూర్పదగునని అనంతుడు వ్యాకరణ సూత్రముననుసరించి చెప్పుట సముచితముగా నున్నది. ఈ యతి బహుళ ప్రసిద్ధి దగుటచేత లాక్షణికు లెల్లరు వచించిరి.

**ఉదా** : అఱయనంగను బోవుట కర్థమైన సంధి నిత్య సమంసోక్తి జరగురెంట నసుర వీరుల నెల్లనుక్క ఆ వధించె బానుకులుఁడ రావణుని నెపటి చెన్యఁగ

'అఱు' ధాతువు పరము కాగా దేశ్య శబ్దములయందు ఉభయయతి చెల్లునని, చెప్పబడింది.

మూడవపాదంలో : 'అ' 'ఉ' లకు; యతిమైత్రి చెల్లింది.

## 15.10. నిత్యయతి :

ఏనియను పదంబుతో నాదిపద మంది
సంధి నిత్యయతుల జరుగుచుండు
నెట్టిక్రూరకర్ముడేని సద్గతి నొందు
నిన్ను నాత్మఁదలఁచెనేని కృష్ణ !

ఏని శబ్దంబుతో సంధి గూడిన వర్ణంబున కుభయ యతి చెప్పుట నిత్య యతి యనబడును. పై పద్యమున మూడవపాదమున 'ఎట్టి... కర్ముడు + ఏని - అను చోఅచ్చునకు యతి. నాల్గవ పాదమున 'నిన్ను....దలఁచెనేని 'అనుచో హల్లునకు యతి.

తెలుగులో అప్యర్థమున వాడబడు 'ఏని' శబ్దము పూర్వమున ఒక శబ్దమునిడుకొనియే ప్రయోగింపబడును. ఇది అజాది పదమగుటచే సంధి జరుగును. అదియునిత్య సంధి అగుటవలన అట్టి శబ్దములయందుభయయతి పాటింపదగియుండి అది నిత్యయతి నామమునకు తగియున్నది.

'ఏని' అను తెలుగు పదముతో సంధిల్లిన పూర్వ పదాంతాక్షరమునకు స్వరమైత్రినిగాని, వ్యంజనమైత్రినిగాని నిలుపవచ్చునని చెప్పబడినది. ఆ.వె. కదియు వడులు స్వరమునకైవడిఁ గాదులు

ఋత్వమునకు నెత్వమెనయు చోట ।
గృష్ణుఁ డాజిఁ గంసు గెడపె నం డ్రార్యులు
కూర్మ రూప విమలకోమలాంగ ।

అనంతుడు వర్గయతికి ఇదియొక నియమముగా పేర్కొనెను. కకారాది హల్లులు స్వరముల ననుసరించియే యతిమైత్రిని పొందును (క - కా - కై - కౌ, కి, కీ, కృ కౄ, కె, కే, కు కూ కొ కో) అని ఒక వాక్యంలో చెప్పి 'ఋకారమునకు మైత్రి కూర్చుచోట 'కృ' అని ఉండునని ప్రత్యేకించి వ్రాయుటలో నొక విశేషముకలదు.

ఋకారమునకు రేఫముతోగల సామ్యం వల్ల హల్ధర్మముండుటయు, వ్యంజనముపై ఋకారము చేరునప్పుడు మిగిలిన స్వరములవలె కాక వట్రుసుడి (ృ) రూపము లిఖింపబడుటయు అనెడి కారణముల వల్ల కలుగు సంశయ నివృత్తికొరకును, ఋ కారమునకు చెందిన ఇతరమైత్రులు కూడ చెల్లునని స్పష్టపరచటానికే చెప్పినట్లు భావింపదగును అప్పకవి దీనిని ప్రాణియతి యని పేర్కొనెను.

## 15.11 వర్గయతి :

తలకొని కచటతపంబులు
తల నొక్కొకట్రాయి తొలఁగఁ దమతమనాల్గున్
విలసిల్లు వర్గయతు లనఁ
గలికల్మష తిమిరతపన ఘననిభవర్ణా !

కచటతప అను ఐదు వర్గములలోని ఒక్కొక్కదానియందు అయిదేసి అక్షరములుండును. వర్గపంచమాక్షరమగు అనునాసికమును వదలి మిగిలిన నాలుగు అక్షరములతో యతి చెల్లును. అనగా క.ఖ.గ.ఘ - ఇవి ఒక దానితో ఒకటి యతిమైత్రికలవి. అట్లే చఛజఝలును, ట.ఠ.డ,ఢలును; తథ, దధలును, ప,ఫ, బభలును అయ్యాయి వర్గములలో ఒండొంటికి మిత్రములై ఒప్పుయతిని వర్గయతి అనబడును. ఈ పద్యమున నాల్గవ పాదమున క' 'ఘ' లకు యతి చెప్పబడినది. దీనినే వర్గయతి అనబడును.

ఉత్పత్తిస్థాన సామ్యము చేత వర్గాక్షరములందు మైత్రి సాధింప బడుచున్నది. స్థానసామ్యమున్నను అనునాసికోచ్చారణాధిక్యమువలన ఙ, ఞ , న, మలకు ఆయా వర్గాక్షరములతో మైత్రిలేదు.

సంధి కార్యములు జరుగు చోట వర్గాక్షరములందు ఒక వర్ణానికి మరొకవర్ణమాదేశమగును. అట్టివర్ణాలు సవర్ణాలు. ఈ సవర్ణ సంజ్ఞవల్ల ఆయావర్ణములకు యతిమైత్రి కూర్పనగును.

ద్రుత ప్రకృతికములమీద పరుషములకు సరళములగునెడి సంధులలో ఈ విషయము గుర్తింపనగును.

ఉదా : అనన్ + కలికల్మష - అనఁగలికల్మష.

## 15.12 పోలికవడి :

వెలసినపు పుఫుబుభువర్ణం
బులు పోలికవడి ముకారముగ నిడఁదగు ని
మ్ముల హరిచరణ సరోరుహ
ములు నా హృత్సరసియందుఁ బొదలు ననంగన్.

పు,ఫు,బు,భు అను వర్ణములకును విభక్తిముకారమునకును యతి చెల్లుట పోలిక వడియనబడును.

ఉత్వము ఓత్వమును మిత్ర స్వరములు. కాబట్టి ఉకారముతోను ఒకారముతోను కూడిన ప-ఫ-బ-భ లను గ్రహింపవచ్చును.

ఈ మైత్రికి గల హేతువు 'ము' ప్రత్యయము యొక్క చరిత్రవల్ల తెలియగలదు. మువర్ణకముయొక్క ప్రథమ స్వరూపము పువర్ణకము. తెలుగు ధాతువులపై పువర్ణకము చేరుటవలన 'మాపు మేపు, అడుపు' వంటి రూపాలు ఏర్పడుచున్నవి. సరళోచ్చారణములోని సౌలభ్యాపేక్షవల్ల పకారము బకారమగుటయు, నాదవర్ణము యొక్క సాన్నిహిత్యము వల్ల బిందుపూర్వకమును, వర్గపంచమాక్షర స్వరూపమును కాలక్రమమున పొందుటయు జరిగి పువర్ణకము బు, ంబు, మ్ము, ము రూపములను పొందినది, ఉచ్చారణలోని సామ్యముచేత సంస్కృత శబ్దములపై నీ వర్ణములుచేరుట సంప్రదాయమై వనబు, వనంబు, వనమ్ము, వనము వంటి రూపములేర్పడినట్లు కావ్యములందు మువర్ణకమునకు రూపాంతరముగ ంబు, మ్ము అను ప్రత్యయములు ప్రయోగింపబడినవి.

సరసము + మాట - సరసపుమాట వంటి సమాసములందు మువర్ణకమునకు పువర్ణాదేశము కలుగుటయు కలదు. ఈ విధమైన భాషా చారిత్రక కారణాలవల్ల పదాంతముననున్న ముబర్ణమునకు పు - బువర్ణములతోను వాని వలన పు, భువర్ణములతోను మైత్రి ఏర్పడినది. తత్సమశబ్దములందలి ముబర్ణకము కనకే ఈ మైత్రి ప్రాథమికమై యుండి, స్వరూప సామ్యము వలన బియ్యము, నెయ్యము వంటి దేశ్యశబ్దముల తుదనున్న ముబర్ణముతోను సాధింపబడినది. కాగా శబ్దాంత ముకారముతో పు,పు బు, భు లకు యతిమైత్రి చెల్లునని తెలియుచున్నది. దీనిని బట్టి ముకారముతో ఉకార స్వరవర్గమునకు చెందిన ఉఊ ఒ ఓ లతో కూడిన పవర్గాక్షరముల కన్నిటికి మైత్రి చెల్లునని తెలియదగును. అనగా ము - ప పూ పొ పో; పు పూ ఫో ఫో; బు, బూ, బొ భో: భు, భూ భొ, భోలు మిత్రములు

దీనికి ఉదాహరణ :

ఎట్టి విశిష్టకులంబున
**బు**ట్టిన సదసద్వివేక**ము**లు గలిగినదా (ఆది - 5.58)

ఈ పోలిక సామ్యము వలన పదాదియు, పదమధ్యస్థమును, ముబర్ణకము కానట్టియునయిన సహజ ముకారమునకు (ముని - పాము) కూడయతిమైత్రి పాటింపబడింది. ఈ యతి ప్రాచీన మగుటవలనను, దీనికి బహుళ ప్రయోగములుండుట వలనను దీనిని లాక్షణికులందరును చెప్పిరి. ముబర్ణకము యొక్క చరిత్రను బట్టి, దానికి పు, పు బు భు లతోగల పోలిక వలన పోలిక వడి అనబడింది. దీన్నే అప్పకవి ముబిభక్తి యతి అని పేర్కొనెను.

## 15.13. సరసయతి :

ఆ.వె. ణనలు చెల్లుఁగమల నాభ! యొండొంటికి
న యహ లొనరఁజెల్లు హస్తివరద !
శషస లొందునండ్రు చఛజఝుంబులతోడ
సరసయతులునాగ జలధిశయన !

'సరస' అనగా సమీపము, భిన్నవర్గాలకు చెందియుండి ఉచ్చారణమున సామీప్యమును కలిగియున్న వర్ణములకు మైత్రి చెప్పబడుటచే నిది సరసయతి అయినది.

1. ణ - న - ఇవి ఒండొంటికి మిత్రములు
2. అ - య - హ - ఇవి ఒండొంటికి మిత్రములు
3. శ - ష - స - చ - ఛ - జ- ఝ - ఇవి ఒండొంటికి మిత్రములు

పై పద్యమునందలి

మొదటి పాదమున - ణ - నా యతి చెల్లును
రెండవపాదమున - అ - హ యతి చెల్లును
మూడవ పాదమున - శ - చ - యతిచెల్లును
నాల్గవపాదమున - స - జ - యతిచెల్లును

అయహలు చెల్లునని యుండుటచే యీక్రిందివిగ్రాహ్యములు.

అ-ఆ-ఐ-ఔ → య యా - యై - యౌ; హ - హా - హై హౌ - మిత్రములు

ఇ - ఈ - ఋ - ఎ - ఏ → యి - యీ - యృ - యె - యే - హి - హీ - హృ - హె - హే మిత్రములు

ఉ - ఊ - ఒ, - ఓ యు - యూ - యొ - యో - హు - హూ - హొ - హో మిత్రములు

అ - య - హలు భిన్నస్థాన ప్రయత్నములుకలవి. అహలు కంఠ్యములు. యకారముతాలవ్యము. అంతస్థము నైనవ్యంజనము, యకారమునకు గల స్వరధర్మాన్ని బట్టియిది Semi Vowel అనియు అనబడుచున్నది. చ - ఛ - జ, ఝ - ఇవి తాలుజములైన ఊష్మవ్యంజనములు. శకారము తాలవ్యమైన ఊష్మవ్యంజనమే. కాబట్టి చఛజఝలు శకారముతో మైత్రికలిగిఉన్నది. శకారమునకు చ ఛ జ ఝ లు మిత్రములగుటవలన శ, ష, స లన్నియును మిత్రములగుచున్నవి.

స్థానకరణ ప్రయత్నసామ్యముచే న-ణ లు పరస్పరము మిత్రములగుచున్నవి.

ఉదా : 1 ....... సింధూర తిలకంబు - **చె**మ్మగిల్ల (మను 1:5)

**చె**ప్పినాఁడవు మాకు నా శ్రితుడవనుచు (కాశీ 1:13)

దక్షు/**ల** చటినాలవజాతి**హ**లముఖాత్తి విభూతి... (మను 1.50)

## 15.14. సంయుక్తయతి :

ఒక్కడుగున విశ్రాంతులు
పెక్కగుచో సంయుతములు పెనుపకమును జ
డ్డక్కరమునఁ దానెత్తిన
యక్కరమే యను పవలయు నన్నిట ( గృష్ణా !

ఒక్కపాదమున రెండు, మూడు, నాలుగు యతులుగల వృత్తము లందు సంయుక్తాక్షరముంటే అందలి ఒక్క అక్షరమే అన్ని యతి స్థానములందును కూర్పవలయును. పాదాది యందు సంయుక్తమున్నచో మొదట యతి స్థానమున పెట్టిన అక్షరమే తరువాతి స్థానములందును వ్రాయవలయును. నడుమ సంయుక్తముంటే అందలి ఒక అక్షరము పాదాది యందును నదే అక్షరము తత్పాదమందలి తక్కిన యతిస్థానములందును నిలుపవలయును.

సంయుక్తాక్షరాలకు పాటింపవలసిననియమాలుపైన చెప్పబడ్డవి. ఇందులో రెండు విషయములున్నాయి. 1. యతిచెల్లింపవలసిన స్థానమొక్కటే ఉన్నప్పుడు పాటించుదానిని 'యతినియతి' అంటారు. ఒకటికంటె ఎక్కువ యతి స్థానాలున్నప్పుడు పాటించుదానిని 'బహుయతినియతి' అంటారు.

ఒకటికంటె ఎక్కువ హల్లులుగల అక్షరాన్ని సంయుక్తాక్షరమంటారు అట్టి సంయుక్తాక్షరము పాదాదినిగాని, యతిస్థానమునగాని ఉంటే అందేదో ఒక హల్లునకు మాత్రమే యతి మైత్రి పాటింపదగును. అట్టిదానిని సంయక్తయతి అని అంటారు.

అనంతుడు పాదాది సంయుక్తము. పాదమధ్య సంయుక్తమని రెండువిధాలుగా చెప్పాడు.

సంయుక్తాక్షరమునకు ఉదాహరణముగ లాక్షణికులందరును 'క్ష' నే గైకొని, దానితో మైత్రి కూర్పదగు అక్షరాన్నే చెప్పారు. 'క్ష'ను వర్ణమాలలో ఒక అక్షరంగా గ్రహించిన అనంతుడు సంయుక్తయతికి లక్ష్యముగ 'క్ష' కారమునే గ్రహించినాడు.

ఉదా: ఏ నిను వేఁడెద లక్ష్మీ
క్ష్మానాయక నీవు నన్ను గ్రైకొని యిష్టం
బై నవి యొసఁగుము శుభ ల
క్ష్మా! నీవాఁడ ననొప్పు సంయుక్త యతుల్

2 వ పాదమందలి 'క్ష్మా'కు 'క్షై' కి, నాల్గవ పాదమందలి 'క్ష్మా'కు 'స'కు యతి వేయబడినది.

కకార షకారముల సంయోగము 'క్ష' కావున పై వర్ణములకు యతిని కూర్చటమైనది.

ఒక పద్యపాదంలో అనేక యతిస్థానాలున్నప్పుడు ప్రథమ స్థానమున కూర్చుయతి మైత్రికే చివరి స్థానములందును కూర్పవలయును. ఉదాహరణ : ద్విరదగతిరగడ -

క్ష్మావలయ మంతయు విష్ణాణమున నెత్తుకిటి

మహిమ దలపోయ నక్కజ మనుచునిట్లనక,

క్ష్మావలయమంతయు విష్ణాణమున నెత్తుకిటి

సత్త్వ మరు దననొప్పు సంయుక్త యతిచెడక.

ద్విరద గతిరగడ - ఇందులో 5 మాత్రలగణాలు పాదానికి ఎనిమిదుంటాయి యతి 1-11-21-31 మాత్రలకు యతి పాటింపబడి బహుయతి నియతిగా ఉంటుంది.

పైపద్యంలో మొదటిపాదంలోని 'క్ష్మా'కు 11 వ మాత్రాక్షరమైన 'షా'తోను అట్లే రెండవ పాదంలోని 21 మాత్రాక్షరమైన 'క్ష్మా' 31వ మాత్రాక్షరమైన 'షా'తోను యతి పాటింపబడింది.

కం. వడినెలవులలోఁజేరువ
యెడనొక సంయుతము నొల యెడ నొకటినిఁదా
రిడిరేని కవులు తప్పుట
యొడఁబడదు పృథ గ్యతి ప్రయోగముల హరీ !

యతిస్థానంలో ఒక సంయుక్తాక్షరాన్ని సమీపంలో మరియొక అక్షరాన్ని ఉంచినయెడల కవులు పొరబడుదురు కావున వేరువేరు యతిప్రయోగాలను కూర్పవచ్చును.

ఉదా : మఱియొక విధంబగు రగడ
ఱంపమున వ్రచ్చుగతి వ్రచ్చె నఖముల రిపుని
వక్షము నృసింహుఁడని రాయువడిసొరదుకృతి
ఱంపమున వ్రచ్చుగతి వ్రచ్చె నఖముల రిపును
రంబు నరసింహుడనఁ గ్రాలు సంయుక్తయతి.

ఇక్కడ 'ఱంపము - వ్రచ్చు - లకు యతి ఏపాదానికాపాదంలో పొందుపరచబడింది. అంతేగాక ఇక్కడ రఱ యతి మైత్రికూడకలదు.

## 15.15 తద్భవవ్యాజయతి :

అప్రసిద్ధముల్ జ ఞ లు శబ్దాదియందు
ఞా జ సంయుక్తి తద్భవవ్యాజమునను
నణలతోఁ బొందు విరతి యాజ్ఞప్తి యనఁగ
జలరుహోదరాశ్రితులు సుజ్ఞాను లనగ.

కవర్గపంచమాక్షరమైన ఙకారమును, చవర్గపంచమాక్షరమైన ఞకారమును ఒక పదముయొక్క మొదట లేవు. జకారముక్రింది ఞావత్తుచేరిన సంస్కృతమునందున్న జ్ఞకారమునకు తద్భవమునందు 'న' 'ణ'కారములు వచ్చును. అట్టినకార ణకారములకును జ్ఞకారమునకును యతివేయుటను తద్భవ వ్యాజయతి అంటారు.

నణలతో ననుచోట 'న' కారమునకును 'విజ్ఞప్తి' యనుచో 'జ్ఞ' కారమునకును యతి చెల్లును. అంటే సంస్కృత శబ్దములందరి 'జ్ఞ'తో నణలకు యతిమైత్రి కూర్పబడినది.

ఆ. యజ్ఞమునకు జన్న మాజ్ఞప్తి కానతి
యాజ్ఞ కాన సంజ్ఞ కరయ సన్న
విన్నపంబువెండి విజ్ఞాపనమునకు
జ్ఞాకుఁదద్భవంబు నా ధరిత్రి.

| ప్రకృతి - | తద్భవము | ప్రకృతి - | తద్భవము | ప్రకృతి - | తద్భవము |
|---|---|---|---|---|---|
| యజ్ఞము | జన్నము, | ఆజ్ఞప్తి | ఆనతి, | ఆజ్ఞ | ఆన |
| సంజ్ఞ | సన్న, | విజ్ఞాపనము | విన్నపము | | |

ఈ విధంగా పై సంస్కృత పదములలోని 'జ్ఞ'కారమునకు బదులు 'న' కారము వచ్చినది. పై పద్యము నాల్గవపాదమున 'జ్ఞా'కును 'నా' కును యతిచెప్పబడింది.

సంస్కృత పదముల మధ్యస్థమున, అవసానమునగల 'జ్ఞ' (ద్వితీయ సరళమగు 'జ' తాలవ్య అనునాసికము అయిన 'ఞ'ల యొక్క సంయుక్తాక్షరము) తద్భవములందునకారం(ద్రుతము) రూపమును పొందుట వలన 'జ్ఞ-న'లు రెండును మిత్రములని అనంతుడు లక్షణమున చెప్పెను.

అనునాసికములగు 'నణ'లుసన్నిహితోత్పత్తి స్థానములును సమాన ఉచ్చారణ ప్రయత్నములును కలిగి ఉన్నవి. 'యజ్ఞము - జన్నము' మున్నగువాని యందు 'నణ'లు సవర్ణములు. నకారమునకు చెప్పిన ణకారమునకు చెప్పినట్లే అని భావింపవచ్చును. జ్ఞ - న - ణ లు భిన్న స్థాన జనితములయినను ఉచ్చారణము నందలి అనునాసిక్య సామ్యముచే మైత్రికి అర్హమగుచున్నవి.

## 15.16. రేఫయుతయతి :

గీ॥ ఆంధ్రలిపిఁ జొప్పడదు ఋకారాన్వితంబు
క్రొత్తగాదు కృష్ణుని వెన్న మ్రుచ్చి మనఁగ
స్రుక్కఁడ తఁడాజి నెట్టి విరోధి నైనఁ
గ్రుమ్ము నన రేఫయుతయతి గూడుఁగాన.

ఋకారము లిపిలో ప్రత్యేకంగా చూపగలసంకేతం (ల) ఋ - రవర్ణములు మూర్థన్యములు. ఋకారము రేఫతుల్యము. ఉచ్చారణ సామ్యంచేత ఋకారము రేఫ మగుచున్నది. కావున రేఫయుతమైన ఋకారానికి రేఫకు యతివేయుటను రేఫయుత యతి అనబడును. పై పద్యం రెండవపాదా ద్యక్షరమైన 'క్రొ'లోని రేఫకు - 'మృచ్చు' ధాతువులోని ఋత్వము రేఫతో కూడిన 'మ్రుచ్చు' నకు యతిమైత్రిని కూర్పబడింది.

## 15.17. అనుస్వారయతి :

భువి ననుస్వారయతి బిందుపూర్వకముగ
ణాకు నిట నాల్గు చెల్లు (బాండవ సహాయ !
నాకు నిట నాల్గు చెల్లు గంధర్వజనక !
మాకు నిట నాల్గు చెల్లు సంపదలరాజ !

ట - త - ప వర్గములందలి అనునాసికవర్ణములతో మిగిలినవర్ణాలు బిందువుతో కూడినపుడు ఏర్పడుయతిని అనుస్వారయతి యందురు.

1. పూర్ణబిందుపూర్వకములగు ట - ఠ - డ - ఢ లకుణతో యతివేయవచ్చును (ణ = ంట; ంఠ; ండ; ంఢ).

2. పూర్ణబిందు పూర్వకములగు త, థ, ద, ధ, న లకు 'న'తో యతివేయవచ్చును (న = ంత; ంథ; ంద; ంధ)

3. పూర్ణబిందు పూర్వకములగు ప,ఫ,బ,భ లకు 'మ'తో యతివేయవచ్చును (మ = ంప; ంఫ, ంబ, ంభ)

పై పద్యంలోని రెండవపాదంలో 'ణ' కు 'ండ'తోను; మూడవ పాదంలో 'న' కు 'ంద' తోను; నాల్గవపాదంలో 'మ'కు 'ంప' తోను మైత్రి వేయబడింది.

అనంతడు ట - త - ప 'వర్గాలకే చెప్పినాడుకాని' క-చ వర్గాలను పేర్కొన లేదు.

ప్రథమవర్గాంత్యమైన జ కారమునకున్ను, ద్వితీయ వర్గాంత్యమైన 'ఞ' కారమునకున్ను ప్రత్యేక వ్యవహారోపయోగములు లేవు కాబట్టి ట-త-ప వర్గములు మూడు మాత్రమే బిందుయతులకు ప్రసిద్ధి కావున క, చ వర్గాలకు పూర్ణబిందు పూర్వత్వ లక్షణము చెప్పకపోవుటకు కారణమై ఉంటుంది.

## 15.18. మకారయతి :

యరలవలు శషసహలును నాదిబిందు
యుతములై మకార విరామయుక్తిఁ దనరు
మారుతాత్మ జుఁడరిది సంయమి యనంగ
మదన జనకుఁడు దనుజ సంహారుఁడనంగ

పూర్ణబిందు పూర్వకములైన య,ర,ల,వలు, శ,ష,స,హలును మకారముతో మైత్రినొందును. పై పద్యమున మూడవపాదంలో మొదటి మకారమునకు బిందుపూర్వక యకారంబును, నాల్గవ పాదంలో మొదటి మకారమునకు బిందు పూర్వక హకారమును యతియందు మిత్రములు.

తెలుగులో బిందువు పరుష సరళములకు ముందేకలదు. సంస్కృతము నందు అంత స్థోష్మములకు ముందు కలదు. దీనిని ఆధారంగా సంహరణము - సమ్‌హరణము, సంరక్ష - సమ్‌రక్ష; అనెడి రూపద్వయములు ఉచ్చారణలో ఉన్నవి. 'కంసాలి'కి 'కమసాలి' అను రూపము ప్రసిద్ధము, పూర్ణబిందువును అనునాసిక వర్ణమే. ఈ కారణాలచేత అంత స్థోష్మములకు పూర్వముగల అనుస్వారము మకారరూపమును పొందుట వ్యవహార ప్రసిద్ధమైనది. ఇట్టి ఉచ్చారణ సామ్యాన్ని పురస్కరించుకొని బిందు పూర్వకములైన య,ర,ల,వ,శ,ష,స,హలు మకారానికి మిత్రములైనవి.

వర్గాక్షరములకు పూర్వమునను్న బిందువు తత్తద్వర్గ పంచమాక్షరత్వమును (వర్గానునాసికము) పొందును. అదేవిధంగా అంతస్థోష్మములకు పూర్వమునను్న బిందువు మకార రూపాన్ని (చరమానునాసికము) దాల్చును. దీన్ని తొలుతచెప్పినవాడు అనంతుడు. ఈమైత్రి విరళంగా ప్రయోగింప బడటంవల్ల చిత్రకవి పెద్దన య-హలకు మాత్రమే ఈ యతిని నిర్దేశించాడు.

## 15.19. ఎక్కటియతి :

ధర నెక్కటివళ్లైతగు
ళరమఉవలు వానిలో అచెలంగెడి / ౘెలంగును / లాకున్
సరి ళా యన విశ్రమవే
ళ రమాధిప రెండునుంగలసి వర్తించున్.

ల,ర,మ,ఉ,వ అను అక్షరములందు ఒక్కొక్కటి తమతమకే యతి మైత్రినొందును. దీనికి ప్రత్యేక యతి యని నామాంతరము. ల-ళ లకు మాత్రము పరస్పరము చెల్లుననియు ఇందు చెప్పబడింది. సంస్కృతమున ల-ళ ల కభేదమగుటచే ఇట్లు చెప్పబడింది. లకారము నకు లకారము; రేఫమునకు రేఫము, మకారమునకు మకారము; ఉవర్ణమునకు ఉవర్ణము వకారమునకు వకారము యతిమిత్రములు.

ఎక్కటియతి యందు చెప్పబడి యున్నను ల-ళ-డ లు ర-ఱలు ప,ఫ,బ,భ,వ లు తమలో తాము మిత్రములని అనంతుడు చెప్తున్నాడు పై పద్యంలో రెండవపాదమున 'ల' కు 'ల'కు యతి. నాల్గవపాదమున 'ళ' 'ల' యతి.

ఉదాహరణము :

మరుని తండ్రి లోకమహితుండు యాదవ
రాజసింహమూర్తి రక్షకుండు
ఊఁగ వేలు పనఁగ ఉంపిల్లు నెక్కటి
వళ్లునాఁగ నిట్లువనజనాభ !

ఈ పద్యంలో మొదటి పాదమున 'మ'కారమునకును; రెండవ పాదంబున రేఫము (ర) నకును; మూడవపాదమున 'ఉ' కారమునకును; నాలుగవ పాదమున 'వ' కారమునకును యతి చెప్పబడింది.

ల - ళ లకు పైన చెప్పిన లక్షణ పద్యమందే కలదు.

## 15.20 ప్రభునామాంతయతి :

ఒరుల నన్నమ్మ యనుచోట నూఁదఁబడక
ద్వివిధమగు ౘ్రభునామాంతవిరమణంబు
మహి నయోధ్యకు రాజు రామన యనంగ
నతని పట్టపు దేవి సీతమ యనంగ.

ద్విత్వరహితంబులై అన్న, అమ్మ శబ్దములు (అన, అమ) పరంబులై నిత్య సంధి ఘటిల్లగా యతులందు స్వరవ్యంజనములు భయమునకు చెల్లుబడి యగును. పై పద్యమున మూడవ పాదమున 'మహి - రామన' అనుచోహల్లునకును, నాల్గవ పాదమున అతని ... సీత + **అమ** అనుచో అచ్చునకు యతులుంచబడెను. అన్నమ్మలు శ్రేష్ఠవాచకములు.

ప్రభువాచకములు కాబట్టి దీనికి ప్రభు యతియని పేరు అన్నమ్మ శబ్దద్వయమే కాక అయ్య, అక్క, అప్ప, అవ్వ ఇత్యాదులిందు గ్రాహ్యములు.

ఉదాహరణము :

భీ/ మన నా పేరు వినంగ (జెప్పితిc దెలుంగాధీశ ! కస్తూరికా, ఇందు భీమన (భీమ + అన) అనుచోటగల అకారమునకు విశ్రమస్థానమున 'తెలుంగ + అధీశ' అనుచోగల అకారమునకు యతి చెల్లుబడి అయింది.

## 15.21. విభాగయతి :

సంఖ్యకుం బరిమాణసంజ్ఞకుc దనర్చు
శబ్దములపై విభాగోక్తి సరణిసంఘ
టించినప్పుడు యతులు రెండేసి యగు ను
పేంద్రుcడిచ్చు ధనము మోపె cడేసి యనcగ.

విభాగమును దెల్పుచోట సంఖ్యకు పరిణామార్థకమగు 'ఏసి' పరంబై నిత్యసంధి ఘటిల్లునేని యచ్చునకైనను హల్లునకైనను యతి పొసగును. మూడవ పాదమున హల్లునకు నాల్గవ పాదమున (ఉప + ఇంద్ర ... మోపె cడు + ఏసి) అచ్చునకు యతులు చూపబడినవి. రెండేసి, మూడేసి అనువాని యందలి 'ఏసి' ప్రత్యయము విభాగార్థ సూచకము. అట్టి 'ఏసి' ప్రత్యయము పరంగా ఏర్పడు సంధి యందు ఉభయయతి చెల్లుటను విభాగయతి అంటారు.

సంఖ్యావాచకములగు రెండు, మూడు మొదలగు వానికిని పరిమాణార్థకములయిన **'గంపెడు'** మొదలగువానికిని విభాగార్థ ప్రత్యయమగు 'ఏసి' అనునది పరంకాగా నిత్య సంధి జరుగుతుంది.

రెండు + ఏసి ⟶ రెండేసి; మోపెడు + ఏసి ⟶ మోపెడేసి; గంపెcడు + ఏసి - గంపెడేసి - అనువానియందు పూర్వపదాంత వ్యంజనమునకుగాని, పరపదాది స్వరానికిగాని యతి మైత్రి చెల్లును. ఇది విభాగయతి, విభాగార్థప్రత్యయము పరమైనప్పటి సంధియందు చెల్లుయతి అగుటచే నిధి విభాగవళి అనబడింది.

ఉదా : **కృ**ష్ణుడిచ్చెనాలుగేసి చీరలు కూర్మి - ఇక్కడ వ్యంజనమైత్రి,
ఋషుల పాలిటివే యింతలేసి పనులు - ఇక్కడ స్వరమైత్రి (కాశీ 2.105)

అనంతుని మొదలుకాని లాక్షణికులెల్లరును ఈ యతిని చెప్పారు. ఏసి పరమైన సంధియందేకాక, విభాగార్థసూచకమగు 'అవ' అనునది పరమైనప్పుడేర్పడు రెండవ, మూడవ అనుసంధిగత రూపము లందును, ఉభయ వళిచెల్లునని విభాగవళి యందే రంగరాట్ ఛందంలో రంగకవి చెప్పాడు.

'గంపెcడేసి' మొదలగుపదాల్లో 'ఏసి' ప్రత్యయమునకు పూర్వము పరిమాణార్థ సూచకమైన 'ఎcడు' అనుప్రత్యయము కలదు. గంపెడు అనుదానిలో **ఎcడు** చేరిన సంధియందు ఉభయయతి చెల్లును. దానిని లాక్షణికులు చెప్పకపోయినప్పటికి ప్రయోగాలున్నాయి.

## 15.22 భిన్నయతి :

1.క. అంచిత తిలకము శౌరిధ
రించె ననcగ జగణమధ్య రేఫవిరతి మౌ
నంచిత తిలకము హరి ధరి
**యిం**చె ననcగ భిన్నవిరతి **ని**త్యమువచ్చున్

"గురు విరహితంబులయి యయాంతంబులయిన యేకస్వర ద్విస్వరంబుల యించుగ్వ్రక్రంబులకి యుడా గమంబు విభాషనగు" - అనుబాలవ్యాకరణ క్రియాపరిచ్ఛేద సూత్రము (50) చొప్పున భుజ్ + యించు - భుజించు; భుజ్ - ఇయ్ - ఇంచు - భుజియించు; గుణ + ఇంచు - గుణించు; గుణియించు అనురూప ద్వయమేర్పడును. ధృ + ఇంచు - 'ఇ ఉ ఋ లకు ఇంచుక్కు పరంబగునపుడు అయుగవుగరు క్కులగు (క్రియా 60) అనుసూత్రముంబట్టి 'ధర్ + ఇంచు' - అయి, మీది సూత్రముచే' ధరించు; ధరియించు' నను రూపద్వయమలరారును. ఇయుడాగమము రాకున్నచో 'ధరించు, భుజించు అను రూపములుండి జగణములగును వీటి మధ్యాక్షర యతిస్థాన పతితమగుచో హల్లునకే మైత్రి. ఇయుడాగమమువచ్చినచో 'ధరియించు అనురూపమేర్పడియతి స్థానమున ఇకారస్వరమునకు మైత్రినందును. పైపద్యంలో రెండవ పాదమున 'ఇయు డాగమము రామిచే జగణ మధ్య రేఫవిరతి ఘటిల్లినది. ఇది సాధారణయతి, వ్యంజనయతి.

చతుర్థపాదమున 'ధరియించు'లో నీయాగమ' యి 'వర్ణానికి' 'ఇ' కారమునకు యతి సూచింపబడింది. స్వరయతి.

'ధరించు, హరించు' మొదలగు పదాలు సంధిరూపంలో 'ధరియించు, హరియించు' అని ప్రయోగింపబడినప్పుడు పరస్వరము (ఇంచుక్కులోని ఇకారము) నకు యతి మైత్రిని కూర్చుటను భిన్నయతి యందును.

ఇంచుక్కు పరమైనచో కొన్నిధాతువులకు ఇయుడాగమము వికల్పముగా నగును : ధరి + ఇంచు  ధరియించు; ధరించు. ఇచ్చట 'ధరియించు' నందు స్వరయతిని పాటించుటకు భిన్నయతి అనిపేరు. 'ధరించు' నందు వ్యంజనయతినే పాటింపవలయును. 'ధరించు' - వంటి క్రియాపదములనడుమనున్న ఇత్వముపై మరియొక ఇత్వము వచ్చి (ధరించు - ధరి - ఇంచు) ధరియించు అని ఏర్పడును. ధృ (ధర్) భుజి (భుజ్) మొదలగుధాతువులు ప్రత్యయ సహితములుగనే ప్రయోగింపబడుటవలన యడాగమము వచ్చురూపములకు అనంతుడు భిన్నముకాబడిన రూపములుగా భావించినాడు. అందుకే దీనికి భిన్నయతి అనునామమేర్పడింది.

ఉదా : ధ్వజం - బెత్తిన నెత్తనిమ్ము వచియించెద ఁగల్గినమాట

**2.** అట ఇకారాంత పదము మీఁదటి దికార
మది యనంగ నవ్వల భిన్న యతికి ఁజెల్లు
దివిజవిభవంబు శౌరి చేతిది యనంగ
నసుర నాశంబు హరి చేతి యది యనంగ

దీనికితోడు అనంతుడు 'చేతిది ; కన్నది' వంటి పదాలనుకూడా భిన్నయతి క్రింద స్వీకరించెను. 'చేతియది' యందు భిన్నయతియును (స్వరయతి) 'చేతిది'-ఇందువ్యంజనయతి అనియు అనంతుని అభిప్రాయము.

అప్పకవి యీపదాన్ని భిన్నయతినుండి పృధఃక్కరించి 'ప్రత్యేకయతి' అను ఒక యతిభేదంగా చెప్పాడు.

'చేతిది' అను పదమునందుత్తర పదాద్యక్షరానికి లోపము లేనిచో అనగా 'చేతి యది' అనెడు రూపమునందు పాటించునట్టి స్వరయతికి భిన్నయతిగా అనంతుడు పేర్కొనెను.

సంబందార్ధమున శబ్దాలన్నీ తచ్ఛబ్దముతో సమసించును (అది - అవి మొదలగు తచ్ఛబ్దములు) అప్పుడా సమాసములోని అది - అవి శబ్దముల అత్తునకు లోపములు బహుళముగానగును. ఈ వ్యాకరణ విధిచేత (చేయి) చేతి + అది - చేతిది; చేతియది. అనెడు రూపములు ఏర్పడుతాయి. 'చేతియది'లోని యకారానికి వచ్చు స్వరయతియే పైలక్షణముననుసరించి భిన్నయతి.

## 15.23. వికల్పయతి :

గీ॥ హయుతమై పొల్లుల వికల్పయతులు చెల్లు
దేవకీనందనుఁడు జగద్ధితు ఁడనంగ
హలధరుఁడు సంగరాంగణోద్ధతుఁ డనంగ
నవని మోచినయవి కకుబ్భస్తులనఁగ.

క,చ,ట,త, పలకు (పొల్లులకు) పరమైన హకారమునకు ఘ,ఝ,ఢ,ధ,భ వర్ణములు క్రమముగా వికల్పముగానగు. హకారము పరంబు కాగా క,చ,ట,త,పలు గ,జ,డ,ద, బలగు.

వాక్ + హరి - వాగ్ + హరి - వాగ్ఘరి; వాగ్హరి; ఇట్లే తక్కినవి. ఇట్టి వికల్ప సంధులందు లోపించియున్న హకారమునకుఁగాని వర్గాక్షరమునకు గాని యతి చెల్లును 'వాగ్ఘరి' అనుచోట గకారమునకంటె హకారమున నొండెయతి ఘటింపవచ్చు. వికల్పసంధియందలి యతి గాన దీనికి వికల్పయతి యను పేరుకలిగె. పైపద్యంలో రెండవ పాదమున - జగత్ + హిత - 'జగద్ధితి' అనుచోట తకారమునకు, మూడవపాదమున ఉత్ + హత 'ఉద్ధత' అనుచోట హకారమునకు యతి ఘటింపబడింది. నాల్గవ పాదమున 'కకుప్ + హస్తి - కకుబ్భస్తి అనుచోట హకారమునకు యతి చూపబడింది.

జగత్ + హిత - జగద్ధిత; జగద్హిత - అనునట్టి వికల్పసంధిలో హకారము పరమగుచున్నది. ఇట్టి హకారము పరమగునట్టి సంధి గతాక్షరానికి పాటించాల్సినయమాతిని యన్ని చెప్పబడటంచేత నీయతి కి వికల్పయతి అయింది. స్వరరహితమైన వర్గహల్లులకు హకారము పరమైనప్పుడు వికల్పసంధి జరుగును. అట్టి స్థలాల్లో పూర్వ పదాంతపొల్లు హల్లునకును పరపదాది హకారమునకు యతిమైత్రి కూర్పదగును. అనగా దేనికైనను యతి చెల్లింపవచ్చును.

అనునాసికేతరములయిన వర్గహల్లులకు హకారము పరమైనపుడు ఆ హకారానికి పూర్వమున గల వర్ణము యొక్క సవర్ణాదేశము వైకల్పికంగా అగునని "ఝయోహో న్యతరస్యామ్" అను సంస్కృతవ్యాకరణ సూత్రం చేత చెప్పబడింది. ఈ సంధి వైకల్పికమగుటవల్ల పూర్వవర్ణానికి గాని, హకారానికి గాని యతి మైత్రి చెల్లుట తటస్థించింది.

వాక్ + హరి - వాగ్ఘరి, వాగ్హరి - వంటి సంధి స్థానంలో కకారపొల్లునకు గాని, హకారానికి గాని యతి వేయదగును. పూర్వ వ్యంజనానికి యతి వేయవలసివచ్చినప్పుడు హకారముపై నున్న స్వరమునకు యతి కూర్పవలసి ఉన్నది.

## 15.24 యుక్త వికల్పయతి :

నలిజ కారహల్లి తరానునాసికాఖ్యఁ
గదిసి తత్పంచమముగా వికల్ప విరతి
గలుగుఁజక్రి వల్లవసుదృఙ్మథుఁ డనంగఁ
గమలనేత్రుండు సకల దిఙ్మహితుఁడనఁగ

అనునాసిక సంధియందు కకారంబునకు ఙకారంబగుం ఇదియు వికల్పమే. దిక్ + మహిత - దిఙ్మహిత; దిగ్మహిత. ఇందు లుప్త కకారమునకు యతిఘటింపవచ్చును.

పై పద్యమున తృతీయ చతుర్ధ పాదములందు 'దృక్ + మథ; దిక్ + మహిత' - అనుచోటులకల కకారంబులకు యతి ఘటింపబడింది. కకారమున కొక్కటికే కాక యితర వర్గములకును నిదిసిద్ధించును.

## 15.25 అభేదయతి

ప్రకట పకార వర
ద్వికమునకుం జను నభేదవిరతి నిశాట
ప్రకర మెరిసె రామునిపా
వకశరమున జనకసుత నెపంబున ననఁగన్

ఇందు అభేదము వలన యతిమైత్రి సాధింపబడుచున్నది

'వపయోరభేదః' - వకారము దంత్యోష్ఠ్యమయ్యును ఓష్ఠ్యోచ్చార ణాధిక్యముకలది. నాదము అల్పప్రాణమునైన వ్యంజనము. పకారము ఓష్ఠ్యమును - శ్వాసము - అల్పప్రాణము నైనవ్యంజనము. రెండువర్ణములకును క్రిందిపెదవి కరణము. ఇట్టిహేతువులచే ఉచ్చారణమున సామ్యము కలిగి ఉండి యతిమైత్రి చెల్లుచున్నవి.

అనంతుడు - ప - వలకు అభేద విరతిని చెప్పినాడు.

నెపము - నెవము; ద్రౌపది - ద్రోవది, ద్వీపి - దీవి; వాపి - బావి ఈ విధముగా తత్సమ తద్భవము లందార్యద్రావిడ భాషలయందు రూపాంతర పరిణామము కాననగును.

తెలుగు సంధియందు కళలపైని పకారము వకారమగును

అతడు + పలికె - అతడవలికె (గసడదవాదేశసంధి)

పైకారణాలచే అభేదయతి ఏర్పడుతున్నట్లు తలంచవచ్చును.

అప్పకవి వ - పలమైత్రిని అభేదవర్గయతిక్రింద చెప్పెను. వకారముతో పకారమునకు మైత్రిని చెప్పుటవలన వర్గమంతయు అనునాసికమును బాసి మైత్రికి తగి ఉండి, అనంతుని లక్షణమునందే అప్పకవి చెప్పిన అభేదవర్గయతి అంతర్గతమగుచున్నది.

పై పద్యమునాల్గవ పాదాది అక్షరమైన 'వ'కు 'ప'తో యతిమైత్రి కూర్చబడింది.
ఇట్లే : కావునన్మహీ / వల్లభ తక్షకాధము నెపంబున సర్వములెల్లనగిలో, ఆది (1.126) ఈ విధంగా అనంతుడు 24 యతులను పేర్కొనెను. పూర్వకవుల ప్రయోగములను గ్రహించి ఏవి బహుళంగా ఉంటయో వాటిని గ్రహింపుడు.

పాఠం - 16

**కావ్యాలంకార సంగ్రహము - రామరాజభూషణుడు**

**తృతీయా శ్వాసము (రస ప్రకరణము)**

# రస స్వరూపము

**ఆచార్య నేతి అనంతరామశాస్త్రి**

## 16.0 ఉపోద్ఘాతం :

'వాక్యం రసాత్మకం కావ్యమ్' - అని విశ్వనాథుడు కావ్య శబ్దానికిచ్చిన నిర్వచనము. రసాత్మకమైన వాక్యమే కావ్యమని దీని అర్థం. రసహీనమైన గ్రంథము కావ్యము కాజాలదని అర్థం. ఎందుకంటే ఇది ఇతర ప్రయోజనములను ఎన్నింటిని సమకూర్చినప్పటికీ కావ్యానికి పరమ ప్రయోజనమైన రసానందాన్ని ఇవ్వలేదు. కాబట్టి కావ్యానికి రసం ఆత్మ. దాని నుండి పుట్టిన ఆనందం పరమ ప్రయోజనం కలది.

## 16.1. రసపదానికి అర్థం :

రసపదము ఋగ్వేదంలో సోమరసము, జలము, పాలు, సారము అనే అర్థాలయందు వాడబడింది. అధర్వవేదంలో దీనికి 'రుచి' అనే అర్థంలో కనబడుతున్నది. ఉపనిషత్కాలానికి దీనికి సారమనే అర్థం ఏర్పడింది. లోకానికి ప్రధాన సారభూతమైనదియు, శాశ్వతానంద సంధాయకమైన పరమాత్మ రసపదానికి అర్థం. అందువల్ల రసానందము బ్రహ్మానంద సహోదరమని చెప్పబడింది.

### 16.1.2. స్థాయి భావమంటే :

విభావాను భావాల చేతను, సాత్త్విక వ్యభిచారి భావాలచేత స్వాదుత్వాన్ని పొందింపబడే స్థాయి భావమే రసమవుతుంది. స్థాయి అంటే స్థిరంగా ఉండేది. సజాతీయ విజాతీయ భావాలంటే తిరస్కరింపబడక రసస్ఫూర్తి అయ్యేంత వరకు సహృదయుల హృదయాలలో నిలిచి ఉంటుంది. కాబట్టి దీనికి స్థాయి భావమను పేరు ఏర్పడింది. ఇది సహృదయుల హృదయమందు వాసనారూపంగా ఉన్నప్పుడు కేవలం జలంవలె ఆస్వాద్యమానం కాజాలదు. ఏవిధంగానంటే జలము ఖండచక్కెర కలయికచే రసాయనమై ఏవిధంగా ఆస్వాదించటానికి వీలగుచున్నదో ఆవిధంగా విభావాను భావ సంచారి భావాలచే పరిపుష్టమైన స్థాయి భావము మిక్కిలి అస్వాద్యమానమగును.

### 16.1.3. స్థాయి భావాలు :

శృంగార, హాస్య, కరుణ, వీర, భయానక, బీభత్స, రౌద్ర, అద్భుత, శాంతములను తొమ్మిది రసములకు క్రమంగా రతి - హాస - శోక - ఉత్సాహ - భయ - జగుప్సా - క్రోధ - విస్మయ - శమములు స్థాయి భావములు.

### 16.1.4. విభావాలు అంటే :

సామాజిక హృదయాల్లో వాసనారూపంలో బీజప్రాయంగా ఉన్న రత్యాదిస్థాయి భావాలు అంకుర రూపంలో ఆస్వాద్యమానంగా చేసేవి విభావాలు. లోక వ్యవహారంలో రత్యాదుల ఉత్పత్తికి హేతువులైన నాయికాదులే కావ్యాదుల యందు విభావాలని చెప్పబడునని సాహిత్య దర్పణం.

### 16.1.5. విభావాలు - భేదాలు :

విభావము రెండు విధాలు : 1. ఆలంబన విభావం; 2. ఉద్దీపన విభావం. ఆలంబనం అంటే ఆధారం నాయికా నాయకులు ఆలంబన విభావం వారిని అవలంబించియే రసోదయమగును.

రసాన్ని ఉద్దీపన చేసేది ఉద్దీపన విభావం. ఇది సహజము - తటస్థము అని రెండు విధాలు.

శృంగార రసంలో - యౌవనము - భూషణాలు - చేష్టాదులు. సహజ ఉద్దీపన విభావాలు.

మలయానిలం - చంద్రుడు మొదలైనవి తటస్థ ఉద్దీపన విభావములు. కొందరు మదనుడ్ని కూడా చేర్చారు. అందువల్ల కవులు విరహ వర్ణన సందర్భంలో చంద్రమలయానిల దూషణంతో పాటు మన్మధుణ్ణి కూడా దూషిస్తారు.

### 16.1.6. అనుభావాలు అంటే :

తమ తమ కారణాలచే నాయికా నాయకుల యందు ఉద్బుద్ధములైన స్థాయి భావాల్ని పైకి ప్రకటనంచేసే క్రియా విశేషాలు కావ్యనాట్యాదుల్లో అనుభావాలనిపిలుస్తారు.

రత్యాదిస్థాయి భావాలను సహృదయులచే అనుభవింపచేస్తవి కాబట్టి వీనికి అనుభావాలని పేరు ఏర్పడింది.

విభావాలు - కారణ రూపాలు; అనుభవాలు : కార్యరూపాలు

### 16.1.7. సాత్త్విక భావాలు ఏవి:

మనస్సు నుండి పుట్టిన హావభావాదులును, ఆయత్నజములయిన శోభ - కాంతి - దీప్త్యాదులును, స్వభావజములగు లీలా విలాసాదులను సాత్త్విక భావాలవుతాయి. ఇంకా సంభావ్యమానములగు ఇతర నిష్టలును శృంగార రసానికి అనుభావాలవుతాయి. ఈ అనుభావాలు మనోభావాలు - వాగ్భావాలు - కాయజాలు - బుద్ధిజాలు అని నాల్గు విధాలుగా ఉండువని కొందరి మతము.

సత్త్వసంజాతాలైన భావాలని సాత్త్విక భావాలంటారు. సత్త్వమంటే ఏమి? అనే విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. అభినయాదుల వల్ల పరగత దుఃఖాలయెడల అంతఃకరణము సుముఖమవటం, సత్త్వమని కొందరి అభిప్రాయం. రజస్తమాలచే అస్పృష్టమైన మనస్సు సత్త్వమని కొందరు, స్వాత్మవిశ్రాంతములైన రత్యాదులను ప్రకాశింపచేసే ఆంతరధర్మాన్ని సత్త్వమని కొందరు, భావాంతరముల సంబంధం లేకుండా రసాన్ని ప్రత్యక్షమొనరించు బలవిశేషం సత్త్వమని కొందరు చెప్తున్నారు.

స్తంభము - ప్రళయము - అశ్రువు - స్వేదము - వైస్వర్యము - రోమాంచము - కంపము - వైవర్ణ్యము - అను ఎనిమిదియు సాత్త్విక భావాలు. రసతరంగిణి కర్త జృంభము (ఆవులింత) కూడ సాత్త్విక భావాల్లో చేర్చి వాని సంఖ్యను తొమ్మిదిగా పేర్కొన్నాడు.

### 16.1.8. సంచారి (వ్యభిచారి) భావాలంటే :

స్థాయి వ్యభిచారాలు - ఆభ్యంతర భావాలు

సాత్త్విక భావాదులు - బాహ్యములు

రసవ్యక్తికి తోడ్పడే భావాలను సంచారి భావాలు లేక వ్యభిచారి భావాలని అంటారు.

విభావ - అనుభావ - సాత్త్విక - భావాలకంటె అతిశయించి రసానుగుణంగా వర్తించును కాబట్టి వీనికి వ్యభిచారులని పేరు ఏర్పడింది. ఇవి స్థాయి భావాలను బాగుగా పోషించి రస్యములను గావించును.

సముద్రంలోని తరంగాలులాగా సంచారులు స్థాయి భావంలో మజ్జనోన్మజ్జనములు కావించును. తిరోభావ ఆవిర్భావాలను పొందుచుండును నిర్వేద - శ్రమ - దైన్య - జాడ్యాదులని సంచారి భావాలు ముప్పది మూడు. అలంకారికులలో కొందరీ సంఖ్యను తగ్గించారు. కొందరు మరికొన్ని భావాలను కూర్చి కలిపి హెచ్చించిరి.

### 16.1.9. రసచర్చ :

మన ఆలంకారికుల్లో మొట్టమొదటగా రసచర్చ చేసినవారు భరతుడు. అతడు ప్రధానంగా రూపకాలకు సంబంధించిన రసాన్ని గూర్చియే చెప్పాడు. తరువాత ఆనందవర్ధనుడు శ్రవ్యకావ్యాలకు కూడా దాన్ని సమన్వయించాడు.

శ్రవ్యకావ్యాల్లో దృశ్యకావ్యాల్లోలా నాయకాదులు ప్రత్యక్షంగా కనబడరు. అలాంటప్పుడు సామాజికులు నాయకా భేదాన్నిపొంది రసాస్వాదన ఏవిధంగా చేస్తారు. అనే అనుమానం వస్తే వాక్యపదీయకారుడైన భర్తృహరి ఈ విధంగా చెప్తాడు.

శ్రవ్యకావ్యాదుల యందు నాయకులు ఆయా వర్ణన విశేషాలచే హృదయ ఫలకంలో రూపాన్ని పొంది ప్రత్యక్షంగా గోచరిస్తారు. అప్పుడు సామాజికుడు తద భేదాన్ని పొంది రసాస్వాదనం చేస్తాడని సమాధానం చెప్పాడు.

రసాన్ని అనుభవించే వారెవ్వరు అనే విషయంలో అనేక అభిప్రాయాలున్నాయి.

"విభావానుభావ సాత్త్విక వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తిః" అనే భరతుని రస సూత్రమందలి సంయోగ - నిష్పత్తి పదాలకు - భట్టలొల్లటుడు - శ్రీశంకుకుడు - భట్ట నాయకుడు - అభినవ గుప్తుడు - అనువారు వేర్వేరుగా వివరించి ఉన్నారు.

లోకంలోని హర్ష - శోకాదులవల్ల చూచేవారికి హర్ష - శోకాలే కలుగుతాయి. కావ్యాలయందు అలాకాక అన్నిటి వల్లను ఆనందమే కలుగుతుంది. ఈ ఆనందం అలౌకికం. కావ్యశిల్పం అలౌకికమగుటయు, కావ్యగత నాయకాదులు అలౌకికులగుటయు ఇందుకు కారణాలు. లోకంలో శోక -హర్షాదులకు కారణాలైన భావాలే కావ్యాలయందు అలౌకిక విభావాలు అనే పేర వ్యవహరింపబడి హర్షాన్ని కల్గిస్తాయి. కావ్యంలోని నాయకాదులు లౌకిక నాయకాదులకు అనుకర్తలు. అనుకరణము ఆనందావహము. ఈ అనుకరణ విశేషంచే కళలన్నీ ఆనందాన్ని చేకూరుస్తున్నాయి.

### 16.1.10. రసానందమంటే :

కావ్యంలో వర్ణితములైన విభావాదులు వర్ణనలచే సహృదయులందలి సత్త్వగుణము ఉద్రిక్తమవుతుంది. ఈ ఉద్రేకం వల్ల వారి హృదయాల్లో వాసనా రూపంగా ఉన్నరత్యాదులు ఉద్బుద్ధములవుతాయి. మరల మరల భావించుకోవడంచేత విభావాదులు సాధారణములవుతాయి అప్పుడు సహృదయుని పరిమితత్త్వము అణిగిపోతుంది. అతడు తనను, ప్రపంచాన్ని విస్మరించి అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందుతాడు. అతడు విభావాదులను అనుసంధించుకొని చర్వణము చేయుచున్నంత కాలము ఆనందాన్ని అనుభవిస్తూనే

ఉంటాడు. ఆ చర్వణము ఆగిపోయినంతనే ఆనందం ముగుస్తుంది. ఈ ఆనందాన్నే రసానందం అంటారు బ్రహ్మానందం కేవలానందం. రసానందం విభావాది యుక్తము. అందుచేత అది బ్రహ్మానంద సహోదరమని చెప్పబడింది. తైత్తరీ యోపనిషత్తు నందలి ఆనంద వల్లిలో బ్రహ్మానంద స్వరూపం వ్యక్తం చేయబడింది.

## కావ్యాలంకార సంగ్రహము - రామరాజభూషణుడు

**తృతీయాశ్వాసము (రసప్రకరణము) 1-92 పద్యాలు.**

### 16.2. ప్రస్తావన :

కం. శ్రీ రమణ చరణ సేవా

పారాయణ! యుభయ వంశ పావన! లక్కాం

బారచిత భాగధేయ! య

పార కృపా రసిక! యోబ ప్రార్థివు నరసా!

నారాయణుని పాదాలను సేవించుట యందు ఆసక్తి కలవాడా! మాతా పితృవంశములను పరిశుద్ధము చేసేవాడా! లక్కమాంబా పుత్రుడా! మిక్కిలి కరుణచే ఆర్ద్రుడయిన వాడా! ఓబయ రాజనందనుడైన నరస భూపాలుడా దీనిని అవధరింపుము.

గీ. అవధరింపుము లక్ష్మ లక్ష్యముల నెల్ల

ననఘ భవదీయ నామధేయాంకితముగ

బహు విభక్తుల నొనరింతుఁ బద్య వితతి

నిచ్చటఁ బ్రబంధ జీవితం బెట్లటన్న - 2

అవధరింపుము : చిత్తగింపుము; అనఘః పవిత్రుడా!

ప్రబంధ జీవితంబు : ప్రబంధమునకు ప్రాణప్రాయమగు రసము; ఎట్లు అటు అన్నన్; ఇచ్చటన్ : ఈ ఆశ్వాసమునందు; లక్ష్య లక్ష్యములనే ఎల్లన్ : లక్షణములను - లక్ష్యములను అన్నింటిని

బహువిభుక్తులన్ : అనేక విభాగములచేత;

భవదీయనామాంకితముగన్ : నీ నామముచేత అంకితమగునట్లు

పద్యవితతిన్ : పద్యముల సమూహముచేత; ఒనరింతున్ : నిరూపింతును.

గీ. మహిత కవితా విలాసినీ మధురతర వి

లాస విన్యాసముల లీల వాసికెక్క

నవరసంబుల నెఱిగింతు నవరసార్ధ

గుంభగంభీరతర వచో జృంభణముల - 3

మహితః పూజ్యయగు; కవితా విలాసినీ : కవితయనెడు స్త్రీ యొక్క మధురతర విలాస - మిక్కిలి మనోజ్ఞములగు విలాసముల యొక్క నవ... జృంభణములన్ : నవరస యుక్తములగు నర్థముల యొక్క గుంభనముచే నతి గంభీరమైన మాటల యతిశయములచేత నవరసంబులన్ : శృంగారది నవరసములను, ఎఱిగింతున్ : తెలుపుదును.

## 16.3. రస లక్షణము :

కం. పులకండంబులు గలిపిన
నలు వగు సలిలము రసాయనం బగు పగిదిన్
లలిత విభావాదులచే
నలఘుతర స్థాయిభావమమరున్ రసమై - 4

పులకండంబులు.... సలిలము : కండ చక్కెర కలిపిన యొప్పిదమగు ఉదకము, రసాయనంబు పగిదిన్ : పానకమగు రీతి; లలిత విభావాదులచేన్ : మనోహరములైన విభావాను భావ సాత్త్విక వ్యభిచార భావములచేత,

అలఘు...... భావము ః అధికమగు రత్యాది స్థాయి భావము
రసమై ః రసస్వరూపమై; అమరున్ : ఒప్పును.

ఖండచక్కెర కలిపితే నీరు పానకమైన విధంగా విభావ, అనుభావ, సాత్త్విక, సంచారీ భావాలచే పరిపుష్టమై అధికంగా ఆస్వాద్యమైన స్థాయి భావము రసమగును.

నీరు - నీటి రూపంలో ఉన్నప్పుడు ఆస్వాద్యంగా ఉండదు. అదేవిధంగా సహృదయుల హృదయంలో వాసనా రూపంగా ఉన్నస్థాయి భావం కూడా ఆస్వాద్యంగా ఉండదు. కాని ఆ నీరు కండచక్కెర, ఏలకులు, మిరియపుపొడి మొదలగు వాని కలయికచే పానక రూపాన్ని పొంది మిక్కిలి ఆస్వాద్యమానమగుచున్నది. అట్లే ఆ సహృదయుల స్థాయియు విభావ, అనుభావ, సాత్త్వికభావ, సంచారి భావాలచేత పరిపుష్టమై మిక్కిలి ఆస్వాద్యమానమగుచున్నది. కాబట్టి సహృదయుల హృదయముననున్న స్థాయియే రసమగుచున్నది.

"విభావై రనుభావైశ్చ సాత్త్వి కైర్వ్య భిచారిభిః

ఆనీయ మానః స్వాదుత్వం స్థాయిభావో రసః స్మృతః"

విభావాను భావ సాత్త్విక వ్యభిచారాలచే ఆస్వాద్యమానమగు స్థాయి భావము రసమగుచున్నది.

## 16.4. స్థాయి భావ లక్షణము :

గీ. గరిమ నదులెన్ని గలిసినఁ గప్పుకొనుచు
జలధి గనుపట్టు రీతి, సంచారి భావ
సంచయములెన్ని గలసినఁ మించనీక
తన కనుపట్టు భావంబు స్థాయి దలఁప - 5

జలధి : సముద్రము ; గరిమన్ : ఆధిక్యముచేత; నదులెన్ని గలిసినన్ : తనలో నెన్ని నదులు చేరినను, కప్పుకొనుచున్ : ఆవిరించుచు; కనుపట్టురీతిన్ : అగపడునట్లు; సంచారి భావ సంచయములు : వ్యభిచారి భావముల యొక్క గుంపులు; ఎన్నికలిసినన్ : ఎన్ని చేరినను; మించనీక : అతిశయింపనీక; తాన : తానే; కనుపట్టు భావంబు : చూపట్టు భావము; తలపన్ : విచారింపగా; స్థాయి : స్థాయి భావమగునని అర్థము.

స్థాయి అంటే : స్థిరముగా నిలుచునది అని అర్థం. మారనిది; నశింపనిది ఎన్ని ఆఘాతాలు వచ్చినప్పటికీ చలింపక సుస్థిరంగా ఉండే భావాన్ని స్థాయి భావమందురు. ఎలాగంటే లవణ సముద్రం తనలో మంచినీటి నదులెన్ని కలిసినప్పటికీ వాని మంచి గుణాన్ని మించనీక తన క్షార గుణాన్నే ప్రకాశింప చేస్తుందో అట్లే తనలో విరుద్ధములు కాని అవిరుద్ధములు కాని సంచారి భావములు కలిసినప్పటికీ వానిని మించనీక తానే స్థిరంగా నిలుచు భావము స్థాయి భావమగును.

ఇప్పుడు స్థాయి అంటే ఏమిటో తెలిసింది. అయితే భావమంటే ఏమిటి?

1. 'వికారోమానసో భావః' - (మనోవికారమే భావము).
2. 'నిర్వికారాత్మకే చిత్తే భావః ప్రథమ విక్రియా' - ఎట్టి వికారములును లేని చిత్తంలో మొదట కలిగే వికారాన్ని భావము అంటారు.
3. 'భావయతి జ్ఞాపయతి హృదయ గతమితి భావః' - హృదయగతము తెలిపేది భావము.

చిరకాలందాకా అంటే రసస్ఫూర్తి వరకు సహృదయ హృదయాల్లో ఉంటూ విభావాదుల సంబంధం కలవి; అనగా వానివల్ల వ్యక్తం చేయబడేవి, రసత్వాన్ని పొందేవి స్థాయి భావములు. అధిక విభావములవల్ల వ్యక్తమయ్యే రత్యాదులు స్థాయి భావాలు. అల్ప విభావాదుల వల్ల వ్యక్తమయ్యే రత్యాదులు వ్యభిచారులు.

కం. ధర శృంగారము, హాస్యము
కరుణయు, వీరము, భయానకము, బీభత్సం
బురురౌద్ర, మద్భుతము, శాం
తరసంబును రసములనగ తన రుం గృతులన్ - 6

శృంగార, హాస్య, కరుణ, వీర, భయానక, బీభత్స, రౌద్ర, అద్భుత, శాంతములనునవి తొమ్మిది కావ్యరసములు.

ఇందు ఉదహరింపబడ్డ నవరసాల్లో శాంతము రసము కాదని కొందరు, శృంగారము ఒక్కటే రసమని కొందరు, కరుణయే రసమని ఒకరు, అద్భుతమే రసమని ఒకరు; తొమ్మిదియే కాదు; భక్తికూడ రసమే అని ఒకరు, వత్సలమను రసము గ్రాహ్యమని మరి కొందరు, ప్రేయోరసమనునది ఉన్నదని కొందరు, వ్యభిచారి భావములన్నియు రసములేయగునని ఒకరు, ఒక్కటే రసము కాని యిన్ని రసములు లేవని మరికొందరు ఈ ప్రకారం రసములను గూర్చి పెద్ద చర్చ కలదు.

## 16.5. స్థాయి భావములు :

కం. రతి, హాస, శోక, యత్నము
లతి భీతి, జగుప్స, రోష, మచ్చెరువు, శమం
బతుల క్రమమున నవి సాం
ప్రతము రసస్థాయి భావ భావనఁజెందున్ - 7.

'శృంగారమునకు - రతి, హాస్యమునకు హాసము, కరుణమునకు శోకము, వీరమునుకు యత్నము - (ఉత్సాహము భయానకమునకు భయము, బీభత్సమునకు జుగుప్స, రౌద్రమునకు క్రోధము, అద్భుతమునకు విస్మయము, శాంతమునకు శమము స్థాయి భావములు స్థాయి భావములంటే వాసనారూపమున సామాజిక హృదయమునను్న రత్యాదులు. అంతేగాక చిరకాలం దాక సహృదయుల చిత్తంలో నిలిచేవి విభావాదుల సంబంధం వల్ల వ్యక్తం చేయబడి రసత్వాన్ని పొందేవి స్థాయి భావములు.

రసములకుఁ తొమ్మిదింటికిఁ
బొసఁగిన యీ స్థాయి భావములకు నొనర్తున్
రసికత లక్షణ లక్ష్యము
లదృశ రసశాస్త్రవేత్త లౌనౌననగన్ - 8

రసములకున్ ..... భావములకున్ః శృంగారాది నవరసములకు వొప్పిన స్థాయి భావములకు అసదృశ ....
అనగన్ = సాటిలేని రసశాస్త్రజ్ఞులు మెచ్చానట్లుగా; రసికతన్ = రసికత్వముచేత లక్షణ లక్ష్యములు = లక్షణములను లక్ష్యములను; బునర్తున్ - రచియింతుము.
శృంగారాది నవరసములస్థాయి భావము లగు రత్యాదులకు లక్షణమును లక్ష్యమును రసజ్ఞులు మెచ్చునట్లు చెప్పెదను.

### 16.5.1. రతి లక్షణము :

కం. తరుణీమణులకుఁ బురుషుల
కరయఁగ సంభోగ విషయ మగు నభిలాష
స్ఫురణము మనములఁ బొడమిన్
ధరలో నది రతియనంగఁ దగునెట్లన్నన్ - 9

తరుణీమణులకున్ : యౌవన వతులగు స్త్రీ రత్నములకు; పురుషులకున్ : యౌవన వంతులగు పురుషులకు; అరయగన్ : విచారింపగా సంభోగ... స్ఫురణము - సంభోగ వాంఛ; మనములఁ బొడమినన్ : మనస్సుల యందు కలిగిన యెడ, ధరలోన్ : భూమియందు; అది : ఆయభిలాషము రతియనంగన్; తగున్ : ఒప్పును : ఎట్లన్నన్.

పైన 'పురుషులకనుటకన్న' 'తరుణుల' కనుట యుక్తము. తరుణీ తరుణులకు మనస్సున పొడమిన సంభోగ విషయకమగు నభిలాష లేక కామము రతి. "తత్ర సంభోగ విషయక ఇచ్ఛా విశేషోరతిః" (సంభోగ విషయకమగు నిచ్ఛా విశేషమే రతి). అనియు "యూనోరన్యోన్య విషయా స్థాయి నీచ్ఛా భవేద్రతిః" (యువతీ యువకుల అన్యోన్య విషయకమగు నిచ్ఛయే రతి) అనియునూ రతి లక్షణము కానబడుచున్నది. కానీ రసగంగాధరకారుడు" తత్ర స్త్రీ పుంసయో రన్యోన్యాలంబనః ప్రేమాఖ్యశ్చిత్తవృత్తి విశేషోరతిః స్థాయి భావః" (స్త్రీ పురుషుల యొక్క అన్యోన్యాలంబనముగల ప్రేమమును చిత్తవృత్తి విశేషమగు రతి స్థాయి భావము) అని చెప్పెను.

ఇందు 'సంభోగేచ్ఛ' అనకుండా ప్రేమరూపమైన చిత్తవృత్తి విశేషమే రతి అని గుర్తుంచుకొనవలెను. ఈ రతి యొక్క అవస్థలు ఈ విధంగా పెద్దలు చెప్పారు.

ఈ రతి అంకురావస్థ యందు ప్రేమమనియు; పల్లవావస్థయందు మానమనియు, కలికా (మొగ) అవస్థయందు ప్రణయమనియు, పుష్పావస్థయందు స్నేహమనియు, ఫలావస్థయందు రాగమనియు భోగావస్థయందు అనురాగమనియు చెప్పబడెను.

ఈ రతి మొదట్లో నాయికకే కలిగినట్లును, ఆయా యింగితాలచే పిమ్మట నాయకునికి కలిగినట్లు కావ్యంలో వర్ణించాలి. ఒక్కొక్కప్పుడు మొదట్లో నాయకునికే కలిగినప్పటికీ నాయికకి కలిగినట్లు వర్ణించుట హృద్యంగా ఉంటుంది. ఏవిధంగానంటే నాయకుడు పౌరుషవంతుడై ఉండాలి. అంటే ధైర్య స్థైర్యాదులు కలిగి ఉండాలి. అట్లయితే అతడు ప్రకాశిస్తాడు. కాబట్టి అతని మనస్సు ప్రథమమున రతి కలిగిన కావ్యమున సహృదయులు దానిని ఈవిధంగా నిబంధింపరు. అందుకే రుద్రటుడు ఇట్లా చెప్పాడు.

"పూర్వం నారీ భవేద్రక్తా పుమాన్ పశ్చాత్తా దింగితైః
తత స్సంభోగ లీలేతి స్వభావ సుభగా స్థితిః"

మొదట నాయిక నాయకుని చూచి అనురక్తురాలు కావాలి. దాని ఇంగితాలచే పిమ్మట నాయకుడు అనురక్తుడు కావాలి. పిమ్మట వారి సంభోగలీల ఈవిధంగా ఉండాలి.

**రతికి ఉదాహరణము**

చల్లఁదనంబె చంద్రునకుఁ; జక్కదనంబె ప్రసూన ధన్వికిన్;
సల్లలితోరు సౌరభమె చైత్రున; కొక్కని కొక్క మేలివే
తెల్లము గాక; సాపతియు దీర్ఘగుణాఢ్యుఁడు నారసింహ భూ
వల్లభుఁ; డట్లు సర్వ గుణవైభవ మెవ్వరికైనఁ గల్గునే? - 10

చంద్రునకున్ : సుధాంశునకు; చల్లదనంబె : చల్లనివాడైయుండుటయె, ప్రసూన ధన్వికిన్ : మన్మధునకు, చక్కదనంబె : సౌందర్యమే చైత్రునకున్ : వసంతునకు; సత్... సౌరభమే : సత్ :శ్రేష్ఠమైనట్టి, లలిత : మనోజ్ఞమైనట్టి; ఉరు : గొప్పదగు, సౌరభమె :

పరిమళమే. ఒక్కనికిన్ ఒక్క మేలిమే : ఒకనికొక యతిశయంబే. తెల్లముగాక : ప్రసిద్ధము కాని, నాపతి : నాభర్తయగు; నారసింహ భూవల్లభుడు; నరసభూపాలుడు; ఉదీర్ణ గుణాఢ్యుడు = ఉత్కట గుణాభిరాముడు, అట్లు : ఆవిధంగా; సర్వగుణ వైభవమున : సకల గుణసంపద; ఎవ్వరికైనన్, కల్గునే : సంభవించునా? కల్గదనుట.

ఒక నాయిక నరసభూపాలుని గుణాలను ఈవిధంగా ప్రస్తుతిస్తున్నది. చంద్రునకు ఒక్క చల్లదనమే ఉంది; మన్మథునికి ఒక్క చక్కదనమే ఉంది. వసంతునకు ఒక్క సౌరభమే ఉంది. ఇందు ఒక్కొక్కరికి ఒక్కొక్క గుణముమాత్రమే ఉంది. కాని నా ప్రియుడైన నరసభూపాలుని యందు ఆమెకున్న రతి వ్యక్తమౌతున్నది. ఇట తనకు రతి ఉదయించినట్లు నాయిక నోటిమాటలతో చెప్పలేదు.

### 16.5.2. హాస లక్షణము :

క. చేకొని యక్రూరములగు
నాకార వికార చేష్ట లాలోకింపన్
గైకొను మనోవికాస
స్వీకారము హాసమయ్యె వినుమెట్లన్నన్ - 11

చేకొని : ఆదరించి; అక్రూర... చేష్టలు : భయంకరములు కాకున్న ఆకృతులను, వికృత చేష్టలను; ఆలోకింపన్ : చూడగా; గైకొను మనోవికాస స్వీకారము : పొందునట్టి వికాస రూపమగు మనోవృత్తిని స్వీకరించుట; హాసమయ్యెన్ : హాసమను స్థాయి భావమయ్యెను ఎట్లన్నన్ ; వినుము : ఆకర్ణింపుము.

అక్రూరములగు ఆకార వికార చేష్టలు చూడటంచేత కలిగేటువంటి మనోవికాసం హాసమని తాత్పర్యం.

పైన ఇచ్చిన లక్షణంలో 'అక్రూరములగు' నకు 'అతి వికృతములగు' అని పాఠాంతరం కలదు. అతి వికృతములయిన ఆకారము, ఆలాపములు, చేష్టితములు మొదలైన వానిని చూచుటచే కలిగే మనో వికాసమే హాసమనబడును.

వాగ్వికారాలను, అంగవికారాదులను చూడటంవల్ల పుట్టిన చిత్త వికాసరూపమైన వృత్తి విశేషమే హాసమని రసగంగాధర లక్షణం.

**హాసోదాహరణము :**

చ. అదె! యిదె! వచ్చె వచ్చె నరసాధిపు దాడి యటంచుఁ బాళెము
ల్బెదరి బరీదుఁ డేగునెడఁ బెంపఱి ఖానులు వెన్కముందుగాఁ
గదిసి హయాళినెక్కి హయకంధరముల్పొడగాన కప్పుడే
చదిపిరి వాజిమస్తముల శత్రులటంచు భ్రమింతు రెంతయున్ - 12

నరసాధిపుదాడి : నరసభూపాలుని దండయాత్ర; అదె ఇదె వచ్చెన్ వచ్చెన్ అటంచున్ : అదిగో ఇదిగో వచ్చెవచ్చెననుచు. పాళెముల్ : సేనలు; బెదరి : భయపడి; బరీదుడు : బరీదు డనునొక శత్రురాజు; ఏగునెడన్ : పోవు సమయమున; ఖానులు : తురుష్కులు, పెంపఱి : గర్వముడిగి; హయాళిన్ : గుఱ్ఱముల సమూహమును. వెన్కముందు గాఁగదిసి : వెనుకటి భాగము ముందగునట్లుగా జేరి, ఎక్కి: ఆరోహించి; హయకంధరముల్ : అశ్వములకంఠములను; పొడగానక :చూడక; శత్రువుల : ప్రతిపక్షులు; వాజిమస్తములన్ : గుఱ్ఱముల తలలను అప్పుడే చదిపిరటంచున్ : అప్పుడే త్రుంచిరని. ఎంతయున్ : మిక్కిలి; భ్రమింతురు : భ్రమనొందుదురు.

బరీదుడనే ముసల్మాను ప్రభువు నరసాధిపుని దాడి "వచ్చెవచ్చె" అని సేనలు బెదరగా తాను పరుగెత్తెను. అతని సేనానాయకులు విభ్రాంతులై గుఱ్ఱములపై వెనుక ముందుగా కూర్చుండి గుఱ్ఱపు తలలను కానక అప్పుడే నరసభూపాలుడు సైన్యముల వచ్చి తమ గుఱ్ఱపు తలలను త్రెంచినవని భ్రమపడ్డారు.

ఇక్కడ ఖానులు వెన్కముందుగా కూర్చుండుట అను వికృత చేష్ట హాసమును వ్యక్తము చేయుచున్నది.

ఈ హాసోదాహరణ పద్యము భయోదాహరణ పద్యానికి సమానంగా ఉన్నది. కాబట్టి ప్రతాప రుద్రీయము నందలి ఉదాహరణము గ్రహించెదము.

కొప్పులు పెట్టుకొని, కన్నులకు కాటుక పెట్టుకొని, కృత్రిమ స్తనాలను ధరించి, స్త్రీ వేషాలతో ప్రచ్ఛన్న రూపులై కాకతీంద్ర నగర వీధుల్లో వెళుతున్న శత్రురాజులను చూచి దుండగీంద్రగు విటులు దువ్వలు వలను ఊడ్చి కుచాల్ని లాగి నీవిని తాకి, హీ, హీ యని నవ్వుకున్నారు. ఇది హాసమునకు సరియైన ఉదాహరణము.

### 16.5.3. శోక లక్షణము :

క. హితజన విరహవ్యధచే
నతిశయమై జనుల మానసాంభోజనమునన్
ప్రతిదినము పొడము దుఃఖం
బతి భూమి వహింపక శోకమగుటెట్లన్నన్ - 13

హితజన విరహవ్యథచేన్: ఇష్టజన విరహ దుఃఖముచేత, అతిశయమై : అధికమై; జనుల మానసాంభోజమునన్ : జనులకమలము వంటి మనస్సునందు; ప్రతిదినము పొడము దుఃఖము : ప్రతిదిన ముదయించెడు దుఃఖము; అతిభూమి వహించెన్ : అతిశయము పొందగా; శోకమగున్ : శోకమను స్థాయి భావమగును.

హితజన విరహ దుఃఖంవల్ల కలుగు దుఃఖము అతిశయిస్తే శోకమవుతుంది. ఇక్కడ 'వ్యథచే కలుగు దుఃఖము అనటం పొరపాటు. ఒక్క హితజన విరహంవల్లనే శోకం కలుగదు. ఇంకా ఏవిధంగా శోకం కలుగుతుందంటే నాట్యశాస్త్రంలో ఈవిధంగా చెప్పబడింది.

ఇష్టజన వినాశము, శాపము, క్లేశము, బంధనము, వ్యసనము మొదలైన వానివల్ల కరుణ రసముకల్గుతుంది.

రసగంగాధరంలో : పుత్త్రుడు మొదలగు వారి వియోగం వల్లగాని, మరణాదుల వల్లగాని కలిగిన వైక్లబ్యమనే చిత్తవృత్తి విశేషమే శోకమని చెప్పబడింది.

పైన చెప్పిన పద్యంలో 'దుఃఖంబతి భూమి వహింప శోకమగు' అని ఉంది. అతి భూమి వహించిన శోకము కరుణమే అవుతుంది కాబట్టి ఇది శోక స్థాయి భావలక్షణం కాక కరుణ రస లక్షణమవుతున్నది.

శోక రసోదాహరణము :

చ. పతుల నృసింహ శౌర్యశిఖిపాలుగఁ జేసినయిట్టి పాపపున్
శత ధృతి కింతటం జలము జాలదు; మమ్మును దావపావక
వ్రతతుల పాలు చేసె; నని పల్కుఱు రోదనమందు విద్వేష
త్సతులకు బాష్ప పూరములె చాలు వనానలమున్ హరింపగన్ - 14.

పతులన్ - తమభర్తలను, నృసింహ ... పాలుగన్ : నృసింహ : నరస భూపాలుని యొక్క, శౌర్యశిఖి : ప్రతాపమనెడి అగ్నికి; పాలుగన్: అధీనమగునట్లు, చేసిన... శతధృతికిన్ : కావించిన పాపాత్ముండగు బ్రహ్మకు; అంతటన్ : అంతమాత్రమున; చలము జాఱదు : వైరముడుగదు మమ్మును, దాన... పాలు : దావాగ్ని సమూహముల కధీనము; చేసెన్ : ఒనరించెను. అని : పల్మఱున్ : మాటిమాటికి, రోదన ... సతులకున్ = రోదనము చేయ శత్రు భార్యలకు; భాష్ప పూరములె : కన్నీటి వరదలె; వనానలమున్ : దావాగ్నిని, హరింపగన్ : ఆర్పుటకు చాలును.

ఇందు శత్రు వనితలకు ప్రియా వియోగముచేత దుఃఖోదయమయినట్లు చెప్పినందున ఇది శోకమునకుదాహరణమయ్యెను.

### 16.5.4. ఉత్సాహ లక్షణము :

క. అత్యున్నత లోకోత్తర
కృత్యంబులు సేయవేఁడి కృతకృత్యు లిలన్
నిత్యము దలఁచు ప్రయత్నం
బత్యంతోత్సాహమయ్యె నది యెట్లన్నన్ - 15.

ఇలన్ : భూమియందు; కృతకృత్యులు : కృతార్థులు; అత్యున్నత... కృత్యంబులు : మిక్కిలి గొప్పవగు లోకోత్తర కార్యములను, చేయన్ : చేయుటకు; వేడి : కోరి; నిత్యము :ఎల్లప్పుడు; తలచు ప్రయత్నము : చింతించుయత్నము; అత్యంతోత్సాహము : మిక్కిలి ఉత్సాహము అయ్యెన్; అవి యెట్లన్నన్.

లోకోత్తర కార్యాలను సాధింపచేసే గట్టి యత్నాన్ని ఉత్సాహమంటారు. లోకోత్తర కార్యాలంటే దాన - ధర్మ - దయా - యుద్ధాదులు. దీన్నిబట్టి దానవీరము - ధర్మవీరము - దయావీరము - యుద్ధవీరము.

రసగంగాధరంలో :

శత్రువులయొక్క పరాక్రమము యొక్క క్షీణతాదులను స్మరించటం వల్ల పుట్టిన యౌన్నత్యమే ఉత్సాహమని చెప్పబడింది. ఇది దాన - దయా - యుద్ధాలవలె సత్యవీరము - క్షమావీరము - బలవీరము - పాండిత్య వీరము మొదలైన అనేక లోకోత్తర కార్యాలు సంభవిస్తున్నవి. వీర రస విషయంలో అనేక భేదాలు కలుగుతున్నట్లు తెలుస్తున్నది.

## ఉత్సాహలక్ష్యం :

మ. అసిఁ జెండాడి విపక్షవృక్షముల శౌర్యాగ్నిచ్చటం బేల్చి శ
స్త్ర సరత్సీరములన రణోర్వీతలమున్ సంక్షుణముంజేసి వై
ర్య సృగార్ద్రం బోనరించి ప్రోదిగొనకుద్యత్కీర్తి సస్యౌఘముల్
వెస సిద్ధించునె? యంచుఁబల్కు నరసోర్వీ నాథయోధావళుల్

నరస.... ఆవళుల్ : నరస భూపాలుని భటుల సమూహములు; విపక్ష వృక్షములన్ : శత్రువులను వృక్షాలను; అసిన్ : ఖడ్గముచేత; చెండాడి : ఖండించి; శౌర్యాగ్నిచ్ఛటన్ : ప్రతాపమను అగ్ని సమూహముచేత; పేల్చి : కాల్చి; శస్త్ర సరత్సీరములన్ : శస్త్ర : బాణములనెడు సరత్ : ప్రసరించుచున్న; సీరములన్ : నాగేళ్లచేత; రణోర్వీతలమున్ : యుద్ధభూమి ప్రదేశమును; సంక్షుణ్ణమున్ : మెదిగిన దానిగా, చేసి, ఒనరించి; వైర్య సృగార్ద్రంబున్ : శత్రువుల యొక్క రక్తముచేత తడిసిన దానిగా, ఒనరించి: చేసి; ప్రోదిగొనక : పెంపు పొందకున్న యెడ; ఉద్యత్కీర్తి సస్యౌఘముల్ : ప్రకాశించుచున్న కీర్తి అనెడు పైరుల యొక్క సమూహములు వెసన్ సిద్ధించునె : వేగముగా సిద్ధించునా! అంచున్ : అనుచు : పల్కున్.

నరస భూపాలుని యోధులు "శత్రువులను వృక్షాలను కొట్టివేసి శౌర్యాగ్నితో కాల్చి, శస్త్రాలనే నాగళ్లతో రణభూమిని క్షుణ్ణంగాచేసి శత్రువుల రక్తంచే తడిపితే కాని కీర్తి సస్యాలు పండునే?" అని, అంటారు. ఇక్కడ యోధావళి యొక్క మాటలు రణోత్సాహాన్ని వ్యక్తంచేస్తున్నవి.

**16.5.5. భయ లక్షణము :**

క. క్రూరాకారముఁ జూచిన
నారయ నేజనుని హృదయమందు ననర్థాం
కూరా శంకన మగునది
ధారుణిలో భయమనంగఁ దగునెట్లన్నన్ - 17

క్రూరా కారము; భయంకరాకృతి; చూచినన్ : చూచుట వలన ఆరయున్ : విచారింపగా; ఏ జనుని హృదయముందున్ = ఏ నరుని మనస్సునందు; అనర్థాంకూరాశంకనము : మరణాది అనర్థకార్యాల యొక్క శంకయనుట; అగున్: అగునో; అది - ఆ యనర్థాశంకనమనుట; ధారుణిలోన్ : భూమియందు; భయమనంగఁదగున్ = భయమను స్థాయి భావమన నొప్పును; ఎట్లన్నన్

క్రూరమైన ఆకారాదులను చూడటం వల్ల ఏ జనుని హృదయంలో మరణాధి రూపముతో కూడిన మహానర్థశంక కలుగుతుందో అది భయము. రసగంగాధరంలో ఇచ్చిన లక్షణమిట్లున్నది. వ్యాఘ్ర దర్శనము మొదలైన వానివల్ల పుట్టినట్టి పరమ అనర్థ విషయకమగు వైక్లబ్యరూపమగు చిత్తవృత్తి విశేషము భయమనబడును. ఇక్కడ భయమనేది సమస్తమైన ప్రాణులకు సాధారణంగా కలిగేది. కాని పై లక్షణంలో 'ఏ జనుని హృదయమందు' అనిచెప్పటంవల్ల పశుపక్ష్యాదులకు కలుగు అనర్థ శంక భయంకాదని అర్థమౌతున్నది. కాని ఇక్కడ జనశబ్దానికి జంతువని అర్థం చెప్పుకున్నచో సరిపోతుంది.

త్రాసమను పదానికి భయమని అర్థం కలదు. సంచారి భావాల్లో త్రాసము అనేది ఒకటుంది. కాబట్టి స్థాయి భావమగు భయానికి, సంచారిభావమైన త్రాసానికి భేదమున్నదా అను ప్రశ్నపుట్టును. శార్దూలము మొదలగు క్రూర జంతువుల వల్ల కలిగే మరణాధి రూపంతో కూడిన మహానర్థశంకను భయమంటారు. ఇతరమైన భయహేతువులవల్ల కలిగేటువంటి మరణాదిభిన్నమైన అనర్థశంకను త్రాసమంటారు. ఇట్టిత్రాసము వ్యభిచారి భావమనబడుతుంది.

## భయోదాహరణము :

చ. అనఘ! నృసింహ! నీయరి వనావళికేగి గుహాగ్ర సుప్తుడై
యని మరలంగలం గని భయంపడి పాఱుచు "నాజిగాదు కా"
దని సతి తెల్పినం దెలియఁ డౌరఁ! నిషాదులఁ జాపహస్తులం
గని విపినేభ పంక్తిగని క్రమ్మఱ నాజియకాఁ దలంచుచున్" - 18

అనఘ : పాపరహితుడా!; నృసింహ : నరస భూపాలుడా! నీయరి : నీ శత్రువు; వనావళికిన్ : అరణ్య సమూహమునకు; ఏగి : పోయి; గుహా గ్రసుప్తుడై : గుహయొక్క ముందటి భాగమున నిద్రించినవాడయి, కలన్ : స్వప్నమందు; మరలన్, అనిన్ : యుద్ధమును, కని : చూచి; భయపడి : భీతుడయి; పాఱుచున్ : పరుగెడుచు; సతి : భార్య; ఆజికాదు కాదని తెల్పినన్ : యుద్ధము కాదు కాదు పరుగెత్తకుమని తెలియజేసినను; చాపహస్తులన్ : ధనుస్సు చేతులంగల ; నిషాదులన్ : బోయలను; కని : చూచి. క్రమ్మఱన్ :మరలను. ఆజియకాఁ దలంచుచున్ : యుద్ధమనియే తలంచుచు, తెలియడు : నిజము తెలిసికొనజాలడు, ఔర : ఆశ్చర్యము !

నిద్రనుండి తటాలున లేచి పరుగెత్తుట, భార్య తెలిపినను నమ్మకుండుట. మొదలైనవి శత్రువు యొక్క భయాన్ని వ్యక్తం చేస్తున్నవి ఇది సామాన్యమైన భయంకాక మరణ రూపంతోకూడిన అనర్థ శంకగానే గ్రహించాలి.

"ఒకరి భయము ఇంకొకరికి హాసాన్ని పుట్టించుటయు కలదు. కాబట్టి భయోదాహరణలందు త్రాసముతోప కుండుటమేలు"

**16.5.6. జుగుప్సా లక్షణము :**

కం. పలలాస్థి శోణి తాదులఁ
బలుమాఱును జూడ నరుచి భావము లోనం
దళుకొత్త నిగర్హణ మది
తలపోయ జుగుప్స యనఁగఁదగునెట్లన్నన్ - 19

పలలాస్థి శోణితాదులన్; మాంసము - ఎముక - రక్తము మొదలగు వానిని, పలుమాఱును : మాటిమాటికిని; చూడన్ : అవలోకింపగా అరుచిన్; అసహ్యత చేత; భావములోనన్ : హృదయమందు, తళుకొత్తు నిగర్హణము : ఉదయించు నిందయేదికలదో, అది : ఆనింద; తలపోయన్ : విచారింపగ; జుగుప్సయనగదగున్ : జుగుప్సయను స్థాయి భావమగును, ఎట్లన్నన్.

రక్తమాంసాదులను చూచుటవల్ల కలుగు ఏవగింపు జుగుప్స అగును. అయితే కొందరకు మాంసాదులను చూడటం వల్ల ఏవగింపు కలుగదు గదా! కాబట్టి ఈ లక్షణం అసంపూర్ణము.

**ప్రతాపరుద్రీయంలో** : ఆయా పదార్థములందలి దోషదర్శనాదులచే కలుగురోత జుగుప్స అని చెప్పబడింది. ఎవనికి దోషం కనబడితే వానికే రోత. లేనివానికి లేదు అని అర్థం వస్తున్నది. కాబట్టి ఈ లక్షణం సరిగా లేదు.

**రసగంగాధరంలో** : ఏవగింపు కొలుపు పురీషాది వస్తువులను చూడటం వల్ల పుట్టినట్టి చికిత్స అనే చిత్తవృత్తి విశేషమే జుగుప్స అని చెప్పబడింది. ఈ లక్షణం సమంజసంగా ఉంది ఎందుకంటే పురీషాది దర్శనం అందరికీ రోతకలుగుతుంది. రక్తమాంసాదుల దర్శనం వల్లకానీ, పదార్థములందలి దోష దర్శనం వల్లకానీ, ఎల్లరకును రోతకలుగదు. కొందరకు మాత్రమే కలుగుతుంది. కాబట్టి పురీష వస్తు దర్శనం వల్ల ఎల్లరకును సర్వసాధారణంగా, ఏవగింపు కొలుపు వస్తువులను చూచుట. దీని వల్ల కలుగు రోత జుగుప్స.

భయంలా ఇదికూడా స్వనిష్ఠము, పరనిష్ఠము అని రెండు భేదాలు కలవు.

## జుగుప్సోదాహరణము :

చ. తలలు సరోజముల్ మెదడు తండ్రము క్రొన్నురు వంత్రజాలముల్
జలఫణు, లస్థి ఖండములు, శంఖములై తగు నెత్రుటేర్లలో
గలభ కపాల నొచయముఁ గ్రక్కున నెక్కి చరించు సంగర
స్థలుల నృసింహ నిర్దళిత శత్రువసారస మత్తభూతముల్ - 20.

నృసింహ.... భూతముల్, నృసింహ నిర్దళిత శత్రుః నరసభూపాలునిచే ఖండింపబడిన శత్రువుల యొక్క; వసాః క్రొవ్వు యొక్క, రసః రసముచేత, మత్తః మదించినట్టి; భూతముల్ : పిశాచములు సంగర స్థలులన్ : యుద్ధభూములయందు; తలలు : శత్రు శిరస్సులు; సరోజముల్ : పద్మములును; మెదడు తండము : క్రొవ్వు యొక్క సమూహము; క్రొన్నరువు : క్రొత్తనురుగును; ఆంత్ర జాలముల్ : ప్రేగుల గుంపులు; జలఫణులు : నీటిపాములును; ఆస్థిఖండములు : ఎముకల తునకలు; శంఖములు : శంఖములును; ఐ; తగునెత్రుటేర్లలోన్ : ఒప్పునట్టి రక్తనదులలో; కలభ... చయము : ఏనుగు పుఱ్ఱెలనెడు పడవ గుంపులను; గ్రక్కునన్ : శీఘ్రముంగా; ఎక్కి; చరించున్ : తిరుగను.

ఇక్కడ భూతముల నెత్రుటేర్లలో చరించుచున్నట్లు చెప్పబడింది. ఆ నెత్రుటేర్ల వర్ణములో మాంస - అస్థి - మజ్జాదులు జుగుప్సను వ్యక్తము చేయుచున్నది.

## 16.5.7. క్రోధ లక్షణము :

కం. అపకార కారులగు నరు
లపరాధ మొనర్ప నే మహామహుని మనం
బు పరిజ్వలితంబగునది
యపరిమిత క్రోధమయ్యె నది యెట్లన్నన్ - 21.

అపకార.... నరులు : అపకారము చేయునట్టి మనుష్యులు శత్రులనుట; అపరాధ మొనర్పన్ : అపరాధము చేయగా; ఏ మహామహుని మనంబు : ఏ మహాత్ముని మనస్సు; ఫరిజ్వలితంబగున్ : జ్వలియించునో, అది - అజ్వలనమని యాశయము ; అపరిమిత క్రోధము; అపరిమితమైన క్రోధమను స్థాయి భావము; అయ్యెన్, అది ఎట్లన్నన్.

1. శత్రువులపచారం చేస్తే ఉదయించు మనః ప్రజ్వలనము క్రోధమని తాత్పర్యము 'శత్రు కృతాపచారేణ మనః ప్రజ్వలనం క్రోధః' అని ప్రతాపరుద్రీయము.

2. గురువును, బంధువులను చంపటం మొదలుగాగల గొప్ప అపరాధంవల్ల పుట్టిన ప్రజ్వలన నామకమగు చిత్తవృత్తి విశేషం క్రోధమను స్థాయిభావము. ఇది పరవినాశనము చేయును. ఈ క్రోధము మహాపరాధంవల్ల కాక క్షుద్రాపరాధం వల్ల పుడితే అది అమర్షము అను పేరు గల సంచారీ భావమవుతుంది. అంటే పరుష వచనాలవల్ల, అసంభాషణం వల్ల ఈ అమర్షమనే సంచారి భావం కలుగుతుంది. అమర్షమనే పదానికి క్రోధమని అర్థం.

**క్రోధ ఉదాహరణము :**

చ : స్థిరభుజ విక్రమ క్రమ నృసింహ! నృసింహ! భవత్కరాగ్ర భీ
కర కరవాల సిద్ధుడతి గాఢయశో రససిద్ధిఁ గోరి బం
ధుర హయసింధురావళులతో రణదుర్గ కనర్ఘళోన్నతిన్
నరబలిపెట్టు దుర్మద సనాథ రిపుక్షితినాథ యూథమున్' - 22

స్థిర... సింహ : స్థిరమగు భుజ పరాక్రమమందు నృసింహస్వామి తుల్యుడగు నృసింహః నరస భూపాలుడా! భవత్... సిద్ధుడుః నీ యొక్క కరాగ్రము నందుండు భయంకరమగు ఖడ్గమను సిద్ధపురుషుడు; అతి... సిద్ధిన్ : మిక్కిలి గాఢమగు యశస్సను రససిద్ధిని; కోరి; రణదుర్గకున్ : రణశక్తికి; బంధుర.... అవళులతోన్: దట్టములగు అశ్వముల యొక్కయు, గజముల యొక్కయు సంఘములతో; దుర్మద... యూథమున్ : చెడు కావరముచే కూడిన శత్రురాజుల గుంపును, అనర్గళోన్నతిన్ : అడ్డము లేని యౌన్నత్యము చేత; నరబలిన్ : నరబలినిగా; పెట్టున్ : ఇచ్చును.

ఇందు మదించిన శత్రురాజులను బలిపెట్టుననుటవల్ల వారు చేసిన అపరాధానికి మనస్సుజ్వలించినట్టు తోచును కాబట్టి క్రోధోదాహరణమగును. ఓ నరస భూపాలా! నీ చేతికత్తియును, సిద్ధుడు కీర్తియను రససిద్ధిని కోరి యుద్ధభూమి అను కాళికి మదించిన శత్రురాజులను నరబలిపెట్టును. ఇక్కడ 'కరవాలమున నరబలి పెట్టును' అని ఉండటంచే క్రోధము వ్యక్తమగుచున్నదని అభిప్రాయము.

ఈ క్రోధ లక్షణానికి ఈ ఉదాహరణ సరిగా లేదనిపిస్తున్నది. ఏలయన ఇందు "యశో రససిద్ధిఁగోరి" అనటంవల్ల 'యశోసేవిజిగీషూణామ్' అను లక్ష్యమందువలె వీరస్థాయియగు ఉత్సాహమే ప్రధానముగనున్నది. కాని శత్రు కృతాపచారము చేతకలుగు

మనః ప్రజ్వలన రూపక్రోధము ప్రధానము కాదు. అంతేగాక ఈ పద్యంలో శత్రుకృతాపచారమేమియు చూపబడలేదు. ఇంకా ఇందు కరవాలము కర్త అవటంచేత అది అచేతనమవటంచేత దానికి మనః ప్రజ్వలన రూపమగు చిత్తవృత్తి ఉండదు. కాన ఈ ఉదాహరణము స్వీకరింపతగదు.

ఈ క్రింది కావ్య ప్రకాశోదాహరణము గ్రహింపదగింది.

"కృతమను కృతం దృష్టం వా యై ర్దిదం గురుపాతకం
మనుజ పశుభి ర్ని ర్మర్యా దై ర్భవద్భిరు దాయుధైః
నరక రిపుణా సార్ధం తేషాం సభీమకిరీటి నా
మయ మహమ సృజ్మదో మాంసైః కరోమి దిశాంబలిం"

ద్రోణాచార్యుడు మరణించిన తర్వాత అశ్వత్థామ పలికిన పలుకులు. ఇదమ్ గురుపాతకమ్ : ఈ మహాపాతకము; మనుజ పశుభిః : వివేక శూన్యులగు; యైః = ఏ ధృష్ట ద్యుమ్నాదులచేత, సన్యస్తశస్త్రాలుగల ఆచార్యుడ్ని (ద్రోణుని) వధించటంచే మనుజ పశువు; కృతమ్ : చేయబడినదో; నిర్మర్యాదైః = అతిక్రాంత ధర్మసేతువులగు, యైః = ఏ నరక రిపువు, మొదలగు వారలచేత, అనుమతమ్ : సమ్మతింపబడినదో, ఉదాయుధైః = గొప్పయా యుధములు కల; యైర్భవ ద్భిః = ఏమీచేత, దృష్టమ్ వాః చూడబడినదో, ఉదాయుధులయ్యు అట్టి దుర్మార్గులగు ధృష్టద్యుమ్నాదుల వారింపక చూచుచుండుట అపరాధమని ఎఱుంగవలయును సభీమ కిరీటినామ్ : భీమార్జులతో కూడిన; తేషామ్ః వారల యొక్క; అస్పృజ్మేదోమాంసైః = నెత్తురు మెదడు మాంసములచేతను; దిశామ్ : దిక్కులు; బలిమ్ : బలిని; అయమహమ్ : ఈనేను; కరోమి; చేయుచున్నాను.

గీ. వీతమర్యాదులై గురుపాతకంబు
సలిపి సహియించి చూచిన సశర మనుజ
పశుల మిమ్మెల్ల నేఁ గృష్ణపార్థ భీమ
యుక్తముగ భూతబలి యిత్తు రక్తమునను

ఇది ద్రోణ వధ అనంతరం అర్జునాదులను గూర్చి కోపించిన అశ్వత్థామయన్న పలుకులు. ఇచట శత్రుకృత మహాపరాధంచే కలిగిన ప్రజ్వలన రూపమైన క్రోధం ఈ పద్యంలో బాగుగా వ్యక్తమగుచున్నది.

### 16.5.8. విస్మయ లక్షణము :

కం. వివిధా పూర్వము లగు వ
స్తువులు కనుం గొనిన యెడల సుజనుని మదిలో
దవిలిన ప్రమోద విస్తర
మవిరళ విస్మయమనంగ నగునెట్లున్నన్ - 23

వివిధ.... యెడలన్ : నానావిధ లోకోత్తర వస్తువులను చూచినచో, సుజనుని మదిలోన్.. సహృదయుని చిత్తమునందు; తవిలిన ప్రమోద విస్తరము : ఉదయించిన సంతోషాతిశయము, అవిరళ విస్మయ మనంగన్ : దట్టమైన విస్మయమను స్థాయి భావమనగ, ఒప్పున్. ఈ పద్యంలో 'సుజనుని' అనేపదం వ్యర్థం. ఎందుకంటే సుజనునికి మాత్రమే చిత్తవిస్తారము కలుగును. ఇతరులకు కలుగదను అర్థం

వస్తుంది. అంతేకాక 'ప్రమోద విస్తరము' అనరాదు : 'చిత్త విస్తారము' అనవలెను. శబ్ద ప్రపంచమునందు 'విస్తరము' అనియు తదితర విషయంలో 'విస్తారము' అనియు ఉండవలెను. ఎలా గంటే 'శబ్దవిస్తరము', 'చిత్త విస్తారము' అని. కాబట్టి ప్రమోద విస్తారము అనవలెను.

ప్రతాపరుద్రీయంలో : అపూర్వములగు వస్తువుల దర్శనం వల్ల కలుగు చిత్తవిస్తారము విస్మయమౌతుంది.

రసగంగాధరమున : అలౌకికమగు వస్తువులను చూడటంవల్ల పుట్టిన ఆశ్చర్యమును చిత్తవృత్తి విశేషమును విస్మయమౌతుంది.

ఈ విస్మయము స్వనిష్ఠ విభావ జన్యమగునప్పుడు స్వనిష్ఠమనియు, పరనిష్ఠవిభావ జన్యమయినప్పుడు పరనిష్ఠమనియు రెండు విధములు.

**విస్మయోదాహరణము :**

చ. ధరణి నృసింహ భూవరు ప్రతాపమహాతప మబ్జజాండ క
ర్పరములు నిండి తీవ్రగతిఁ బర్వ నఖర్వ సగర్వ వైరి భూ
వరులు వడంకసాగుదు రవార్య నవ వ్యజనాత పత్ర వై
ఖరులు దొలంగఁ జేయుదురు కన్నులఁ జీఁకటి కప్పుచుండగన్ - 24

ధరణిన్ : భూమియందు; నృసింహ.... ఆ తపము : నరస భూపాలుని యొక్క ప్రతాపమనెడు గొప్ప యెండ; అబ్జజాండ కర్పరములు : బ్రహ్మాండముల నెడు చిప్పలు; నిండి; తీవ్రగతిన్ : తీక్ష్ణవిధముచేత; పర్వన్ : వ్యాపించుచుండ; అఖర్వ... వరులు : అధికులై గర్వముతో కూడుకొన్న శత్రు భూపాలురు; వడంకసాగుదురు; అవార్య.... వైఖరులు, అవార్యః నివారింప శక్యము కానట్టి, నవః నూతనమయినట్టి; వ్యజన : విసనకర్రల యొక్కయు; ఆతపత్ర : గొడుగుల యొక్కయు, వైఖరులు : రీతులను, కన్నులన్ : నేత్రములయందు, చీఁకటి కప్పుచుండగన్ : అంధకారమావరించు చుండగా; తొలంగన్ : తొలఁగునట్లు చేయుదురు.

నరభూపాలుని ప్రతాపరూపమగు గొప్ప యెండ బ్రహ్మాండమంతా తీక్షణంగా కాస్తుంటే శత్రురాజులు కన్నులు మిఱుమిట్లుగొని వణికిపోతూ తమ ఛత్రచామరాదుల్ని తొలగించుకొటారు.

నరభూపాలుని ప్రయత్నం బ్రహ్మాండమంతా గప్పి మిఱుమిట్లు గొలుపు చుండెను. ఈ అపూర్వమైన వస్తుదర్శనంవల్ల శత్రు రాజులకు విష్మయం కలుగుచున్నది. అంతేగాక వారిచేష్టలు ఆ విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నవి.

### 16.5.9. శమలక్షణము

కం. నిరుపమ వైరాగ్యాదుల
కిరవై నిశ్చలతపూని హృదయము దిరమై
నరులకుఁ బరిణతిఁ జెందిన
ధరలో నది శమమనంగ దగునెట్లన్నన్ - 25.

నరులకున్ : మనుష్యులకు. నిరుపమ వైరాగ్యాదులకున్: అసదృశములైన వైరాగ్యము మొదలగువానికి; ఇరవై ఆశ్రయమై; నిశ్చలత : చాంచల్య రహితత్వమును; పూని : వహించి; మనము : మనస్సు; తిరమై : ఏకాగ్రమై; పరిణతిన్ : పరిపాకమును; చెందినన్ : పొందిన యెడల; ధరలోన్ : భూమియందు అది : ఆపరిణామము; శమమనంగన్ : శమమను స్థాయి భావమనగా; తగున్ : ఒప్పున్; ఎట్లన్నన్

వైరాగ్యాదులచే కామాది వికారములు ఉడిగి యుండుట శమమని తాత్పర్యము.

ప్రతాపరుద్రీయంలో : వైరాగ్యాదులచే చిత్తము నిర్వికారమై ఉండటాన్ని శమమంటారు (వైరాగ్యాదినా నిర్వికార చిత్తత్వంశమని)

రసగంగాధరంలో : ఇది నిత్యము ఇది అనిత్యము అనే విచారంవల్ల పుట్టిన విషయ విరాగమను పేరుగల చిత్తవృత్తి విశేషమగు నిర్వేదము శమమని చెప్పబడింది.

## శమోదాహరణము :

ఉ॥ ఘోర భవాది దుఃఖములఁ గుందగఁ నీక నృసింహుడౌర! దు
ద్వార ఫలప్రదంబగు విరక్తి సుఖం బొనరించెనంచు నీ
వైరులు మౌనులై విపినవాటిని నీవ గురుండవంచు నీ
పేరిటి యక్షరంబులె జపింతురు శ్రీ నృసింహభూవరా! - 26

శ్రీ నరసింహ భూవరాః సంపదతో కూడిన నరసభూపాలుడా!; నీవైరులు : నీ శత్రువులు; ఘోర భవాది దుఃఖములన్ : భయంకరములగు సంసారాది దుఃఖములచేత; కుందగ నీక : దుఃఖపడనీయక; నృసింహుడు : నరసభూపాలుడు; ఔర = ఆశ్చర్యము, దుర్వార.... సుఖంబు : అనివార్యమగు మోక్ష ఫలము నిచ్చు వైరాగ్య సుఖాన్ని, ఒనరించెనంచున్ : చేసెననుచు; మౌనులై : తాపసులై; విపిన వాటిని : అరణ్య ప్రదేశమునందు, నీవగురుండవంచున్ : నీ వెగురువనుచు. నీ పేరిట యక్షరంబులె : నీ నామాక్షరములనె; జపింతురు : జపము సేయుదురు.

ఈ పద్యంలో శత్రురాజులు రాజ్యాన్ని వదిలి యరణ్యవాసం చేసి నరసింహుని యందు భక్తి కలిగి అతని నామమంత్రమును జపిస్తున్నారని చెప్పబడి ఉంది. ఆవిధంగా వారు సంసార పరిత్యాగం చేసి అడవులను ఆశ్రయించారని చెప్పటంచేత వారి వైరాగ్యము వ్యక్తమౌతున్నది.

ఇక్కడ శత్రురాజులు సంసార పరిత్యాగం చేయడం వాస్తవికమైన వైరాగ్యం కాదు. వారు ప్రాణాపాయాన్ని తప్పించుకొనటానికై అరణ్యావాసం చేశారు. అట్లాంటప్పుడు ఇది సరియైన ఉదాహరణము కాదని చెప్పవచ్చును. కానీ శత్రురాజులు మొదట్లో నరసభూపాలుడంటే కలిగిన ప్రాణ భయంవల్లనే సంసార పరిత్యాగం చేసి అరణ్యాలను ఆశ్రయించారు. క్రమంగా శత్రురాజులకు ఆ అరణ్యంలో ఉండటం వల్లనే వారికి యధార్ధమైన వైరాగ్యం కలిగింది. అందువల్లనే వారు నృసింహ నామాక్షరాల్ని జపిస్తున్నారు. మొదట వారికి ఆ సంసార త్యాగం కష్టంగా ఉండేది. క్రమంగా దానికి వారు అలవాటు పడటంవల్ల వారికి మేలుగానే తలంచారు. కాబట్టి వారిది యదార్ధమైన వైరాగ్యంగానే గ్రహించాలి.

# పాఠం - 17

## కావ్యాలంకార సంగ్రహము

## రససామగ్రి - స్థాయి భావాలు

ఆచార్య నేతి అనంతరామశాస్త్రి

**1. నిర్మాణం :**

భారతీయ సాహితీ శాస్త్రప్రవంతిలో ఎనిమిది ప్రసిద్ధ ప్రస్థానాలున్నాయి. అందులో 1. రసప్రస్థానం. 2. అలంకార ప్రస్థానం 3. రీతి ప్రస్థానము 4. వక్రోక్తి ప్రస్థానము 5. ధ్వని ప్రస్థానము 6. అనుమాన ప్రస్థానము 7. ఔచిత్య ప్రస్థానము 8. చమత్కార ప్రస్థానము ఈ ప్రస్థానాలన్నీ సాహిత్య సౌందర్యాన్ని పేర్కొనడానికి ఏర్పడ్డవే. సంప్రదాయ మార్గాలు మాత్రం భిన్నమైనవి. చాలావరకు రస సిద్ధాంతానికి పోషకాలే. రసపర్యవసాయులే, వానినిట స్వల్పంగా పరిశీలిద్దాం.

**2. లక్ష్యం :**

"విభావానుభావ వ్యభిచారీ సంయోగాద్రసనిష్పత్తిః" - అనే రససూత్రాన్ననుసరించి ఈ ప్రకరణలో విభావ స్వరూపాన్ని, అందలి భేదాలైన ఆలంబన - ఉద్దీపన విభాగాల గురించి చర్చింపబడింది. ఇంకా ఉద్దీపనను కలిగించే వస్తువులైన యౌవనము, చేష్ట, తటస్థ విభావాదులను గురించి వివరింపబడింది. అంతేకాక రత్యాధికమైన స్థాయి భావాలు సామాజికులచే అనుభవింపచేసేదైన అనుభవాన్ని సోదాహారణంగా నిరూపింపబడింది. నాయికా నాయకులకు కార్యరూపంచే ఉదయించే ఏనిమిది సాత్త్విక భావాలను లక్ష్య లక్షణాలతో చర్చింపబడింది.

## 17.1 స్థాయిభావకారణ నిరూపణము :

కం॥ ఈరసముల కుత్పాదన
కారణము విభావమనఁగఁగల; దది ద్వివిధం
బై రంజిలు; నాలంబన
మారయ నుద్దీపనంబుననఁగ ధరిత్రిన్ 27

ఈ రసములకున్ : అని ఇక్కడ చెప్పటం అనవసరం. ఇక్కడ రసములంటే స్థాయి భావాలనే అర్థాన్ని చెప్పుకోవాలి ఉత్పాదన కారణము : ఉత్పత్తి హేతువగు కారణము : విభావమనఁగన్; కలదు; అదిః ఆ విభావము; ఆరయన్: విచారింపగా; ఆలంబనంబు: ఆలంబన విభావము; ఉద్దీపనంబు: ఉద్దీపన విభావము; అనఁగన్; ద్వివిధంబై: రెండు తెఱంగులై; ధరిత్రిన్ః భూమియందు, రంజిలున్ః ప్రకాశించును.

"రత్యాద్యుద్బోధకా లోకే విభావాః కావ్యనాట్యయోః" 'లోకవ్యవహారంలో రత్యాదుత్పత్తికి కారణాలయిన నాయకాదులు కావ్యాల్లో విభావాలని వ్యవహరింపబడతారు. అని సాహిత్యదర్పణం. సామాజికుల హృదయంలో వాసనారూపంగా బీజప్రాయంగా నున్న రత్యాదిభావాలు వేనివల్ల అంకురరూపంలో ఆస్వాద్యమానములగునో అవి విభావాదువుతవని రసగంగాధరం.

రత్యాది స్థాయి భావాలను ఉత్పాదన కారణం విభావమనబడుతుంది. వ్యభిచారులలో కలిసినగాని అట్టి శక్తి కల్గదు. ఈ విభావానికి సమగ్ర రసాభివ్యక్తి కలిగించు శక్తిలేదు. విభావము ఆలంబనమనియు, ఉద్దీపనమనియు రెండు విధాలు. ప్రస్తుతం ఇందులో

శృంగార విభావాలు మాత్రమే చెప్పటం జరుగుతుంది. ఇక్కడ భావనమనగా రసములను భావింప చేసేవి కాబట్టి భావములైనాయి. విభావాల చేత ఆహృతమై, అనుభావముల చేతను, వాగంగ సత్త్వాభినయముల చేతను గమ్యమానమగు అర్థాన్ని భావమంటారు.

## 17.2 విభావస్వరూపము :

కం॥ వనితయుఁబతియును నాలం
బనమగు; నుద్దీపనంబు ప్రాయంబును సొ
మ్మును, జేష్టలు, మదనాదులు
నన (దగు; నేర్పఱతు వీనికగు లక్ష్యంబుల్ 28.

వనితయు (బతియును: స్త్రీ పురుషలిరువురును; ఆలంబనమగున్: శృంగారస్థాయి యగురతికి ఆలంబనమగునని తాత్పర్యం. ప్రాయంబును: ఆఆలంబనము యొక్క యౌవనమును; సొమ్మును - ఆభరణమును; చేష్టయున్ : వ్యాపారమును ; మదనాదులను: కామాదులును; అనన్: అనగా; ఉద్దీపనంబు: ఉద్దీపన విభావము; తగున్ : ఒప్పును; వీని కగు లక్ష్యంబుల్ : ఈ విభావములకు ఉక్తంబులగు ఉదాహరణంబులను; ఏర్పఱతున్ - వివరింతును. వాగంగ సత్త్వాభినయములు దీనిచే విభావితములగును కాబట్టి ఇది విభావమైంది. ఈ విభావముయొక్క ప్రయోజనాన్ని అభినవగుప్తుడు ఇట్లా చెప్పాడు. సామాజికులు నటుల చేష్టలను చూస్తుంటారు. అభినయాల్ని గ్రహిస్తుంటారు. ఆ అభినయములు, అనుభావాలు అనేక హేతువులననుసరించి కల్గుతాయి. హాసమనేది హర్షము మొదలగు వాని వల్ల కల్గుతుంది. అట్లే బాష్పము కేవలం ఒక్క శోకం చేతనే కల్గదు. ఘర్మము వల్లగాని, ధూమమువల్లగాని, రోగము వల్లగాని గల్గవచ్చు, అందుచే వీనివల్ల సామాజికునకు స్పష్టతకలదు కాని విభావ సాహాయ్యమున అది వెంటనే సామాజికుని మనస్సున స్ఫురించి నిశ్చయించబడుతుంది.

ఇందు పతిశబ్దం పురుష బోధకంగా ప్రయోగింపబడింది. శృంగార రసస్థాయి భావమగు రతికి నాయికానాయకులు ఆలంబన విభావము. వారియౌవనము, భూషణములు, చేష్టలును ఉద్దీపన విభావములు. ఆలంబనమంటే అధారము.

ఏ నాయికానాయకుల వలన రసావిర్భావము కలుగుతుందో ఆ నాయికా నాయకులు ఆలంబన విభావములు. అంటే రసానికి సమవాయి కారణములు. ఇతరమైన కారణజాత మంతయు ఉద్దీపన విభావము.

ఉద్దీపన విభావమంటే ఉద్దీపింప చేయు విభావము. రసాన్ని ఉద్దీపింప చేసేవి ఉద్దీపన విభావములు. యౌవనాదులు ఆ రసాన్ని ఉద్దీపింప చేస్తవి. ఈ ఉద్దీపన విభావము సహజమనీ, తటస్థమనీ రెండురకాలు. శృంగార రసంలో నాయికా నాయకుల యౌవన, భూషణ, చేష్టలు మూడూ సహజములు. మదనాదులు తటస్థ రూపమగు ఉద్దీపన విభావము. కానీ సహజముకానిది తటస్థము. ఉద్దీపన వస్తుకోటిలో మన్మథుని ఆలంకారికులెవ్వరూ చేర్చలేదు. కాని కవులు తమ ప్రబందాల్లో నాయికా విరహ వర్ణన ప్రకరణంలో ఉద్దీపక వస్తువులగు మలయానిల చంద్రాది దూషణములతోపాటు మన్మథ దూషణాన్ని గూడా చేశారు. అందువల్ల రామరాజ భూషణుడు కూడా మన్మథుడ్ని ఉద్దీపన విభావంగా పేర్కొన్నాడు.

### 17.2.1 ఆలంబన విభావము - ఉదాహరణము :

చ. అలరురతిన్ రతీశు, దమయంతి నలున్ నలువొంద ముందుగా
నలువ సృజించి యందుకతనం దనచే యశుకెల్ల (దీటినే
ర్పలవడ నో లతాంగి; నవసాధిప నిన్ నినుఁగూర్చి ప్రేమసం
కలితము గాఁగ దంపతులుగా నొనరింపఁగఁబోలు నెంతయున్ 29

నరసాధిప : నరసభూపాలుడా!; నలువః బ్రహ్మ; బలరురతిన్ : ఒప్పు చుండెడి రతీదేవిని; రతీశున్ : మన్మధుని; దమయంతిన్ : దమయంతీ దేవిని; నలున్ : నలచక్రవర్తిని; నలువొందన్ : సౌందర్యమొప్పునట్లుగా; ముందుగన్ : మొదట; సృజించి = నిర్మించి; అందుకతనన్ : ఆ హేతువుచేత; తన .... ఎల్లన్ : తన చేతి జంకంతయు; తీఱి : పోయి; నేర్పలవడన్ : చాతుర్యము కలుగగా; ఈలంతాంగిన్ : ఈ సుందరిని, నిన్నును; కూర్చి : సంఘటించి; ప్రేమసంకలితముగాఁగన్ : ప్రేమతో కూడునట్లుగా; దంపతలుగాన్ భార్యాభర్తలుగా, ఎంతయున్ : మిక్కిలి; ఒనరింపగబోలున్ : ఒనరించిన వాడు కాబోలు.

ఓ లతాంగీ! రతీమన్మథులను, నలదమయంతులను, బ్రహ్మదేవుడు ప్రప్రథమంగా సృష్టించి జంకుతీరిన పిమ్మట నిన్నును నరభూపాలడ్ని సృజించి ప్రేమపూర్ణులగు దంపతులుగా నొనరించి ఉండును.

ఇందు నరసభూపాలునకు రత్యాలంబన విభావము లతాంగియు, లతాంగికి రత్యాలంబన విభావము నరభూపాలుడుగా వర్ణించటంవల్ల ఇది శృంగార ఆలంబన విభావానికి ఉదాహరణము. ఇది రసభేదము ననుసరించి వివిధ రీతుల్లో ఉంటుంది.

### 17.2.2 ఉద్దీపన విభావము - ప్రాయము :

మ॥ వర వక్త్రేందు విలాసకృన్న వవయో వర్షావ సానంబునం
దరుణీ శైశవ సింధులింకు నెడఁ దత్తత్కాల లక్ష్యంబు లౌ
స్వరసాంతః స్థిత గండ శైలములనం జందోయి యంతంతకుం
బరగుం; దత్క్రమశోష్య రేఖలనఁగన్పట్టున్ వళీపుంజముల్

వర .... అవసానంబునన్; వర : శ్రేష్టమగు; వక్త్రేందు : ముఖచంద్రునకు; విలాసకృత్ : ప్రకాశమును చేయునట్టి; నవ వయోవర్షావ సానంబునన్ : నూతన యౌవన మనేటటువంటి శరత్కాలమునందు; తరుణీ..... సింధులు, తరుణీ : స్త్రీ యొక్క ; శైశవ : శిశుత్వమనెడు; సింధులు : నదులు; ఇంకునెడన్ : శోషించునపుడు; తత్తత్కాల లక్ష్యంబులు : ఆయాసమయములందు కనబడుచుండేవి; స్వరస... అనన్, స్వరస : ఆర్ద్రములగునట్టి; అంతస్థితఃలోపలనుండు నట్టి, గండశైలములనన్ : కఠినమైనరాళ్లు అనునట్లుగా; చందోయి : స్తనయుగ్మము; అంతంతకున్ : క్రమక్రమంగా; పరగున్ : ఒప్పును; వళిపుంజముల్ : త్రివళీ సమూహములు; తత్క్రమశోష రేఖలనన్ : క్రమ క్రమముగ నగునట్టివాని యెండుటయొక్క రేఖలనునట్లు; కన్పట్టున్ : చూపట్టును.

ఆ యువతికి బాల్యంపోయి యౌవనం వచ్చింది. అప్పుడు ఆమెకు చనుదోయి క్రమక్రమంగా కనబడింది. నీరు తీసినప్పుడు కనబడు రేఖలో అనునట్లు వళులు కనబడ్డాయి. ఈ లక్షణాలన్నీ ఆ యువతికి కలిగిన యౌవన పరిణామం.

ఇక్కట నాయకునికి రతిని ఉద్దీపింపచేయు నాయిక యొక్క యౌవనము వర్ణింపబడింది.

### 17.2.3 ఉద్దీపన విభావము - సొమ్ము

కం॥ వెలఁదికి మణి తాటంకము
లలరున్ దిగ్విజయకాంక్ష నతనుఁడు చూపున్
ములుకులు నిశాతములుగా
నలవడి వడిఁదీడు శాణ యంత్రములనఁగన్

వెలఁదికిన్ : స్త్రీకి; మణితాటంకములు : రవలకమ్మలు; అతనుడు : మన్మథుడు; దిగ్విజయకాంక్షన్ : దిగ్విజయాభిలాషచేత; చూపున్ ములుకులు : చూపులనెడి బాణాగ్రములు; నిశాతములుగాన్ : తీక్షణములగుటకు; అలవడన్ : తగునట్లు; వడిన్ : వేగముచేత; తీడు... అనఁగన్ : నూతెడు సానరాళ్ళునునట్లు; అలరెన్ : ప్రకాశించెను.

ఆ యువతియొక్క రవలకమ్మలు, మన్మథుడు దిగ్విజయార్థియై దాని చూపులను బాణాలను నూరటానికై ఉంచిన సానరాళ్ళవలె ప్రకాశించాయి.

ఇక్కడ నాయకరతిని ఉద్దీపింప చేయు నాయిక యొక్క సొమ్ము వర్ణింపబడింది.

### 17.2.4 ఉద్దీపన విభావము - చేష్ట :

చ. సుదతి నృసింహునిన్ మరలి చూచె విలాస వివర్తితాస్యయై
వదలిన ప్రేమ వెన్తవిలి వచ్చె ముఖేందుఁడఁటంచు భీతిచే
జెదరి గిరీంద్ర దుర్గముల (జేరిన చీఁకటివోలె వాసనా
స్పదమగు వాలుఁగొప్పు వలి చన్నులపై నసియాడుచుండఁగన్ 32

సుదతి : స్త్రీ; వదలిన ప్రేమన్ : వీడని అభిలాషచేత; వెన్తవిలి ... అంచున్ : ముఖచంద్రుడు వెంబడించి వచ్చెనను; భీతిచేన్ : భయముచేత; చెదరి : చలించి; గిరీంద్ర ... పోలెన్ : పర్వతదుర్గములను చేరిన యంధకారమువలె, వాసనా .. కొప్పు : పరిమళ యుక్తమగు జాఱుకొప్పు; వలిచన్నులపైన్ : చల్లని గుబ్బలమీద; అసియాడు చుండగన్ : చలించుచుండగా; విలాసవివర్తితాస్యయై : విలాసముచేత మరల్పబడిన ముఖము కలదై; నృసింహునిన్ : నరసభూపాలుని; మరలి చూచెన్ : తిరిగి చూచెను.

ముఖచంద్రుడు తన్నువెంబడించి వస్తాడన్న భయంతో ఒక యువతి ఒయ్యారంగా ముఖాన్ని త్రిప్పుకొంది. అప్పుడు పర్వతదుర్గములను దాగుటకై చేరిన చీకటియో అన్నట్లున్న కేశభారం స్తనముల మీద చలించుచుండగా నరసభూపాలుని చూచింది.

ఇక్కడ నాయిక రతికి ఉద్దీపకమయిన నాయికాచేష్ట వర్ణింపబడింది.

### 17.2.5 తటస్థ విభావము :

చిగురు కటారితో (జెఱకు సింగిణితో నలరంపు గుంపుతో
నిగనిగ మించు చెంగలువ నేజముతో వడిఁజిల్కు తేజిపై
మగఁటిమి నెక్కి శూరుఁడయి మారుడు కోకిలకంఠ కాహళుల్
నెగడ లతాంగిపై వెడలె నేఁడు నృసింహ! యెఱుంగఁజెప్పితిన్ 33

మారుడు : మన్మథుడు; చిగురుకటారితోన్ : చిగురాకనెడు కత్తితోను; చెఱకు సింగిణితోన్ : చెఱకనెడు ధనుస్సుతోను, అలరంపగుంపుతోన్ : పుష్పబాణ పరంపరలతోను; నిగ... నేజముతోన్ = నిగనిగయని ప్రకాశించు ఎఱ్ఱకలువయను చిల్లకొలతో; వడిన్ = వేగముగ; చిల్క తేజిపైన్ = చిల్కయనెనడు గుఱ్ఱము మీద; మగఁటిమిన్ = పౌరుషము చేత; ఎక్కి = అధిష్టించి; శూరుడయి, కోకిల కంఠ కాహళుల్ = కోయిలల గొంతులనెడు ధ్వనులు; నెగడన్ : అతిశయింపగా; కోయిలలు కూయుచుండగా అని అర్థము; లతాంగిపైన్ = స్త్రీ మీదికి; నేడు = ఈ దినము; వెడలెన్ = బయలుదేతెను. కోకిలాలాపాదులచే లతాంగికి కామమతిశయించింది. నృసింహ = ఓనరస భూపాలా ! ఎఱుంగన్ = తెలియునట్లు; చెప్పితిని.

కాబట్టి మన్మథుడు తన వాహనమైన చిలుకనెక్కి తన ఆయుధ సామాగ్రితో కోయిలలు కూస్తుండగా స్త్రీ మీదకు వెళ్ళాడని చెప్పటం నాయికారతికి ఉద్దీపన విభావాలుగా మదనుడు కోకిలాలాపాలను వర్ణించడంచేత ఇది తటస్థ విభావమయింది.

## 17.3 అనుభావము :

క. కారణమైన విభావము
చే రసముత్పన్నమైనఁ జెలఁగెడిదానం
బ్రారూఢ కటాక్షాదిక
మారయ నను భావమయ్యె నదియెట్లన్నన్ 34.

రసము : రసస్థాయి యగురత్యాదికము; కారణమైన విభావముచేన్ : హేతువగు నాయికా నాయకాది రూపమయిన విభావముచే; ఉత్పన్నమైనన్ : ఉదయించిన పిమ్మట; చెలఁగెడి దానన్ = ఒప్పెడుదానిచేత; ప్రారూఢకటాక్షాదికము = ఉదయించిన కటాక్ష భ్రూవిక్షేపాదికములు; ఆరయన్ : విచారింపగా అనుభావమయ్యెన్ : అనుభావములు ఆయెను. అది ఎట్లనగా.

విభావాదులచేత రసముత్పన్నమయిన పిమ్మట కలిగేటటువంటి కటాక్షాదులు అనుభావాలు. ఈ లక్షణంకంటే సాహిత్యదర్పణ లక్షణము సమంజసంగా ఉంది. విభావాదులచే ఆహృతమైన అర్థం అనుభావాలచే గమ్యమానమవుతుంది. విభావములు స్థాయిభావాన్ని ఉద్భోదిస్తుంది. తద్భావాన్ని సంసూచనము చేయునవి అనుభావాలు. విభావము కారణరూపమైనచో అనుభావము కార్యరూపము.

'అను = పశ్చాత్; భావ = ఉత్పత్తిః; యేషాంతే అనుభావాః'

కారణమగురతికి అవ్యవహితంగా తటస్థించే కార్యాన్ని అనుభావమంటారు. లేక రత్యాదికమైన స్థాయి భావమును సామాజికులచే అనుభవింపచేసేదాన్ని అనుభావము అంటారు. ఈ అనుభావాలేవో సాహిత్య దర్పణంలో ఈ విధంగా చెప్పబడింది.

"ఉక్తాః స్త్రీణామలంకారా అంగజాశ్చ స్వభావజాః ।
తద్రూపాస్సాత్త్వికా భావాస్తథా చేష్టాః పరా అపి ॥"

1. భావ, హావ; హేలలు - అంగజములు (మనోభవములు) (3)
2. శోభ, కాంతి, దీప్తి, మాధుర్యము, ప్రగల్భత, ఔదార్యము, ధైర్యము - అయత్నజములు. (7)
3. లీలా, విలాస, విచ్ఛిత్తి, బిబ్బోక, కలికించిత, మోట్టాయిత
   కుట్టమిత, విభ్రమ, లలిత, మద, విహృత, తపన, మౌగ్ధ్య, - స్వభావజములు
   విక్షేప, కుతూహల, హసిత, చకిత, కేళులు. (18)
4. స్తంభము - ప్రళయము, అశ్రువు; స్వేదము, వైస్వర్యము
   రోమహర్షణము, కంపము; వివర్ణత 8 - సాత్త్వికభావాలు
5. సంభావ్య మానములయిన చేష్టలను, పైన పేర్కొన్న 36 శృంగారమున అనుభావాలు.

మరోక సందర్భంలో - మనోజములు; వాగ్భవములు, కాయజములు, బుద్ధిజములు అను నాలుగు అనుభావములని చెప్పబడింది.

విభావాలు కారణరూపాలు - అనుభావాలు కార్యరూపాలు - వెనుక చేష్ట ఉద్దీపన విభావాలుగా పేర్కొనబడ్డాయి. శృంగార రసమున చేష్ట ఉద్దీపన విభావము. భావ హావాదులు చేష్టలు. అవి శృంగార కార్యములగుటచే అనుభావములగుచున్నవి. కటాక్షభ్రూవిక్షేపాదులు అనుభావములు కదా ! అవి నాయకునికి అనురాగ జనకములగుటచే విభావములును అగుచున్నవి. ఈ

రెండును కల్లోలాత్మకములై రసపరిపోషకములగుటచే సంచారులును అగుచున్నవి. సమస్త సంచారి భావాలును (చింతాదులు) అనురాగ కార్యములగుటచే అనుభావములును అగును. వానిని దర్శించటంవల్లను, వినటంవల్లను అనురాగాతిశయము జనించుటచే విభావములును అగుచున్నవి. భావప్రకాశంలో 'విభావం అనుభావం అవుతుంది. అనుభావం విభావమవుతుంది. ఆ రెండూ సంచారులవుతాయి. అ సంచారి భావాలు పరస్పరము అనుభావాలవుతాయి' అని చెప్పబడింది.

ఇక విభావాది వ్యవస్థ ఎట్లాంటిది అంటే ? ఇది విభావము, ఇది అనుభావము, ఇది వ్యభిచారి భావమను విభాగము ఎట్టిది అంటే ? = ఒకరి అనురాగ వ్యక్తిలో ఏ విభావానుభావ సంచారి భావాలు కలవో వానిలో సాంకర్యముండదు. అంటే నాయికా చేష్ట నాయకునిక ఉద్దీపన విభావము. అంతేకాక ఆ చేష్టయే నాయకునికి అనుభావంగా ఉండదు. అది నాయికా శృంగారమున అనుభావమై ఉండవచ్చును. ఒకడే మనుష్యుడు తన పుత్రునికి తండ్రియు, తన తండ్రికి తాను పుత్రుడునుగావచ్చునుకదా! కాబట్టి విభావాదులు వ్యక్తి భేదాన్ని బట్టి రూపాంతరాన్ని పొందుతాయి. కాబట్టి విభావాదిక వ్యవస్థ నియతము.

**అనుభావోదాహరణము**

మ॥ అలసాలోలములై యచంచలములై యాకేకరాగ్రంబులై
యలఘుప్రీడములై యనిందితములై యానందపూర్ణంబులై
సులభా సూనములై సుతీక్షణరుచులై సువ్యక్తరాగంబులై
చెలువంబొందెడు చూపు లింతి నెఱపెన్ శ్రీనారసింహేంద్రుపై 35

అలసాలోలములై : మందములు కొంచెము చలించునవియునై; అచంచలములై : తొలగనివై; ఆకేకరాగ్రంబులై : అకేకరమన దృష్టి విశేషము ముఖ్యముగ గలవై; అలఘుప్రీడములై : అధికమయిన లజ్జకలవయి; అనిందితములై : ప్రశస్తములై; ఆనందపూర్ణంబులై : హర్షపూరితములయి, సులభాసూయములై : సులభమగు ఈర్ష్యకలవై; సుతీక్షణరుచులై : మిక్కిలి తీక్షణములగుకాంతులుగలవై; సువ్యక్తరాగంబులై : మిక్కిలి వ్యక్తమగుననురాగము కలవై; చెలువంబొందెడు చూపులు; సొగసునొందిన చూపులును; ఇంతి = స్త్రీ శ్రీనారసింహేంద్రుపైన్ : నరస భూపాలునియందు, నెఱపెన్ = వ్యాపింపజేసెను.

ఇందు నరసభూపాలునియందు నాయికానురాగము యొక్క కార్యములయిన చూపులవల్ల వ్యక్తమగుచున్నది. కాబట్టి ఇక్కడ చూపులు అనుభావములుగా వర్ణింపబడ్డవి.

"అలసాలోలములై సులభాసూయములై సుతీక్షణరుచులై!" అనే విశేషం వల్ల అలసత, అసూయ, ఉగ్రత అనే వ్యభిచారిభావాలు వ్యక్తమవుతున్నాయి. అవి విప్రలంభములో ఉండదగునుకాని సంభోగములో ఉండదగవు. ఆనంద పూర్ణంబులై అనుటవల్ల విప్రలంభముకాదని తోస్తున్నది.

## 17.4 సాత్త్వికభావాలు :

క. పరగతి సుఖదుఃఖాదుల
నరయఁగ భావించి యట్ల యలరుట సత్త్వ
స్ఫురణము; తద్భవభావము
లరయఁగ సాత్త్వికములయ్యె నవియెట్లన్నన్ 36

పర .... ఆదులన్ : అన్యులుపొందిన సుఖము దుఃఖము మొదలగువానిని; భావించి : ధ్యానించి; అట్లయలరుట : వారివలెనొప్పుట; అరయన్ : విచారింపగా; సత్త్వస్ఫురణము - సత్త్వమనుట; తద్భవభావములు : ఆసత్త్వమువల్ల ఉదయించిన భావాలు; అరయగన్ : విచారించగా; సాత్త్వికములయ్యేన్ : సాత్త్వికభావములాయెను; అవి : ఆసాత్త్విక భావములు ఎట్లన్నన్.

పరగతములయిన సుఖదుఃఖాదులను భావించి తన్మయత్వాన్ని పొందటాన్ని సత్త్వమనబడుతుంది. ఈ సత్త్వశబ్దానికి అనేక అర్థాలున్నాయి. సత్యముచే నిర్వృత్తమైన భావం సాత్త్వికభావం. సత్త్వమనగా మనఃప్రభావమైన ఒకానొకస్థితి అని భరతముని నిర్ధేశ్యము

1. అభినయాదుల మూలంగా పరగత సుఖదుఃఖాలయెడ అంతఃకరణము సుముఖమవటాన్ని సత్త్వమంటారు.

2. రజస్తమస్పర్శలేని మనసును సత్త్వమంటారు.

3. తన ఆత్మయందు విశ్రమించిన రత్యాదులను ప్రకాశింపచేయు ఆంతరధర్మమును సత్త్వమంటారు.

4. భావాంతరాలతో పనిలేక రసాన్ని ప్రత్యక్షమొనర్చు బలవిశేషాన్ని సత్త్వమంటారు. అని వివిధ లక్షణాలు కనబడుతున్నాయి. ఆసత్త్వమున పుట్టినదవటం వల్ల సాత్త్విక భావాలని వ్యవహారం లేక ఆసత్త్వ దశయందు కలిగిన కార్యాలే సాత్త్విక భావాలు. ఇవి కూడా కార్యరూపములగుటచే అనుభావాలే అవుతాయి. అయినప్పటికీ కేవలం సత్త్వమునుండే పుట్టినవి కాబట్టి సాత్త్వికాలు. మిగిలిన అనుభావాలు శరీరజాలు.

### 17.4.1 సాత్త్విక విశేషణ లక్షణాలు :

స్తంభ మచంచలత్వ; మనసత్త్వమగుం బ్రళయంబు; దృగ్జలో
జ్జృంభణ మశ్రువౌః, ఁ; జెమటస్వేదము, గద్గదవాక్యవైఖరీ గుంభము
విస్స్వరత్వము; తగుం బులకంబన రోమహర్షణా
రంభము కంపమౌవడఁకు; రామకుఁబాండురుచుల్ వివర్ణతల్. 37

అచంచలత్వముః అవయవచాంచల్యములేమి; స్తంభముః స్తంభమగును అవశత్వముః ఇంద్రియ పరవశత; ప్రళయంబగున్ః ప్రళయభావమగును; దృగ్జలో జ్జృంభణముః కన్నీరు కారుట; అశ్రువౌన్ = అశ్రువను భావమగును; చెమట : స్వేదోదకము స్వేదము; స్వేదభావమగును; గద్గద..... గుంభము : డగ్గుత్తిక పడిన మాటలకూర్పు; డగ్గుత్తికతోడి మాటలనుట; విస్వరత్వము : వై స్వర్యమగును; రోమహర్షణారంభముః గగుర్పాటు కలుగుట; పులకంబనదగున్ : పులకమననొప్పును, వడకు = వడకుట; కంపమౌన్ : కంపమనునది యగును; రామకు పాండురుచుల్ : స్త్రీకి తెల్లని కాంతులు, వివర్ణతల్ : వైవర్ణ్యమనంబడును.

ఇందు ఎనిమిది సాత్త్విక భావాలు వాని లక్షణాలు చెప్పబడినవి. 1. స్తంభమున - 'అచంచలత్వము'; 2. ప్రళయమన 'అవశత్వము' 3. అశ్రువంటే - 'కన్నీరు', 4. స్వేదమంటే - చెమట, 5. వైస్వర్యమంటే గాద్గద్యము; 6. రోమాంచమంటే - గగురుపాటు; 7. కంపమంటే - వణకు; 8. వైవర్ణ్యమంటే పాలిపోవుట. భరతాదులందరు ఎనిమిది సాత్త్వికభావాలనే పేర్కొన్నారు. కాని భానుదత్తుడు రసతరంగిణిలో జృంభాచ నవమః సాత్త్వికోభావఇతి ప్రతిభాతి" (జృంభము అనేది తొమ్మిదవ సాత్త్విక భావంగా పేర్కొన్నాడు. జృంభమంటే ఆవులింత "రసానుకూలో వికారోభావః" - అంటే రసానుకూలమగు వికారము భావమని భానుదత్తుడు లక్షణాన్ని చెప్పాడు. అంతేగాక ఆ భావాలు అభ్యంతరాలు, బాహ్యాలు అని రెండు విధాలు. ఆభ్యంతరభావాలు స్థాయి వ్యభిచారులు; బాహ్యములు - సాత్త్విక భావాలు. సాత్త్విక భావాలే రసానుకూల వికారాలు. కాబట్టి రసానుకూల వికారరూప భావాలు సాత్త్వికాలే అని చెప్పవచ్చును. సాత్త్వికభావాలు అనుభావాలలో ఏకదేశమే కావచ్చును. వానికొక వైశిష్ట్యం వుంది. అని సత్త్వజములు. మిగిలిన అనుభావాలు సత్త్వజాలుకావు. ఈ సత్త్వము చిత్తవృత్తి విశేషం.

### 17.4.2 కవి ప్రతిజ్ఞా వాక్యము :

క॥ తలఁపఁగ రసకార్యములై
జలజాక్షులయందుఁ బొడము సాత్త్వికభావం
బుల కెనిమిదింటి కేర్పడ
నలరింతుం గడకతో నుదాహణంబుల్ 38.

తలఁపఁగన్ : విచారించగా; రసకార్యములై : రసజన్యములై, జలజ .... ఎనిమిదింటికిన్ : స్త్రీలయందుదయించు సాత్త్విక భావముల కెనిమిదింటికిని; ఏర్పడన్ = స్పష్టపడునట్టుగా; కడఁకతోన్ : పూనికతో; ఉదాహరణంబుల్ లక్ష్యములను; అలరింతున్ : ఒనర్తును.

ఈ పద్యంలో 'జలజాక్షులయందు' అనుట నిరర్థకము, పైన పేర్కొనినట్లు ఇట్లు పేర్కొనుట వివరీతార్థకము. కాబట్టి ఈ విశేషణాన్ని మార్చుట సమంజసము. కార్యరూపములగు సాత్త్విక భావాలను ఉదహరిస్తాను. ఈ సాత్త్విక భావాలు కేవలం నాయికకే కాక నాయకునకు కూడా ఉదయిస్తాయి. ఎట్లాగంటే.

"ఏతత్పరి స్ఫురతి పద్మదృశాం సహస్రం
అక్షిద్వయం కథయ కుత్ర నివేశయామి?
ఇత్యాకలయ్య నయనాంబురుహే నిమీల్య
రోమాంచితేన వపుషాస్థిత మచ్యుతేన"

ఏతత్ పద్మదృశాంసహస్రమ్ : ఈ స్త్రీ సహస్రము; పరిస్ఫురతిః ప్రకాశించుచున్నది, అక్షిద్వయంః నేత్రద్వంద్వము; కుత్రనివేశయామిః ఎవ్వరియందుంతును; కథయః చెపుమా; ఇత్యాకలయ్యః ఇట్లు భావించి; నయనామ్బురుహేః పద్మముల వంటినేత్రములను, నిమీల్యః మూసికొని; రోమాంచితేన వపుషాః పుట్టినరోమాంచమైన శరీరంతో; అచ్యుతేన : శ్రీ కృష్ణునిచేత, స్థితమ్ : ఉండుటయయ్యెను.

ఇదిగో! ఇక్కడ సుందరీ సహస్రము వెలుగుచున్నది. నాకందోయి ఎక్కడ ఉంచుతాను ? అని విచారించి కన్నులు మూసి కృష్ణుడు గగుర్పాటు గొన్న శరీరంతో నిలబడ్డాడు. ఇక్కడ శ్రీ కృష్ణునికి రోమాంచాన్ని వర్ణించబడింది.

### 17.4.3 స్తంభమునకు ఉదాహరణము :

చ॥ కలికి నృసింహ భూవరుని గన్గొని నిశ్చల గాత్రవల్లి యై
అలరె విలాసచేష్ట లొలయం గలయంగఁనటింప జేయు నా
వలపుల సూత్రధారుఁడనవద్య నృపాకృతి ఁజూచి తాను ని
శ్చలత వహింపఁగ్రా ఁగదల ఁజాలని జంత్రపు బొమ్మ యోయనన్. 39

కలికి : సుందరి; నృసింహభూవరునిన్ : నరసభూపాలుని; కన్గొని = చూచి; నిశ్చలగాత్రవల్లియై : చలించని తీగవంటి యంగముకలదై; విలాస చేష్టలు : విలాస వ్యాపారాలు; ఒలయన్ : వ్యాపించునట్లు; కలయంగన్ = కూడునట్టుగా; నటింపన్ .... ధారుడు : నాట్యము చేయించు ఆ మదనుడను సూత్రధారుడు; అనవద్య .... చూచి : లోకోత్తరమగు నరసభూపాలుని ఆకారాన్ని చూచి; తాను; నిశ్చలతన్ = కదలకుండుటను, వహింపగన్ : పొందగా, కదలన్ ... అనన్ = కదలలేని కీలుబొమ్మయో అనునట్లు; అలరెన్ = ఒప్పెను.

స్తంభమంటే : భయంవల్ల, హర్షంవల్ల, ఆమయాదులవ్ల శరీరానికి కలిగిన చేష్టా ప్రతీఘాతాన్ని స్తంభమంటారు. ఇక్కడ నాయిక నరసభూపాలుని చూచి నిశ్చల గాత్రవల్లియైంది. వెంటనే పరుల శరీరాలపై విలాస చేష్టలను రచించే మన్మథుడే ఆ నరస భుపాలుని చూచి నిశ్చలత్వాన్ని వహించటంచేత నాయిక కదలజాలని యంత్రపుబొమ్మయో అన్నట్లు చెప్పింది. ఇందునాయికకు హర్షంవల్ల స్తంభము కలిగినట్లు వర్ణింపబడింది కాబట్టి ఇది స్తంభమనే సాత్త్విక భావమయింది.

### 17.4.4 ప్రళయమునకు ఉదాహరణము :

ఇత్తఱి నీతలోదరి వహించె నచేతనవృత్తి శారదా
చిత్తముఁజూరగొన్న నరసింహుడు నేడు వియోగపాండువౌ

గుత్తపు గుబ్బలాఁడి పలుకుంజవరాలి వలెం జెలంగఁగా
నిత్త రళాక్షి చిత్తము నహీన రసోన్నతి ఁజూఱవెట్టెనో?

ఇత్తఱిన్ = ఇపుడు; ఈతలోదరి : ఈ స్త్రీ; అచేతనవృత్తి : చైతన్యము లేని పాషాణాదుల ఉనికివంటి ఉనికిని; వహించెన్ = ధరించెను. శారదా... సింహుడు = సరస్వతీహృదయాన్ని హరించిన నరసభూపాలుడు; నేడు ... గుబ్బలాడి = ఇప్పుడు విరహము చేత పాండువర్ణము కల : కఠినస్తని, పలుకుం ... చెలంగగాన్ = సరస్వతివలె ప్రకాశింపగా; ఇత్తరలాక్షిచిత్తమును; ఈ స్త్రీ హృదయాన్ని; అహీనరసోన్నతిన్ తక్కువ కాని రాగాతిశయంచేత; చూఱవెట్టెనో = కొల్లపెట్టెనా ఏమి ? అందువల్లనే అచేతన వృత్తి వహించెనని భావము.

నరసింహునియందు నాయిక హృదయము దృఢలగ్నమయింది. అది అచేతన వృత్తి వహించెనని వర్ణించినందున ప్రళయముగా చెప్పబడింది. నరసభూపాలుడు సరస్వతీ హృదయాన్ని హరించినాడు. అతడు తన వియోగంచేత తెల్లబారిన శరీరంగల యువతిని గాంచి అది సరస్వతియేయని తలంచి దాని చిత్తాన్ని హరించాడేమో ! అందువల్ల ఆ స్త్రీ యిప్పుడచేతన వృత్తిలో ఉంది.

ఇక్కడ అచేతనవృత్తిరూపమగు ప్రళయము వర్ణింపబడింది.

నరభూపాలుడు భావించటం చేత కలిగిన సుఖముచే అచేతనత్వము కలిగింది. దీన్నిబట్టి అత్యధికమయిన సుఖదుఃఖాలచే కలుగు అచేతనత్వము ప్రళయమవుతుంది.

### 17.4.5 అశ్రువునకు ఉదాహరణము :

చ. మగువకు నంగజానల సమగ్రము లౌ నులివేఁడి యూరుపుం
బొగ లెగయం జనించు గతి, ముత్తెపుఁ జిప్పలఁబోలు ఱెప్పలన్
నెగడు నుదశ్రుపూరములు నేత్రసరోరుహనాళ చాతురిం
డిగియె నృసింహ! యింకఁదురుణీమణిఁగౌరిట నాదరింపుమా!

మగువకున్ = కాంతకు, అంగజ .... పొగలు : మన్మథుడనెడి అగ్నితో కూడిన నులివెచ్చనైన ఊర్పులనెడిపొగలు; ఎగయన్ = వ్యాపించుటచే; జనించుగతి : పుట్టినట్టి; ముత్తెపుచిప్పలపోటు : ముత్తెపు చిప్పలను పోలినటువంటి; ఱెప్పల నెగడు ఉదశ్రుపూరము = రెప్పలయందు ప్రవహించు కన్నీరు; నేత్రసరోరుహనాళచాతురిండిగియె : పద్మపునాళములవంటి నేత్రముల నుండి జారెను; నృసింహ : నరభూపాలా! తరుణీమణి కౌగిటన్ = ఆ స్త్రీ రత్నము యొక్క ఆలింగనముచేత; ఆదరింపుమా = సంతోషింపచేయుము.
ఇక్కడ క్రోధమువల్లగాని, దుఃఖమువల్లకాని, హర్షమువల్లగాని కన్నులనుండి పుట్టిన అశ్రువును అశ్రువు అందురు. యువతికి విరహ దుఃఖముచేత అశ్రుపూరములు కలిగినట్లు వర్ణింపబడింది.

### 17.4.6 స్వేదంబునకు ఉదాహరణము :

చ॥ సతికిఁజెమర్చె మేను జలజాతదళాక్షి చతుస్సముద్ర ము
ద్రిత వసుధాధురరురుని శ్రీనృసింహుని భావవీధిలోఁ
బ్రతి దినమున్ వహించు నతిభారము వంకనొ? కాక సంతతా
పతదసమాస్త్ర శస్త్ర భవపావక కీలలఁ వేఁడివంకనో? 42

జలజాతదళాక్షి : పద్మములవంటి కన్నులు కలదానా ! చచుః... ధరునిన్ : నాలుగు సముద్రాలచే గురుతు కలదైన భూమియొక్క భారాన్ని వహించునట్టి; శ్రీనృసింహునిన్ = సుందరుడైన నరసభూపాలుని; భావవీధిలోన్ = మనఃప్రదేశమునందు; ప్రతిదినమున్ = ఎల్లప్పుడు; వహించు నతిభారమువంకనొ = మోయుచున్న అధికమగు బరువు చేతనో; కాక : అట్లుకాక; సంతతాపతత్ : ఎల్లప్పుడు

పడుచున్న అసమాస్త్ర శస్త్ర : మదన బాణములచేత; భవ = పుట్టినట్టి; పావక కీలలఁవేఁడిమంకనో : అగ్నిజ్వాలలయొక్క వేడిచేతనో, సతికిన్ = స్త్రీ; మేను చెమర్చె : శరీరము చెమ్మగిల్లెను.

రతివల్లగాని, వేడివల్లగాని, శ్రమవల్లగాని, భయంకర దర్శనంవల్లగాని, ఆకస్మిక దుర్ఘటనవల్లగాని కలుగు శరీరజలాన్ని స్వేదమంటారు. ఇక్కడ నాయిక నరసభూపాలుణ్ణి ఎల్లప్పుడు భావన చేయటం చేతగాని; లేక విరహవేదన చేతగాని కల్గిన శ్రమవల్ల స్వేదము కలిగినట్లు వర్ణింపబడింది.

### 17.4.7 వైస్వర్యమునకు ఉదాహరణము :

చ॥ అమరఁ బరాంగనా నఖముఖాంకితుఁడైన నృసింహభూవరుం
గమల దళాక్షి చూచి తమకమ్మున దూఱెదనన్న గద్గద
త్వమునఁ బొసంగవయ్యె సతీవాక్యము; లాంతరమై చెలంగు నె
య్యము హృదయేశు దూఱవలదంచు నిరోధ మొనర్చునో యనన్ 43

అమరన్ = ఒప్పునట్లుగా; పరాంగనా నఖముఖాంకితుడైన : ఇతర వనితయొక్క; నాఖాగ్రములచే చిహ్నితుడైన; నరసభూవరున్ : నరసభూపాలుని; కమలదళాయతాక్షిచూచి : కమల దళములవంటి కన్నులు గల ఆమె చూచి; తమకమ్మున = వేగమున, దూఱెదనన్నన్ = దూషించెదననగా; గద్గదత్వము నన్ = డగ్గుత్తికచే; ఆంతరమైచెలంగు నెయ్యము : లోపలనున్నదై ఒప్పు ప్రీతి; హృదయేశున్ = ప్రాణాథుని, దూఱవలదంచు : దూషించు తగదని; నిరోధమొనర్చునోయనన్ = అడ్డగించెనా యనునట్లు, పొసంగవయ్యె సతీవాక్యము = నాయిక యొక్క వచనములు ఒప్పవయ్యెను.

మదముచేత, సంతోషంచేత, నిద్రలేక పోవటంచేత, ఉచ్ఛారణాధిక్యము చేత, పీడాదులచేత కలిగేటటువంటివై స్వర్యాన్ని గాద్గద్యమంటారు. ఇక్కడ నరసభూపాలుడు వేరొక స్త్రీని కలిసి వచ్చినట్లుగా గల చిహ్నాలను చూచి దూషిద్దామని ప్రయత్నం చేసినప్పటికీ ఆమె నోటమాట రాలేదు. ఇక్కడ నిరోధరూపమైన పీడచే కలిగిన వైస్వర్యము వర్ణితమైంది.

### 17.4.8 రోమాంచమునకు ఉదాహరణము :

చ॥ కలికి నృసింహునింఁదలఁపఁగా నెలమింబులక ప్రకాండముల్
మొలచె మనోజ హాలికుడు మోద మెసంగఁ గురంగనాభపం
కిలమగునింతి గాత్రమను క్షేత్రమునన్ వెలయంగఁజేయు న
స్ఖలిత మనోమనోరథనికాయము లీరిక లెత్తెనోయనన్ 44.

కలికి : కాంత; నృసింహునిన్ : నరసభూపాలుని; తలఁపగా : స్మరింపగా; ఎలమిన్ = మిక్కిలి, పులక ప్రకాగండముల్ : పులకల గుంపులు; మనోజహాలికుడు : మన్మథుడను కర్షకుడు; మోదము ఎసంగన్ = సంతోషమతిశయిల్లగా; కురంగ... క్షేత్రమునన్ : కస్తూరిచేత పంకిలమైన నాయికశరీరమును పొలమునందు; వెలయంగన్ ... నికాయము : వెలయజేయునట్టి దృఢములయిన కోరికలగుంపులు; ఈరికలెత్తెనో : మోసులెత్తెనో యనునట్లు; మొలచెన్ : ఉదయించెను.

హర్షము, అద్భుతము, భయము మొదలగువానివల్ల కలుగు రోమవికారమును రోమాంచమందురు. మన్మథుడనే సేద్యకాడు సంతోష మతిశయించగా యువతి యొక్క కస్తూరి పూతగల శరీరమును పొలములో జల్లిన మనోరథములు మొలకెత్తెనో అన్నట్లు పిలకలు పుట్టాయి. ఇక్కడ నాయిక నృసింహుని తలంచగా కలిగిన హర్షంచేత రోమాంచం కలిగింది.

**17.4.9 కంపమునకు ఉదాహరణము :**

ఉ॥ చెన్నగు శ్రీ నృసింహ విభుఁజిత్రపటంబున వ్రాసి బింకపుం
జన్నుల మీఁద ఁజేర్చుకొని చాలవడంక ఁదొడంగె బాల; దాఁ
గన్నుల వింటివాఁడు త్రిజగంబు జయించెద నంచు ఁగోరి చే
నున్న కృపాణవల్లికి మహోజ్జ్వలతన్ జళిపించెనో యనన్ **45**

బాల : చిన్నది; చెన్నగు ... విభున్ : సుందరుడగు శ్రీ నరసభూపాలుని; చిత్ర పటంబునన్ : చిత్తరువు పటమందు; వ్రాసి : లిఖించి; బింకపుం ... కొని : బిగువైన గుబ్బలపైనుంచుకొని; కన్నువింటివాడు : చెఱకు విల్లుగా కలిగినవాడు; తాన్ = తాను; త్రిజగంబు ... కొరి : ముజ్జగములు గెలిచెనని దలంచి; చేనున్న కృపాణవల్లికన్ : చేతనున్న తీగవంటి ఖడ్గమును; మహోజ్జ్వలతన్ : మిక్కిలి ప్రకాశముచేత; జళిపించెనోయనన్ : కంపింప చేసెనో యనునట్లు; చాలున్ = మిక్కిలి; వడంకదొడంగెన్ = వణికి పోసాగెను.

రాగము; ద్వేషము, శ్రమము, ఘోరదర్శనాదులవల్ల శరీరం వణుకుతుంది. దాన్నే కంపమంటారు. నాయిక నరసభూపాలుని చిత్రపటాన్ని వ్రాసుకొని తన స్తనాలపై ఉంచుకొన్నంతనే మన్మథుడు ముల్లోకాలను గెలిచి తన్ను తీగవంటి ఖడ్గంచేత కంపింపజేశాడో అన్నట్లు ఉండటం వల్ల ఆమె వణికిపోసాగింది. కాబట్టి ఇక్కడ నాయికకు కలిగిన అనురాగంవల్ల కంపము కలిగినట్లు వర్ణింపబడింది.

**17.4.10 వివర్ణతకుదాహరణము :**

ఉ॥ మానవతీలలామ యసమాన సముజ్జ్వల గాత్రవల్లిపైఁ
గానఁగనయ్యెఁ బాండుతరకాంతి, నిరంతరమై మనంబునన్.
శ్రీనరసింహభూవరు ధరింపఁగఁ దద్వదనేందుమండలీ
మానిత చంద్రికారస సమాజము పై పయిఁ బర్వెనోయనన్ **46**

మానవతీ.... పైన్; మానవతీలలామ : ఉత్తమ స్త్రీయొక్క; అసమాన : సాటిలేనట్టి; సముజ్జ్వల = ప్రకాశించునట్టి; గాత్రవల్లిపైన్ : తీగవంటి శరీరమందు; పాండుతరకాంతి : తెల్లని కాంతి; నిరంతరమై : దట్టమయి; మనంబునన్ : మనస్సునందు; శ్రీనరసింహభూవరున్ : శ్రీ నరసభూపాలుని; ధరింపగన్ : తాల్పగా; తద్వన... సమాజము : తద్వదనేందుమండలీ : ఆ రాజముఖమనెడు చంద్రమండలముయొక్క; మానిత : శ్రేష్టమయిన; చంద్రికారస సమాజము : వెన్నెల అనెడి ద్రవపుంజము; పై పయిన్ : మీఁద మీదుగా; పర్వెనోయనన్ : వ్యాపించెనా యనునట్లుగా, కానగ నయ్యెన్ : కన్పించెను.

విషాదంవల్లగాని, మదమువల్లగాని, రోషమువల్లగాని కలుగు అన్యవర్ణతను వివర్ణత అంటారు. వివర్ణత అంటే పాలిపోవుట అని ఇక్కడ చెప్పటం పొరపాటు. శృంగార రసంలో పాండు రుచియే కావచ్చును. ఈ సాత్త్విక భావము ఇతర రసములలో కూడ రావచ్చును. అక్కడ పాండురుచియే కలుగుతుందని చెప్పలేము. ఈ వివర్ణత్వము శోక, మోహాల వల్లకూడా కలుగుతుంది.

ఇక్కడ మనస్సులో నిరంతరము నాయిక నరసభూపాలుని భావించటం చేత అతని ముఖచంద్ర చంద్రికాపురము పైకుబికెనో అన్నట్లుగా యువతి శరీరము తెల్లబడింది. ఇక్కడ మోహంవల్ల ఈ వివర్ణత కలిగింది.

సమీక్ష :

ఈ ప్రకరణంలో విభావాదులు అందలి భేదాలను గురించి సోదాహరణంగా వివరింపబడింది. అంతేకాక అనుభావాలు, సాత్త్విక భావలక్షణం, లక్ష్యాలు వివరింపబడింది.

ఈ సాత్త్విక భావ నిష్పత్తి విషయంలో హేమచంద్రుడు భిన్నమతాన్ని ప్రతిపాదించాడు. సత్త్వగుణం యొక్క ఉత్కర్షచేతను, సాధుత్వం చేతను ప్రాణాత్మకమైన వస్తువే సత్త్వం. దానినుండి పుట్టినది సాత్త్విక భావమనబడుచున్నవి.

1. పృధ్వీభాగ ప్రధానమైన ప్రాణమందు సంక్రాంతమైన చిత్తవృత్తి గణము స్తంభమంటారు. విష్టబ్దచేత సత్వము దీని లక్షణం.

2. జలభాగ ప్రధానమైన ప్రాణమందు సంక్రాంతమైన చిత్తవృత్తిగణము బాష్పమవుతుంది.

3. తేజస్సుకు ప్రాణముతోడి సామీప్యం చేత ద్వైవిధ్యం సంభవిస్తుంది.

4. తీవ్రమైన ప్రాణానుగ్రహంచే స్వేదం పుట్టుతుంది

5. అతి తీవ్రమైన అనుగ్రహంచే వైవర్ణ్యము కలుగుతుంది

6. ఆకాశభాగ ప్రధానమైన ప్రాణమందు సంక్రమించిన రత్యాది గణము ప్రళయమవుతుంది. గతచేతనత్వము ప్రళయం లక్షణం.

7. వాయు స్వాతంత్ర్యంచే ప్రాణానికి, మంద - మధ్యకు - ఉత్కృష్టావేశాలు కల్గుతాయి. దానితో సంక్రమించిన రత్యాదులు వరుసగా రోమాంచము, వేపథువు, వైస్వర్యభేదము లవుతాయి. ఇది భరతముని అభిప్రాయము.

బాహ్యములు, శరీరధర్మములు, అనిలభావములునైన ఈ స్తంభాదులు అంతరాళికములైన స్తంభాదులను సూచిస్తాయి. పరమార్థంచే రతి నిర్వేదాది గమకములగుచున్నాయి.

## సమీక్ష :

ఇందులో విభావ-అనుభావ- సాత్త్విక భావాలను గురించి సోదాహరణంగా వివరింపబడింది. ఇవి రసనిష్పత్తిని కలిగించే సాధన సామగ్రి. ఈ మూడేగాక వ్యభిచారి భావాల సంయోగంతోనే రసనిష్పత్తి కలుగుతుంది. వీనిలో ఏది లోపించినా రసస్ఫూర్తి కలగదు. విభావాదులచే ఆ హృతమై, అనుభావాలచేత, సత్త్వముచే నిర్వృత్తమైన సాత్త్విక భావాలు ఏ విధంగా రసస్ఫూర్తికి దోహదపడుతున్నాయో పైన పేర్కొనటం జరిగింది.

## ప్రశ్నలు :

1. విభావ స్వరూపాన్ని తెల్పండి ?

2. అనుభావాన్ని వివరించండి ?

3. సాత్త్వికభావాల ప్రయోజనాన్ని తెల్పి రెండింటిని సోదాహరణంగా వివరించండి ?

## ఆధార గ్రంథాలు :

సంస్కృతము :

1. నాట్యశాస్త్రము - భరతుడు

2. రసగంగాధరము - పండిత జగన్నాధరాయలు

3. సాహిత్యదర్పణము

4. ప్రతాపరుద్రీయం - ప్రతాపరుద్రుడు

తెలుగు

1. కావ్యాలంకార సంగ్రహము - సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి

2. రససిద్ధాంతం - ఆంధ్రుల వరివస్య - డా॥ తిప్పాభట్ల రామకృష్ణశాస్త్రి

## పాఠం - 18

### కావ్యాలం కార సం(గహము

# సంచారి భావాలు (వ్యభిచారి భావాలు)

**ఆచార్య నేతి అనంతరామశాస్త్రి**

## నిర్మాణం

రససూత్రమునందు మూడవపదము వ్యభిచారి శబ్దము-వీనికే సంచారిభావములని నామాంతరముకలదు. ఈ శబ్దాన్ని గూర్చి, తదర్థాన్ని గురించి భరతుడు నాట్యశాస్త్రంలో వివరించాడు. "వ్యభిచారిణ ఇతికస్మాత్? ఉచ్యతే - వి - అభిఇత్యేతా వుపసర్గౌ చర ఇతి గత్యర్థోధాతుః వివిధ మాభిమూఖ్యేన రసేషు చరంతీతి వ్యభిచారిణః వాగంగ సత్త్వో పేతాన్ ప్రయోగే రసాన్నయంతీతి వ్యభిచారిణః"

వి-అభి అనేవి ఉపసర్గములు. చరధాతువు గత్యర్థకము. రసములయందు వివిధరీతుల అభిముఖ్యముతో చరించును కాబట్టి ఇవి వ్యభిచారులు. వాగంగసత్త్వోపేతము లైన రసములను ప్రయోగమునాచరింపచేస్తాయి. అంటే తీసికొనిపోతాయి. సహృదయాస్వాద యోగ్యమొనరుస్తాయి. ఈకొని పోవుటను గురించి భరతుడేయిట్లు సోదాహరణంగా చెప్పుచున్నాడు.

సూర్యుడు ఈ దినమును లేదా నక్షత్రమును తీసికొని పోవుచున్నాడనుట, లోకంలో ప్రసిద్ధప్రయోగంగా కన్పిస్తున్నది. అచట సూర్యుడు పైవానిని బాహువులతో గాని, స్కంధముచేగాని, మోసుకొని పోడు, కానీ తీసికొనిపోవుచున్నాడని మాత్రం అంటారు. అట్లే ఈ వ్యభిచారిభావాలు రసములను కొనిపోతాయి. అంటే వ్యభిచారి భావములను రసరూపోపచయమునందు స్థాయి భావముల కుపకరిస్తున్నవి. ఉపకరించి నశిస్తున్నవి కూడ. ఈ విధంగా ఆభిముఖ్యమున చరిస్తున్నవి. ఇట్లు రసపరిణామపదవిని పొందింపజేస్తవి.

దశరూపకకారుడు దీనినిట్లు చెప్పాడు :

రత్యాది స్థాయిభావాలు రసత్వ పరిణామాన్ని పొందేటప్పుడు ఇవి ఆభిముఖ్యమునచరిస్తాయి. వీనిని వారధియందలి అలలతో పోల్చారు. ఇవి అప్పటికప్పుడు పుట్టి నశిస్తవే కాని స్థిరంగా ఉండేవికావు. ఈ భావాలు ప్రత్యేక రసమునకే అనునియమంలేక సర్వరసములందును వ్యభిచరించుటంచే కూడా వీనిని వ్యభిచారులంటారు.

## 18.0 లక్ష్యం :

"విశేషాదాభిముఖ్యేన చరంతో వ్యభిచారిణః

స్థాయిన్యున్మగ్న నర్మిగ్నాః కల్లోలా ఇవవారిధౌ"

అని దశరూపక కర్త పేర్కొన్నశ్లోకము. దీన్నిబట్టి తెలిసేదేమంటే రత్యాదిస్థాయి భావాలు రసత్వ పరిణాన్ని పొందేటప్పుడు ఈ వ్యభిచారిభావాలు అభిముఖ్యమున చరిస్తాయి. వీనిని వారిధియందలి అలలతోపోల్చారు. ఇవి ఎప్పటికప్పుడు పుట్టి నశించునవేకాని స్థిరంగా ఉండేవి కావు. ఈ భావాలు ప్రత్యేక రసానికే అనే నియమంలేక సర్వరసముల యందును వ్యభిచరించుటచే కూడా వీనిని వ్యభిచారులని అంటారు.

## 18.1. సంచారి భావలక్షణము :

కం॥ అహరహము రసోత్పత్తికి
సహాయభావంబు లెలమి సంచారులగున్
మహి నివి ముప్పదిమూఁడై
మహితములగు వీనికిం గ్రమం బేర్పఱతున్ 47

అహరహమున్ : ఎల్లప్పుడును; రసోత్పత్తికిన్ : రసోదయమునకు; ఎలమిన్ : మిక్కిలి; సహాయభావంబులు : సహకారులగు భావమ్ములు, సంచారులగున్ : సంచారి భావములగును; అవి : ఆ భావాలు ; మహిన్ : భూమియందు; ముప్పదిమూఁడై : ముప్పదిమూడు భావాలై; మహితములగున్ : పూజితములగును ; వీనికిన్ : ఈ సంచారులకు ; క్రమంబు : వరుసను ; ఏర్పఱతున్ = నిరూపించెదను.

అభివ్యక్తమైన భావాన్ని వ్యభిచారులంటారు. రసవ్యక్తికి సహాయ భూతులగు ఈ భావాల్ని సంచారులంటారు. సంచారి భావాలన్నను వ్యభిచారిభావాలన్నా ఒక్కటే. దీనికన్న సాహిత్యదర్పణ లక్షణం సమంజసంగా ఉంది.

“విశేషావాభిముఖేచ చరంతో వ్యభిచారిణః ।
స్థాయిన్యున్మగ్న నిర్మగ్నా స్త్రయ స్త్రింశత్ప్రకీర్తితాః ॥

విశేషించి అనగా విభావ, అనుభావ, సాత్త్విక భావాలకంటే అతిశయించి రసానుగుణంగా చరించేవి వ్యభిచారులు (వి + అభితః + చరంతి వ్యభిచారిణః) ఇవి స్థాయియగు రత్యాదులందు ప్రాదుర్భావ తిరోభావాల్ని పొందుతూ చరిస్తాయి. సంచారులంటే (సమ్యక్ చారయంతి) బాగుగా రసాన్ని ఎల్లయెడలను వెదజల్లేవి సంచారి భావాలు. ఇవి ముప్పదిమూడు. స్థాయిభావం సముద్రంవంటిది. సముద్రంలో తరంగాలు ఆవిర్భవిస్తుంటాయి. తిరోభావాన్ని పొందుతుంటాయి. అట్లే వ్యభిచారిభావాలు స్థాయి భావమునందు మజ్జనోన్మజ్జనములు చేస్తుంటాయి. ఆవిర్భావ తిరోభావ సామ్యమును బట్టియే వ్యభిచారులకు తరంగాలతో సామ్యము. ఈ వ్యభిచారిభావాలు స్థాయిభావాలను బాగుగా పోషించి వానిని రస్యమానములుగా చేస్తాయి.

## 18.2. సంచారి భావనిరూపణము :

శా॥ నిర్వేద శ్రమ దైన్య జాడ్యములు, గ్లాని త్రాస శంకార్తి రు
ఢ్గర్వావేగ ధృతి స్మృతుల్! చపలతో గ్రత్వావహిత్థా త్రపాం
తర్వ్యైక్లబ్య మదోత్సుకత్వ మతి నిద్రామోహ బోధాంతము
త్సర్వాలస్య వితర్క సుప్త్య సహతా ధ్యాన భ్రమాప స్మృతుల్.48

1. నిర్వేదము 2. శ్రమము 3. దైన్యము 4. జాడ్యము (జడత) 5. గ్లాని 6. త్రాసము 7. శంక 8. ఆర్తి (వ్యాధి) 9. రోషము (అమర్షము) 10. గర్వము 11. ఆవేగము 12. ధృతి 13. స్మృతి 14. చపలత 15. ఉగ్రత్వము (ఔగ్ర్యము) 16. అవహిత్థ 17. త్రప (లజ్జ) 18. అంతర్వ్యైక్లబ్యము (విషాదము) 19. మదము 20. ఉత్సుకత్వము (ఔత్సుక్యము) 21. మతి 22. నిద్ర 23. మోహము 24. బోధము 25. అంతము (మరణము) 26. మదము (హర్షము) 27 ఆలస్యము 28. వితర్కము 29. సుప్తి (స్వప్నము) 30. అసహత (అసూయ) 31. ఆధ్యానము (చింత) 32. భ్రమము (ఉన్మాదము) 33. అపస్మారము - ఇవి సంచారి భావాలు.

భరతుడు ఎనిమిది స్థాయిభావాలను కూడా ఇతర రసాలయందు వ్యభిచారులని చెప్పాడు. ఆ విధంగా అయితే వ్యభిచారిభావాలు (33 + 8 = 41) నలభైఒకటి అవుతాయి.

1. శోకస్థాయి భావం వ్యభిచారి యైనపుడు ఈ ముప్పది మూడింటిలో 'విషాదము' వ్యర్థమౌతుంది.

2. భయస్థాయి భావం వ్యభిచారియైనపుడు 'త్రాసము'వ్యర్థమౌతుంది.

3. క్రోధస్థాయి భావం వ్యభిచారియైనపుడు 'ఆమర్షము' వ్యర్థమౌతుంది.

4. వ్యభిచారిభావాల్లోని గ్లాని, శ్రమలలో ఒక్కటే చాలు. అని ఈ విధంగా ఈషద్వైషమ్య మవివక్షతం' అనులోకోక్తిని బట్టి వానికిగల అలతి భేదాన్ని లెక్కింపక వ్యభిచారిభావాల్ని కొందరు ఆలంకారికులు తగ్గించారు. భోజుడు తన శృంగార ప్రకాశికలో 'అపస్మార, మరణాలను' తీసివేసి 'ఈర్ష్యాశమము'లను గ్రహించాడు. భానుదత్తుడు రసతరంగిణిలో 'ఛలము' అనుమరొక వ్యభిచారి భావాన్ని కలిపాడు. 'గురుదేవ' "నృపపుత్రాది విషయా రతిశ్చేతి చతుస్త్రింశత్" గురు నృప పుత్రాది విషయకమగు రతికూడ భావమే. కాబట్టి భావాలు ముప్పదినాలుగు అని రసగంగాధరుడు చెప్పాడు.

## 18.3. కవిప్రతిజ్ఞావాక్యము :

క॥ ఈవరుసఁ ద్రయస్త్రింశ
ద్భావములకు లక్షణము లుదాహరణంబుల్
వావిరినొనర్తు నీయెడ
గేవల శృంగార సూత్ర కీలిత భంగిన్ - 49

ఈ వరుసన్ = ఈ ప్రకారముగా; త్రయస్త్రింశద్భావములకున్ : ముప్పదిమూడు భావాలకు ; లక్షణములు దాహరణంబుల్ : లక్షణంబులును లక్ష్యములను ; వావిరిన్ : వెంబడిగనె; ఈయెడన్ : ఇపుడు ; కేవలం ... భంగిన్ = ఒకటైన శృంగార రసమనెడు సూత్రముచేత కూర్చబడిన వాక్కుచేత ; ఒనర్తున్ = రచియింతును.
ఈ వ్యభిచారులు సర్వరసాలయందున్న ఒక శృంగారానికి చేరినవానికే లక్షణ లక్ష్యాలు రచియిస్తానని తాత్పర్యం. కానిలక్షణాలు శృంగారానికే కాక యితర రసాలకును సాధారణంగా ఉన్నాయి.

## 18.4. నిర్వేద లక్షణము :

నిరుపమ దుఃఖేర్ష్యాదుల
నిరతము జనియించు నరతి నిర్వేదమగున్. 50

నిరుపమ ... ఆదులన్ : సాటిలేని దగుదుఃఖము ఈర్ష్యమొదలగు వానిచేత, నిరతము : ఎల్లప్పుడు ; జనియించు నరతి : పుట్టినట్టి యప్రీతి, నిర్వేదమగున్ : నిర్వేదభావమగును.

దుఃఖము, ఈర్ష్య మొదలగువానివల్ల కలిగేటువంటి అరతియే నిర్వేద మందురు. ఇందు నిర్వేదాదులకు ఇవ్వబడ్డ లక్షణాలు అసమగ్రంగా దోషగ్రస్తములుగా ఉండటంచేత రసగంగాధర లక్షణాలు కూడా ఇందివ్వబడ్డాయి. నిర్వేదమంటే నీచులకు, ఆక్రోశన, అధిక్షేప, వ్యాధి, తాడన, దారిద్ర్య, ఇష్టవిరహ, పర సంపద్దర్శనాదులచేతను, ఉత్తములకు పరతిరస్కారాదుల వల్ల పుట్టిన విషయ ద్వేష నామాంతరంగల చిత్తవృత్తి, అధి కలిగినపుడు రోదనము, దీర్ఘనిశ్వాసము (నిట్టూర్పు) దీన ముఖత్వము మొదలైనవి కలుగుతాయి.

రసము విభావాను భావాలచే వ్యజ్యమానమయిన చందమున భావంకూడా విభావాను భావాలచేతనే వ్యజ్యమానం కావాలి. నిర్వేదానికి ఆక్రోశనాదులు విభావాలు. రోదనాదులు అనుభావాలు. విభావానుభావాలచే ఇట్లు వ్యజ్యమానమైన వ్యభిచారి భావాన్ని భావధ్వని అంటారు.

అయితే రసానికి భావానికిగల భేదమేమి? అంటే - అధిక విభావాలవల్ల వ్యక్తములయిన రత్యాదిస్థాయి భావాలు రసములు. అల్పవిభావాలవల్ల వ్యక్తములయిన వ్యభిచారి భావాలు భావములవుతాయి. అంటే బాగుగా పరిపుష్టమైనది రసము. అపరిపుష్టమైనది భావము.

ఒక్కొక్కప్పుడు ఒక వ్యభిచారిభావం వ్యంగ్యమయినపుడు దాని సామగ్రిచేత, అవినాభావంచేత అంతకన్న అల్పంగా మరొక భావం కూడా ధ్వనింపవచ్చును. ఎట్లంటే గర్వము ప్రధానంగా వ్యంగ్యమయినపుడు అమర్షము అల్పంగా ధ్వనిస్తుంది. అమర్షము ప్రధానంగా వ్యంగ్యమయినపుడు గర్వము అల్పంగా ధ్వనిస్తుంది. అట్లాంటప్పుడు ఒకటి ప్రధానం. రెండవది గుణీభూతం అవుతుంది గదా ! ఇక్కడ అట్లాంటి అనుమానంలేదు. ఎందుకంటే ఇవి ప్రత్యేక విభావాను భావాలచే వ్యంగ్యములు కావు గదా !

**18.4.1 నిర్వేదోదాహరణము :**

కం॥ శిలలు మణిభూషణంబులు
చెలువగు హారములు జలధిఁజిందిన చినుకుల్
తలిరాకుఁ బోఁడి ! నా కగు
సులభదయానిధి నృసింహుఁజూడక యున్నన్ - 51

తలిరాకుఁబోఁడి : ఓసఖీ ! నాకున్ ; సులభదయానిధిన్ నృసింహున్ : సుకరమైనదయకు నివాసమగు నరసభూపాలుని; చూడక యున్నన్: చూడనప్పుడు; మణి భూషణంబులు = మణిమయములైన యాభరణములు ; శిలలు = రాళ్ళే ; చెలువగుహారములు = అందమైన ముత్తెపు సరములు "హారోముక్తావళీ" అని అమరము; జలధిఁజిందిన చినుకుల్ = సంద్రమందు బడిన ఉదకబిందువులే ; అగున్ = అగుచున్నవి.

నరసభూపాలుని చూడకపోతే నాకు మణిభూషణములు రాళ్ళేసుమీ? ముత్యాలహారాలు నీటి చినుకులు సుమా ! ఈ యువతి మణిభూషణాలను రాళ్ళుగాను, హారాలను నీటి చినుకులుగా తలంచటంచేత ఇది నిర్వేదము. ఇక్కడ 'ఇష్టవిరహము'- (నృసింహుని యదర్శనము) విభావము. దైన్యాదు లనుభావములాదక్ష్యేపములు (ఊహ్యములు) వీని నిర్వేదము వ్యక్తమగుచున్నది.

## 18.5. శ్రమ లక్షణము :

క॥ సురత గమనాది సంభవ
సరస స్వేదాంబులహరి శ్రమ ; మెట్లన్నన్.

సురత ... లహరి : సురతము, గమనము, బరువుమోయుట మొదలగు వానివల్ల ఉదయించు ఉత్తమమగు చెమట నీటి ప్రవాహము. శ్రమము : శ్రమమను భావమగును. ఎట్లన్నన్ : ఎట్లంటే

సురతక్రీడా వ్యాపారం వల్లను, గమనాది వ్యాపారముల వల్లను పుట్టిన స్వేదాన్ని శ్రమమంటారు.

బహుతరమైన శరీరవ్యాపారంచేత పుట్టింది నిట్టూర్పు; శరీరము నలిగిపోవుట; నిద్ర మొదలగువానిని కలిగించు ఖేద విశేషాన్ని శ్రమము అంటారు. ఇచట శరీర వ్యాపారము విభావము; నిశ్శ్వాస, అంగ సమ్మర్ద, నిద్రాదులు అనుభావాలు. వీనిచే వ్యక్తమగు సంచారి భావము శ్రమము. నరసభూపాలీయ శ్రమ లక్షణ పద్యంలోని 'సరసస్వేదాంబులహరి శ్రమము' అనేది సరికాదు.

"మార్గగమనము; వ్యాయామసేవ మొదలగు విభావాలవల్లను గాత్ర సంవాహనము, ముఖసంకోచము, ఒళ్లు విఱుపు, నిట్టూర్పులు, ఆవులింతలు, కాళ్లెత్తుచుండుట అను అనుభావాలచేత శ్రమ వ్యక్తమవుతుంది అని వేరొకచోట కలదు.

**18.5.1. శ్రమమునకుదాహరణము :**

కం॥ నరసేంద్రుఁజూడ రయమున
నరుదెంచి లతాంగి శ్రమ జలాపూరితయై
సరసేందు కిరణ పరిణతి
గరఁగిన నెలచట్టు బొమ్మకైవడి నమరెన్ 52

లతాంగి : స్త్రీ; నరసేంద్రున్ ; నరసభూపాలని; చూడన్ = చూచుటకు; రయమునన్ = వేగంగా; అరుదెంచి = వచ్చి ; శ్రమజలాపూరితమై: శ్రమచే ఉదయించిన ఉదకముచే వ్యాప్తమై; సరస... పరిణతిన్ : సరస : మనోజ్ఞములగు; ఇందుకిరణ ; చంద్రకిరణములయొక్క, పరిణతిన్: వ్యాప్తిచేత; కరగిన ... కైవడిన్ = ద్రవించిన చంద్రకాంత మణిప్రతిమవలె, అమరెన్ : ఒప్పెను.

నరసభూపాలుని చూడటానికి వచ్చిన ఒక యువతి చెమటచేత చెమ్మగిల్లి; చంద్రకిరణ పాతముచేత కరగిన చంద్రకాంత శిలాకృతమగు బొమ్మవలె ఉంది. లక్షణ పద్యంలోని "సర్వస్వేదాంబులహారి" దుష్టమని తెలిపితిమి. ఏ లక్షణ గ్రంథమునందును శ్రమమన 'స్వేదము' అని చెప్పబడలేదు.

ప్రతాపరుద్రీయంలో : మార్గగనము, సురతము మొదలగువాని వల్లకలిగిన ఖేదము (బడలిక) శ్రమము. అది మిక్కిలి స్వేదాన్ని కలిగిస్తుంది అనేది యుక్తము. ఏలాగంటే శ్రమకు అధ్వ రత్యాదులు విభావాలు; స్వేదము అనుభావమవుతుంది. ఈ రెంటిచే శ్రమ వ్యక్తమౌతుంది. అయితే రసరంగాధర లక్షణమున గాని, మరొక లక్షణమునగాని స్వేదమను భావంగా చెప్పలేదు. 'నరసేంద్రుఁజూడ రయమున ' అనుపద్యంలో 'అరుదెంచుట'- విభావము. స్వేదమనుభావము. ఈ రెంటిచే శ్రమవ్యక్తమగును. సురతశ్రమకీక్రింది ఉదాహరణాన్ని పరిశీలింపుడు.

"చెదరినముంగురుల్ సరిఁగఁజేర్పుము చెల్వుఁడ! బొట్టుదిద్దుమీ!

నుదుట విలాసి! కూర్పుము చనుంగవఁ ద్రెస్సిన ముత్తెపున్ సరుల్

హృదయ సఖుండ!" యంచు వచియించి రతాంతమునందు వాని తాఁ

కుదలకొడల్ గగుర్పొడువఁ గోమలి క్రమ్మఱఁబొందె మోహమున్".

ఇట సురతక్రీడ విభావము; ఆవలింతలు, నిట్టూర్పులు, అంగసమ్మర్దము, మొదలగు అనుభావము లాక్షేప్యములు. వీనిచేత శ్రమవ్యక్తమౌతున్నది. "చెదరిన ... హృదయ సఖుండ" - అన్నంతవరకే శ్రమ.

## 18.6. దైన్య లక్షణము :

కం॥ "బలమఱి యరికిన్ దయరాఁ
బలుకుట దైన్యంబనగఁ బరఁగున్" 53

బలమఱి : సామర్థ్యముడిగి; అరికిన్ : శత్రువునకును; దయరాన్ : దయవచ్చునట్లు ; పలుకుట : వచించుట; దైన్యంబనంగఁబరఁగున్ : దైన్యమను భావమై ఒప్పును.

బలముడిగి శత్రువుతో కనికరంబు కలుగునట్లు పలుకుటను దైన్యమంటారు. దుఃఖము, దారిద్ర్యము, అవరాధము, మొదలగువానివల్ల పుట్టినట్టియు, స్వాపకర్షము (తన తక్కువతనము) సూచించు సంభాషణానికి కారణభూతమగు చిత్తవృత్తి దైన్యమవుతుంది. దుఃఖాదులు విభావములు - స్వాపకర్షణ భాషణాదులు అను భావాలు. వీనిచే దైన్యము వ్యక్తమౌతున్నది.

### 18.6.1. దైన్యోదాహరణము :

క॥ మదన! మదిరాక్షి లక్ష్యమె?
మొదలఁ బురాంతకుని నీళ్ళు మోయించిన నీ
కిది మొదలు కరుణ ఁజూడుము
సుదతిన్ నరసింహు ఁగూర్పు సుకృతము గలుగున్ 54

మదన - ఓ మన్మథుడా!; మొదలన్ = తొలుత; పురాంతకునిన్ : త్రిపుర భేదియగు ఈశ్వరుని ; నీళ్ళుమోయించిన నీకున్ : నీళ్ళు మోయునట్లు చేసిన నీకు, అనగా, శివుడు గంగను తలమీద నుంచుకున్నాడు; మదిరాక్షిలక్ష్యము : ఆడుదిలక్ష్యమా? అంటే లక్ష్యముకాదు. ఇది...చూడుము : ఇది మొదలుకొని దయచేనాలోకింపుము. సుదతిన్ : నా చెలిని; నరసింహున్ : నరసభూపాలుని ; కూర్పు : చేర్పుము. సుకృతముగల్గున్ : పుణ్యముగలుగును.

ఓ మన్మథుడా! త్రిపురాంతకునంతవానిని నీళ్ళుమోయించిన నీకు స్త్రీ యొక లెక్కయా? కాబట్టి దీనిని దయదలచి నరసభూపాలునితో కూర్పుము. ఇక్కడ ఏ నాయిక నరసభూపాలుని విరహదుఃఖాన్ని అనుభవిస్తున్నదో దాన్నే దైన్యము అంటారు.

“మదన! మదిరాక్షిలక్ష్యమె?” అనే పద్యాన్ని బట్టి విరహదుఃఖాన్ని అనుభవించేది యొకనాయిక. దూతి మదనునితో దీనాలాపాలు ఆడుతున్నది కాబట్టి ఇది సరిగాదు. కానీ ప్రియురాలి విరహదుఃఖాన్ని చూచి దుఃఖిస్తున్న దూతిదైన్యము వ్యక్తమగుచున్నదంటే సమంజసంగానే ఉంటుంది. అప్పుడు ప్రియురాలి విరహదుఃఖమే విభావమౌతుంది. స్వాపకర్ష భాషణములు అను భావాలవుతాయి. దీనివల్ల దూతీదైన్యం వ్యక్తమౌతుంది.

## 18.7. జాడ్య(జడత) లక్షణము

కం॥ ............................మదిలోఁ
గలకోరిక చేకూఱిన
నలవెఱుఁగక యునికి జాడ్యమగునెట్లన్నన్

మదిలోన్ కలకోరిక చేకూఱినన్ : మనస్సునందు కలిగిన మనోరథంబీ డేరినపుడు ; అలవెఱుఁగకయునికి : మై మఱచి యుండుట; జాడ్యమగున్ : జాడ్యమనునది యగును ; ఎట్లన్నన్ = ఎట్లంటే.

హృదయ మనోరథము సిద్ధించినపుడు కలుగు మైమఱపును జాడ్యమంటారు. ఇష్టార్థ సిద్ధివల్లను, అనిష్టార్థ సిద్ధివల్లను కలిగిన అప్రతిపత్తిని జాడ్యము అని ప్రతాపరుద్రీయము. ఇక్కడ ఇష్టార్థ సిద్ధి మూలకంగానే జాడ్యం కలుగుతుందని చెప్పబడింది. అది సరియైనది కాదు. కాబట్టి దీనికి సరియైన లక్షణాన్ని పరిశీలిద్దాం. చింతా, ఉత్కంఠా, భయ, విరహ, ఇష్టానిష్ట దర్శన శ్రవణాదులవల్ల పుట్టినట్టియు, అవశ్య కర్తవ్యములగు కార్యములందును, ఇతికర్తవ్యతా మూఢత్వాన్ని కలిగించునట్టిదియు నగుచిత్తవృత్తి విశేషాన్ని జడత అంటారు. చింతాదులగు విభావాలచే, ఇతికర్తవ్యతా మూఢత్వరూపమగు అనుభావాలచే జాడ్యము వ్యక్తమవుతున్నది.

### 18.7.1 జాడ్యోదాహరణము :

క॥ అదన నృసింహుఁడు వచ్చిన
సుదతి కనుంగొనదు; చెలులఁ జూడదు; భాషిం
పదు ; మిగులఁ జలింపదు; త
ద్వదనామృత పారణావధానయుఁబోలెన్ 55

సుదతీ : ఒకనాయిక ; నృసింహుడు : నరసభూపాలుడు ; అదనన్ : మంచిసమయమందు; వచ్చినన్ : రాగా; తద్వదన ... పోలెన్ : ఆ రాజు ముఖామృతము యొక్క యనుభవమందేకాగ్రతగలదో యనునట్లు; కనుంగొనదు : నృసింహుని జూడదు; చెలుల జూడదు : చెలికత్తెల నవలోకింపదు; భాషింపదు : మాటాడదు; మిగులన్ : మిక్కిలి; చలింపదు : కదలదు.

నరసభూపాలుడు రాగా నాయిక హర్షాతిశయంతో పక్కలకు చూడదు. చెలులను చూడదు, మాటలాడదు. చలింపదు. అతని ముఖచంద్రామృత పానమున ఏకాగ్రచిత్తయై ఉన్నట్లు కనబడుతుంది. ఇక్కడ ఇష్టదర్శనము (ప్రియదర్శనము) విభావము అగుచున్నది. చెలులతో భాషింపకుండుట మొదలగునవి అనుభావాలు దీనివల్ల నాయిక యొక్క జడత వ్యక్తమౌతున్నది. 'తద్వదనామృత పారణావధానయుఁబోలెన్' - అనటంచేత ఇతికర్తవ్యతా మూఢత్వము లేదు. కాబట్టి ఇది లేకుండటమే సమంజసముగానున్నది.

## 18.8. గ్లాని లక్షణము :

కం॥ కడుశక్తి యెడలి బడలిక
నడలుట యది గ్లానియయ్యె; .... 56

కడుశక్తియెడలి : మిక్కిలి సామర్థ్యముడిగి; బడలిక నడలుట : బడలికచే ఆయాసపడుట యేదికలదో; అది : ఆ ఆయాసపడుటను; గ్లాని అయ్యెన్ : గ్లాని అయింది.

బలము తగ్గి బడలిక పడుటను గ్లాని అంటారు. మనోవ్యాధులవల్ల శారీరక వ్యాధుల బలము తగ్గుటంచే పుట్టినట్టియు, వైవర్ణ్యము, శిథిలాంగత్వము, దృగ్భ్రమణము మొదలగువానిని కలిగించు దుఃఖ విశేషరూపమగు చిత్తవృత్తిని గ్లాని అంటారు. కొందరు వ్యాధ్యాదులవల్ల కలిగిన బలనాశమే గ్లాని అంటారు. పైన చెప్పబడిన గ్లాని లక్షణపద్యం యొక్క భావం కూడా ఇదే. ఇది పొరపాటు ఎందుకంటే భావమంటే చిత్తవృత్తి విశేషం గదా ! కాబట్టి నాశం చిత్తవృత్తి విశేషమెట్లా అవుతుంది.

బలనాశజన్య దుఃఖ విశేషరూప చిత్తవృత్తియే గ్లాని అని చెప్పుకోవాలి. ఇక్కడ బలహాని విభావము; వైవర్ణ్యము; శిథిలాంగత్వము; దృగ్భ్రమణము మొదలగునవి అనుభావాలు.

### 18.8.1. గ్లాన్యుదాహరణము

కం॥ నిండదె బడలిక? మును చను
కుండలబరువాఁగ లేని కోమలి మేనం
గొండంత వలపు పుట్టిన;
గండరగండాంక! యోబఘన నరసింహ ! 58

గండర ... సింహ = గండరగండయను బిరుదుచే నంకితుడవగు ఓబయ నరసభూపాలుడా ! మును .... మేనన్ = తొలుత కుచకుంభభారము వహింపజాలని కోమలియంగమునందు; కొండంత వలపు పుట్టినన్ : కొండవలె నధికమైన మోహముదయించినచో, నిండదెబడలిక : బడలిక నిండదా ; అవశ్యము నిండునని అర్థము.

'నిండదెబడలిక?' అనుటవల్ల గ్లాని వర్ణింపబడింది. ఇక్కడ గ్లాని వ్యక్తము గాక వాచ్యమైంది. ఇంకా ఈ బడలిక వలపువల్ల పుట్టినట్టు చెప్పినాడు. ఇదికూడ అనుచితమే. కాబట్టి పై ఉదాహరణము సరిగా లేదు. అందువల్ల రసగంగాధరములోని లక్ష్యాన్ని పరిశీలిద్దాం.

శయితాశైవల శయనే! సుషమాశేషా నవేందులేఖేవ
ప్రియమాగతమపి సవిధే! సత్కురుతే మధుర వీక్ష ణేరేవ

"శోభమాత్రమే మిగిలిన చంద్రకళవలె, శైవాలతల్పమున పండుకొని చెంతకు వచ్చినప్పటికీ ప్రియుని మధుర వీక్షణాలచేతనే సత్కరిస్తున్నది". ఇక్కడ ప్రియవిరహ జనిత 'వ్యాధికృతబలహాని విభావము. ఎదుర్కొనకుండుట, చరణపాతము సేయకుండుట, కౌగలింపకుండుట మొదలగునవి అనుభావాలు. వీనిచే గ్లాని వ్యక్తమగుతున్నది.

## 18.9. త్రాస లక్షణము :

కం॥ ........................ ఆకస్మికమై
పొడము భయంబుఁ జిత్తము
తడఁ బడుటది త్రాసమనఁగ దగు నెట్లన్నన్ 58

ఆకస్మికమైపొడము భయంబునన్ = ఆ కారణముగ నుదయించిన భయంచేత చిత్తము; తడఁబడుట : మనస్సు తడబాటు నొందుట యేదికలదో; అది : ఆ తడబడుట . త్రాసమనదగున్ : త్రాసమననొప్పును : ఎట్లన్నన్ ఎట్లంటే.

ఆకస్మికంగా కలిగిన భయంచేత చిత్తము తడబాటు పొందటాన్ని త్రాసమంటారు. అంతేకాక పిడుగు వానికి వ్యాఘ్రాది ఘోరజంతువులను చూడటంవల్లను, లేక ఉఱుములు మొదలగు వానిని వినటంవల్లను కలుగుచిత్తవృత్తి విశేషాన్ని త్రాసమంటారు. భయస్థాయి భావ ఉదాహరణమున భయత్రాసాలకు భేదం చెప్పబడింది. దీనివల్ల రోమాంచ, కంప, స్తంభ, భ్రమాదులుకలుగుతాయి.

### 18.9.1. త్రాసోదాహరణము :

కం॥ మరుఁజిత్ర లిఖితుఁ గని బి
త్తరి వెఱవఁ బరాగ భూతిఁ దగనిడి చిగురా
కరయఁగ దిగఁదుడిచి యలులకు
విరిబోనము వోయఁ దొఁజగె వెఱపు నృసింహా ! 59

నృసింహా : ఓ నరసభూపాలుడా ! బిత్తరి : స్త్రీ; చిత్రలిఖితున్ : చిత్తరువు నందు వ్రాయబడిన; మరున్ = మన్మథుని; కని : చూచి, వెఱవన్ = భయపడగా; పరాగభూతిన్ : పుప్పొడియను భస్మమును; తగనిడి : తగునట్లుంచి; చిగురాకు ... తుడిచి : చిగురుటాకును బాగుగా దిగఁ దుడిచి; అళులకున్ : తుమ్మెదలకు ; విరబోనము పోయన్ : పువ్వులను అన్నముపోయగా; వెఱపు : భయము; తెలిసెన్ తెలిసింది.

ఇందులో చిత్రమునందు లిఖింపబడిన మన్మథుడు విభావము. రోమాంచ, కంప, స్తంభాదులు ఆక్షేప్యములు. ఇట అనుభావములు ఆక్షేప్యములవటంవల్ల త్రాసము బాగా వ్యక్తమవటంలేదు. కాబట్టి రసగంగాధరమున చెప్పిన లక్ష్యాన్ని ఇక్కడ పరిశీలిద్దాం.

"మాకురు కశాం కరాబ్జే కరుణావతి ! కంపతే మమస్వాంతం

ఖేల న్నజాతు గోపైరంబ ! విలంబంకరిష్యామి".

"అమ్మా! నా చేతిమీద కొరడాదెబ్బలు కొట్టవద్దు. అందువల్ల నా హృదయం వణికి పోతున్నది. గోపబాలురతో ఆడుకుంటూ ఇకముందెప్పుడూ ఆలస్యంచేయను. అని బాలకృష్ణుడంటాడు. ఇక్కడ కొరడా విభావము. హృదయకంపము అనుభావము. దీనివల్ల త్రాసము వ్యక్తమవుతున్నది.

## 18.10. శంకా లక్షణము :

కం॥ తనకు ననిష్టంబగునో! యని కొదుకుట శంక. 59

తనకున్ ... కొదుకుట; = తనకు కీడగునో యని సంశయించుట శంక = శంకయను భావంబగును.

ఇందువల్ల ముఖవివర్ణతా, కంపాదులు కలుగుతాయి.

### 18.10.1. శంకోదాహరణము :

కం॥ చిలుకల పలుకో యని విన
నలుకుం జెలిపలుకుఁ; దలఁకు నద్దము సూడన్.
గలువల చెలికాఁడో? యని
చెలువ వియోగంబు కతన శ్రీ నరసింహ! 60.

శ్రీనరసింహ : సంపన్నుడవగు నరసభూపాలుడా ! చెలువ : నాయిక; వియోగంబుకతనన్ : విరహమువలన; చెలిపలుకున్ : చెలికత్తె మాటను, చిలుకల పలుకోయని విననలుకున్ : చిలుకల యొక్క పలుకోయని ఊహించి వినుటకు వెఱచును; అద్దము చూడన్ = అద్దము చూచుటకు; కలువలచెలికాడోయని = చంద్రుడోయని; తలకున్ = భయపడును.

ఇందు నాయిక విరహార్తి. కాబట్టి చిలుకల పలుకులు వినటంవల్లను, చంద్రుని చూడటంవల్లను తనకు అనిష్టంబగునోయని భయపడినట్లు వర్ణించినందున ఇది శంకకుదాహరణము. ఇట అనిష్టము విభావము. ముఖము వివర్ణతపొందటం, కంపించటం మొదలైన అనుభావాలు ఆక్షేప్యములు. దీనివల్లశంక వ్యక్తమౌతున్నది.

## 18.11. ఆర్తి (వ్యాధి) లక్షణము :

కం॥ .... హృదయమందలి తాపం
బినుమడియై వెలిఁబర్విన
ననయము తనుపీడ యార్తి యగునెట్లన్నన్

హృదయమందలి .... పర్వినన్ = హృదయమందలి సంతాపము రెండింతలై బయలు పడగా; అనయమున్ : ఎల్లప్పుడు; తనుపీడ : శరీరబాధ; ఆర్తియగున్ = ఆర్తియనునది యగును ఎట్లన్నన్ : ఎట్లనగా

హృదయతాపము రెట్టింపై బయలు పడగా కలిగిన శరీరపీడ తాపము. చిత్తవృత్తి విశేషమే భావమయినపుడు శరీరపీడ చిత్తవృత్తి విశేషం కాదు. 'హృదయమందలి తాపం' బనుట మాత్రమే యుక్తము. తక్కినది శరీరధర్మాన్ని బోధిస్తుంది కాని మానవధర్మాన్ని బోధించదు. కాబట్టి 'వెలిఁబర్విన ననయముఁదను పీడ' - అనేది యుక్తముగాదు అందువల్ల ఈ క్రిందిలక్షణము సమంజసముగా ఉంది. రోగము, విరహము, మొదలగువానివల్ల పుట్టిన మనస్తాపరూపమగు చిత్తవృత్తి విశేషము వ్యాధి. ఇందురోగ విరహాదులు విభావములు. గాత్రశైథిల్యము, శ్వాసము మొదలైనవి అనుభావాలు. ఇక్కడ రోగము వ్యాధికాదనియు, రోగమువల్ల పుట్టిన మనస్తాపమే వ్యాధి అనిగ్రహించాలి.

### 18.11.1 ఆర్తికి ఉదాహరణము :

కం॥ బెడిదపు మదనజ్వరమున
మిడిసిపడున్ హారలతలు మృగలోచనకున్
వెడవిలుతు వింటికోలల
వడువున; సతినింక నేఁచవలదు నృసింహ ! 61

బెడిదపు మదన జ్వరమునన్ : ఉగ్రమైన కామజ్వరము చేత; మృగలోచనకున్ : నాయికకు; హారలతలు : లతలవలెనుండు ముక్తా హారములు; మిడిసిపడున్ : మిట్టిపడును; ఇంకన్ : ఇఁకమీద; సతిన్ : స్త్రీని ; వెడ .... వడువునన్ : మదన ధనుర్బాణముల విధమున; నృసింహా : నరసభూపాలుడా ! ఏఁచవలదు : బాధింపతగదు.

మన్మథుని తాపంచేత హారలతలు మన్మథుని బాణాలవలె ఎగిరెగిరి పడుతున్నాయి. ఇంకా ఈ యువతిని బాధింపవద్దు. ఇక్కడ శరీర తాపమే వ్యక్తమగుచున్నది కాని మనస్తాపము వ్యక్తమగుటలేదు. కాబట్టి రసగంగాధరమున చెప్పిన లక్ష్యాన్ని చూద్దాం.

"హృదయే కృతశైవలానుషంగా ముహురంగాని యతస్తతః క్షిపంతీ

తదుదంతపరే ముఖే సఖీనా మతిదీనా మియ మా దధాతి దృష్టిం"

వక్షస్థలమునందు తామరతూండ్లను పెట్టుకొని మాటిమాటికీ అంగాలను ఇటూ అటూ విసరుకొంటూ ప్రియుని ఉదంతాన్ని చెలికత్తె చెప్పబోతుంటే ఆ యువతి దీన దృష్టితో చూస్తున్నది. ఇక్కడ విరహము విభావము. అంగక్షేపాదులు అనుభావాలు. వీనిచే వ్యాధి వ్యక్తమవుతున్నది.

## 18.12 రోష లక్షణము (అమర్షము)

కం॥ ఎందును గృతాపరాధుల
యందు మనం బెరియ రోషమగునది; 62

కృతాపరాధుల యందున్ : అపరాధము చేసిన వారియందు; ఎందును : ఎచటనైనను; మనంబు : మనస్సు; ఎరియన్ : జ్వలింపగా; అది : ఆ మనస్సు జ్వలించుట; రోషము : అమర్షమను సంచారి, అగున్ .

అమర్షమను ఈ వ్యభిచారి భావానికిచ్చిన లక్షణము, స్థాయిభావమగు క్రోధ లక్షణము ఒకే విధంగా ఉంది. కాబట్టి రసగంగాధంలో ఇచ్చిన లక్షణాన్ని చూద్దాం. "పరకృతావజ్ఞాది నా నాపరాధజన్యః మౌనవాక్యాది పారుష్యాది కారణీభూత శ్చిత్తవృత్తి విశేషోஉ మర్షః". ఇతరులచేత అవజ్ఞారూపముతో చేయబడ్డ అనేక అపరాధాలవల్ల పుట్టినట్టిదియు; మాటాడకుండుట, వాక్పారుష్యము మొదలగు దానివల్ల కలిగించు చిత్తవృత్తివిశేషమే అమర్షమగును. స్థాయిభావమగు క్రోధానికి - వ్యభిచారి భావమైన అమర్షానికి భేదముంది. ఇందు అవజ్ఞాదులు విభావాదులు. మౌనవాక్య, పారుష్యాదులు అనుభావాదులు. వీనివల్ల రోషము వ్యక్తమగుచున్నది.

### 18.12.1. రోషోదాహరణము :

కం॥ నిలునిలుమనంగ ! యొచటికిఁ
దొలఁగెదు? నరసింహుఁ డింతితోఁ గూడినఁ జా;
లలరు భవదీయ చాపము
కలుగానుగ ద్రిప్పి పిప్పిగాఁ గావింతున్ 63

అనంగ = ఏ మదనుడా!; నిలునిలుము; ఆగుమాగుము త్వరపడకు అనుట. ఎచటికిఁదొలఁగెదు = ఎందుబోయెదవు? నృసింహుడు : నరసభూపాలుండు; ఇంతితోకూడినన్ = నాయికతో కూడినవెనుక; చాలు. అలరు భవదీయచాపము : సమృద్ధిచే ప్రకాశించుచున్న; నీవింటిని; కలుగానుగన్ : రాతిగానుగ యందు; త్రిప్పి పిప్పిగా గావింతున్ : తిరుగఁజేసి పిప్పి చేయింతును.

ఇందులో తన సఖికి అపరాధం చేసిన మన్మథునిపై మనః ప్రజ్వలనము వ్యక్తమగుచున్నది. మన్మథా పరాథము విభావము. పరుషవచనము అనుభావము. వీనిచే రోషము (అమర్షము) వ్యక్తమగుచున్నది.

## 18.13. గర్వ లక్షణము :

కం॥ .................. ఒరులన్
నిందించి తన్ను ఁబొగడు న
మందోన్నతి గర్వమయ్యె మహి నెట్లన్నన్.

ఒరులన్ ...... ఉన్నతి : ఇతరులనిందించి తన్ను పొగడుకొనునధికోన్నతి; మహిన్ - భూమియందు ; గర్వమయ్యెను : గర్వమననది ఆయెను. అది ఎట్లన్నన్.

పరులను నిందించి తన్ను పొగడుకోవటం గర్వమంటారు. ఇంకా రూపము, ధనము, విద్య మొదలగు వానిచేత పుట్టిన ఆత్మ ఉత్కర్షజ్ఞానం వల్ల కలిగిన పరావహేళనాన్ని కూడా గర్వమంటారు.

### 18.13.1. గర్వోదాహరణము :

కం॥ ప్రతియె? కళంకాంకితునకు
సతియగు రోహిణియు నతను సతియగు? రతియుం
జతురు నృసింహుని ఁజెందిన
యతిధన్యకు నాకు? ననుచు నంగన నవ్వెన్ 64

కలం కాంకితునకున్ : కలంకముగల చంద్రునకు; సతియగు రోహిణియున్ : భార్యయగు రోహిణీదేవియు; అతను సతియగు రతియున్: అనంగుని భార్యయగు రతీదేవియు; చతురున్ : చాతుర్య శాలియగు ; నృసింహున్ : నరసభూపాలుని; చెందిన యతిధన్యకునాకున్ : పొందిన అతిధన్యురాలైన నాకు, ప్రతియె : సరియా; అనుచునంగన నవ్వెన్ : ఇట్లనుచు మగువ నవ్వెను.

నరసభూపాలుని చెట్ట బట్టిన నాకు కళంకి భార్యయగు రోహిణియు, మన్మథుని భార్యయగు రతియును సమానులా? అని నాయిక నవ్వెను. ఇక్కడ నరసభూపాల ప్రాప్తి ప్రయుక్తమగు 'అతిధన్యకు' అను ఆత్మోత్కర్షము విభావము. అవహేలనము (నవ్వుట) అనుభావము. వీనిచే గర్వము వ్యక్తమగుచున్నది.

## 18.14. ఆవేగ లక్షణము :

కం॥ క్రమమున నిష్టానిష్టా
గమజ మనస్సంభ్రమంబు గన నావేగంబు 65.

క్రమమునన్ : వరుసగా; ఇష్ట .... సంభ్రమంబు : ప్రియాప్రియ ప్రాప్తి వల్ల పుట్టిన మనస్సు యొక్క తొట్రుపాటు; కనన్ = చూడగా; ఆవేగంబు = ఆవేగమనునదియగును.

ఇందులో ఇష్టము, అనిష్టము, తటస్థించడంవల్ల కలిగిన మనస్సుయొక్క తత్తఱపాటును ఆవేగమంటారు. కాని సరియైన లక్షణంగా లేదు. కాబట్టి రసగంగాధరంలో ఇచ్చిన లక్షణాన్ని చూద్దాం. కేవలం అనిష్టం వల్ల కలిగిన తత్తఱపాటునే ఆవేగమని చెప్పబడింది. లేక - అనర్థాతిశయం వల్ల పుట్టిన మనస్సంభ్రమమను పేరుగల వృత్తిని ఆవేగమంటారు.

### 18.14.1. ఆవేగోదాహరణము :

కం॥ సతిహారము నిడనెడలే
కతనుని ఁదనుసిద్ధిఁగోరి యలరతి వ్రతసం

గతి నక్షసరము ఁగైకొను
గతిఁ గేలన దాల్చి నృపతిఁ గనుగొన నరిగెన్ 66

సతి : స్త్రీ, హారమున్ : ముత్తెపు సరమును; ఇడనెడలేక : ధరింప నవకాశములేక; అలరతి : ప్రసిద్ధమగు రతీదేవి; అతనుని తను సిద్ధిఁగోరి: అనంగుడగు తన భర్తకు శరీర సిద్ధి నభిలషించి; వ్రతసంగతిన్ : వ్రతమునవలంభించుటచేత; అక్షసరము గైకొనుగతిన్ : జపమాల ధరించిన భంగి; కేలన: చేతనే; తాల్చి = ధరించి; నృపతిగను గొన నరిగెన్ : నరసభూపాలుని జూడటానికి వెళ్ళెను.

నరసభూపాలుడు వీధిలో వెళ్తుంటే నాయిక హారాన్ని మెడలో వేసుకోవటానికి అవకాశం లేక చేతిలోనే ధరించింది. అతనుడగు మన్మథునికి తను సిద్ధికోరి వ్రతాన్ని పూని జపమాలను ధరించిన విధంగా ఆ చేతిలోని హారాన్ని దాల్చిన రతిని తలపిస్తూ నరసభూపాలుడిని చూడటానికి వెళ్లింది. ఇక్కడ ఇష్టాగమజనిత మనస్సంభ్రమాన్ని మాత్రమే చెప్పబడింది. కేవలం అనిష్టాగమ జనిత మనస్సంభ్రమమే ఆవేగమని సిద్ధాంతం. ఈ ఉదాహరణము సరిగాలేదు. అందువల్ల ఈ క్రింద చూపిన పద్యం అనర్థం వల్ల కలిగిన చిత్త సంభ్రమానికి ఉదాహరణంగా స్వీకరించవచ్చు.

ఆ.వె. ఇది నపుంసకంబుగద ! యంచుఁ బ్రి యురాలి
ప్రాంతమునకు మనసుఁ బంపియుంటి
నది రమించుచుండె నటనె హా ! పాణిని
పలుకు నమ్మి గోఁత బడితిఁ జెడితి.

ఇది నపుంసకంబుగద : మనస్సునపుంసక లింగశబ్దము. ఇక్కడ మనసు ప్రియురాలితో రమించుట అనర్థము. ఇది విభావము. అతిత్వరాన్వితములగు వచనాదులు అనుభావాలు వీనివల్ల ఆవేగము వ్యక్తమౌతున్నది.

## 18.15. ధృతి లక్షణము :

అమరఁగ మనము కృతార్థ
త్వముఁజెందిన ధృతియనంగఁ దగు నెట్లన్నన్.

అమరఁగన్ = బాగుగా; మనము : మనస్సు; కృతార్థత్వముఁజెందినన్ : కృత కృత్యతనొందఁగా, ధృతియనంగఁదగున్ : ధృతియను భావమగును ఎట్లన్నన్ : ఎట్లంటే.

మనస్సు కృతార్థమగుట ధృతి. ఇంతేగాక లోభము, శోకము, భయము మొదలగువాని వల్ల కలిగిన ఉపప్లవాన్ని నివారించటానికి కారణమైన చిత్తవృత్తి విశేషాన్ని ధృతి అంటారు.

### 18.15.1. ధృత్యుదాహరణము :

కం॥ నరసేంద్రుఁడు రాకుండినఁ
బరువడి భావింపఁగలుగు భాగ్యమె చాలుం
జరితార్థనైతి మరునకు
గిరునకుఁ బ్రియమేల పల్కఁ గీడ్పడినాకున్? 67

నరేంద్రుడు : నరసభూపాలుడు; రాకుండినన్ : రాకపోయినచో;; పరువడి...... చాలున్ : వరుసగా స్మరింపగలిగెడు భాగ్యమే చాలును. విరహమునందు ఇతరములను పరిత్యజించి ప్రియస్మరణమే ఎల్లపుడు కలుగు తుంది, చరితార్థనైతిన్ : కృతార్థనైతిని; మరునకు గిరునకున్ : నీచుడైన మన్మథునకు; కీడ్పడి : లోఁబడి; నాకున్ = నాకు; ప్రియము : ప్రియవాక్యము ; పల్కనేల : పల్కుటకేమి

ప్రయోజనము? ఏమియు ప్రయోజనములేదు. నరసభూపాలుడు నా దగ్గరకు రాకపోయినప్పటికిని వానిని స్మరింప గలిగే భాగ్యం కలిగింది. అదేచాలు. నేను గీడ్పడి మన్మథుని దేబిరించటం దేనికి ? ఇక్కడ నరసభూపాలుడు రాకపోవటంచేత కలిగేటువంటి ఉపద్రవము ఆమె ధైర్యంతో నివారించుకొంది. ఇక్కడ వివేకం విభావము. చాపల్యంచే మన్మథుని దేబిరింపనని చెప్పుట అనుభావము. వీనిచేత ధృతి వ్యక్తమగుచున్నది.

## 18.16. స్మృతి లక్షణము :

కం॥ స్మృతియగు పూర్వానుభవ
స్మృతి ........................... 68

పూర్వానుభవస్మృతి : పూర్వమనుభవించిన దానిని తలచుట స్మృతి : స్మృతి అనుసంచారి; అగున్ : అగును

పూర్వానుభవాన్ని తలంచటాన్ని స్మృతి అంటారు. ఈ లక్షణం సరియైనది కాదు. పూర్వానుభవం వల్ల కలిగిన సంస్కారం వల్ల కలిగిన జ్ఞానాన్నే స్మృతి అని చెప్పాలి. "సంస్కార జన్యం జ్ఞానం స్మృతిః" అంటే సంస్కారం వల్ల కలిగిన జ్ఞానమే స్మృతి. లోకంలో ఒకప్పుడు మనం దేన్నైనా చూస్తాం వింటాం. ఆ విషయం ప్రత్యక్షానికి దూరమైనను మన హృదయంలో హత్తుకొని ఉంటుంది. అదే సంస్కారం. మరల ఎప్పుడైనా ఆ విషయాన్ని చూడటంకానీ, వినడంగానీ సంభవిస్తే వెనుకటి సంగతి మరల తలపునకు వస్తుంది. ఆలాంటి తలపునే స్మృతి అంటారు.

### 18.16.1. స్మృత్యుదాహరణము

కం॥ నాఁటి పరిరంభ సౌఖ్యము
నేఁటి బలెం బాయదాత్మ నిండి తొలఁకుచున్.
బోఁటి! నృసింహునిఁ బాయని
పాటల సుమగంధు లెంత భాగ్యాధికలో? 69

బోటి : ఓ సఖీ ! ; నాఁటి పరిరంభసౌఖ్యము : నాడనుభవించిన ఆలింగనసౌఖ్యము; నేఁటిబలెన్ : నాడనుభవించినదానివలె : ఆత్మన్ : చిత్తమునందు; నిండు తొలఁకుచున్ : నిండివెలి ఁబర్వుచు పాయదు; పోదు; నృసింహునిన్ : నరసభూపాలుని; పాయని పాటల సుమగంధులు : = ఎపుడు ఎడబాయని స్త్రీలు; పాటలసుమము అంటే కలిగొట్టు పువ్వు. దాని వాసనవంటి దేహవాసన కలవారనుట. ఎంత భాగ్యాధికలో : ఎంత భాగ్యాతిశయము కలవారో.

ఇందు నాయిక తాను పూర్వం నరసభూపాలునితో అనుభవించిన ఆలింగన సౌఖ్యాన్ని తలచుచున్నందున స్మరణమగును. ఇచట పరిరంభసౌఖ్యము విభావము. ఆనందాశ్రువులు, నేత్ర నమీలనము, హాహాకారములు మొదలగునవి అనుభావములు ఆక్షేప్యములు. వీనివల్ల స్మృతి వ్యక్తమవుతున్నది.

## 18.17. చాపల లక్షణము :

కం॥ ............రాగ ద్వేషజనిత చేష్టాద్యనవ
స్థితి చాపలము

రాగ.... అనవస్థితి = రాగమునఁగాని, ద్వేషమున గాని పుట్టిన చేష్ట మొదలగు వానియొక్క అనవస్థ; చాపలము = చపలత యనునది యగును.

రాగద్వేషాలవల్ల పుట్టిన చేష్టాదుల అనవస్థ. అంటే నిలుకడ లేని చేష్టలు చేయుటను చాపలమంటారు. అంతేకాక అమర్షాదులవల్ల పుట్టి నట్టియు వాక్పారుష్యాదులు కలిగించునట్టి చిత్తవృత్తిని చపలము అని కూడా అంటారు. అమర్షము, ప్రాతికూల్యము; ఈర్ష్య, రాగము; ద్వేషము; మాత్సర్యము. అనేవి విభావాలు, వాక్పారుష్యము, ప్రహారము, తాడనము, వధ, బంధనము, లెస్సగా ఆలోచింపక పనులు చేయుట, అనేవి అనుభావాలు. వీనివల్ల చాపలము వ్యక్తమవుతున్నది.

### 18.17.1. చాపలోదాహరణము :

కం॥ వనిత నృసింహుని (గనుగొని
చనుగుబ్బల మీఁది వలువ చక్కఁగ దిద్దున్ ?
జనఁజూచు; మరలుఁజెలితోఁ;
బనిలేమియుఁబలుకు; నురముపయి జెయి సేర్చున్ 70

వనిత = స్త్రీ; నృసింహునిన్ = నరసభూపాలుని; కనుగొని: చూచి; చను...వలువ: జాఱునట్టి పైఁట చెఱఁగు; చక్కఁగ దిద్దున్ : బాగుగా సవరించుకొనును; చనఁజూచున్ : అతని చెంతకు వెళ్ళటానికి ఆలోచించును; మరలున్ : వెనుకకు తిరుగును. చెలితోన్ : పలుకున్ సఖితో కార్యము లేకయే మాటాడును ; ఉరముపయిన్ చెయిసేర్చున్ : ఎదపై హస్తముంచుకొనును.

నాయిక నరసభూపాలుని చూచి పైట చెఱగును చక్కదిద్దుకుంటుంది; అతన్ని సమీపించటానికి కుతూహల పడుతుంది; వెనుకకు తిరుగుతుంది. చెలికత్తెతో పనిలేకపోయినా కల్పించుకొని మాటాడుతుంది. తన హృదయంపై హస్తముంచుకుంటుంది. ఇక్కడ నాయికకు నరసభూపాలునిపైగల రాగము విభావము, పైటను దిద్దుకొనుట; అతని దగ్గరకు వెళ్లాలని ఆలోచించుట; ఊరక పనిలేకపోయినా పలుకుట; ఉరమున చెయిచేర్చుట అనేవన్నీ ఆలోచింపక చేసేపనులు ఇవన్నీ అనుభావాలు. వీనివల్ల చాపలము వ్యక్తమగుచున్నది.

## 18.18 ఔగ్ర్య లక్షణము :

కం॥ .........................ఎగ్గొదవిన
నతిచండత యుగ్రభావమగు నెట్లన్నన్
ఎగ్గొదవిన నతిచండత: అపరాధము చేసినచో మిక్కిలి కోపించుట; ఉగ్రభావ మగున్ : ఉగ్రతయగును; ఎట్లన్నన్.

ఇతరుల వల్ల తనకు కీడు కల్గగా పుట్టిన తీవ్రతను ఔగ్ర్యమంటారు. ఇంకా అధిక్షేపము, అవమానము మొదలగు వాని వల్ల పుట్టినట్టియు నేను వీనికి ప్రతీకారమేమిచేస్తాను? అను ప్రచండమగు చిత్తవృత్తిని ఔగ్ర్యమంటారు. అంతేగాక నృపాపరాధము; లేనిదోషాన్ని ఆరోపించుటం; చోరధారణము; ఇవి విభావాలు; బంధనము, వధ, తాడనము, బెదిరించుట, ఇవి అనుభావాలు. వీనిచే ఉగ్రత వ్యక్తమవుతుంది.

### 18.18.1 ఔగ్ర్యోదాహరణము :

కం॥ వలదు వల దేఁచఁ గలువల
చెలికాఁడ! నృసింహుఁ గూర్పు చెలిఁగా కున్నన్
బొలఁతుక నిట్టూర్పుఁబొగ
ల్వెలువడి నీబింబమెల్ల వెసమాయించున్ 71

కలువలచెలికాడా : ఓచంద్రుడా! ఏఁచన్ : బాధింపగా; వలదువలదు : కూడదు కూడదు; చెలిన్ = స్త్రీని; నృసింహున్ = నరసభూపాలుని; కూర్పు = చేర్పుము; కాకున్నన్ = అటుకాకున్నచో, పొలతుక నిట్టూర్పుఁబొగల్ : దాని గొప్పయూర్పులను ధూమములు; వెలువడి = బయలు దేరి; నీబింబ మెల్లన్ : నీ యొక్క బింబమంతయు; వెసన్ = వేగముగా; మాయించున్ = నశింపచేయును.

ఓ చంద్రుడా ! నాయికను బాధింపకుండా నరసభూపాలుని చేర్చుము. లేకపోతే ఆమె నిట్టూర్పు పొగలు నీ బింబాన్నంతా నశింపచేస్తుంది. ఇక్కడ చంద్రుడు అపరాధంచేస్తే వాన్ని రూపుమాపటం చెప్పటం వల్ల ఉగ్రత అనుభావమేర్పడింది. ఇట చంద్రతాపము విభావము. 'నీ బింబమెల్ల వెస మాయించున్' అనేది అనుభావం. వీనిచేత ఔగ్ర్యము వ్యక్తమవుతుంది.

## 18.19. అవహిత్థా లక్షణము :

కం॥ భువిలో నాకృతిగోపన
మవహిత్థ ................

భువిలోన్ : భూమియందు; ఆకృతి గోపనము = అభిప్రాయాన్ని దాచటం; అవహిత్థ : అవహిత్థమను సంచారియగును.

ఆకారాన్ని దాచుకోవడాన్ని అవహిత్థ అంటారు. ఇంకా సిగ్గు మొదలగువాని వల్ల హర్షాది అనుభావాల్ని దాచేటువంటి చిత్తవృత్తిని అవహిత్థ అంటారు. అంతేగాక భయము, సిగ్గు, ధార్ష్యము; కౌటిల్యము, గౌరవములవల్ల పుట్టినటువంటియునగు భావ పిధానార్థమగు భావాన్ని అవహిత్థ అంటారు.

### 18.19.1. అవహిత్థోదాహరణము :

కం॥ హారములు గరఁగ నరస
క్ష్మారమణునిఁ బాడి యొక్క సతి పులుకలుమై
నీరికలెత్తినఁదాఁచును
సారెకు హారాంబు జనిత శైత్యం బనుచున్ 73

ఒక్కసతి : ఒకనాయిక; హారములుగరగన్ : మణిహారములు ద్రవించునట్టుగా; నరసక్ష్మారమణునిఁబాడి : నరసభూపాలుని గీతములు పాడి; పులకలు ... ఎత్తినన్ = రోమాంచములు శరీరమందు అంకురింపగా; సారెకున్ = మాటికి; హార .... అనుచున్ : హారోదకము వలన పుట్టిన చల్లదనమును; దాఁచున్ = దాచిపెట్టును.

ఇక్కడ నాయిక మణిహారాలు కరిగిపోవునట్లుగా నరసభూపాలునిపై పాటలు శైత్యము వల్ల పుట్టినట్లు చెప్పి అనురాగాన్ని దాచినందున అవహిత్థఅనుసంచారీ భావమేర్పడింది. ఇక్కడ వ్రీడ విభావము. పులకలు దాచుట అనుభావము, దీనివల్ల అవహిత్థవ్యక్తమగుచున్నది.

## 18.20. త్రపా లక్షణము :

కం॥ మనంబు ముఁడుగుట త్రప.

మనంబుముఁడుగుట; చిత్తసంకోచమేదికలదో; అది : ఆ చిత్తసంకోచము, త్రపః త్రపయనునది యగును.

స్త్రీలకు పురుషుల ముఖాన్ని చూడటం వల్ల కలిగేటువంటిదియు, పురుషులకు ప్రతిజ్ఞాభంగము, పరాభవము, మొదలగు వానివల్ల కలిగేటటువంటిదాన్ని వైవర్ణ్యము, అధోముఖత్వము మొదలగువన్ని కలిగించేటువంటిదియునగు చిత్తవృత్తివిశేషాన్ని వ్రీడ లేక త్రప అంటారు.

### 18.20.1. త్రపోదాహరణము :

కం॥ వనిత నృసింహేంద్రుఁ బరా
కునఁ బేర్కొని శిరమువంచుకొనుఁ; జెలి యెదుటన్

గనిపించె భావమని మో

మనయముఁ గుచదుర్గవసతి నాఁగిన భంగిన్ - 74

వనిత: ఒక స్త్రీ; నృసింహేంద్రున్ : నరసభూపాలుని; పరాకునన్ : పొరపాటుచేత; చెలియెదుటన్ : సఖిముందర; పేర్కొని : పేరుపెట్టిపిలిచి; భావము : హృదయాభిప్రాయమును; కనిపించెన్ : తెలిపెను; అని : అనుకారణముచేత; మోము : ముఖమును; అనయమున్ : మిక్కిలి; కుచదుర్గవసతిన్ : కుచములనెడు దుఃప్రవేశమైన స్థలమందలి ఉనికిచేత; ఆఁగినభంగిన్ = అడ్డగించెనో అనునట్లు; శిరము వంచున్ : తలవంచుకొనును.

ఒక వనిత పొరపాటున నరసభూపాలుని పేరుచ్చరించి తనముఖము తన భావాన్ని తెలిపివేసేనేయని దానిని కుచదుర్గములందు నిలిపెనో అన్నట్లు తలవంచుకోవటాన్ని త్రపయంటారు. ఇక్కడ నాయిక తలవంచుకొనుట వల్ల త్రపయగుచున్నది. నరసభూపాలుని నామోచ్చారణము విభావము. తలవంచుకొనుట అనుభావము. వీనిచే త్రప, లేక వ్రీడ వ్యక్తమగుచున్నది.

## 18.21. విషాద లక్షణము :

కం॥ వివిధోపాయాభావా

దవిరత భంగము విషాదమగునెట్లన్నన్.

వివిధ ... భంగము : ఉపాయాభావముల వలనైన నానావిధమైన ఎడతెగని భంగము; విషాదమగున్ : విషాదమగునదియగును ఎట్లన్నన్.

వివిధములయిన ఉపాయములు లేకపోవటంవల్ల కలిగిన భంగపాటును విషాదమంటారు. ఇంకా ఇష్టము సిద్ధింపకుండుటవల్లను; రాజ, గురుప్రభృతుల యెడలచేసిన అపరాధాదుల వల్లను కలిగిన అనుతాపము విషాదమవుతుంది.

### 18.21.1. విషాదమునకుదాహరణము :

కం॥ అలరులు మరునమ్ములు; హిమ

జలమిందుకరోదితంబు; శత్రువు దలఁపం

జలిగాడ్పు; శ్రీనృసింహుం

డలిగినవాఁ డెట్లు మాను నతివకుఁ గాఁకల్ 74.

అలరులు : పువ్వులు; మరునమ్ములు : మదనుని బాణములు. హిమజలము : పన్నీరు; ఇందుకరోదితంబు : చంద్రకిరణములవలన నుదయించునది; చలిగాడ్పు : చల్లనివాయువు, తలఁపన్ : స్మరింపఁగ; శత్రువు : విరోధి ; శ్రీ నృసింహుడు : శ్రీ మంతుడగు నరసభూపాలుడు; అలిగినవాడు : కోపించినవాడు; అతివకుఁగాఁకల్ : చెలికిసంతాపములు ఎట్లుమానున్ : ఏ విధంగా శమించును?

ఇందు నాయికకు కాకలు మానటానికి ఉపాయం తోచక మనస్సునకు భంగంకలిగినట్లు చెప్పటం వల్ల విషాదం ఏర్పడింది. ఇక్కడ నృసింహుని ఇష్టాసిద్ధి విభావము. "ఎట్లు మానునతివకుఁ గాఁకల్?" అనునప్పటి ముఖసంకోచాదులనుభావాలు ఆక్షేప్యములు. వీనివల్ల విషాదమువ్యక్తమగుచున్నది.

## 18.22. మదలక్షణము :

కం॥ మదము మదిరాదికృత స

మ్మదమోహ వ్యతికరంబు- 75

మదిరా ... వ్యతికరంబు : మద్యపానము మొదలగు వానిచే కలిగిన హర్షమోహముల చేరిక; మదము : మదమను సంచారియగును.

మద్యపానం చేత కలిగిన సంతోష మోహాల కలయికను మదమంటారు అంతేగాక మద్యపానాదులవల్ల కల్గినట్టియు, శయన, హసితాదులను కలిగించేదియు; ఉల్లాస రూపమగు చిత్తవృత్తిని మదమంటారు. దీన్నే మరొక విధంగాకూడా చెప్పవచ్చు. మద్యంయొక్క ఉపయోగంవల్ల పుట్టిన సమ్మోహానందముల కలయికను మదమంటారు. 1. ఉత్తముడు మదముకలిగినచో నిద్రిస్తాడు. 2. మధ్యముడు నవ్వుతాడు; పాడుతాడు. 3. నీచుడు రోదిస్తాడు. పరుషవచనములు మొదలగువానిని చేస్తాడు. ఈ మదము మూడు విధాలు : తరుణము - మధ్యమము - అధమము అని. 1. అవ్యక్తములును, అసంగతములును, అగు వాక్యాలచేతను, సుకుమారమగు తొట్రుపాటుచేతను అభినయింపబడేది తరుణమదము.

2. చేతులు ఎగరవేయటం; తొట్రుపాటుతో కూడిన నడక; తిరుగుడుపాటు మొదలగువానిచే అభినయింప బడేది మధ్యమమదము.

3. గతిభంగ, స్మృతినాశ, ఎక్కిళ్లు, వాంతులు మొదలగువానిచే అభినయింపదగినది అధమమదము.

### 18.22.1. మదోదాహరణము :

కం॥ అమరు నృసింహుని వనమున
నమితాసవ రసములాని యలి యౌవతముల్
భ్రమియించు; నాఁడు; బాడును;
రమణులతో ఁగూడి సాంద్రరాగప్రౌఢిన్ 76

అలియౌవతముల్ : ఆడుతుమ్మెదల గుంపులు; అమరు నృసింహుని వనమున్ : ఒప్పుచున్న నరసభూపాలుని ఉద్యానవనమునందు; అమితాసవ రసములు : అమితములౌ పుష్పరసములను; ఆని : పానముచేసి; రమణులతో కూడి : ప్రియులతోకూడి : సాంద్రరాగ ప్రౌఢిన్ : గాఢాను రాగముయొక్క అతిశయముచేత; భ్రమియించున్ = తిరుగును; ఆడున్ : క్రీడించును, పాడున్ = గానముచేయును.

ఆడుతుమ్మెదలు ఉద్యానవనంలో పుష్ప రసాలను త్రాగి తమ ప్రియులతో కూడి గాఢానురాగంతో క్రీడిస్తూ, తిరుగుతూ గానంచేస్తున్నాయి. మకరందాన్ని త్రాగి మోహంలో ఆడుతుమ్మెదలు తమ ప్రియులతో చేరి హర్షాన్ని చెందటం చేత మదమనే సంచారి భావమేర్పడుచున్నది. ఇక్కడ పుష్పాసవమానుట విభావము; ఆటపాటలు అనుభావాలు. వీనివల్ల సమ్మోహ ఆనందముల కలయిక అను మదము వ్యక్తమగుచున్నది.

### 18.23. ఔత్సుక్య లక్షణము :

కం॥ ........ మఱి యౌత్సుక్యం
బదన సమయాక్షమత్వము

మఱి : మఱియు; అదనన్ = సమయమునందు, సమయాక్షమత్వము : విలంబము సహింప జాలమి; ఔత్సుక్యంబు = ఔత్సుక్యమగును.

కాలవిలంబాన్ని సహింపలేకుండటాన్ని ఔత్సుక్యమంటారు. ఇంకా ఇప్పుడే నాకిది లభించుగాక అనుకోరికయే ఔత్సుక్యమంటారు. ఇష్టవిరహాది రూపమైన ఆలంబన విభావం చేత, ప్రియ సంస్మృతి రూపమగు ఉద్దీపన విభావంచేత, నిద్రా, తంద్రా, ఒడలుబరువుగా తోచుట, చింతలు అను అనుభావాల చేత వ్యక్తమయ్యేదే ఔత్సుక్యం.

### 18.23.1. ఔత్సుక్యమునకుదాహరణము :

కం॥ వరుఁ బిలువఁ బనిచె యెపుడెపు
డరు దెంచునొ? యనుచుఁదలఁచి యభిముఖియగు బి
త్తరి; యింత పరాకైనను
నరయఁ దదాలోక విఘ్నమగు ననుభీతిన్- 76

బిత్తరి : స్త్రీ ; వరునిన్ : ప్రియుడగు నరసింహుని; పిలువఁబనిచి : పిలువఁ బంపి; ఎపుడు ... అనుచున్ : ఎపుడెపుడు వచ్చునోయనుచు తలఁచి : భావించి; ఇంత పరాకైనను : ఇసుమంత పరాకు కలిగినను; అరయన్ : విచారింపగా; తత్ ... భీతిన్ = ప్రియుని చూచుటకు విఘ్నమగునోయను భయముచేత; అభిముఖియగున్ : ప్రియుడు వచ్చుదారికి అభిముఖియగును.

ఇక్కడ నాయిక దూతికనుపంపి ప్రియుడు వచ్చేవరకు ఆలస్యాన్ని సహించక ఎదురు చూడటంవల్ల ఔత్సుక్యమవుతుంది. ప్రియ విరహము ఆలంబన విభావము. ఆక్షేప్యమగు ప్రియ సంస్మృతి ఉద్దీపన విభావము. “ఎపుడెపు డరుదెంచునో?” అనే చింతయును, అభిముఖీ భావమును అనుభావాలవుతాయి. అందువల్ల ఔత్సుక్యము వ్యక్తమవుతున్నది.

## 18.24. మతి లక్షణము :

కం॥ మది నర్థవినిర్ణయంబు మతి యెట్లన్నన్.

మదిన్ : చిత్తమందు; అర్థవినిర్ణయంబు = అర్థనిశ్చయము; మతి : మతి అనుభావంబగును, ఎట్లన్నన్.

‘మతిరర్థ వినిర్ణయః’ - అని ప్రతాపరుద్రీయ లక్షణం. అర్థనిర్ధారణమే మతి అని ఉండగా ఇందు ‘మదిలో నర్థవినిర్ణయము మతి’-అని ఉన్నది. మతి పదార్థజ్ఞానానికి చెప్పిన లక్షణంలో మదిని ప్రవేశింపచేయటం ఆత్మాశ్రయదోషహేతువవుతుందని తోస్తున్నది. మది-మతులకు గల భేదాన్ని బట్టి తత్పరిహారాన్ని ఊహింపవచ్చును. ఇంకా ఈ విధంగా చెప్పవచ్చు. శాస్త్రాదులను విచారించటంచేత కలిగిన కార్య నిశ్చయాన్ని మతి అంటారు. నిస్సంశయంగా ఆ కార్యమనుష్ఠించుట, సందేహాలు తీరటం మొదలైనవి అనుభావాలు.

### 18.24.1. మత్యుదాహరణము :

కం॥ చెలువరో ! శ్రీనరసింహుం
డలనాఁటి నృసింహమూర్తి యగుఁ; గాకున్నన్
దలఁచిన తావుల నెల్లను
నెలకొని సాన్నిధ్య మొందు నిపుణతగలదే? 77

చెలువరో : ఓ సఖీ ! శ్రీ నరసింహుండు : శ్రీ నరసభూపాలుండు; అల... అగున్ : ఆనాటి నృసింహస్వామియగును; కాకున్నన్ : అటు గాకయుండినచో, తలఁచిన తావులనెల్లను: స్మరించినచోటుల నంతటను; నెలకొని ..... గలదే : నిలుచుండి సన్నిధానమునొందు నిపుణత ఉండునా?

నరసభూపాలుడు ఆ నరసింహమూర్తియే కాకపోతే తలచుకున్న తావుననే ప్రత్యక్షమగునా? ఇక్కడ ‘తలచిన తావులనెల్లను ... ఇత్యాదికముచే కలిగిన సంశయ విచ్ఛేదంచే నృసింహుడేయని అర్థ నిర్ధారణము చేయబడింది. ఇక్కడ శాస్త్ర ప్రమాణము విభావము. సంశయ విచ్ఛేదము అనుభావము దీనిచేత మతి వ్యక్తమగుచున్నది.

## 18.25 నిద్రా లక్షణము :

కం॥ జగతిం జిత్తనిమీలన
మగు నిద్రయనంగ ... 78

జగతిన్ = భూమియందు ; చిత్తనిమీలనము : మనోముకుళనము ; నిద్రయనంగన్ : నిద్రయను సంచారి యగును.
మనస్సు మూసికొని పోవుటయే నిద్ర అనబడును. అంతేగాక శ్రమాదుల వల్ల కలిగిన మనస్సమ్మీలనము, ఒడలు కదల్పకుండుట మొదలైనవి అనుభావాలు.

### 18.25.1 నిద్రకుదాహరణము :

క॥ కలనైన శ్రీ నృసింహునిఁ
గలయం గలనంచుఁ గలికి కన్నులు మొగిచెన్
జెలి బాహ్యేంద్రియ పథమున
నలరు మనం బరుగకుండ నాఁగిన భంగిన్ 79

చెలి : స్త్రీ ; కలనైనన్ = స్వప్నమందైనను; శ్రీ నృసింహునిన్ : శ్రీమంతుడగు నరసభూపాలుని; కలయంగలనంచున్ : పొందగలననుచు; అలరుమనంబు = ఒప్పుచుండెడి మనస్సును; బాహ్యేంద్రియ పథమునన్ : చక్షురాది బహిరింద్రియమార్గమున; అరుగకుండన్ : వెళ్లకుండునట్లు; ఆగినభంగిన్ = అడ్డగించిన రీతిగ; కలికి కన్నులు మొగిచెన్ : అందమైన కన్నులు మోడ్చెను.

కలలోనైనా నరసభూపాలుని కలిసికొంటానని యెంచి ఒక యువతి తన బాహ్యేంద్రియ మార్గాన మనస్సుపోకుండా ఆపినట్లు కన్నులు మూసికుంది. ఇందు నాయిక కన్నులు మూసినందున చిత్తనిమీలనము స్పష్టము. కనుక నిద్రయను సంచారి భావమయ్యెను. ఈ ఉదాహరణము స్వప్నానికి తగినది కాని నిద్రకు తగినది కాదు. మనస్సమ్మీల నాత్మకమగు నిద్రలో స్వప్నంరాదు. ఈ క్రింది పద్యం యోగ్యమైంది.

కం॥ లలన నృసింహుని కౌఁగిట
నలసియొ పవలెల్ల నిద్రనందెడు నెలమిన్
నెల ప్రొద్దున రే ముద్దులు
గులికి పగల్ నిద్రవోవు కుముదిని వోలెన్ !

నృసింహుని కౌగిటిలో అలసిపోవుట విభావము. నేత్రనిమీలన, గాత్ర నిష్క్రియత్వాదులు ఆక్షేప్యములగు అనుభావములు. వీనిచే నిద్ర వ్యక్తమగుచున్నది. కాని కొందరు ఈ ఉదాహరణము భావలక్షణానికి సరిపోయిందికాని ధ్వనికి వాచ్యమైనందున సరికాదంటారు.

## 18.26. మోహ లక్షణము :

కం॥ ..... మూర్ఛనందుట మోహంబగు ......
మూర్ఛనందుట : మూర్ఛిల్లుట; మోహంబు : మోహమనునది; అగున్ = అగును
భయవియోగాదుల వల్ల, కలిగినట్టియు, వస్తుతత్త్వాన్ని నిశ్చయింప చాలనట్టియు చిత్తవృత్తిని మోహం అంటారు.

### 18.26.1 మోహమునకుదాహరణము :

కం॥ అతను శరహతుల సొరిగెను
సతి విరహతపస్సమాధి జనిత వ్రతయై
ధృతి శ్రీ నృసింహుఁ దలఁడగఁ
మతి దన్మయమగుచు మేనుమఱచిన భంగిన్ 80

సతి : స్త్రీ; విరహ...వ్రతయై : వియోగమనెడు తపోనిష్ఠయందు కలిగిన నియమము కలదై; ధృతిన్ : దైన్యముచేత; శ్రీ నృసింహుఁ దలఁపగన్: నరసభూపాలుండను నృసింహమూర్తిని స్మరింపఁగా; మతి = చిత్తము; తన్మయమగుచున్ : తద్రూపమగుచు; మేను మఱచిన భంగిన్ : శరీరమును మరచినచో అన్నట్లు, అతను శరహతులన్ : మన్మథబాణపు దెబ్బలచేత; సొరిగెన్ : మూర్ఛిల్లెను.

ఇందు నాయిక మన్మథునిబాణపు దెబ్బలచేత మూర్ఛిల్లినట్లు చెప్పబడింది. అంటే సతి విరహరూప తపోనియమం కలిగిందై నరసభూపాలుడను నృసింహమూర్తిని తలంచగా తన్మయమైనదో అన్నట్లు మన్మథబాణ హతులచే మూర్ఛనొందింది. ఇక్కడ ప్రియవియోగము విభావము. మూర్ఛిల్లుట అనుభావము. దీనిచే మోహము వ్యక్తమగుచున్నది.

## 18.27. బోధ లక్షణము :

కం॥ .....బోధ మెఱుకఁ జెందుట.
ఎఱుకఁ జెందుట : తెలివినొందుట; బోధము : బోధమగు సంచారియగును.

తెలివిని పొందుటను బోధమందురు. నిద్రానాశానంతరం వల్ల కలిగే మెలకువయే విబోధమంటారు. బోధ - విబోధ పదాలు పర్యాయపదాలే. నిద్ర పూర్తియైనపుడును, స్వప్నాంతమందును, పెద్దపెద్ద శబ్దాలను వినటంవల్లను, ఒకరు తాఁకుటవల్లను నిద్రనాశంకలుగుతుంది. కాబట్టి ఇవి విభావాలు. అక్షి, మర్దన, గాత్రమర్దనాదులు అనుభావాలు

### 18.27.1. బోధమునకుదాహరణము :

కం॥ తరణికులాధీశ యశ
స్తరుణి జడత్వంబు మాని సంపుల్ల సితాం
బురుహాక్షియు, జృంభితయై
చిరగతి మేల్కొనియె శ్రీ నృసింహుఁడు గలుగన్ - 81

తరణి ... తరుణి : సూర్యవంశపు రాజుల కీర్తికాంత; శ్రీ నృసింహుడు గలుగన్ : నరసభూపాలుండు కలుగగా; జడత్వంబుమాని : జడవృత్తిని వదలి, సంపుల్ల సితాంబురుహాక్షియున్ : వికసించిన తెల్ల దామరలవంటి కన్నులు కలదియు; జృంభితయై : ఆవలించినదియునై ; ప్రకాశించినదియునై ; చిరగతిన్ = బహుకాలమునకు; మేల్కొనియెన్ : మేల్కొనియెను.

సూర్యవంశపు రాజులకీర్తి యింతవరకు నిద్రించినట్లుండినది. నరసభూపాలుడుదయించుట చేత కనులు తెరచి ఆవలించి మేల్కొన్నది. ఇక్కడ నరసభూపాలుని జన్మము విభావము; కనులు తెరుచుకొనుట, ఆవులించుట అనేవి అనుభావాలు. వీనివల్ల బోధము వ్యక్తమౌతున్నది.

### 18.28. అంత లక్షణము (మరణము)

కం॥ అగణిత మృతి యత్నమంతమగు నెట్లన్నన్
అగణిత మృతియత్నము : అధికంగా మరణంకోసం ప్రయత్నించటం; అంతము : అంతము అగునది అగున్; ఎట్లన్నన్.

మరణ ప్రయత్నాన్ని అంతమంటారు. అంతేగాక రోగాదుల వల్ల పుట్టినట్టియు, మూర్ఛారూపమగునట్టియు, అగు మరణానికి పూర్వావస్థ లేక మరణ యత్నము మరణమౌతుంది. ఇక్కడ మరణమంటే ప్రాణ వియోగమని అర్థం చెప్పరాదు. ఎందుకంటే భావమంటే చిత్తవృత్తి విశేషం అని చెప్పాం కదా ! ప్రాణవియోగము చిత్తవృత్తి కాదుగదా ! అన్ని చిత్తవృత్తులగు భావాలకును శరీరప్రాణ సంయోగం అవసరంకదా!

**18.28.1. అంతమునకుదాహరణము :**

కం॥ వల పెఱిఁగి రాఁడు; గౌఁగిట
నలమఁడు నరసావనీంద్రుఁడని వగవఁజుమీ !
చెలులును జిలుకయు నెవ్వతి
వలనగునో యనుచుఁగొంత వగచెద నాత్మన్ 82

నరసావనీంద్రుడు = నరసభూపాలుడు; వలపెఱిఁగిరాడు: మోహమును తెలిసియేరాడు; కౌగిట నలమడు : కౌగిలీయడు. అని వగవఁ జుమీ: అని చింతించను సుమీ !; చెలులును: సఖురాండ్రును; చిలుకయున్ : క్రీడాశుకమును; ఎవ్వతివలనగునో అనుచున్ : ఎవ్వతెయధీనమగునో అంటూ; ఆత్మన్ : చిత్తమందు; కొంతవగచెదన్ : కొంచెము వ్యసన పడెదను.

ఇందు నాయకుడు ఎన్ని ప్రయత్నాలు చేసి ఎంత కాలం నిరీక్షించినప్పటికీ ప్రియుడు రాలేదని అతన్ని పొందటంపై నిరాశకలిగి మరణానికి పూనుకున్నట్లు “చెలులును చిలుకయు నెవ్వతి వలనగునో” అనటం వల్ల వ్యక్తమౌతున్నది కాబట్టి అంతము అనే సంచారి భావమవుతుంది. ఇక్కడ నరసభూపాలునిపై గల విరహము విభావము. ‘చెలులును చిలుకయు నెవ్వతి వలనగునో’ అనే చింత అనుభావము. వీనిచే మరణ ప్రయత్నము వ్యక్తమవుతున్నది.

## 18.29. ముదము యొక్క లక్షణము (మదము - హర్షము)

కం॥ ముద మిష్టలాభ భవ స
మ్మదమగు.

ఇష్టలాభ భవ సమ్మదము = ఇష్టసిద్ధి వల్ల కలుగు హర్షము; ముదము : ముదమనునది ; అగున్ = అగును.

ఇష్టము లభించుట వల్ల కలిగిన సంతోషమను చిత్తవృత్తిని ముదమందురు. దేవ, భర్త, గురు, స్వామి, ప్రభృతుల అనుగ్రహము; ప్రియ సంగమము, మనోరథలాభము, అప్రాప్యుడగు మనోహరుడు, ధనము మొదలగువాని రాక, పుత్రాద్యుత్పత్తి మొదలైనవి విభావాలు. నేత్ర ప్రసన్నత, ముఖప్రసన్నత, ప్రియభాషణము, పులకోద్గమము, అశ్రూదయము; స్వేదోదయము మొదలగునవి అనుభావాలు. వీనివల్ల ముదము వ్యక్తమగుచున్నది.

**18.29.1. ముదమునకు ఉదాహరణము :**

కం॥ అలులై కింశుక శిఖలోఁ
జెలఁగుచు మున్నెంత తపముఁజేసెనో? చెలి వే
నలి; నరసింహుని యురమునఁ
జెలువగు చెంగల్వదండ చేరువ గలిగెన్ - 84

చలివేనలి : స్త్రీయొక్క కొప్పు, అలులై : తుమ్మెదలై , కింశుకశిఖలోన్ : మోదుగ పువ్వులను అగ్నియందు; చెలఁగుచున్ : ఒప్పుచు మున్నెంత తపముచేసెనో : పూర్వమెంత తపమునాచరించెనో, నరసింహుని ఉరమునన్ : నరసభూపాలుని వక్షమునందు; చెలువగు చెంగల్వదండ చేరువగలిగెన్ : అందమగు ఎఱ్ఱకలువల దండయొక్క సాన్నిధ్యము దానికి కలిగెను.

స్త్రీయొక్క కొప్పు నరసభూపాలుని వక్షస్థలమందలి రక్తోత్పలహార సాన్నిధ్యము కలిగిందని, యిష్టలాభము వల్ల కలిగిన హర్షాన్ని చెప్పటం వల్ల ముదము అను సంచారి భావం ఏర్పడింది. చెలికొప్పు పూర్వజన్మలో తుమ్మెదలై మోదుగపూవు అనెడు అగ్నిలో తపస్సుచేసిన దానికి ఫలితంగా ఈ జన్మలో నరసభూపాలుని వక్షఃస్థలముననున్న చెంగల్వదండ సాన్నిధ్యాన్ని పొందింది. ఇక్కడ దేవతానుగ్రహము విభావము. వేనలి నిర్జీవ పదార్థం కాబట్టి దానికి చిత్తవృత్తిరూపగు ముదమెట్లా కలుగుతుందనే ప్రశ్న కలుగుతుంది. కాబట్టి నేత్రప్రసన్నతాది అనుభావాలు లేవు. కాబట్టి చేతన కర్తృకమగు ఉదాహరణాన్ని ఇవ్వాలి.

ఈ క్రింది ఉదాహరణాన్ని చూడండి.

కం॥ నిలబడి నీ ముందెవ్వఁడు
కలికీ! కలిగించెఁ గనులఁ గళుకుల్ బెళుకుల్?
కులికించెను గనుబొమలను?
బులకింపఁగఁజేసె గాత్రము మనోజ్ఞముగన్.

ఇక్కడ ప్రియుని సన్నిధి విభావము; కళ్లయందు, కళుకులు, తళుకులు, కనుబొమ్మలయందు కులుకులు, గాత్రము పులకించుటయు అనుభావాలు, వీనిచే హర్షము వ్యక్తమవుతున్నది.

## 18.30. ఆలస్య లక్షణము :

కం॥ .............కర్తవ్య కార్యమందోద్యోగం
బది యలసత.

కర్తవ్య ....... ఉద్యోగంబు : చేయవలసిన కార్యమందు మంద ప్రయత్నంబు ఏదికలదో; అది = ఆమందోద్యోగము; అలసత= అలసతయను నది అగును.

చేయవలసిన పనులయందు చుఱుకుతనము లేకపోవటాన్ని ఆలస్యమంటారు. ఇంకా అతి తృప్తి, గర్భ, వ్యాధి, శ్రమాదులవల్ల పుట్టినట్టియు, మనస్సునకు కార్యవైముఖ్యాన్ని కలిగించునట్టి చిత్తవృత్తిని కూడా ఆలస్యమను సంచారి అంటారు. అసమర్థత ఆలస్యమని ఎంచకూడదు. కార్యాకార్యవివేక శూన్యత్వము ఆలస్యముకాదు. గ్లానియందు అసామర్థ్యము; జాడ్యమందు కార్యాకార్య వివేక శూన్యత్వము కలదు. ఆలస్యమంటే కార్యవైముఖ్యము.

### 18.30.1. ఆలస్యమునకు ఉదాహరణము :

కం॥ చెలు లాహారాదులకుం
బిలిచిన నఱగంట ఁజూచుఁ బ్రియుఁడు నృసింహుం
డలఘు నృపకుంజరుండని
యలికుంతల కుంభినీత్వ మందెనొ తానున్ ! 85

అలికుంతల : అలి నీలవేణియగు నొకర్తు; చెలులు : సఖులు; ఆహారాదులకుంబిలిచినన్ : భోజనాదులకు పిలిచినను, అఱగంట చూచున్: సగము మూసినకంటితో చూచును; ప్రియుడు నృసింహుండు : ప్రియుడైన నరసభూపాలుండు; అలఘునృపకుంజరుండని : గొప్పరాజశ్రేష్ఠుడని, గొప్పరాచ ఏనుగని; తానున్ : తానును ; కుంభినీత్వమందెనో : ఆడ ఏనుగుతనాన్ని పొందెనా ఏమి? లేని యెడల అఱగంట చూచుట సంభవింపదు.

ఇక్కడ నాయిక సఖులు ఆహారాదులకు పిలిస్తే చూడటం వల్ల అలసత అగునని భావము. సగము మూసిన కంటితో నరసభూపాలుడు నృపకుంజరుడు కాబట్టి ఆ యువతియు ఆడ ఏనుగుగా అయ్యేనో అన్నట్లు చెలులు ఆహారాదులకు పిలిస్తే అఱగంట చూచును (ఆడ ఏనుగుకూడా అఱగంటనే చూచును) ఇందు విరహశ్రమ విభావము, సగము మూసినకంటితో చూచుట అను భావము. వీనివల్ల ఆలస్యము వ్యక్తమగుచున్నది.

## 18.31. వితర్కలక్షణము :

కం॥ ........................ సందేహో
భ్యుదయ బహుత్వము వితర్క మొగి నెట్లన్నన్.

సందేహోభ్యుదయ బహుత్వము : సందేహోదయనానాత్వము - అనేక సందేహము లుదయించుట; వితర్కము = వితర్కమగును, ఒగిన్ = వరుసగా; ఎట్లన్నన్ : ఉదాహరణమెట్లనగా;

అనేక సందేహాలు కలగటం వితర్కమంటారు.

"సందేహాత్కల్పనానన్యం వితర్కః 'పరికీర్తితః' - అనే ప్రతాపరుద్రీయ లక్షణానికీ 'సంశయాదుల వల్ల కలుగు విచారము వితర్క' మను రసతరంగిణ్యాది లక్షణాదులకును విరుద్ధమై అనేక సంశయరూపమే వితర్కమను అర్థాన్ని చెప్తున్నది. "సందేహాద్యనంతరం జాయామాన ఉహోవితర్కః" సందేహాదులు కలిగిన పిమ్మట పుట్టిన ఊహ వితర్కము, నరసభూపాలీయ లక్షణంలో ఈ అర్థం కన్పించదు. కేవలం పెక్కు సందేహాలు కలుగటం కాక సందేహానంతరమున కలిగిన ఊహయే వితర్కము. అది కూడ నిశ్చయానుకూలంగా ఉండాలి. అంటే తుదకు ఆ వితర్కము నిశ్చయానికి తోడ్పడాలి.

### 18.31.1. వితర్కోదాహరణము :

కం॥ చెలు లెఱుఁగరాదు భావము
చెలు లెఱుఁగక యున్న మరునిచే రాయిడియౌఁ
జెలులును మనసొకటైనను
వల పెఱిఁగి నృసింహవిభుఁడు వచ్చునో? రాఁడో? 86

భావము : హృదయాభిప్రాయము; చెలులెఱుఁగ రాదు : సఖులకు తెలియగూడదు; చెలులెఱుఁగకయున్నన్ : చెలులకు దెలియక యున్నచో; మరుని చేన్ : మన్మథుని చేత; రాయిడి యౌన్ : బాధ కలుగును; చెలులును మనసు ఒకటైనను : చెలులకు తెలిసిన యెడల, వలపు ..... రాఁడో : నరసభూపాలుండు మోహ మెఱిఁగి వచ్చునో రాడో

ఇక్కడ సందేహమే కాని నిశ్చయానుకూలమగు ఊహలేదు. కాబట్టి ఇది దోషపూరితము. రసగంగాధరలక్ష్యాన్ని చూద్దాం.
'యది సా మిథిలేంద్రనందినీ నితరామేవ నవిద్యతే భువి ।
అథ మే కథమస్తి జీవితం నవినాలంబన మాశ్రిత స్థితిః ॥

ఆ సీత భూలోకంలో ఉండకపోతే జీవితం ఎట్లా నిలిచి ఉంటుంది? ఆమె లేకుంటే నా జీవితం పోయి ఉంటుంది. ఎట్లంటే ఆలంబనం లేకుండా తదాశ్రిత వస్తువు ఉండదు గదా ! సీత ఉన్నదా? లేదా? అనుసందేహము విభావము. కనుబొమ్మలు ఎగరవేయటం, శిరస్సును ఆడించటం, వ్రేళ్లను ఆడించటం; మొదలైన అనుభావాలు ఆక్షేప్యములు. ఇదిచింతయని భ్రమపడరాదు. ఏ విధంగానంటే - చింతనిశ్చయాంతరంగా ఉండదు. ఏమగును? ఎట్లగును? అనే చిత్తవృత్తి చింత. 'ఇది యిట్లగును' అను నిశ్చయ గర్భమగు చిత్తవృత్తి వితర్కము.

## 18.32 సుప్తి లక్షణము :

కం॥ అతినిద్ర సుప్తి

అతినిద్ర : అధికమైన నిద్ర ; సుప్తి : సుప్తియనునది యగును.

ఈ లక్షణం సరిగాలేదు. సుప్తి అంటే స్వప్నము. గాఢనిద్రయు, స్వప్నమును ఒకటికావు. ఇంకా నిద్రవల్ల కలిగిన జ్ఞానం స్వప్నము. దీనికనుభావాలు ప్రలాపాదులు. నిద్రకు నేత్రనిమీలన, గాత్ర నిష్క్రియత్వాదులు అనుభావాలు.

### 18.32.1. సుప్తికుదాహరణము

క॥ లలన నృసింహుని కౌఁగిట
నలసియు పవలెల్ల నిద్రనందెడి నెలమిన్
నెలపొందున రే ముద్దులు
గులికి పగల్నిద్రపోవు కుమిదిని వోలెన్ 88

లలన : ఒక నాయిక; నృసింహుని కౌఁగిటన్ : నరసభూపాలుని కౌగిలిచేత; అలసియు : బడలియు , పవలెల్లన్ : పగలంతయు, నెల.... పోలెన్ : చందురుని సాంగత్యమున; రాత్రి ముద్దులు గులికి పగలు నిద్రించు కలువ తీగవలె; ఎలమిన్ : మిక్కిలి; నిద్రనందెడిన్ : అతి నిద్రను పొందెను.

ఇందు నాయికకు గాఢనిద్ర చెప్పినందున సుప్తి అగునని తాత్పర్యం. ఈ పద్యం స్వప్నానికి ఉదాహరణార్హాముకాదు. నిద్రకు దీన్ని ఉదాహరించితిమి కాబట్టి ఈ క్రింది పద్యము ఉదాహరణీయము.

గీ॥ నిన్నపగటి పూట నిద్రలో నినుఁగూర్చి
పాపమానెలంత పలవరింప
సవతి నవ్వె; నత్త దివులొందెఁ, బరువెత్తి
మూసిరంత దాని మొగము ఁజెలులు.

ఇక్కడ నిద్ర విభావము. ప్రలాపము అనుభావము. వీనిచే స్వప్నము వ్యక్తమవుతున్నది.

## 18.33. అసూయా లక్షణము

కం॥ .....................ఇతరుల ।
యతిశయము సహింపకుండుటది యీర్ష్యయగున్.

ఇతరుల యతిశయము సహింపకుండుట : పరుల ఆధిక్యంబోర్వకుండుట యేదికలదో; అది : ఆయోర్పులేమి; ఈర్ష్యయగున్ ఈర్ష్యయనునదియగును.

ఇతరుల యొక్క ఉత్కర్షాన్ని జూడటం మొదలగు వాని వల్ల పుట్టినట్టి చిత్తవృత్తి వివేకమే అసూయ అనబడుతుంది.

**18.33.1. అసూయోదాహరణము :**

కం॥ ఈవికోలఁ దంతె; తనమే
లే వేళను బాండుశోభ; యెన యేనాకున్
వావిరిఁగీర్త్యంగన? యని
శ్రీ వెలయు నృసింహునొద్దఁ జిరతర లీలన్.

తనమేలు : తనవిభవము ; ఈవికొలఁదంతె : ఈవి ప్రమాణమెంతో అంత మాత్రమే. ఏవేళను బాండుశోభ : ఎల్లప్పుడూ పాండుశోభయను రోగము కలది, తెల్లని దనుట; కీర్త్యంగన : కీర్తికాంత; వావిరిన్ : ఉత్కర్షమునందు ఎనయేనాకున్ : నాకుసరియౌనా? అని : ఇట్లని; శ్రీ : లక్ష్మి; నృసింహు నొద్దన్ : నరసభూపాలుని సన్నిధియందు; చిరతర లీలన్ : చాలకాలము వెలయున్ : ప్రకాశించును,

లక్ష్మీదేవి నరసభూపాలుని కీర్తి వైభవాన్ని చూచి సహింప లేక దాన్ని నిందిస్తూ ఆతనిని తాను ఆశ్రయించుకొని ఉంది. ఇక్కడ కీర్తియొక్క ఉత్కర్షము విభావము, ఈవికోలఁ దంతెతనమేలు; ఏవేళను బాండుశోభ; ఇట్టి నిందావచనములు అను భావములు. వీనివల్ల అసూయ వ్యక్తమగుచున్నది.

## 18.34. ఆధ్యాన (చింతా) లక్షణము :

కం॥ హితవస్తువు చేకూఱమి
నతులాధానంబు చింతయగునెట్లన్నన్

హితవస్తువుచేకూఱమిన్ : ఇష్టవస్తువు ఘటిల్లనందున, చింత : చింత అనునది; అనగా హితవస్తువు చేకూరమిచే కలుగు చింతయేదికలదోయది; అతులాధానంబు = అతులమైన ఆధ్యాన మనునది యగునని అన్వయము.

ఇష్టము సిద్ధింపకుండుటవల్ల కలుగు నాధ్యానము (పునః పునరాలోచన) చింతయనబడును. ఇంకా ఇష్టము లభింపకుండుట; అనిష్టము వచ్చిపడుట, మొదలగువానివల్ల పుట్టినట్టియు, ఆధ్యానమను నామాంతరము కలిగి నట్టియు, వైవర్ణ్యము, భూలేఖనము, అధోముఖత్వము మొదలగువానిని కలిగించునట్టియునగు చిత్తవృత్తి విశేషము చింత. పైన చెప్పిన విధంగానేకాక ఇంకా దారిద్ర్యము, ఐశ్వర్యభ్రంశనము, ఇష్టార్థము సిద్ధింపకుండుట, మొదలగునవి విభావములు. తలవాల్చుట, సంతాపము, స్మరణము, కృశించుట, దేహ సంస్కారము లేకుండుట, అధైర్యము అనేవి అనుభావాలు. ఈ చింతకు ముందు వెనుకల్లో వితర్కముకూడా పుడుతుంది.

**18.34.1. ఆధ్యానమునకు ఉదాహరణము :**

క॥ సతి చెక్కిట ఁజెయిసేర్పఁగ
నతులకరాంగుళులు సాంజనాశ్రుయుతములై
రతిపతి బాసట మించిన
శితిపంచశరమ్ము లనఁగ జెలఁగు నృసింహ ! 89.

నృసింహ : నరసభూపాలుడా! సతి...చేర్పఁగన్ = నాయిక చెక్కిటఁజెయిచేర్పగా; అతుల కరాంళులు : సాటిలేనివగు చేతివ్రేళ్లు; సాంజనాశ్రుయుతములై : కాటుకతోకూడిన కన్నీరుతో కూడినవై; రతి.....అనగన్ : మన్మథుని సహాయములై అతిశయించిన తీక్షణములగు పంచ బాణములో యనునట్లు; చెలగున్ = ప్రకాశించును.

ఇందు నాయిక చెక్కిట చెయి చేర్చి చింతించునట్లు చెప్పినందున అధ్యానమగును. నాయిక చెక్కిటిపై చేయి చేర్చగా దాని చేతి వ్రేళ్ళు మన్మథునకు సాహాయ్యము చేయుటకు అతిశయించిన ఐదు వాడి బాణములన్నట్లుండెను. ప్రియాప్రాప్తి విభావము. చెక్కిట జెయిచేర్చుట యనుభావము. వీనిచే చింత వ్యక్తమగుచున్నది.

## 18.35 ఉన్మాద లక్షణము :

కం॥ అనయంబు చేతనాచే
తన సదృశ మనో భ్రమంబు ధర నున్మాదం
బనఁబొల్చు....... 90

అనయంబన్ : ఎల్లపుడును; చేతన .... భ్రమంబు : ప్రాణులయందును అప్రాణులయందును సమానమైన చిత్తభ్రాంతి; ధరన్ = భూమియందు; ఉన్మాదంబనఁబొల్చున్ = ఉన్మాదమనఁదగును.

చేతనాచేతన వస్తువులయందు సమానమగు చిత్తవిభ్రాంతిని ఉన్మాద మంటారు. ఇంకా

విప్రలంభము, మహాపద, పరమానందము, మొదలగువానివల్ల పుట్టినట్టియు, ఒకదానిని మరొక దానినిగా భ్రమింపచేయునట్టియునగు చిత్తవిశేషాన్ని ఉన్మాదమంటారు.

### 18.35.1. ఉన్మాదమునకుదాహరణము :

కం॥ నినుఁబ్రార్థించెద భ్రమరమ !
చని నరసింహేంద్రుఁదెమ్ము చనవల దోహో !
చనిన నృపాలు ముఖాంబుజ
ఘనవాసనఁదగిలి నీవు క్రమ్మఱవు గదా ! 91

భ్రమరమ = ఓ భృంగమా ! నినున్ = నిన్ను; ప్రార్థించెదన్ = వేడెద; చని : ఏగి; నరసింహేంద్రున్ : నరసభూపాలుని; తెమ్ము : తీసికొనిరమ్ము; ఓహోచనవలదు : తెలిసెను ! పోవలదు; చనినన్ : పోయిన యెడల; నృపాలు ... తగిలి : ఆ రాజు ముఖపద్మవాసన యందాసక్తమవై; నీవు క్రమ్మఱవుగదా : నీవు మరలి రావుగదా !

ఇక్కడ భ్రమరం నరభూపాలుని తీసికొనివచ్చు సామర్థ్యము లేదని తెలియక, ఉన్నట్లుగా భావించి నాయిక సంబోధించింది. పై ఉన్మాద లక్షణం ఇక్కడ సరిగా లేదు. ఈ క్రింది పద్యం యోగ్యమైంది.

గీ॥ అన్న భృంగంబ ! భ్రమియింతు వఖిలదిశల
నాదు వలపులరాణి కన్పట్టెనోయి !
'ఔ' వటందవు సఖి' తెల్పు మాలసింప
కెచటఁగల? దేమి గావించు? నెట్టిదామె?

ఇక్కడ ప్రియావిప్రలంభము విభావము. ఇట్టి అసంబద్ధ ప్రలాపమను భావము. వీనిచే ఉన్మాదము వ్యక్తమగుచున్నది. ప్రతాపరుద్రీయంలో : చేతనాచేతనములయందు సమానంగా వర్తించటాన్ని ఉన్మాదమంటారు. విక్రమోర్వశీయ నాటకంలోని నాల్గవ అంకమందీ ఉన్మాదాన్ని ఎంతో హృద్యంగా వర్ణించబడింది. అచ్చట కేవలం చేతనములందు అచేతన వ్యవహారము. అచేతనములయందు

చేతన వ్యవహారము లేదా ఉన్మాదంకూడా ఒక వ్యాధి అయినప్పుడు దీన్ని వ్యాధిలో ఎందుకు అంతర్భవింప చేయరాదంటే మిగిలిన వ్యాధులకన్నా ఇది విచిత్రమైన దగుటచే ప్రత్యేకంగా చెప్పబడింది.

### 18.36. ........ అపస్మారక లక్షణము :

కం॥ ..........ధాతు చలనము
దనర నపస్మార మనఁగఁదగు నెట్లన్నన్

ధాతుచలనము = వాత, పిత్త, శ్లేష్మధాతువులయొక్క చాంచల్యము; తనరన్ : ఒప్పునట్లుగా, అపస్మారమనఁగఁదగున్ : అపస్మారమను సంచారియగును; ఎట్లన్నన్.

ధాతువులగు వాత, పిత్త, శ్లేష్మముల యొక్క కదలికవల్ల అపస్మారము కలుగును. ఇంకా వియోగ, శోక, భయ, జుగుప్సాదు లతిశయించుట వల్లను పుట్టిన వ్యాధి విశేషాన్ని అపస్మారమంటారు. ఇది వ్యాధిలో అంతర్భవించును. కాని విశేషాకారంగా చెప్పటంవల్ల భీభత్స, భయానక రసాలలో ఈ అపస్మారకమే వ్యభిచారి అవుతుంది. కాని కేవలవ్యాధి వ్యభిచారి కాదు.

దీనికి వియోగ శోకాదుల అతిశయము విభావము. కంప, ఫేన, నిశ్శ్వాస, భూపాత, విపర్యాస, జిహ్వాలోలనాదులనుభావాలు.

### 18.36.1. అపస్మారమునకుదాహరణము

క॥ మదన గ్రహంబు సోఁకెను
సుదతీమణి దీర్ఘదృష్టిఁజూచెఁడు ఁజెలులన్
ముద మొదవ రక్షఁగట్టుడు;
మదవతికి నృసింహనామ మంత్రము కనన్। 92

మదనగ్రహంబు : మన్మథుడనుభూతము ; సోఁకెను : ఆవేశించెను; సుదతీమణి : స్త్రీరత్నము; చెలులన్ : సఖులను; దీర్ఘదృష్టిన్ : నిడివిచూపుల చేత; చూచెడున్ : చూచుచున్నది; ముద మొదవన్ : సంతోషమగునట్లు; నరసింహనామ మంత్రము కతనన్ : నరసభూపాలుని నామాక్షర మంత్రముచేత; రక్షగట్టుడు : రక్షరేకు బంధింపుడు.

ఇందు దీర్ఘదృష్టి చూడటంచే అపస్మారమగును. మదనావేశము విభావము, దీర్ఘదృష్టి అనుభావము. వీనిచే అపస్మారము వ్యక్తమగుచున్నది.

## 18.37. సమీక్ష :

వ్యభిచారి భావాలు 33 మాత్రమే అని ఎందుకు సంఖ్యానియమము చేయాలి ? మాత్సర్యము, ఉద్వేగము, డంభము, ఈర్ష్య, వివేకము, నిర్ణయము, క్లైభ్యము, క్షమా, కుతుకము, ఉత్కంఠా, వినయము, సంశయము, ధార్ష్యము మొదలగు భావాలను ఎందుకు చేర్చకూడదు అని ప్రశ్నకలుగుతుంది. ఎందుకంటే పైనపేర్కొనబడ్డ మాత్సర్యాదులు అన్నీ 33 సంచారీ భావాల్లోనే అంతర్భవిస్తాయి. ఎలాగంటే అసూయలో మాత్సర్యము; త్రాసమున ఉద్వేగము, అవహిత్థమున దంభము; అమర్షమున ఈర్ష్య, మతియందు వివేక నిర్ణయములు. దైన్యమునందు క్లైబ్యము; ధృతియందుక్షమ; ఔత్సుక్యమునందు కుతుకోత్కంఠలు, లజ్జయందు వినయము; తర్కమునందు సంశయము; చాపలమునందు ధార్ష్యమును అంతర్భవించును. అలతిభేదాలు వీనికున్నప్పటికీ అసూయాదులు లేకపోతే మాత్సర్యాదులు కలుగవు. అంటేవానికి పరస్పరము అవినాభావ సంబంధముకలదు. ఈ వ్యభిచారిభావాల్లో కొన్నింటికి విభావములగును కొన్ని అనుభావములగును

ఎట్లంటే - ఈర్ష్య నిర్వేదానికి విభావము, అసూయకు అనుభావమును అవుతుంది. చింతనిద్రకు విభావమును, ఔత్సుక్యమునకు అనుభావమును అగును.  రత్యాది స్థాయి భావాలు కూడా ఇతర రసములకు వ్యభిచారులవుతాయి. శృంగార-వీర రసములలో హాసస్థాయి భావమును, వీరమున క్రోధస్థాయి భావమును, శాంతమున జగుప్సస్థాయి భావమును వ్యభిచారులవుతాయి. ఇంకను హాసమద్భుతమందును, క్రోధము శృంగారమందును; శోకము శాంతము నందునుకూడా వ్యభిచారులుగా ఉండవచ్చును.  దేవాది విషయకరతియు, వ్యంజతమైన భావమున వ్యభిచారి అని చెప్పబడును. కావున జగన్నాథుడు దేవాదిరతినికూడ కలిపి వ్యభిచారి భావాలు ముప్పది నాలుగని చెప్పాడు.  దీనిపై అనేక అభిప్రాయాలున్నప్పటికీ రామరాజ భూషణుడు పేర్కొన్న 33 సంచారీ భావాలనే ఇక్కడ పేర్కొనబడింది.

## ప్రశ్నలు :

1. సంచారి భావలక్షణాన్ని నిరూపింపుడు ?

2. ఈ క్రింది సంచారీ భావాలను సోదాహరణముగా వివరింపుడు ?

1. నిర్వేదము 2. దైన్యము 3. గ్లాని 4. త్రాసము 5. రోషము 6. ఆవేగము 7 చాపలము 8. త్రప 9. మదము 10 ముదము

## ఆధార గ్రంథాలు :

### సంస్కృతము

1. నాట్యశాస్త్రము - భరతుడు

2. రసగంగాధరము - పండిత జగన్నాథరాయలు

3. సాహిత్యదర్పణము -

4. ప్రతాపరుద్రీయము - ప్రతాపరుద్రుడు.

5. దశరూపకము - ధనంజయుడు

## తెలుగు

1. కావ్యాలంకార సంగ్రహము - సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి

2. రససిద్ధాంతం - ఆంధ్రుల వరివస్య - డా॥ తిప్పాభట్లరామ కృష్ణశాస్త్రి